# వరాహపురాణము

## అష్టఘంటావధానపరమేశ్వర
## హరిభట్టప్రణీతము
## (సంశోధితముద్రణము)

కిరివర దంష్ట్రా దండోపరిభాగము నందు నాతపత్రము కరణిన్
ధరణీ చక్రము తనరెను, సురశైలము పసిడిగుబ్బ చొప్పున నొప్పెన్. (3-14)

# వరాహపురాణ సంశోధితప్రతి - అధోభాగ సంకేత వివరణము

| సంకేతములు | వివరణము |
|---|---|
| ప్ర. | ప్రతి |
| అన్ని ప్ర. | అన్ని ప్రతులు |
| అన్ని తాళప్ర. | అన్ని తాళపత్రప్రతులు |
| (యతి ?) | యతిభంగము |
| (ప్రాస ?) | ప్రాస భంగము |
| (గణము ?) | గణభంగము |
| లుప్తము | గ్రంథపాతము |
| వ | వచనము |
| ప | పద్యము |
| పా | పాదము |
| తీ. కంటె భిన్నప్ర. | తీ. ప్రతికంటె భిన్నప్రతులు - అనగా మ. మా. త తా. తి. హ. ర. క ప్రతులు. ఇట్లే తదితరములు |

# 1 ఆముఖము

## 1 కవి పరిచయము :

శ్రీ హరిలీలా ప్రతిపాదకమగు వరాహపురాణము నాంధ్రీకరించిన హరిభట్టారకుఁడు ప్రాచీనాంధ్రకవివతంసుఁడు. సంప్రదాయ సముపలబ్ధ సంస్కృత పాండితీమండితుఁడు. కవిచరిత్రలో నితనిని గుఱించి కథన మున్నది. సాహిత్య చరిత్రములో సంస్తుతి యున్నది. విమర్శక వ్యాసములలో వినుతులున్నవి.

[1]కందుకూరి వీరేశలింగం పంతులుగారు ఆధునిక కవులు అను శీర్షికను హరిభట్టుతో ప్రారంభించిరి. అయిదు పుటల ప్రస్తావమది. [2]చాగంటి శేషయ్యగారు అంత కెనిమిదింత లుగ్గడించినారు. [3]బులుసు వెంకటరమణయ్యగారు కొంత విన్నవించినారు. [4]ఆరుద్రగారు సంగ్రహించినారు.

[5]డా. నేలటూరి వెంకటరమణయ్యగారి 'హరిభట్టు' అను వ్యాసము పరిగణింపఁదగినది. [6]కళాప్రపూర్ణ నిడుదవోలు వెంకటరావుగారు 'కవి కాలనిర్ణయము – శాసనాధారములు' అను వ్యాసమును వ్రాసినారు. అందలి 'హరిభట్టు – కృష్ణదేవ రాయలు' అను భాగము కవి కాలనిర్దేశమున కనువుపడు శాసనప్రమాణము నవధరింపఁజేయుటచే అది యమూల్యమైనది. అందు కృష్ణదేవరాయలనాఁటి రామసముద్ర దానశాసనము కలదు. [7]తేరాల సత్యనారాయణశర్మగారి 'హరిభట్టు' అన్నది మఱియొక వ్యాసము.

ఇఁక హరిభట్టు రచించిన తెలుఁగు కృతులలో మొదట ముద్రితమైనది మత్స్యపురాణము. అది 1912 వ సంవత్సరమున కాకినాడలోని కవితా పత్రికాధిపతుల ప్రచురణము. అందలి యుపోద్ఘాతమువలన, అనాఁటికి హరిభట్టుయొక్క గ్రంథాంతరముగా వారికి తెలియవచ్చినది ఒక్క వరాహపురాణము మాత్రమే యని యవగతమగుచున్నది.

తరువాత 1926వ సం. న ఆంధ్రసాహిత్యపరిషత్ప్రకటనముగా నారసింహ పురాణము — ఉత్తరభాగము వెలువడినది. ఇందలి ఓలేటి వేంకటరామశాస్త్రిగారి సంపాదకీయోపోద్ఘాతము హరిభట్టును సాహితీలోకమునకు సవిమర్శకముగ పరిచయము చేసినది. సముచితము సమీచీనమునగు వివరణమది.

[8]'హరిభట్టు శ్రీనాథాదులయిన యెందఱు మహాకవులవో యముద్రితగ్రంథములు ప్రకటించినది' యని కవి సమ్రాట్టుల ప్రశంసకు పాత్రమయినది ఆంధ్రసాహిత్యపరిషత్తు. తత్కార్యాలయమువారు క్రమముగ తమ ప్రసిద్ధ 'పత్రిక'లో హరిభట్టారకుని భాగవత-ఏకాదశ స్కంధమును మూడు సంపుటములలో (41-43) ప్రచురించియున్నారు.

ముష్టిపల్లి సోమభూపాలుఁ డాంధ్రీకరించిన రతిరహస్యమును మదరాసు కల్చరల్ బుక్స్ లిమిటెడ్ వారు [1950] ప్రకటించిరి. అందు హరిహరుని [హరిభట్టారకుని] సంస్కృతమూలముకూడ కలదు. ఆ గ్రంథమును పరిశోధించినవారు బులుసు వెంకటరమణయ్యగారు. పీఠికాప్రదాతలు యస్. యస్. సుందరేశ్వరరావుగారు. ఈ పీఠికలో హరిభట్టు ప్రస్తావము మూఁడు పుటలలో కలదు.

---

1 ఆంధ్రకవులచరిత్రము, 3 వ భాగము, పు. 1-5. 2 ఆంధ్రకవితరంగిణి, సంపు. 8, పు. 167-195. 3 ఆంధ్రకవిసప్తశతి, పు. 311. 4 సమగ్ర ఆంధ్రసాహిత్యం, సంపు. 7, పు. 258. 5 భారతి – జనవరి 1941, పు. 17-24. 6 భారతి – జూలై 1949, పు. 19-25. 7 వ్యాసభారతి – 2, పు. 94-107. 8 ఆం.సా.వ. సంపు. 45. సం. 1-2, సారస్వతమహాసభ – అధ్యక్షోపన్యాసము, విశ్వనాథ సత్యనారాయణ, పు. 1.

ఈ విధముగ హరిభట్టు రచనములు సూర్యాలోకయోగమును పొందెను. అయినను కవికి సంబంధించిన కొన్ని సమస్యలకు సముచిత సమాధానము మృగ్యముగనే యున్నది. అతని యింటిపేరు తెలియుటలేదు; ఊరు ఊహామాత్రయోగ్యమైనది; కాలనిర్ణయము క్లిష్టప్రాయము; గ్రంథముల పౌర్వాపర్య వినిశ్చయము కష్టసాధ్యము.

మఱి యీతని ముద్రిత గ్రంథములయినను సులభముగ లభించునవి కావు. ఇతరములు – వరాహ పురాణము, భాగవత షష్ఠ ద్వాదశ స్కంధములు – ఇంకను ముద్రణ భాగ్యమునకు నోచుకొని యుండలేదు. 'స్థితస్య గతిః చింతనీయా' యనునదే ప్రకృత కార్యము.

కవి పేరు : కవి హరిభట్టుగా ప్రసిద్ధుడు. 'హరిభట్టా ! సత్కవి గ్రామణీ !' యని వరాహ పురాణములో కృతిపతి కృతికర్తను కావించిన సంబోధనము (అవ. 16). ఈ పురాణముయొక్క ఆశ్వాసాంత గద్యములలో 'హరిభట్ట ప్రణీతంబైన' యనియే కలదు. 'మీ తండ్రి....హరిభట్టు' అని నారసింహ పురాణములోని యవతారిక (1-15) తెలియజేయుచున్నది. 'హరిభట్టారకుడు' అని మత్స్యపురాణ – నారసింహపురాణ – భాగవత స్కంధముల ఆశ్వాసాంత గద్యములలో కానవచ్చుచున్నది. రతిరహస్యములోని తుదిగద్యమున కవి హరిహర నామధేయుడు. వరాహపురాణ చక్రబంధములో 'హరి సూరి' (2-204) అని పేరు కూర్పఁబడియున్నది. రామసముద్ర శాసనమున అతడు హరిభట్టోపాధ్యాయులు.

గోత్రాదికము : కవి భారద్వాజసగోత్రుడు. 'భారద్వాజసగోత్రపవిత్ర' యని నారసింహపురాణ గద్యమునందును, 'భారద్వాజసగోత్ర సంభవుఁడ' నని మత్స్యపురాణ – అవతారికలోను (1-5) సూచితములై యున్నవి. ఇతఁడు ఆపస్తంబసూత్రుఁడని మత్స్యపురాణ – అవతారిక వలన (ఆపస్తంబుఁడన్ 1-5) తెలియుచున్నది. కవిది యజుశ్శాఖ. "యాజుష ప్రకటశాఖ ధుర్యుఁడుత్కృష్టుఁడు" (వరాహ. అవ. 16). హరిభట్టు తల్లి తిమ్మమ. "తిమ్మమాంబా రాజద్వర గర్భసంభవుఁడ" నని మత్స్యపురాణమునందు మాత్రమే (1-5) సూచితమైనది.

తండ్రి : తెలుఁగు కావ్యములలోని గద్యములయందు తన తండ్రిని 'చంద్రనామాంక రామ విద్వన్మణి' యని హరిభట్టు పేర్కొనెను. ఈ 'గద్యమందున్న చంద్రనామాంక పదమున కర్థమేమో ?' యని [9]వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తమ సంశయమును సూచించియున్నారు. 'ఇంటిపేరు చంద్రాభట్లవారని వినికిడి కలదు. కాని దానికాధారములు కనిపించుట లేదు'—అని [10]తేరాల సత్యనారాయణ శర్మగారు వ్రాసిరి.

చంద్రనామాంకుఁడు హరిభట్టు తండ్రియే. [11]రతిరహస్య ముద్రితప్రతిలో ఒక చోట 'చంద్రనామాంక రామవిద్వత్కుమార' అని కలదు. ఇక్కడ రామశబ్దము ఎట్లు ప్రవేశించెనో తెలియదు. ఏలయన, తరువాతి [12]గద్యమున 'చంద్రనామాంక విద్వత్సుత' అనియే పాఠము. వ్రాఁత ప్రతులలో కూడ [13] 'చంద్రనామాంక విద్వన్మణికుమార' యనియును, [14]'చంద్రనామాంకసుత' యనియును కలదు.

అసలు హరిభట్టు తండ్రిపేరు రామచంద్రుఁడు. రతిరహస్యమున చంద్రనామమును, తెలుఁగుకావ్యములలో చంద్రనామాంక రాముఁడనియును కనఁబడుటకుఁగల కారణమిది. 'నామైకదేశగ్రహణే నామమాత్ర గ్రహణమ్' అని ఒక న్యాయమున్నది. సత్యభామ యనుటకు సత్యయని, భీమసేనుఁడనుటకు భీముఁడని యనుట లోకప్రసిద్ధి. ఇట్లే రామచంద్రశబ్దములు పై న్యాయానుసారము వేర్వేఱుగా నిర్దేశింపఁబడినవి. ఇఁక, దాన ప్రయోజనమునుబట్టి శాసన

9 త్రైవార్షిక – ఆంధ్రగ్రంథముల పట్టిక, సంపు. 3, భాగము 3, 1224–1228, సంధాత – వే. ప్ర. జి. ఓ. ఎం. ఎల్. 10 వ్యాసభారతి 2, పు. 97 11 రతిరహస్యము [గద్య] పు. 38 12 అందే పు. 128, 134 13 అందే వ్రాఁతప్రతి, పు, 290, 14 అందే పు. 15. జి. ఓ. ఎం. ఎల్ – R. 2883

ములయందు గోత్రసూత్రాది వివరములతో నిండు పేరుండుట యెంతేని యవసరము కదా! కావున, రామసముద్ర దానశాసనములో హరిభట్టుతండ్రియొక్క పేరు 'రామచంద్ర భట్టోపాధ్యాయులు' అని స్పష్టముగ కానవచ్చుచున్నది. మఱియును హరిభట్టు తండ్రికి రాఘవనామముకూడ కలదు. 'రాఘవార్య హరిభట్టా!'యని వరాహపురాణమున [అవ. 16] కృతిభర్త కృతికర్తను పేర్కొనెను. రాఘవార్యుని కుమారుఁడు హరిభట్టు - అని దీని అభిప్రాయము. రాఘవ శబ్దము రామశబ్దమునకు పర్యాయ పదము. కావ్యములందు ఇట్టి మార్పులు ఛందోఽనురోధమువలన ఏర్పడుచుండును. హరిభట్టు తనకుమారునకు రాఘవ నామమునే పెట్టెను. ఈ సంగతి నారసింహపురాణ - అవతారికా భాగములో కలదు (1-15).

కావ్య గద్యములలో కానఁబడు 'చంద్రనామాంక రామవిద్వన్మణి'యే శాసనములో 'రామచంద్ర భట్టోపాధ్యాయులు'గా దర్శన మిచ్చుచున్నాఁడు. ఇందలి భట్టశబ్దమునకు విద్వద్విప్రుఁడని సామాన్యార్థము. నందికేశ్వర ప్రోక్తమైన [15]అభినయదర్పణమున సభాసప్తాంగ లక్షణ మిట్లున్నది.

విద్వాంసః కవయో భట్టాః గాయకాః పరిహాసకాః
ఇతిహాస పురాణజ్ఞాః సభాసప్తాంగ లక్షణమ్.

ఇక్కడ భట్టశబ్దమునకు వందియని యర్థముకాఁబోలును. శబ్దరత్నాకరమున ఈ యర్థమే కలదు. [16]రామచంద్ర భట్టోపాధ్యాయుల పుత్రుఁడు హరిభట్టోపాధ్యాయులు అని - శాసనపాఠము. భట్ట - అమాత్య శబ్దముల పర్యాలోచనము సాగుచునే యున్నది.

[17]డా. దివాకర్ల వేంకటావధానిగారు నన్నయకాలమున నీ పదద్వయము వైదిక నియోగ్యర్థ నిర్దేశకము కాదని తెల్పిరి. అనంతరకాలమున భట్టశబ్దము వైదికుని, అమాత్య శబ్దము నియోగిని సూచించుట పరిపాటియైనది. భట్ట - అమాత్యులు ఇరువురును వేదశాస్త్రాది విద్యాప్రవీణులే కావచ్చును. వైదికవృత్తి నాశ్రయించిన భట్టు లుపాధ్యాయులైనారు. 'ఉపాధ్యాఽయోధ్యాపకః' అని [18]యమరకోశము. వేదమును చదివించువారు అని భావము. నియోగులు రాజాశ్రయములో నియుక్తులై యమాత్యపదమును గ్రహించిరి. ఆ నామములు క్రమముగా వారి సంతతివారికిని సంక్రమించినవి.

నన్నయగారు భట్టోపాధ్యాయులు. "క. నెట్టుకొని కొలుతు నన్నయ భట్టోపాధ్యాయ సార్వభౌముని'.... అని శ్రీనాథభట్టసుకవి వచనము (భీమ. 1-8), పినవీరనయు '....కవితా పట్టాభిషిక్తు నన్నయ భట్టోపాధ్యాయు....' అని స్తుతించెను (శృం. శా. 1-11).

ఈ సందర్భమున భట్టశబ్దార్థ మించుక సమాలోచనీయము.

కణాద న్యాయమతయోః బాలవ్యుత్పత్తి సిద్ధయే।
అన్నంభట్టేన విదుషా రచితః తర్కసంగ్రహః ॥

సంస్కృతమున, అన్నంభట్టు తర్కసంగ్రహమను శాస్త్రగ్రంథమును రచించి, దానికి దీపిక యను స్వీయ వ్యాఖ్యనుకూడ వెలయించెను, ఈ దీపికకు తర్కసంగ్రహదీపికాప్రకాశమను నామాంతరముగల నీలకంఠీయమును శ్రీరామభట్టతనూజుఁడగు నీలకంఠభట్టు వ్రాసెను. అందు గ్రంథాంతమున నిట్లున్నది.

ఇతి శ్రీమత్పాణ్యోపనామక కౌండిన్యవంశపయఃపారావార రాకాచంద్రాయమాణ పదవాక్యప్రమాణ పారావారపారీణ శ్రీరామభట్టతనూజ శ్రీ నీలకంఠభట్టవిదుషా విరచితః తర్కసంగ్రహదీపికాప్రకాశః సమాప్తః,

---

15 పు. 4 (1887), 16 రామసముద్రదాన శాసనము. 17 నన్నయ భారతము, పు. 678, 18 ద్వి. కాం. బ్రహ్మవ. 6.

నీలకంఠభట్టసూనుఁడగు లక్ష్మీనృసింహసూరి ఆ నీలకంఠీయమునకు భాస్కరోదయమను వ్యాఖ్యను సవదరించి ఆ గ్రంథాంతమున భట్టశబ్దనిర్వచనమును ఈ విధముగా కావించియున్నాఁడు.

శ్రీరామభట్టతనూజః — "సా హి శ్రీ రమృతా సతా" * మితి శ్రుతిబోధిత వేదత్రయీరూప శ్రీసహితత్వ మత్ర వివక్షితమ్. భట్టత్వం వేదశాస్త్రార్థ తత్త్వజ్ఞత్వమ్. తాదృశ రామనామకస్య తనూజః సూనుః. తేనానూచానపాండిత్యం సిద్ధమ్. శ్రీ నీలకంఠభట్టః తథావిధ శ్రీ సాహిత్యవిశిష్టః, తథావిధ భట్టత్వ విశిష్టశ్చ నీలకంఠశర్మా గ్రంథకారః. విద్వుషా వేదవేదాంగ నిఖిలతంత్రసిద్ధాంత జ్ఞానజనితానేకగ్రంథ సందర్భరచనాధాయక కల్పనావిశేషవతా, రచితః నిర్మితః తర్కసంగ్రహదీపికాప్రకాశః.

దీనివలన భట్టశబ్దమునకు వేదశాస్త్రార్థతత్త్వజ్ఞుఁడనియును, విద్వచ్ఛబ్దమునకు వేదవేదాంగపరిజ్ఞానజన్య జ్ఞానవిశేషముచేత గ్రంథములను రచించు సామర్థ్యముకలవాడనియును తెలియుచున్నది. కావున రామచంద్రభట్టు, రామవిద్వన్మణి అను పేర్లలోని భట్ట విద్వచ్ఛబ్దములకు పై రీతిని అర్థసమన్వయము చేయుట సముచితమగును.

ఈ సందర్భమున హరిభట్టారక నామమందలి భట్టారక శబ్దము పరిశీలనార్హమగుచున్నది. భట్టారక పదమునకు ముని, సూర్యుఁడు, పండితోత్తముఁడు—అను నర్థములు కనుపట్టుచున్నవి. వీనిలో మూఁడవది ప్రస్తుతార్థము. విశేషణమైనచో పూజ్యార్థకము. నాట్య పరిభాషయందు-భర్తృదారిక = యువరాజు, భట్టారకుఁడు = రాజు, భర్తృదారిక = రాజపుత్రి, భట్టిని = పట్టపురాణికాని భార్య [భోగపత్ని] అను పదములున్నవి.

[19]నాట్యోక్తౌ-యువరాజస్తు కుమారో భర్తృదారకః।
రాజా భట్టారకో దేవః తత్సుతా భర్తృదారికా।
దేవీ కృతాభిషేకాయాం ఇతరాసు తు భట్టినీ।

రాజపూజ్యుఁడగు విద్వద్విప్రుఁడు అనునర్థమున భట్టశబ్దమునకు భర్తృశబ్దము మూలమగునేమో! [భర్తృహరి, భట్టహరి, హరిభట్టు?] భట్టారకో భట్టరకో భట్ట స్తత్రభవాన్ భవాన్ - అని వైజయంతి* పేర్కొనుచున్నది. భట్టారకశబ్దము పూజ్యవాచకము.

కవియొక్క నివాసస్థలము తెలిసికొనుటకు గ్రంథాధారములు కానరావు. కొలిపాక ఎఱ్ఱయ వరాహపురాణ కృతిపతి. అతఁడు కంబముమెట్టపురమునకు 'స్థలకరణికుఁడు'. కొలిపాక ఒక గ్రామము. ఇది నల్గొండజిల్లాలో కలదు. నాఁటి కంబముమెట్ట నేఁడు కమ్మముమెట్టగా వ్యవహృతమై వరంగలుజిల్లాలో కాననగుచున్నది. ఉద్యోగధర్మమువలన కృతిపతికి కంబముమెట్టలో కాఁపురము. ఆ పురమో, దానికి సమీపగ్రామమో కవి నివాసస్థానమై యుండును. హరిభట్టు ఆ కంబముమెట్టపురమును మిక్కిలి యభినివేశముతో రెండు పద్యములలో (అవ. 9, 10) రమణీయముగ వర్ణించియుండుట పై యూహకు కారణము. కంబముమెట్టకు స్తంభాచలమని సంస్కృతీకరణము (అవ. 46). కవి తొలుత ఈ పురమున నివసించియుండి, పిదప తనకు శాసనపూర్వకదత్తమైన రామసముద్ర మను నామాంతరముగల చిన్నపల్లెను చేరియుండును. ఈ చిన్నపల్లె ఏ సీమలోనిదో? ఇఁక, కంబముమెట్టపురము చరిత్రప్రసిద్ధి గాంచినది. ఈ దుర్గమును [20]కృష్ణదేవరాయలు, [21]ఇబ్రహీం కుతుబ్ ముల్కు అను పాలకులు తమ కైవసము గావించుకొనియుండిరి.

---

* చూ, తైత్తిరీయం, 19 అమరము, ప్ర. కాం. నాట్యవ, 12 * పృ, 293, వావిళ్ళ, 1958
20 పారిజాతాపహరణము, అవ. 23 21 తపతీసంవరణోపాఖ్యానము, అవ. 24.

## 2 కాలసూచనము :

శాసనాధారము : హరిభట్టునకు క్రీ. శ. 1513 వ సం. న చిన్నపల్లె యను గ్రామము దానముచేయఁబడినది. దాత శ్రీ వీరరామనాయకులవారు. పై గ్రామమునకు శ్రీరామసముద్రమని ప్రతినామముచేసి, దానముచేసినట్లు లా శాసనమునఁ గలదు. అప్పుడు రాజ్యపాలనము చేయుచుండినది కృష్ణదేవరాయలు. కావున ఆ శాసనమునకు కృష్ణరాయల శాసనమని వ్యవహారము. ఇది తామ్రశాసనము, కృష్ణరాయలపాలనకాలము క్రీ. శ. 1509–1530. ఈ [1]శాసనము నొక వ్యాసమున సవిమర్శముగ ప్రకటించి యుపకరించినవారు కళాప్రపూర్ణ నిడుదవోలు వెంకటరావుగారు. శాసనపాఠము క్రింది రీతి నున్నది.

శుభమస్తు. స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహనశకవర్షంబులు 1435 అగు నేటి శ్రీముఖ సంవత్సరం ఆశ్వీజ బ 12 పుణ్యకాలమందు శ్రీమన్మహారాజాధిరాజ రాజపరమేశ్వర శ్రీ వీరప్రతాప శ్రీకృష్ణరాయమహారాయలుగారు సుఖానురాగం శ్రీరాజ్యం జేయుచుండగాను శ్రీమద్రఘుపతి నాయకాచార్యులైన శ్రీవీరరామనాయకులవారు శ్రీభారద్వాజ గోత్రం ఆపస్తంబసూత్రం యజుశ్శాఖాధ్యాయులైన శ్రీరామచంద్ర భట్టోపాధ్యాయుల పుత్రులైన హరిభట్టోపాధ్యాయులకు ఇచ్చిన తామ్రశాసనమెట్లంటేను మాఅధికారానికి జేరిన చిన్నపల్లె అనుగ్రామమునకు శ్రీరామసముద్రం అని ప్రతినామం జేసి మా మాతాపితృవులకు పుణ్యలోక ప్రాప్తికై శ్రీరామసన్నిధిలో సహిరణ్యోదక దానధారాపూర్వకంగాను సమర్పించిరి. ఈ గ్రామానికి జెల్లే నిధ్యాది సమస్త తేజస్స్వామ్యములున్ను మీరు పుత్రపౌత్రాదులుగా అనుభవించుకొని మావంశస్థులకు శ్రేయఃప్రార్థన జేసుకుని సుఖంగా వుండేది అని వ్రాయించి యిచ్చిన తామ్రశాసనం.*

దాత తనమాతాపితరులకు పుణ్యలోక ప్రాప్తికై చేసిన దానమిది, పాత్రమెఱిఁగి చేసిన ప్రశస్త దానమిది, హరిభట్టు ఆకాలమున లబ్ధప్రతిష్ఠుఁడు. ఆముష్యాయణుఁడు, 'వేదశాస్త్రవివిధగ్రంథార్థ నిర్ణేతయై' (వరాహ,అవ.16) భట్టోపాధ్యాయ బిరుదము నన్వర్థము గావించుకొనియుండెను. ఆతని కీగ్రామము పడయుటకు పై యోగ్యతయే ప్రధాన కారణము కావచ్చును.

పండితుఁడుగా, కవిగా, అవధానిగా అతని కీర్తి యప్పటికే బహుముఖవ్యాప్తిని పొందియుండును. కడుపు కక్కుఱితికై కన్నవారి నాశ్రయించి కావ్యములను అమ్ముకొను దుర్దశ గడచియుండును. అనఁగా, ఏ యువదేండ్లో దాఁటినవాఁడని తోఁచుచున్నది. కావున అతని జననకాలము ఇంచుమించు క్రీ. శ. 1450 సం. కావచ్చును. రాజాశ్రయమును గర్హించి, యదృచ్ఛాలాభముతో సంతోషించు స్వభావము కలవాఁడగుటచేత రాచమన్ననలను ఆశించియుండఁడు. ఈ విషయమున పోతనకు దీటయినవాఁడు హరిభట్టారకుఁడు.

అతని గ్రంథానుక్రమమును పరిశీలించినచో హరిభట్టు డెబ్బదియేండ్లకు తక్కువలేక జీవించియుండునని తోఁచును. అనఁగా కవి కాలము క్రీ. శ. 1450–1520 కావచ్చును.

గ్రంథస్థాధారము ; హరిభట్టు కృతులలో నారసింహపురాణ – ఉత్తరభాగ మొక్కటే అతని కాలనిర్ణయమునకు కొంతవఱకు నుపకరించునది. అయిదాశ్వాసములుగల యీ కావ్యమును రచించినది హరిభట్టు. కాని దానిని హరిభట్టు కుమారుఁడు రాఘవమనీషి ప్రోలుగంటి రంగన్నకు అంకితము కావించెను. అంకితమునకు అనువగురీతిని అవతారికను, ఆశ్వాసాంతపద్యములను రచించి పొందుపఱచెను. ఆ భాగమే ప్రకృతము కవి కాలసూచనమునకు కొంత ఉపయోగపడు చున్నది.

---

1 భారతి, జూలై, 1949, పు. 21–22.

* A.R. of Mysore Archeologica' Report 1927 Kolar inscriptions No. 69; Page 77. A copy of Ramasamundra grant of king Krishnaraya of Vizianagaram dated Saka 1435 in the possession of Sawle Seshachar in Kolar town.

1. నారసింహపురాణమునకు [2]ఉపోద్ఘాతమును వ్రాసిన ఓలేటివారు శాసనావలంబన న్యాయానుసారముగ కవి జీవితకాలము నూహించిరి. వారి చర్చాసారాంశ మిది :

(1) ప్రోలుగంటి రంగన, హావళి చినయోబభూపాలునియొద్ద దండనాథుఁడు. ఈ భూపాలుఁడు, ఆరవీటి బుక్కరాజువంశములోనివాఁడని కళాపూర్ణోదయ - అవతారికవలన తెలియుచున్నది. బుక్కరాజునకు ఆఱవతరములోనివాఁడగు హావళి చినయోబభూపాలుఁడు క్రీ. శ. 1560 ప్రాంతమున నుండినవాఁడు. అతని దండనాథుఁడగు రంగనయు అతనికి పురాణము నంకితముచేసిన రాఘవమనీషియు నా కాలములోనివారే అగుదురు. హరిభట్టు పరమపదించిన పిదప సుమా రిరువ దేండ్లకు నీ యంకితకార్యము జరిగియుండును. అపుడు హరిభట్టు నిర్యాణము క్రీ. శ. 1540 వ సం॥ ప్రాంతము కావచ్చును. కవికి అపు డేఁబదియేండ్లని భావించినచో, అతని జననకాలము క్రీ. శ. 1490 కావచ్చును. కావున, కవి జీవితకాల మించు మించు క్రీ. శ. 1490-1540 కావచ్చును. అతఁడు కృష్ణదేవరాయలకు సమకాలికుఁడు.

(2) ప్రోలుగంటి రంగనకు తిప్పన ముత్తాత యనియును అతఁడు ప్రౌఢదేవరాయల దండనాథుఁడనియును రాఘవుఁడు నారసింహ పురాణ-అవతారికలో పేర్కొనియున్నాఁడు. ఈ ప్రౌఢదేవరాయల రాజ్యపాలనకాలము క్రీ. శ. 1422-1447. తిప్పనకు మూఁడవతరమువాఁడగు రంగన (1447 60) క్రీ. శ. 1507 సం॥ ప్రాంతమువాఁడగును, మొత్తముమీఁద ప్రోలుగంటి రంగన 16 వ శతాబ్ద పూర్వార్ధమున ఉండినవాఁడగుటచే, [3]'నాతనికిముందున్న హరిభట్టు 15 వ శతాబ్దియం దుత్తరభాగమున నున్నవాఁడనుటకు సందేహముండదు.'

2. హరిభట్టుకాలము ఓలేటివారిచే నిర్ణయింపఁబడినదానికంటె తరువాతిది యని డా. నేలటూరు వెంకటరమణయ్యగారి [4]సిద్ధాంతము. దాని సారమిది :

ప్రోలుగంటి వంశజులలో మొదటివాఁడు తిప్పన. అతని పౌత్రుఁడు చెన్నకవి, తిప్పనకు ప్రపౌత్రులలో (మునిమనుమని పౌత్రుని పుత్రుఁడు) నొకఁడు రంగన. ఇతఁడు నారసింహపురాణమునకు కృతిపతి,

(1) తిప్పన ప్రౌఢరాయలకు సమకాలికుఁడు. ఇతడు ఓలేటివారు సూచించిన ప్రౌఢదేవరాయలు కాఁడు. అతని కుమారుఁడగు మల్లికార్జున దేవరాయలు. ఇతనికి ప్రౌఢదేవరాయ నామముకూడ కలదు. ఇతని పాలనకాలము క్రీ. శ. 1448-1495. ప్రోలుగంటి తిప్పన ఈతనికాలములోనే దండనాథుఁడు.

(2) ప్రోలుగంటి చెన్నకవి క్రీ. శ. 1500-1525 సం.ల మధ్యమున వెలసినవాఁడు, ఇతఁడు గ్రంథకర్తయై నరసింగరాయల మెప్పు పడసెను,

(3) నారసింహపురాణ కృతిపతియగు ప్రోలుగంటి రంగన, హావళి చినయౌబళరాజు యొక్క పినతండ్రి యైన యౌబళ మహారాజుగారొసఁగిన వైష్ణవాగ్రహార దానశాసమున నొక వృత్తికి స్వామిగ పేర్కొనఁబడియున్నాఁడు. ఆ శాసన కాలము క్రీ.శ. 1543వ సం॥. ఇతఁడు నారసింహపురాణమును క్రీ. శ. 1543-1548 సం.ల మధ్యకాలమున నంకితము గొనియుండును. అప్పటికి హరిభట్టు పరమపదించెను. అతఁడు కృష్ణదేవరాయలకును, పిదప అచ్యుతరాయలకును సమకాలికుఁడై యుండెననుట నిస్సంశయము.

3. చాగంటి శేషయ్యగారు ఓలేటివారి అభిప్రాయమును ఆమోదించిరి. డా. నేలటూరివారి శాసనప్రమాణ నిర్ణయమును సరియని యంగీకరించిరి. మఱియు, కృతిపతి రంగన కందాళ రంగాచార్యుల శిష్యుఁడగుటచేతను, రంగాచార్యులకు సంబంధించిన శాసనములు తిరుపతియందు క్రీ.శ. 1545 ప్రాంతమున కనఁబడుటచేతను ప్రోలుగంటి రంగన

---

2 పు. 9. 3 నారసింహ - ఉపోద్ఘాతము, పు. 9-10. 4 భారతి, జనవరి, 1941, పు. 17-24.

యొక్క కాలముకూడ అదియే యని ధ్రువపఱచిరి. [5] హరిభట్టు కాలము క్రీ. శ. 1475-1535 అనియును, అతఁడు 1500-1535 సం.ల నడుమ గ్రంథములను రచించియుండుననియును నిశ్చయించిరి.

ఓలేటి వేంకటరామశాస్త్రిగారును, డా. నేలటూరు వెంకటరమణయ్యగారును, చాగంటి శేషయ్యగారును తమ తమ అభిప్రాయములను విస్తరించి వ్రాసియున్నారు ముప్పురు నూహలపై ఆధారపడి వ్రాసినవారే. ఆ యూహలన్నియు నారసింహపురాణ-ఉత్తర భాగమునకు కృతిపతియగు ప్రోలుగంటి రంగనకు సంబంధించియున్నవి. హరిభట్టు అతనికంటె ఎంత పూర్వుఁడో నిశ్చయించుటకు నవి అంతగా ఉపకరించునవి కావు. కావున శ్రీకృష్ణదేవరాయల కాలమునాఁటి దాన శాసన మొక్కటే కవికాలనిర్ణయమునకు శరణ్యమగుచున్నది. కవికాలము క్రీ.శ. 1450-1520 కావచ్చునని కవివ్రాసిన గ్రంథపౌర్వాపర్య నిర్ణయావసరమున కొంత వివరింపఁబడును.

## 3 గ్రంథానుక్రమము:

తిక్కన, భారతములో తన నిర్వచనోత్తర రామాయణమును పేర్కొనియుండలేదు. దీనికి కారణములు చెప్పవచ్చును. రామాయణము నరాంకితము. భారత మట్టిది కాదు. రామాయణకాలమున తిక్కన తిక్కనయే. భారత కాలమున అతఁడు సోమయాజి. ఏలొకో కవి చెప్పలేదు. అతనికి ప్రియశిష్యుఁడగు కేతన కూడ తిక్కనను 'మఖి' యని వినుతించెనేకాని, ఆతని భారత రామాయణములమాట యెత్తలేదు. పలువురు కవులిట్లే తమ పూర్వరచనములను సమనంతర కావ్యములలో ప్రస్తావించియుండలేదు. హరిభట్టారకుఁడు నిట్టి మూకీభావమును వహించినవాఁడే. ఇతఁడేమి యంత తక్కువగా వ్రాసినవాఁడును కాఁడు. వ్రాసినవి వమ్ము కాలేదు. నేఁటికి లభించు గ్రంథముల ఆనుపూర్వి యెట్టిది? అవి యే వరుసలో వ్రాయఁబడినవి? ఏ గ్రంథ మే దశలో రచింపఁబడినది? ఈ ప్రశ్నములకు సరియైన సమాధానము లభించుట కష్టము. ఊహించి తృప్తిచెందవలసినదే

నారసింహపురాణ - ఉత్తరభాగపు ఉపోద్ఘాతములో ఓలేటివారు సూచించిన గ్రంథానుక్రమ మిది:-

1. వరాహపురాణము, 2. మత్స్యపురాణము, 3. భాగవతములోని షష్ఠ - ఏకాదశ - ద్వాదశ స్కంధములు, 4. నారసింహపురాణము - ఉత్తరభాగము. ఈ క్రమమునే చాగంటి శేషయ్యగారును అనువదించిరి. దీనికి వారు ఉటంకించిన కారణము లివి:

కవి, వరాహపురాణమును నరాంకితము కావించెను. తత్పాపపరిహారార్థము తరువాతి రచనములను దైవాంకితము చేసెను.

సీ. ధనమునకై నరాధముల సన్నుతి సేయఁ, బొడమిన పాపముల్ చెడుట కొఱకు. (మత్స్య. 1-7)

కడుపులకై నరాధములఁ గావ్యముఖంబుల సన్నుతింపఁగాఁ, బొడమిన పాపజాలముల బొట్టణఁగన్.... (షష్ఠస్కంధ, ప. 4)

కడపటి కృతియగు నారసింహపురాణము నేకారణముననో యెవరికిని అంకితము చేయలేదు. ఇందలి కవిత్వ మితరగ్రంథములలోనిదానికంటె కొంత ప్రౌఢమై తోఁచును. గ్రంథమును ముగించి యవతారికను వ్రాయుటకుమునుపు కవి కాలధర్మమును చెందియుండవచ్చును. భాగవత-ఏకాదశ ద్వాదశస్కంధముల ప్రస్తావము నారసింహపురాణమున కానఁబడుచున్నది. కావున నీ స్కంధద్వయము దానికి పూర్వమున రచింపఁబడినవి.

5 ఆం.క.త. సంపు.8, పు. 188

"విను రాఘవమనీషీ!....యేకాదశ ద్వాదశ స్కంధముల్, తెనిఁగించె మీతండ్రి...." (నారసింహ. 1-15)

ఓలేటివారు హరిభట్టురచించిన రతిరహస్యము నెఱుఁగరు. చాగంటివారి గ్రంథవిషయమున నెక్కువ యభిని వేశమును చూపలేదు. (ఆం.క. తరం. సంపు. 8. పు. 195)

గ్రంథానుక్రమ పరిశీలనమునకుముందు, ఒకటి రెండంశములను గూర్చి ప్రస్తావించుట సమంజసమై తోఁచు చున్నది. హరిభట్టు తనతండ్రియైన రామవిద్వన్మణియొద్ద వేదశాస్త్రాది సకలవిద్యల నభ్యసించినవాఁడు. షట్త్రోపాధ్యాయుఁడైన తండ్రి యుండఁగా, కుమారునకు వేఱొక గురువును అన్వేషించు శ్రమ లేకపోయినది. తండ్రియే గురువు. అందులకే అతని రచనములలో ప్రత్యేకముగా గురువు యొక్క ప్రస్తావము కానరాదు. గురువగు తండ్రిపేరు పూర్తిగా పేర్కొనుటకు * శిష్టాచారము అడ్డుపడినది. అందుచేతనే కాఁబోలును తండ్రిపేరును "చంద్రనామాంక రామవిద్వన్మణి' యని విభజించి ప్రస్తుతించెను. కవికి సంస్కృతభాషాభిరుచి, శాస్త్రరంగమందు అభిలాష యంకురించిన కారణములచే మొదట రతిరహస్యము రచింపఁబడినది. అది యౌవనదశ. ముప్పదేండ్ల ప్రాయము కావచ్చును. పాండిత్యమునకుతోడుగా అతనికి ఆశుకవిత యనభ్యస్తవిద్యగా వశమైనది. అతనికి ఇష్టదైవము హనుమంతుఁడు. హనుమన్మంత్రోపాసకుఁడై దానిలో సిద్ధినంది, కవితాసిద్ధియు నందు కొనెను. అనర్గళధారాశుద్ధిచే అవధానకళయందారితేఱెను. తెలుఁగులో కావ్యరచనమునకు ఉపక్రమించెను. ఒకవంక జీవికయు, మఱొకవంక కీర్తికాంక్షయు నతనిని వేధించుచున్నవి. 'నిరాశ్రయా న శోభంతే పండితా వనితా లతా' అను సూక్తి కలదు కదా! హరిభట్టునకు మహదాశ్రయము కావలసి వచ్చినది. ఇది యాతని రెండవదశ. ఏఁబదేండ్లు దాఁటని ప్రాయము. కవి యదివఱకు శివకేశవాభేదమును పాలించిన స్మార్తవైదిక విప్రుఁడు, శ్రీవైష్ణవ మతమునకు వ్యాప్తి, సమాదరము గల కాలమది. కాలమహిమకు లోఁగినాఁడు. విష్ణుభక్తి కలుగుట కష్టము. కలిగెనా ఆప్రభావము తొలఁగదు. అది నిగూఢ సత్యము. హరిభట్టు మొదట అద్వైతి. ఇపుడు 'విశిష్ట' పూర్వుఁడయినాఁడు. అతనిలో వాసుదేవుఁడే పరతత్త్వమను భావము పొటమరించినది. ఇది చిత్తసంస్కారమునకు సంబంధించిన పరిణామము. ఆత్మోద్ధరణము తప్ప తదన్యమును ఆశింపని విశిష్టదశ; మూఁడవదశ; చివరిది.

కవి 15 వ శతాబ్దము మధ్యమున ఉదయించినవాఁడు. రాచవారితో బుజములు రాచుకొనుచు, కవిరాజై, విద్యాధికారియై, కవిసార్వభౌముఁడైన శ్రీనాథుఁడు అప్పటికే కవితా సామ్రాజ్యమును పాలించినాఁడు. నాఁడాతని రాజసమునకు లోనుకాని కవిశబ్దవాచ్యుఁడు కానరాఁడు. ఏ పల్లెలోనో భక్తి కవితా కుటీరమును స్థాపించి, శుకాలాపాభిరామముగా, బమ్మెర పోతన భాగవతమును పలుకుచుండినవాఁడు. మహత్త్వ కవిత్వ పటుత్వ సంపదకు భవహరమగుటయే పరమార్థమని విశ్వసించిన మహానుభావుఁడు పోతన. హరిభట్టు తొలుత శ్రీనాథుని 'రాజసదీప్తికి' చిట్టాడిపోయెను. కావ్యరచనములో ఇది యతని తొలి యవస్థ. శ్రీనాథుని కవితా ప్రౌఢిమకు వశుఁడై, నారసింహ పురాణ ఉత్తరభాగమును సంతరించెను, పరాశ్రయమునకై ప్రాకులాట ప్రారంభమైనది. హరిభక్తుఁడైన, వరాహపురాణమునకు కృతిపతిత్వమును అభిలషించిన మాన్యుఁడే లభించెను. అదివఱలో వ్రాసియుండిన నారసింహపురాణ తాళపత్రములను నిరంకితముగానే కట్టకట్టి, వరాహపురాణము నాంధ్రీకరించి, నరాంకితముచేసి, తృణమో పణమో పడసెను. త్వరలోనే ఆశ్రయ లాభములోని యుబలాట మణఁగారినది. ఆ స్థితి యనుభవైకవేద్యము. తనకు ప్రాంతీయుఁడైన పోతనామాత్యుని చిత్తపరిపాకమును గ్రహించెను. అతని సాత్త్వికప్రవృత్తికి లోఁగిపోయెను. కృతిని నరాంకితము కావించినందులకు పశ్చాత్తాపపడెను. అతనిలో తీవ్రభావవిపరిణామము కలిగెను. కవితాపరిపాకమునకు సరసతాసారళ్యములు ప్రధాన చిహ్నములగును కాని, ప్రౌఢత కాదని గుర్తించెను. ఆ కవిత

* ఆత్మనామ గురోర్నామ నామాతికృపణస్య చ।
శ్రేయస్కామో న గృహ్ణీయాత్ జ్యేష్ఠాపత్యకళత్రయోః॥

భగవదర్పణము కావలయును. భాగవత-ఏకాదశ ద్వాదశ స్కంధములు రచించి యిష్టదైవమునకు అంకితము చేసెను. కొంత కాలము తీర్థ క్షేత్రములను సందర్శించెను. అప్పటికి అతనిలో హరిభక్తి స్థిరపడెను. నీలాచల జగన్నాథునకు 'నూలు పోగు'గా భాగవత-షష్ఠస్కంధమును రచించి సమర్పించెను.

వైష్ణవులకు ముక్తిక్షేత్రము శ్రీరంగము. శ్రీరంగనాథునకు నొక కావ్యమును సమర్పింపవలయును. విష్ణు పరత్వమును వేనోళ్ళ కొనియాడి, మత్స్యపురాణమును తెనిఁగించి రంగనాథునకు నంకితము చేసెను. జీవిత చరమదశ కడచినది. కవికి భవహరమైనది.

తరువాత కొంతకాలమునకు, కొడుకు రాఘవమనీషి తన తండ్రి కట్టిపెట్టిన ఆ నారసింహపురాణ కృతికి కలవాని వరుని వెదకి, హరువుగా మురువుగా అవతారిక నవదరించి, కన్యాదానముచేసి కృతార్థుఁడయ్యెను. ఇవికాక హరిభట్టు కృతులను పరిశీలించువారికి నింకను ఒకటి రెండు విషయములు సుబోధములు కాఁగలవు.

మొదటిది-ఇతని తెనుఁగు కావ్యములన్నియును పురాణానువాదములే. 15 వ శతాబ్దము పురాణయుగము. కవి ఆ కాలములోనివాఁడు కనుక, కాలప్రభావమునకు లోనైనట్లు స్పష్టము. రెండవది-తనకు పూర్వులగు ప్రసిద్ధ కవులు రచించిన గ్రంథములు పరికించి, తత్సంబంధములైన రచనలు సేయుట కవికి నభిమతమని తోఁచును.

సింహళీయ కొక్కోక పండితుఁడు రచించిన రతిరహస్యము (14 వ శతాబ్దాంతము) ఆంధ్రదేశమున అఖండ ప్రశస్తిని గడించినది. దానిని కూచిరాజు ఎఱ్ఱయ 1480 ప్రాంతమున నాంధ్రీకరించెను. హరిభట్టుకూడ శృంగారదీపిక యను నామాంతరముగల రతిరహస్యము-అను కామశాస్త్ర గ్రంథమును రచించెను. ఇది 1480 ప్రాంతమున జరిగియుండును.

చెదలువాఁడ యెఱ్ఱన నృసింహపురాణ-పూర్వభాగమును రచింపఁగా, తాను ఉత్తరభాగమును సంతరించెను. ఇది 1490 ప్రాంతమున జరిగియుండును,

నంది మల్లయ ఘంట సింగనలు సంస్కృత వరాహపురాణము నాంధ్రీకరించియుండఁగా, తానును మఱియొక వరాహపురాణమువైపు దృష్టి సారించెను. నామసాదృశ్యమున్నను స్వీకరింపఁబడిన యితివృత్తమున విభేదము కలదు. కాలము 1495 ప్రాంతము కావచ్చును.

పోతన రచించిన భాగవతములో కొన్ని స్కంధములు లుప్తములై యుండఁగా, ఆ యేకాదశ ద్వాదశ స్కంధములను 1500 సం. ప్రాంతమునను, షష్ఠమును 1520 సం. ప్రాంతమునను పూరించి ధన్యుఁడయ్యెను.

ఇంతవఱకు పేర్కొనఁబడినవి ఒకవిధముగా అనుసంధాన గ్రంథములు – లేదా భాగములు.

ఇతని కృతులలో కడపటిది మత్స్యపురాణము. కాలము 1525 సం. ప్రాంతము కానోపును. మత్స్యపురాణము ననువదించినవారతనికి మునుపు కానరారు. ఒకవిధముగ నిది ఇతని తొలి స్వతంత్రానువాదము. ఈ యాశయమువలన కవి రచనములలో నిదియే కడపటిదై యుండును. మత్స్యపురాణము తక్క తక్కినవన్నియు ననుబంధరచనములవంటివి యని భావించుటకు కారణమేమి? యను విచికిత్సకు అవకాశము కలుగుచున్నది.

ఎంత గొప్ప కవికైనను కీర్తిప్రతిష్ఠల విషయమున ఆత్మప్రత్యయము ప్రబలముగ నుండఁజాలదు. కాళిదాసంతవాఁడు "మందః కవియశఃప్రార్థీ" యని కొంత జంకుగొంకులను ప్రకటించియుండఁగా, హరిభట్టునుగూర్చి వేఱుగ చెప్పనక్కఱలేదు. అతనికొక మార్గము సుగమమని తోఁచినది. మహాకవుల రచనలలో ఏవేని యవశేషము లున్నచో వాని

పరికించెను. అవి ప్రసిద్ధగ్రంథములయినచో, కాలానుగుణముగా నష్టిదాని నెన్నుకొని, పూరించి సఫలతను బడయవచ్చును గదా! అప్పుడు గ్రంథగౌరవముతోఁబాటు తన రచనములకును ప్రచారము కలుగును. ప్రచారమువలన ప్రతిష్ఠ మిగులును. ప్రతిష్ఠవలన కృతులకు స్థిరత్వము సిద్ధించును.

ఇఁక నీ యంశములను మఱికొంత విశదముగా, విపులముగా పర్యాలోకించినచో, అతని గ్రంథానుక్రమమును, ఆయా గ్రంథముల రచనాకాలమును కొంతవఱకు సమన్వయము కాఁగలదు.

## (1) రతిరహస్యము :

ఇది కవికి హరిహరుఁడు అను వ్యవహారనామముండిన కాలమున రచింపఁబడినది. తొలిగ్రంథము. కామశాస్త్ర విషయకము. తాళపత్రములకు అమూల్య భద్రతలనాపాదించునది. సహృదయులు దీనారటంకమువలె వలచి దాఁచుకొనవలసినది. గ్రంథ మచిర కాలములోనె వ్యాప్తిగాంచుట కింతకన్న మఱేమి కావలయును!

“ఇది శ్రీ సర్వవిద్యానవద్య, సహజ సారస్వతానవద్య, చంద్రనామాంక విద్వన్మణికుమార, హరిహరనామక విరచితాయాం రతిరహస్యే....” అనునది [1]వ్రాఁతప్రతులలోని గద్యము. ఇందలి ‘సర్వవిద్యానవద్య’ బిరుదవాచకము ముద్రితమైన *రతిరహస్యములో కానరాదు. ఇది కవియొక్క పాండితీప్రకర్షను సూచించు బిరుదము; భట్టశబ్దార్థద్యోతకము. అతనికి తెలుఁగు కావ్యములు రచించుకాలములో ఆబిరుదముపై అభిరుచి తొలఁగినట్లున్నది. ‘అహమేవ పండితః’ అను భావతీవ్రత తగ్గినది. ‘అహం చ పండితః’ అనుభావము కలిగినది. హరిభట్టనామము చాలునని తోఁచినది. ఉత్తరపదమైన ‘హర’కు భట్టశబ్ద మేకాదేశమైనట్లున్నది. రతిరహస్యరచనమునాఁటినుండి యతని కృతులలో స్థిరపడిన బిరుదము ‘సహజసారస్వత’ యనున దొక్కటే. తక్కినవి యాతాయాతములు.

రతిరహస్యమునకు శృంగారదీపికయను నామాంతరము కలదు. 1422-1447 మధ్యకాలమున, విజయనగర ప్రభువైన [2] ఇమ్మడి ప్రౌఢదేవరాయలు రచించిన కామశాస్త్ర గ్రంథము ‘రతిరత్నప్రదీపిక’. ఈ రాజగ్రంథము సుప్రసిద్ధమై యుండును. అప్పటికే కొక్కోకుని రతిరహస్యము మహాఖ్యాతి నార్జించినది. సుమారు 1480 ప్రాంతమున దానిని కూచిరాజు-ఎఱ్ఱయ అనువదించియుండెను. వీనికి సంబంధిగా హరిహరుఁడును రతిరహస్యమును శ్లోకరూపమున స్వతంత్రముగ రచించియుండును. కాలము సుమారు 1480 సం. ప్రాంతము కావచ్చును.

నారసింహ పురాణ-ఉత్తరభాగమునకు ప్రోలుగంటి రంగన కృతిపతికదా! అతని ముత్తాత తిప్పన ప్రౌఢదేవరాయలయొద్ద దండనాథుఁడు. ఈ విషయమును రాఘవమనీషి తాను వ్రాసిన అవతారికలో తెలిపియున్నాఁడు, (నారసింహ, 1-22). ఈ ప్రౌఢదేవరాయలు ‘ఇమ్మడి’ పూర్వపదనామధేయుఁడే కాని [3]డా॥ నేలటూరివారు సూచించిన ముమ్మడి ప్రౌఢదేవరాయలను నామాంతరముగల మల్లికార్జునదేవరాయలు కాఁడు. ఏలన తండ్రి రచించిన శృంగారదీపికయును, తత్పూర్వము (ఇమ్మడి) ప్రౌఢదేవరాయ కృతమగు రతిరత్నప్రదీపికయును రాఘవమనీషి తలఁపున మెదలుచుండియుండును. ‘దీపికా’నామము భ్రాంతిజనకము కావచ్చునని భావించి, హరిహరుఁడు రతిరహస్యమను నామాంతర మొసఁగినట్లున్నది. కొక్కోకుని రతిరహస్యముకంటె నిది భిన్నమైనదని సూచించుటకు కాఁబోలును దీనికి రతిదర్పణమను నామమును తుది గద్యలో (పు. 134) లేఖకులు వ్రాసికొన్నటులు తోఁచుచున్నది. రతిరహస్యమే యైనను రచనములో స్వైరిత కానరాదు. సంప్రదాయపు హద్దు లెందును మీఱని నిగ్రహముతో కూడిన రచనమిది. అందుచే నిది పండితుల ప్రశంసకు పాత్రమైనది.

---

1 ఆర్. నం. 1054 (బి); డి. 3899 జి.ఓ.ఎం.ఎల్, * కల్చరల్ బుక్స్ లిమిటెడ్, మదరాసు.

2 History of Classical Sanskrit Literature, పు. 893. 3. భారతి జనవరి, 1941, పు. 20.

[4]'కొక్కోకుని రతిరహస్యము కంటెను ఈయన గ్రంథము చాల సంప్రదాయశుద్ధముగాను, కామసూత్రోద్దేశ నిబద్ధముగను ఉన్నది.' [5] 'అసలే కొక్కోక మహాకవి క్రొత్తత్రోవ త్రొక్కినాఁడు. ఆపైని ఎఱ్ఱయ మఱియొక ఆకు ఎక్కువ చదివినాఁడు'—అని పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు గ్రంథద్వయమును తులనాత్మకముగా శీలించి హరిభట్టుకృతి నభినందించినారు.

హరిభట్టు రతిరహస్యములో నాలుగు పరిచ్ఛేదములు కలవు. స్త్రీ విట విభాగావస్థాది లక్షణము, స్త్రీ పురుష జాత్యాది నిరూపణము, భోగ బంధాది నిరూపణము, వశ్యౌషధాది నిరూపణము—అందలి ప్రధానాంశములు.

హరిభట్టు శ్లోకరూపమున రచించిన రతిరహస్యమును ముష్టిపల్లి సోమభూపాలుఁ డాంధ్రీకరించెను. మూలము ననువాదముతోఁజేర్చి కల్చరల్ బుక్స్ లిమిటెడ్‌వారు ప్రచురించిన సంగతి ఉక్తపూర్వము. సోమభూపాలుని కృతికి నీ హరిభట్టీయము సంస్కృతీకరణమని గోలకొండ కవుల సంచిక (పుట 406) సూచించుట ప్రామాదికము.

క్రీ. శ. 1846 సం॥న VON RICHARD SCMIDT (ఫాన్ రిషర్డ్ ష్మిట్) అను పాశ్చాత్య పండితుఁడు హరిహరుని రతిరహస్యమును జర్మనీదేశమున మొదటిసారిగా ప్రచురించెను.

హరిభట్టు నిండుజవ్వనమున ఈ రతిరహస్యమును సంతరించియుండుననుట సముచితము. ముప్పదేండ్లు దాఁటని ప్రాయము. విద్వత్కవులు శాస్త్రగ్రంథరచనముతో కావ్యరంగమున కాలూనుట కలదు. 'పాండిత్యహీనాః కవయో భవంతి' యను అపప్రథ కగ్గము కారాదని వారి యాశయము. 'విద్వత్కవయః కవయః....' అను నాభాణకములోని మర్మమును హరిహరుడు గుర్తించి, శాస్త్రగ్రంథమును రచించి ప్రసిద్ధికి వచ్చెను. ఆశుకవియై, అవధాన విద్యానిపుణుడై 'అష్టఘంటావధాన'-బిరుద విభ్రాజి తుఁడైనాఁడు. రతిరహస్య రచనానంతర మార్జించిన బిరుదమిది. ముచ్చటపడి ఈ బిరుదమును చాల వఱకు తన తెలుఁగు కృతులలో నిక్షేపించుకొన్నాఁడు. ఇంతకు రతిరహస్య మాతని తొలి రచనమని భావించుట యుక్తము.

## (2) నారసింహ పురాణము - ఉత్తర భాగము :

(కవి తొలి కృతి), ఈ పురాణమున ఇతివృత్త భాగమును సంపూర్ణముగా రచించినది హరిభట్టు.

ప్రోలుగంటి రంగన కంకితము చేయుటకై అవతారికను, ఆశ్వాసాంతపద్యములను సమకూర్చిపెట్టినది హరిభట్టు కుమారుఁడైన రాఘవుఁడు. ఇట్టిది అపూర్వము కాకున్నను విచిత్ర సంఘటనము.

ఇది వివాదములకు దారితీయవచ్చును.

కవి యీ నరసింహపురాణము నేకాలమున వ్రాసియుండును? రచించిన గ్రంథములలో నిది యెన్నవది? కవి దీనికి అవతారికను రచింపలేదా? లేక వ్రాసినదానిని రాఘవుఁడు స్వానుకూలముగా మార్చివేసెనా? యనునవి వివాదాంశములు. ఆశ్వాసాంతగద్య మిట్లున్నది.

"ఇది శ్రీ హనుమత్కటాక్షలబ్ధవరప్రసాద, సహజసారస్వత చంద్రనామాంక భారద్వాజసగోత్రపవిత్ర రామ విద్వన్మణికుమారాష్టఘంటావధానపరమేశ్వర హరిభట్టారకప్రణీతంబైన శ్రీ నృసింహపురాణోక్తంబగు నుత్తరభాగంబునందు...."

రతిరహస్యములోని గద్యముకన్న ఇది విభిన్నమైనది. విశిష్టమైనది. కవికి హనుమత్కటాక్షమువలన కవితాసిద్ధి కలిగినది; అవధానిగాఁగూడ ప్రసిద్ధికి వచ్చెను. పురాణమును హరిభట్టు రచించెననుటలో విప్రతిపత్తి లేదు.

---

4 వాత్స్యాయన కామసూత్రములు, చదువరులకు విజ్ఞప్తి, పు. 19, 5 అంతే, పు. 25.

ప్రోలుగంటి రంగన. నంబెల చినపోబభూపాలునికడ దండనాథుఁడు. 'రెండవ యింద్రుఁడనఁదగు...... గొలువు గూర్చుండి హరికథాగోష్ఠిఁదవిలి, (1-13) రాఘవుని పిలువఁబనిచెను. అర్ధాసనమొసఁగి యాదరించి వినయమున నిట్లనెను.

సీ. విను రాఘవమనీషి! హనుమత్కృపావర । లబ్ధ కవిత్వవిలాసమహిమఁ
దనరి, యేకాదశ ద్వాదశ స్కంధముల్ । తెనిఁగించె మీతండ్రి ధీయుతుండు
హరిభట్టు నిఖిలవిద్యాచతురాస్యుండు । రాజమాన్యుఁడు కవిరాజసుతుఁడు,
నారసింహపురాణ పౌర స్త్యభాగంబుఁ । జెవలవాఁడెట్టిన మొదలు సేయఁ

తే. బ్రతిభ దనకొ త్త నుత్తరభాగ మిచ్చె । డంధ్రభాషను వచనకావ్యం బొనర్చె
నా ప్రబంధంబు నాపేర నంకితముగ । నీవు గావింపలయుఁ గవీంద్రగణ్య!

(నారసింహ. 1-15)

ఈ పద్యమున వినుతింపఁబడినవాడు పురాణము నాంధ్రీకరించిన హరిభట్టు; అతనికుమారుఁడు రాఘవమనీషి కాఁడు.హరిభట్టు ప్రతిభాదికము పైపద్యమున ప్రశంసితము. అతని కృతులలో నేకాదశ ద్వాదశ స్కంధముల ప్రస్తావము మాత్రమే కలదు. కావున నాస్కంధద్వయము ఈ నారసింహ పురాణరచనమునకు మునుపు రచితములయినట్లు భ్రమ కలుగుట వాస్తవము. అపుడు కవి రచించిన తక్కిన కృతులేమయినట్లు ? ఓలేటివారు ఇట్లు వ్రాయుచున్నారు.

'నారసింహపురాణమునకును బిరముందే వరాహ మత్స్య పురాణములు విరచింపఁబడిన వనుకొందమన్నచో నా గ్రంథములు రచియించునంతకాలమువఱకు నీ నారసింహపురాణము కవిచే నెవ్వరిపేర నంకితము చేయఁబడక మిగిలియుండి యిప్లేల కవిపుత్రునిచేఁ గృతి యీయఁబడునని సంశయింపవలసివచ్చును....గ్రంథరచనాక్రమమును గూర్చి విశేషతర్కము....పనిలేదు. కాని గ్రంథకర్తచే నెవ్వరికి నంకితము చేయఁబడక మిగిలియున్నదగుటచేతను....నిందలి కవిత్వము కొంత ప్రౌఢముగాఁ గాన్పించుటచేతను నీ నారసింహ పురాణ మీకవిగ్రంథములన్నింటిలోను గడపటిది....'[6]

ఎవరికి నంకితము కాకుండుట, కవిత్వము ప్రౌఢముగనుండుట యను రెండుకారణములచేత ఈ పురాణము హరిభట్టు రచనములలో కడపటిదని నిరూపించుట యుక్తిసహమగునా? పరిశీలింపవలయును.

1. రాఘవమనీషియే తన తండ్రి యొక్క కృతులవివరములను కృతిపతి రంగనకుఁ దెలిపియుండవలయును. రతిరహస్యము సంస్కృత గ్రంథము. కావున నంకితముతో పనిలేదు. నారసింహపురాణము నిరంకితము. ఎవరికో అంకితమైపోయిన వరాహపురాణమునుగూర్చి ఆతరుణమున రంగన ప్రస్తావించుట భావ్యము కాదు. ఏకాదశ ద్వాదశ స్కంధములు హనుమదంకితములు. షష్ఠస్కంధము జగన్నాథార్పితము. మత్స్యము శ్రీరంగనాథునకు సమర్పితము. వీనిలో-షష్ఠస్కంధమునందును, మత్స్యపురాణమునందును-కృతిని నరాంకితము చేయుట పాపకార్యమని కవి ముక్తకంఠముతో చెప్పియే యున్నాఁడు. కాఁబట్టి వీనిని ప్రస్తావించుటలోను సందర్భశుద్ధి కానరాదు. ఇఁక మిగిలినవి యేకాదశ ద్వాదశ స్కంధములు. కవి హనుమద్భక్తుఁడు. కవిత అతని కృపాలబ్ధమైనది. ఆ కారణమున నీ రెండు స్కంధములును హనుమదంకితములయినవి. మఱొక విషయము. ఈ స్కంధద్వయమును రచించుటచేత పోతన భాగవతము పూరింపఁబడినది. అది యొక సమగ్రాకృతినందుటచేత హరికథా ప్రియులు సంతసించిరి. కవి వారి మన్ననలకు పాత్రుఁడై ఆకాలములో వాసికెక్కియుండెను. అందులకే యీ రెండు స్కంధముల ప్రస్తావము మాత్రము పైపద్యమున

6. నార. పురా. ఉత్తరభాగము - ఉపో - పు. 12.

కన్పట్టుచున్నది. ఇఁక నారసింహపురాణము రంగనచే సమీహితము కాఁగా, రాఘవమనీషి అంకితకైంకర్యము కావించెను. కావున నారసింహపురాణము కడపటిదనుటకు ఇది కారణము కాఁజాలదు.

2. ఇఁక హరిభట్టుయొక్క ఆద్యకృతి కావున, నిందులో పాండితిస్ఫోరకమగుశైలి కానఁబడును. మఱియు నిది 'ప్రబంధ పరమేశ్వరుఁడు' 'ప్రబంధ రచనా ప్రావీణ్యము' తో రచించిన నృసింహపురాణమునకు పూరకగ్రంథము కదా! కావున ఈ కృతి కూడ 'తద్రచనయకా' ఉండుట యుక్తము. కావున కవిత ప్రౌఢమైనది. అంతియకాని కడపటి రచన యను కారణముచేత రచన ప్రౌఢము కాలేదు. [వరాహపురాణము ముద్రితమై యుండలేదు. కనుక వారు దానిని సునిశితముగా పరిశీలించుట కవకాశము తక్కువ. పరిశీలించినచో ప్రౌఢిమలో వరాహపురాణము ప్రాథమ్యము వహించునని వారును గ్రహించియుందురు.] వ్రాసినకొలఁది, కవితలో ప్రౌఢిమ యఱుగవడి, ప్రసన్నత కుదురుకొనుట మహాకవుల రచనలలో కనవచ్చు గమనార్హమగు పరిణామము. హరిభట్టు మహాకవి. అతని కావ్యములలో ఈ పరిణామము కానవచ్చును. తిక్కన రచించిన రామాయణ భారతభాగములలో ఈ వ్యత్యాసమును విమర్శకులు గుర్తించియే యున్నారు. కావున నరసింహపురాణము తుది రచనమని తలఁచుటకు ఈ కారణము కూడ అంతగా సాధకమైనది కాదు. తొలి రచనమై యుండునని భావించుటలో బాధక మేమాత్రమును కానరాదు.

చాగంటి శేషయ్యగారి అభిప్రాయము కూడ కవి రచనములలో నారసింహ పురాణము చివరిదనియే. అట్లనుకొనుటలో దోషము లేదు. కాని, 'హరిభట్టు రచించిన కృత్యాదిపద్యములను రాఘవమనీషి మార్చి వేసినాఁడనుటయే యుక్తము'[8] అను అభియోగము మాత్రము నిరాకరమైనది. మఱియు [9]ద్రవ్యలోభముచే రాఘవమనీషి యటువంటిపని చేసియుండుననుట అభినీతము కాని మాట. [బిల్హణీయకృతి విషయమున జరిగిన తెరమఱుఁగు నాటకమువంటిది ఇందేదియు కానరాదుకదా!] కృతి చివరిదే యైయుండినచో హరిభట్టు దానిని భగవదంకితము చేసియుండవలయును. కారణము, కవి నరాంకితము చేయుటకు అప్పటికే విముఖుఁడు. ఏదైనమునో నిర్ణయించుకొనుటలో కవి తికమకపడ నవసరమును లేదు కదా! అర్పణపద్యములను కొన్నింటిని వ్రాసినను చాలునే!

వరాహపురాణము నరాంకితము. అందులోకృతిపతి వంశాదిక వర్ణనములుండుట అనివార్యము. కావున అవ తారికలో మొత్తము పద్యగద్యముల సంఖ్య 50. ఏకాదశ ద్వాదశ స్కంధములలో 6; షష్ఠస్కంధమున 9. మత్స్య పురాణము ముద్రిత ప్రతిలో 14, తాళ పత్రప్రతులలో 20. ఇది యాతనిపద్ధతి. దైవార్పితములయిన యీ కొన్ని పద్యముల భాగమును కుమారుఁడు రాఘవుఁడు మార్చివేయుట యన ఇటు పితకు, నటు దేవతకును ద్రోహము తల పెట్టుట కాదా? ఆ 'మనీషి' ఆ పాపకృత్యమునకు నొడిగట్టి యుండునా?

మఱియొక దృష్టాంతము. కవి కృతులలో వరాహపురాణము మొదటిదని ఓలేటివారును, చాగంటివారును నిర్ధరించి యున్నారు. ఆ పురాణములో కృతిపతి కవిని "అమృతప్రాయ వచోవిశేష రచనా హంభావ పుంభావ వాగ్రమణీ మూర్తివి....ఏకముఖ బ్రహ్మవు....సత్కవిగ్రామణీ! (అవ. 16) అని వినుతించియున్నాఁడు. ఈ వినుతికి, తత్ప్రోద్వమే ప్రౌఢకావ్య మేదియైన నా కవిచే రచితమై యుండవలయును కదా? ఆతని రతిరహస్యమో, అవధానప్రాభవమో కారణమని తలఁచుట హాస్యాస్పదమగును. ఈ దృష్టితో పరికించినను నారసింహపురాణమే తొలికృతియై తద్వినుతికి పాత్రమై యుండియుండును.

---

7. ఎఱ్ఱన నృ. పు. 1—17, 20. 8 ఆం.క.త, సంపు. 8, పు. 176, 9 అందే పు. 175

నారసింహపురాణము హరిభట్టు వ్రాసిన తెనుఁగు కృతులలో మొదటిది. పూర్వభాగమును ఎట్టున రచించి యుండెను. కావున ఉత్తరభాగమును తాను రచించినచో కీర్తి కలిగినవచ్చునను అభిలాష యతనిలో నంకురించియుండును. ఈ కృతికన్యను వలచి పిలుచుకొను జామాత మాత్రము దొరకియే యుండినచో, తప్పక ఆ ప్రబంధమును తన్నా మాంకితము కావించియుండును. ఇంతలో వరాహపురాణమును వలచిన యల్లుఁడు మాత్రము లభించినాఁడు. కావున మూలఁబడిన నారసింహపురాణమున అవతారిక కానరాదు. తరువాత ఏఁబదేండ్ల పిదప కావచ్చును, ప్రోయగంటిరంగన యభ్యర్థింపఁగా, రాఘవమనీషి యవతారిక సంతరించి, అంకితము కావించియుండును.

కవి తన తొలిరచనము నిట్లు మూలఁబడవేయుట యెందులకు? తరువాత నెప్పుడైన దైవార్పణమైనను జేసియుండరాదా? అనుశంక కలుగవచ్చును.

ఏ నరునకో అంకితముచేసి, యింతగడింతమని యాశించి, రచించి, యా కోరిక సఫలము కాకపోఁగా, పిదప దాని నే భగవంతునకైన సమర్పింప హరిభట్టు తలఁచియుండెనేని అది యాతని భట్టత్వమునకే భ్రష్టత్వమును కలిగించి యుండును. అది రెంటికిం జెడిన రేవడి కార్యము.

రతిరహస్యములోని తుదిగద్యమునుబట్టి తొలుత నాతనిపేరు హరిహరుఁడు. హరిహరదేవ ప్రస్తావము నారసింహపురాణ ఉత్తరభాగములో కలదు. ప్రథమాశ్వాసమున శివ కేశవులు శరభ నరసింహాకారములు ధరించి సమరము కావించుట, పిదప వైష్ణవశ్రేష్ఠులును, శైవవరులును వినుతింపఁగా "హరిహరస్ఫూర్తి యేకదేహమున నిలుచుట" (1–227); పంచమాశ్వాసమున – ప్రహ్లాదుఁడు వైకుంఠముపై దాడి వెడలుట మున్నగు అంశములు విష్ణుభక్తులకు నంగీకార్యములు కావు. "ప్రహ్లాదో జన్మ వైష్ణవః" అని కదా పురాణవాక్యము. అట్టివానికా హరిపై వైరము!

కాన, కవి శివకేశవులకు నభేదము నంగీకరించియుండిన తరుణమున వ్రాసిన పురాణమది. ఆ వయసున అతని భక్తిభావము బురదలో పాతిన కంబమువలె నుండినది.

వరాహపురాణరచనమునాఁటికి అతనిలో విష్ణుభక్తి కొంత యూర్జితమైనది. మత్స్యపురాణమును రచించు నాఁటికి హరియే పరతత్త్వమను గాఢ ప్రత్యయము స్థిరపడినది. కావున తన హరిహరనామము వలె, హరిహరాభేదమును ప్రతిపాదించు నారసింహపురాణము కూడ విస్మరింపఁబడినది; తరువాతిరచనముపై దృష్టి పాఱినది.

ప్రహ్లాదునిలో సాత్త్వికప్రవృత్తి శమించి, తమోగుణము విజృంభించినపుడాతఁడు స్వర్గముపై దాడివెడలుట, వైకుంఠమును ముట్టడించుట, పశ్చాత్తప్తుఁడగుట, అతనికి శ్రీమన్నారాయణుఁడు హరివాసరమహిమ నుపదేశించుట – ప్రధానముగ పురాణములోని ఇతివృత్తము. అయిదాశ్వాసములలో 900 పద్యగద్యములలో, ప్రబంధోచిత వర్ణనముతో పరిపూర్ణమైన పురాణమిది. కావ్యాంతమందలి మందేహోపాఖ్యానమొక రసవద్ఘట్టము. పాండురంగమాహాత్మ్యమందలి నిగమ శర్మ మందేహునియొద్ద పాఠములు చదివినవాడనిపించును. తెనాలికవికి, రచనమునకు హరిభట్టుకవిత బజ్జబంతి. రెంటిని పోల్చి చదువుకొను రసికుల కీవిషయము వినోదకరము. కవి యీ నరసింహపురాణము—ఉత్తరభాగమును 1490 సం. ప్రాంతమున రచించియుండును.

## (3) వరాహపురాణము :

సంస్కృత వరాహపురాణమునకు సముచితానువాదము నంది మల్లయ ఘంట సింగయల కృతి. అది భూదేవీవరాహ స్సంవాదరూపకము. కాని, వరాహావతార మహిమాతిశయమును వర్ణించునది కాదు. నేతిబీరకాయ. ఒకవిధముగానది

ప్రతకల్పగ్రంథము. హరిభట్టు రచించిన వరాహపురాణము రోమశ మార్కండేయ సంభాషణాత్మకము. అవతార ప్రయోజనాదికము నభివర్ణించునది. అన్వర్థమైనది.

కవి యీ పురాణమును కొలిపాక యెఱ్ఱయకు అంకితము కావించెను. అతఁడు కంబముమెట్టకరణము. కుమ్మరికోనయ్యను కొసరినచో ఒకప్రమిద ఎక్కువగా దొరకును. అంతే! హరిభట్టు పరిస్థితియు అట్టిదే కావచ్చును. తన నారసింహపురాణము నిరంకితముగ నుండుటయు, వరాహపురాణము అంకితమైనను 'అభిలషితార్థము' సిద్ధింపక పోవుటయు కవిని అంతర్ముఖుని కావించియుండును. ఈ సన్నివేశమే అతనిలో పరాశ్రయ వైముఖ్యమును భాసింపఁజేసియుండును. దైవార్పణమే తరణోపాయమను తాత్పర్య మాతనిలో నెలకొనియుండును. అందుచేతనే హరిభట్టు తన తరువాతి కృతులను భగవదంకితములు కావించెను. వరాహపురాణ రచనాకాలము 1495 సం॥ ప్రాంతము కావచ్చును. ఈ పురాణ ప్రశస్తి 'అనుశీలన'మను తర్వాతి శీర్షికాంశమగును.

## (4) భాగవతము - ఏకాదశ ద్వాదశ స్కంధములు

ఈ స్కంధద్వయము హనుమన్నామాంకితము. దినకరునకు దీపారాధనముచేసి తృప్తిపడునట్లు, కవి హనుమల్లబ్ధ కవిత్వము నీ స్కంధరూపమున అతనికే సమర్పించి అంజలించెను.

శా. బంధూక ప్రసవాతిరక్తవదనున్, బ్రఖ్యాతునిన్, రామ హృ
ద్బంధున్, వాయుతనూభవున్ దలఁచి, విద్వత్కోటి మద్వాగ్విభూ
తిం ధాత్రిన్వినుతింప, భాగవతమం దేకాదశ ద్వాదశ
స్కంధంబుల్ తెనిఁగింతుఁ బూర్వకథిత స్కంధానుసారంబుగన్.

పోతన భక్తినిర్భరుఁడై మహాభాగవతమును తెనిఁగించెను. అందు కొన్ని స్కంధములు లుప్తప్రాయములైనవి. పోతన వాఙ్మాధుర్య మనిదంపూర్వము. ఆ రీతిని స్కంధరచనలో సహృదయ సమ్మతముగా అనుకరింప యత్నించినది హరిభట్టొకఁడే. తన వాగ్వైభవమును విద్వాంసులు వినుతింపవలయును. కవితలో భక్తి వాసింపవలయును. ఆ దృష్టితో అతఁడు లుప్తస్కంధములను పూరించెను. 'అపర పోతన'గా రాణించెను.

కూచిమంచి తిమ్మకవి 1740 ప్రాంతమున సర్వలక్షణసారసంగ్రహము రచించెను. అందు భాగవత గ్రంథ ఖననగాథ కలదు. సర్వజ్ఞ సింగభూపాలుఁడు 'అలిగి యా పుస్తకం బవనిఁ బాతించినఁ, జివికి యందొకకొంత శిథిల మయ్యెఁ, గ్రమ్మరనది వెలిగందల నారపరాజును, మఱి బొప్పరాజు గంగరాజు మొదలగు కవివరుల్ తేజమెసఁగఁ జెప్పిరి……" (3-344). తిమ్మకవి ఈ యుదంతమును కర్ణాకర్ణిగ వినియుండును. ఇందలి సత్యాసత్యవిచార మంత ముఖ్యము కాదు. కాని, యిప్పటికి 250 సం.లకు పూర్వము తిమ్మకవి చెప్పియుండుట నిజము. 'మొదలగు కవివరుల'లో హరిభట్టు కూడ అన్యతముఁడని భావింపనగును.

రాజులు పరకృత తిరస్కారమును సహింపరు. వారి నిగ్రహానుగ్రహ చాపల్యమే నాటి దేశ చరిత్ర. 'గుడి మ్రింగేవారికి తలుపులప్పడాలు' దేశములపై దండయాత్రలు సేయువారికి 'పేద కవి' యొక లెక్కయా! హేమపాత్రాన్నము భుజించిన కవిసార్వభౌముఁడే 'నగరివాకిటనుండు నల్లగుండు'ను భరించెను గదా! కవులకు నరపతులపై వైముఖ్య మేల కలుగును? 'రాజుల్ మత్తులు వారిసేవ నరక ప్రాయంబు' అని ధూర్జటి ఆక్రోశించెను. 'రాజసేవా మనుష్యాణా మసిధారావలేహనం' అని సుభాషితము. పరమసాధుశీలి పోతనయు రాజులను నిందించెను. అవి చాటువులని సాకులు చెప్పవచ్చును.

మనకు సమ్మతములు కానివన్నియును అసత్యములే అందునచో, ఇంక రాజులందఱును 'రఘువంశము'లోని వారలే కావలయును.

సింగభూపతి పోతనకు ఏయపకృతిని చేసియుండక పోవచ్చును. తిమ్మకవి పేర్కొన్నకథ 'కట్టుకథ' కావచ్చును. ఆరాజునకు కళంకము కలుగరాదని చాగంటి శేషయ్యగారు "సింగమనీఁడు క్రీ.శ. 1340–1410 సం॥ ల నడుమ నుండెను' [10] అనియు, 'పోతన జననము క్రీ. శ, 1450 సం; క్రీ. శ. 1490 ప్రాంతమున భాగవతము పుట్టి యుండునని' [11] యును నిశ్చయింప యత్నించుట యేలొకో! వారి యూహ చొప్పున శ్రీనాథ పోతనలు సమకాలికులు కాకపోయిరి. భోగినీదండక నారాయణ శతకము లన్యకృతములే యాయెను. కాని, పోతన భాగవతమును 1470 ప్రాంతముననే పూర్తి చేసియుండునని పలువుర విశ్వాసము.

పోతన పదునేనవశతాబ్దము పూర్వార్ధములోనివాఁడని వీరేశలింగం పంతులుగారి యభిప్రాయము. అనుముల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు క్రీ. శ. 1410–1470 అని నిర్ణయించిరి (పోతన, పు. 18). 'పోతన 15 వ శతాబ్దము ఉత్తరార్ధము నందున్నవాఁడు,[12] అని శ్రీ మహాభాగవతము పీఠికలో కలదు.

హరిభట్టు క్రీ. శ. 1500 ప్రాంతమున నేకాదశ ద్వాదశ స్కంధములను పూరించియుండును. ఇదే భాగవతమునకు 'తొలిపూరణము' కావచ్చును. తరువాత నితని పద్యముల నాదరించి, పోతనకు ప్రియశిష్యుఁడు వెలిగందల నారయ సంగ్రహముగా రచించియుండును. నారయయొక్క యన్యరచన మేదియును కానవచ్చుటలేదు. కనుక నారయ హరిభట్టు రచనము ననుసరించి సంగ్రహించి యుండును కాని, హరిభట్టు నారయ ననుకరించె ననుట సరికాదు. హరిభట్టు పద్యములు అటనట నారయరచనములో వచనములో నున్నవి. భాగవతప్రతులు వ్రాసికొన్నవారు నారయ పూరణము నాదరించినట్లు హరిభట్టు రచనమును గూడ అనుసంధించుకొని యున్నారు. ఉదాహరణమునకు – తిరుపతిలోని *శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యానిలయ ప్రాచ్య పరిశోధనాలయమునఁగల ఆర్. నం. 681 గల తాళపత్రప్రతిని గ్రహింప వచ్చును.

'హరిభట్టు రచన ధారాశుద్ధిశోభితమై మనోహరముగా నుండుటచేఁ గొందఱు భాగవతమును వ్రాసికొనునప్పుడు నారయ రచనకు బదులుగా, హరిభట్టు రచనను వ్రాసికొనుచుండిరి. అందుచేతనే కొన్ని తాళపత్రప్రతులు హరిభట్టు రచనతోఁ గూడియుండుట సంభవించినది. నారయరచనలోఁ బెక్కుచోట్ల హరిభట్టు రచనయో దాని ననుసరించిన రచనయో కనవచ్చుచున్నది.' అని [13] అకాడమి భాగవత పీఠికలోని విమర్శకాభినందనము నిష్పాక్షికమై యున్నది.

నారయయొక్క కృత్యంతరము లభించవలకును 'నారయ వచనములుగా వ్రాసినవానిని హరిభట్టు పద్యములుగా వ్రాసెను' అను [14] నిడుదవోలు వారి పలుకులు సమర్థనీయములగునా? నారన తాను పోతనకు ప్రియ శిష్యుఁడనని చెప్పికొనుటచే నతని రచనమునకు విశేష ప్రచారము కలిగియుండును.

---

10 ఆం.క.త. సంపు. 6, పు. 197, 11 అందే పు. 191, 12. ఆం. ప్ర. సా. అకా. పు. 12, 13.

* Sri Venkateswara University Oriental Research Institute; Tirupati (A.P) 13. భాగ. పీఠిక, పు. 66. 14. పోతన – పుట 186.

క. పలికెడిది భాగవతమఁట । పలికించెడువాఁడు రామభద్రుండఁట? నేఁ
బలికిన భవహరమగునఁట । పలికెద, వేఱొండు గాథ పలుకఁగ నేలా?

అనునది పోతరాజుగారి పవిత్ర భావన. హరిభట్టు కూడ ఆ మార్గముననే పయనించెను.

క. మారుత సుతుఁడఁట కృతిపతి । పారీణత భాగవతము పలికెదివఁట ః యీ
సారస్య మిచటఁ గలుగఁగ । వేఱొక మార్గమునఁ బోవు వెఱ్ఱియుఁ గలఁడే? (11 వ స్కం, ప. 4)

పూరింపవలసిన భాగవతము ఉండఁగా, కృతిపతిగా ఇష్టదైవము హనుమంతుఁ డుండఁగా, ఇతివృత్తమునకై కృతిపతికై ప్రాకులాడిన తన యలనాఁటి బాలిశభావము తలఁపునకు వచ్చినది కాఁబోలును!

ఈ స్కంధము ఆంధ్రసాహిత్యపరిషత్తువారి యాజమాన్యమున ప్రకటింపఁబడిన సంగతి విదితమైనదే. ద్వాదశస్కంధము చిన్నదైనను ముద్రణ భాగ్యము నందలేదు. ఏకాదశ ద్వాదశ స్కంధముల విషయానుక్రమణిక యిది.

కశ్యపాదిముని సమాగమము, విప్రశాపమిషను యాదవవంశ సంహరణము, ఉద్ధవ జనార్దన సంవాదము, వాసుదేవుఁడు మానుషదేహమును వీడి ఆత్మయోగమున పరమపదమునకు చనుట, తత్కాంత లనలప్రవేశముసేయుట — ఇవి ఏకాదశ స్కంధములోని విషయములు.

కలియుగ రాజవంశములు, కలియుగ ధర్మములు, చతుర్విధ ప్రళయ లక్షణములు, బ్రహ్మనిరూపణము, పరీక్షిన్నిర్యాణము, జనమేజయ సర్పయాగము, వేదశాఖా ప్రమాణము, పురాణలక్షణములు, మార్కండేయోపాఖ్యానము, పురాణక్రమము — అనునవి ద్వాదశ స్కంధములోని కథాంశములు.

(* నందవర వంశ్యుఁడైన సంజీవరాయకవి కూడ నేకాదశ ద్వాదశ స్కంధములను రచించెనఁట.)

పోతనగారి భాగవతములో చివరి రెండు స్కంధములను హరిభట్టు పూరించుటవలన అతనికి అఖండఖ్యాతి కలిగియుండును. అదిగాక ప్రగాఢపాండితి, యవధాననైపుణి, కవితావిభూతి, నరాశ్రయ విముఖత, హరిభక్తి యనునవి యతనిలోని విశిష్టగుణములు. ఇవి యన్నియు నాతనియెడ ప్రజలకు పూజ్యభావమును గలిగించియుండును. క్రీ. శ. 1513 సం. న అతనికి నొక యగ్రహారము దానముగా ఒసఁగఁబడినది. హరిభట్టును భట్టోపాధ్యాయులుగా గౌరవించి, శ్రీ వీరరామ నాయకుఁడు శ్రీరామసన్నిధిలో చిన్నపల్లె యను గ్రామమునకు శ్రీ రామసముద్రమని ప్రతినామముచేసి, తన పితరుల (తల్లిదండ్రుల)కు పుణ్యలోకప్రాప్తికై ధారాపూర్వకముగా దానము చేసెను. ఈ యగ్రహారము లభించుటచేత కవికి జీవిక సుకరమై యుండును. "వినా దైన్యేన జీవన"మ్మను కోరిక ఫలించెను. ఇఁక కావలసినది భగవదారాధన మొక్కటే.

దానశాసనకాలమున హరిభట్టు అఱువదేండ్ల ప్రాయమువాఁడు కావచ్చును. ఈ శాసనకాలమును ప్రమాణముగా స్వీకరించియే యతని జననకాలము, గ్రంథ రచనాకాలము ఇదివఱలో పరామర్శింపఁబడినవి.

గృహస్థులకు సుఖశాంతులు సమకూరినపుడు తీర్థయాత్రాభిలాష కలుగును. హరిభట్టు అయిదాఱేండ్ల కాలము తీర్థయాత్రలోఁ గడపియుండును. అతఁడు జగన్నాథక్షేత్రమును సందర్శించెను. ఆ క్షేత్రము ''సర్వం జగన్నాథ''మ్మను వినుతికి పాత్రమైనది. భగవద్రామానుజులు సందర్శించిన పుణ్యక్షేత్రమది. వీరు తరువాత శ్రీరంగమున నెలకొనిరి. అది ''వైకుంఠం రంగమందిర''మ్మను ప్రశంసకు పాత్రమైనది. హరిభట్టుకూడ శ్రీరంగమును సందర్శించెను. శ్రీరామానుజుల తత్త్వమార్గ మాతనికి అనుసరణీయముగా తోఁచినది. జగన్నాథునకు ఒకకృతిని, శ్రీరంగనాథున కొకకృతిని ఈ సమయమున సమర్పించెను.

---

* మీఁగడ తఱకలు, పు. 94.

## (౬) భాగవతము - షష్ఠ స్కంధము :

ఇదివఱలో రచించియుండిన ఏకాదశ ద్వాదశ స్కంధములకంటె షష్ఠస్కంధము మెఱుఁగైనది. దీనిని—

[15]''సకలదేవతానాయకుండై యింద్రద్యుమ్నసరోవర తీరంబున నీలగిరి నిలయుండైన జగన్నాథదేవునకు ననంతంబులైన సాష్టాంగ వంద్రప్రణామంబులు సమర్పించి, తత్పాద పద్మంబులు మదీయమనః పద్మంబునం గీలుకొల్పి తదర్పితంబుగా షష్ఠస్కంధంబు మతి గోచరించుకొలఁదిని దెనిఁగించెద'' నని యవతారికలో నివేదించుకొనెను.

'మతి గోచరించుకొలఁదిని' రచించుట యనునది వినయము నిండిన పలుకు. పోతన చెప్పినట్లు ''తెలియ వచ్చినంత తేటపఱుమట'' యగును. ''బుద్ధిఁ దోఁచినంత బుధులచే విన్నంత'' అని ఏర్చూరి సింగనయును వక్కాణించెను (6 వ స్కం. ప. 23).

హరిభట్టు 'నరాధముల' సన్నుతించి యుండెను. ఆ పాపపంకము ప్రక్షాళితము కావలయును. దానికై విష్ణువును వినుతింపవలయును. ఈ భావము, ఏకాదశ ద్వాదశ స్కంధముల రచనమునకు ననంతరమే యాతనిలో నావిర్భవించి యుండవలయును. చూడుఁడు.

[16]ఎడపక విష్ణునిం బొగడ నెన్నఁడు నొల్లక, దుర్మదంబునన్
గడుపులకై నరాధములఁ గావ్యముఖంబుల సన్నుతింపఁగాఁ
బొడమిన పాపజాలముల బొట్టణఁగం బొలియించు ముక్తిఁ బొం
దెడుకొఱకై రచింతుఁ గృతి, నీలగిరీంద్రున కర్పితంబుగన్.

పై పద్యము, పోతన రచించిన "ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి" (భాగ. 1-13) యను పద్యమునకు ననుసరణమగును. పోతన నిర్వహించిన ప్రాసముతోనే, ఏర్చూరి సింగన తన షష్ఠ స్కంధమున, పోతన నిట్లు స్తుతించెను.

ఉ. ఎమ్మెలు సెప్పనేల, జగమెన్నఁగఁ బన్నగరాజశాయికిన్
సొమ్ముగ వాక్యసంపదలు సూఱలుసేసినవాని, భక్తిలో
నమ్మినవాని, భాగవతనైష్ఠికుఁడై తగువానిఁ, బేర్మితో
బమ్మెర పోతరాజుఁ, గవిపట్టపురాజుఁ దలంచి మ్రొక్కెదన్. (ప. 13)

హరిభట్టు [17]కృష్ణ (జగన్నాథ) ప్రీతిగా తెనుఁగుసేసిన స్కంధమిది. (''విష్ణుఁ దలంచి భాగవత పౌరాణీయ మైనట్టి షష్ఠ స్కంధంబుఁ దెనుంగుఁజేసెదను గృష్ణప్రీతిగా వేడ్కతోన్'') సింగనయును—'శ్రీ మహాభాగవత పురాణంబు నందు షష్ఠస్కంధం బాంధ్రభాష రచియింపంబూని....యీ కృతిఁ గృష్ణార్పణంబు'' చేసెను (భా గ. 6-15)

క. [18]కృతినాథుఁడు నీలాచల। పతి యఁట! శుకయోగివదన భాషితమగు త
త్కృతి భాగవతంబఁట ! యిది। మతిఁ దలఁపఁగ నింతకన్న మాన్యము గలదే ?

అని హరిభట్టు పోతనతీరున విన్నవించెను. సింగనయును—

15. శ్రీ. వేం. ప్రా. గ్రం. ఆర్. 1069.

16. 6 వ స్కం. ప. 4. 17. 6 వ స్కం. అవ. 5. ఆర్. నం. 1069 శ్రీ వేం. వి. ప్రా. గ్రం. తిరుపతి.

18 అందే. అవ. 6.

ఆ. వె. ''పలుకఁగలిగె మొదల భాగవతార్థంబు। భర్త కృష్ణుఁడయ్యె భాగ్యమొదవె'' అని పోతన ననుకరించినాఁడు.

షష్ఠస్కంధ రచనలలో సింగన హరిభట్టుల పోటి వ్యక్తము కాఁగలదు. హరిభట్టు 9 పద్యములలో అవతారికను రచించెను.

ఆ. వె. ''శ్వపచుఁడైన విప్రవరుఁడైన శ్రీ విష్ణు భక్తి కొక్కసమము పరిచరింప''

అనునది యతని విశ్వాసము (6 స్కం. అవ. 8). దీనికి నాధారములు—

శునిచైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః (గీత. 5–18)

విప్రాద్ద్విషడ్గుణయుతా దరవిందనాభ
పాదారవింద విముఖాత్ శ్వపచం వరిష్ఠం॥ (భాగ. 7–9–10)

శ్వపచోఽపి మహీపాల ! విష్ణుభక్తో ద్విజాధికః ।
విష్ణుభక్తి విహీనస్తు యతిశ్చ శ్వపచాధమః॥ (రహస్యత్రయసారము)

షష్ట్యబ్దములు గడచునరికి హరిభట్టోపాధ్యాయులలో నీ సమదృష్టి బలపడినది. ఇది శ్రీమద్రామానుజుల మతాభినివేశమువలన నేర్పడియుండును. విశిష్టాద్వైతమత ప్రచారమునకు ఈ సమదర్శిత విశిష్టముగా నుపకరించినది కదా !

ఏర్చూరి సింగన రచించిన షష్ఠస్కంధమునకే భాగవతము ప్రతులలో బహుళ ప్రచారము కలదు. పోతనవలె నితఁడద్వైత మార్గగామి. హరిభట్టునకు విశిష్టాద్వైతమున నాదరము. కావున సింగనకృతులకు కలిగిన వ్యాప్తి యితనికి కలుగలేదు. కవితా విషయమున పోతన శైలి ననుసరించుటలో సింగనకంటె హరిభట్టు చతురుఁడు. భాగవత ప్రతులు కొన్నింటిలో హరిభట్టారకుని షష్ఠస్కంధమును చేర్చినవారు తత్ప్రాంతీయులుకాని, విశిష్టాద్వైతాభిమానులుకాని కావచ్చును. హరిభట్టుయొక్క భాగవత స్కంధములనుగూర్చి వేటూరి ప్రభాకరశాస్త్రిలవారు ఇట్లభిప్రాయపడియున్నారు.

''పోతరాజుగారు భాగవతము నద్వైత సిద్ధాంతానుగుణముగా శ్రీధరవ్యాఖ్య ననుసరించి రచించిరి. హరిభట్టు విశిష్టాద్వైత సిద్ధాంతానుగుణముగా షష్ఠైకాదశ ద్వాదశ స్కంధములను బూరించెను.... తెలుఁగు భాగవతము ప్రాఁత ప్రతులు పెక్కులు ఏర్చూరి సింగన షష్ఠస్కంధముతోను, వెలిగందల నారయ యేకాదశ ద్వాదశ స్కంధములతోను నుండును. కాని యక్కడక్కడఁ గొన్ని ప్రతులలో హరిభట్టు రచనములు కూడఁ గలసియున్నవి. అమృత ప్రవాహము వంటి పోతరాజుగారి రచనము నశించుటచేతఁ, దత్తుల్యముగా లుప్తభాగములను బూరింపఁగోరి హరిభట్టువలెనే రచనముల నెటపిరి. (మీఁగడ తఱకలు, పు. 81–82.)

[19]''సర్వన యను కవికూడ షష్ఠస్కంధమును రచించెనఁట. ఈతని గ్రంథము దొరకలేదు. ఈతఁ డెప్పటివాఁడో యెఱుఁగరాదు. ప్రబంధ రత్నావళిలో నీతని గ్రంథమునుండి పద్యము లుద్ధరింపఁబడియున్నవి.''

కవుల షష్ఠము – దీనికి శృంగారషష్ఠము అను నామాంతరము కలదు. రాచమల్లు కవులు రచించినట్లు లాక్షణికు లుదాహరించిన పద్యములవలన తెలియుచున్నది. ఇదియును భాగవత – షష్ఠస్కంధమే యయినను గ్రంథము లభ్యము కాలేదు. కొన్ని పద్యములు మాత్రము లభించుచున్నవి. ఈ పేరుగల కవు లెవరో కవి చరిత్రకారులు స్పష్టముగా నిర్ణయింపలేకున్నారు. [20]''రాచమల్లువారనఁగా నందిమల్లయ ఘంటసింగయ కవులు'' అని నిడుదవోలు వెంకటరావుగారి సిద్ధాంత వాక్యము. కాని వారు దీనికి ఆధారమును చూపియుండలేదు. వేటూరివారు తమ అభిప్రాయమును ఇట్లు నుడివియున్నారు.

---

19. మీఁగడ తఱకలు, పు. 83, 20 పోతన, పు. 173.

"రాచమల్లువారు – ఇద్దఱో ముగ్గురో వీరిపేళ్లేమో యెఱుఁగరాదు. వీరు గూడ షష్ఠస్కంధమును దెనిఁగించిరి. లక్షణ గ్రంథములందు వీరిగ్రంథమునుండి యుద్ధరింపఁబడిన పద్యములు పెక్కులు గానవచ్చును. శృంగారషష్ఠమని వీరి గ్రంథమునకుఁ బేరు. షష్ఠస్కంధము నిండఁగ పూరించుటకుఁ గల విశేషమేమో"! (మీఁగడ తఱకలు, పు. 83)

## (6) మత్స్యపురాణము :

ఇదివఱకు తెలిపిన హరిభట్టు కృతులు లౌకవిధముగా అనుబంధ రచనములు. మత్స్యపురాణము అట్టిది కాదు. అతనికి పూర్వ మీపురాణము ననువదించినవారు మృగ్యులు.

ఇది పురాణఖండము. 'మత్స్యపురాణ ఖండంబగు విష్ణుధర్మోత్తరము' అని యాశ్వాసాంత గద్యములందు పేర్కొనఁబడి యున్నది. 'విష్ణుధర్మోత్తరంబు రంగనాథునకు నర్పింతు' ననియును, 'తలఁచి చూడ విష్ణుధర్మోత్తరమునకు నాయకుండు రంగనాథుఁడు' అనియు నవతారిక (ప. 7–8)లో కవి వ్రాసికొన్నాఁడు. నారాయణ మునీంద్రుఁడు శౌనకమునికి వైష్ణవధర్మము లుపదేశించుట యిందలి ఇతివృత్తము. కావున దీనికి విష్ణుధర్మోత్తరఖండము – అనియును ప్రసిద్ధి.

ఇది కవికృతులలో కడపటిది. శ్రీరంగనాథునకు నంకితమైనది. కవి యిందు గోత్రసూత్రములను పేర్కొని, తాను 'శ్రీరామానుజ పాదపద్మయుగళీ చింతా సమాసక్తుఁడన్' అని ప్రవచించియుండుట యీ పురాణావతారికలో కనుపట్టు నూతన విషయము. కొన్ని తాళపత్ర గ్రంథములలో దీనికి పాఠాంతరము 'శ్రీరామావర పాదపద్మయుగళీ' యని యున్నది. కాని యిది సందర్భోచితముగా కనుపట్టదు. కారణము, ద్వితీయాశ్వాసాది పద్యమున 'శ్రీరామానుజముని వచనారూఢమతప్రకాశ' యని కవి కృతి కర్తీశ్వరుండైన శ్రీరంగనాథుని సంబోధించియున్నాఁడు. శ్రీరామానుజులు సిద్ధిపొందిన స్థలము శ్రీరంగము. శ్రీరంగనాథునిపై భక్తియు, శ్రీరామానుజ సిద్ధాంతముపై రక్తియు వార్ధకమున హరిభట్టునకు కలిగినవి.

కవితా పత్రికాధిపతులు 1912 వ సం.న. మత్స్యపురాణమును ప్రకటించిరి. ముద్రితప్రతి "హరికి సమర్పిత మగు కృతి' అను పద్యముతో ప్రారంభమైనది. గ్రంథాదిలో భగవన్నుతి కానరాదు. వస్తు నిర్దేశముతో ప్రారంభమైనట్లు తోఁచును. ఈ కారణముచేతనే కాఁబోలును ''అపూర్వమగు గ్రంథోపక్రమమును బట్టి చూడ నీతఁడు మిక్కిలి ప్రాచీనుఁ డయినట్లు తోఁచుచున్నది'' అని పరిష్కర్త లుపోద్ఘాతమున వ్రాసియున్నారు. వారికి లభించిన మూలప్రతిలో అవతారిక సమగ్రముగ ఉండియుండదు. అందుచేత వారికా కృతి 'అపూర్వముగ' తోఁచియుండును. తాళపత్రప్రతులను కొన్నింటిని పరిశీలింపఁగా, సమగ్రమైన అవతారికాభాగము లభించినది. అది పరిశీలనార్థము రెండవ యనుబంధములో పొందుపఱుపఁబడి యున్నది. ఉపలబ్ధములయిన యందలి పద్యములు మిక్కిలి ఉపయోగకరములు. కవి యాత్మీయతకు దర్పణములు.

దైవస్తుతి సందర్భములో ''దేవతాంతర నమస్కారంబు పరిత్యజించి, లక్ష్మీకాంతున కనంతంబులయిన సాష్టాంగ దండప్రణామంబు లాచరింపు' (2 వ అను – 5) నంతగా నాతనిలో విష్ణుభక్తి కుదురుకొన్నది. దీనికి కవి సమర్థన మిట్లున్నది.

> చ. గురుతర నవ్యరత్నములకుం ధరణీశుఁడు దక్క, మౌళిపై
> నరుదుగఁ దాల్ప నన్యజను లర్హులుగాని విధంబునన్, నమ
> స్కరణ మహార్హ సన్మణులఁ గైకొన విష్ణుఁడె కాని, దేవతా
> వరు లసమర్థులంచు నభివందన మా విభు కే నొనర్చెదన్. (2 వ అను, ప. 4)

గొప్ప రత్నములను 'శిరోమణి'గా ధరించుటకు ధరణీశుఁడు (రాజు) మాత్రమర్హుఁడు. 'రత్నహారీ తు పార్థివః' అని కదా రాజనీతి! హరిభట్టు ఇక్కడ 'ధరణీశ' శబ్దమును విష్ణువు (ధరణికి భర్త) అను నర్థములో సమన్వయమగునట్లు

ప్రయోగించియున్నాడు. అంతేకాని, యతనికి నృపతియను సామాన్యార్థమున వివక్ష లేదు. నమస్కారము గొప్ప రత్నము. దాని కర్తృండు విష్ణుండే. అన్యదేవతలు కారు.

"వైష్ణవ ధర్మప్రశస్తమగు విష్ణు ధర్మోత్తరమును'' (అను. 2-7) రచించుటే కాదు. దానిని హరికి సమర్పింప వలయును. అపుడే యది శుక్తిమధ్య గత జలబిందువు వలె సరస 'ముక్త' మగును. హరికి సమర్పితము కాని కృతి, తప్త లోహమునం బడిన జలబిందువువలె 'విరస' మగును (అను 2-8). విరసమనంగా 'అనామకమై నశియించుట' కాంబోలును!

కవిలో కలిగిన యీ విష్ణుభక్తి పరిణామమును పరిశీలించి, ఆ భావనలకు దర్పణము పట్టు ఈ మత్స్య పురాణము కవికృతులలో చివరిదనియును, నారసింహపురాణము - ఉత్తరభాగము మొదటిదనియును నిర్ణయింపవలసి వచ్చినది.

మత్స్యపురాణములోని యవతారికయందలి పూర్వకవిస్తుతి కొంత చిత్రముగ కనుపట్టును. కవి ప్రాచీన గీర్వాణ కవులయిన వ్యాసాదులకు వందనము చేసెను. 'పద పద్యములు దేశభాషల రచియించి, వెలసిన కవుల కంజలులొనర్చి' యని సమష్టిగా తెలుంగుకవులను నుతించెనే కాని, నన్నయాదుల నామధేయములను వాకొనలేదు. ఆ ప్రస్తావమును వరాహ పురాణముతో నాపివేసెను. ఈదృశ కవిస్తుతి యితర కృతులలో కానరాదు.

తన వార్ధకమున కవి శ్రీరంగనాథు నాశ్రయించెను. ఆ దశలో ఆయురారోగ్య విభవము లవసరము. ధనమునకై నరాధములను సన్నుతి సేసిన పాపమునకు ప్రాయశ్చిత్తము కావలయును. జీవిత నాటకరంగమున భరతవాక్యము పలుకునపుడు తలంపులో హరిస్మరణ రావలయును. పరమ పదమును పడయవలయును.

[''అంతకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కళేబరం।
యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః॥ (గీత. 8-5)]

ఈ భావములు కవిపలుకులలో కనంబడు తీరు గమనింపుండు !

సీ. ఆయురారోగ్య నిత్యైశ్వర్యములు గల్గి, విభవంబుతో ధాత్రి వెలయుకొఱకు
ధనమునకై నరాధముల సన్నుతి సేయం, బొడమిన పాపముల్ చెడుట కొఱకు
హృదయంబు లక్ష్మీశ పదపంకజములందు, నిశ్చలవృత్తితో నిలుచుకొఱకు
రౌరవంబులం బాసి రయమున వైకుంఠ, సదనంబునకు వేడ్కం జనెడుకొఱకుం

తే. బరమ వైష్ణవజను లెల్లం బ్రస్తుతింప, మత్కృతం బయ్యె హరికథా మాన్యమగుచు
నుత్తమంబగు విష్ణుధర్మోత్తరంబు, రంగనాథున కర్పింతు రాణ మెఱసి. (మత్స్య. 1-7)

ఎ. గీ. "వృత్త్యనుప్రాస గణ వర్ణ వృత్త నియమ, లలిత శబ్దార్థ రస బంధములు చెలంగ
నఖిల సన్నుత మగునట్లు యంధ్ర భాషం బొలుపుతో" (అను 2-6)

చెప్పిన కృతి మత్స్య పురాణము. కవిత కుసుమగుచ్ఛసదృశము. శ్రీరంగనాథ పూజార్హమైన యా పద్యపుష్పము లేవిధ ముగా నుండవలయును? చక్కని శ్లేష, చిక్కని భావము గల పద్యము సమాధానము.

చ. లలిత మనోజ్ఞ వర్ణ సదలంకృతమై, సరసాంత హృద్యమై,
దళగణ తుల్యమై, శ్రవణధారణ వాంఛితమై, నవీనమై,
నలంకువ నొంద కచ్యుత గుణ ప్రకరంబులతోడ యుక్తమై,
పొలుపగు కావ్యపుష్పతతిం, బూజ యొనర్చెద రంగభర్తకున్. (మ పు. 1-4)

ఈ పురాణము 5 ఆశ్వాసములలో, 800 పద్య గద్యములతో సంతరింపఁబడినది. నారాయణముని శౌనక మునికి తెలియఁజేసిన విష్ణుధర్మము ఈ పురాణఖండములోని యితివృత్తము. ఆశ్వాసానుక్రమమున కథాంశము లివి.

ప్రథమాశ్వాసము – నారాయణమున్యాశ్రమమునకు శౌనకముని వచ్చుట. బ్రహ్మనారద సంవాదము, మధుకైటభ సంహారము, మేదిన్యుత్పత్తి, రుద్రజననము, సృష్టిచింతనము, సాలోక్యాది చతుర్విధముక్తి స్వరూపము, సుజ్ఞానప్రసక్తి.

ద్వితీయాశ్వాసము – సృష్టిక్రమము, ముక్తిహేతువు, హరినామజపాదికము, అన్నదాన మహత్త్వము, వాసవుఁడను విప్రుని కథ (ఇది 'ఆముక్తము'లోని మాలదాసరి కథను పోలినది), ఆచారధర్మములు.

తృతీయాశ్వాసము – సాలగ్రామ మహత్త్వము, తులసీ వృత్తాంతము, దేవలోపాఖ్యానము, రోగ కారణములు.

చతుర్థాశ్వాసము – పుండరీకరాజు కథ, వైష్ణవధర్మములు, ఏకాదశీ మహిమ.

పంచమాశ్వాసము – ఏకాదశీమహిమను దెల్పు విష్ణుదత్తోపాఖ్యానము, నారదవృత్తాంతము, పులహోపాఖ్యానము, సప్తసంతాన ప్రశస్తి, ఫలశ్రుతి.

ఇంతవఱకు హరిభట్టు రచించిన కృతుల పౌర్వాపర్యము, వాని కాలసూచనము, రచనా వైశిష్ట్యము ప్రస్తావింపఁబడినవి.

1. లౌకికదృష్టితోను, పురుషార్థక్రమమునను పరిశీలించినచో – రతిరహస్య వరాహపురాణము లౌకిక దృష్టితో రచితములు. భాగవత స్కంధములు, మత్స్యపురాణము పారమార్థిక భావనతో సంతరింపఁబడినవి. సంప్రదాయమునకు బద్ధుఁడైన కవి యీ విధముగా క్రమముగా – త్రివర్గ సోపానముల నధిరోహించినట్లు వ్యక్తమగుచున్నది.

2. తొలుత పాండితీప్రకర్షద్యోతకముగ ప్రభవించిన శైలి, కాలక్రమమున ప్రసన్న గంభీరముగా పరివర్తన మందినది.

3. మొదట భాసించిన హరిహరాభేదభావము, క్రమముగా విశిష్టాద్వైత తత్త్వానుసరణమున పర్యవసించినది.

4. కవికి పురాణానువాదమున మిక్కిలి మక్కువ. అవి భాగములో, స్కంధములో, ఖండములో యగుట యొక విశేషము. కావ్యావతారికలు – నరాంకితమైన వరాహపురాణమున విస్తరముగ, నితరకృతులయందు సంగ్రహముగ నుండుట గమనార్హము.

# 2. అనుశీలనము

## (వరాహపురాణ పరిశీలనము)

### 1 అవతారిక :

కృతిపతి – కొలిపాక ఎఱ్ఱయ. అతఁడు కంబముమెట్ట కరణము. ఉపనామమైన కొలిపాక (కొలనుపాక) నేఁడు నల్గొండజిల్లాలో ఒక కుగ్రామము. ఒకనాఁడిది చరిత్రప్రసిద్ధి గాంచిన నగరమని [1]ఆదిరాజు వీరభద్రరావుగారు తమ ప్రాచీన – ఆంధ్రనగరములు – ప్రథమ భాగములో, కొలనుపాక కథనమున పేర్కొన్నారు. ఎఱ్ఱయ కంబముమెట్ట పురమునకు స్థలకరణికాగ్రగణ్యుఁడు—(అవ.11, 46). ఈ పురము నేఁడు వరంగలుజిల్లాలో చేరియున్నది. ఆనాఁడు పురముయొక్క శోభ యిట్లుండినది. పురప్రాంతమున నెడతెగకపాఱు మున్నేరు; పురములో మదనగోపాలస్వామికి, నరసింహమూర్తికి, బాలేందుమౌళికి భవ్యమందిరములు. పురమహోన్నత సౌధములు సకలవర్ణములవారికి నునికిపట్టులు. ఆ మెట్ట ఆంధ్రమండలమున నెన్నికకెక్కిన గిరిదుర్గము (అవ. 9–10). అట్టి శ్రీ మహిత స్తంభాచలమునకు (కంబము మెట్ట) మన ఎఱ్ఱయ 'స్థల గణకగ్రామణి' (అవ, 46).

[2]''....కవి కృతినాయకుని (ఎఱ్ఱయను) నెంతగా నభివర్ణించినను....అతఁడాయూరికి కరణము'' అని కందుకూరివారి చిన్నచూపు. యథార్థమేమనఁగా, నాఁటి కరణికుఁడు ఒక్క పాళెగానితో సమానుఁడు. నేఁటి జిల్లాకలెక్టరు పదవివంటిది. వారిపదవి, ప్రతిష్ఠ 'పురము' ననుసరించి యుండును. ఈ ఎఱ్ఱన "సుతులు హితుల్ పురోహితులు శూరులు.... మంత్రి శేఖరులు....చేరికొల్వఁగ సభాభవనాంతర రత్నపీఠికా స్థితుఁడయి, విష్ణుకీర్తన విశిష్టపురాణము'' లాలకించువాఁడు (అవ. 14). అనఁగా – విభవము, విష్ణుభక్తి, విద్యారక్తి నిండుగాఁ గలవాఁడు.

కవి హరిభట్టు – 'కవితానిష్ఠా ద్వితీయ దివిజ జ్యేష్ఠుఁడు" (అవ. 15). అమృతప్రాయ వాగ్విలాసముగల పుంభావవాణి. సత్కవి. వేదశాస్త్ర వివిధ గ్రంథార్థ నిర్ణేత. ఏకముఖ బ్రహ్మ. 'అష్టఘంటావధాన' విశిష్ట బిరుదాంచితుఁడు (అవ. 16–17).

ఎఱ్ఱయ హరిభట్టు నాహ్వానించి సత్కరించెను. అతఁడు రచింపఁ దలంచిన 'నిరుపమార్థ రమ్యమగు' వరాహ పురాణమును (ప. 17) తన పేర నంకితము సేయుఁడని సవినయముగా అర్థించెను. కవి అంగీకరించెను.

కవి సంప్రదాయానుగుణముగా వరాహపురాణకృతిని ఎఱ్ఱయకు అంకితము చేసెను. ''అయ్యమాత్య శిరోమణి'' వంశావతారము నభివర్ణించెను (అవ. 18–50).

మరీచి సంయమికి పుత్రుఁడు కశ్యపముని. అతఁడు కృతిపతికి గోత్రకర్త.

---

1 పు. 40–48.   2. ఆం. క. చ. 3 వ భా. పు. 1–2.

## వంశవృక్షము

- కాశ్యప గోత్రము
  - ఎఱ్ఱ మంత్రి (భార్య - మల్లమాంబ)
    - చిన్న మంత్రి (అక్కమాంబ)
      - బసవవిభుఁడు
      - అనంతామాత్యుఁడు
    - అనంత మంత్రి (గంగమాంబిక)
    - (కొలిపాక) సర్వ మంత్రి (గంగాంబ)
      - చెన్నశౌరి
      - ఎఱ్ఱయ (కృతిపతి) (మాదమాంబ)
        - వేద మంత్రి
        - అనంతామాత్యుఁడు
    - రామ మంత్రి (వీరమాంబ)

ఎఱ్ఱయ నియోగి. (నియోగులు - అమాత్య విభు మంత్రి పద వాచ్యులు) అతనికి తిరుమల నారాయణుఁడు గురువు. కావున ఎఱ్ఱయ వైష్ణవమతానుయాయి. 15వ శతాబ్దమునుండి అనేక నియోగులకు నీ తిరుమల వంశ్యులు గురువులు. 'కర్మవిపాకము' అను కృతిలో తిరుమల వంశజుల ప్రాభవము వర్ణింపఁబడి యున్నట్లు [3] మానవల్లి రామకృష్ణకవిగారు తమ 'తెనాలి కవులు' అనువ్యాసమున తెలియఁ జేసిరి. అందులో ఎఱ్ఱయకు గురువైన నారాయణగురు ప్రశంస యున్నదేమో! ఆ గ్రంథము మృగ్యము.

### ప్రస్తుతి :

సరోజాక్ష శంభు విరించి వాగ్దేవీ గణపతులను స్తుతించి, తద్దేవతాపరముగ కృతిపతికి నాయురారోగ్యైశ్వర్యములు కలుగవలయునని హరిభట్టు మంగళాశాసనము పలికి, తరువాత కవిస్తుతి కావించెను. పూర్వకవి వందనములలో మొదటి మర్యాదను వ్యాసులవారికి చెల్లించెను. పురాణములన్నియు వ్యాసప్రోక్తములు. ''అష్టాదశ పురాణానాం కర్తా సత్యవతీసుతః'' అని ప్రమాణము. తాననువదించునది పురాణము కదా! అందులకే వ్యాసులవారికి మొదటి పీట. (*'వ్యాసో నారాయణః స్మృతః' వ్యాసుఁడు సాక్షాన్నారాయణావతారముకదా!) ఆ తరువాతనే వాల్మీకి కాళిదాస బాణ మయూర చోర శ్రీహీర మాఘులకు వినతులు. ఇంతవఱకు సీసపద్యభాగము ముగిసినది. ఎత్తుగీతిలో - ఆంధ్ర వచోధుర్యుఁడగు నన్నపార్యుని, సూక్తిమణిరాజియగు సోమయాజిని, సురాచార్యమతియగు ఎఱ్ఱనను (కవిత్రయమును) మాత్రము సాహితీరూఢమతియై సంస్తుతించెను. (అ వ. 6). సీసమున సంస్కృత కవీంద్రులను, ఎత్తుగీతిలో తెలుఁగు కవులను కొనియాడుట గణ్య ప్రక్రియ.

---

3. మానవల్లి కవి రచనలు, పు. 314.

* ఆదిమపండితుం గొలుతు నచ్యుతమూర్తిఁ బరాశరాత్మజున్ (నృసింహ. 1-8).

కవిరాజుల కావ్యకోశములనుండి వాక్యమాణిక్యముల నపహరించి, సందుగొందులలో సంచరించి, పోఁకవక్కకయినంతకు నమ్ముకొను దుష్కవి చోరులను నిరసింపకపోలేదు (అవ. 7).

తరువాత, 'శబ్దార్థ భావ రసాలంకార బంధంబుగా నొక్క ప్రబంధం బంధ్రభాషా భవ్యంబగు వచన కావ్యంబుగా రచియింప' పూనెను (అ వ. 8). ఒక విధముగా నిది కవియొక్క ప్రతిజ్ఞావాక్యము. తన కావ్య మేతద్విశిష్ట లక్షణ సంభరితమై యుండునని కవిహృదయము.

పై ప్రతిజ్ఞా వాక్యములో కవి తన గ్రంథమును 'వచన కావ్యము'గా పేర్కొనెను. ఇందలి 'వచన' శబ్దము విమర్శనీయమై కనుపట్టుచున్నది.

[4]"వచన కావ్యమునకు గద్య పద్య కావ్యమని యర్థము గ్రహింపవలెను. లేదా వచన శబ్దమును పద్య అని మార్చుకొనవలయును" అని చాగంటి శేషయ్యగారు వ్రాసియున్నారు. ఇట్టి యభిప్రాయముతోనే కవి ప్రయోగమును మార్చివేసిన ప్రాచీన పరిష్కర్తలుకూడ నున్నారు.

క. నీవిప్పు డాంధ్రభాషం, గావించుచున్న 'వచన' కావ్యంబగు నీ
శ్రీ విష్ణుపురాణము నా, కీవలయు మదీయకీర్తి యిలలో నెగడన్.

అని తాళపత్రప్రతిలోని పాఠము (డి. నం. 311, జి. ఓ. ఎం. ఎల్.)

ఈ విష్ణుపురాణము మొదట 1831 సం.లో, చెన్నపురి, సరస్వతీ నిలయ ముద్రాక్షరశాలయందు ప్రకటింపఁబడినది. అందు, పై పద్యములోని రెండవ పాదము "గావించుచున్న చంపుకావ్యమ్మగు నీ" యని మార్పు చెందినది. ఈ ముద్రితప్రతి పాఠమునే తర్వాత 'వావిళ్ళ' ప్రతియు స్వీకరించినది. కారణము పై విమర్శకులును, పరిష్కర్తలునీ వరాహ విష్ణుపురాణములను చంపూకావ్యములుగా తలఁచిరి. వచనకావ్యమన్నచో కేవల 'వచన కావ్యములు' కావలసి వచ్చునని శంకించిరి.

పురాణములు, కావ్యములు సంస్కృతభాషలో నుండఁగా వానిని తెలుఁగుకవు లనువదించెడివారు. అనువదించుట యనఁగా అనుసరించి వచించుట. సంస్కృత కావ్యము ననుసరించి ఆంధ్రభాషలో వచించిన కావ్యము- అని సామాన్యార్థము. సంస్కృత సాహిత్యములో రఘువంశాదులు పద్యకావ్యములు. కాదంబర్యాదులు గద్య కావ్యములు. భోజుని రామాయణము, వేంకటాధ్వరి విశ్వగుణాదర్శము చంపూ కావ్యములు. "గద్య పద్యోభయం కావ్యం చంపూరిత్యభిధీయతే" యని లాక్షణికోక్తి. ఆంధ్రవాఙ్మయమునఁగల ఇతిహాస పురాణ ప్రబంధము లన్నియును సామాన్యముగా చంపూ కావ్యములే. స్తుతి వచనములు, బిరుదు గద్యములు అనునవి విశిష్ట రచనములు. ఈ సమయమున వచన శబ్దార్థము నించుక పరామర్శ కావించుట అవసరము.

వచనము అనఁగా పలుకు. 'వ్యాహార ఉక్తి ర్లపితం భాషితం వచనం వచః' అని అమరము (వాగ్వర్గము. 1).
'భాసుర నవార్థ వచన రచనా విశారదులయిన మహాకవులును' అని నన్నయ (భార. అవ. ప. 8).
'అరయ నతని వచనరచన నంతయుఁ దెలిసెన్' అని తిక్కన (భార. ఉద్యో. 3-389).
'అపూర్వ వచనరచనా బంధుర కావ్యరసాభిజ్ఞుడు' అని మడికి సింగన (వాసిష్ఠ. 1-10)

4. ఆం. క. త. సంపు. 8, పు. 174.

క. తెనుఁగైన నేమి కవితా, జనతాలంకార చిత్ర సంగత పద వ
ర్ణన వచనరచన చతురత. విన యోగ్యం బగుచు కృతియ విం(ద్రు మహాత్మల్.

అని వర్ణనరత్నాకరము (భాగ. 4, ప. 3851).

పై లక్ష్యములవలన 'వచనరచన' యనఁగా పలుకులకూర్పు అని తెలియుచున్నది. ఆ పద నిర్మాణము పద్యములోఁగాని, గద్యములోఁగాని, ఉభయములోఁగాని ఉండవచ్చును గదా !

నేఁడు వచనశబ్దము (Prose) అను ఆంగ్లపదమునకు సమానార్థమున రూఢిమై యున్నది. గద్యము అన్వాసాంతములయందు గోచరించు విశిష్ట రచనముగా కలదు. ఇఁక వచన గద్య శబ్దముల నొకే యర్థమున వ్యవహరించిన ప్రాచీన కవులును కలరు. తిక్కనగారి ఉత్తర రామాయణము నిర్వచనమైనది; అందు వచన గద్య పదము లేకార్థములో నుపయోగించినట్లు తెలియుచున్నది.

"వాక్య సాంగత్యము సేయుచో నలయిన గద్యము తోడుగఁ జెప్పి పెట్టను".
"వచనము లేకయు వర్ణన రచింపఁగఁ గొంత వచ్చుఁ బ్రౌఢులకున్". (నిర్వ ఉ.రా. 11-4. 15)

ఈ విధముగా వచన శబ్దమునకు ప్రకరణోచితమైన యర్థము లేర్పడినవి.

నారసింహ పురాణము - ఉత్తరభాగములో హరిభట్టు కుమారుఁడు రాఘవమనీషి కృతిపతిచేత నీ విధముగ పలికించినాఁడు. "హరిభట్టు....ఆంధ్రభాషను వచన కావ్యం బొనర్చె. ఆ ప్రబంధంబు...." (అవ. 16).

నారసింహ వరాహ పురాణములు వచన (Prose) కావ్యములగుట అసంభవము. అందలి రచనా ప్రక్రియయే ఆ విషయమును చాటుచున్నది. వచన కావ్యమనఁగా ప్రబంధమనియే యర్థము. ఆ యర్థమే కవికి అభిమతము కూడ.

## వరాహపురాణ ప్రస్తావము

హరిభట్టు వరాహపురాణము నేల రచించెను? ఈ ప్రశ్నకు సమాధానము కొంత గ్రంథానుక్రమమున పరామర్శింపఁబడినది. నేఁడు లభించు ముద్రిత సంస్కృత వరాహపురాణమును, దానికి అనువాదమైన నందిమల్లయ ఘంట సింగనల వరాహపురాణమును చేకుమళ్ల అచ్యుతరావుగారు విమర్శించి యున్నారు. వారి యభిప్రాయమిది.

*"వ్యాసభట్టారక విరచితములగు నష్టాదశ పురాణములలో నొకటియైన యీ వరాహపురాణము (మల్లయ సింగనలకృతి) నేతిబీరకాయ వంటిది. నేతిబీరకాయయందు నేయి లేదు. వరాహపురాణమునందు వరాహావతార విషయము లేదు. అది వరాహమూర్తి ధరణీవరారోహకు సృష్ట్యాది విషయములనుగూర్చి చెప్పిన పుణ్యకథలు మున్నగునవి యెన్ని యేని దీనియందున్నవి. కాని,

"చాపచుట్టఁగఁ జుట్టి చంకఁ బెట్టుకపోఁడె, ధరణి హిరణ్యాక్ష దానవుండు"

అని యీ కవులు తమ ప్రబోధచంద్రోదయమునఁ జెప్పినట్లు ధరణీరమణిని హిరణ్యాక్షుఁడెట్లు గొనిపెట్టెనో, యేలాగున శ్రీ మహావిష్ణువు వరాహరూపమున భూదేవి నుద్ధరించెనో యా కథ యేమాత్రము నేతద్వరాహపురాణమునఁ గాన్పింపదు. ఇది బహు విచిత్రము గదా !"

---

* విజయనగర సామ్రాజ్యమందలి ఆంధ్రవాఙ్మయచరిత్రము, ప్ర. భా. పు. 254-255.

నంది - ఘంట కవిద్వయము రచించిన వరాహపురాణమున కంటె విభిన్నమైన కథాభాగములగల వరాహపురాణ మూల మొకటి హరిభట్టునకు లభించి యుండవలయును. అందు రెండు ఖండము లుండునట్లు తెలియు చున్నది (5-262) 1. కైవల్యఖండము. 2. విజ్ఞానఖండము. హరిభట్టు కైవల్యఖండమును మాత్ర మాంధ్రీకరించెను. ఇందు వరాహావతారప్రశస్తి విపులముగ వర్ణింపబడియున్నది.

కృతిపతియగు కొలిపాక యెఱ్ఱయమంత్రి హరిభక్తుఁడను విషయ మవతారికాభాగమువలనను, ఆశ్వాసాద్యంత పద్యములవలనను సుబోధము కాఁగలదు. పైఁగా నతఁడు తిరుమల నారాయణుల శిష్యుఁడు. అందువలన విశిష్టాద్వైత మతావలంబకుఁడు. అతఁడు కైవల్యఖండ భాగములగల వరాహపురాణమును సంపాదించి హరిభట్టునకు నిచ్చియుండును. "శ్రీరమణ ప్రతిపాదక। వారాహపురాణ తత్త్వవార్తాశ్రవణో। దార పరితోషచిత్తన। మారోపిత పులక!" [5-1] అను సంబోధనమువలన నదివఱకే కృతిపతికిఁగల వరాహపురాణ శ్రవణ కుతూహలము అభివ్యక్తమగుచున్నది,

హరిభట్టు కృతులన్నియును పురాణఖండానువాదములే. శ్రీహరి విభవాభివర్ణన మాతని కభిమతము కాఁబోలును. కవి యా తలంపుతో తన రచనములను సంతరించెను.

వరాహావతార ప్రశంస వేదోపనిషత్తులయందును, పురాణాదులయందును కానవచ్చుచున్నది.

* ఉద్ధృతాసి వరాహేణ కృష్ణేన శతబాహునా। భూమిర్ధేను ర్ధరణీ లోకధారిణీ ॥

హే మృత్తికే! త్వం భూమిరూపాసతీ కృష్ణవర్ణేన శతసంఖ్యాక బాహుయుక్తేన వరాహావతారేణ పూర్వ ముద్ధృతాఽసి। కీదృశీ భూమిః। ధేనుః కామధేను వత్ప్రీణయిత్రీ (సాయణభాష్యం, 1-1).

ఓ భూమీ! నీవు వరాహరూపుఁడయిన భగవంతునిచేత పాతాళమునుండి యుద్ధరింపఁబడితివి. సమస్త కామము లను పిదుకునది కావున ధేనువనియును, నిశ్చలముగా నుండుటచే ధరణి యనియును నిన్ను పిలుచుచున్నారు - అని భావము.

మంత్రశాస్త్రములో వరాహమంత్రము ప్రసిద్ధము. దీనిని భూపతిత్వ సిద్ధికై జపింతురు.

"ఓం నమో భగవతే మహా వరాహాయ స్వాహా".

శ్లో. శ్రియా పురా ప్రార్థిత దివ్యరూపం। యజ్ఞోద్భవం యజ్ఞవరాహరూపం।
రాకేందుతుల్యాం తిలకం దధానం। శ్రీ భూ సమేతం సతతం నమామి ॥

ఓం నమో మహావరాహాయ, దంష్ట్రాకరాళవదనాయ, వరాహాయ నమః। భూపతిత్వం మే దేహి స్వాహా ॥ అని మంత్రము. (గురూపదేశము లేక మంత్రమును జపించుట యనర్థహేతువని సంప్రదాయజ్ఞుల యభిప్రాయము.)

పింగళఫణి, గరుడ భయమువలన ఉచ్చరించిన పలుకులు ఛందస్సూత్రములుగా లభించినవి. అవి-

1. ధీశ్రీస్త్రీమ్. 2. వరాహాయ్, 3. కాగుహార్, 4. వసుధాస్, 5. సాతేక్వత్, 6. కదాసజ్, 7. కింవదభ్, 8. సహసన్. కావ్యాలం. చూ. 7-10.

ప్రతిసూత్రమునకును ప్రత్యేకముగా నిర్దిష్టార్థము లేకున్నను 2, 4 సూత్రములు వరాహమూర్తిని, వసుధను నిర్దేశించుట గమనార్హమగును.

---

* తైత్తిరీయోపనిషత్తు - నారాయణవల్లి, ఉ. 28-29.

శ్రీనాథకవిసార్వభౌముఁడు స్కాందపురాణ — ఈశానసంహిత నాధారముగాఁ గైకొని, శివరాత్రి మాహాత్మ్యము అను శైవప్రబంధమును సంతరించెను. అందు వరాహప్రస్తావము రెండుసారులు వచ్చును. ప్రళయాంతమున సంభవించిన సలిలోపద్రవమున భూమి సప్తపాతాళము నట్టడుగున అణఁగి పోయెను. నారాయణుఁడు వరాహావతారమును ధరించి, జల సంక్షోభమును దీర్చి, వసుంధరను పూర్వ స్థానమున సంస్థాపించెను. తరువాత మూల రూపముతో వైకుంఠమును చేరెను. అపుడు ధరణి నుద్ధరించినందులకు నారాయణునిలో శివమాయవలన నహంకార మంకురించెను. ఆ సమయమున సర్వలోకములను సృజించిన బ్రహ్మకుఁగూడ తనతో సాటి రాఁగలవాఁడు లేఁడని గర్వము తలసూపెను. ఈ యాధిక్యాతిశయమున హరి విరించులకు వైరము కలిగెను. వారు ఘోరముగా పోరాడసాగిరి. లోకములు తల్లడిల్లెను. ఆ సమయమున వారికలహము నపనయింప శంకరుఁడు వారి మధ్యలో స్తంభరూపమున జ్యోతిర్లింగమై యుద్భవించెను. వారు కలహము మాని శివుని సంస్తుతించిరి. ఆ స్తంభముయొక్క యాద్యంతముల నరయుటకు పద్మాక్ష పద్మాసనులు మాఱు రూపములను గైకొనిరి. అపుడు హరి రెండవ సారి వరాహరూపమును ధరించెనఁట!

తే. హంస రూపంబుఁ దాల్చెఁ బద్మాసనుండు, దంష్ట్రిరూపంబుఁ గైకొనె దనుజరిపుఁడు
పోయి రంబరమున కధోభువనమునకు, నూర్ధ్వమును గ్రిందు గానంగ నుత్సహించి. (శివరా, 1-10)

ఇఁక శాసనములలోని వరాహప్రశంస.

[5] హనుమకొండ శాసనము. (కాకతిరుద్రభూపతి. శా.శ. 1084)

యస్యోత్తుంగ తరంగ తాడిత వియత్పర్యాప్తపీయం జలం
పాదాంగుష్ఠనఖాగ్రదఘ్నమభవద్భూమండలోద్ధారణే।
దంష్ట్రా కోటికుటీరకోటరగతం త్రైలోక్య మబ్బిందువత్
బ్రహ్మాండా ఇవ రోమకందనికరో వందే వరాహం హరిం॥

[6] పెక్కల్లు శాసనము (ఆరాజులనాఁటిదే)

పాతు ప్రీతమనాః సదా త్రిభువనం వారాంనిధే రుద్ధర
న్నుర్వీం సూకరదేహభృత్ స భగవా నుద్భూతనాళాంకురే।
భూమిః పద్మతి, కేసరంతి గిరయః, పత్రంతి దిగ్భిత్తయః
పాథోధి ర్మకరందతి, ప్రవితతో మేరుశ్చ కింజల్కతి॥

[7] ఉప్పరపల్లి శాసనము (రేచర్లకాటయ క్రీ.శ. 1236)

క. ఉరగేంద్రదిగ్గజములకుఁ, బరమోత్సాహముగ నాతపత్రము వోలెన్
ధరనెత్తిన కిరివరుఁడగు, హరి కాటయ కీవుతము దయామతి శుభముల్

[8] తాళ్ళపాక అన్నమాచార్యులయింట వరాహముద్ర గల శాసనము

హరేర్లీలావరాహస్య దంష్ట్రాదండః స పాతు వః।
హేమాద్రికలశా యత్ర ధాత్రీ ఛత్రశ్రియం దధౌ॥

5. కాకతీయసంచిక. పు. 32, 6. అందే. పు. 42,

7. Telugu Inscriptions, Page 80, 8. Cuddapah Inscriptions, Page 523, G.O.M.L. (1972)

కాకతిప్రభువులకువలె విజయనగరరాజులకును వరాహలాంఛనము కలదు. ఎజ్జయ, తన కాలమునాఁటి [1495 ప్రాంతము] విజయనగరాధీశుల కటాక్షవీక్షణాకర్షమునకు నీ వరాహపురాణ కృతిపతిత్వము నభిలషించియుండును. దీనివలన తీర్థము స్వార్థము రెండును సమకూరియుండును.

నియోగులకు కరణీకవృత్తి రాజదత్తమగుట యొక చిత్రమైన సంఘటనము. ఈ విషయము 'కరణీకోద్భవ మంజరి' యను పద్యకావ్యమున ఉల్లేఖింపఁబడియున్నది.

9 "వ. అవ్విప్రపుంగవుల నందఱ రావించి, నిజ సింహాసన సమీపోపవిష్టుండగు రామయామాత్యుఁ డందియీయ వేరువేరుగాఁ గర్పూర తాంబూల సమేతంబుగా దానపత్రంబులొసంగి మీరలు మీ మీ నిర్ణయ గ్రామములకుం జని స్వామికార్య నిర్వహణప్రవీణులై గ్రామణిత్వాధికార ధర్మంబు లనుష్ఠింపుచుఁ దత్ప్రయోజనదత్తంబులగు వృత్తి స్వాస్థ్యప్రముఖ నిరూపణద్రవ్యంబు లనుభవింపుచు సుఖంబున నుండుఁడని యానతిచ్చిన, వారును తత్క్షణ తమ తమ గ్రామములకుం జనిరి.

[వి. వి.] గజపతి వంశ్యుఁడగు గణపతి భూపాలునివలన గోపరాజు రామప్రధానుఁడు....కరణికములను నియోగి బ్రాహ్మణుల కిప్పించిన కథ పద్యకావ్యముగా రచింపఁబడినది. రచయిత – ఊరె వీరభద్ర కవి.''

ఇట్టి పరిస్థితిలో కరణికులగు నియోగులకు రాజులను మెప్పించుట అవశ్యకర్తవ్యము కదా! కావున, ఎజ్జయ వరాహపురాణమును వ్రాయ హరిభట్టు నభ్యర్థించుట జరిగియుండును.

కవులు కథాప్రారంభమును "నా యొనర్పం బూనిన" యిత్యాది వచనముతో నుపక్రమించుట కవి సంప్రదాయము. కాని హరిభట్టు—

అచలితాభ్యుదయ పరంపరాభివృద్ధిగా, సుధాకర మధురోక్తి గారవమునఁ
గణఁగి, యేఁ జేయు నిమ్మహా గ్రంథమునకు, నేధమాన కథాసూత్ర మెట్టిదనిన. [అవ. 51]

అని తేటగీతిలో మధురముగా నాలాపించుట యొక క్రొత్త రీతి.

## 2. కథాసంగ్రహము :

ప్రథమాశ్వాసము : రోమశముని వేద పురాణ తత్త్వజ్ఞుఁడు. చర్మణ్వతీ నదీతీరమున నాతని యాశ్రమము. అది ప్రశాంతము, పావనము, సుందరము. శివపూజాతత్పరుఁడై సన్మునిగణముతో బయలుదేరిన మార్కండేయముని మధ్యే మార్గమున రోమశాశ్రమమున విడిసెను. మునీంద్రులు పరస్పరము కుశలప్రశ్నము గావించుకొనిరి. వచ్చిన అతిథికి సపర్యలు జరిగినవి. మార్కండేయ మహర్షికి హరిలీలాకర్ణనమున ఆసక్తి యధికము. అతనిది తార్కిక ప్రశ్నము. రోమశునిది తాత్త్విక సమాధానములు. అతఁడు శ్రోత. ఇతఁడు వక్త. హరిమాహాత్మ్య కథనము ప్రారంభమైనది.

విష్ణువు పురాణపురుషుఁడు. సృష్టి స్థితి లయ కర్త. సర్వాంతర్యామి. జగమంతయు విష్ణుమయము. అతని నిజ రూపమును బ్రహ్మరుద్రాదులును తెలియఁజాలరు. అతఁడు దుష్టశిక్షణమునకు శిష్టరక్షణమునకు ప్రతియుగమునందు నవతరించును. అతని ఆదివరాహావతారమునకు నట్టి కారణమున్నది. అది హృదయాహ్లాదిని యగు కథ.

పద్మకల్పమున దైత్యు లుదయించిరి. వారి యౌద్ధత్యమునకు శివుఁడు కోపించి, వారిని భస్మము చేసెను. ఆ భస్మమునుండి యఱువదివేల దైత్యులు మరల జన్మించిరి. తీవ్రతపము గావించి శంకరుని మెప్పించి, వరములు పడసిరి.

9. D.c. Vol. 13, Page 2854, G.O.M.L.

మఱల విజృంభించిరి. సురపతి స్రుక్కిపోయెను. హరియే శరణ్యుఁడని బృహస్పతి బోధించెను. విష్ణుపూజా విధానమును వివరించెను. ప్రాస్తావికముగా సాలగ్రామ మహత్త్వమును, ఏకాదశీ వ్రత మాహాత్మ్యమును వర్ణించెను.

ఆ సమయముననే భూదేవియు నింద్రసభకు వచ్చెను. ఆమె రాకకు హేతువుకూడ అసురపీడయే. భూకాంతను పురస్కరించుకొని, ఇంద్రుఁడు సురగణముతో, నారదాదిమునులతో, సనకాదియోగులతో హరిపురమునకు పయనమయ్యెను. పాలకడలిని చేరెను. వైకుంఠమును దర్శించి పురవందన మాచరించెను. ముందుగా భూదేవి ప్రాగ్ద్వారముఖంబున నగరు ప్రవేశించి, హరిమందిరము చొచ్చి, హరిని స్తుతించెను. నారాయణుఁడు వసుంధరయొక్క విన్నఁబాటును గ్రహించి, ఆమె నంకపీఠమున నాసీనఁగా చేసికొని సాంత్వనపఱచెను. దౌవారికులు వాసవాదుల నడ్డుపెట్టఁగా, వారు ద్వారము దగ్గఱ నిలిచియుండుటను వసుంధర మనవి చేసెను.

శుద్ధాంత ప్రవేశమునకు సిద్ధపడిన ఇంద్ర సుర మునిగణమును జయ విజయులు వారించిరి. ఆగంతుకులు కార్యత్వరితులై ముందుకు పోవఁజూచిరి. దౌవారికుల కాగ్రహము కలిగినది. వారు హస్తవేత్రములను ప్రయోగించిరి. దండితులు రోష భీషణులై – శ్రీ హరికి విరోధులై జన్మత్రయము రాక్షస కులమున పుట్టుఁడని – జయవిజయులకు ఘోరశాపము నిచ్చిరి. ఈ కలకలమును శౌరి వినెను. జయవిజయుల నూరడించెను. దైవిక దుఃఖము తప్పరానిది, దితి గర్భమున పుట్టుఁడనెను. అపుడు తానవతరించి కడతేర్తునని అభయమిచ్చెను. తన్ను నిందించుటవలన దోషము కలుగదనెను. రాక్షస జన్మము గర్హ్యమని తోఁచినచో, జన్మసప్తకమును సద్విప్రులై గడపి, శాపమును నిస్తరింప వచ్చునని బోధించెను. అంత కాలము శ్రీహరి వియోగమును సహింపని జయవిజయులు, రాక్షసత్వము నంగీకరించి దితిగర్భమును ప్రవేశింప తరలిరి.

ద్వితీయాశ్వాసము : విష్ణువు ముని బృందారక బృందము నూరడించి, వారు వచ్చిన పని సఫలమయ్యెనని పలికి పంపి వేసెను. జయవిజయులు దితిగర్భమున హిరణ్యాక్ష హిరణ్యకశిపులై జన్మించిరి.

హిరణ్యాక్షుఁడు పంచజనావత పట్టణమును నిర్మించెను. తపము చేసి పరమశివునివలన వరములను బడసి పాలింపఁ దొడఁగెను. అతని నసురగురుఁడు శుక్రుఁడభినందించెను. హిరణ్యాక్షుఁడు కోరఁగా జగదుత్పత్తి ప్రకారమును, లోకత్రయవైశిష్ట్యమును, మేరువు ఘనతను, జంబూద్వీప వైభవమును వర్ణించెను. మహా ప్రళయ విధానమును వినిపించెను. సురలోక రామణీయకము నభివర్ణించెను. దేవతలను నిర్జించి ఇంద్రపదము నాక్రమించి, అసురులనుద్ధరింపుమని బోధించెను. విశ్రవునిశాపమువలన సురలకది పరాజయకాలమను రహస్యమునుగూడ వ్యక్త పఱచెను. ఆ కథ యిది.

పుండరీకపురమున విశ్రవుఁడను విప్రుఁడుండెను. వాఁడు విత్తాభిలాషియై తన జ్యేష్ఠ కుమారుని విక్రయించి లభించిన విత్తమును వృద్ధిమూలమున పెంచి, యనుభవింపనేరక, పేరాసతో తౌల్యుఁడను వైశ్యునకు మఱల వడ్డి కిచ్చెను. ఆ ధనము దొంగల పాలగుటతో నతఁడు విరక్తిచెంది, బిందుసరోవరమున నొక స్వర్ణపద్మమున ఆసీనుఁడై విష్ణుని గుఱించి తపము సేయుచుండెను. అక్కడికి నింద్రుఁ డైరావతము నెక్కి అరుదెంచెను. వేడుకతో ఆ సువర్ణ కమలమును తన గజముచే తివియించెను. విశ్రవుఁడలిగి అతని వైభవము రాక్షసాక్రాంతమగునట్లు శపించెను.

హిరణ్యాక్షుఁడు కథ వినెను. అమృతోత్పత్తిని వినఁగోరెను. అసురగురుఁడు – కూర్మావతారము, గరళ క్షోభము, శ్రీదేవి ప్రాదుర్భావము, సుధాపహరణము, మోహిన్యవతారము, అమృతము దేవార్పితమగుట, రాక్షసులు వంచితులగుట – ఇత్యాది క్షీరసాగర మథన వృత్తాంతమును సవిస్తరముగా వినిపించెను. కథ ముగిసెను. హిరణ్యాక్షునిచే సేవితుఁడై శుక్రుఁడు మఱలెను.

హిరణ్యాక్షుఁడు సురపురిపై దండెత్తెను. దేవదానవులకు భీకరసమరము జరిగెను. తలవాచుకొన అమరులు మేరుపర్వతమునకు పలాయితులైరి. దేవరాజ్యమున అసురపతియొక్క నిరంకుశపాలనము సాగుచున్నది. హిరణ్యాక్షునకు

సునాసీరుఁడను దానవవీరుఁడు రాజనీతిని విన్నవించెను. శత్రుశేషము నుంచరాదు కదా! కావున భూమితోఁగూడ మేరువును పెకలించి వారిధిలో పడవేయుమని హితముసెప్పెను. హిరణ్యాక్షుఁడు సన్నద్ధుఁడయ్యెను. మఱల దేవదానవులకు పోరు కలిగినది. రాక్షసరాజు మేరువును భూమితో నుత్పాటించి, సముద్రములోఁ బడవైచెను. విష్ణువు యజ్ఞవరాహరూపమున అవతరించెను.

తృతీయాశ్వాసము : వరాహమూర్తికి సప్తసాగరములు జానుదఘ్నములైనవి. ఆ భయానక రూపము నసురపతి చూచెను. యుద్ధమునకు సిద్ధపడెను. తుదకు వరాహదంష్ట్రాదళితాంగుఁడై మడిసెను. ఆదివరాహమూర్తి తనదంష్ట్రాగ్రముతో వసుంధర నుద్ధరించెను. మేరువును స్వస్థానమున స్థాపించెను. భూదేవి వరాహమూర్తిని వేవిధముల వినుతించెను. ఇంద్రునికి స్వారాజ్యము దక్కెను. ప్రధానకథ ముగిసెను.

మార్కండేయముని మఱల ప్రశ్నించెను. వేదసమ్మతమైన కర్మమేది ? ముక్తిదాయకమైన కర్మమేది ? ఏది దురితహరము ?

పూర్వము దంష్ట్రాగ్రవాసినియగు వసుంధర యీ ప్రశ్నములనే యాదివరాహము నడిగియుండెను. ఆ భూ వరాహ సంవాదమునే బ్రహ్మ నారదునకు వివరించియుండెను.

ఆ బ్రహ్మ నారద సంవాదమును రోమశముని మార్కండేయమౌనికి నిట్లు వినిపించెను.

భూలోకము కర్మభూమి. భాగవత ధర్మానుష్ఠానమును, విష్ణుపూజనమును విష్ణుప్రీతిగా నాచరింపవలయును. ఇవి ముక్తిప్రదములైన కర్మములు. విష్ణువు కాలస్వరూపి. కాలము యుగభేదములు గలది. ఆచారములు యుగానుసారములై విహితములై యున్నవి. చాతుర్వర్ణ్య ధర్మములున్నవి. విప్రులకు విశిష్టధర్మములున్నవి నిత్య నైమిత్తికాది కర్మములు గలవు. హరినామ సంకీర్తనము, హరిసేవాసక్తి, హరిభక్త జనాదరణ మనఁనవి విష్ణులోకమునకు సోపానములు. ఈ సందర్భమున రోమశముని విష్ణుపూజాక్రమమును, సాలగ్రామ సంభవ స్థానమును, తత్స్వరూప విశేషములను వివరించెను. అంత్యకాలమున సాలగ్రామతీర్థమును సేవించి హరిపురికేఁగిన ధూమాస్యుఁడను చోరుని కథను దెలిపెను. హరికీర్తన ప్రశస్తిని, ధ్యానయోగ విధానమును వివరించెను. జీవునికి పుణ్య పాప ఫలానుభవము తప్పదు. పాపమెట్లు సంభవించునో చెప్పుట కష్టము. దీనికి విష్ణువర్ధనోపాఖ్యానమును దృష్టాంతముగా పరికింపవలయును.

విష్ణువర్ధనుఁడు సద్విప్రుఁడు. నిష్ఠాగరిష్ఠుఁడు. పుణ్యశ్లోకుఁడు. ఇహము వీడి స్వర్గమున కేగెను. ఇంద్రుఁ డతనిని గొనియాడెను. స్వర్గసౌఖ్యముల ననుభవింప ననుమతించెను. కాని యొకప్పు డాతని యర్ధాంగి క్షుధాతురు నన్నముపెట్టక తఱుమఁగొట్టెను. ఈ సంగతి, పాపమా బ్రాహ్మణునికిఁ దెలియదు, కాని చిత్రగుప్తుని చిట్టాలో చేరిపోయెను. కావున నా పాపములో సాఁబాలాతనికి సంక్రమించినది. తత్ఫలము ననుభవింపకతీరదు. బ్రాహ్మణుఁడు మొదట పుణ్య ఫలముగా స్వర్గసుఖమును యుగమొక క్షణముగాఁ గడపెను. తరువాత నరకమున పాపఫలమును క్షణమొక యుగముగా ననుభవించెను. పిదప జంబుకజన్మమెత్తెను. ఆపై హరిపురికేఁగెను,

మార్కండేయముని విజయుని వృత్తాంతమును వినఁగోరెను. విజయుఁడు హిరణ్యకశిపుఁడై పుట్టుట ప్రహ్లాదచరితము, నరసింహావతార కథ, ప్రహ్లాద పట్టాభిషేకము మున్నగువానిని రోమశుఁడు సవిస్తరముగా వినిపించెను. తరువాతికథను సంగ్రహముగ నిట్లు తెలిపెను. జయవిజయులు రెండవజన్మమున రావణ కుంభకర్ణులై పుట్టిరి. శ్రీరామునిచే నిహతులైరి. మూఁడవజన్మమున శిశుపాల దంతవక్త్రులై జన్మించి, శ్రీ కృష్ణునిచే హతులై వైకుంఠమును జేరిరి. నిజ స్వరూపములను గైకొనిరి.

చతుర్థాశ్వాసము : మార్కండేయముని హరికథాశ్రవణ కుతూహలియై, విష్ణువుయొక్క విచిత్ర చరిత్ర మెట్టిది? హరి, సృష్టి స్థితి లయ కారకుఁ డెట్లయ్యెను? కీటతుల్యులైన దైత్యులను సంహరించుట కిన్నిసారు లవతరింపనేల? సర్వసమునకు నసురులపై వైరమేల? తపోజ్ఞానులగు వసిష్ఠాదు లింకను ముక్తులు కాకపోవుటకు కారణమేమి? హరికి మీనాద్యవతారములేల? ఇత్యాదిగ పలుప్రశ్నములు వేసెను. రోమశముని వీనికన్నింటికి నిట్లు సమాధాన మొసఁగెను.

మొదట బ్రహ్మ సమస్తమును సృష్టించెను. అందు జీవరాసులు పునఃసృష్టి జరుపలేక నశించినవి. బ్రహ్మ విష్ణువును ప్రార్థించెను. అతఁడు యోగనిద్రలో నుండెను, కావున యోగమాయను వినుతించెను. ఆమె యనుగ్రహించి, హరియొక్క నయనపద్మమునుండి వెలువడెను. అపుడు విష్ణువు మేలుకొనెను. పరిస్థితిని గ్రహించెను. విశ్వమును సృష్టించెను. యోగమాయవలన స్త్రీపురుషాంశములు ఏర్పడినవి. జీవజాలమునకు సృజనశక్తి కలిగినది. దుర్జనులు విజృంభించినపుడు హరి యవతరించును. వారి నంతమొందించును.

కశ్యపమునికి దితి, యదితియు భార్యలు. దితికి దైత్యులు, అదితికి నాదితేయులు జన్మించిరి. అదితిపుత్రులు హరిసేవాపరులు. హరికి వారు దేహతుల్యులు. వారికి కీడు తలఁచువారు హరికి శత్రువులు. అందుచేత దైత్యులను విష్ణువు పలుమారు సంహరించును. సజ్జన సంరక్షణమునకై మీనాద్యవతారములను వహించును. భూసురులు గర్వితులై వేదములకు నపార్థములు కల్పించినపుడు సోమకాసురుని సృష్టించి, వేదముల నపహరింపఁజేసెను. వేదములు విష్ణు స్వరూపములు. పశ్చాత్తప్తులైన విప్రులు తపముచేసి విష్ణువును ప్రార్థింపఁగా, హరి మీనమై యవతరించి, సముద్ర గర్భమున డాఁగిన యా సోమకుని సంహరించి, వేదముల నుద్ధరించెను. మార్కండేయమునికీ యంశము రుచింపలేదు. అడుసు త్రొక్కనేల? కాలు కడుగనేల? యన్నట్లు సోమకుని పుట్టింపనేల? మరల వధింపనేల? విషవృక్షమునైనను పెట్టినవాఁడు పెకల్పఁడు కదా! దీనికి రోమశుల సమాధాన మిది.

హరి కార్యార్థమై తన దాసులయందొక తప్పు కల్పించి, వారు రాక్షసులుగా జన్మించునట్లు చేయును. వారు దుర్మదాంధుల గర్వము నణఁచివేయుదురు. పిదప తానే వారిని వెదకి వధించి, ముక్తులను జేయును. హరిచే చావనివాఁడు భవబద్ధుఁడగును. దేవతలు గర్వించినచో, రాక్షసులచేత వారి గర్వము నంతమొందించును. అసురులు విజృంభించినచో వారిని దేవతలచేత చంపించును. అతని దశావతారములకు నిట్టివే కారణములు. తరువాత శ్రీకృష్ణుఁడు శిశుపాలుని వధించిన వృత్తాంతమును, జీవుని కర్మబంధమును రోమశముని వివరించెను.

పంచమాశ్వాసము : హరినామము మహామహిమాన్వితము. దీనిని ప్రతిపాదించునది శివశర్మోపాఖ్యానము.

శివశర్మ వేదవిశారదుఁడైన విప్రుఁడు, అనపత్యుఁడు. కులము తెలియని యొక పసికందును దాదినిపెట్టి పోషించి పెద్దచేసెను. అతని పేరు శీలుఁడు. పశుపాల్యాదిక మాతని పని. అతఁడు తన్ను సంరక్షించిన విప్రదంపతులను గురుభావముతో నారాధించుచుండెను. వారికి వానియెడ పుత్ర మమకారము. అతఁడు శీలసంపన్నుఁడు.

శివశర్మపత్నికి నోఁచిననోముగా నొకకన్య కలిగినది, ఏఁడవయేఁట నామెకు వివాహమైనది. ఏడవ దినమున భర్తను గోల్పోయినది. అది పురాకృత కర్మఫలమని జ్యోతిషికుఁడైన శివశర్మ తలఁచెను.

వాసవిలో నిండుజవ్వన మంకురించినది. కామార్తయైనది; తమోఽభిసారికయై శీలుని సమీపించినది. శీలునకు నామెయందు సోదరప్రీతి. నీతులు చెప్పెను. ఆ చెప్పుటలో కొంత కాఠిన్యము తోఁచెను. వాసవి అభిమాన క్రోధములతో వెనుతిరిగెను. బంధకిగా మారెను. ఒకనాఁడు శీలునకు విషాన్నము పెట్టెను. శీలుఁడిహలోకమును వీడెను. విప్రదంపతులు

శోకించిరి. శివశర్మ శీలునకు ఔర్ధ్వదైహికక్రియలు చేసెను. భూసురాన్నభోజనము, పుణ్యవర్తనము శీలునకు స్వర్గలోక ప్రాప్తిని కలిగించినవి. యముఁడు శీలుని పితృభక్తి ని మెచ్చుకొనెను. అతనిని తనకింకరులలో నొకనిఁగా నియమించెను.

శీలుఁడు స్వధర్మనిర్వహణార్థ మొకసారి భూలోకమునకు వచ్చెను. శివశర్మను చూచెను. శివశర్మ శీలుని చూచెను. అతని దివ్యశరీరమును చూచి శివశర్మ యబ్బురపాటు చెందెను. అతని చరితము విని యానందించెను. బొందితో స్వర్గమునకేఁగి యందలి వింతలు చూడ కుతూహలపడెను. అది కాని కార్యము. శీలుఁడు శివశర్మకు దివ్యదేహమునిచ్చి, యతనిని యమలోకమునకు తోడుకొనిపోయెను. నరకములో జీవు లనుభవించు యాతనలను శివశర్మ చూడలేకపోయెను. వారు పడు బాధల సహింపఁజాలక ముమ్మారు నారాయణ నామము నుచ్చరించి, చెవులు మూసికొనెను. ఆ నామమును విన్న మాత్రాన నరకబాధ తప్పి యందఱును వైకుంఠమునకేఁగిరి. ఉన్నట్లుండి యమలోకము శూన్యమైనది. యమునికి ఆశ్చర్యము కలిగెను. కారణమును తెలిసికొనెను. ఇఁకమీఁద పొరపాటుననైనను విష్ణుభక్తులను యమపురికి నెవరును పిలుచుకొని రాకూడదని శాసించెను. హరినామప్రభావ మట్టిది. మార్కండేయముని చాల సంతోషించెను. సూర్య చంద్ర వంశ్యుల జన్మకర్మవర్తనములను చెలియఁగోరెను. రాజులు గర్వితులై సూర్యు నెదుర్కొనుటయు, అతఁడు వారి నందఱిని మ్రింగివేయుటయు, లోకమరాజకముకాఁగా, బ్రహ్మ సూర్యచంద్రాంశములనుండి రాజన్యులను పుట్టించి, జగము నుద్ధరించిన సంగతిని రోమశముని వివరించెను. ఆ రాజులలో విష్ణుభక్తి విహీనులు తేజోహీనులై నశించిరి. ఎంత గొప్ప చక్రవర్తియైనను తనతో దేనిని దివికి తీసికొనిపోలేఁడు. కావున మనుష్యులు దారాది మోహబంధములో తగులువడి ముక్తికి దూరులు కారాదు. దీనికి మయూరధ్వజోపాఖ్యానము చక్కని యుదాహరణము.

మయూరధ్వజుఁడు రాజు. పరమలోభి. అతని రాజ్యములో దుర్భిక్షము ప్రబలెను. అతనికి ధర్మమును బోధింప వసిష్ఠాది మహర్షులు విచ్చేసిరి. వర్షప్రదమగు నొక యాగము సేయుటకై పదివేల నిష్కముల నడిగిరి. ఆ మాటలు విన్నంతనే యా లోభి ప్రాణములు పైకి వెడలిపోఁజొచ్చెను. ముని లారాజుపై మంత్రపునీతలు చల్లిరి. అతఁడు నిద్రించెను. నిద్రలో స్వప్నము. ఆ స్వప్నానుభూతి విచిత్రమైనది. రాజు తురగారూఢుఁడై వేలకొలఁది యోజనములు పయనించెను. మధుసాగరతీరమున నొక వటవృక్షమూలమునఁ బడెను. ఆకలిదప్పులు బాధించుచున్నవి. సమీపమున మాయాపురము. చండాల ధామము. ఇంటింట గోహత్యలు. అతనికి దుర్భరమైనది. రాత్రి యెటులో పుచ్చెను. అక్కడికి లజ్జావిహీనుఁడైన సిద్ధుఁడొకఁడు వచ్చెను. అతని కూఁతురు కమలహూతి. చండాలప్రమద. మయూరధ్వజుఁడు మరులు కొని దానిని పెండ్లాడెను. వారికి సంతానము తామరతంపర. అతనికి వార్ధకమునఁ గూడ పుత్రకాంతా వ్యామోహ ముడుగలేదు, ఒకనాఁడు తన కాంత కొలుజాఱి క్రిందపడి మరణించెను. మయూరధ్వజుఁడు వెక్కి వెక్కి యేడువఁ దొడఁగెను.

వసిష్ఠాదులు నవ్వుచు రాజును మేలుకొలిపిరి. ముహూర్తమాత్ర స్వప్నమున చిరకాలము సుఖదుఃఖము లనుభవించినట్లు తోఁచెను. రాజాశ్చర్యచకితుఁడయ్యెను. సంసారముకూడ నిట్టి స్వప్నానుభూతిని పోలినదే యని మును లతనికి బోధించిరి. భోగములను పరిత్యజింపుమని యుపదేశించిరి. దానముచే దురితములు నశించుననిరి. విష్ణుపూజా ప్రభావ మును వర్ణించిరి. మయూరధ్వజుని చిత్తము నిర్మలమైనది. మోహపాశములు వీడినవి. అతఁడు హరిని ధ్యానించుచునై దుదినములలో పరమపదము నలంకరించెను.

రోమశముని మార్కండేయాది మునులకు నీవిధముగా వరాహపురాణాంతర్గత కైవల్యఖండ మాహాత్మ్యమును వివరించెను. వారు తరువాత విజ్ఞానఖండ శ్రవణ కుతూహలు లైరి.

ఇంతదనుక సుమారు 1250 పద్య గద్యములలో హరిభట్టు రచించిన వరాహపురాణ కథాదికము సంగ్రహిత మైనది.

మూలము - సూచన :

[1]సంస్కృత వరాహపురాణమొకటి ముద్రితము. పరిష్కర్త పండిత హృషీకేశశాస్త్రిగారు. దీనిననుసరించి, బొంబాయి వేంకటేశ్వర స్టీమ్ ప్రెస్ వారు 1902 సం. లో మరొక ముద్రణమును వెలయించిరి.

ఈ పురాణములోని విషయవివరణము విస్తరకార్యమగును. 'బాదరాయణ సంబంధము' తప్ప హరిభట్టుకృతి కిది మూలము కాదు. నందిమల్లయ ఘంటసింగనల యనువాదము యథానుకూలముగా పైముద్రిత సంస్కృతమూలము ననుసరించుచున్నది. ఇట్లుండఁగా, [2]"సంస్కృత వరాహపురాణమునఁ గొంతభాగమును మాత్రమే యీ కవులు తెనిఁగించిరి" అని చేకుమళ్ల అచ్యుతరావుగారు వచించుటకు కారణము కానరాదు.

## ౩. కైవల్యఖండ ప్రకాశిక :

కైవల్యఖండము : హరిభట్టు. వరాహపురాణములోని పూర్వ భాగమును మాత్రము రచించెను. ఆ భాగమునకు 'కైవల్యఖండము' అని పేరు. దానికే 'ఆదిఖండ'మని నామాంతర మున్నట్లు పద్యశ్రుతి [5-263] తెలియఁజేయుచున్నది. అనంతరభాగము విజ్ఞానఖండమఁట [5-262]. దాని సంగతి విజ్ఞాతమగుట లేదు. ఖండము-అనఁగా గ్రంథైకదేశము.

మోక్షశబ్దమునకు ఈషదర్థభేదముగల పర్యాయపదము లనేకములున్నవి. వానిలో కైవల్య శబ్దమొకటి. అద్వైతి యగు పోతనకు కైవల్య పదముపై మక్కువ యెక్కువ. కాఁబట్టి తన భాగవతమునకు శ్రీకైవల్య పదముతో శ్రీకారము చుట్టెను.

"శరీరేంద్రియ విరహితః ఆత్మనః అద్వితీయతయా అవస్థానం కైవల్యం"అని యమరకోశవివృతి [1, ధీ-6]. ఈ అద్వితీయస్థితి త్రిమతాచార్య సంవిదంశము.

క. హరినామ కీర్తనామృత । హరిపదతీర్థంబులాని యతివిమలుండై
హరిభక్తిపరవశుండగు । పురుషుఁడు కైవల్యపదముఁ బొందుట యరుదే? [1-40]

అనునది హరిభట్టారకుని యభిమతము. ఇదే భాగవతధర్మము,

కొన్ని పురాణములు ఖండములుగ విభజింపఁబడియున్నవి. 'స్కాందపురాణ సంహితకు ఖండము లేఁబది'యని కాశీఖండ పీఠికలో [1-8] శ్రీనాథుఁడు నుడివియున్నాఁడు. వానిలో నేఁడు ఎన్నిఖండములు లభించుచున్నవి? పాండురంగ మాహాత్మ్యకథ స్కాందములోనిదని తెనాలికవి వ్రాసెను. కాని నేఁటివఱకు ఆ భాగము కనఁబడలేదు కదా! శ్రీనాథుఁడు తన 'కాశీ - భీమములను' ఖండములనెను. ఇతర కవులును పురాణ సంజ్ఞ ననుసంధించి భాగములనో, ఖండములనో వ్రాసినారు. హరిభట్టుకూడ ఖండములు వ్రాసెను. వానిని పురాణములని వ్యవహరించెను. అతని మాత్స్య వారాహము లిందులకు ప్రబల నిదర్శనములు.

గీర్వాణ కైవల్యఖండము నేఁడు లభించుట లేదు. ఇదివఱలో సూచించిన ముద్రిత వరాహపురాణములో సుమారు పదివేల శ్లోకములు కలవు. కాని వరాహపురాణములో ఇరువదినాలుగువేల శ్లోకము లున్నట్లు పురాణవాక్యము.

"బ్రాహ్మం దశ సహస్రాణి పాద్మం పంచోనషష్టి చ ।
......................చతుర్వింశతి వారాహం ॥

అని శ్రీమద్భాగవతవచనము (అధ్యా. 13, 4-7)

---

1 Published by the Asiatic Society of Bengal, Calcutta, 1893.

2 విజయనగర సామ్రాజ్యమందలి ఆంధ్ర వాఙ్మయ చరిత్రము, భా, 1. పు. 258.

కావున వరాహపురాణములో నింకను పదునాలుగువేల శ్లోకములు కనుపడుట(గ్గై యున్నవి యని విదితమగు చున్నది. ఈ కైవల్యఖండ మందులో చేరియుందునేమో !

ప్రస్తుతము లభించుచున్న ముద్రిత వరాహపురాణము (పదివేలు శ్లోకములు గలది) సమగ్రమనియు, ఇఱువది నాలుగువేల శ్లోకములు గలవనుట యతిశయోక్తి యనియు అనుకొనుటకు వీలులేదు. పురాణాదులలో ప్రక్షేప విక్షేపాదులు బహుధా సంభవించినవి. ఆనందతీర్థులు 'మహాభారత తాత్పర్య నిర్ణయము' వ్రాయుచు నందులో నిట్లు ప్రవచించియుండుట పరిశీలనార్హ మగును.

> ''క్వచిద్గ్రంథాన్ ప్రక్షిపంతి క్వచిదంతరితానపి । కుర్యుః క్వచిచ్చ వ్యత్యాసం ప్రమాదాత్క్వచిదన్యథా ।
> అనుత్పన్నా అపి గ్రంథా వ్యాకులా ఇతి సర్వశః । ఉత్పన్నాః ప్రాయశః సర్వే కోట్యంశోఽపి న విద్యతే ।
> గ్రంథోఽప్యేవం విలులితః కిమ్వర్థో దేవదుర్గమః । కలావేవం వ్యాకులితే నిర్ణయాయ ప్రచోదితః ।
> ................................................శాస్త్రాంతరాణి సంజానన్ వేదాంశ్చాస్య ప్రసాదతః ।
> దేశే దేశే తథా గ్రంథాన్ దృష్ట్వా చైవ పృథగ్విధాన్ ॥ (అధ్యా. 2, శ్లో. 3-5, 7).

వరాహపురాణమునకును ఈ పరిస్థితి యేర్పడియుండు ననుటకు నిదర్శనములున్నవి.

1. ముద్రిత వరాహపురాణముకంటె హరిభట్టుకృతి పూర్తిగ విభిన్నమైయుండుట.

2. ముద్రిత వరాహపురాణములో ప్రధానమైన వరాహావతార వృత్తాంతము లేకపోవుట.

3. వరాహపురాణాంతర్గతముగా ప్రసిద్ధిలోనున్న వేంకటాచల మాహాత్మ్యము (రెండు భాగములు) ముద్రిత ప్రతిలో(గాని, కైవల్యఖండములో(గాని కానరాకుండుట.

4. సాలగ్రామ లక్షణమును దెల్పు తాళపత్రప్రతి (డి. నం. 5813, జి. ఓ. ఎం. ఎల్) కలదు. ఇది వరాహ పురాణములోనిదని యా గ్రంథాంతమున ఇట్లు కలదు.

"ఇతి శ్రీ వరాహపురాణే సాలగ్రామస్య లక్షణం నామ అష్టమోఽధ్యాయః" ఈ యధ్యాయభాగము ముద్రిత ప్రతిలో కానరాదు. కాని హరిభట్టు ఆంధ్రీకరించిన వరాహపురాణమున పైదానికి అనువాద మున్నది.

ఈ కారణములచేత, ముద్రిత వరాహపురాణప్రతి యసమగ్రమైనదనియును, లుప్తభాగములలోని కైవల్య ఖండమొకటి యానా(డుండెననియు ఊహింపవలసియున్నది.

## పురాణము - ఆంధ్రీకరణము

పురాణమునకు నిష్పత్తిక్రమమున్నది. ఆ శబ్దమునకు నిర్వచనమున్నది. సంఖ్యాపరిగణనము కలదు. పురాణ లక్షణములున్నవి. ప్రయోజన ముద్దిష్టము. వర్గీకరణము వ్యక్తీకృతము. ఉపపురాణములు నున్నవి.

వీనినిగూర్చి విపులమగు వివరణములు, విమర్శలు వెలువడియున్నవి. అవి భారతదేశ విభిన్నభాషలలో సహస్రాధికములు. పాశ్చాత్య పరిశోధనకును మేఱలేదు. ఇటీవల తమ సిద్ధాంతవ్యాసములో డా॥ జి. వి. సుబ్రహ్మణ్యం గారీయంశములను (ప్రథమాంధ్ర మహాపురాణము - మార్కండేయపురాణము పు. 1-40) వ్యాకరించియున్నారు. ఉక్తము సువిదితమునైన ఆ యంశములను మఱల వచించుట చర్వితచర్వణమగును. కాన ప్రస్తావించుటలేదు.

పురాణలక్షణములను విస్మరింపక, ప్రయోజనమును గుర్తించి హరిభట్టు కైవల్యఖండమును రచించెను. పురాణ లక్షణములకు గ్రంథములోని కొన్ని సూచనలు.

1. సర్గప్రతిసర్గల ప్రస్తావము— 2; 42-77; 4; 25-76.
2. విభవాభివర్ణనము (అవతార ప్రశస్తి)— 4; 84-147.
3. వంశము, వంశానుచరితము - (సూర్య చంద్రవంశ ప్రశస్తి) 5; 87-153.
4. పూజలు, వ్రతములు :— సాలగ్రామ వృత్తాంతము (విశిష్టరీతిలో వివరింపఁబడియున్నది). 1; 109-112, 3; 66-116, ఏకాదశీ మాహాత్మ్యము 1; 111-115.
5. క్షేత్రమాహాత్మ్య వృత్తాంతములు - విస్మృతములు,
6. పోషణము (భక్తజన పాలనము) - ప్రహ్లాద చరిత్ర, 3; 224-309,
7. ఊతులు (కర్మవాసనలు, కర్మయోగము ఇత్యాదులు). 3; 62-64, 4; 224-225, 5; 8-6.
8. హరినామ మహత్త్వము— 5; 8-12.

పురాణమునకు ప్రయోజనమున్నది. అది వేదప్రయోజన ప్రదర్శకము. ధర్మాచారములను లోకహితార్థము తెలియఁజేయునవి వేదములు. అవి యపౌరుషేయములనుట సంప్రదాయము. అందలివి శాసనము లాదేశపూర్వకములు. కావున ప్రభుసమ్మితములందురు. వేదాంశములు పురాణములలో నుపబృంహితము లయినవి. వ్యాసాది మహర్షులు శిష్య ప్రశిష్యుల మూలముగా ఆఖ్యాప్రాయములుగా వానిని సుబోధముచేసిరి. అవి స్నిగ్ధములు, సందేశ పూర్వకములు. కావున మిత్రసమ్మితము లయినవి.

ఆంధ్రమహాకవుల పురాణానువాదము చిత్రమైనది. అది ''వేదముల్ వోసిన గాదె, శాస్త్రముల పుట్టినయిల్లు, కళా కలాపముల్ డాసిన రచ్చ'' యని వినుతింపఁదగినది. శ్రీనాథాదులను కేవల పురాణకవులని యనలేము. హరిభట్టు వారిమార్గమున నడచిన కవి. ఇతని వరాహపురాణము 'దేహళీదత్త దీపము.' ఇటు పురాణసౌధమునకు అటు ప్రబంధ వీథికి వెలుఁగు చూపుచున్నది. పురాణములకు ప్రధానధర్మమగు ధర్మప్రబోధమును విస్మరింపక, ప్రబంధ శిల్పమును పరిమిత పరిధిలో ప్రదర్శించుటకు నుద్యమించిన కవి - హరిభట్టు.

ఇతని యాంధ్రీకరణమును మూలముతో పోల్చి పరిశీలించుటకు కొంత యుపకరించునది— 'సాలగ్రామ లక్షణ' ఘట్టము,

'[1]సాలగ్రామ లక్షణమ్' అను తాళపత్రప్రతి యొకటి కలదు. అది అతిశిథిలము. శ్లోకములను గుర్తించుట శ్రమకరము. అందులో సుమారు 300 శ్లోకము లుండవచ్చును. గ్రంథాంత గద్యమువలన అది వరాహపురాణాంతర్గతమని తెలియుచున్నది. ఈ విస్తృత గ్రంథభాగమును హరిభట్టు 45 పద్య గద్యములలో సమాహారపఱచి సంగ్రహించెను. సంగ్రహీకరణము పురాణానువాదక్రమములో నొక యంశము.

అందుండి కొన్ని పాదము లిక్కడ నుద్ధరింపఁబడును. (పు. 8-16). అనువాదరీతి ప్రదర్శింపఁబడును.

1. సుదంష్ట్రాభ్యాం సమోపేతం వారాహం ధరణీప్రదం ।....వరాహం శక్తియుక్తం చ చక్రే తు విషమే స్థితే ॥....

   తే. శక్తిలింగకమనఁగ దంష్ట్రాఖురాది । కములు గైకొని, విషమచక్రములు దాల్చి
   సేవకాభీష్టదాన ప్రసిద్ధమగుచుఁ । దనరునది కోలమూర్తి సజ్జనవరేణ్య ! (3-95)

2. ఇంద్రనీలనిభం స్థూలం త్రిలేఖాలాంఛితం శుభం ।

---

1 డి. నం. 5813, D.C. vol Pege 4521, G.O.M.L

క. స్థూలంబై వాసవమణి। నీలంబై విబుధవర్ణనీయంబై రే
ఖా లాంఛన త్రయంబై। క్రాలెడునది కూర్మమూ_ర్తి గౌరవనిలయా! (3-96)

3. అతసీ కుసుమప్రఖ్యం కించిదున్నత మస్తకం। తద్వామనం కామదం స్యాత్ కించిద్విస్పష్ట చక్రకం॥

క. అతసీ నూతన కుసుమ। ద్యుతియును, విస్పష్టబిందుయోగము, రమ్యా
కృతియుఁ త్రివిక్రమమూ_ర్తికి। శ్రుతిభాషిత చిహ్నములు యశోధనవర్యా! (3-101)

4. హ్రస్వం సువర్తులం చైవ వామనం పరిచక్షతే॥
వర్తులతయు హ్రస్వభావమును రూఢిగ వామనమూ_ర్తి చిహ్నముల్, (3-100)

5. నారసింహో మహాదేవః పృథుచక్రః సుదంష్ట్రకః। బ్రహ్మచర్యేణ పూజ్యేత నాన్యథా పూజనం భవేత్।
వామపార్శ్వస్థితే చక్రే కృష్ణవర్ణః సబిందుకః। లక్ష్మీనృసింహో విజ్ఞేయః భు_క్తిము_క్తి ఫలప్రదః॥

క. పృథువ_క్త్రమై సుచక్ర। ప్రథితంబగు నృహరిమూ_ర్తి పరులకుఁ బూజా
గ్రథన మొనరింపరాద। శ్లథమానసుఁడైన బ్రహ్మచారికిఁ దక్కన్. (3-93)

తే. పంచబిందుక కపిలంబు, భాసురత్రి। బిందుయుత నారసింహంబు పృథుతర ప్ర
యత్నమునఁ బూజ యొనరించు నర్చకులకు। నపునరావృ_త్తి ము_క్తిదాయకము లనఘ! (3-94)

6. లసత్పరశు రేఖాఢ్యో దూర్వాశ్యామ _స్తథోన్నతః।

సీ. డాపల గండ్రగొడ్డలి దక్షిణమునఁ జ। క్రము గల్గ భార్గవ రామమూ_ర్తి. (3-105)

7. ధనురాకృతికారేఖా దృశ్యతే పార్శ్వతోఽపి వా।....బాణతూణీరచాపాఢ్యః వీరరామః క్రియావహః॥

ఎ. గీ. చాపసాయకరేఖలు సవ్యసీమ। రమణఁ గైకొన్నయది రఘురామమూ_ర్తి, (3-105)

8. సువర్ణబిందుభిర్యు_క్తం బృహచ్చక్రం బృహన్ముఖం। వ_క్త్రదంష్ట్రా నృసింహాఖ్యం యతీనాం ప్రీతిదం సదా।

సీ. భూరివ_క్త్రమును దంష్ట్రారేఖయును యతి। నికరపూజ్యము నుగ్రనృహరిమూ_ర్తి. (3-105)

9, దక్షపార్శ్వే స్థితే చక్రే సమలగ్నే ప్రదేశతః। వనమాలాయుతో లక్ష్మీవారాహః పరికీర్తితః॥

క, చారు సమచక్రయుతము, శి। రోరూఢ సువర్ణబిందు రుచిరము వన మా
లా రమ్యమునై లక్ష్మీ। నారాయణమూ_ర్తి తనరు నత సౌఖ్యదమై. (3-107)

పై యుదాహరణములవలన హరిభట్టు రచనమునకు ఒక వరాహపురాణ ప్రతి మూలమై యుండినట్లు తెలియుటయేకాక, అతని యనువాద విధానము కూడ రేఖామాత్రముగ నవగతము చేసికొనుటకు నవకాశము కలుగుచున్నది.

మఱియును, పాంచరాత్రాగమాంతర్గతమగు శ్రీ పురుషో_త్తమ సంహితలో 28 వ యధ్యాయమున సాలగ్రామ లక్షణము కలదు. ఇది పైని పేర్కొన్న తాళపత్రప్రతిలోని పాఠములను బోలియున్నది. సంహితలోని భాగమునకును వరాహపురాణమే మూలము కానోపును!

"'హరేర్లీలావరాహస్య దంష్ట్రాదండః స పాతు వః।
హేమాద్రికలశా యత్ర ధాత్రీ చ్ఛత్రశ్రియం దధౌ॥

ఈ శ్లోకము కొన్ని శాసనములలో కాననగును. ఇది వరాహపురాణమునుండి సంగృహీతము కాఁబోలును! దీనిని హరిభట్టు సుందరముగా కందములో ననువదించి యున్నాఁడు.

కిరివర దంష్ట్రాగ్రదండో। పరిభాగమునందు నాతపత్రము కరణిన్
ధరణీచక్రము తనరెను। సురశైలము పసిఁడీగుబ్బ చొప్పున నొప్పెన్. (3-14)

హరిభట్టుయొక్క యాంధ్రీకరణ వైఖరి నరయుటకు మార్గాంతరము కలదు. అతఁడు బహుశ్రుతుఁడు. కావున ప్రాచీన మహాకవుల శ్లోకములను, ఉపనిషద్వాక్యములను పెక్కింటి ననువదించి వరాహపురాణములో పొందుపఱచి యున్నాఁడు, ఒకటి రెండు ఉదాహరణములు.

ఊర్ధ్వమూల మధశ్శాఖ మశ్వత్థం ప్రాహు రవ్యయం।
ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్॥ (గీత. 15-1)
*ద్వాసుపర్ణా సయుజా సఖాయా, సమానం వృక్షం పరిషస్వజాతే।
తయోరేకః పిప్పలం స్వాద్వత్తి అనశ్నన్నన్యో అభిచాకశీతి॥

పై గీతా-ఉపనిషత్తుల భావము సరళముగా సీసములో అనువదింపఁబడినది. పద్యము నన్నయశైలిని పుణికి పుచ్చుకొన్నట్లున్నది.

సీ. మూలముల్ మీఁదు, కొమ్మలు క్రిందునై చాల। నున్నతంబై మించు నొక్కతరువు
వేదపర్ణంబుల విలసిల్లుఁ, దత్పక్వ। ఫలము లెవ్వారికిఁ దెలియఁబడవు,
ఆహారియును నిరాహారియునై రెండు। పక్షులు తరువునఁ బాయకుండు
నతినిశ్చలంబైన యాఖగ ద్వితయంబు। సురుశక్తి నైక్యంబు నొందఁజేసి
తే. యమ్మహీజమ్ముఁ బాలింప నజుఁ(పఁ)జాలి, తత్ఫలశ్రేణి నిజభక్తతతికి నొసఁగు
నీ మహత్త్వంబు వర్ణింప నేర్తు నెట్లు? శరధికన్యాకళత్ర! తామరసనేత్ర! (4-38)

విషవృక్షోఽపి సంవర్ధ్య స్వయం ఛేత్తు మసాంప్రతం॥

ఇది కాళిదాస మహాకవి కుమారసంభవములోని ప్రసిద్ధోక్తి; బ్రహ్మవాక్యము. దీనికి ననువాదము—

"......విషవృక్షమునైన నను బెట్టి, పెంచి, తాఁ
బెకలిచివైచునే? కరుణపేరు నెఱుంగని ఘాతుకాత్ముఁడున్. (4-85)

ఇట్టిదే యనువాదము పోల్చి చదువుకొని యానందించుటకు శ్రీనాథుని సీసమందలిది—

"విషవృక్షమేనియు వృద్ధిపొందఁగఁజేసి। తనకుఁ దాఁ బెఱుకుట తగవు కాదు" (హర, 3-18)

ఇతివృత్తము—ఈ పురాణములో విష్ణుప్రాముఖ్యము నుగ్గడించుట ప్రధాన లక్ష్యము. ఆ ప్రయోజనము సిద్ధించుటకు కవి యితివృత్తము ననుసంధానము చేసెను. ఇది కృతిపతికి నభీష్టము; ఆనంద జనకము. కవికి శివస్తుతి గర్హ్యము కాదు. అందుకే ఇష్టదేవతాస్తుతిలో అమంలిత భావసంపదతో శంభుస్తుతి కానవచ్చుచున్నది.

శైత్యవిశేషశైలమున సంభవమందినపాలు, జన్మసాం। గత్యము లేనిపాలు
గల కాయమునన్ జగదేక చిత్ర దాం। పత్యము దాల్చు శంభుఁడు...." (అవ. 2)

రాక్షసులు పరమశివభక్తులు. వారు శివుని స్తుతింతురు (1; 67-76). హరిభట్టు శివభక్తికి ఇది నిదర్శనము. కాకున్నచో ఆ పద్యము లంత రసభరితములుగా నుండఁజాలవు. ఇది కావ్యాదిలోఁగల వృత్తాంతము.

హిరణ్యాక్ష హిరణ్యకశిపులు శివునిగూర్చి తపము సేయుదురు. కాని వారు కావించిన శివస్తుతి ఎట్టిదో కవి యక్కడ తెలుపలేదు. ఏదియో సాకుపెట్టి కవి యిట్లు శివస్తుతి కావించుట 'కృతిపతికి రుచింపదేమో!' యని కవి భావించి

* యాజుషీ - శ్వేతాశ్వతరోపనిషత్తు, 4-5.

నట్లున్నది. మొదట రాక్షసులకు సాక్షాత్కరించిన శివస్వరూపము (1-65), తరువాత హిరణ్యాక్షునకు పొడగట్టిన శంకర రూపము (2-23) రెండును సీసపద్యములోనే వర్ణింపఁబడియున్నవి. అవి శ్రీనాథుని గడుసుపోకడలోని సోయగమును తలఁపునకు తెచ్చును. హిరణ్యకశిపునకు ప్రత్యక్షమైన శివరూపము వర్ణింపఁబడలేదు.

ఈ పురాణమునకు వక్త రోమశముని హరిభక్తుఁడు. శ్రోత మార్కండేయ మహర్షి హరభక్తుఁడు, ఈ యుభయుల సమ్మేళనము, ఉక్తి ప్రత్యుత్తరములు చిత్రములు; విజ్ఞానప్రదములు.

హిరణ్యాక్షునకు గురువు శుక్రుఁడు. ఇతఁ డసురపతికి జగదుత్పత్తిక్రమమును వినిపించుచు (2, 36-146) మధ్యలో విష్ణుమహిమను వివరించుట వింతగ నుండును. హిరణ్యాక్షుఁడు 'జయుఁ'డను విష్ణుద్వారపాలకుఁడు కదా ! సన్నివేశములకు ననుగుణముగా, కథానిర్మితి జరిగినది. కథలలోని కొన్ని యంశము లితర గ్రంథములకు సంవాదములుగాను, విసంవాదములుగాను కానవచ్చుచున్నవి.

ప్రథమాశ్వాసమున శ్రోతృవక్తల సమావేశము కథకు పునాది. జయ విజయులకు కలిగిన శాపముతో ఆశ్వాస మంతమగుచున్నది. ఇతర పురాణములలో-సనక సనందనులు జయ విజయులను శపించినట్లు కలదు. ఇందులో ఇంద్రాదులు శపించినట్లున్నది. ఈ 'ఆదుల'లో ఆ సనకాదులున్నారని భావింపనగునేమో ! (1-163). ఎఱ్ఱనగారి నృసింహపురాణము లోను సనక సనందనాదులు జయ విజయులను శపించినట్లు కలదు (చూ. ఆశ్వా. 1),

ద్వితీయాశ్వాసమున జయుఁడు హిరణ్యాక్షుఁడుగా జన్మించిన వృత్తాంతము కలదు. ఆశ్వాసాంతమున 'యజ్ఞ వరాహావిర్భావము' ఒక సీసమున (2-202) కనులకు కట్టునట్లు వర్ణింపఁబడినది.

ఈ పురాణములో తృతీయాశ్వాసము 'మధ్యమమణి.' (సామాన్యముగా ప్రబంధములలోని తృతీయాశ్వాసములు కవికి ప్రతిష్ఠా జనకములు). ఇందులో – వరాహవిహారము, హిరణ్యాక్ష వధ, భూ సముద్ధరణము, హిరణ్యకశిపు వృత్తాంతము ప్రధాన కథాభాగములు. పోతన భాగవతములోని కథాభాగముతో పోల్చి పరిశీలింపఁదగిన ప్రహ్లాదచరిత్ర యిందుఁ గలదు. ఇందులో నరసింహావిర్భావమున నొక విశేషము కలదు. నృసింహుఁడు స్తంభోద్భవుఁడనుట ప్రసిద్ధము. కాని, తేజఃపుంజమునుండి యవతరించినట్టు ఏ పురాణములోఁ గలదు.

క. ప్రళయానల సన్నిభమై। జలజాధిప కోటికోటి సంకాశంబై
యిల నొక తేజఃపుంజము। కలయఁగ దిశలెల్లఁ గప్పి కనుగొనఁబడియెన్. (3-30)

"....నరసింహాకృతి దాల్చి యందు వెడలె న్నారాయణుండుగ్రుఁడై (3-302). ప్రధానేతివృత్తభాగ మింతటితో ముగిసినది. ఇఁక, ఉపాఖ్యానములు, భాగవతధర్మములు, కర్మయోగరహస్యము, సాలగ్రామమాహాత్మ్యము కలవు. చతుర్థాశ్వాసమున – హరికథామృతచరితము గలదు. పంచమాశ్వాసమున – త్రివిధయోగములు, హరినామ మహత్త్వము, సూర్య చంద్ర వంశానుక్రమము, రెండు ఉపకథలు గలవు.

ఉపాఖ్యానము – పురాణములలో కథనశిల్పమును ప్రదర్శించుటకు ఉపకరించునవి ప్రాసంగికేతివృత్తములు లేదా యుపాఖ్యానములు. ఈ ప్రబంధములో నిట్టి యుపాఖ్యానములు కొన్ని కలవు. అవి తృతీయాశ్వాసమునుండి కాననగును. వానిలోని పేర్లు సాంకేతికములు. తృతీయాశ్వాసములో – విష్ణువర్ధనోపాఖ్యానము (163-206). పంచమాశ్వాసమున-శివశర్మోపాఖ్యానము (16-81); మయూరధ్వజోపాఖ్యానము (160-262).

విష్ణువర్ధనోపాఖ్యానము – పుణ్య పాపఫలముల నుగ్గడించు కథ. పుణ్యఫలములు స్వర్గభోగ్యములు, పాపఫలములు నిరయభోగ్యములు. విష్ణువర్ధనుఁడు సమార్జించిన పుణ్యమునకు ఫలముగా స్వర్గమున సురసుందరీమణులతో సుఖము ననుభ

వించును. ఆ సుఖానుభూతి సంభోగమునముతో, మత్తేభయానముతో సొంపారుచున్నది. హరిభట్టు రతిరహస్యమును రచించిన రసికుఁడు కదా!

ప్రమదంబందుచుఁ జూచు నొక్కెపుడు, రంభా నర్తకీరూపిత
భ్రమకీనృత్య విసార్యమాణవిలస ద్బాహాద్వయీమూల భా
గ మనోహారి సువర్ణరేఖ నిభ రంగత్కాంతి సందోహ వి
భ్రమణోత్పన్న తటిల్లతావలయ సౌభాగ్యంబులన్ నిచ్చలున్. (3-194)

ఈ సమాసగ్రథనము శ్రీనాథుని స్మరణమునకుఁ దెచ్చును. శివశర్మోపాఖ్యానము - ఇది హరినామ మహత్త్వమును దెలుపు కథ. ఇందలి ఉపాఖ్యానములలో నుత్తమమైనది. శివశర్మ కులము పేరు తెలియని యొక బిడ్డను మిక్కిలి వాత్సల్యముతో సంరక్షణ చేసెను. వాని పేరు శీలుఁడు. వాని శీలమునకు తగిన పేరు. కులముకన్న గుణము ప్రధానమను తత్త్వమును బోధించు కథ. ఇది కవియొక్క యాత్మీయతకు దర్పణప్రాయమై యున్నది. శివశర్మకు లేకలేక యొక యాడుబిడ్డ కలిగినది. పేరు వాసవి. బాల్యముననే భర్తను గోలుపోయిన యభాగ్యురాలు. ప్రాయమున వైధవ్యము బహు విషాదకరము. కవి ఇట్లనుచున్నాఁడు.

భవ్య నివాసహేతువగు ప్రాయమొకించుక యంకురింప, భో
గ వ్యవహారయోగ్యమగు కాలమునందు, యనుంగుబిడ్డ వై
ధవ్యము నొందెనేనిఁ, దలిదండ్రుల యేటికి! దానిఁ గన్నవో,
నవ్యయ దుఃఖసాగరమునందు మునుంగరె పీతరాగులున్? (5-31)

ఒకనాఁటి రేయి వాసవి శీలుని చెనకినది. అతఁడు భారత కమునికన్న నుత్తముఁడు.

"తల్లి! నీ, వేలరుదెంచితిట్లు? మన యిద్దఱికిన్ శివశర్మ తండ్రి, దు
శ్శీలము మాను, నా యనుఁగుఁజెల్లెల వీ విధి నీకు ధర్మమే? (5-34)

అని హితము నుపదేశించి సాగనంపెను. ప్రవరునిశీలము, శీలునిశీలము నీ రెంటిని తులనాత్మకముగ శీలించు సాహితీ రసికులకు తారతమ్య మవగతము కాకపోదు.

మూఁడవ యాశ్వాసములో, విష్ణువర్ధనుని నరకయాతనానుభవము వర్ణింపఁబడినది. శివశర్మ కథలో నరకలోక వర్ణనము, జీవుల యాతనానుభవము వివరింపఁబడినది. (5; 55-67)

మయూరధ్వజోపాఖ్యానము -

''సంసార నిస్సార సౌఖ్యముల్ వివరింప। స్వప్నమిథ్యాభోగ సన్నిభములు'' (5-157)

అను తత్త్వమును బోధించుచున్నది. మయూరధ్వజుఁ డొక రాజు; లోభి. రాజధర్మమును విస్మరించినవాఁడు. అతఁడు-

విడిముడి గలిగియు నొరులకు। నిడనేరక, యనుభవింపనేరక, మదిలో
నుడుగని లోభము దాల్చిన। గడుసరి జీవన్మృతుండు కాఁడె తలంపన్! (5-178)

మయూరధ్వజుని స్వప్నానుభవము కథలోని రసవద్దృశ్యము. స్వప్నకథకు మాయాపురము రంగభూమి. అక్కడ చండాల ప్రమదతో పెద్దకాలము కాఁపురము; ఫలితముగ పుత్రపౌత్ర సంతానము; భార్య మరణము; మయూరధ్వజుని

ప్రలాపము - ఇది యంతయు 'వెడమాయఁ గనిన కల' (5-225), ముహూర్తమాత్ర స్వప్నమున చిరకాలాను భూతములైన సుఖదుఃఖములు. రాజు అచ్చెరువు చెందెను. జీవితము స్వప్నానుభూతివంటిదని మునుల యనుగ్రహము వలన గ్రహించెను.

పురాణములలో సామాన్యముగా నిట్టి కథలు కాననగును. మడికి సింగన రచించిన వాసిష్ఠ రామాయణమున-లవణోపాఖ్యానము (2, 214-236), గాధ్యుపాఖ్యానము (4, 98-108) అను రెండు కథలు కలవు. వక్త వసిష్ఠులే. ఈ రెంటిని గలిపినచో నది మయూరధ్వజోపాఖ్యానము వలె కానిపించును. ఆ కథలకున్న పోలికలు మిక్కిలి సన్నిహితములు. సింగన కథ లద్వైతపరములు. హరిభట్టు కథ విష్ణుపారమ్యమును బోధించును. రాధామాధవ కవి రచించిన విష్ణుమాయా నాటకమున పుండరీక వృత్తాంతము కలదు. అదియును కొంతవఱకు నీ కథను పోలియున్నది.

ఇంతకును మయూరధ్వజోపాఖ్యానము - శరీరము లనిత్యములు, విభవము లశాశ్వతములు (అనిత్యాని శరీరాణి విభవో నైవ శాశ్వతః) అను సత్యాంశమును చాటుట కనుసంధింపఁబడినది. కవి యీ కథాముఖమున ''మనుజేశ్వరుల వస్తు జాలమెల్ల విలయమును బొందెఁ గాని తద్విభులవెంట నరుగ దొకటైన" నని వ్రాసియున్నాఁడు. ఈ యభిప్రాయము శ్రీ గురుజ్ఞాన వాసిష్ఠాంతర్గత వరాహోపనిషదర్థ ప్రతిపాదకమైన యజ్ఞవరాహ భగవద్గీత యందలి చివరి శ్లోకములలోఁ గలదు.

> క్వ ధనాని మహీపానాం బ్రహ్మణః క్వ జగంతి వా (129)
> కోటయో బ్రహ్మణో యాతా భూపా నష్టాః పరాగవత్ (130)

విష్ణుపురాణములో (అం. 3, అధ్యా. 6) ఆఖ్యానోపాఖ్యానముల ప్రసక్తి యిట్లు కలదు.

> "స్వయం దృష్టార్థకథనం ప్రాహు రాఖ్యానకం బుధాః।
> శ్రుతస్యార్థస్య కథనముపాఖ్యానం ప్రచక్షతే॥

కవులు దృష్టార్థములను, శ్రుతార్థములను, మనోహరముగ మేళవించి ఉపకథలు వ్రాయుదురు. దృష్టార్థమున సహజతయు శ్రుతార్థమున నూహయు కానవచ్చును. ఇందలి శివశర్మ కథ దృష్టార్థమునకును, మయూరధ్వజోపాఖ్యానము శ్రుతార్థమునకు నుదాహరణములు.

రస స్పర్శ - నేతృ ప్రశంస: వరాహపురాణము ధార్మిక గ్రంథము. ప్రధాన కథలోఁగాని, యుపాఖ్యానములలోఁ గాని సన్నివేశ సంవిధానమునకు ననుకూలముగా రసస్పర్శ యుండును. అంతే. విష్ణువర్ధనుని సురలోక సుఖానుభూతి ఘట్టములో (3, 193-195) శృంగార రసస్పర్శ కలదు. అట్లే శివశర్మ సందర్శించిన యమలోక దృశ్యము బీభత్సమునకు నాకరము (5-57). వరాహమూర్తి హిరణ్యాక్షుని సంహరించు పట్టున వీరరసము వర్ణితము (3, 3-9)

పురాణములలో నాయకప్రశంసకూడ రసపోషణమువలె దృశ్యాదృశ్యముగ నుండును. వరాహ పురాణమునకు వరాహమూర్తియే నాయకుఁడు. అతని మాహాత్మ్య ప్రకటనమే ప్రధానోద్దేశము కావున, విభావానుభావాదులకు అంతగా స్థానముండదు. భక్తిని రసముగా నంగీకరించినప్పుడు ప్రధాన కథ, ఉపకథలు అన్నియు నందులో పర్యవసించును. కథా ప్రయోజనము ననుసరించి, పాత్రచిత్రణము రూపుగాంచును.

వర్ణనములు : శ్రీనాథుని కాలమునకే కావ్యములలో ప్రబంధోచిత వర్ణనములు కథానుగుణములుగా ప్రవేశించినవి. వరాహపురాణము ప్రబంధమని, కావ్యమని కవి పేర్కొన్నాఁడు (అవ; 8, 17). కథకు దీప్తి యవసరము. పతిత

లను, క్రోతలను, పాఠకుల నున్ముఖులఁ జేసికొనుటకు వర్ణనములు తోడుపడును. ఆ వర్ణనములకు సందర్భౌచితి ముఖ్యము కాని, సంఖ్యాధిక్యము కాదు.

మార్కండేయుఁడు రోమశముని యాశ్రమమునకు విచ్చేసెను. ఆ ఆశ్రమ ప్రాంతము ప్రశాంతము, పావనము. భావనలు ప్రసన్నములు. ఇక్కడ వర్ణన మవసరము. వర్ణనమునకు నుచితమైన భావన, భావనకు సరిపడు భాషా ఛందోగతులు ప్రధానములు. ఈ సన్నివేశ రామణీయకము పది పద్యగద్యములలో వర్ణితమై యున్నది.

ఒక యుదాహరణము

సీ. గంధసారమహీజ బంధురోరగరాజ। భుక్త ముక్తంబులై పొదలి పొదలి,
భూసార జలపూర కాసార కుముదాళి। విందు బృందమ్ముపై విడిసి విడిసి,
కోమల మాకంద కుసుమ గుచ్ఛమరంద। కణగణంబుల సొంపు గమిచి గమిచి,
భామినీ సురతాంత భవ ఘర్మజల తాంత। గండమండలములఁ గదిసి కదిసి,

తే. చిన్నివెన్నెల లేఁగొనల్ చిదిమి చిదిమి। పరువు మరువంపుఁదావుల బలసి బలసి,
మునుల తనువుల కింపుగా మొనసి మొనసి। మంద మందానిలము వీచె మలసి మలసి॥ (1-10)

మలయ పవనము హితముగా, మితముగా, మందముగా వీచుట సమ్మోదప్రదము. వాతపోతము మలయము నుండి పొదలినది. ఆశ్రమములోని మునుల తనువుల కింపుగా మలసి వీచినది. పవనగతిలోని సొంపు పద్యగమనములోను, స్పర్శములోని హాయి భావములోను వెలార్చు సుందరమైన సీస మిది.

మఱియొక యుదాహరణము. పంచమాశ్వాసమున చంద్రవంశ ప్రశస్తి కలదు. వంశమునకు మూలపురుషుఁడు చంద్రుఁడు. అట్టివాఁ డెట్టివాఁడై యుండవలయునో ! చూడుఁడు :

సీ. శిరసుపువ్వంబికాజీవితేశ్వరునకు,। నిందిరాధవునకు నెడమకన్ను,
వాకట్టుబదనిక వనరుహశ్రేణికి,। నమృతాశనులకు నాహారఘటము,
గారాపుఁగొమరుండు కలశవారాశికిఁ। గలిమిచేడియకు డగ్గఱినతోడు,
మొగసిరిమందు చెందొగమొత్తమునకును,। జారచోరులకు నంగారవృష్టి,

తే. విరహులకుఁ బెట్టు, చలువల విడిదిమట్టు,। తిమిరముల నెవ్వ, శిశుచకోరముల బువ్వ,
మన్మథుని మామ, కాంతిసంపదల సీమ,। చంద్రుఁ డొప్పారుఁ గౌముదీసాంద్రుఁ డగుచు. (5-145)

పెద్దనకూడ రేవెలుంగు ప్రవరమును పెద్దగా వర్ణించెను (మను, 1-18) పోల్చి చూడనగును. ప్రబంధకవికి మన పురాణకవి 'తీసికట్టు' కాదనిపించును. సంశయమున్నచో నిట్టిదే మఱొక పద్యమును చూడవచ్చును. (2-152)

ప్రబంధోచితమగు వర్ణనములిందు మఱికొన్నింటిని గూడ గమనింపవచ్చును. వైకుంఠపుర వర్ణనము 1, (129-131). సూర్యాస్తమయ చంద్రోదయ ప్రభాతవర్ణనములు (2, 148-155).

పై ప్రకృతివర్ణనము వలెనె, స్వరూప స్వభావ వర్ణనములును హృద్యములై భాసించును. ఉదాహరణముగా వైష్ణవీ మాయాదేవి వర్ణనమును (5-53) గ్రహింపవచ్చును. ఆ వర్ణనములోని 'ఉపమా' రామణీయకము మనోజ్ఞము.

విష్ణుమాయాదేవి ముత్తియపు ముక్కరను ధరించియున్నది. ఆ సోయగము హృద్యమై భాసించుచున్నది. ''చరమ సంధ్యారుణ జలధర రేఖాగ్రంబున వీక్షణీయంబగు నక్షత్రంబు తెఱంగున, నధరపల్లవోపరిభాగంబున నాసాభరణమౌక్తికంబు'' చూపట్టుచుండెను. ఇట్టి సుందర భావన లిందెన్నేని కలవు.

హరిభట్టు శైలి—

కవితా రచనావిధానమునకు శైలి యని పేరు. ''శీలస్య ఇయం శైలీ'' అని వ్యుత్పత్తి. శీలసంబంధిని యని భావము. [1]శీలము సంస్కారజన్య విశేషము. ఇది విలక్షణమై, ఆనందసంధాయకమై యుండును. ఆలంకారికులు దీనిని 'రీతి' యని పేర్కొనిరి. నన్నయ భట్టారకులు ''అక్షర రమ్యత'' యనిరి. శైలి, వ్యక్తిత్వమువలె విభిన్నమై యుండును.

సంస్కృత సాహిత్యములో ఆయా రచనాప్రక్రియల కనుగుణముగా శైలి లేదా రీతి భాసించును. అనగా, [2]కథలయందు, కావ్యములయందు, పురాణములయందు, శాస్త్రములయందు శైలీవిభేదము స్పష్టముగా కానవచ్చును. కాని తెలుగు సాహితిలో నన్నయ శైలి, తిక్కన శైలి, పోతన శైలి ఇత్యాదిగా సహృదయ సంవేద్యములై యున్నవి. మఱొకవిధముగా, పురాణశైలి, ప్రబంధశైలి, శతకశైలి యనియును గుర్తింపఁబడుచున్నవి. ఇతిహాస పురాణముల యందును పురాణశైలితోఁబాటు ప్రబంధశైలికూడ తరతమభేదములతో కానవచ్చుచుండును. కావున, హరిభట్టు రచనము కూడ, ప్రాయికముగా ప్రబంధశైలిలోను, విశేషించి - పురాణశైలితోను సాగినదని భావింపనగును.

పురాణశైలికి భావబోధకత్వము ప్రధాన లక్షణము. ప్రసన్నకథన మున్నపుడే వేదవిహిత ధర్మములు సుగ్రాహ్యములు కాఁగలవు. వివిధ ధర్మములను తేటపఱచుటకుఁగాను హరిభట్టు ద్రాక్షాపాకము నాశ్రయించెను. ఇందు, అన్వయక్లిష్టతకు పదాడంబరమునకు నవకాశము లేదు. సన్నివేశ సందర్భముల ననుసరించి, శైలిలో వైవిధ్యమును ప్రదర్శించుట మహాకవుల లక్షణము.

కథన సందర్భమున—

చతురామ్నాయ విశారదుం డఖిలశాస్త్రగ్రంథ నిర్ణేత, స
త్క్రతునిర్ధూత సమస్త కల్మషుఁడు, రాగద్వేషదూరుండు, సు
వ్రతుఁ డొప్పున్ శివశర్మనా, ధరణిదేవశ్రేష్ఠుఁ; డా సద్గుణో
న్నత చర్యుం డొకనాఁడు ప్రొద్దున నుషస్స్నానార్థియై యేటికిన్. (5-18)

వర్ణన పద్ధతి—

జలజాతంబులు నిద్ర మేలుకొన, నక్షత్రంబు లెందేనియుం
దొలఁగంబాఱ, విహంగ సంఘములు ఱంతుల్ సేయఁ, గహ్లార మం
దలి లావణ్యముజాఱ, జక్కవలు వేడ్కన్ నిక్క, మందానిలం
బెలమిన్ వీవఁ, బ్రభాతమయ్యె జగతిన్ హృద్య ప్రభాస్వీతమై. (2-154.)

---

1 చిత్తప్రసుప్త సంస్కారబోధినీ మోదదాయినీ।
విలక్షణా హి సా శైలీ కవీంద్ర మతికల్పితా॥ (లక్ష్మీ స్వయంవరం)

2 మదమత్తకపోలస్య గతి రన్యా హి దంతినః। కథా కావ్య పురాణానాం రీతయో హి పృథక్ పృథక్॥

వివరణ రీతి—

గిరులన్, వృక్షములన్, సరీసృపములన్. గీర్వాణులన్, పహ్నులన్,
ధరణీదేవతలన్, సముద్రములు, మార్తాండావళిన్, యక్షులన్,
వరలోకంబుల, నాశ్రమంబుల, నదీవ్రాతంబులన్, గోవులన్
హరిరూపంబులుగా నెఱుంగు మమరాహారోల్లసద్భాషణా ! (1-46).

సూక్ష్మాంశ కథనము—

ప్రణవము కామరాజము, ప్రభంజనబీజము, నిందిరా వధూ
మణి నిజబీజయుగ్మము క్రమంబున బిందు సమన్వితంబులై
ప్రణుతికి నెక్కఁ గూర్పనగు భాసురతావక మంత్రమున్, మనో
గణితము చేసి, శాశ్వత సుఖంబులు గాంతురు సజ్జనోత్తముల్. (4-43).

వితర్కము—

అకట ! నిజప్రయోజన సహాయతకై హరి, తానె మున్ను సో
ముకుని సృజించి, క్రమ్మర సముద్రములోన వధించెనన్న, నే
రికి విన నింపు గాదు; విషవృక్షమునైనను బెట్టి, పెంచి, తాఁ
జెకలిచివై చునే కరుణపేరు నెఱుంగని ఘాతుకాత్ముఁడున్ ? (4-85)

పురాణ రచనకు దీప్తి నిచ్చునది శైలీ విశేషము. విషయ బోధనానుకూలముగ పదసంయోజనము, *ఛందో గతి మారుచుండును. ఈ దృష్టిలో హరిభట్టు రచన నన్నయ రచన వంటిది. శైలీ ధారాళ ధోరణి పురాణ పఠనమున కుత్సాహమును కలిగించును. సంస్కృత పురాణములకు 'అనుష్టుప్' శ్లోక ముపకరించును. తెనుఁగు పురాణములకు కంద గీత సీసములు తోడుపడును. తిక్కన – కందములయందము, శ్రీనాథుని – సీసముల చెలువు, హరిభట్టు కవితలో సాక్షాత్కరించుచుండును.

పోతన కవిత శబ్దాలంకార భూషితము. దానికొక ప్రయోజనమున్నది. భక్తిరస ప్రధానమగు రచనలలో స్తుతులు మెండు. భావములు, పదములు పునరుక్తములగుచుండును. పాఠకులకు విసుగు జనించును. తన్నిరాసమునకై

* వరాహ పురాణములోని పద్యముల పట్టిక

| | ఉ. | చం. | శా. | మ. | మత్త. | స్వాగ | మాలిని | లయ వి. | లయ గ్రా. | కం. | సీ. | తే.గే. | ఆ.వె. | శ్లో. | మొత్తము |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| అవ. | 6 | 2 | 7 | 4 | | | | | | 12 | 9 | 3 | 1 | | 44 |
| ఆ. 1 | 19 | 24 | 3 | 15 | 1 | | 1 | | | 67 | 27 | 7 | 3 | | 167 |
| 2 | 22 | 27 | 10 | 14 | | | 1 | | 1 | 55 | 24 | 10 | 12 | | 176 |
| 3 | 39 | 29 | 13 | 14 | | | 1 | | 1 | 96 | 35 | 21 | 18 | | 267 |
| 4 | 32 | 28 | 4 | 16 | 1 | 1 | 1 | | | 63 | 27 | 19 | 5 | 1 | 198 |
| 5 | 28 | 40 | 7 | 19 | | | 1 | 1 | | 74 | 30 | 27 | 11 | | 238 |
| మొత్తము | 146 | 150 | 44 | 82 | 2 | 1 | 5 | 1 | 2 | 367 | 152 | 87 | 50 | 1 | 1090 |

పోతన అనుప్రాసాదులను సంఘటించి, పద్యములను శ్రవణ సుఖదములుగా మలిచివేయును. హరిభట్టు కూడ నిట్టి సందర్భములందు పోతన ననుకరించి, తన శైలిని శబ్దాలంకారములతో మెఱుఁగుపఱచెను. ఇతని కవితలో నన్నయధారాధారాళధోరణి, తిక్కన తెనుఁగుందనము, ఎఱ్ఱన ఉక్తివైచిత్రి, శ్రీనాథుని యెత్తుగడ, పోతన యనుప్రాసములు మేళవించుండును. దానికితోడు హరిభట్టు 'సారస్వత నిరాతంకుఁడు; అష్టఘంటావధాన పరమేశ్వరుఁడు'. కావున, అకుంఠిత పాండిత్యము, అత్యాశుకవితాధార యతని కవితలో భాసించుచుండును.

అనుసరణములు—

హరిభట్టు కవిత్రయమువారిని, శ్రీనాథ పోతనలను గౌరవించి. యనుసరించిన రచనా ప్రస్థానములిందు చాల కన్పట్టుచున్నని. ఈ ప్రబంధమును పరికించువారి కది కరతలామలకము. మచ్చునకు – ఒకటి రెండు.

1. పోతనార్యుని అంత్యానుప్రాసము ననుకరణము—

శా. చండస్ఫూర్తివటుండు కాంచె బహుధాజల్పన్నిశాటంబు, ను
ద్దండాహూత మునీభ్యబిభ్యదమృతాంధ స్స్పర్ధ కూటంబు, వే
దండాశ్వధ్వజినీ కవాటము, మహోద్యద్ధూమ సంఛన్న మా
ర్తండ స్యందనఘోటమున్, బలిమఖాంతర్వేదికా వాటమున్. (భాగ; 8–529)

ఉ. స్వర్వనితావిహార విలసద్వనయూటము, శేముషీ తపః
కుర్వదనేక మౌనియుత కూటము, శాఖిశిఖా నిరుద్ధ స
ప్తార్వరథోరుఘోటము, ననంతవనాటము. శోభమాన సౌ
పర్వణ పర్వత ప్రవరభర్మ కిరీటము, హేమకూటమున్. (వరాహ; 2–19).

2. పోతనార్యుని 'భాగవతాఖ్య కల్పతరువునకు' ననురూపముగా, . హరిభట్టు 'రవి వంశస్వర్గ భూజమును' ప్రోదిచేసెను.

మ. లలితస్కంధము, కృష్ణమూలము, శుకాలాపాభిరామంబు, మం
జులతా శోభితమున్, సువర్ణ సుమనస్సు జ్ఞేయమున్, సుందరో
జ్జ్వలవృత్తంబు, మహాఫలంబు, విమల వ్యాసాలవాలంబునై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరు వుర్విన్ సద్ద్విజశ్రేయమై. (భాగ; 1–22)

మ. హరితేజో నవబీజకంబు, మనువర్యాంకూర, మిక్ష్వాకు బం
ధుర కాండంబు, దిలీపముఖ్య నృపతిస్తోమోరుశాఖంబు, దా
శరథి స్వచ్ఛఫలంబునైన రవివంశస్వర్గభూజంబు, త
త్పురరాజంబను నాలవాలమున నొప్పున్ సద్ద్విజావాసమై. (వరాహ, 5–114)

3. శ్రీనాథుని చాటుపద్యములకుఁ గల ప్రచార మనన్యసామాన్యము. అందొక చాటువులోని యశ్లీలమును తొలఁగించి, హరిభట్టు అనుకరించిన విధానము శ్లాఘ్యము. ఎత్తుగడ, నిర్వహణము హృద్యము.

శ్రుతిశాస్త్రస్మృతులభ్యసించుకొని విప్రుండంత నానాధ్వర
వ్రతుఁడై పోయి కనుం, బురందరపురారామద్రుమానల్పక
ల్పతరుప్రాంత లతాకుడుంగ సుఖసుప్తప్రాప్త రంభాభగ..
ప్రతిరోమాంకుర పాటనక్రముకళా పాండిత్యశౌండీర్యమున్. (చాటువు)

శ్రుతిపారంగతుఁడై సదక్షిణ మఖస్తోమంబు పాటించి, సం
గతపుణ్యుండగు భూసురోత్తముఁడు, నాకంబందుఁ బ్రాపించు, నూ
ర్జిత కల్పద్రుమమంజరీ మధురమైరేయామృతాస్వాద గ
ర్వితగీర్వాణ వధూ నితంబభర సేవీ మోక్ష సత్సౌఖ్యముల్. (వరాహ, 2-83)

4. మాదయ్యగారి మల్లన రచించిన రాజశేఖర చరిత్రములో, తేటగీతిలో నాలాపింపఁబడియున్న భావమించుక మార్పుతో నొక యుత్పలములో నిందు వాసించుచున్నది. ఎవరెవరి ననుకరించినను ఆ భావము మాత్రము హృద్యము.

నీలకంఠుని శిరసుపై నీళ్లు చల్లి। పత్తిరిసుమంత యెవ్వఁడు పాఱవైచుఁ
గామధేనువు వానింటి గాడిపసర। మల్ల సురశాఖి వానింటి మల్లెచెట్టు. (రాజ; 1-65)

నీకలితోత్తమాంగమున నీళ్లను దోసెఁడు చల్లువాఁడు మం
దాకిని మోచుఁ, బువ్వొకటిఁ దానిడువాఁడు ప్రసన్నచంద్రరే
ఖాకుసుమంబుఁ దాల్చు, సిరిగంద మలందినవాఁడు మన్మథ
ప్రాకటభూతిఁ గైకొనుఁ, బురాకృతపుణ్యఫలంబు తప్పునే! (వరాహ, 1-76)

5, కృతిపతి యెఱ్ఱయ హరిభట్టును కొనియాడిన తీరును, తెనాలి రామకృష్ణుని అతని కృతిపతి యభినందించిన విధము నొక్క రీతిఁ గలదు,

అమృతప్రాయవచోవిశేష రచనాహంభావపుంభావవా
గ్రమణీమూర్తివి, వేదశాస్త్రవివిధగ్రంథార్థనిర్ణీతి వే
కముఖబ్రహ్మవు, యాజుషప్రకటశాఖాధర్మధుర్యుండ వ
ర్యమతేజుండవు రాఘవార్యహరిభట్టా! సత్కవి గ్రామణీ [వరాహ, అవ, 16]

ఉదయం బస్తనగంబు సేతువు హిమవ్యూహంబునుం జుట్టిరా
విదితంబైన మహిన్, మహాంధ్ర కవితా విద్యాబల ప్రౌఢి నీ
కేదు రేరీ? సరసార్థబోధఘటనా హేలాపరిష్కార! శా
రద నీ రూపము, రామకృష్ణకవిచంద్రా! సాంద్ర కీర్తీశ్వరా! (పాండు, 1-27)

6. విభిన్న వ్యక్తిత్వముగల యిరువురు కవులలో సమానభావము లచ్చుగ్రుద్దినట్లు కానవచ్చుట చిత్రము వేమన హరిభట్టును అనుకరించెనా? లేక హరిభట్టు వేమన ననుసరించెనా? నిర్ణయము దుష్కరము.

ఆ. వె. లోభివానిఁ జంప లోకంబు లోపల మందు మాకు వలదు, మాట గలదు,
పైక మడిగినంత భగ్గునఁ బడి చచ్చు ॥విశ్వ॥

చ. ఘనతరకష్టలోభిఁ దమకంబునఁ జంపెడునంత యల్క నె
మ్మనమునఁ బుట్టెనేని, విష మారణకర్మ కృపాణ ముఖ్య సా
ధనములు గూర్పనేల ? ప్రమదంబున డగ్గఱి, కాసువీస మి
మ్మనుటయె చాలు, వాని నిమిషార్ధమునన్ మృతిఁ బొందఁజేయఁగన్. (వరాహ, 5-184)

7. ఒక పదబంధము.

ప్రాణము ప్రాణము – మిక్కిలి ప్రియము.

ప్రాణము ప్రాణమైన ప్రియభామిని (వరాహ, 4-142)
నిర్భరకరుణాధురీణ యగు ప్రాణము ప్రాణము తల్లి........ (శివరాత్రి. 3–19)
ప్రాణము ప్రాణమైన తనయామణి (రాజశే, 3-137)

సుకుమార మానసుఁడు గొం
తికిఁ బ్రాణము ప్రాణమితఁడు....(భార, విరాట, 5-328)
శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనః యద్వాచో హ వాచం స ఉ
ప్రాణస్య ప్రాణః [కేనోపనిషత్తు, ప్ర. ఖం. 2]

8. ఒక నానుడి.

అంగారకపాలములో కమలము. కుంపటిలో తామర యని దీని భావము. ఇది లోకమున అసంభవము. కవిలోకమున సంభవము. జన్యజనకభావమున వైరుధ్యము కనుపట్టుట యిందులోని విశిష్టత. హిరణ్యకశిపుఁడు తామసవృత్తిప్రధానుఁడు; విష్ణుద్వేషి. వాని కడుపున పుట్టిన ప్రహ్లాదుఁడు సాత్త్వికమూర్తి; పుట్టినదాదిగా విష్ణుభక్తుఁడు. ఈ విరుద్ధ సంఘటనమును పై నానుడి వివరించును.

క. నీ మగని తేజమున నుద్దామశమ సమగ్రుఁడనఁగఁ దగి 'కుంపటిలోఁ
దామర' మొలచినక్రియఁ, దన్వీ ! మునినిభుఁడైన సుతుఁడు నీకుదయించున్.
[ఎఱ్ఱన-నృసింహ. 3–127]

క. నారాయణ భక్తి కళా పారాయణుఁడగుచుఁ బుట్టె బ్రహ్లాదుం, డా
వీరాగ్రగణ్యునకు 'నంగారకపాలంబులోనఁ గమలము' వోలెన్. [వరాహ, 3-224]

క. గ్రామగ్రామంబున నొక సామంతునకిడిన చలువ చప్పరములు త
న్సైన్య, మేదినిఁ 'గుంపటిలో తామరలుం' బోలె నట్టితఱి నొప్పారెన్. [ఆముక్త. 2-69]

నృసింహ పురాణమందలి పద్యము, వరాహ పురాణమందలి పద్యము నొకే సందర్భమును – హిరణ్యకశిపునకు ప్రహ్లాదుఁడు జన్మించిన తీరును – తెలియఁజేయుచున్నది. ఎఱ్ఱనగారి నానుడిని హరిభట్టు సంస్కృతీకరించుకొనెను. తెలుఁగు పలుకుబడికి ముగ్ధుఁడై రాయలు యథాతథముగ స్వీకరించి, గ్రీష్మ వర్ణనమున జోడించెను. ఇందు సన్నివేశ వైరుధ్యము – నిప్పులు గ్రక్కు ఎండలలో చలువ చప్పరములు – కుంపటిలో తామరల వలె సొంపారెను. ముగ్గురు కవులును ఒక లోకోక్తి నింత యందముగా, కందములోనే పొందుపఱచియుండుట గమనింపఁదగిన విషయము.

9. సమాసగ్రహణము

నన్నయ – నిరాతంకమతి; తిక్కన – హృదయాహ్లాది. ఈ యభిప్రాయమున హరిభట్టుసమ్మతి కలదు.

1. క. పంకజభవ సన్నిభుఁ డషు। పంకక్షాళన మహాతపస్సలిలుఁ డనా
తంకమతి పైలశిష్యుఁ డు। దంకుండను మునివరుండు తద్దయు భక్తిన్ [భార. ఆది. 1-91]

ఉ. పంకజనాభుఁ డాత్మపదభక్తుల............"నిరా
తంకమతి"న్వహింపఁడె యతండు ఋషప్రముఖావతారమున్ [వరాహ. 4-77]

2. మ, 'హృదయాహ్లాది' చతుర్థమూర్జితకథోపేతంబు నానారసా
భ్యుదయోల్లాసి విరాట పర్వము............[భార. విరాట. 1-7]

క. ఏది నిమిత్తము విష్ణుం। డాదివరాహస్వరూపముగుటకు ? 'హృదయా
హ్లాదిని'యగు నాకథ నా। కాదరమునఁ దెలియ నొడువు మమలచరిత్రా! [వరాహ 1-55]

10. భావగ్రహణము

భారత భారతీసముద్రమును దఱియంగ నీఁదుటకు విధాతృనకైన నెన్నుటకు నలవికాదు. అట్లే పరమశివుని గుణగణములు నలువకైన నెన్నుటకు నలవికాదు. ఇఁక విష్ణుమాహాత్మ్యమును ప్రబోధింపని చదువు చదువే కాదు.

చ. అమలిన తారకా సముదయంబుల నెన్నను, సర్వవేద శా
స్త్రముల యశేషసారము మువంబునఁ బొందను, బుద్ధిబాహు వి
క్రమమున దుర్గమార్థజలగౌరవ భారత భారతీ సము
ద్రముఁ దఱియంగ నీఁదను విధాతృనకైనను నేరఁబోలునే ? [భార. ఆది, 1-19]

ఆ. వె. భూ పరాగముల, శమీ పలాశములఁ,దా। రల, సుదగ్రవృష్టిజలకణముల
నెన్నవచ్చుఁ గాని, యీశ ! మీగుణములు। నలువకైన నెన్న నలవికాదు; [వరాహ. 1-73]

ఎ.గీ. చక్రహస్తుని బ్రకటించు చదువు చదువు [భాగ. 7-164]

ఆ.వె. చక్రిఁ దెలుపలేని చదువు చదువె [వరాహ. 3-261]

వరాహపురాణము హరిభక్తి కథాత్మకము, వైజయంతీవిలాసము హరిభక్త కథాత్మకము. సారంగు తమ్మయ వరాహపురాణమును చదివియుండును. దేవాలయముపై రావి మొలచినచో నది సుభద్రమైన గుడినే గుల్ల చేయునఁట!

ఉ. న్యాయపథంబు దప్పి,కులనాశకుఁడై జనియించె వీఁడు, దే
వాయతనంబుఁ గూల్చుటకునై యుదయించిన రావి పోలె......[వరాహ. 3-263]

ఉ. కాకులు రావిపండ్లు తిని కార,శిలామయ దేవమందిరా
నీకములందు రావులు జనించును, సజ్జనచిత్తవృత్తి య
వ్యాకులలీల బాతిగుడివంటిది, లోకములోన వేశ్యలున్
గాకులవంటివార, లటుగానఁ బ్రమాదము చేరనిచ్చినన్ (వైజయంతీ, 2-98)

మడికి సింగన పద్మపురాణము నాంధ్రీకరించెను. అందు సప్తమాశ్వాసములో వరాహావతారకథ సంగ్రహముగాఁ గలదు (ప. 11-24). సాలగ్రామ మహత్త్వముకూడ ఒకచోటఁ గలదు. అందొక పద్యము హరిభట్టు రచనముతో సంవదించుచున్నది.

క. సాలగ్రామశిలా ప్ర। క్షాళిత తీర్థంబుఁ గ్రోలి, కమలోదరు ది
వ్యాలయముఁ జేరి, యెన్నఁడుఁ। గ్రోలఁడువో నరుఁడు మాతృకుచదుగ్ధములన్. (వరాహ. 1-110)

క. విను సాలగ్రామశిలా। వినుతజలం బానునతఁడు, వెండియు జననీ
స్తనపాన మాచరింపక। ఘనముగ వైకుంఠమునను గాఁపురముండున్. (పద్మపు. 2-122)

11. ఒక ప్రౌఢభావన.

లోకమున 'తేజస్తిమిరన్యాయము' అని యొక ఉక్తి కలదు. విరుద్ధవస్తుసమావేశము (అసంభవము)న దీని నుదాహరించుట కలదు. వెలుఁగున్నచోట చీఁకటి యుండదు. చీఁకటి యున్నచోట వెలుఁగు లేదనియే కదా! ఈ రెంటి నేకత్ర సమావేశపఱచుటెట్లు? అసాధ్యము. కాని, కవికి సాధ్యము కానిది లేదు. 'రవి గాననిచోఁ గవి గాంచునే కదా': చూడుఁడు.

ఉ. తామరసాప్తకాంతి సముదాయముతోడుత నంధకారముల్
ప్రేమదలిర్పఁ జెల్మి యొనరించునొకో! యనఁ బొల్చుఁ, దన్మరు
ద్ధామమునందు వప్రసముదంచిత నిర్మల పద్మరాగ సు
త్రామమణిప్రభల్ నభముఁ దార్కొని యొక్కటఁ గూడి పర్వినన్. (వరాహ. 2-86)

నాకపురమందలి వప్రము లాకాశము నంటుచున్నవి. పెద్దనగారి పలుకులలో చెప్పఁదలఁచినచో, ఆ వప్రస్థలులు చుంబితాంబరములు. వానిలో అశేషపద్మరాగములు, ఇంద్రనీలములు ఖచితములై యున్నవి. ఆ మణులకాంతులు పరస్పరము కలసిమెలసి యెగఁబ్రాకుచున్నవి, పద్మరాగము లెఱుపు. కావున వాని కాంతి సూర్యుని తేజమువలెను, ఇంద్రనీలము నలుపు, కాఁబట్టి వాని ప్రభ తిమిరమువలెనుఉండి, ఒకదానితో నింకొకటి కూడుకొని, మైత్రీభావము నెఱపుచున్నట్లు భాసించెను -అని భావము. సొగసైన యుత్ప్రేక్ష.

12. వర్ణ్యవైభవము.

పురాణములయందు వరాహావిర్భావ మద్భుతముగా వర్ణింపఁ బడియున్నది. ఒక సీసములో మూసపోసినట్లున్న యా యా కవులరచన ప్రౌఢగంభీరముగా, వర్ణ్యవస్తువును కనులముందు సాక్షాత్కరింపఁ జేయుచున్నది. పోల్చి చదువుకొనువారి కాపద్యములు హృద్యములు.

సీ. కఠినసటాచ్ఛటోత్కటజాత వాత ని। ర్ధూత జీమూతసంఘాత మగుచు,
క్షురనిభ సునిశిత ఖురపుటాహత చల। త్ఫణిరాజదిగ్గజప్రచయ మగుచుఁ
జండదంష్ట్రోత్థ వైశ్వానరార్చిస్స్రువ। ద్రజత హేమాద్రి విస్రంభ మగుచు,
ఘోరగంభీరఘుర్ఘుర ఘూరి నిస్వన। పంకిలాఖిల వార్ధి సంకులముగఁ

తే. బొరలుఁ, గెరలు, నటించు, సంబరము దెరల। రొప్పు, నుప్పరమెగయును, గొప్పరించు,
ముట్టె బిగియించు,మసమస మూరుకొనుచు। నడరు సంరక్షితక్షోణి, యజ్ఞఘోణి. (భాగ. 3-414)

సీ. కొండిపాటిన మేనిగరులు బ్రహ్మాండంబు కనుపపూబంతి కక్కజముదోఁప,
ఖురపుటంబునఁ గీలుకొని మేదురధరంబు మువ్వలోపలి జాతిమురువు వడయ,
దీర్ఘ కంఠ కఠోర ఘుర్ఘురస్వనమునఁ బాతాళగోళంబుఁ బాతలింప,
నీలాంబుదశ్యామ నిబిడదేహచ్ఛాయఁ బ్రళయాంతకాలంబుఁ గొలఁకరింప,

తే. సప్తపాతాళములక్రిందఁ జాఁగిపడిన యవనినెత్తె నిశాత దంష్ట్రాంకురమున
నభినవ స్తబ్ధరోమ దివ్యావతారుఁ డంబురుహలోచనుండు కల్పాదియందు. (శివరాత్రి. 1-61)

సీ. ఘనతర ఘోణాగ్రమున నొక్కచో ధాత్రి ఘుర్ఘురధ్వనులతోఁ గుద్దలించుఁ,
బాదుగా నిల్చి సంభ్రమమున నొకచోటఁ గొనవెంట్రుకలు నిక్కఁ గొప్పరించుఁ,
గఠినవాలము బెట్టుగాఁ దీసి యొకచోటఁ గడిమిమై రొప్పుచు గద్దరించు,
భూరిదంష్ట్రాటంకముల గ్రుచ్చి యొకచోట నగముల నడువీథి కెగురఁజిమ్ముఁ.

తే. జరణఖుర ఘట్టనంబుల జలధిమధ్య జంతుజాలంబు నొకచోట సంహరించు,
దుష్టశిక్షణ భక్తవిశిష్ట రక్ష ణాకులంబైన యమ్మేటి యేకలంబు. (వరాహ. 3-4)

సీ. పోరిఁ గాలుద్రవ్వుచో గొరిజల తాఁకున నురగఫణామణు లొరసిరాలఁ,
దజిమి క్రోడాడుచో దంష్ట్రానిలంబున దివ్యవిమానముల్ తెరలిపాఱఁ,
గెరలి దిగ్గనఁబడి పొరలి యుంకించుచోఁ గంపించి జలధులు రొంపిగాఁగ,
దట్టించి ఘుర్ఘురధ్వని సేయునప్పుడు బ్రహ్మాండభాండంబు పాదు కదల

తే. ముట్టెతాఁకున దిక్కు లట్టిట్టుపడఁగ నజభవాదుల చూడ్కి కక్కజముగాఁగ
భూత సంఘములకు భీతి పొడమఁ జేర్చి నిలిచె నత్తఱి జగముల నిలుపఁగోరి. (పద్మపు. 7-22)

ఎ. గీ. యజ్ఞరూపంబుతోడ బ్రహ్మాండమెల్లఁ దానయై నిండి సురలద్భుతంబు నొంద ।
భక్తవత్సలుఁ డిందిరా ప్రాణవిభుఁడు రాక్షసధ్వంసి యాదివరాహ మయ్యె. (వరాహ. 2-202)

యజ్ఞాంగములకు, వరాహాంగములకు నభేద కల్పనమే యజ్ఞవరాహ స్వరూపము – ప్రమాణము.

1 వేదపాదో యూపదంష్ట్రః క్రతుదంతః చితీముఖః । అగ్నిజిహ్వో దర్భలోమా బ్రహ్మశీర్షో మహాతపః ॥
అహోరాత్రేక్షణధరో వేదాంగశ్రుతిభూషణః । ఆజ్యనాసః స్రువస్తుండః సామఘోషస్వనో మహాన్ ॥
ధర్మసత్యమయః శ్రీమాన్ క్రమవిక్రమ సత్కృతః । క్రియాసత్రమహాఘోణః పశుజాను ర్మహాకృతిః ॥
ఉద్గాతాంగో మహాలింగో బీజౌషధిమహాఫలః । వాయ్వంతరాత్మా మంత్రస్ఫిక్ వికృతః సోమశోణితః ॥
వేదిస్కంధో హవిర్గంధో హవ్యకవ్యాతివేగవాన్ । ప్రాగ్వంశకాయో మతిమాన్ నానాదీక్షాభిరాచితః ॥
దక్షిణాహృదయో యోగీ మహాసత్రమయో మహాన్ । ఉపాకర్మోష్ఠరుచకః ప్రవర్గ్యావర్తభూషణః ॥

1 హరివంశమ్, పు. 598, సంశోధిత ముద్రణము, భండార్కర్ ఓరియంటల్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్, పూనా; 1971.

నానాఛందోగతిపథో గుహ్యోపనిషదాసనః । ఛాయాపత్నీ సహాయో వై మణిశృంగ ఇవోచ్ఛ్రితః ॥
భూత్వా యజ్ఞవరాహోఽసౌ ప్రాగధః ప్రవిశద్గురుః । అద్భిః సంఛాదితామూర్వీం స తామర్థత్ప్రజాపతిః ॥
రసాతలతలే మగ్నాం రసాతలతలం గతః । ప్రభుర్లోకహితార్థాయ దంష్ట్రాగ్రేణోజ్జహార గాం ॥
తతః స్వస్థాన మానీయ పృథివీం పృథివీధరః । ముమోచ పూర్వం సహసా ధారయిత్వా ధరాధరః ॥
తతో జగామ నిర్వాణం మేదినీ తస్య ధారణాత్ । చకార చ నమస్కారం తస్మైదేవాయ శంభవే ॥
ఏవం యజ్ఞవరాహేణ భూత్వా భూతహితార్థినా । ఉద్ధృతా పృథివీ దేవీ లోకానాం హితకామ్యయా ॥
ఏ తదనువాదము ఎఱ్ఱాప్రెగ్గడ - హరివంశములో నిట్లు గలదు.

వ. ఆశ్రితాభయప్రదాన విద్యా విదగ్ధుండును, గేవల విదగ్ధుండును, సర్వభూతజ్ఞ చిత్తుండును ప్రవర్తితాఖిల యజ్ఞుండును నగు యజ్ఞపురుషుండు యజ్ఞవరాహదేహం బవ్యాహతబాహులీలా లలితంబును ప్రభూత దివ్యాయుధ కలితం బునుంగా నుద్భవించి,

క. చనుదెంచి పాంచజన్య। స్వనమున దానవుల హృదయ సంపుట భేదం
బొనరించుచుఁ దనునీలిమ। పెనుజీఁకటి గదిసి రిపులు బెగ్గిలి కలఁగన్. (ఉ. భా. ఆ. 9; పు. 247)

13. వర్ణనప్రాగల్భ్యము

చ. కమలినిఁ బుష్పిణిన్ మధువికారవతిన్ ద్విజరాజదూషితన్
ప్రమదముతోడఁ గూడి,యనురాగవశంబునఁ గ్రీడసల్పఁగా,
నమరఁగ రక్తమయ్యెనని,యంబరమున్ విడనాడి, వార్ధిలో
దుమికె శరీరశుద్ధికనఁ,దోయరుహాప్తుఁడు గ్రుంకె నత్తఱిన్ (5–195)

ఈ పద్యమున-సూర్యుఁ డస్తమించెను-అనునది ప్రకృత విషయము. అప్రకృతమైన కాముకవ్యాపారమొకటి యిందు స్ఫురించుచున్నది, కావున నిది సమాసోక్త్యలంకారము. ఆ యప్రకృతార్థమునకు-పుష్పిణి, మధువికారవతి, ద్విజ రాజ దూషిత, ప్రమదము, అనురాగము, రక్తము, అంబరము - అను శబ్దములలోని శ్లేష సాధకమగుచున్నది. అనన్, అను నది ఉత్ప్రేక్షా వ్యంజక శబ్దము. కావున ఉత్ప్రేక్ష.

కవులు వ్యర్థముగా వర్ణన సేయరు. అందులో ఏదే నొక్క ధర్మ సూక్ష్మమును గూర్చియుందురు. *సూర్యోదయ వర్ణనములో నొక ధర్మశాస్త్ర విషయము ప్రతిపాదింపఁబడియున్నది కదా! అట్లే యిందుఁగూడ. రజస్వలా సంపర్కము పాపకార్యము; శాస్త్రదూషితము. అది కావించినవాఁడు తద్దోషపరిహారార్థము స్నానముచేసి పరిశుద్ధుఁడు కావలయును. "స్నాత్వా శుద్ధి మవాప్నుయాత్"అని ధర్మశాస్త్రము నుడువుచున్నది. ఆ నియమమును క్రింది చాటుశ్లోకము రమ్యముగా ప్రతి పాదించుచున్నది.

శ్లో. లతాం పుష్పవతీం స్పృష్ట్వా స్నాతో విమలవారిషు। పునః సంపర్కశంకీవ మందం చరతి మారుతః॥

---

2 స్టార్ ఆఫ్ ఇండియా ముద్రాక్షరశాల, చెన్నపురి, 1901.

* చూ. పరిష్కరణప్రవేశిక, ప. 2–148

14. ఎత్తుగడ

మహాకవులరచనములలో పద్యములయెత్తుగడ ప్రౌఢముగా భాసించుచుండును. అందులోను కవిసార్వభౌముని కరకౌశల మద్భుతావహము. హరిభట్టు, అనుకరించిన యొకపట్టు రమ్యమై తోఁచుచున్నది. దానిలో పోతరాజుగారి కైవాడము కూడ కలదు.

సీ. కబరికాభారంబు కై పెక్కు విరులతో నవటుభాగంబుపై నత్తమిల్ల, (కాశీ, 1-3)

సీ. కబరికాభారంబు గమనవేగంబునఁ గుప్పించి మూఁపున గునిసియాడ. (వరాహ. 1-117)

సీ. కుప్పించియెగసిన గుండలంబులకాంతి గగనభాగంబెల్లఁ గప్పికొనఁగ. (భాగ, 1-222)

ఈ యుదాహరణములు స్థాలీపులాకన్యాయముగా ప్రదర్శింపఁబడినవి.

బిరుదములు:

'బిరు' పదము - అన్యదేశ్యము. దానికి ప్రబల విరోధమని యర్థము. ఆ విరోధమును కలిగించునదే బిరుదము. పూర్వము వంది మాగధులు రాజులను బిరుదావళులతో కైవారము చేసెడువారు. ఆబిరుదములలో నారాజుల వంశప్రశస్తి, రణ వితరణ శౌర్యము, చిహ్నములు కీర్తింపబడును. అవి శత్రురాజులకు కర్ణకఠోరములై భయజనకములై యుండును.

క. బిరు శబ్దంబు విరోధో। త్కరము మహారాష్ట్రభాషఁ, దత్ప్రదవిధులన్
బిరుదములనఁ జను, వానిని ధర బిరుదావళి యొనర్పఁ దగునండ్రు బుధుల్. (కావ్యా. చూ. 4-25)

క్రమముగా నీబిరుదములు కవిరాజులకును సంక్రమించినవి. అవి యాయా కవుల పాండిత్యాతిశయమును, కవితాపాటవమును ప్రదర్శింపఁజేయును. అవి సుకవులకు మోదమును, కుకవులకు ఖేదమును కలిగించును.

హరిభట్టుకు - సహజ సారస్వత, అష్టఘంటావధానపరమేశ్వర యని రెండు బిరుదములు కలవు. పోతనకుఁ గల 'సహజపాండిత్య' హరిభట్టుకుఁ గల 'సహజసారస్వత' యను బిరుదములు సమార్థకములు. సహజసారస్వతుఁడనఁగా, స్వయంపండితుఁడని అర్థము కాదు. అతఁడు ఆచార్యుని సేవించి, యిద్ధబోధమును సంగ్రహింపక పోలేదు. కాని, కష్టించి చదివి నేర్చినదానికంటె నతిశయ శక్తిని పడసినట్లు, భావింపవలసియున్నది. అందుకే కవి-హనుమల్లబ్ధ వరప్రసాద సకల విద్యానవద్య, 'సహజసారస్వత' యని భాగవత గద్యము (స్కం. 12) లో వివరించెను.

అష్టఘంటావధాన పరమేశ్వరుఁడు - ఈ బిరుదము కవికిఁ గల యవధాన కౌశలమును చాటుచున్నది. అంపలి ఘంటశబ్దము లేఖినిని లేదా గంటను పేర్కొనుచున్నది. అష్టఘంటావధానమునకును, నేఁటి అష్టావధానమునకును నిర్వహణ ములో భేదము కానవచ్చును. సాహిత్యములో నుపలబ్ధమగు నవధానప్రసంగము ఇంచుక పరామర్శింపఁబడును.

అవధానమనఁగా—చిత్తముయొక్క యేకాగ్రత. "చిత్తైకాగ్ర్యం అవధానం। చిత్తస్య ఏకాగ్ర్యం బాహ్యార్థ నివృత్తిః। తదవధానమ్" అని వామనుఁడు.

ప్రతిభాప్రదర్శనము, కవితావినోదము, పాండిత్యస్పర్ధ యనునవి యవధానమునకు మూలద్రవ్యములు. బుద్ధిప్రసరణము, ఎనిమిది విషయములపై నున్నచో నది అష్టావధానము. నూఱంశములపై చూపినచో శతావధానము. సంఖ్యానియమ మవధానియొక్క యభీష్టమును, సామర్థ్యము ననుసరించియుండును.

అవధానకళ యెప్పుడు ప్రాదుర్భవించెనో గుర్తించుట కష్టము. మొదట [1]వేదావధానములు ప్రదర్శింపఁబడుచుండి నట్లు తెలియుచున్నది. ఒక ఋక్కు ననులోమ విలోమ పద్ధతిలో చెప్పుట, యా ఋక్కు, ఎందులోనిది ? అందులో ఒకా నొక యక్షరముగాని, పదముగాని యెన్ని పర్యాయములు వచ్చినవి ? యని ప్రశ్నించుట మున్నగునవి వేదావధానములోని యంశములు.

ఆంధ్రదేశమున నారాయణసూరి గొప్పమేధావి. అతఁడు సాహిత్యరత్నాకర కర్తయగు ధర్మసూరికి పెద తండ్రి (క్రీ.శ. 1414-30). ఇతనికి-అవధానేశ్వర శరభఘటా గండభేరుండ-అను బిరుదము కలదు.

వ్యాఖ్యాతృచక్రవర్తి కొలచెలమ మల్లినాథసూరి శతావధాని యని తెలియుచున్నది. అతఁడు ప్రతాపరుద్రునిచే సమ్మానింపఁబడినట్లు లావంశజుఁడు, చంపూరామాయణమునకు పదయోజనమను వ్యాఖ్యను వ్రాసిన నారాయణపండితుఁడు- ఆ వ్యాఖ్యాపీఠికలో తెలియఁజేసి యున్నాఁడు.

[2]"కొలచెల్మాన్వయాబ్ధీందుః మల్లినాథో మహాయశాః। శతావధానవిఖ్యాతో వీరరుద్రాభివర్షితః"

మనకుఁ దెలియవచ్చిన శతావధాన చతురులలో నెల్ల నీతఁడే ప్రాచీనతముఁడు. అద్భుత ప్రతిభాప్రదర్శకమైన యాశతావ ధానచాతుర్యమునకు మెచ్చి కాకతీయ ప్రతాపరుద్రచక్రవర్తి మనపండిత పరమేశ్వరునకుఁ గనకాభిషేక సత్కారముఁ గావించినాఁడు" అని ప్రభాకరశాస్త్రులవారు తెలియఁజేసి యున్నారు.

[3] నాట్యచూడామణి యనుగ్రంథమును వ్రాసిన సోమన యష్టావధాని. ఈ సోమన ఉత్తరహరివంశమును రచించిన నాచన సోమన కావచ్చునని సంస్కృత సాహిత్యచరిత్రమును వ్రాసిన ఎం. కృష్ణమాచార్య లభిప్రాయపడిరి (పు. 1018).

అష్టావధాన విఖ్యాత సోమనార్యేణ వక్ష్యతే। నాట్యచూడామణిర్నామ గ్రంథో విబుధ సమ్మతః॥

ఆంధ్రకౌముది కర్త మండ లక్ష్మీనృసింహ కవి. ఇతఁడు సహస్రావధాని. 'అష్టభాషా సరస్వతి' యను బిరుదు దాల్చినవాఁడు. [4]"ధన్యః సహస్రావధానీ హ్యష్టభాషావిశారదః।

ఆంధ్రదేశమున అవధానకళ మూఁడుపూవు లాఱుకాయలుగా వర్ధిల్లినది. నన్నయ భారతముతో తెనుఁగు సాహిత్యమునకు శ్రీకారము చుట్టెను. అప్పటికే యవధానముకూడ నాదరింపఁబడియుండినది. భారతరచనములో నన్నయ భట్టారకునకు సహకరించి, యుపకరించిన నారాయణభట్టుకు "అష్టావశావధాన చక్రవర్తి"యను బిరుదమున్నట్లు నందంపూడి శాసనము తెలియఁజేయుచున్నది.

[5]"తస్మై సకలజగదభినుత గుణశాలినే, సరస్వతీ కర్ణావతంసాయ, అష్టాదశావధారణ చక్రవర్తినే, నన్ని నారా యణాయ". ఈ శాసన కాలము క్రీ.శ. 23-11-1063.

---

1. సంస్కృత భాషలో కొందఱు శతావధానులు - శ్రీ ఈయుణ్ణి వేంకట వీరరాఘవాచార్యుల వ్యాసము.
2. మీఁగడతఱకలు, పు. 192-194 3. డి.నం. 1239, జి.ఓ.ఎం.ఎల్.
4. డి.నం. 1223, జి.ఓ.ఎం.ఎల్. 5. ఆం.సా.ప. సంపు. 1, సం.1, పు.61.

కొక్కోకమును రతిరహస్యముగా అనువదించిన ఎఱ్ఱయకు అష్టభాషా కవితాప్రవీణ, నవఘంట సురత్రాణ అను బిరుదము లున్నట్లు గ్రంథాంతగద్యము తెల్పుచున్నది. ఇతని యితర గ్రంథము [6]సకలనీతి కథా నిధానము.

'అష్టావధానంబులఁ గ్రీడించు' వారలను, (శివరాత్రి, 4-43) శ్రీనాథుఁడు గుర్తించియున్నాఁడు. అతని సమస్యాపూరణములు ప్రసిద్ధములు. అతఁడు నవధాని యగు నేమో!

చరిగొండ ధర్మన చిత్రభారతమును రచించెను. అతఁడు 'శతలేఖినీ సురత్రాణ' బిరుదభూషితుఁడు (అవ. 17). మఱియును 'నవఘంట సురత్రాణ' బిరుదాంచితుఁడు (ఆశ్వాసాంతగద్య).

నరసభూపాలీయకర్త భట్టుమూర్తి. ఇతఁడు శతలేఖినీ పద్య సంధాన ధౌరేయుఁడు, ఘటికాశత గ్రంథ కరణధుర్యుఁడు, ఓష్ఠ్య నిరోష్ఠ్యజ్ఞుఁడు, ఆశుప్రబంధబంధాభిజ్ఞుఁడు, అచలజిహ్వోక్తి నిపుణుఁడు, తత్సమభాషావితానజ్ఞుఁడు, బహుపద్యసాధిత వ్యస్తాక్షరీధురీణుఁడు, ఏకసంధోదిత శ్లోకభాషాకృత్యచతురుఁడు, ఓష్ఠ్యనిరోష్ఠ్య సంకరజ్ఞుఁడు, అమిత యమకాళునిధి (1-13). ఈ కవితావినోదికి 'నిరుపమానావధాన' యను బిరుదమున్నట్లు గద్యము తెల్పుచున్నది.

రెంటూరి రంగరాజు [7]భానుమతీ పరిణయము – అను ప్రబంధమును రచించెను. ఈ రంగరాజును, కృతిపతి వెలుగోటి రాయనృపాలుఁడును కందాళ శ్రీ రంగాచార్యులకు శిష్యులు. గ్రంథావతారికలో కవియొక్క పాండితీప్రకర్షను వర్ణించు పద్య మిట్లున్నది.

సీ. వ్యస్తాక్షరీధుర్య విస్తీర్ణ భావంబు, క్రముక సంఖ్యాఖ్యాన కౌశలంబు,
నారోహణావరోహణ లేఖనప్రౌఢి, యగ్రపద్య గ్రహణాభిరక్తి,
యనవలోకిత శారికాభిఖేలనరీతి, వరసమస్యాపూర్తి వైభవంబు,
సముదగ్ర శిక్షిత చతురంగబల కేళి – కా విలాసము నేకకాలముననె

తే. యలరఁ, బ్రకటింపనేర్తు వష్టావధాని కలిత శతలేఖినీ పద్యగద్య శక్తిఁ
బాటిమీఱితి వంధ్రకర్ణాటచోళ రాజసభలను రెంటూరి రంగనార్య!

చిత్రకవితా ప్రదర్శనశాలయైనది – [8]ప్రబంధరాజ శిరోభూషణ ప్రకృష్ట బలరామ చరిత్ర. దీనిని గుడారు వేంకట దాసు నిర్మించెను. అతఁడు, అష్టభాషావధానియఁట! పైఁగా—

సీ. బహుళ సందర్భాష్ట భాషావధాన దుష్ప్రాపిస దుష్కరబంధభావ గద్య
పదమైత్రి రస జాతి పద్యశబ్దశ్లేష దురవగాహార్థ విస్తరనిగూఢ
ఘటికాప్రబంధ హృద్గత సమస్యాగీత ఛాయ నావీన నాటక విభేద
భరతకళాశాస్త్ర పాదార్ధ గుప్త్యను లోమ విలోమావలోష్ఠ జిహ్వ

తే. సదుపమాలంకృతి కవిత్వ సాంఖ్యయోగ మంత్ర షట్తంత్ర తత్తంత్ర యంత్ర పార
గంతృ విజ్ఞాననిధి విజ్ఞగమునఁ గవులు నీ సరెవ్వరు వేంకటదాససుకృతి!

6. డి. నం. 858, జి. ఓ. ఎం. ఎల్. 7. అందే డి. నం. 602. 8. అందే డి. నం. 581.

9మిత్రవిందా పరిణయమును రచించిన కుందుర్తి వేంకటాచలకవి కాళహస్తి దేశిక నిట్లభినందించినాఁడు.

సీ. అష్టభాషా మహితాశు ప్రబంధ ని। ర్మితచాతురీధుర్య, శత సహస్ర
లేఖినీ లేఖ్యకలిత కవిత్వాపాద। నాహ్నతవ్యస్తాక్షరాదిచతురుఁ
జలజిహ్వాకాచలాచల జిహ్వాకాచల। జిహ్వాకా రచనా విశేషనిపుణు
నోష్ఠ్యనిరోష్ఠ్య వర్ణోదీర్ణ కల్పనుఁ। గఠినత్రిపాద సంఘటన కుశలు,

తే. నఖిల లక్షణ లక్ష్య సిద్ధాంత పాణి। నీయ కాణాద కాపిలానేకతంత్ర
కోవిదుని, రేవురి కులాబ్ధికుముదబంధుఁ। జెలఁగి మదిఁ గాళహస్తిదేశికు భజింతు.

ఘట్టు ప్రభువు, ఆశుకవితలో గట్టివాఁడయినట్టు లాతని కుచేలోపాఖ్యానము చాటుచున్నది.

సీ. ''ఘటికాశతగ్రంథ ఘటనా సమంచిత చాతుర్యమహిమకుఁ జాలినాఁడ'.

ఆంధ్రదేశమున నిటీవలి కాలమున, అష్టావధాన శతావధానములచే కవితా చైతన్యమును గలిగించినవారు 'కింకవీంద్ర ఘటాపంచానన' ఇత్యాది బిరుదాంచితులు తిరుపతి వేంకటేశ్వరకవులు. వీరిది వశ్యవాక్కు. వీరు

''శతఘంటకవనంబు సల్పుసంగతియన్న। నల్లేరుపై బండినడక మాకు''

అని యవలీలగా అష్టావధాన శతావధానములను కావించి, మించి, జయభేరి ప్రోగించిః ధరణీంద్రులు మ్రొక్కఁగ నిక్కినవారు. వీరి కంటెఁ గొంత పూర్వకాలికులు, శతావధానములో విఖ్యాతి నార్జించినవారు, శ్రీమాన్ మాడభూషి వేంకటాచార్యులుగారు. వీరు 'అభినవ పండితరాయ' బిరుద భూషితులు. వీరి శతఘంటావధానము విశిష్టమైనదఁటః నూఱు కంచుచెంబుల ధ్వనిని విని, చెంబుల సంఖ్యను సరిగా చెప్పెడివారఁట! 'మహాకవీనాం మతయశ్చ భిన్నాః' అనురీతి నొక్కొక్క కవియొక్క ప్రతిభాకౌశలము కూడ భిన్నమై యాశ్చర్యజనకమైనది. అందులకే 'ముఖే ముఖే సరస్వతీ' యను నానుడి యేర్పడినది.

అవధానప్రశంస – 10 'లక్షణదీపిక' యను అముద్రితగ్రంథములో నిట్లున్నది.

"ఆశుకవిత్వంబన్నది యేకపాద త్రిపాద కఠినప్రాస విషమ సమస్యాపూర్తులు. వ్యస్తాక్షరీ సంఘటిత పద్యంబును ఇష్టార్థదేవతావర ప్రతివాది నిషేధాక్షర రచనార్థ చమత్కృతియును, నవఘంట లిఖిత మేకైక మిష్టార్థ దేవతాపరనానా విధవృత్త భేదనిర్మిత రచనార్థ సమర్థతయును, అష్టావధానంబులును, ఘటికాశతగ్రంథ కల్పనయును, ఆకాశపురాణంబు లనియును తత్కాలోచితాతి త్వరిత గతిని రచియింపంబడునది".

ఈ విధముగా, అవధానకళ కాలాను రీతిగా, కవుల ప్రతిభానుగుణముగా, బహుభంగులుగా భాసిల్లినది. అది అభ్యాసమున వశమగు విద్య కాదు. దైవానుగ్రహ లబ్ధము. ప్రాచీనులట్లే భావించిరి.

చిత్రకవిత్వము :

కవితా కల్పవృక్షమునకు ప్రధానశాఖలు నాలుగు. అవి: 1. ఆశువు 2. మధురము 3. చిత్రము 4. విస్తరము. వీనిలో ఆశువు అవధానమునకు; మధురము యక్షగానాది కృతులకు; విస్తరము పురాణాది రచనములకు నుపయుక్తములు.

---

9. అందే డి. నం. 645, 10. డి. నం. 1329, జి. ఓ. ఎం. ఎల్; పు. 189.

ఇఁక చిత్రకవిత. దీనికి ప్రత్యేకముగా ప్రాధాన్యము లేదు. కాని కవులు స్వతంత్రులు. నిరంకుశ ప్రతిభా భాసురులు. ఆ కారణముచేత తమచిత్తవృత్తియే నిదానముగా, ప్రబంధములయందు వివిధ విచిత్ర బంధములను నిబంధించిరి. వీనిని సంస్కృతాంధ్ర కావ్యములందు విశేషముగా కాననగును. సంస్కృతమున సాహిత్యరత్నాకరము, తెలుఁగున అప్ప కవీయము మొదలగు లక్షణగ్రంథములు చిత్రకవితా లక్ష్య లక్షణములను నిర్దేశించియున్నవి.

కావ్యమునకు లక్షణమేమి ? అను విషయమున భిన్నాభిప్రాయములు కలవు. "కావ్యస్యాత్మా రసః" కావ్యమునకు రసము జీవము – అను సిద్ధాంతమును పలువురంగీకరించియున్నారు. ఆ దృష్టితో చూచినప్పుడు, చిత్రకవిత్వములో రసమునకు స్థానము లేదు. 'ప్రాయస్తు యమకే చిత్రే రసపుష్టిర్నవిద్యతే'–యని యాలంకారికుల యభియుక్తి. అయినచో కవులు రసహీనమైన చిత్రకవిత్వము నెందులకు వ్రాసినట్లు ? రసహీనమైనంత మాత్రాన అవి నిష్ప్రయోజకములు కావు. ఉపయుక్తముకాని వస్తువు బ్రహ్మసృష్టిలో మాత్రము కనిపించునా ? చిత్రకవిత్వములో చమత్కారమను గుణవిశేషమొకటి కలదు. అది కొందఱి నాకర్షించును. మఱికొందఱిని 'ఔరా!' యని ముగ్ధులను జేయును. దీనిని లౌకిక దృష్టాంతములతో వివరింపఁదలఁచినచో –సరసకావ్యములు సినిమాల వంటివి. చిత్రకవిత సర్కసువంటిది. రెంటికిని ప్రేక్షకులుందురు. కాని యభిరుచిలో, ననుభవములో, అవస్థలో భేదము కలదు.

చిత్రకవిత్వములో బంధకవిత్వముకూడ చేరియున్నది. బంధములు రసాస్వాదనమునకు ప్రతిబంధకములయినను, దానిబలమువలన సాహిత్యములోని కొన్ని నిగూఢాంశములు బహిర్గతములు కాఁగలవు. దీనికొక దృష్టాంతము.

బిల్హణీయమను కావ్యము పండిపెద్ది కృష్ణస్వామి రచితముగా ప్రసిద్ధిలోనికి వచ్చినది. ఈ సంగతి యాగ్రంథము లోని యవతారికవలన, ఆశ్వాసాంతగద్యమువలన తేట పడఁగలదు. కాని, నిజమున కాగ్రంథమును రచించినది - చిత్రకవి సింగరార్యుఁడు. మరణించిన తరువాత, అతని కుమారుఁడు నారసింహకవి, ధనాశచేతఁ గాఁబోలును, తన తండ్రి రచించిన బిల్హణీయమును, పండిపెద్ది కృష్ణస్వామికి సర్వస్వామ్యముగా నిచ్చివేసెను. తదనుగుణముగా అవతారికను, ఆశ్వాసాంత గద్యములను వ్రాసిపెట్టెను. గ్రంథచౌర్యము జరిగిపోయెను. కంచెయే చేను మేసినచో కాఁచువారెవ్వరు ? తండ్రియొక్క కీర్తిచంద్రుని కుమారుఁడే రాహువై కబళించివైచెను. రహస్యముగా జరిగిపోయిన యీ సంగతి బయలుపడు టెట్లు ?

అసలు కవియే, కావ్యములో ఒకచోట గ్రంథ కర్తృత్వమును నిగూఢముగాఁ దాచియుంచెను, ఆ రహస్యమటు కవికుమారుఁడును, ఇటు కవియశఃకండూతి గల కృష్ణస్వామియును గుర్తించియుండ లేదు. ఇటీవలి విద్వాంసు లారహస్యమును బట్టబయలు చేసి, కావ్యకర్తకు మహోపకృతి చేసినవారయిరి. ప్రథమాశ్వాసాంతమున– ''ధన్యాసింహాభ చంద్ర కీర్తి''యను పద్యము కలదు. అది సామాన్య పద్యము కాదు. చక్రబంధము గల పద్యము. బంధములో మూఁడవ చుట్టున ''సింగరార్య కవి'' యని కృతికర్తపేరు కానవచ్చును. ఈ రహస్యము బంధకవిత్వములో నిగూఢముగా దాఁగి యుండి, యుపకరించినది. కావున బంధాది చిత్రకవిత్వమునకు నొక విధమైన ప్రయోజనము కలదు. లేకున్నచో కవులేల వ్రాయుదురు? పండితులేల శ్లాఘింతురు ?

హరిభట్టు పైన పేర్కొన్న చతుర్విధ కవితలలో నందె వేసిన చేయి. అతని అష్టఘంటావధాన బిరుదము ఆశుకవితా ప్రావీణ్యమును చాటుచున్నది. చిత్రకవితకు వరాహపురాణములోని కొన్ని పద్యములు, బంధములు సాక్ష్యములు కాఁగలవు. మధుర కవిత్వములోకూడ, కవికి నభినివేశము కలదేమో యని యూహించుటకు—

''పదపద్యములు దేశభాషల రచియించి, వెలసిన కవుల కంజలి యొనర్చి (మత్స్య. అవ. 6)

అనెడు స్తుతివాక్యము కొంత యవకాశమును కలిగించుచున్నది. విస్తరకవితకు అతని పురాణానువాదములు లక్ష్యములు.

ఇఁక, వరాహపురాణములో హరిభట్టు చూపిన చిత్రకవితా వైదుష్య మెట్టిదో పరిశీలింపనగును.

1. శ్రీనిత్యుండగు చెన్నమంత్రి సరిగాఁ జింతింతుఁ, దేజో నయ
జ్ఞానైశ్వర్య రుచి స్వరూప జనరక్షా పాత్రదానంబులన్;
భానున్ భార్గవు భారతీరమణునిన్ భర్మాద్రి బాణాసనున్
భానీకప్రభు భావజున్ భరతునిన్ భాస్వత్తనూజాతునిన్. (అవ. 32)

ఈ పద్యములో కృతిపతి వంశ్యులలోని చెన్నమంత్రి వర్ణితుఁడు. అతఁడనేక గుణగణ మండితుడు – అని పద్యభావము. ఆ గుణము లేవి ? వానికి సాటిరాఁగల వారెవ్వరు ? అను ప్రశ్నములకు క్రమాన్వయమున సమాధానము వచ్చును. సాటి వ్యక్తులు లేదా మహనీయులు – అందఱును 'భాదిమ వర్ణయుక్తులే' యగుట చిత్రము.

| గుణములు | సామ్యపురుషులు |
|---|---|
| 1. తేజస్సు (పరాక్రమము)లో | 1. భానుఁడు (సూర్యుఁడు) |
| 2. నయము (నీతి)లో | 2. భార్గవుఁడు (శుక్రుఁడు) |
| 3. జ్ఞానములో | 3. భారతీరమణుఁడు (బ్రహ్మ) |
| 4. ఐశ్వర్యములో | 4. భర్మాద్రి బాణాసనుఁడు (శివుఁడు) |
| 5. రుచి (కాంతి)లో | 5. భానీకప్రభుఁడు (చంద్రుఁడు) |
| 6. స్వరూపము (అందము)లో | 6. భావజుఁడు (మన్మథుఁడు) |
| 7. జనరక్ష (పాలనము)లో | 7. భరతుఁడు |
| 8. పాత్రదానములో | 8. భాస్వత్తనూజాతుఁడు (కర్ణుఁడు) |

2. సవతెంతున్ గొలిపాక యెఱ్ఱనికిఁ, దేజశ్శౌర్య గాంభీర్య స
త్త్వ విభుత్వోక్తి ధనుర్జయోన్నతి శమ త్యాగక్రియా కాంతులన్;
సవితన్ సాత్యకి సింధు సీరి సురశాస్తన్ సూతు సేనాని సైం
ధవనిర్భేదను సోము సౌమ్యును సంతానంబు సస్యాధిపున్. (అవ. 41)

ఇది అక్షరగుణిత వృత్తము. అనఁగా పద్యములో నొక యక్షరముయొక్క (సకారము) గుణితము క్రమముగా కాననగును. కృతిపతియైన యెఱ్ఱమంత్రి బహుగుణములలో వర్ణన కెక్కినవాఁడు. ఇందులో క్రమాన్వయమున ఆతని గుణములు, వానికి సాటిరాఁగల పురుషులు కలరు. వారు గుణితక్రమములో అమరియుండుట యొక చిత్రము.

| గుణములు | సామ్యపురుషులు |
|---|---|
| 1. తేజస్సులో | సవిత (సూర్యుఁడు) |
| 2. శౌర్యములో | సాత్యకి (కృష్ణ సోదరుఁడు) |
| 3. గాంభీర్యములో | సింధువు (సముద్రము) |

| | |
|---|---|
| 4. స_త్త్వము (బలము)లో | సీరి (బలరాముఁడు) |
| 5. విభుత్వములో | సురశా_స్త (ఇంద్రుఁడు) |
| 6. ఉ_క్తి (పలుకు)లో | సూతుఁడు (పురాణవ_క్త) |
| 7. ధనుస్సు (విలువిద్య)లో | సేనాని (సుబ్రహ్మణ్యుఁడు) |
| 8. జయములో | సైంధవ నిర్భేదనుఁడు (అర్జునుఁడు) |
| 9. ఉన్నతిలో | సోముఁడు (శివుఁడు) |
| 10. శమము (నిగ్రహము)లో | సౌమ్యుఁడు (బుధుఁడు) |
| 11. త్యాగక్రియ (దానము)లో | సంతానము (కల్పవృక్షము) |
| 12. కాంతిలో | సస్యాధిపుఁడు (సః + స్యా) చంద్రుఁడు |

ఇటువంటి అక్షరగుణిత పద్యము పారిజాతాపహరణమునఁగూడ కలదు. అది శవర్ణ గుణితము (చూ. 2-57). భకారగుణిత శ్లోకమొకటి సంస్కృత భోజచరిత్రమున కలదు.

భట్టిర్నష్టో భారవిశ్చాపి నష్టః। భిక్షుర్నష్టో భీమసేనోఽపి నష్టః
భుక్కుండోఽహం భూపతి_స్త్వంహి రాజన్! భబ్భావళ్యామంతకః సన్నివిష్టః॥ (పు. 246)

3. సీ. భుజశౌర్య వైభవ సుజనరక్షణములఁ నర హరి విఖ్యాతిఁ బరిణమించి (అవ. 42)

ఇదియు నెల్లనయొక్క మహిమాతిశయమును వర్ణించు పద్యము. ఇందులో 'గూఢతృతీయము' అను శబ్దార్థ వైచిత్రి కలదు. అదెట్టిదనఁగా – సీసపద్యముయొక్క ప్రతిపాదములోను మొదట మూఁడు గుణములు చెప్పఁబడును. వెంటనే యా గుణములకు సాటి రాఁగలవారు ఇరువురు మాత్రము కానిపింతురు. ఆ యిరువురిలోనే మూఁడవ సాటి వ్య_క్తిని గు_ర్తించుటకు నేర్పు–అవసరము కదా! తరువాత, క్రమాన్వయముగా సరిపుచ్చుకొనవలయును. అపుడు అర్థము సుగమము కాఁగలదు. మచ్చునకు మొదటి పాదము వివరింపఁబడును.

| గుణము | సాటివారు |
|---|---|
| 1 భుజశౌర్యమున | 1 నర (అర్జునుఁడు) |
| 2 వైభవమున | 2 హరి (ఇంద్రుఁడు) |
| 3 సుజన రక్షణమున | 1 నరహరి (విష్ణువు) |

ఇందు 3 వ ఉపమానమైన 'నర హరి' క్రమాన్వయములో కానరాదు. కాని, సమా_ప్త పునరా_త్తముగా మొదటి, రెండవ యుపమానముల నేకముగా స్వీకరించి, దానిని మూఁడవ ఉపమానముగా అన్వయించుకొనవలయును. తక్కిన మూఁడు పాదములకు ఇట్లే సమన్వయము.

4. బంధకవిత్వము ;

నాగబంధము. (చూ. అనుబంధము 1, ప. 1-188)

[1]దీని లక్షణము

మ. సరిగా నల్ నవకోష్ఠముల్ నెఱపి, లో సందంశరీతిం బర
స్పర రేఖల్ గదియించి, పార్శ్వము లధోభాగంబు కోణంబులుం
బరివేష్టింపఁగఁ జుట్టి, పుచ్ఛముఖముల్ ప్రాగ్రేఖలం దీర్చి, స్ర
గ్ధరయో, చంపకమాలయో యొగి నిడంగా నాగబంధంబగున్.

చక్రబంధము. (చూ. అనుబంధము 1, ప. 2-204)

దీని లక్షణము

మ. పయిఁబైఁగా బదిచుట్లు నాఱుదళముల్ ప్రాగ్రేఖలం దీర్చి, స్వా
హ్వాయ పత్యాహ్వాయ ముఖ్యచిహ్నములు గన్పట్టంగఁ బాదత్రయా
శ్రయ రేఖాంత్య పదాశ్రయాదివృతిగా, శార్దూలవిక్రీడితా
హ్వాయవృత్తంబు యథాక్రమంబుగ లిఖింపం, జక్రబంధంబగున్.

వరాహపురాణ చక్రబంధములో కృతి, కృతికర్త్ర, కృతిపతి నామములు గలవు.

గోమూత్రికాబంధము. (చూ. అనుబంధము 1, ప. 3-312)

[3]దీని లక్షణము

కుటిలంబై పొడవై మిథోఽభిముఖమౌ గోమూత్రరేఖాకృతి
స్ఫుటరేఖాద్వయి, రెండు గీట్ల నడుమం బొందించియో, లేక త
త్పుటు రేఖాంతరగేహ పంక్తి యుగళిన్ వాల్నిల్పి యొండొంటఁ బ
ల్కుటకర్థంబుగనో ఘటింతురు కవుల్, గోమూత్రికాబంధమున్.

5. సీ. సకలజగన్నాథః శంఖచక్రాంకితః జలజాలయాధీశః జలజనయనః [4-108]

ఇది నిరోష్ఠ్యసీసము. ఓష్ఠ్యములు—ఉ ఊ ఒ ఓ ప ఫ బ భ మ - అను అక్షరములు లేని పద్యము. మరింగంటి సింగరాచార్యులు దశరథరాజనందన చరిత్ర (నిరోష్ఠ్య రామాయణము) రచించెను. ఇతఁడు శతఘంటావధానాదుల ప్రదర్శించిన కవి. కందుకూరి వీరేశలింగం పంతులుగారు శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధమును రచించినారు.

---

1, 2, 3 మండపాక పార్వతీశ్వరకవిగారి - ప్రబంధ సంబంధ నిబంధన గ్రంథము; అముద్రిత గ్రంథ చింతామణి; సంపు. 5, సం. 12, (1892).

6. సీ. దేవ దేవేశ్వర దేవారిఖండన, నిత్య నిత్యోదయ నిత్యచరిత....(1-138)

ప్రతి సీసపాదమును రెండుగా విభజింప వలయును. వానిలో ఒక్కొక్క విభాగములో నొక్క పదము పునరావృత్తమగుచుండును. ఇదియే యిందలి వై చిత్రి.

7. ఆ.వె. కువలయప్రమోదకుండగు రాజు లే! కున్న సత్పథంబు వన్నె దిగదె ?
కువలయప్రమోదకుండగు రాజు లే! కున్న సత్పథంబు వన్నె దిగదె ? (5-91)

ఈ పద్యములోని ప్రథమ ద్వితీయపాదములే తృతీయ చతుర్థ పాదములుగా వచ్చినవి. ఇది యమక మను శబ్దాలంకారము.

8. 1. రోషదూర శమ రూపిత వేషా! వేషయోగ్య.... (4-226)

2. ఫణిశయన చరణకమల.... (4-227)

పై రెండు పద్యములయందు ముక్తపదగ్రస్తమను శబ్దాలంకారము కలదు.

ఈ వరాహపురాణమున 'గర్భకవిత' కానరాదు.

హరిభట్టు చిత్రకవిత్వము వ్రాసినను, అవి కథా గమనమునకుఁగాని, రసస్ఫూర్తికిఁగాని యాటంకము కాలేదు. రసస్ఫురణము లేని కావ్యము నిష్ఫలమని (1-39) కవితలంపు. కావున, ఆ పద్యములనన్నింటి నవతారికలోను, ఆశ్వాసాంతములలోను, స్తుతులలోను నిక్షేపించియుండుట కవియొక్క యౌచిత్య పరిజ్ఞానమునకు నిదర్శనము.

లక్షణప్రతి

ఈ విభాగములో ఛందో వ్యాకరణ విశేషములు ప్రదర్శింపఁబడును. కవిత వనితవలె లక్షణవతిగా నుండ వలయును. అపుడే పుట్టినయింటికి (కవికి), మెట్టినయింటికి (కృతిపతికి) కీర్తి వచ్చును.

లాక్షణికులు హరిభటుకవితను ప్రమాణముగా కైకొనిరి. అప్పకవికి గ్రంథము లభింప లేదు. కాని కూచిమంచి తిమ్మకవి యీ వరాహపురాణమునుండి రెండు పద్యములను మత్స్యపురాణమునుండి యొక పద్యమును స్వీకరించి తన సర్వలక్షణసారసంగ్రహమున నుదాహరించెను.

1, పాయకదైత్యు లిట్లు................................కళ! త్రాయ నమో నిశాచరహరాయ నమోయనుఁ గాని (3-275)

నమశ్శబ్దమునకు 'నమో' అను రూప మిందుండి లక్ష్యముగా గ్రహింపఁబడియున్నది. (చూ. సర్వల. 1-193)

2 ....సాదరజల్పునకు సత్యసంకల్పునకున్ (అవ. 44)

పై పద్యపాదమును తిమ్మకవి నిత్యసమాసవళులలో పేర్కొని యున్నాఁడు. (2-272)

హరిభట్టుకవితలో కొన్ని విలక్షణ ప్రయోగములు, రేఫ ఱకారముల సాంకర్యము, అఖండయతి మున్నగునవి కలవు. కవి పోతనగారి కవితామార్గము ననుసరించినవాఁడని భావింపవలెను. లేదా 'నిరంకుశాః కవయః' అను సూక్తి కలదు గదా!

ఛందోవిశేషములు

సహార్థకయతి—సాదరజల్పునకు సత్య-సంకల్పునకున్ (అవ.44), సాదరబుద్ధిం బఠించు-సరసులు.... (4-52)

నిత్యసమాసయతి

శాండిల్య పులహ వి-శ్వామిత్ర....(మిత్రేవర్షౌ) (1-1), నా।రాయణుఁడెన్న మద్విమతుఁ-డాకుటిలాత్ముని.... (3-264)

కర్ణర। సాయనముగనొకటి చెప్పె-నది....(3-33), వృ।త్తాంతము చెప్పి పోవుటయు-నా చపలాత్ముఁడు.... (4-176)

హరిమంత్ర భజనప-రాయణుండు (5-245)

ప్రాదియతి

అ।త్యాయత బాహుదర్పమునఁ-దద్గిరి మధ్య....(1-62), మనో।హరముగ నీతిశాస్త్రము స-మస్తము.... [3-255]

అనునాసికాక్షరయతి—మం।డలుఁడయి యమ్మహాత్ముపల-నన్ ద్రుహిణాండ.... [2-39]

అనునాసికవికల్పయతి—స।న్మునిమను మానవామరమ-నోభవ.... [4-9]

ఋవళి—వివ।రించ హయగ్రీవమూర్తి-ఋషికులతిలకా [3-98]

కాకుస్వరవళి

ఆ।ర్యమతేజుండవు రాఘవార్యహరిభ-ట్టా!....[అవ. 16], నెఱయఁగ వర్ణింప నేర్తు-నే! దనుజేంద్రా! [3-260]

నీ। కభయంబిచ్చితి నేఁగు నీపురికిఁ బు-త్రా!....[3-287], భూ।షాకీర్ణాంగ ముకుంద కేశవ నృసిం-హా!.... [4-27]

ఆ।వేశంబొప్ప భజించి యాగఫలమీ-వే!.... [4-160]

సంయుక్తవిశేషయతి

స్నానమాడిన జనులపా-తకము లణఁచు [5-249]

స్నాంబుదీర్చి ధౌ-తములైన వస్త్రముల్ [మత్స్య పు. చూ. సర్వల; 2-162]

అఖండయతి

భానీకప్రభు భావజున్ భరతునిన్ - భాస్వత్తనూజాతునిన్ [అవ. 32]

జం।భారాతిప్రతిమానుఁడై వసుమతీ-భాగంబు....[2-8]

దయయు దాక్షిణ్య మఖిలశా - స్త్రార్థదృష్టి [3-50]

శ।క్రోదిత కార్యుఁడై నిజపు-రోహితులన్....[3-226]

చూడం।దనుజేంద్రుఁడు చారముఖము-నందాప్రహ్లా....[3-292]

పై। ద్రవమున నెత్తివై చుటయు-నాశివవప్పుడు.... [4-196]

....నొరులకు। నిడనేరక యనుభవింప-నేరక....(5-178)

ర-ఱయతి— ....యని।రుద్ధమూర్తిగా నె-ఱుంగవలయు (3-89)

వర్గజప్రాస

రాధాధర....... । ద్గాథామృత (ధ - థ) (అవ. 47)

ఉద్యత్ప్రతాప నిర్జిత । మధ్యందిన.......(ద - ధ) (అవ. 49)

ర - ఱ ప్రాస

హరి మధ్యమస్ఫూర్తి - నిఱుపేద.......ప్రాసయతి (1-9), ధారుణీ....... । ఁ బాఱె....... (1-81)

సరణి నడువక పరబుద్ధిఁ - గుఱుచపడక (1-91). ఎఱుఁగరు....... । ఁ బోరయరు....... (2-47)

హరి గలఁడు....... । వెఱవక....... (2-97). దొరకిన సుబ్బి మై । మఱచు.......(ప్రాసయతి) (3-24)

పురుషుఁడు....... । నెఱిఁగియధర్మ....... (3-158). పురుషవరేణ్య....... । నెఱిఁగిన....... (3-235)

ఎఱుకచెడి....... । పరవశుఁడై ....... (3-247), శ్రీ రమణుఁడు....... । మీఱిన....... (4-7)

నిఱుపేదలైన నీపద । సరసిజములు....... (4-47), హరిమాయా....... । నెఱుఁగక....... (4-112)

హరిదాసుల్....... । తఱుచై ....... (5-74)

పంచప్రాస

ఫలితములయ్యె.... । గళితములయ్యె.... । ని। ర్మలితము లయ్యె.... । కలితము లయ్యె....। (1-26)

వృత్తప్రాస సీసము

శోధించితివి....... । సాధించితివి....... । బాధించితివి....... । రోధించితివి....... । (2-33)

వ్యాకరణ విశేషములు

మట్టాకు (మట్టి + ఆకు; ఇకార సంధి; 1-21) రాక్షస పుంగవుల్ ! వినుఁడు (ఆరగాగమ రహితము; 1-78) దివిజుల్ ! పంజర రాజకీరముల.......( ,, 1-130) కదలివిభుండు (మిశ్ర సమాసము;) (1-126) గృహస్థు (వృద్ధాది గణము) (1-131) చిహ్నవాని (చిహ్న చరిత్రాది గణము) (1-133) రోధించితివి యప్సరో.......(మధ్యమ పురుషే కారసంధ్యభావము) (2-33) ఎందుకు (ఎందులకు.) (2-181) ఏలుకన్నన్ (ఏలుటకన్నన్. భావార్థ'ట' వర్ణలోపము) (2-185) మోహాపుట్టించి (పద్వాది గణమున పుట్టుధాతువు) (2-141) నలుగడ (1-166), నల్గడ (3-80) ఆచ్చిక ద్విగువు; ఏకవచనము. వివరించ ( ంచ ప్రాస) పత్వము రాకుండుట, (3-98) విష్ణో ! యనుచున్ (విష్ణూ !) (3-22) వరాహాయని (వరాహాయ అని) (3-25) జీవకోట్లు (కోటి + లు కోటులు - కోట్లు. తత్సమ శబ్దమున ఉత్వలోపము) (3-201) మిక్కిలిం గలిసి (మిక్కిలియును; యు - లోపము; 3-305) అంభోముచములు (ఋత్విగాది గణము; 4-65) పైనవ (పైని + రవ; స్వరలోపము; 4-196) నావుడక్రూరుఁడును (నావుడున్ + అక్రూర; ద్రుతస్వరసంధి; 4-208) పూర్మేయు (పూరి మేయు; స్వరలోపము; 4-220) పుట్నిల్లు (పుట్టిన ఇల్లు; 5-17) ఆర్నూఱు (ఆఱు + నూఱు; 5-60) చేతువు (4-29), చేతురు (5-8) యు దులకు తకారము. రాజుకవధ్యుఁడు (4-171), కానుకు (4-220) నగాగమ రహితము.

పై వానిలో నిప్పటి లక్షణ గ్రంథములకు లొంగని ప్రయోగములు కొన్ని కలవు. వాని నలాక్షణికములని యపహసింపరాదు. మహాకవుల ప్రయోగములు కాలానుగములు, మాన్యములు.

"ఆర్యవ్యవహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు" [బాల; సంజ్ఞ; 23]

# 3. ఆవిష్కరణము

## 1. తాళపత్ర గ్రంథ పరిచయము

నేఁడు వ్రాఁతకు సాధన సంపదలయిన కాగితము, కలము, సిరా ఇత్యాదులును, ముద్రణ యంత్రములును మన భారతదేశమునకు రెండు వందల సంవత్సరముల లోపున దిగుమతియైన క్రొత్త సరుకులు. అంతకుపూర్వము వ్రాఁతకు పరికరములు రెండే. కాగితములకు బదులుగా తాళపత్రములు. కలమునకు మాఱుగా గంటము. గంటమునకు లేఖిని యని నామాంతరము.

పరికరములు :—తాళపత్రములు మిక్కిలి లేఁతయును, ముదురును కారాదు. నడుమంతరముగ నుండవలయును. ఆకులను చక్కఁగా ఈనెలు తీసి, చుట్టలు చుట్టి, పలుచని పేడనీళ్లతో కొద్దిగా ఉడుకఁబెట్టి, నీడలో నార్చి, నిలువచేసి యుంచుకొనవలయును. ఆ పత్రములకు 'అలేఖములు' అని పేరు.

ఘంటము తత్సమపదము. గంటము తద్భవము. ఈ గంటము, కలముకంటె దీర్ఘాకారమున నుండును. ఒకవైపు సూదివలె సునిశితమై యుండును. ఈ భాగముతో పత్రములమీద నక్షరములను తొలుచవలయును. శ్రమతో కూడినపని. మఱొకవైపు చురకత్తివలె నుండును. దానితో తాళపత్రములను చక్కఁజేసి కొనవలయును. ఒక సాధనముతో రెండు పనులు. ఇది ఒక విధముగా 'Pen knife' అని యనఁదగిన సాధనము.

తే. ముదుకతల పాగయును, బాహుమూలమందుఁ । గవిలె, చర్మపుటొఱలోని కత్తిగంట,
మలఁతి నీర్కావిదోవతు లమరి, గ్రామ । కరణ మేఁతెంచి రెడ్డిచెంగట వసించె. [శుక. 2-417].

ప్రాచీనుల విజ్ఞానసంపద యంతయు తాళపత్ర గ్రంథములయందు నిక్షిప్తములైయున్నవి. 'ఆకులనె యుండు కవితా పాకమ్ములు' (కవి కర్ణ, 1-14) అని సంకుసాల నృసింహ కవియును, 'తాళీదళసంపుట ప్రకర కాంతారంబునం దర్థపుం దెరువాటుల్ దెగఁగొట్టి' (మను. 1-9) యని అల్లసాని పెద్దనయును, 'తాటాకులలోన వ్రాసిరి పరాంగనఁ గూడినఁ బాపమంచు' (తారా. 3-82) అని శేషము వేంకటపతియును విభిన్న సన్నివేశములయందు తాళపత్ర ప్రశంసను గావించి యున్నారు.

గంటము : [1]ఇది లోహనిర్మితము. తెలుఁగు విద్యార్థికి తొలుత నేర్పఁబడుచుండిన "తొలుత నవిఘ్నమస్తనుచు ధూర్జటినందన! నీకు మ్రొక్కెదన్" అను వినాయకస్తుతిలో – 'నా వలపలి చేతి గంటమున' అనుచోట గంటము పేర్కొనఁ బడియున్నది. ఈ వరాహపురాణకర్త హరిభట్టుకుఁ గల ''అష్టఘంటావధాన పరమేశ్వర'' బిరుదములోని 'ఘంట' శబ్దము పైగంటమే. 'శతలేఖినీ పద్య సంధాన ధౌరేయు' (నరస, 1-13) అనుచోట లేఖనీప్రశంస కలదు.

లిపి : లేఖనము వ్యక్తికి ముఖము వంటిది. అక్షరములు ఒకటైనను పోలికలు, తీరు, వేఱు. 'వ్రాయంగ వ్రాయంగ వ్రాఁత' యను లోకోక్తి ననుసరించి, సుందరమైన దస్తూరి ప్రయత్నసాధ్యము. దానిని నాటికొకఁడు కళగా

---

1. గంటము or ఘంటము (Tel.) N. An iron style for writing on palm leaves బ్రౌణ్యము.

భావించి, యారాధించి కృతహస్తుఁడగును. అట్టివారి వ్రాలు నయనానందకరములై 'మురువు లొలుకు గుండ్రముత్తియముల' వలె భాసించును. ఆ సుకృతము నలనాఁడు సిద్ధన మంత్రియును, విరూరి వేదాద్రి మంత్రియును, సముఖ వేంకటకృష్ణప్ప యును పడసియుండిరి.

> ఆణిముత్తెముల సోయగము మించిన వ్రాలు । వరుసతో నిరుగేల వ్రాయనేర్చె, (విక్ర. 1-50)
>
> వ్రాలు వ్రాయుఁ, గొంకుఁ గొసరును జేతప్పు గొనకయుండ । లలిత ముక్తాఫలాకార విలసనమున, (పాండు. 1-71)
>
> తగ వ్రాయనేర్తువు తారకా తారకా । నీకరేఖా సమానేక లిపులు, (అహల్యా. 1-37)

సామాన్యముగా, తాళపత్రములలోని అక్కరములు పొందికలు లేనివి. కొకిబికి వ్రాఁతలు, కోణంగి వ్రాఁతలు, గొలుసుకట్టు వ్రాఁతలు; తలకొకవిధమైన వ్రాఁత. వానిలో ఖ ఘ లకు, థ ధ లకు, ఱ ట లకు, వ ప లకు, న స లకు, భేద మంతగా కనుపట్టదు. కొన్నియెడల హ్రస్వ దీర్ఘములకు భేద మగపడదు. వ్యాకరణకార్యములగు గసడదవాదేశ ద్రుత సంధుల వ్యత్యయములు, పూర్ణ ఖండ బిందువుల విలక్షణ సంకేతములు, సంయుక్తాక్షరముల యందలి వర్ణ లోప వర్ణ వ్యత్యయాదులు, లేఖక ప్రమాదములు మున్నగునవి అలసులగు చదువరులకు చిత్తవిభ్రమమును కలిగించి తీరును.

[2] "తాళీదళ సంపుట కాంతారమునఁ దిరిగి, ప్రమాద కంటకములను దొలఁగించుకొనుచు, సపూర్వార్థ వివేచనంబు సేయుచుండువారి యవస్థ తత్తుల్యులకుఁ గాని యన్యుల కెఱుఁగరాదు" అని మానవల్లి రామకృష్ణకవిగారి యనుభవ వాక్యములు స్మరణీయములు.

తాళపత్రములయందు వ్రాయు నలవాటుగల లేఖకులే మఱొక ప్రతిని జూచి వ్రాయు నవసరమున మిక్కిలి శ్రమ పడుచుండినట్లు తెలియుచున్నది. వారు తాము వ్రాసికొన్న ప్రతులతుది నీ విధముగ నివేదించుకొని యున్నారు.

> [3] క. తుడుపులు సందిగ్ధంబులు । తడబాటును పంక్తిలోప తట పట వ్రాలె
> క్కుడ వ్యతిరిక్తంబయినను । నెడనెడ తిట్టకయ చదువు డెలమి రసజ్ఞుల్.
>
> క. [4] తలకట్టు గుడుసు కొమ్ముల్ । అలవడి యేత్వంబు నోత్వ మౌత్వము సున్నల్
> నెలవులు తప్పినచోటను । సలలితముగ దిద్దరయ్య సజ్జనులారా !

లేఖకులు : [5] 'కవిత సెప్పి యుభయకవిమిత్రు మెప్పింప' అని కేతనయు. [6] 'ఒక కృతి సెప్ప బుద్ధి పొడమి' యని హరిభట్టును చెప్పినట్లు, నాఁడు కవులు కవితను చెప్పుచుండిరి కాని, తీరికగా కూర్చొని తాళపత్రములపై వ్రాసి కొనెడివారు కారు. పూర్వకవులు సామాన్యముగా పలువురు ఆశుకవులు. కావున వారికి లేఖకులు కావలసివచ్చిరి. తిక్కన గారికి గురునాథుఁడును. [7] తిమ్మనగారికి అతని సోదరుఁడు జగ్గకవియును లేఖకులై యుండినట్లు ప్రసిద్ధి. "ఊహ తెలియం గల లేఖక పాఠకోత్తముల్ దొరకినఁగాక" యని యాంధ్రకవితా పితామహుఁడు, తన కవితాసామగ్రి జాబితాలో లేఖ కోత్తములను తప్పనిసరిగా నిర్దేశించియున్నాఁడు.

---

2. శ్రీరంగమహత్త్వము. పీఠిక, పు. 7. 3 డి.నం. 1374, జి. ఓ. ఎం. ఎల్. 4 అందే—డి.నం. 2603, 5 ఆం. భా. భూ. ప. 5, 6. మత్స్య. అవ. 6.

7. నిఖిల విద్యాభ్యాస నిపుణుఁడు మత్సహో । దరుఁడగు జగ్గసత్కవి తనయులు,
ఘనులు తిమ్మనయు సింగనయును లేఖక। పాఠకులై కృతుల్ ప్రబలఁజేయ. (రసికజనమనో అవ. 24)

స్థూలముగా లేఖకులను మూఁడు తరగతులుగా విభజింపవచ్చును. 1. ఉత్తమ లేఖకులు, 2. మధ్యమ లేఖకులు, 3. అధమలేఖకులు. తగినంత వ్యుత్పత్తి యుండి, ఊహ తెలిసికొని, నిర్విరోధముగా వ్రాయవలంతులు - ఉత్తమలేఖకులు; గురునాథుని వంటివారు. లిపి పరిజ్ఞానముండి, సాహిత్యమున సామాన్య పరిచయము కలిగియుండి, యథామాతృకముగా వ్రాయఁగలవారు మధ్యమలేఖకులు. వీరు తమ భాషా పరిజ్ఞానమును ప్రత్యంతమున స్వప్రశ్రయముగా నిట్లు వ్యక్తము చేసియున్నారు.

చ. [8]కుదురుగ వ్రాయనేర, ననుకూల పదార్థ విభేదనోక్తి సం
విదితుడ గాను, లక్షణవివేక మెరుంగను, మాతృకాకృతిం
జెదరక వ్రాసినాడ, నగు సేయక యక్కర తప్పులున్న నిం
పొదవగ గూర్చి దిద్దుడు బుధోత్తములార కృపాసమగ్రతన్.

ఇఁక, అధమలేఖకులు, వీరికి ఒకవిధమైన పాండితియు, కవితాశక్తియు నుండును. "అంతా కవులము కామా? అంతింతో పద్యములను అల్లగలేమా'' యనుధోరణి కలవారు వీరు. తమకు అర్థముకాని పట్టులను మార్చివేయఁగల ఔద్ధత్యము, తమ యభిప్రాయములను మూలగ్రంథమున ప్రక్షేపింపవలయునను 'ఉబలాటము' వీరికి బహుళము. అప్పకవి యిటువంటి వారినే [9]వికటకవులనియు. [10]ధూర్త కవులనియు నిరసించియున్నాఁడు. ఎల్లసాహిత్యములయందును ప్రసిద్ధిగాంచిన ప్రామాణిక గ్రంథములలో వీరు కావించిన కూర్పులు చేర్పులు మార్పులు తక్కువకానివి. ఇది సారస్వత మహాపరాధమని అభిజ్ఞుల యభిప్రాయము.

గ్రంథ సంపాదనము: పూర్వకాలమున గ్రంథ సంపాదన సౌకర్యములు తక్కువ. రాజులు, సంస్థానాధిపతులు, ధనవంతులు భృతినొసఁగి లేఖకులను పోషించుచుండిరి. బహువ్యయప్రయాసముల కోర్చి గ్రంథ సంపాదనము కావింపవలసియుండిన కాలమది. గ్రంథ సంపాదనమునకును, గ్రంథ ప్రచారమునకును మహదాశ్రయము కావలసియుండును. ఒకసారి శ్రీమద్రామానుజులు బ్రహ్మసూత్రమునకు వార్తిక గ్రంథమగు బోధాయనవృత్తిని జూడఁదలఁచిరి. ఒక్క ప్రతి మాత్రము శారదాపీఠములో నుండునట్లు తెలియవచ్చినది. కాలినడకతో కాశ్మీరమునకు పోయి, ఆ ప్రతి నొకసారి మాత్రము చూడఁగలిగిరఁట!

గ్రంథరక్షణము: సంపాదించిన గ్రంథములను భద్రపఱచి సంరక్షించుట యొక క్లిష్టసమస్య. "పుస్తక భాండాగారంబును నాఖుభక్షణి శిథిలబంధన యాచకముఖోపద్రవంబులవలనఁ బ్రోచుట'' (పాండు. 3-24) దుర్ఘటము.

శ్లో. తైలాద్రక్షే జ్జలాద్రక్షే ద్రక్షేచ్ఛిథిల బంధనాత్। మూర్ఖహస్తే న దాతవ్యమేవం వదతి పుస్తకం॥
పుస్తకం....పరహస్త గతం గతం॥

పై యభిజ్ఞవాక్యములు త్రైకాలిక సత్యములు. ఒక లేఖకుఁడు తాను శ్రమించి వ్రాసికొన్న ప్రతిని రక్షింపుమని యీ విధముగా భగవంతునితో మొఱ పెట్టుకొన్నాఁడు.

ఆ.వె. [11]అగ్నివలన మూషకాదులవలన త। స్కరులవలన బాధ పొరయకుండ
కృపచలిర్ప నెప్పు డీ పుస్తకంబు కృ। ష్ణుండు రక్ష సేయుచుండుగాత.

---

8. డి.నం. 1596, జి.ఓ.ఎం.ఎల్. 9. అప్పకవీయము, 3-260; 10. అంతే 3-378.
11. భార. సం.ము. ఆను. పీఠిక.

ఉపేక్షాభావము, విప్లవములు, యుద్ధములు మొదలగునవికూడ గ్రంథవినాశమునకు హేతువులు. విద్యానగరమని పేరుగాంచిన విజయనగరము కాలదుర్విపాకముచే ధ్వస్తమై అగ్నికి నాహుతియైనప్పు డందులో అపారమైన గ్రంథరాశి పరశురామ ప్రీతికి పాత్రమై పోయినది. కాలాయ తస్మై నమః

పాఠాంతరములు: కవి వ్రాసిన పాఠము ఒకటై యుండఁగా, నేఁడు తద్భిన్నము లనేక పాఠములు కాన వచ్చుటకు కారణమేమి? యను ప్రశ్న ప్రతి పాఠకునకును కలుగకపోదు. వాస్తవముగా—కవి యొకపాఠమునే వ్రాసి యుండును. కాని, మనకు ఆకవియే వ్రాసికొన్న లేదా వ్రాయించిన గ్రంథము లభించు నవకాశమున్నదా? తాళపత్రగ్రంథ సంరక్షణము నిత్యగండముతో కూడిన పని. ఒక ప్రతినుండి మఱొక ప్రతి తయారగునప్పుడు మాతృకలోని లిపిక్లిష్టత వలన, శైథిల్యాది కారణములవలన నాయాభాగములయందు నష్టములైన యక్షరములు, పదములు, పాదములు తుదకు పద్యములే క్రొంగ్రొత్త రూపములను దాల్చుచుండును. అర్థరహితములని, యన్వయదూరములని, యలాక్షణికములని యనేక సంస్కార సౌభాగ్యములంది వింత వింత రూపములు సంతరించుకొనుచుండును. నన్నెచోడుని కుమారసంభవ మునకు లభించిన తాళపత్రప్రతి యొకటియే కదా! నేఁడు తదాధారముగ ముద్రితమై లభించు ఆ గ్రంథములో లేఖకులయు, పరిష్కర్తలయు ధీకౌశలమున వెలసిన, వెలయుచున్న పాఠభేదములకు పారము కలదా? లేఖకుల యవ్యుత్పత్తియును, వ్రాఁతప్రతుల శైథిల్యాదులును నపపాఠములకును, బహుపాఠములకును కారణములు. లేఖకులు, పాఠకాధములు, జాన పదులు నపపాఠకారకులని అప్పకవి యభిప్రాయము.

ఉ. నన్నయ ముఖ్య సత్కవిజనంబుల కావ్యములందు లేఖకుల్
గొన్నియుఁ, బాఠకాధములు గొన్నియుఁ బోకడఁబెట్టఁ, దక్కవై
యున్నెడఁ గాంచి జానపదు లోడకదిద్దిన తప్పుత్రోవ లె
ల్లన్నిజమంచుఁ గైకొనిన, లక్షణవేత్తలు సమ్మతింతురే? (అప్ప, 3-202)

అపపాఠముల విషయమున విమర్శక పండితుల యభిప్రాయము లీ రీతి నున్నవి.

[12]"భారతాది ప్రాచీన గ్రంథములు భాషాచరిత్రశోధన కుపయోగించునవియే కాని యవి పుట్టినట్లిప్పటివారికి లభించుటలేదు. కవులు వ్రాసిన మాతృకలు చిరకాలము క్రిందటనే నశించిపోయి, వానినిబట్టి యాకాలమువారు వ్రాసి యుంచిన ప్రతులలోఁ జిట్టచివరవియే యిప్పుడు దొరకుచున్నవి. పాండిత్యాభావముచేతనేమి, పాండిత్యముండియుఁ బ్రాచీన ప్రయోగములు తప్పులనుకొని సవరించుటవలననేమి, కేవల ప్రమాదముచేతనేమి ప్రతులు వ్రాసినవా రచ్చటచ్చటఁ బాఠములను దిద్దుచుండిరి. లిఖితప్రతులలోఁ బాఠాంతరము లుండుటయే యిందులకు నిదర్శనము. ఇట్లు మాఱియున్న గ్రంథములంబట్టి కవిప్రయుక్తపాఠముల నిర్ణయించుట శ్రమసాధ్యము."

[13]"ఆంధ్ర వాఙ్మయము తాళపత్రములనుండి ముద్రిత గ్రంథరూపమున నవతరించునపు డందలి యాంధ్రభాష నూతన రూపముం దాల్చియున్నది. ఈ యవతారమున నెన్నియో పాఠములు తాఱుమాఱుగుటచేఁ బలుతావులఁ బ్రాచీన కవుల భావములను గాని, ప్రయోగ విషయమున నాయాకవుల సమ్మతిని గాని సరిగా గుర్తించుటకు వలనుపడకున్నది.........
తొలుతఁ దాళపత్ర మాతృకలనుండి పత్రిక లవతరించునపుడే యర్థజ్ఞాన శూన్యులగు లేఖకాదుల ప్రమాదములవలనఁ గవుల ప్రయోగము లెన్నియో వ్యత్యస్తములై యనర్థాపాదకము లయినవి."

---

12. శాసనపద్యమంజరి, సంపు. 1, పీఠిక, పు. 2, 3; జయంతి రామయ్యపంతులు; ఆం. సా. ప. ప్ర. కాకినాడ, 1930. 13. దువ్వూరి వేంకటరమణశాస్త్రిగారి - పాఠ పరిశీలనము - అను వ్యాసము. ఆం.సా.ప. సంపు. 20, సం. 2, పు. 81-88.

నేఁటి కర్తవ్యము: నేఁడు తాళపత్ర గ్రంథ సంపాదన కార్యము దుర్ఘటమై కనుపట్టుచున్నది. రాజ్యము లంతరించినవి. సంస్థానములు పతితములయినవి. సాహిత్యపోషణము సన్నగిల్లినది. కాని, యిప్పటికిని గ్రామములయందలి కొన్ని కుటుంబములవారు మాత్రము వంశానుక్రమముగా తమకు దాయవిభాగముగా సంక్రమించిన ప్రాచీనగ్రంథ సంచయమును పదిలముగా, పూజాద్రవ్య సదృశముగా పవిత్రభావనతో పరిరక్షించుచున్నారు. కాని ఆ వివరములు తెలిసికొను మార్గము మాత్రము మృగ్యము.

మదరాసు, తంజావూరు, తిరుపతి, కాకినాడ, రాజమండ్రి, హైదరాబాదు మున్నగు పట్టణములయందు వెలసియుండు గ్రంథాలయములయందును, పరిశోధన సంస్థలయందును ప్రాచీన తాళపత్ర గ్రంథములు పరిరక్షింపఁబడియున్నవి. వానిలో పేటికాంతర్గతరత్నముల చందమున గుప్తములై యనేక కృతిరత్నములు పొనుఁగుపడి యున్నవి. వానిని వెలికి దీసి, శాణోల్లీఢము కావించి, వెలుఁగునకు తేవలసినభారము సాహితీ సమారాధకుల ముఖ్యకర్తవ్యమై కనుపట్టుచున్నది. ఆ రత్నరాజిలో హరిభట్టకృత వరాహపురాణ మొక యనర్ఘరత్నము. ఆ మహాప్రబంధముయొక్క సంశోధిత ముద్రణమునకు లభించిన వ్రాఁతప్రతుల చరిత్రకు నింతపట్టు అవతారికా ప్రాయముగా ప్రాచీన తాళపత్ర గ్రంథపరిచయము స్థూలముగా కావింపఁబడినది.

సంశోధిత ముద్రణప్రసక్తి: ఆంధ్రసాహిత్యము అపారమైనది. అందులో బహుగ్రంథములు ముద్రితములై, వాసికెక్కియున్నవి. ముద్రణభాగ్యమునందని ప్రసిద్ధగ్రంథము లింకను నసంఖ్యాకములుగా కనుపట్టుచున్నవి. వావిళ్ల, ఆనంద, అముద్రితగ్రంథచింతామణి మొదలగు ముద్రణాలయాధిపతులును, విశ్వవిద్యాలయములును, సాహిత్యసంస్థలును, గ్రంథాలయాధికారులును, కవి పండితులును, కవిపోషకులును, సాహితీప్రియులును-ఇంకను పలువురు పలుగ్రంథములను ముద్రించి, ముద్రింపించి, భాషాసేవ కావించి యశఃకాయుల కృతజ్ఞతకు పాత్రులైయున్నారు. వారు తమ పరిధిలో, లభించిన యవకాశములో, నుపలబ్ధమైన గ్రంథసామగ్రితో, పూర్వ పూర్వ ముద్రిత ప్రతుల సాహాయ్యముతో, గ్రంథములను ముద్రించి, చరితార్థులైయున్నారు. కాని, వానిలో పాఠకులకు మనఃక్లేశమును కలిగించు అపపాఠములు, గ్రంథగ్రంథులు జిజ్ఞాసాధికరణముతో ప్రారంభింపఁబడి, బహువివాదములకు దారితీసిన సంగతి సాహితీప్రియులకు విదితమైయున్నది. ప్రసిద్ధ సాహిత్యపత్రికలు భారతి, ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక మున్నగునవి సాహిత్యములోని సందియములను పరిహరించుటకుఁగాను, చర్చావేదికలకు అవకాశమొసఁగిన సంగతి పాఠకలోకమునకు పరిచయమైనదే. నాఁడును, నేఁడును, ఏనాఁడును సందేహములు, సమాధానములు శరపరంపరగా సాగుచునే యుండును. సాహిత్య సముద్రమునకు నేతమెత్తు ధీరులెవరు ?

సాధారణముగా ఒకేప్రతి నాధారముగాఁగొని, కావించిన ముద్రణములయందు స్ఖాలిత్యము లెక్కువగా కనుపట్టుట సహజము. అదియును శిథిలప్రతియైనచో చెప్పవలయునా ? ఉదాహరణమునకు క్రీడాభిరామమును గ్రహింతము. దీనికి లభించిన మూలప్రతి ఒక్కటి. ఇందులో కృత్యాది యున్నట్లు కానరాదు. ఎడనెడ గ్రంథపాతములును గలవు. గ్రంథములో అనేకాపపాఠములు తారసిల్లినవి. కర్తృత్వ విషయమున తర్జనభర్జనలు సాగుచునే యున్నవి. ఆ మూలప్రతికి మాతృకయును, పుత్రికయును కాని మఱియొక సమగ్రప్రతి యెందైనను లభించినచో, ఉన్న వానిలో నన్ని కాకున్నను కొన్ని సంశయములైనను పరిహరింపఁబడు ననుటలో సందియములేదు. కావున నొక గ్రంథమునకు నెన్ని భిన్నప్రతులు లభించిన నంతలాభము కలుగును. ఈ దృష్టితో నిదానించినపుడు సంశోధిత ముద్రణమునకుఁగల స్థాన మవగతము కాఁగలదు.

సంశోధిత ముద్రణ కార్యము శ్రమసాధ్యము. దీనికి పూనుకొను వ్యక్తికి నోర్పు, నేర్పు ముఖ్యావసరములు. దేశాల వెంబడి సంచరించి, కాలమును ధనమును వెచ్చించి, సముపలబ్ధ సమస్తప్రతులను పరిశీలించి, సాధ్వసాధుపాఠముల

నన్నింటిని సంగ్రహింపవలయును. గ్రంథాంతర సంవాదములతో శోధింపవలయును. లభించిన సామగ్రితో సమగ్రముగా కాకున్నను సంతృప్తికరముగానైనను గ్రంథ పరిష్కరణము సాగును. సంశోధిత ముద్రణమునకు నింత శ్రమ సహిష్ణుత యవసరము. అంగబలము, అర్థబలము కల మహాసంస్థలు కావింపవలసిన ఘనకార్య మిది.

సంశోధిత ముద్రణ ప్రతి విధానము : ఆంధ్ర సారస్వతమున కవిత్రయ ప్రణీతమగు మహాభారతమునకుఁ గల స్థాన మద్వితీయము. అది లక్ష్యగ్రంథముగను, లక్షణ గ్రంథముగను వాసిగాంచియున్నది. పెక్కుసారులు ముద్రణ మంది యశేషప్రచారమును వడసియున్నది. అందులోని బహువిషయములు చర్చాస్పదములై, పూర్వపక్ష సిద్ధాంతముల కవకాశ మొసఁగియున్నవి. ఏవంవిధ విశిష్ట మహాగ్రంథమునకు సంశోధితముద్రణ మత్యంతావశ్యకమని పండితులు, భాషా పరిశోధకులు చిరకాలముగా అభిలషించుచుండిరి.

హైదరాబాదు, ఉస్మానియా విశ్వవిద్యా నిలయమందలి తెలుఁగుశాఖవారు–ఆంధ్రుల చిరకాలవాంఛా పరిపూరణముగా, నిటీవల 'ఆంధ్రమహాభారత సంశోధిత ముద్రణమును' సమర్థతతో, సర్వాంగసుందరముగా వెలువరించి, వాఙ్మయారాధకులకు మహోపకారము కావించియున్నారు. ఈ సంశోధిత ముద్రణమున తత్సంపాదక వర్గమువారు పాఠ నిర్ణయముపట్ల తమకుఁగల యభిప్రాయములను క్రిందిరీతిని ప్రకటించియున్నారు.

14 "నిజమైన సంశోధిత ముద్రణము లభ్యములైన సాక్ష్యములన్నియు విద్వత్సంఘముల ముందుంచి ప్రత్యేకములైన పాఠముల నంగీకరించుటో, తిరస్కరించుటో వారు స్వయముగా నిర్ణయించుకొనుట కవకాశ మొసఁగవలయును. సంశోధిత ముద్రణము సాధ్యమైనంతవఱకు తటస్థముగా నుండవలయును. సంపాదకుఁడు తన కిష్టమువచ్చిన పాఠము నెన్నుకొనవచ్చుననుటలో సందేహములేదు. కాని యతఁడు తన యభిప్రాయములచేఁ బాఠకులను ప్రభావితుల నొనరించుటకు యత్నింపరాదు.''

15 ''మేము ప్రధానముగా గ్రహించిన వావిళ్ళ ప్రతియందలి పాఠము పరీక్షకు నిలిచినచో దానినే ధైర్యముగా నుంచివేసితిమి. లిఖితప్రతులుకాని, యితర ముద్రణములుకాని యంతకంటె నుత్తమమైన పాఠము నొసంగియుండినచో నున్నదానిని మార్చుటకు యత్నించితిమి.''

వరాహపురాణముయొక్క సంశోధిత ముద్రణవిధానము పై భారతముద్రణముకంటె విభిన్నమైనది. ఇంతవఱకు హరిభట్టు కృత వరాహపురాణము ముద్రణము కాలేదు. ఆ కారణముచే గ్రంథస్థ బహువిషయములు పండిత మండలిచే పరామర్శింపఁబడియుండలేదు. ప్రబంధము ప్రశస్తమైనదైనను, దానికిఁగల ప్రచారము పరిమితము, లభించుప్రతు లల్ప సంఖ్యాకములు.

ఈ స్థితిలో, వరాహపురాణమునకు ఆదర్శప్రతి – భారత సంశోధితప్రతికి 'వావిళ్ళ' ముద్రిత ప్రతివంటిది– లేదు. లభించు తాళపత్రప్రతులలో నేయొక్కటియు శుద్ధప్రతి కాదు. ఏదేనొక్క ప్రతిని మొదట నాధారముగా గ్రహించి, యందున్న చందమున నకలు వ్రాసికొనవలయును. ఇతరప్రతులతో పోల్చి చూచి, లభించు పాఠభేదముల నన్నింటిని గ్రహించి, వానినుండి సాధుపాఠములను స్వీకరింపవలయును. తత్తుల్యములను, భిన్నములను పాఠాంతరములుగా నధో భాగమున నిర్దేశింపవలయును. అట్లుకాక భారతమునకువలె తటస్థమార్గానుసరణ మిట్టి ప్రథమముద్రణ ప్రబంధముపట్ల నాచరణయోగ్యముగా కనుపట్టదు. అపపాఠములనుండి పరిష్కృత సాధుపాఠ వినిర్ణయము కత్తిమీఁద సాము. పరిష్కరణ పథము దుర్గమము.

---

14. ఆం. మ. భా; సంశో. ము. సంపు. 1, ఉపో. పు. 110. 15. అందే పు. 136.

16 "ముద్రణకాలమున కుపలబ్ధమయిన వ్రాత ప్రతులను సావధానముగ పరికించియు, నందు లేఖక ప్రమాద జనితములుగఁ దోఁచినవానిని న్యాయ్యదృష్టిని సవరించియుఁ, బాఠభేదములున్నయెడ వాని నన్యథాకరింపక సాకల్యముగఁ జూపియు, సమన్వయసందేహము గలిగిన పట్టుల నేదో యొకరీతిని సవరింపఁ గడంగక 'యియ్యది సందిగ్ధ'మని సుస్పష్టముగ సూచించియు నీరీతిని విమర్శక సమ్మతమగు పద్ధతుల నవలంబించుట గడుంగడుఁ బ్రశంసనీయము.".

మహామనీషులు కీ. శే. మానవల్లి రామకృష్ణ కవిగారు, కీ. శే. వేదం వేంకటరాయ శాస్త్రిలుగారు, కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిలుగారు, కీ. శే. డా. చిలుకూరి నారాయణరావుగారు, శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు పరిష్కరించి ప్రకటించిన గ్రంథము లిప్పటివారికి, పరిష్కరణ మార్గదర్శకములైన దారిదీవియలై తేజరిల్లుచున్నవి. ఆ వెలుఁగు నాధారముగా కైకొని, దేశాటనము గావించి, ప్రసిద్ధ గ్రంథాలయములయం దుపలబ్ధములగు లిఖితగ్రంథముల నామూలచూడము ప్రత్యక్షరశోధము కావించి, బహుపాఠములు సంగ్రహింపఁబడినవి. వానినుండి సాధుపాఠములను నిర్ణయించి స్వీకరించుటకుఁగాను కావించుకొన్న కతిపయ నియమములు క్రింది తీరున నున్నవి.

1. నాఁటి లిపి సంప్రదాయమును పరిహరించి, నేఁటి రీతిని వ్రాసికొనుట. 2. లేఖక ప్రమాదములను తొలఁగించుట. 3. లాక్షణిక విరోధపాఠములను విడనాడుట. 4. ప్రకరణౌచితిని గుర్తించుట. 5. గ్రంథాంతర ప్రయోగబలముచే సాధుత్వమును సమర్థించుట. 6. ఏకవాక్య సుదీర్ఘవచనములను విడఁదీసి వ్రాయుట. 7. పద్యములయందు యతిస్థానమును నిర్దేశించుట. 8. నవ్య సంస్కరణముగల కాగితపుఁ బ్రతికంటె తాళపత్రప్రతికి ప్రాముఖ్య మొసఁగుట.

వరాహపురాణ ప్రతులు - చరిత్ర: వరాహపురాణముయొక్క సంశోధితముద్రణప్రతిని సిద్ధము చేయుటలో సహకరించి యుపకరించిన వ్రాతప్రతుల వివరములు తొలుత గుర్తించుకొన్న యక్షరసంకేతక్రమమున తెల్పఁబడును. తరువాత నాయాగ్రంథములకు సంబంధించిన విశేషాంశములు వివరింపఁబడును.

| సంజ్ఞ | వివరణము | సంఖ్య |
|---|---|---|
| మ, మా | మదరాసు ప్రతులు | 2 |
| త, తా, తి, తీ | తిరుపతి ప్రతులు | 4 |
| హ | హైదరాబాదు ప్రతి | 1 |
| ర | రాజమండ్రి ప్రతి | 1 |
| క | కాకినాడ ప్రతి | 1 |
| | మొత్తము ప్రతులు | 9 |

మ. మదరాసులో ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయమందలి ప్రతి. సంఖ్య. ఆర్, నం. 2139. తాళపత్రము. పత్రములు 306. సమగ్రము. వ్రాలు మంచివి. శైథిల్యమించుక కలదు. గ్రంథపాతములు లేవు. ఎడనెడ క్రిమిదష్టభాగములు కలవు.

16. దువ్వూరి వేంకటరమణశాస్త్రిగారి - పాఠపరిశీలనము అను వ్యాసము; ఆం. సా. ప. సంపు. 20, సం. 2, పు. 31-36.

గ్రంథాంతమున లేఖకుని వ్రాలు : ప్రమోదూతనామ సంవత్సర పుష్య బ. 6. జయవారం వర్కు యామునాల మంగయ్యగార్కి పూండ్ల అచ్చన్న వరాహపురాణం అయిదు ఆశ్వాసములున్ను శ్రీ విష్ణుపురాణం యెన్మిది ఆశ్వాసము లున్ను యీ రెండు పురాణాలు వక సంపుటములోను ఆచంద్రార్కముగా వ్రాసెను.

ఈ మ. ప్రతిని ఆధారముగా గ్రహించి మొదట చిత్తుప్రతి (Rough copy) సిద్ధము చేయబడినది.

మా. ఇదియును పై గ్రంథాలయమందలి తాళపత్రప్రతి. సంఖ్య ఆర్.నం. 1951. పత్రములు 127. పత్రములు పొగచూరి నల్లబడి క్రిమినష్టములై యున్నవి. సమగ్రము. లేఖకునివ్రాలు:

క. వ్రాలా శత్రులు తప్పులు చాలంగలవేను శబ్దసంగతు లెరుగన్
కేలింబెట్టక నవ్వక పోలంగా దిద్దరయ్య బుధజనులారా.

వ. పుట్టకొండపతి లక్ష్మీనృసింహార్పణమస్తు । క్రోధినామ సం. ఫాల్గుణ బహుళ పంచమీ ఆదివారం సరికి శ్రీవరాహపురాణం సంపూర్ణం.

త. తిరుపతిలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యానిలయ ప్రాచ్య పరిశోధనాలయమందలి తాళపత్రప్రతి. సంఖ్య ఆర్.నం. 827 (బి) పత్రములు 143-201. సమగ్రము. వ్రాత తిన్ననిది. తప్పులున్నవి. శైథిల్యగ్రంథపాతములు లేవు. ఈ ప్రతిలో మొదట సూరన-విష్ణుపురాణము (పత్రములు 1-142), కడపట హరిభట్టు-మత్స్యపురాణము (202-250) చేరియున్నవి.

లేఖకునివ్రాలు : రుధిరోద్గారి సం. ఆషాఢ బ. 7 జ వర్కు మహారాజశ్రీ రాజారావు కుమార మహీపతిరావు బహద్దరుగారికి రేమెర్ల వుప్తాంకయ్య (?) గారు యథామాతృకగా విష్ణుపురాణ వరాహపురాణ మత్స్యపురాణములున్ను వ్రాసి శ్రీ రామచంద్రార్పణంగా దాఖలు చేసిరి.

తా. ఇదియును పై పరిశోధనాలయమందుఁగల తాళపత్రప్రతి. సంఖ్య ఆర్. నం. 411 (ఏ). పత్రములు 1-207. సమగ్రము. వ్రాత తిన్ననిది. శైథిల్య గ్రంథపాతములు లేవు.

17 "కైవల్యఖండమను పేరుగల వరాహపురాణపుఁ బూర్వభాగమునకిది తెలిఁగింపు. ఐదాశ్వాసములు గలది. కర్త హరిభట్టారకుఁడు. అష్టఘంటావధాన – బిరుదము గలవాఁడు. గద్యమందున్న చంద్రనామాంక పదము నర్థమేమో ! తెలుఁగున మాత్స్యపురాణము భాగవతైకాదశ ద్వాదశ స్కంధములు నీతని కృతులు గలవు. శృంగారదీపిక, రతిరహస్యము నను నామములతో సంస్కృతభాషనుగల కామశాస్త్ర గ్రంథగద్య మీతని గద్యముతోఁ గొంత పోలియున్నది. ఆ గద్య మిది. "ఇతి సర్వవిద్యానవద్య సహజసారస్వత చంద్రనామాంక రామవిద్వన్మణికుమార హరిహరనామకవి విరచితాయాం శృంగార దీపికాయాం రతిరహస్యే."

ఇందు 208-260 పత్రములలో వెలిదిండ్ల వేంకటపతి రచిత-రాధామాధవ విలాసము జతగూడి యున్నది.

లేఖకునివ్రాలు : పార్థివ సం. ఆషాఢ బహుళ అష్టమి జయవారంసర్కి కొడుకుళ్ళ వెంకట సోమయాజులు వరాహపురాణం ఆత్మార్థమై వకప్రతి వ్రాసుకొనెను.

17. T. C. Vol. 3, Pages 1124 - 1129. G.O.M.L.

క. యతి గణ నియమము లెరుగను। అతిశ్రద్ధలు వ్రాలు చూడ నన్నియు తప్పుల్।
ప్రతి చూచి వ్రాసినాడను। మతిమంతులు తప్పు దిద్ది మన్నించరయా॥

తి. ఇదియును పై పరిశోధనాలయమందుఁగల నాతిశిథిల తాళపత్రప్రతి. సంఖ్య ఆర్. నం. 507. పత్రములు 140. పత్రములు క్రిమిదష్టములై యున్నను చదువఁదగియున్నది. లేఖకుని వ్రాలు –

సీ. శాలివాహన శక సంవత్సరంబులు। చంద్ర రుగిరి చంద్ర (1761) సంఖ్య దనర
వలనొప్పగ వికారి వత్సర శ్రావణ। శుద్ధ తృతీయను సోమవాస
రమున వరాహపురాణంబు ప్రతినున్న। క్రమముగ బుధజన ప్రతతి యలర
బుగత వంశోద్భవుడగు నరసప్పకు। తనయుడౌ సింహాద్రి వినయమునను

తే. సాంతముగ వ్రాసె నీకృతి చదువువారి। కఖిల సంపచ్చిరాయువు లవనియందు
గలుగు పరలోక సౌఖ్యము ల్వెలయుచుండు। నిందిరేశుని సత్కృపాదృష్టివలన.

తీ. ఇదియును పై పరిశోధనాలయమం దుపలబ్ధమగు కాగితపుఁబ్రతి. సంఖ్య ఆర్. నం. 1065. ఇది ఆర్. నం. 1063 కల యత్యంత శిథిలప్రతికి పుత్రిక. పుటలు 344. ప్రసిద్ధ పండితులు-గన్నవరం సుబ్బరామయ్యగారు ఈ ప్రతిని వ్రాసిరి. వ్రాఁత శుద్ధమైనది. తి. ప్రతిలో (ఆర్. నం. 507) ప్రతివిలేఖకుఁడు వ్రాసికొన్న ''శాలివాహన శక సంవత్స రంబులు' అను సీసపద్య మిందును, దీనికి మాతృకయైన కాగితపుఁబ్రతి (ఆర్. నం. 1063) యందును గలదు. కావున, ఈ రెండు కాగితపుఁ బ్రతులకును తి. ప్రతియే (ఆర్. నం. 507) మూలము.

హ. ఈ తాళపత్రప్రతి. ప్రకృతము హైదరాబాదు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయమున కనుపట్టుచున్నది. కారణాంతరమున, తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యానిలయ ప్రాచ్య పరిశోధనాలయమునుండి తెప్పింపఁబడినది. సంఖ్య ఆర్. నం. 869. సమగ్రము. వ్రాఁత మంచిది. శైథిల్య గ్రంథపాతములు లేవు. లేఖకుని వ్రాలు-

క. వ్రాలా శ్రద్ధలు తప్పులు। త్వాలం గల వేను శబ్దసంగతు లెరుగన్
గేలిం బెట్టక నవ్వక। ప్రోలంగా దిద్దరయ్య బుధజనులారా.

శ్లో. యాదృశీ పుస్తకం దృష్ట్వా తాదృశీ లిఖితం మయా। అబద్ధత్వా సుబద్ధత్వా మమ దోషో న విద్యతే॥

రక్తాక్షినామ సం. భాద్రపద శు. 8 శుక్రవారం పొగలు రెండు జాముల ప్రొద్దు అయేసరికి శ్రీపతి గంగన్నగారి ప్రతినున్నక్రమంగాను త్యహాడీ నారాయణప్పగారి కొమాళ్లు పట్టాభిరామయ్య వరాహపురాణం సరస్వతీదేవి అనుగ్రహం వల్లను ఆత్మార్థం వ్రాసుకొనెను.

ర. రాజమండ్రి, రాళ్ళబండి సుబ్బారావు ప్రభుత్వ పురావస్తుశాఖ (పూర్వము – [18]ఆంధ్రేతిహాస పరిశోధక మండలి) యందు లభ్యమగు సమగ్ర తాళపత్రప్రతి. సంఖ్య 192. పత్రములు 199. వ్రాఁత సుందరము. క్రిమిదష్టభాగ ములు కలవు. చదువుటకు కొంత శ్రమ యనిపించును.

లేఖకునివ్రాలు : రక్తాక్షి చైత్ర (?) స్థిరవారం....వరాహపురాణం 5 ఆశ్వాసములున్నూ 199 పత్రములమీద సాంగముగా, రామాపంతుల వెంకట కామోజి 4 ఆశ్వాసములున్నూ, దూశి.... 1 ఆ. వ్రాసినారు.

---

18. Andhra Historical Research Society

క. కాకినాడ, ఆంధ్రసాహిత్య పరిషత్కార్యాలయమందలి తాళపత్రప్రతి. సంఖ్య 33/8. పత్రములు 93. శైథిల్యగ్రంథపాతము కలదు. చదువ పగియున్నది. ఈ ప్రతిలేఖకుఁడుగాని, దానికి మూలప్రతిలేఖకుఁడుగాని వ్రాసికొన్న కాల నిర్దేశముతో స్వీయకవితాపై చిత్రిని ప్రత్యాశ్వాసాంతమునందు నిట్లు ప్రకటించియున్నాఁడు. ప్రథమాశ్వాసాంతమున—

క. ''రంగగు వరాహపురాణము । అంగుష్టాశ్వాసమును వ్రాస్తి అతివేడుకతో
మంగళమతులగువారలు । వెంగలి వాక్యంబులున్న వేగమె దిదుడీ.

వ. అష్టమహిళలతోడి మదనగోపాలున కర్పితం ఆనందనామ సం. మాఖ బహుళ 9 శనివారం రోజునకు పెంనాడ కాపురస్థుడు పంద్రంగి వెంకటశివుడు వ్రాసిన ప్రతి నున్నక్రమాన సీతారామపురం కాపురస్థుడు కొప్పర్తి రామేశం వరాహపురాణం ప్రథమాశ్వాసం సంపూర్ణముగా స్వహస్తముగా సొంతముకు వ్రాసుకొనెను. ద్వితీయాశ్వాసాంతమున—

క. దుర్జను హిరణ్యలోచను । భర్జించినయట్టి పరమపావన పోత్రిం
వూర్జిత భక్తిని నుడువుచు । తర్జన్యాశ్వాసంబు నేను తద్దయు వ్రాస్తిన్.

ఆ.వె. తప్పు ఒప్పు నెరుగ తద్దయు దయచేసి। దిద్దవలయు వేగ వద్దికలర
పెద్దలైనవారు వేవేగ వినవలయు । సవన ఘోణికతల సరవి వినుడి.

వ. మదన గోపాలార్పణమస్తు. ఆనందనామ సం ఫాల్గుణ బహుళ 30 ఆదివారం వర్కు సీతారామపురం కొప్పర్తి వెంకన్న కొమాళ్లు రామేశం పెన్నాడ పంద్రంగి వెంకట శివుడు వ్రాసిన ప్రతినున్న క్రమాన వరాహపురాణం ద్వితీయాశ్వాసం సంపూర్ణముగా స్వంతముకు స్వహస్తంగా వ్రాసుకొనెను. తృతీయాశ్వాసాంతమున—

క. క్రోడపురాణము నందును । మూడో ఆశ్వాసమేను ముదమున వ్రాస్తిన్
పండితజనులును వినుడీ । కుండల వరభూషుడైన గోవిందు కథల్

వ. రాక్షసనామ సం. ఆషాఢశుద్ధ దశమి సోమవారం వర్కు సీతారామపురం కొప్పర్తి వెంకన్నకుమాళ్లు రామేశం వరాహపురాణం తృతీయాశ్వాసం సంపూర్ణముగా సొంతముకు స్వదస్తూరిని వ్రాసుకొనెను.

ఆ.వె. వ్రాతతప్పువలన వాచకులలుగక । తప్పు గలిగెనేని తగిన ఎడల
వలయునక్షరములు వర్ణించి వ్రాయుడి । సుకవులైనవారు సురుచిరముగ

చతుర్థాశ్వాసాంతమున—

ఆ.వె. ముదితచిత్తముతోడ మోక్షంబుకోరియు । వ్రాసి సమర్పిస్తి శ్రీశునకును
నలువ స్తుత్యమైన నాలుగోశ్వాసంబు । నందసుతునికథలు పొందుగాను

ఆ.వె. తప్పు ఒప్పు లెరుగ తెంపున వ్రాస్తిని । పెద్దలెల్ల జూచి ప్రేమ జేసి
తప్పులుండెనేని దయచేసి దిద్దుడీ । సర్వశయనుకథలు నేర్పుమీర

వ. రాక్షస సం. భాద్రపద శు. 12 ఆదివారంవరకు పంద్రంగి వెంకటశివుడు వ్రాసిన ప్రతినున్న క్రమాన కొప్పర్తి రామేశం వరాహపురాణం నాలుగో ఆశ్వాసం సంపూర్ణముగా స్వహస్తముగా సొంతముకు వ్రాసుకొనెను.

పంచమాశ్వాసాంతమున—

వ. రాక్షసనామ సం. పౌష్య బ. (తిథి ?) సోమవారం రోజువరకు వరాహపురాణం 5 ఆ....సీతారామపురం కొప్పర్తి వెంకన్న కొమాళ్లు రామేశం స్వహస్తంగా సొంతముకు సంపూర్ణంగా వ్రాసుకొనెను.

క. తప్పులు ఒప్పులు నెరుగను । తప్పులు వెదుకంగవలదు తద్దయు బుధులుం
తప్పులు దిద్దగవలయును । అప్పులశయనించువాని ఆదివరహమున్''

పై పద్యములన్నియు 'ఎమితిని సెపితివి కపితము' అనుధోరణిలో నున్నవి. లేఖకుని భాషాపాండిత్యము, లక్షణపరిజ్ఞానము ఈరీతి నున్నవి. సామాన్యభావమును వెలార్చు వ్రాతలోనే యిన్ని అపభ్రంశములు దొరలియుండఁగా ఇఁక, ప్రౌఢకవుల ప్రబంధములను వ్రాయువేళ నుప్పతిల్లు అక్షరదోషములకు నపపాఠములకు హద్దులుండునా?

పై కార్యాలయమందు, మఱొక కాగితపుఁబ్రతి కనుపట్టుచున్నది. సంఖ్య 113/20. పుటలు 147. మిక్కిలి ప్రాఁతది. కాగితములయందు సిరా యూరిపోయి యున్నది. పోల్చి చదువుట శ్రమకరము. ప్రత్యంతమున "శాలివాహనశక సంవత్సరంబులు'' అని లేఖకుఁడు వ్రాసికొన్న సీసపద్యముండుటచే ఇది తి. ప్రతికి (ఆర్. నం. 507) పుత్రిక యనుటలో సంశయము లేదు.

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యానిలయ ప్రాచ్యపరిశోధనాలయములో అత్యంత శిథిలమగు కాగితపుఁబ్రతి మఱొకటి కలదు. సంఖ్య ఆర్.నం. 1063. పుటలు 198. సమగ్రము. ఇది ఆర్.నం. 1065 ప్రతికి మాతృక.

ఈ పరిశోధనాలయములోనే ఒక్క పత్రము మాత్రము గల తాళపత్ర *ప్రతి యొకటి కలదు. సంఖ్య డి.నం 306. దీని ప్రయోజన మంతమాత్రమే.

రాజమండ్రి, కాకినాడ ప్రతులు తప్ప, మిగిలిన తిరుపతి ప్రతులన్నియును పూర్వము మదరాసు ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయమందు (G. O. M. L.) ఉండినవి. ఆకారణముచే ఆ ప్రతులవివరము లాగ్రంథాలయ [19]వివరణ పట్టికలయందు కాననగును. ఆంధ్రరాష్ట్ర విభజనానంతరము మదరాసునుండి తరలిన ఆంధ్రసాహిత్యములో ఆ ప్రతులు చేరియున్నవి. ఇపుడు తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యానిలయ ప్రాచ్యపరిశోధనాలయములో భద్రపఱుపఁబడియున్నవి.

కాకినాడ, పరిషత్పుస్తక భాండాగారములోని ప్రతి గ్రంథసంఖ్య 986 అని, [20] ఆంధ్రసాహిత్య పరిషత్పత్రికలో వర్ణితమై యున్నది.

---

* ప్రతి : 'గ్రంథము' అను అర్థమున వాడఁబడు ప్రతి శబ్దము దేశ్యము. నేఁడీ పదము సంస్కృతతుల్యముగా వ్యవహారస్థమైనది.

19. Descriptive and Triennial catalogues, 20, సంపు. 4 పు. 434-435.

## 2. వ్రాతప్రతుల కాలసూచి

| ప్రతి | సంఖ్య | భారతీయ కాలమానము | ఆంగ్ల కాలమానము |
|---|---|---|---|
| మ. | ఆర్. 2139 | ప్రమోదూత సం. పుష్య బ.6 జయవారము | 15-1-1811 |
| మా. | ఆర్. 1951 | క్రోధి సం. ఫాల్గున బ. 5 ఆదివారము | 21-2-1725 |
| త. | ఆర్. 827 | రుధిరోద్గారి సం. ఆషాఢ బ. 8 జయవారం | 12-7-1803 |
| తా. | ఆర్. 411 | పార్థివ సం. ఆషాఢ బ 8 జయవారం | 4-8-1885 |
| తి. | ఆర్. 507 | వికారి సం. శ్రావణ శు. సోమవారం | 12-8-1839 |
| తీ. | ఆర్. 1065 | (కాగితపుప్రతి) | 1940-41 |
| హ. | ఆర్. 869 | రక్తాక్షి సం భాద్రపద శు. 8 శుక్రవారం | 9-9-1864 |
| ర. | 192 | (అ.3) రుధిరోద్గారి కార్తిక శు. 4 శనివారం | 14-11-1863 |
| క. | 33/8 | రాక్షస సం.పుష్య బ.7 సోమవారం | 28-1-1855 |

## 3. పరిష్కరణ ప్రవేశిక

లేఖన సంప్రదాయము : గ్రంథపరిష్కరణమునకు కావించుకొన్న నియమములలో ఆద్యమగు లేఖనపద్ధతిని చూపి, నేఁటి విధానములోనికి మార్చి, దిక్ప్రదర్శకముగా ఉదాహరింపఁబడును. ఇందులకు మ. ప్రతి (ఆర్. నం. 2139) ఆధారముగాఁ గొని, అందులోని యవతారికయందలి పద్య గద్యములనుండి కొన్ని యుదాహరణములు.

1. పూర్ణబిందువుమీఁది హల్లులకు ద్విత్వము.

| | ప్రాచీన సంప్రదాయము | నేఁటి సంప్రదాయము |
|---|---|---|
| అవ. | 1. సరోజాక్షుండ్డు రక్షించ్చు | సరోజాక్షుండు రక్షించు |
| | 2. సంబ్భవము, దాంప్పత్యము | సంభవము, దాంపత్యము |
| | 3. మధ్యంబ్బున | మధ్యంబున |
| | 5. విండ్దు, స్వాంత్త | విందు, స్వాంత |
| | 17. అంక్కితము | అంకితము |
| | 19. సంయ్యమి | సంయమి |
| | 28. గంగ్గాంబ్బ | గంగాంబ |
| | 31. అంబ్భోధి | అంభోధి |
| | 51. గ్రంద్ధము | గ్రంథము |

2. ద్రుతమునకు స్థిరములు పరములగునపుడు పూర్ణబిందువు.

| | |
|---|---|
| 7. సవడిం మ్రుచ్చిలి | సవడిన్ మ్రుచ్చిలి |
| 27. ఈక్షించం లోపల | ఈక్షించెన్ లోపల |
| 49. మఖికిం సుఖికిన్ | మఖికిన్ సుఖికిన్ |

3. అస్థానమున పూర్ణబిందువు.

| | | |
|---|---|---|
| 1. | కౌంస్తుభమణి | కౌస్తుభమణి |
| 9. | ముంన్న | మున్న |

4. ఖండబిందువు స్థానమున పూర్ణబిందువు.

| | | |
|---|---|---|
| 7. | పోంక | పోఁక |
| 30. | గాంగ | గాఁగ |

5. పూర్ణబిందువుమీఁది హల్లులలో మార్పు.

| | | |
|---|---|---|
| 9. | నృశింహ్వా | నృసింహా |
| 23. | సంహ్వారణ | సంహారణ |

6. ద్రుత సంధి కప్రాప్తి.

| | | |
|---|---|---|
| 8. | అని యివ్విధంబ్బున యిష్టదేవతా | అని యివ్విధంబున నిష్టదేవతా |
| 13. | అనుచు కృతనిశ్చయుడై | అనుచుఁ గృతనిశ్చయుఁడై |
| 50. | పాండిత్యునకుం పరమోత్సవ | పాండిత్యునకుం బరమోత్సవ |

7. కొన్నియెడల కృతహ్రస్వము మీఁది హల్లునకు ద్విత్వము.

| | | |
|---|---|---|
| 23. | గియ్యమాన | గీయమాన |
| 33. | వర్ణనియ్య | వర్ణనీయ |
| 40. | జేగియ్య | జేగీయ |

8. శ ష స వర్ణవ్యత్యయములు.

| | | |
|---|---|---|
| 5. | వింద్దుచేశి | విందుచేసి |
| 9. | నృశింహ్వా | నృసింహా |
| 23. | రంగశీమా | రంగసీమా |
| 24. | రశికుల | రసికుల |
| 36. | పషిడి | పసిఁడి |
| 39. | గర్భసుక్తి | గర్భశుక్తి |

9. ఖ ఘల విపర్యాసము.

| | | |
|---|---|---|
| 4. | నఘరుచుల్ | నఖరుచుల్ |
| 23. | పార్వతీశాఘర్వ | పార్వతీశాఖర్వ |
| 48. | చరణ నఘునకు | చరణ నఖునకు |

10. ఫ భల మార్పు.

| | | |
|---|---|---|
| 29. | భణీంద్ర | ఫణీంద్ర |
| 42. | భణినాయక | ఫణినాయక |

11. వలపలగిలక తెచ్చిన మార్పు.

| | |
|---|---|
| 3. వనర్ణ | వర్ణ |
| 30. కనర్ణము | కర్ణము |
| 31. పూనర్ణమా | పూర్ణిమా |

12. మఱికొన్ని వర్ణ వ్యత్యయములు.

| | |
|---|---|
| 9. శార్ఙిపాణి | శార్ఙపాణి |
| ,, చెతుర చెతురంగ | చతుర చతురంగ |
| 30. చన్నశౌరి | చెన్నశౌరి |
| 25. పరిమెళ | పరిమళ |
| 31. గోలిపాక | గొలిపాక |
| 36. దుగ్ధాః ప్పతి | దుగ్ధాప్పతి |
| 43. పయఃప్పాథోది | పయఃపాథోధి |
| 36. పరమేష్టి | పరమేష్ఠి |
| 40. సోష్టవము | సౌష్ఠవము |
| ,, సంగ్గిత | సంగీత |
| 47. వేద స్తరుణీ | వేధ స్తరుణీ (ధ ప్రాస) |
| 14. స్థితుడై విష్ణుకీర్తన (గణభంగము) | స్థితుఁడయి విష్ణుకీర్తన |
| 43. వయిభవామర | వైభవామర |
| 2. చిరాయుహొన్నతుల్ (దుస్సంధి) | చిరాయురున్నతుల్ |

కొన్ని లాక్షణికాంశములు :

1. పదాది యకార వుకారములు:— 11. యివ్విధంబునం జూపట్టుచు 12. యలమి విలసిల్లె గొలిపాక యర్రశౌరి 39, యివ్విధంబున లోకోత్తర 44. యీాదృశసుగుణాకల్పునకు 49: వుద్యత్ప్రతాపనిర్జిత. "యకారంబును వు వూ వొ వోలును దెలుఁగు మాటలకు మొదట లేవు" అని చిన్నయసూరి యనుశాసనము (బాల.సంజ్ఞా.17). చిన్నయసూరికి పూర్వముండిన లేఖకు లీనిషేధమును గుర్తించుటకు వీలులేదు. కావున నన్ని తాళపత్ర ప్రతులయందును పాఠములు పైరీతి నగపడుచున్నవి. దీనిని గుర్తించియే సూరి పై నిషేధసూత్రమును వ్రాయవలసివచ్చెను,

2. అవసానద్రుత స్వరలోప విధానము:— 14. పురాణము లాలకింపుచున్ 15. నన్ను బిలిచి యిట్లని ాశ్వద్మజుండో యనన్.

ఁనందు ద్రుతస్వరంబునకేని ద్రుతంబునకేని లోపంబు బహుళంబుగానగు. (బాల. సంధి. 20) ఁడు వచ్చెను. ఈ లోపంబు పద్యాంతములయందు గణానుసారంబుగా వ్యవస్థితంబయి యుండు. ఁయంబుతుదను స్వత్వంబు లేదు. అతిశయముగ బుద్ధిమంతుఁడగు బుధసేవన్,"

పై వృత్తిలోని 'స్వత్వంబులేదు' అను నిషేధవాక్యము గమనింపఁదగినది. నేఁడు ముద్రిత గ్రంథములయం దెక్కడను గుర్వవసాయియగు పద్యము కడపట స్వత్వముండు రూపము మచ్చునకొకటికూడ కానరాదు. 'లేదు' అని నిషేధించుటకు పూర్వము ప్రాప్తి యుండవలయును గదా! (ప్రాప్తిపూర్వకో హి నిషేధః) అని శంక కలుగవచ్చును. సమాధానమిది. అది తాళపత్ర ప్రతులలోని వ్రాఁతయందు కాననగును. "అతిశయముగ బుద్ధిమంతుఁడగు బుధసేవను'' అనియే ప్రాచీనలేఖన సంప్రదాయము. అదే రీతిలోనే పై ప్రయోగములుకూడ నున్నవి. అన్నియును గుర్వవసాయియగు పదములే. వానిని – ఆలకింపుచున్, పలికెన్, పద్మజుండోయనన్ – అని ద్రుతస్వరమునకు లోపము కావించుకొని వ్రాసికొనవలయును.

మఱియు, ఇట సూరి నిర్దేశింపఁదలఁచిన ఛందోంశము ఒకటి గలదు. సంస్కృతమందలి 'గురు' లక్షణము తెనుఁగునకంటె భిన్నమైనది. పాదాంతమున – లఘువునకు గురువుగను, గురువునకు లఘువుగను అట వివక్ష యుండుట విశిష్టప్రక్రియ.

స్నిగ్ధచ్ఛాయాతరుషు వసతిం రామగిర్యాశ్రమేషు - ఇది మందాక్రాంతా పద్యపాదము. అంతిమాక్షరము గురువుగా ఉండవలయుననుట నియమము. 'షు' వర్ణము లఘువైనను, ఇట గురువుగా దీనికి వివక్ష.

ప్రమాణము: వర్ణో గురుర్మతో హ్రే ప్రే పాదాంతే చాపి వా లఘుః (ఛందఃకౌస్తుభం)

ఆంధ్రమున ఈ పద్ధతికి అవకాశము లేదు. అనఁగా, పై ద్రుత స్వత్వరూపములకు గురుత్వవివక్ష మనకు లేదని ప్రాసంగికముగా ధ్వనింపఁజేయుట సూరియాశయము.

3. దంత్య చకారము :– 20 నిత్సలు నుబ్బుచుండఁగన్.

తెనుఁగునకు విశిష్టత నాపాదించు వర్ణములలో దంత్య చ-జల విధానము ప్రధానమైనది. ప్రాచీన లేఖకులు 'నిచ్చలు' అను పదమును 'నిత్సలు' అని వ్రాయుచుండిరి. దంత్య చకారమును 'త్స' యని వ్రాయుట వారి యలవాటు. దీనికి కారణమేమైయుండును? తకార సకారములు రెండును దంత్యములే (ఌతులసానాం దంతాః). తరువాత సకార స్థానమున 'చకారము'ను నిలిపి, మొదటి తకారమునకు బదులుగా తాముడి (ౘ) నిలిపి వ్రాయుట రూఢిలోనికి వచ్చినట్లున్నది. ఈ నియమమును నిఘంటువులు పాటించినవి. (చూ. శ. ర.) కాని నేఁడీ నియమము వ్రాఁతయందుఁగాని, ముద్రిత గ్రంథములయందుఁగాని కానరాదు. ఉచ్చారణమునందు భ్రంశము కాకుండుటను సూరి యిట్లు వ్యవహరించెను.

అ ఆ ఉ ఊ ఒ ఓ ఔలం గూడిన చ జలు దంత్యములు. ౘలి. ౘాప మొ. (సంజ్ఞా. 9). ఈ చకారము మీఁది తాముడిని రెండవ సంఖ్యగా భ్రమించినవారు లేకపోలేదు.

4. శిథిలద్విత్వ రూపము. 42. సార కలహార కర్ణికా.

కలహార శబ్దము 'కహ్లార' శబ్దముయొక్క శిథిలరూపము. ఇంతకు నీ పదమునకు సరియైన రూపము కహ్లారము. ''సౌగంధికం తు కహ్లారం'' అని యమరము. "కే జలే హ్లాదతే ఇతి కహ్లారం" అని వ్యుత్పత్తి. జలమున సంతసించునది – కలువ యని భావము. [1]హ్న హ్ల హ్మాం న ల మానాం స్థితిరూర్ధ్వం – అను ప్రాకృతమంజరి సూత్రమువలన, లకారము పైకి వచ్చి, హకారము క్రిందఁజేరఁగా 'కల్హార' అయినది. ఆ నియమము ప్రాకృతమునకే పరిమితమైనది.

---

1. వహ్ని ర్వన్హీతి కహ్లారం కల్హార మభిధీయతే। బ్రహ్మా బమ్హా మత స్తేషాం స్థితిరూర్ధ్వ మితీదృశీ ॥ (ఆంధ్రభాషానుశాసనము, పు. 10).

5. ఖండబిందువు - శకటరేఫము

ఆంధ్రమున అర్ధానుస్వార శకటరేఫముల చరిత్ర కొంతవఱకు అనిశ్చితమై కనుపట్టుచున్నది. ఈ విషయమున విజ్ఞులలో విభిన్నాభిప్రాయములు కలవు. లభించిన వరాహపురాణ తాళపత్రప్రతులు పెక్కింటిలో అర్ధబిందు స్థానమున పూర్ణబిందువు కనుపట్టుచున్నది. కాని యొకటి రెండు ప్రతుల (తి. ర. ప్రతుల)లో మాత్రము ఖండబిందు వుండవలసిన చోట, కేవల బిందువు ( . ) నిక్షిప్తమైయున్నది. ఉదా : 1-12 రే.గి. 1-14 లే.త, 1-51 దో.మ, 1-122 గా.డె, 1-125 ఆ.కటి, డా.గు, 1-158 తో.ట, 1-161 వా.డు, 2-143 తే.టి. హైదరాబాదు ప్రతిలో మాత్రము 110 వ, పత్రమునుండి భిన్నలేఖకుఁడు ఖండబిందువును (ఁ) కొన్నిచోట్లను, కేవల బిందువును ( . ) మఱికొన్నిచోట్లను గుర్తించి యున్నాఁడు. ఉదా : 4-118 వేఁడిన; వేఁడనిచ్చు, 4-119 వాఁడునార్యుఁడే, 4-129 ఏఁగుదెంచి, 4-214 దా.టి. అన్ని తాళపత్ర ప్రతులలోను శకటరేఫ స్థానమున లఘురేఫమే కలదు.

అపపాఠములు

ఇఁక ముద్రిత గ్రంథముయొక్క అధోభాగమున అన్ని ప్ర. యని గుర్తించిన పాఠముల వివరములు, అన్ని ప్ర. అనఁగా లభించిన యన్ని ప్రతులలోని పాఠమని భావము. అన్నిపాఠములు నపపాఠము లయినప్పుడు వానిలోని దోషమును పరిహరించి, సంస్కరించి ప్రచురించిన పాఠముల తీరుతీయము లీ విభాగమున వివరింపఁబడును. మొదటి పాఠము వ్రాతప్రతిలోనిదిగాను, రెండవ పాఠము సవరణమందిన సంశోధిత ప్రతియందలిదిగాను భావింపవలయును.

వక్షః స్థలా - వక్షః స్థల అవ. 1. అన్ని ప్రతులయందు 'స్థలా' యను పాఠము కలదు, 'స్థలం స్థలీ' అని యమరము. స్థలం - నపుంసకలింగరూపము. స్థలీ - స్త్రీలింగరూపము. స్థలశబ్ద మిందు గ్రహింపఁబడినది.

శ్రీ రాజీవాక్ష వక్షః స్థల నిలయ రమా (విశ్వగుణా. 1)

అబ్ధిలేకార్ణవత్వంబు నందియుండు - అబ్ధిలేకార్ణవత్వంబు నందియుండ 1-20.

రోమశముని మార్కండేయమహర్షి రాకకు సంతోషించి, అతని శ్లాఘించు ఘట్టములోనిది. ఆ ముని మాహాత్మ్య మసామాన్యమైనది. ప్రళయకాలమున సముద్రములన్నియు నొకటై, జలమయమై కనుపట్టుచుండఁగా, చిరంజీవియైన మార్కండేయముని వటపత్రశాయిని సేవించు భాగ్యమును పడసియుండెను. ఈ ప్రకరణమున భూతకాలిక మైన 'ఉండు' క్రియ, 'భయమెఱుఁగక' యను మీఁది పదముతో నన్వయింపదు. కావున, సందర్భానుగుణముగా 'ఉండు' ధాతువు తుమర్థక రూపమైన 'ఉండన్' గ్రహింపఁబడినది. అపుడే, సీసపాదములోని 'పర్వెన' మొదలగు క్రియారూపముల తోడి యన్వయము కుదురును.

దుష్పురుషునితోటి బాంధవము - దుష్పురుషునితోడి బాంధవము 1-39.

ఇందు 'తోటి' వ్యావహారిక రూపము. తృతీయావిభక్తి ప్రత్యయమగు 'తోడ'కు సమాసయోగమున 'తోడి' యను రూపము సిద్ధించును (చూ. బాల, సంధి-43). [1]"తోడకు తోటియని కొన్నియెడలఁ గలదు. కాని యయ్యది గ్రామ్యము" అని లాక్షణికాభిప్రాయము. లక్ష్యము.

1. నారాయణీయాంధ్ర వ్యా. పు. 248.

తే. భంగమొందిన యల రామలింగముఖులు। సాటి రాఁగలవారె నీ తోటి? యౌర।
యాంధ్రకవితాపితామహ! యల్లసాని। పెద్దనార్య! విశేష వివేకధుర్య! (చాటువు)

పాషండకుల భూషితంబులై పొలియునపుడు - పాషండకుల దూషితంబులై పొలియునపుడు 1-48.

ధర్మము నశించి, యధర్మము పెచ్చుపెరిగినపుడు భగవంతుఁడు భూమిపై నవతరించి, ధర్మస్థాపనము కావించును. వేదాది విద్యలు పాషండకులదూషితములై నశించునపుడు భగవదవతారప్రసక్తి కలుగును. కావున వేదములు పాషండకుల భూషితములగుట అసంభవము. ఆపాఠము ప్రకరణమునకు ననుచితము. 'దండింతుఁ బాషండులన్' అని విష్ణుమూర్తి యొక్క ప్రతిజ్ఞావాక్యమిందే కలదు (చూ. 3-286), గీతావాక్య మిట్లున్నది.

శ్లో. యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత। అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం॥ (4-7)

చతురోపాయంబులచేత శాత్రవనాశంబొనర్పవలయు, చతురుపాయంబులచేత శాత్రవనాశంబొనర్ప వలయు. (1-90)

శత్రువును జయించుటకు సాధనములు 4. 1. సామము, 2. దానము. 3. భేదము, 4. దండము. వీనికి చతురుపాయములని పేరు. చతుర శబ్దమును ఉపాయమునకు విశేషణముగా గ్రహించినచో, అది ప్రయోజనశూన్యము. కావున సంఖ్యావిశేషణమైన చతుశ్శబ్దమును స్వీకరించుట యోగ్యము.

నిరుపమోద్యాన తరుపుష్ప - నీడలొక్కొ, నిరుపమోద్యాన తరువుల - నీడలొక్కొ! 1-128

సురపతి వైకుంఠనగర సౌందర్యాతిశయమును వర్ణించు సందర్భములోనిది. అందలి కోటలు, పరిఖలు, గోపురములు, సుందరీమణులు మొ॥ అన్నియు స్వర్గములోని వానికంటె నతిశయములై కనుపట్టుచున్నవని భావము. దివిజ భూజములైన కల్పవృక్షాదులు వైకుంఠనగరోద్యానమందలి వృక్షములకు ఛాయాసదృశములై యున్నవి. ఈ భావమున 'తరుపుష్పనీడలు' వైరిసమాసము. ఇది ప్రకరణోచితమును కాదు. కావున "తరువుల నీడలొక్కొ" యను సవరణము సందర్భోచితము, నిర్దుష్టము నగుచున్నది.

భూదేవియుం బ్రాగ్ద్వారముఖంబున నన్నగరంబు ప్రవేశించి,

భూదేవియుం బ్రాగ్ద్వారముఖంబున నన్నగరు ప్రవేశించి. (1-132)

నగర, నగరు - అను పదములు విభిన్నార్థకములు. నగరము - పురము, నగరు - అంతఃపురము. దేవతలు వైకుంఠనగరమును దర్శించి వచ్చునంతలో భూదేవి తూర్పుముఖద్వారమునుండి నగరి (Palace) లో ప్రవేశించెను. దీనికి ప్రయోగములు—

అల వైకుంఠపురంబులో నగరిలో (ఔపవిభక్తి.) (భాగ. 8-95)

నగరు పగాయె, నింక విపినంబుల కేఁగుడు రాజ్యకాంక్షకుం

దగరు కుమారులార! .......... (రాధామాధవకవి సమస్యాపూరణము)

చరణములకు నొరగి లేచి - చరణములకు నెఱఁగి లేచి. (1-136)

వైకుంఠమున భూదేవి విష్ణుమూర్తి పాదములకు నమస్కరించి లేచెను. ఈ సందర్భమున హరిచరణములకు ఒరగుటకంటె, ఎఱఁగుట ధర్మము కదా! ఒరగు — వంగు, వ్రాలు; ఎఱఁగు — నమస్కరించు.

ధర్మంబు సామాధికుల్ - ధర్మంబు సామాజికుల్. (1-153)

ఇది విష్ణుమూర్తి వసుంధరతో నాడిన సాంత్వనవాక్యములలో చేరినది. సామాధికుల్ - సందర్భహీనమైన యపపాఠము, సామాజికుల్ - అనునది చిన్ని సవరణముతో సరిపడు సాధుపాఠము. సామాజికులు=సభయందుండువారు; సభ్యులు. సభ్యులు స్వార్థరహితులై ధర్మమును నిర్ణయింతురా? యనునది ప్రకృతప్రశ్న, అది చక్కఁగా నిర్వహింపఁబడ వలయును.

"సా సభా యత్ర సభ్యోఽస్తి । న సభ్యో ధర్మ మాహ యః ।
స ధర్మో యత్ర సత్యం స్యాత్ । తత్సత్యం యత్ర న చ్ఛలం ॥ (కథాసరిత్సాగరము)

అప్పుడు జయవిజయు లిద్దఱు - నంబుజాక్షు, అప్పుడు జయవిజయు లిరువు - రంబుజాక్షు. 1-174,

'ఇద్దఱు' అను పాఠమున వర్ణాధిక్యముచే గణభంగము. కావున, 'ఇరువురు' అను పర్యాయపద స్వీకరణము వలన అర్థహాని లేదు; ఛందోదోషము పరిహరింపఁబడినది.

బాలత్వ కౌమారంబుల్ ధరియించి । బాలత్వ కౌమారంబుల్ తరియించి, 2-8

హిరణ్యాక్షుఁడు బాల్య కౌమార దశలను దాఁటి యౌవనావస్థలో నున్నాఁడు. అట్లుకాక బాల్య కౌమారములను దాల్చి, యౌవనములో నున్నాఁడని భావించుట ప్రకృతి విరోధము. ఏకకాలమున విభిన్నావస్థ లొకవ్యక్తియందుండుట అసంభవము. కాఁగా, బాల్య కౌమారములు తొలఁగుట, యౌవనము వచ్చుట జరిగినది. పై అపపాఠమునకు కారణమిది. కౌమారంబుల్ - తరియించి, ప్రథమమీఁది తకారమునకు దకార మాదేశముకాఁగా - కౌమారంబుల్దరియించి యని యుండఁగా, లేఖకుఁడు దానిని వర్గచతుర్థాక్షరముగా వ్రాసికొనెను. ఇది లేఖక ప్రమాదము.

శంకరాది సమస్తసురలు - శంకరాదిసమస్తసురులు 2-93

తరిత్రాడు చేసిరమరాసురలు - తరిత్రాడు చేసి రమరాసురులు 2-115

దాగిన నవనిసురలు - దాగిన యవనిసురులు 4-78

సురశబ్దమునకు వ్యస్తమైనపుడు బహువచనరూపము సురలు. సమసించినపుడు, సురశబ్ద మకారాంతము కావున తుది అత్వమునకు, ఉత్వము వచ్చి, సమస్తసురులు, అమరాసురులు, అవనిసురులు-అను రూపములు సిద్ధించును. (చూ. బాల, తత్సమ 59-60.)

ఆపదమాని వహ్నిహతులయ్యు-ఆపదనూనవహ్ని హతులయ్యు

విష్ణుసంస్మరణఫల మిందు వర్ణితము. ప్రథమపాఠమున, ఆపద లేక వహ్నిహతులగుట-అనునది అనన్వితపాఠము, ఆపదలనెడు అనూనవహ్నియందు హతులగువారు హరిస్మరణముచే సకల సౌభాగ్యములను బడసి, సుఖింతురనుట -

ప్రకరణానుకూల పాఠము. లేదా, మానము - కొలఁది. అమానము తక్కువకానిది, కాన 'ఆపదమానవహ్ని' యనియైనను (ఆపద్ + అమానవహ్ని) సవరింపనగును. అనూనవహ్ని, అమానవహ్ని యనఁగా - మహాగ్ని (దావాగ్ని) యని అర్థము కావచ్చును. ఇప్పట్టున, పోతరాజుగారు :

తాపత్రయాభీల దావాగ్నులారునే విష్ణుసేవామృతవృష్టి లేక (భాగ. 7-171)

తళుకు వాలికె చూపుగములు - తళుకు వాలిక చూపుగములు 2-144.

వాలు + ఇక - వాలిక. 'ఇక' తద్ధిత ప్రత్యయము. వాలికె అనునప్పుడు ఈ విభాగము కుదురదు. 'వాలిక'కు ప్రయోగాంతరము—

పుత్తడిబొమ్మకన్నుగవ పోలిక వాలిక గండుమీలకున్ (విజయ, 2-108)

దీనం గలయంగనేరని - వీనం గలయంగనేరని 2-182.

సామ దానములకు లొంగని నృపతిని భేదోపాయముచేత జయింపవలయును. సామ దానములను పేర్కొని తరువాత, దీనన్ = దీనిలో అని, ఏకవచనమును నిర్దేశించుట 'వచన' దోషము. కావున 'వీనన్' అను బహువచన రూపము సాధువు.

గణితశాస్త్ర విద్యా చరితుల్ - గణితశాస్త్ర విద్యా చతురుల్ 3-45.

ఈ పద్యమున కాలమానము వర్ణితమై యున్నది. కాలనిర్ణయమును కావించినవారు గణితశాస్త్ర విద్యయందు 'చతురులై' యుండవలయును గదా ! 'చరితుల్' లేఖక ప్రమాదము.

విచ్చనవిడి విష్ణులోకవిభవము। విచ్చలవిడి విష్ణులోకవిభవము. (3-77)

విచ్చనవిడి - అను పదము లేఖకకృతాపపాఠము. విడి+విడి=విచ్చలవిడి. యథాప్రయోగముగా గ్రహింపఁదగిన ''అందదుకువర్గమునకు'' చెందినది (చూ. బాల. సంధి - 42). విచ్చలవిడి. దే. వి. విచ్చలు + విడి యని శబ్దరత్నాకరము.

క. విచ్చేయు మదితిగర్భము। చెచ్చెర వెలువడు మహాత్మ చిరకాలంబున్।
విచ్చలవిడి లేకమరులు। ముచ్చటపడి యున్నవారు ముదమందింపన్॥ భాగ. 8.

విభిన్న మూర్ధ్నుడై - విభిన్న మూర్ధుఁడై 3-141 నిజ మూర్ధ్నభాగ - నిజమూర్ధభాగ 4-227

మూర్ధన్ శబ్దము నకారాంతము, పుంలింగము. అకారాంతముగా మాఱి, 'మూర్ధుఁడు' అనియును, సమాసమున, మూర్ధభాగ - అనియు నగును, ''మూర్ధ్రఘ్రాణంబు సేసె'' - అను సంశోధిత భారతము (కర్ణ, 3-88 ) లోని ప్రయోగమునకు అధోజ్ఞాపికలో "మూర్ధ్నిఘ్రాణము - పెక్కుప్రతులు'' అని తెల్పఁబడినది; మూర్ధ్ని - యని వ్రాయుట లేఖన సంప్రదాయమై తోఁచుచున్నది.

యువరాజ్య పట్టవైభవము - యువరాజ పట్టవైభవము 3-280

యువరాజ పదవికి పట్టాభిషిక్తుని గావింతునని విష్ణుమూర్తి ప్రహ్లాదునితో పలికెను. కాని యువరాజ్యమని రాజ్యములో ఒక ప్రత్యేక విభాగము లేదు. తండ్రి యుండఁగా, కుమారుని యువరాజ పదమున నభిషిక్తుని కావించుట సమీచీనాచారము. కావున యువరాజ పట్టవైభవ అని కాని, దానికి తద్ధితరూపమైన యౌవరాజ్యపట్ట వైభవ అను పాఠమును కాని గణోచితముగ స్వీకరింపఁదగును.

దిశావకాశములు గప్పి కనుంగొన నొచ్చి - దిశావకాశములు గప్పి కనుంగొన నొప్పె 3-294

హిరణ్యకశిపుఁడు తన కుమారుని జంపుటకు సైన్యముతో తరలి వచ్చుచుండఁగా, సైన్య పదఘట్టనముచే చెలరేఁగిన ధూళి దిక్కులఁ గప్పివైచెను. ఆ వ్యాపనము, 'విష్ణు వావిర్భవించునంతలోపల రాక్షసుఁ డొండెడకు దాగికొనఁ బోవునేమో!' యని తలంచి, వాని కండ్ల రికట్టుటకు నట్లు హరి మాయ పన్నెనేమో : యను రీతిని పొడగట్టెను.¦కనుంగొనన్. ఒప్పెన్ - అను సమాపకక్రియ యుండిననే పై రీతి నుత్ప్రేక్షించుటకు నెడము కలుగును. 'నొచ్చి' యను పాఠమున భావస్ఫూర్తి లేదు.

ప్రళయానిల సన్నిభమై జలజాహితకోటి - ప్రళయానల సన్నిభమై జలజాధిపకోటి 3-301

ఇది నరసింహావతార ఘట్టములోనిది. విష్ణువు తొలుత తేజఃపుంజముగా కనుపట్టెను. ఆ తేజము ప్రళయానల సంకాశము. అనల శబ్దమును - అనిల - యని వ్రాసికొనుట లేఖక ప్రమాదము. ఇందులోనే 'జలజాహితకోటి సంకాశ" మన్నది, మఱొక ఉపమానము. జలజములకు అహితుఁడు చంద్రుఁడు. అతనిలో దాహక తైక్ష్ణ్యశక్తులు లేవు. కావున జలజ + అధిపుని (సూర్యుని)తో సామ్యము కల్పించుట ప్రకరణోచితము.

ధ్యానయోగ భక్తియోగ కర్మయోగంబుల-జ్ఞానయోగ భక్తియోగ కర్మయోగంబుల. 4-12

ఆత్మతరణోపాయమునకు ముఖ్యమైన మార్గములు మూఁడు; 1. కర్మయోగము 2. జ్ఞానయోగము 3. భక్తియోగము. వ్రాఁతప్రతిపాఠమున జ్ఞానయోగము పరిత్యజింపఁబడినది. అస్థానమున ధ్యానయోగము పేర్కొనఁబడినది. ధ్యానము భక్తియోగములో నంతర్భవించును. కావున దానిని ప్రత్యేకింపఁ బని లేదు. జ్ఞానహీనమైన మిగిలిన యోగము లప్రయోజనములు, వ్యర్థములు.

వలిపెంపుఁ గంచెలియ మెఱుంగున-వలిపెంపుఁ గంచెల మెఱుంగున. 4-53

ఇది వైష్ణవీమాయ వర్ణనములోనిది. ఇందులో 'కంచెల' యని యుండవలసినచోట 'కంచెలియ' ప్రయుక్తమై యున్నది. కంచెలియ పదసాధుత్వము శంకనీయమై యున్నది. పూర్వకవి ప్రయోగములలో 'కంచెల' కాననగును. కంచెల-అవిక; కంచులీ శబ్దభవము.

1. కం। చెల తెగఁ, గుట్టియూఁడు వెలచేడియకున్ విషయాభిలాషియై (క్రీడా. 106)
2, కంచెలయుం బటీరతిలకంబును.... (శృం. శా. 4-78)
3. కం। చెల తెగిపడ్డఁ, గేతనముచీరచెఱంగున మూసెఁ జన్నులన్ (మను. 5-63)
4, కం।చెల వెడలించి మాటికిని జేతుల నొక్కుచు హొంతకారియై (రసికజన, అవ, 3)

సరోజాయతనేత్రి గర్భపుటమందు - సరోజాయతనేత్ర గర్భపుటమందు 4-72

ప్రాచీనప్రతులయం దన్నింటను 'సరోజాయతనేత్రి' యను పాఠమే కలదు. ఇది అపాణినీయము. కావున అసాధువని లాక్షణికాభిప్రాయము. "అంగాదులకుఁ దప్ప సంయోగోపధంబులకు జీప్రత్యయము లేమింజేసి మీననేత్రి పద్మనేత్రి ఇత్యాదు లసాధువులు" అని చిన్నయసూరి వృత్తి (బాల, తత్సమ-86). ఈ విషయమున మహావైయాకరణులైన మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారి యభిప్రాయ మిట్లున్నది.

[2]"అమరనిచ్చె విమలకమలనేత్రి (సో. శా). తాటాకు పుస్తకములలోనున్న యిట్టి ప్రయోగము లనేకములు అచ్చులో 'నేత్ర' యని దిద్దఁబడినవి....సారస్వత వ్యాకరణమునందు పద్మనేత్రీత్యాదుల కనుశాసన మున్నదఁట."

హరిభట్టుకూడ ఈ యపాణినీయ ప్రయోగముపై మక్కువ చూపియున్నాఁడు. అది యంత్యానుప్రాస సంఘటితమై యున్నది, చూడుఁడు :

పద్మదళనేత్రి సౌందర్యభరితగాత్రి (వరాహ, 5-24) భారతాదులయందు అపాణినీయములు చాలఁ గలవు. ఇటువంటి విషయములందు సహృదయులే ప్రమాణము.

బాలుఁడై యున్నవాఁడు రేపల్లెలోన - వ్రేపల్లెలోన, 4-197, అఁట రేపల్లెలోన నందుండు 4-198

రేపల్లె వ్యావహారికరూపము. వ్రేపల్లె-గొల్లపల్లె. యతిస్థల నిర్ధారిత ప్రయోగ మొకటి—

శా. గోపాలాంగన లెంతజాలిపడిరో : కోపించిరో : దూఱిరో : వ్రేపల్లెన్ నిజధర్మ గేహములలో-విభ్రాంత చైతన్యలై (భాగ 10, శ.ర.)

విష్ణుండునున్ లేని మోక్షపదంబిచ్చు - విష్ణుండునీ లేని మోక్షపదంబిచ్చు 5-11

ఇది హరినామ మాహాత్మ్యమును వర్ణించు ఘట్టములోనిది. హరికంటె హరినామము మహిమాన్వితమని భక్తుల యభిప్రాయము. "హరికన్నఁ దదీయనామ మధికం బనఘా" ! (5-10) యని పూర్వపద్యమందే స్పష్టము చేయఁబడినది. విష్ణువిహీనమైన మోక్ష మదేమి మోక్షము! కృష్ణశతకమున హరినామ మహత్త్వము మనోజ్ఞముగా చిత్రింపఁబడినది.

క. హరి యను రెండక్షరములు హరియించును పాతకంబు లంబుజనాభా !
హరి ! నీ నామమహత్త్వము హరిహరి! పొగడంగ వశమె ? హరి ! శ్రీకృష్ణా !

సురాసురబలాఢ్య సాధ్య నయోధ్యన్। సురాసురబలాద్యసాధ్య నయోధ్యన్. 5-112

అయోధ్య సార్థకనామధేయ. అది సురాసురుల బలప్రయోగాదులచే సాధింపరానిది. అట్లుగాక, బలాఢ్యసాధ్య - అయినచో దానిని వర్ణింపనేల ?

సోమపుర ప్రాంతసీమకు నరిగి। హేమపుర ప్రాంతసీమకు నరిగి. 5-167

మయూరధ్వజుని రాజధానిపేరు హేమపురమని యొకచోటను, సోమపురమని మఱొకచోటను పేర్కొనఁబడినది. పైపాఠములు ప్రాసయతి నిబద్ధములు. కావున రెండు పాఠములును సరిపోవుచున్నవి. కాని, హేమపురమన్నదే సరియైనపాఠమని యతిస్థాన ఘటితమైన క్రిందిప్రయోగము నిర్ధరించుచున్నది.

2. ఆంధ్రభాషానుశాసనము. భా. 2, పు. 95

"ఇరవగు పట్టణం బొకటి - హేమపురంబన దివ్యసేవ్యమై". (5-160)

ఛందోదోషములు:-

లేఖక ప్రమాదమువలన ఛందోభంగములైన అపపాఠములు చాల కన్పట్టుచున్నవి. అవి ముద్రిత గ్రంథాంతో భాగమున నుద్ధరింపఁబడియున్నవి. (యతి ?) (ప్రాస ?) అని తద్దోష మాపాఠము ప్రక్కన సూచింపఁబడినది. నిర్దుష్ట మగు పాఠము ప్రధానపాఠముగఁ గైకొనఁబడినది. పరిత్యక్తమగు అపపాఠము మొదటిదిగను, స్వీకృత సాధుపాఠము రెండవదిగ నిక్కడ ప్రదర్శింపఁబడుచున్నది.

యతిస్థానములు

నవగేహంబుల సందిక్రాంతలనె మం - ది వ్యాప్తి, నవగేహంబుల సందిక్రంతలనె మం - ద వ్యాప్తి. అవ. 7

చరణాబ్జ ధ్యానమధుర - సుస్థిర, చరణాబ్జధ్యాన మధు ర - సస్థిర. అవ. 45

దుర్వికారహరంబగు - హిత పథంబు, హృద్వికారహరంబగు - హిత పథంబు. 1-29

కీటములయందు గిరులందు - మునులయందు, కీటములయందు మునులందు - గిరులయందు. 1-30

గొనలను గలుముల - నీను మగువ, గోనలఁ గలుముల - నీను మగువ. 1-49

ఆదరమునఁ దెలియ నొడువు - విమల చరిత్రా, ఆదరమునఁ దెలియనొడువు - మమల చరిత్రా. 1-55

అనవుడు రోమశుండు మది - నుత్సుకుఁడైన, అనవుడు రోమశుండు హృద - యంబున నుత్సుకుఁడై. 1-56

తెలిసి కోపంబు వర్జించి - విప్రకార్య, తెలిసి కోపంబు వర్జించి - తీవ్రకార్య. 1-91

నవరత్నబీజ సం - గమము లొక్కొ, నవరత్నబీజ సం - భవములొక్కొ. 1-128

రసమింకి కడు వాడు - వారిన, రసమింకి కడు వాడి - పస చెడు. 1-152

మోదిరి జంభారి - మకుటాగ్ర, మోదిరి జంభారి - ముకుటాగ్ర. 1-166

జం। భారాతి ప్రతిమానుఁడై వసుమతీ - చక్రంబు, జం। భారాతి ప్రతిమానుఁడై వసుమతీ - భాగంబు. 2-3

సౌ। పర్వణ పర్వతప్రవర - ధర్మకిరీటము, సౌ। పర్వణ పర్వతప్రవర - భర్మకిరీటము. 2-19

తారహారజ్యోత్స్నఁ - బ్రస్తరింప, తారహారజ్యోత్స్నఁ - ద్రస్తరింప 2-23

వాసశ్రేణులు కొల్లలాడుట జగ - ద్గణ్యంబుగా, వాసశ్రేణులు కొల్లలాడుట జగ - ద్వర్ణ్యంబుగా 2-29

దుర్వార ప్రతిమాన మూర్తివగుచు - న్వర్ధిల్లు, వార్వాహప్రతిమాన మూర్తివగుచు - న్వర్ధిల్లు 2-34

సన్నుతపుణ్యుండగు భూసురోత్తముఁడు నా-కంబందు,

సంగత పుణ్యుండగు భూసురోత్తముఁడు నా- కంబందు 2-83

ఏక్రమంబునఁ గాని-యురువడిదైత్యుల, ఒక క్రమంబునఁ గాని - యురవడి దైత్యుల 2-141

చెదరి పరచువారి-పేర్వేరఁ జీరుచు, బెదరి పరచువారిఁ - బేర్వేఱఁ జీరుచు 2-169

శృంగముల్। తమురుగఁ జేరి నిల్చిరియ - ఖండ, తుంగశృం। గముతుదఁ జేరినిల్చిరి య - ఖండ 2-195

శ్రుతిపఠనంబు చేసిన వి - శిష్ట, శ్రుతిపఠనంబు చేసిన వి - శుద్ధ 3-21

పావకుని దన్ని మంత్ర ర-క్షణమొనర్చి, పావకుని దన్ని మంత్రత - ర్పణమొనర్చి 3-25

నగజాసుతపుణ్యనామ - యహితవిరామా, అగజాసుతపుణ్యనామ - యహితవిరామా. 3-28

దైన భూదేవి యం - బురుహనాథు, దైన భూదేవి తో - యరుహనాథు 3-31

వెలయు చిహ్నమెద్ది - వైష్ణవులకు, వలయు చిహ్నమెద్ది - వైష్ణవులకు 3-33

ధర్మభూమి సమస్తలో - కములయందు, కర్మభూమి సమస్తలో - కములయందు 3-38

నికరపూజ్యము నుగ్ర - హరిమూర్తి, నికరపూజ్యము నుగ్ర - నృహరిమూర్తి 3-105

దాపల గండ్రగొ - డ్డలి (ద-డయతి), డాపల గండ్రగొ - డ్డలి 3-105

నవరత్న సంపన్న - వార్ధిపతికి, వరరత్న సంపన్న - వార్ధిపతికి 3-178

భోగనాశ్యంబులైనట్టి - జన్మకర్మ, భోగనాశ్యంబులైనట్టి - పూర్వకర్మ. 3-182

దివిజకాంతలు చతురచొ - సీతిభేద, దివిజకాంతలు చతురశో - త్రిప్రభేద 3-193

జలధరంబులు నభ - మందు నారోహించె, జలధరంబులు కులా - చలము నారోహించె 3-216

భోరున వర్షింపుచునుండ నూర్ధ్వవదనుం - డై, జోరని వర్షింపుచునుండ నూర్ధ్వవదనుం-డై 3-217

నీటిలోన నచలుండై నిమేషరహి - తాక్షిసమీక్షిత, నీటిలో ననశనుండై నిమేషరహి-తాక్షిసమీక్షిత 3-221

సుతుండు జనియింపం బుత్రకో-త్సవము గాంచె, సుతుండు జనియింపం బుత్రవ-త్సుఖము గాంచె. 3-225

సారససుజ్ఞాన మధుర-సుస్థిరభృంగా, సారససుజ్ఞాన మధు ర-సస్థిరభృంగా. 3-242

పరవశుండై పెరిగి పుత్ర-దారాదులకై, పరవశుండై పెరిగి పుత్ర-భార్యాదులపై. 3-247

వరశుభగేహ గణ్యగుణ-దైన్యనృపాల, వరశుభగేహ గణ్యగుణ-వైన్యనృపాల. 3-312

పృథుల జంకెడివార లీ-యుర్విమీంద, వాగురులం జిక్కువడి బహు-భాగవతుల, 4-21

కర్మకాంతారముల నీఱు-నాహరించి, కర్మకాంతారముల నీఱు-గా హరించి. 4-22

భూషాకీర్ణాంగ ముకుందకేశవ మురా-రీ పక్షిరాజధ్వజా,
భూషాకీర్ణాంగ ముకుందకేశవ నృసిం-హా పక్షిరాజధ్వజా. 4-27

యని నిన్ను వర్ణన-యే నొనర్తు, యని నిన్ను నెపుడుం గీ-ర్తన మొనర్తు. 4-51

రోమకూపముల నం-భోధరములు, రోమకూపముల నం-భోముచములు. 4-65

ఉన్మదులు హరిద్విషుల్ నిగమ-సాదరకృత్యులు, ఉన్మదులు హరిద్విషుల్ నిగమ-నాశకకృత్యులు. 4-74

సోమకుని సృజించి క్రమ్మర స-ముద్రములోన, సోముకుని సృజించి క్రమ్మర స-ముద్రములోన. 4-85

భోగ మహాతల్పమునన్ శయించిన రమా — నాథున్,
భోగ మహాతల్పమునన్ శయించిన రమా - కాంతున్. 4-156

ఆపదలం బాపి ననుం గృపం - బ్రోవవయ్య, ఆపదలం బాపి మముం బ్రోవు - మంబుజాక్ష. 4-158

నిరుపేదలకైనం గలిమి - లోంగొనకున్నే, నిరుపేదలకైనం గలిమి - నెలకొనకున్నే. 4-183

దోషదూర శమ - రూపితవేషా, రోషదూర శమ - రూపితవేషా. 4-226

వేషయోగ్యగుణ - విస్ఫుటభూషా, వేషయోగ్యగుణ - విస్ఫుటభూషా. ,,

గృహమేధి యోగ్యమై - యొనరించు ధర్మంబు, గృహమేధియోగ్యమై - మహి మించు ధర్మంబు. 5-4

దర్శనంబందునఁ - గలసియుండు, దర్శనస్మృతి నాత్మఁ - దగులనీఁడు. 5-6

భో । గ వ్యవహారయోగ్యమగు - నాలమునంద, భో । గ వ్యవహారయోగ్యమగు - కాలమునంద. 5-31

ద్వాపదాది క్రూర - జంతువు లేలొకో, శ్వాపదాది క్రూర - జంతువు లేలొకో 5-73

జీవుఁ డవధ్యుఁడ - భేద్యుఁ డక్లేద్యుండు, జీవుఁ డవధ్యుఁ డ - చ్ఛేద్యుఁ డక్లేద్యుండు. 5-84

యి । ట్టటనరాని విక్రమము - నం ధర యేలుచు, యి । ట్టటనరాని విక్రమత - నా ధర యేలుచు. 5-132

గిరిగుహలందు వారిజద - శాఖల కేశములందు, గిరిగుహలందుఁ గంజముఖి-కిం గచభారములందు 5-196

(దెప్ప యెయ్యది పుత్ర - రూపనిరీక్షణా, (దేప యెయ్యది పుత్ర - రూపనిరీక్షణా 5-200

బూతులాడుచుఁ దారశ - బ్దములు బెళుక, బండులాడుచుఁ దారశ - బ్దములుబెళుక 5-206

కుముదములసొంపు శ్రీకార — ముల తెఱంగు, ముకురముల సొంపు శ్రీకార - ముల తెఱంగు 5-209

హా ప్రియాంగన నను( బాయఁ - దగునె నీకు, హా ప్రియాంగన నను( బాయ - నగునె నీకు 5-224

యా సందెఱుఁగంగవలదె - ప్రాజ్ఞునకెపుడున్, యీ సందెఱుఁగంగవలదె - యిలఁబ్రాజ్ఞునకున్ 5-228

గుణ మందును నింద లేదు — వసుధాధీశా, గుణమందును నింద లేదు — కువలయనాథా 5-229

ప్రాసస్థానములు

రాధాధవ....ద్గానామృత, రాధాధవ....ద్గాథామృత అవ. 47

అనియిట్లు.... హరణోపాయంబు, అనియిట్లు.... హననోపాయంబు 1-88

ముఖభూత .... సుము త్సుక, ముఖభూత....మరు త్సుఖ 2-43

శాకద్వీప....బాహుక్షయక, శాకద్వీప....బాహుకౌక్షేయక 2-63

సురగిరి....డు ద్ధతలీల, సురగిరి....డు ద్ధురలీల. 2-196

ద్వారంబున....మ నోహర; ద్వారంబున....ము నోరమ. 3-88

ఏకసుచక్రము మణిరే ఖాంకము, ఏకసుచక్రము మణిరే ఖాకము. 3-99

కావున విష్ణుభక్తి.... షానల, కావున విష్ణుభక్తి.... షాఖిల, కావున విష్ణుభక్తి.... షావిల. 3-114

తరుణీజన వక్షోజ ద్వయగిరి, తరుణీజన వక్షోజ స్థిరగిరి. 3-220

నావుడు దైత్య....వి ద్యానిధి. నావుడు దైత్య....వి ద్యావిదు. 3-240

శ్రీకాంతా....చంద్రకాంకాత్యుజ్వల, శ్రీకాంతా....చంద్రాకలోజ్జ్వల. 4-27

పాఠనిర్ణయము :

భూరివిద్వన్మౌళి హీరు శ్రీహీరుని, భూరివిద్వన్మనోజాంబుజ రవి భారవి. అవ. 6

ఇది సంస్కృతాంధ్ర కవిస్తుతి పద్యములోని భాగము. పై రెండవపాఠము, ఒక తా. ప్రతిలో మాత్రము కలదు. సంస్కృతమున 'విద్వదౌషధ'మ్మని పేరుగాంచిన నైషధకావ్యమును శ్రీ హర్షుఁడు రచించెను. ఆ శ్రీహర్షుని తండ్రి శ్రీ హీరకవి. ఇతఁడు కాన్యకుబ్జాధీశ్వరుఁడగు విజయచంద్రునియొద్ద ఆస్థానకవి. ఆ నృపతిచే తాంబూలద్వయమును, సహాసన సభాగౌరవమును పడసినవాఁడు. అట్టి తండ్రిని శ్రీ హర్షుఁడిట్లు ప్రస్తుతించి యున్నాఁడు.

శ్లో. శ్రీహర్షం, కవిరాజరాజి మకుటాలంకారహీరః, సుతం
శ్రీహీరః సుషువే, జితేంద్రియచయం మామల్లదేవీ చ యం।
తాంబూలద్వయ మాసనం చ లభతే యః కాన్యకుబ్జేశ్వరాత్
యః సాక్షాత్కురుతే సమాధిషు పరంబ్రహ్మ ప్రమోదార్ణవమ్॥ (నైషధం. సర్గ 22)

శ్రీహీరుఁడు సామాన్యుఁడు కాఁడు; కవిరాజరాజి మకుటాలంకార హీరుఁడు. ఈ భావమే 'భూరివిద్వన్మౌళిహీరు శ్రీహీరుని' అను పైపాఠము తెల్పుచున్నది. హీర శ్రీహీరశబ్దములు రెంటిలోను సమానము. కవిసార్వభౌముఁడు శ్రీనాథుఁడు శ్రీహీరుని శేషాంశసంభవునిగా స్తుతించియున్నాఁడు.

సీ. కలియుగంబునయందుఁ గాశ్మీర భూమిలో। మత్పితమున ధరామరుఁడు పుట్టి,
శ్రీహీరుఁడనఁగ శేషాహియంశంబున। నతఁడు మామల్లదేవ్యాఖ్యయైన....(శృం. నై. 6–25)

శ్రీహీరుని ప్రతిభను గుర్తింపని లేఖకుఁడొకఁ డాకవిస్థానమున, భారవి కవిని కూర్చుండఁ బెట్టియున్నాఁడు.

మానవగేహంబుల సందిక్రంతలనె. అవ. 7

వ్రాఁతప్రతులయందు 'సందిక్రంతలు' అను పదమునకు బదులుగా, లేఖక ప్రమాదమువలన — సంది కంతల, సందిగంతుల, సందుగొందుల — అను పాఠములు కన్పట్టుచున్నవి. కావ్యాంతర ప్రయోగబలముచే 'సందిక్రంతల' అను పాఠమిందు స్వీకరింపఁబడినది.

ఉ. ఆ తరలాయతాక్షి యొక్కతెయ యానడురాతిరి పెక్కుమోసలన్
వే తఱియంగఁ దూఱి, యట వీథికి వెల్వడి, సందిక్రంతగా, నాతనియిల్లు సొచ్చి....
(జ్ఞానవాసిష్ఠము, 2—177)

పావనసలిల సంపన్న పెన్న, పావనసలిల సంపన్న మున్న. అవ. 9

'పెన్న' యను పాఠము మ. ప్రతిలో మాత్ర మున్నది. పెన్న = పినాకిని. ఈ నది నెల్లూరుమండలమున ప్రవహించునది. కంబముమెట్ట పురప్రాంతమందలిది మున్న నది — మున్నేరు.

[1]"సీసపద్యము మొదటి పాదమునందు వర్ణింపఁబడినది, మున్ననది, మునియేరని తెలుసుకొననగును. ఇది తెలంగాణములో ప్రవహించి, కృష్ణానదిని కలియుచున్నది."

1. కుందూరి ఈశ్వరదత్తుగారి ప్రాచీనాంధ్రచారిత్రక భూగోళము. పు. 60.

1–48

1. సభ్యులెంతయు నొచ్చి సంచరించిననాఁడు । పుడమిపై బాధలు పొడమినపుడు.

2. నిజమైన హరిభక్తి త్యజియించి జనులెల్ల । వేషధారణులయి వెలయునపుడు.

3. దుష్టసంకీర్ణమై శిష్టజనోపద్ర । వముసేయ నిమ్మహి పనరునపుడు.

మొదటి పాఠము మ. ప్రతిలోనిది. రెండవది తి. తీ. ప్రతులయందలిది. మూఁడవ పాఠము హ. ప్రతిలోనిది. మా. త. తా. ర. క. ప్రతులయందు ఈ పాదమే లుప్తము. ఒక సీసములోని చరణ మిన్నివిధములుగా కానవచ్చుట వింత. ఏ పాఠముకూడ పద్యమందలి మూఁడు పాదముల స్థాయిలోలేదు. ఏ కారణముచేతనో మూలప్రతిలో నొక పాదము లోపింపఁగా, లేఖకులు సందర్భానుగుణముగా పాదపూరణము కావించియుండిరేమో! రెండవ పాఠము రెండు ప్రతులలో కానవచ్చుటకు కారణము, అవి ఒకే మాతృకానుసరణప్రతులు కావచ్చును. ఉన్నవానిలో మొదటి పాఠము కొంత మెఱుఁగైనది.

సభ్యులు – సభయందుండువారు, సత్పురుషులు, ఆర్యులు. భగవంతుని యవతార ప్రయోజనములలో సాధు జన సంరక్షణము ప్రధానమైనది. అతఁడు ప్రహ్లాదునికిఁగాను నరసింహుఁడై యవతరించెను. పుడమియునుమల నపసయింప వరాహరూపమున నావిర్భవించెను. సభయందలి జను లార్యులనుటకు ప్రమాణము.

చ. అది సభయే ప్రియంబెసఁగ నార్యులు నిల్వరయేని, నార్యులే
మదిఁ దలఁపంగ వారలు సమంచితధర్మము వల్కరేని.... (భార, ఉద్యో 2–70)

1–147

స్పర్ధాకాముకుఁడైన సోమకుఁడు

వేదముల నపహరించిన దైత్యునిపేరు సోమకుఁడన్నది స్పష్టము. కాని, యిందు సోమకుఁడు, సోముకుఁడు అని ద్విరూపములు కన్పట్టుచున్నవి. ఈ స్థలమున సోమకుఁడు – అను పదము గ్రహింపఁబడినది. కాని, యిందే మఱొక చోట. "మున్ను సో। ముకుని సృజించి క్రమ్మర స – ముద్రములోన వధించె"" (4–85) అని ముకారము యతిస్థానమునఁ గూర్పఁబడియున్నది. కవికి సోమక సోముక శబ్దములు రెండును సమ్మతములు.

2–96

1. దేహాశాదిపాశోక (మ. తా.) 2. దేహాశాదిపచ్ఛాశోక (మా.)

3. దాశీశాధిపశోక (త.) 4. దేహాశాదిపచ్ఛోక (తి. తీ.)

5. దేవశాధిపశ్శోక (ర.) 6. దేహాశాధిపశ్శోక (హ. క.)

స్వర్గలోక సౌభాగ్యము నభివర్ణించు పద్య ప్రథమ భాగములోని పదశకలములే పై పాఠములు. వీనిలో ఏ ప్రతి పాఠముకూడ భావబోధకముగా లేదు. అసలు కవిపాఠ మేమైయుండునో! లేఖకులు తమ చిత్తానుసారముగా వ్రాసిపెట్టిరి. వీనినుండి కొంతవఱకైనను ప్రకరణోచితరీతిని ఇట్లొక పాఠము పోహింపఁబడినది.

"దేహాశా విపచ్ఛోక తృష్ణా లోభాది విదూరులై" స్వర్గలోకమందలి పురుషులు దేహాభిమాన విపత్భయ దుఃఖ దురాశా లోభాదులు లేక చరింతురని భావము.

2–93

లలనా భావము దాల్చి, లలనా రూపము దాల్చి

ఈ పద్యమున విష్ణువుయొక్క మోహినీరూప ప్రసక్తి కలదు. విష్ణువు స్త్రీరూపమును ధరించినట్టులొక్క మ. ప్రతి మాత్రము తెల్పుచున్నది. మిగిలిన ప్రతులన్నియు 'లలనాభావము' అను పాఠమునే కలిగియున్నవి. విష్ణువు

భావములో మాత్రము స్త్రీత్వమును ధరించుట యెట్లు ? ఒక్కప్రతిలో మాత్రము కానవచ్చు పాఠమేయైనను, రెండవ పాఠమే ప్రకరణోచితము, అర్థవంతము నగుటచే నయ్యది ప్రధానపాఠముగ నిందు స్వీకరింపఁబడినది.

1. చారదశపడి వచ్చున్ (మ.త.తా.) 2. చారదసవడి (మా.తి.తీ.) 2—126
3. చారదసపడి (హ) 4. చారధనపడి (ర) 5. చేతదనపడి (క)

పాలసంద్రమును చిలుకుచుండఁగా మందరపర్వతము సముద్రములో మునిఁగి పోయెను. సురాసురులు ఇతికర్తవ్యతావిమూఢులైరి. విష్ణువు ప్రత్యక్షమై ధైర్యము చెప్పెను. ప్రారంభించిన కార్యమును మధ్యలో పరిత్యజించుట పాడి కాదు. దానిచే కీర్తిప్రతిష్ఠలు తొలఁగును. శుభము కలుగదు. అపనింద వచ్చును — అని పద్యభావము.

పై పాఠములలో ఒక్కపాఠముకూడ అర్థస్ఫోరకముగా లేదు. "మేలు చేర దపసడి వచ్చున్" అని పాఠము సరిదిద్దఁబడినది. అపసడి = అపనింద. 'సడి' యను తెలుఁగు పదమునకు ముందు 'అప' అను ఉపసర్గము తగునా ? అను నాక్షేపము లేకపోలేదు. కవులు నిరంకుశులు. కవిసార్వభౌముఁడిట్టి ప్రయోగవిశేషము నొకచో కావించియున్నాఁడు.

ఎ.గీ. వీటిపెద్దతలారి నిస్సాటి కలికి । దిస్సమొలవేల్పు పార్వతీదేవిపట్టి (కాశీ. 2—38)

సాటి — తెలుఁగు పదము. దీనితో 'నిస్' అను ఉపసర్గము చేరినది. సాటిలేని యని యర్థము. అపదూఱు, అపనమ్మిక, అపపాడి — అని 'అప' ఉపసర్గపూర్వక దేశ్యపదములను సూర్యరాయాంధ్ర నిఘంటువు గ్రహించియున్నది.

లయంకర కీట రూటమున్ (మ.తి.తీ.), లయంకర కీటరూపమున్ (మా.త.తా.హ.క.) 2—133

ఈ పద్యమున, కాలకూటోత్పత్తి వర్ణితమైనది. పద్యము పోతనశైలిలో అంత్యానుప్రాస శోభితమైనది. కాని పై భాగమందలి 'రూట' శబ్ద మర్థరహితమైనది. రెండవ పాఠమున అనుప్రాస మంతరించినది. అది ప్రక్రమభంగము. కావున, అనుప్రాస సౌభాగ్యమునకుగాను "లయంకరరూప కీటమున్" అని సవరింపఁబడినది.

జలదివ్య మొనర్చెడువాఁడు పోలె. 2—148

ఇది సూర్యాస్తమయ వర్ణనములోనిది. సూర్యుఁడు రాజకాంతను కుముద్వతి నంటెనను లోకాపవాదమును పోఁగొట్టుకొనుటకును, తన నిర్దోషత్వమును ప్రకటించుకొనుటకును 'జలదివ్య' మొనరించుటకై సముద్రమున గ్రుంకెను. ఈ సందర్భమున, వ్రాఁత ప్రతులయందలి — '**జలధిత్వ**' యనునది అపపాఠము. '**జలధివ్య**' అక్షరదోషయుత పాఠము. 'జలదివ్యము' అని సవరింపఁబడిన పాఠములో మహార్థ మిమిడియున్నది. సందర్భశుద్ధిగల పాఠమిది. జలదివ్యమనఁగా, నీటియందు చేయు ప్రమాణము. దీనికి ఆకరము, పంచతంత్రమున—

శ్లో. వివాదేఽన్విష్యతే పత్రం, పత్రాభావే తు సాక్షిణః ।
సాక్ష్యభావే తతో దివ్యం ప్రవదంతి మనీషిణః ॥ (1—403)

పూర్వకాలమున ఏ యిరువురికైనను వివాదము సంభవించినపుడు, న్యాయనిర్ణేతలు మొదట పత్రమును పరీక్షించెడువారు. అది లేనిచో సాక్షి విచారణము. సాక్షులుకూడ లేనిచో, వారిచే ప్రమాణములు చేయింతురు. ఈ ప్రమాణమునకే 'దివ్య'మని పేరు. ఈ పద్ధతి [2]యాజ్ఞవల్క్యస్మృతి యను ధర్మశాస్త్రమున దివ్యప్రకరణమున నిట్లు కలదు.

శ్లో. తులాగ్న్యాపో విషం కోశో దివ్యానీహ విశుద్ధయే ॥

వ. తులాదీని కోశాంతాని పంచ దివ్యానీహ ధర్మశాస్త్రే విశుద్ధయే సందిగ్ధస్యార్థస్య సందేహనివృత్తయే దాతవ్యానీతి.

శ్లో. సత్యేన మాభిరక్ష త్వం వరుణేత్యభిశాప్య కం । నాభిదఘ్నోదకస్థస్య గృహీత్వోరూజలం విశేత్॥

2. నిర్ణయసాగర్ ప్రెస్, బొంబాయి, 1918.

పంచ దివ్యములు : 1. తులాదివ్యము 2. అగ్నిదివ్యము 3. జలదివ్యము 4. విషదివ్యము 5. కోశదివ్యము.
పై భాగమును 'అభినవదండి' కేతన ఇట్లాంధ్రీకరించి యున్నాఁడు.

క. శ్రీతులయును నగ్నియు విషమును । జలమును గోశంబుననెడి సత్యము లెల్లన్
వలయును, సాక్షియుఁ బత్రముఁ । దెలుపఁగలేకున్నఁ బాడి దీర్చెడు చోటన్. (పు. 33, ప. 133)

జలదివ్య విధానము :

సీ. పరికింపఁగా బొడ్డుబంటి నీటిలలోన । నొకమాను చేతికి నూఁతగాఁగ,
మూఁడవ శరశబ్దమున శోధ్యుఁడగువాఁడు । మునిఁగిన దరినున్న జనుఁడు నడుద
లమ్మేసినంతద వ్వతివేగమునఁ బాఱ । నందుండి వేఱొక్కఁ డతిశయమునఁ
బఱతెంచి, దరి మున్ను పాతిన తోరణ । స్తంభంబు ముట్టునంతటికి మున్ను

ఆ. వె. మునిఁగినతనిఫాలమును గ్రిందియంగముల్ । గానఁబడకయున్నఁ గలుగు గెలుపు,
కానవచ్చెనేని వానికి నోటంబు । తప్పదండ్రు ధర్మతత్త్వవిదులు. (పు. 34, ప. 120)

హరిభట్టు ప్రవేశపెట్టిన ఈ ధర్మశాస్త్రప్రసంగము తరువాతి కవుల ప్రబంధములయందును కాననగును. అగ్ని దివ్యమునకు :

ఆ. వె. తప్పులేక రాజు తను డించి, యపరఁ జెం । దుటయుఁ, దాను విగతదోష యగుటఁ
బ్రాచి లోకమెఱుఁగఁ బాలంబు వట్టెడు । పోల్కి, నెట్టనగుచుఁ బ్రొద్దు పొడిచె. (కవికర్ణ. 4–195)

ఉ. ఏఁ గలనైన నొండెఱుఁగ, నీవ విభుండవు, సందియంబు నా
పైఁ గలదేని చూడుమని ప్రాగ్దిశ, గౌతమదారజారునిం
దాఁ గడు నమ్మఁజేయుటకుఁ, దక్కక యెత్తెడునట్టి యెఱ్ఱగాఁ
గ్రాఁగిన మడ్డువంద మెసఁగం గనుపట్టె నినుండు నుష్షతన్. (ప్రభావతీ. 5–60)

మ. ప్రకటాకాశవిభుం డహర్పతిధని మత్పాప్రి పైక నక్షత్రమా
లిక నీవేటికి దాఁచినావనుచు హాళిం బల్కుచో, నాతఁ డ
త్యకలంకస్థితి నగ్నితప్తచటులంబౌ లోహఖండంబు సా
త్వికరీతి న్వెసనెత్తినట్లు, రవి తీవిం బ్రాగ్దిశం దోఁచినన్. (శుక. 1–503)

ఈ సంప్రదాయమును కర్ణాటక మహాకవులును తమ కావ్యములయందు పరిగణించియున్నారు.

క. * దోషి పిడివంతె దివ్యద। కాసిద కుళవం, కడంగి కాళోరగనం
కూసు పిడివంతె, పిడిదం । సాసిగ నవివేకి సీతెయం దశకంఠం. (9–101)

రామలక్ష్మణులు లేనితఱి రావణుఁడు సీతను గొంపోవు సందర్భములోని దీ పద్యము. దోషి తప్తలోహమును, శిశువు కాలోరగమును గ్రహించుతీరున, సాహసియు నవివేకియునగు రావణుఁడు సీతను పట్టెను.

కందరంబులు చిందరలాడియు 2–164

---

కంధరములోని 'ధకారము' వర్గచతుర్థాక్షరము. మెడ యని యర్థము. శిరోధిః కంధరేత్యపి – అని అమరము. వర్గతృతీయాక్షరమైనచో, కందరము = గుహ, ఇక్కడ నను ప్రాసనహితమై, తవర్గచతుర్థాక్షరమునకు మాఱుగా, తృతీ

3. విజ్ఞానేశ్వరీయము, శ్రీ వివేకవర్ధనీ ముద్రాక్షరశాల, రాజమహేంద్రవరము, 1895.
* పంపరామాయణము, కర్ణాటకసాహిత్య పరిషత్తు, బెంగళూరు. 1921.

యాక్షరముతోడి 'కందర' పద ముపయుక్తమైనది. గంధమునకు, గంధము తద్భవరూపముగా కానవచ్చునట్లు, కంధరా శబ్దభవముగా 'కందర' శబ్దమును కవి ప్రయోగించి యుండవలయును.

అగ్నికణంబులు వేయు కన్నులన్ 2-172

ప్రతులయందు – వేయు కన్నులన్, అనియును, వేయి కన్నులన్ అనియును రెండు రూపములు కన్పట్టు చున్నవి. సమాసమున వేయిశబ్దస్వరూప మెట్లుండును ? అన్నది ప్రశ్న. రెండు రూపములును సాధువులే. వేయుకన్నులు అనుప్రయోగము ప్రౌఢముగా తోఁచును.

సీ. విహితశీలతఁజేయ వేయువత్సరములు సనిన సావిత్రి యమ్మౌని వరునకు (భార. శాం. 4-133)

తే. వీటిరహి మెచ్చవలయుఁబో వేయునోళ్ల (విజయ, 1-17)

కార్యాలోచనభావబుద్ధిధుతరాగా 2-204

ఇది చక్రబంధపద్యము. 'ధుతరాగా' అనుచోట 'ద్రుతరాగా, మతిరాగా, మతరాగా' యను పాఠములు వ్రాత ప్రతులలో కన్పట్టుచున్నవి. ఈ పాఠములు బంధమునకు ప్రతిబంధకములు. తృతీయపాదాద్యక్షరమైన 'ధు'వర్ణము వలయమున రెండవసారి యావర్తించును. అపుడు 'ధుతరాగా' అనియే పాఠము సహజముగా సిద్ధించును. ప్రతులలోని పాఠములు లేఖక ప్రమాద జనితములు.

(1) శునకపాదజ మాంస సమంబులు (2) శునకపాచిక మాంస సమంబులు. 3-84

హరికి సమర్పితమైన అన్నమునుగాని, ఫలమునుగాని, జలమునుగాని స్వీకరించినవాఁడు ఎట్టి పాపాత్ముఁడైనను, పరమపద సౌఖ్యమును పడయును. హరికి నివేదితముకాని వస్తువులు నీచాతినీచములు – అని పద్యభావము. ఆ అతినీచ మైనది – శునకపాదజమాంసము అనియును, శునకపాచిక మాంసము అనియును, రెండు పాఠములు కలవు. వీనిలో, పాచిక, పాదజ శబ్దములు అర్థబోధకములుగా లేవు. 'శునకపాచక' యని చిన్న సవరణ మిందు కావింపఁబడినది. శునకపాచక శబ్దమునకు శ్వపచుఁడు, శ్వపాకి యని అర్థము. శునకమే నీచము. దానిని వండుకొని తినువాఁడు ? ఇఁక వానిమాంసము అత్యంత హీనమని చెప్పవలయునా ? కుక్కమాంసము నీచమనుటకు ప్రమాణము.

తే. కుక్క మృగములలోనెల్లఁ గుత్సితంబు। దీనిఁ దిని ధర్మమునకేల హానిసేయ ? (భార. శాం. 3-291)

1. మూలముల్ మెండు కొమ్మలు క్రిందునై చాల, 2. మూలముల్ మెండల్పముగ శాఖములు గల్గి. 4-38

మొదటి పాఠము, అన్ని తాళపత్ర ప్రతులలో కలదు. ఇందులో 'యతి' తొలఁగినది. రెండవది సవరణ మందిన కాగితపు (తి.) ప్రతి పాఠము. ఇందు 'యతి' సరిపడినది. కాని, 'కొమ్మలు క్రింద నుండు' అను మూలభావము నకు దూరమైనది. చూడుఁడు.

శ్లో. ఊర్ధ్వమూల మధశ్శాఖ మశ్వత్థం ప్రాహు రవ్యయం।
ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్॥ (గీత. 15-1)

కావున, "మూలముల్ మీఁదు కొమ్ములు క్రిందునై చాల" అనురీతి మూలావిరోధముగా, యతికి హాని లేకుండఁగా సవరణము కావింపఁబడినది. కొమ్ము శబ్దమునకు శాఖ (కొమ్మ) యను అర్థమును శబ్దరత్నాకరమిచ్చి, క్రింది లక్ష్యము నొసఁగియున్నది.

సీ. కలఁడు పున్నాగంబు లలరుఁగొమ్ముల మహో। న్నతి గలయ నభీతమతులనైన। (హ.న.)

1. మైనాకముఖ శైల రీనతా యోగ్యాంగ, 2. మైనాకముఖ శైల లీనతా యోగ్యాంగ,
3. మైనాకముఖ శైల దీనతో యోగ్యాంగ 4-84

ఇందు మత్స్యావతార మహిమ వర్ణితము. పై పాఠములలో రీనతా, లీనతా, దీనతో అను పదములు అనన్వితము లైన అపపాఠములు. 'రీణతా యోగ్యాంగ' యని సవరణము కావింపఁబడినది. సముద్రములో దాఁగియుండు మైనాకము మొదలగు పర్వతములు మత్స్యమూర్తి యొక్క మేనిపొలుసు తాఁకినంతనే నశించిపోవుచున్నవని భావము. ఆ మీను మేని పొలుసుయొక్క కాఠిన్యాతిశయము దీనిచే అనుమేయమగును. రీణ శబ్దమునకు కావ్యాంతరప్రయోగములు:

కర్ణసుఖదాయివచోరచనాధురీణ ! రీణతా నతరాజ (శృం.నై. 3-206)

క. పాణీతవాణీ కరగత । వీణా రీణా రవంబు వినికిని మృగకం
ఖాణము నిబుచటయు జగ । త్ప్రాణుం డీచ్చోట మందభావముఁ జెందెన్. (సమీర. 1-129)

తే. అనుమ వచియింపఁగొడఁగె భాష్యార్థమాన । మాధురీ మాధు రీణత సాధుకీర్తి (శుక. 3-503)

స్యన్నం రీణం స్రుతం స్రుతే-అని అమరము. రీణము సం.విణ.కాఱినది - అని శ.ర. ప్రయోగము చూపలేదు.

అన్యయాచ్నకుం దొరఁకొనెనేని 4-117

అన్ని ప్రతులయందును 'యాచ్న' యని వ్రాయఁబడియున్నది. యాచన యాచ్న కాఁజాలదు, యాచనా శబ్దమునకు పర్యాయపదము 'యాఞ్ఞ' కలదు. దీనిని 'యాచ్న'యని వ్రాయుట లేఖక దోషము, 'యాఞ్ఞాభిశస్తి ర్యాచనార్థనా' యని యమరము. కవిప్రయోగములు: యాఞ్ఞా మోఘా వర మధిగుణే నాధమే లబ్ధకామా (మేఘ. 1-6)

సీ. అతివేల మణిత యాఞ్ఞార్థ గల్లచపేట । మతిదీన వాక్యాచితాత్మవిరహ....(మను, 3-116)

తవన తప్పి యుములు తఱుచయ్యె 4-182

ఈ పద్యమున గర్భవతి లక్షణములు వర్ణితములు. తవన తప్పుట అనఁగా, ఋతుధర్మము తప్పుట. తవన.దే.వి. క్లుప్తకాలము, ఋతువు, 'తవన తప్పుటెంచి' వర,ఆ.2. అని శబ్దరత్నాకరము,

సూర్యరాయాంధ్రనిఘంటువు 'తవన' పదమునకు మితి, గడువు-అను అర్థములనిచ్చి, పై వరాహపురాణ ప్రయోగమునే లక్ష్యముగా గ్రహించినది. దీనివలన ఈ పురాణముయొక్క ప్రామాణికత వెల్లడి యగుచున్నది.

'తపనదప్పి, తనువుదప్పి, తమము దప్పి' అనుపాఠములు సందర్భశుద్ధి లేనివి.

రోషదూరశమరూపితవేషా 4-226

మ. ప్రతి పై పద్యమును 'ఉప' యని పేర్కొన్నది. ఉపజాతి-అని భావమేమో ? తి.ర. ప్రతులు రథోద్ధతా వృత్తమని గుర్తించినవి. త.ప్రతి మాత్రము స్వాగతవృత్తము-అని సరిగా పేర్కొన్నది. స్వాగతవృత్తమున - ర న భ గగ-అను గణములుండును. 7వ అక్షరమున-యతి.

జీవుఁ డవధ్యుఁ డ-భేద్యుఁ డక్లేద్యుండు 5 84

అన్నిప్రతులయందును పై యతిభ్రంశ పాఠమే కలదు. 'జీవుఁ డవధ్యుఁ డ-చ్ఛేద్యుఁ డక్లేద్యుండు' అను సవరణమువలన సాధుపాఠము సిద్ధించినది. ఈ సవరణమునకు క్రింది భగవద్గీతావాక్యము ప్రమాణము.

అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయ మక్లేద్యోఽశోష్య ఏవ చ॥ 2-24

విశదయశః పట గర్భిత, విశదయశః పటుగర్భిత. 5-128

ఇందు మాంధాతృనృపతికీర్తి వర్ణితమైనది. పై రెండు పాఠములలో 'యశఃపట' అను పాఠము గ్రాహ్యము. కీర్తిని వస్త్రముతో రంజనము కావించుట కవిసమయము.

మలసినచోటఁ గూడిన సమగ్రయశోవసనంబు గప్పి. (పారి. 1-22)

వాకట్టు బదనిక వనరుహశ్రేణికి 5-145

ఇది చంద్రవర్ణనములోని చక్కని పద్యభాగము. 'బదనిక' యనుచోట - అదెనిదె, వదినికె, నదెవిదె, వికసిత, మరియును - అను వ్యర్థపాఠములు కన్పట్టుచున్నవి. 'బదనిక' సాధుపాఠము. బదనిక = ఓషధీ విశేషము, ఒకమూలిక, చంద్రుఁడు కమలములకు నోరుకట్టివేయు మూలిక. చంద్రునిరాకతో కమలములు ముకుళించునని భావము. ప్రయోగములు.

క. ఇది దారికట్టు, మొన క। ట్టిది, కాంతావశ్యకరణమిది, నీమది కిం
పొదవించు నోనరేశ్వర ః పదిలంబని తెల్పి కొన్ని బదనిక లిచ్చెన్. (శుక. 1-98)

సీ. పులులవాకట్టు మందులు పాము బదనికల్.... (శుక. 2-546)

1. పూర్వశైల శిఖరాగ్రపు దాగడిమీఁద, 2. పూర్వశైల శిఖరాగ్రపు దాగటిమీఁద. 5-202

ఈ పద్యమున సూర్యోదయము వర్ణితమైనది. తూరుపుకొండ యను దాగటిమీఁద పెట్టిన, క్రాఁగిన లోహపుముద్ద వలె సూర్యుఁడు కనుపట్టెను.

దాయి + కలు. ఔపవిభక్తిక రూపము - దాగటి. దాకలి = కాఁచిసాగఁగొట్టెడు ఇనుము బంగారు లోనగువానికి నూఁతగా క్రిందనుంచెడి ఇనుపముద్ద లోనగునది (శబ్దరత్నాకరము).
దాయిశబ్దమునకు ప్రయోగాంతరము.

చ. గరశపుముద్ద లోహ, మవగాఢ మహాశనికోట్లు సమ్మెటల్,
హరునయనాగ్ని కొల్మి, యురగాధిపుకోరలు పట్టుకార్లు, ది
క్కరటి శిరంబు దాయి.........(భీమన చాటుధార)

క. భుజ నిశితాసి భుజంగీ। భుజికర్మీకృత విరోధి భూభుజుఁడు.... 5-161

ఇందు మయూరధ్వజుని పరాక్రమాతిశయము వర్ణింపఁబడినది. అతని కరవాలము శత్రురాజులను హత మార్చునని భావము, 'భుజవల్మీకృత' యని హ. ప్రతిపాఠము, భుజకర్మీకృత యని యితరప్రతులలోని పాఠము. ఇవి యన్వయరహిత పాఠములు. వల్మీశబ్దము వల్మీకశబ్ద పర్యాయము కాదు. ఇఁక 'భుజంగీ భుజకర్మీకృత' యను పాఠములో కర్మీకృతము (కర్మముగా చేయుట?) భుజంగీ భుజమునకు కుదురదు. అసలు భుజంగికి భుజ మెక్కడిది ? 'భుజికర్మీకృత' యని చిన్న సవరణము కావింపఁబడినది. మయూరధ్వజుఁడు తన కరమందలి కరవాలమనెడు భుజంగి (పాము)చే, శత్రురాజుల (ప్రాణవాయువుల) హరించువాఁడు - పాము గాలిమేపరి. కరవాలమను భుజంగము శత్రురాజుల ప్రాణ వాయువుల హరించును - అని భావము. భుజ్ అను క్రియకు, కర్మీకృత = కర్మముగా చేయఁబడిన యని యర్థము. భుజికర్మీకృత యను పదగుంఫనకు స్ఫోరకములు శ్రీనాథుని ప్రయోగములు :

మ. మృదురీతిం బ్రతివాసరంబు గమికర్మీభూత నానానదీ
నద కాంతార పురీ శిలోచ్చయుఁడనై .... (శ్రం. నై. 2-20)
గమికర్మీకృత నైకనీవృతుఁడనై .... (శ్రం. నై. 2-21)
భుజిక్రియ వలపించెం బెండ్లి వారి వనితయుఁ బోలెన్. (శ్రం. నై. 6-134)

ఒక చిత్రము

3-126. ఇది యొక వచనభాగముగా అన్నిప్రతులును పేర్కొనుచున్నవి. వచన పద్ధతిలో వ్రాయఁబడియున్నది. తాళపత్ర ప్రతులయందు పద్యములు కూడ, పాదవిభాగము లేక వచనములవలెనె యేకాకారమున వ్రాయఁబడియుండును. కాని, పద్యములకు ముందు పద్యమును గుర్తించుటకు ననువుగా కొన్ని సంకేతాక్షరములుండును. ఉదా. చ. చంపకమాల; క. కందము మొ॥. ఆ రీతిలో, పై స్థలమున వ. వచనము అనియే సూచింపఁబడినది. నిశితపరిశీలనమున అది వచనము కాదనియు, సీసపద్యమనియు ధ్రువపడినది. ఆభాగము యథాతథముగా క్రింద నుద్ధరింపఁబడుచున్నది. అందుండి ఆనాఁటి వ్రాఁత తీరుకూడ కొంత విశదము కాఁగలదు. తరువాత ఆ భాగము సీసపద్యముగా మాఱిన తీరు స్పష్టము కాఁగలదు.

"వ. అని యిట్లు విన్నవించ్చినం గృతాంతుండు రోషకలితుండై త్యక్తాధికారుండగుచు ద్రిదివంబ్బునకేంగి దేవతా భర్తకు నీ కథా వృత్తాంతంబ్బు మెరుగంజెప్పి యతనితోగూడి దుగ్ధాబ్ధి మధ్యమునకు జని శేషశయనుని జలజనయను దర్శించి బహువిధ స్తవములం గ్గొనియాడి కరములు నిటలభాగములంజేర్చి తస్కరునిచొప్పు విష్ణుదూతలవిధంబు నాత్మ భృత్యులు కుంఠితులైనట్టి తెరంగ్గు విన్నవించ్చిన నింద్దిరావిభుండ్డు నవ్వి యాదరంబ్బున యమున కిట్లనుమం బలికె."

పద్యావతరణము

సీ. అని యిట్లు విన్నవించినఁ, గృతాంతుఁడు రోష । కలితుఁడై త్యక్తాధికారుఁడగుచుఁ,
త్రిదివంబునకునేఁగి, దేవతాభర్తకు । నీ కథా వృత్తాంత మెఱుఁగఁ జెప్పి,
యతనితోఁగూడి దుగ్ధాబ్ధి మధ్యమునకుఁ । జని, శేషశయనుని జలజనయను
దర్శించి, బహువిధ స్తవములఁ గొనియాడి, । కరములు నిటలభాగమునఁ జేర్చి,
తే. తస్కరునిచొప్పు, విష్ణుదూతలవిధంబు । నాత్మభృత్యులు కుంఠితులైన తెఱఁగు
విన్నవించిన, నిందిరావిభుఁడు నవ్వి । యాదరంబున యమున కిట్లనుచుఁ బలికె.

క. జలపరిపూరిత బహువిధ । కలశంబుల, నేకశీతకరుఁడే బహుభం
గులఁ గానవచ్చు కైవడిఁ, । బలుతెఱఁగులఁ దోఁచు నాత్మ భాగవతుండై . 1-53

పై పద్యము "ఏకం సద్విప్రా బహుధా వదన్తి" అను శ్రుత్యర్థమును దృష్టాంతపూర్వకముగా వివరించుచున్నది. భగవంతుఁడు భావగమ్యుఁడు – అనుట యిందలి ముఖ్యాభిప్రాయము. చతుర్థ పాదమున 'భాగవతుండై' అను పై పాఠమే అన్నిప్రతులయందును కానవచ్చుచున్నది. అది సందర్భ శుద్ధిలేని పాఠము. లేఖక దోషమువలన అక్షర వ్యత్యయము కలిగియుండును. 'భావగతుండై' యనుట సాధుపాఠము. ఆత్మ = పరమాత్మ, భావగతుండై = హృదయాధిష్ఠాతయై, కానవచ్చును. ఎట్లు? ఒక శీతకరుఁడే బహు జలకలశములందు బహువిధములుగా కానవచ్చునట్లు అని. ఇంత సుందరమైన భావమునకు క్రింది పోతరాజుగారి ప్రసిద్ధ పద్యము దోహదము చేసియుండునా ? పరికింపుఁడు :

మ. ఒక సూర్యుండు, సమస్తజీవులకుఁ దా నొక్కొక్కఁడై తోఁచు పో
లిక, నే దేవుఁడు సర్వకాలము మహాలీల న్నిజోత్పన్న జ
న్యకదంబంబుల హృత్సరోరుహములన్, నానావిధానూన రూ
పకుఁడై యొప్పుచునుండు, నట్టి హరి, నేఁ బ్రార్థింతు శుద్ధుండనై. (భాగ. 1–226)

గణితశాస్త్రవిద్యా చరితుల్ 3–45. ఈ పద్యమున కాలమానము వర్ణితమైయున్నది. కాలనిర్ణయమును కావించువారు ఆ శాస్త్రమున 'చతురులై' యుండవలయును. చరితుల్ – లేఖకప్రమాదము. 'చతురుల్' అనుట సందర్భోచిత పాఠము,

ఒక సూచన :

వ్రాఁతప్రతులనుండి సంగ్రహించిన సాధ్వసాధు పాఠములన్నియును పరామర్శింపఁబడినవి. యోగ్యమైన పాఠములను ప్రధానపాఠమునందును, తత్తుల్యములను, విభిన్నములను అధోజ్ఞాపికయందును (foot note) చూపఁబడినవి. ప్రమాదవశమున కొన్ని సాధుపాఠము లధోభాగమున చేరినవి. సహృదయు లట్టిపాఠములను గుర్తించి స్వీకరింప ప్రార్థితులు. అట్టివి యొకటి రెండు ;

మణిసౌధంబందుఁ జేరిచ్చలన్, మణిసౌధంబందుఁ బేరిచ్చలన్. 5-220

ఈ పద్యమున మయూరధ్వజుఁడు స్వప్నజగత్తులో మణిసౌధమున జరిపిన భోగానుభవము వర్ణింపఁబడినది. మొదటి పాఠమున చేరి + ఇచ్చలన్ అనుచోట క్త్వార్థకమైన యికారమునకు సంధి. ఇది పెక్కుప్రతులలోని పాఠము. రెండవది పేరు + ఇచ్చలన్ — నిర్బాధకము. ఇది సంతోషాతిశయమును సూచించు సందర్భోచిత సాధు పాఠము. ఈ పాఠము మా. ప్రతిలో మాత్రము కలదు.

ఇట్లే అవతారికలోని 51వ పద్యములో స్వీకరింపఁబడిన 'ఇద్ధమాన' పాఠముకంటె, అధోభాగమున నిచ్చిన 'ఏధమాన' పాఠము ఉత్తమమైనది.

ఇంతవఱకు లభించిన పాఠములలోని సాధ్వసాధు పాఠముల స్వరూప స్వభావాదులను విస్తరభీతిచే, కొన్నింటిని శృంగగ్రాహికగా ప్రదర్శించి, వాని సాధుత్వ సమర్థనమునకు గ్రంథాంతర ప్రయోగములు ప్రమాణములుగా చూపఁబడినవి. లాక్షణిక (యతి-ప్రాస) దోషముల నిర్దేశించి, గృహీతసుష్ఠుపాఠముల సూచించుట జరిగినది. అయినను, అర్థనిర్ణయమునకు నందనివి, లక్షణవిరోధము తొలఁగింపరానివియైన కొన్ని అపపాఠము లింకను మిగిలియే యున్నవి. ఉత్తమములయిన ప్రతులు లభించినపు డవి మున్ముందు సవరింపఁబడును. వాని వివరము లివి:

మధ్యమా హరికరదండంబులనోజ రోమరాజి విరాజిల్ల 4-53

ఇది వైష్ణవీదేవియొక్క శరీరసౌందర్యవర్ణనములోనిది. ఆమెయొక్క రోమరాజికి నుపమానముగా 'మధ్యమాహరికరదండము' పేర్కొనఁబడినది. హరియొక్క కరదండముతో సామ్యమును సరిపుచ్చుకొన్నను, 'మధ్యమా' శబ్దము మాత్ర మనన్వితమై, అవశిష్టమై యున్నది.

బోధఫలసారవిన – తాస్తుత విహారా 2-121. ఇది లయగ్రాహి వృత్తము. మాలికావృత్తములో చేరినది, ప్రతి పాదమున (39 మాత్రలు) 30 అక్షరములు ఉండును, భ జ స న భ జ స న భ య – అను గణములు క్రమముగా నుండును. 8+8+8 అక్షరములపై 'ప్రాసయతులు' నియతము, యతి యక్కఱ లేదు.

పై పద్యమున ధకారము ప్రాసయతి, సర్వత్ర పాటింపఁబడినది. కాని పైపాదార్ధమున ఆ నియమము తొలఁగినది.

సుజనపరితోష జిత—హిమకరవిశేషా 5-264. ఇది లయవిభాతి వృత్తము. మాలికా వృత్తములో చేరినది. ఇందులో — న స న న స న న స న న స గ అను గణములుండును. 9+9+9 అక్షరములపై ప్రాసయతులు నియతములు. యతి వలదు. ప్రతి పాదములోను 34 అక్షరములు (39 మాత్రలు) ఉండును.

పై పద్యమున, మకారము ప్రాసయతిగా పాటింపఁబడినది. కాని పై పాదార్థమున, ప్రాసయతి తొలఁగినది. అస్థానమున 'సుముఖ' యను పాఠ మధోభాగమున ప్రశ్నాంకముతో సూచింపఁబడినది. కాక, 'సుమతి' యని యగునా ? చెప్పలేము.

కమలములు వనరె నింద్రగో - పములు దనరె. 3-216

ఇది తేటగీతి పద్యపాదము. ఇందు వర్ణాధిక్యముచే గణభంగము కలిగినది.

నిన్ను సేవింతు సతతంబు - నిగమజనక ! 1—138

ఇది వసుంధర కావించిన విష్ణుస్తుతిలోనిది. ఇందలి యెత్తుగీతిలో మూఁడు పాదములు మాత్రమే కలవు. చతుర్థపాదము లభించినప్రతులలోఁ గానరాదు. ఆ భాగము నక్షత్రాంకములతో నిందు గుర్తింపఁబడినది. ఇది శ్రీహరిని అభినుతించు పాదము.

క. మానితపు నడకపేరిమి,
మానసమున కింపుఁ బెంప, మను నంచలకున్,
బోనిడి నీరసనీరము,
జానుగ క్షీరంబు గొనుట సహజము కాదే !

—చిన్నయ సూరి.

శ్లో. కవీంద్రాణాం చేతః కమలవన బాలాతపరుచిం
భజంతే యే సంతః కతిచిదరుణామేవ భవతీమ్,
విరించిప్రేయస్యాః తరుణతర శృంగారలహరీ
గభీరాభిర్వాగ్భిః విదధతి సతాం రంజనమమీ.

—సౌందర్యలహరీ

శ్రీ

# వరాహపురాణము

## ప్రథమాశ్వాసము

### అవతారిక

ఇష్టదేవతాస్తుతి

శా. శ్రీకాంతా కుచ హార కౌస్తుభ 1 మణి - శ్రీ లాత్మ వక్షః 2 స్థల
వ్యాకీర్ణత్వము 3 నొంది 4 చూపఱకు ను - ద్యద్గంధ కాశ్మీర చ
ర్చాకారంబు భజింప మించిన సరో - జాక్షుండు, 5 రక్షించు, ధై
ర్యాకల్పుం గొలిపాక సర్వవిభు నె - ఱ్ఱామాత్య చూడామణిన్. 1

ఉ. శైత్యవిశేష శైలమున - సంభవమందిన పాలు, జన్మ సాం
గత్యము లేని పాలు, గల - కాయమునన్ జగదేకచిత్ర దాం
పత్యముఁదాల్చు శంభుఁడు, కృ - పాయుతుఁడై కొలిపాక యెఱ్ఱయా
మాత్యున కిచ్చు 1 వాంఛిత స - మంచిత సౌఖ్య చిరాయు రున్నతుల్. 2

ఉ. అంబుజనాభు నాభి సము - దంచిత తామరసాలవాల మ
ధ్యంబున నంకురించి, నిగ - మాయత శాఖము, శారదా లతా
లంబనమున్, జగత్త్రయ ఫ - లంబునునైన విరించి కల్ప భూ
జం, బొసఁగుం గృతీశుఁ డగు - సర్వయయెఱ్ఱయ కీప్సితార్థముల్. 3

శా. మాణిక్యాంగుళి ముద్రికా 1 నఖరుచుల్ - మార్మ్రోటికిం బర్వఁగా,
వీణాదండము చిత్రవర్ణముగ, నా - విర్భూత నాదామృత
శ్రేణీ పూరిత రాగ సాగరమునం - గ్రీడించు వాగ్దేవి, క
ల్యాణశ్రీయుతుఁ జేయు సర్వవిభు నె - ఱ్ఱామాత్యదేవేంద్రునిన్. 4

సీ. గండ 1 మండల గళ - ద్ఘన దానధారల । నిందిందిరములకు - విందుచేసి,
శేఖరీకృత మౌళి - శీతాంశు చంద్రికా । రసమున మదచకో - రములఁ 2 దనిపి,
శ్రవణ చామర సమీ - రమునఁ గుండలిరాజ । యజ్ఞసూత్రమున కా-హారమొసఁగి,
కర పుష్కరాగ్ర ని - ర్గత వారి కణములఁ । జాతకశ్రేణి కు - త్సవమొనర్చి,
తే. భూరి విఘ్నాద్రి 3 కూట దం-భోళి యనఁగ । హితజన స్వాంత పంకజ-హేళి యనఁగ
నలరు గణపతి, ఋష్టార్థ-ముల నొసఁగు । నెలమిఁ గొలిపాక యెఱ్ఱమం-త్రీశ్వరునకు. 5

( ) 1 మణిశ్రీ - మ, మా, హ 2 స్థలా - అన్ని ప్ర. 3 సెందె - తి, తా 4 చూపరకు - క 5 శ్రీ
లిచ్చు - హ (2) 1 గావుత - మ, తి, తి, హ, ర, క (4) 1 నఘ - మ, తి, హ, ర, క; ఘన - త
(5) 1 ద్వయీ - తా 2 దగిలి - మ, తా, ర, క 3 కోటి - తా

### పూర్వకవీంద్ర పురస్కృతి

సీ. [1]భారత విరచనో - పాయు సాత్యవతేయు, । లోక సన్నుతుని వ - ల్మీకసుతుని,
శుభకర వాగ్విలా - సునిఁ గాళిదాసుని, । సత్కావ్య తోషిత - స్థాణు బాణుఁ,
గమలాప్త వర శుభా - కారు మయూరునిఁ, । గవితా కళా చమ - త్కారుఁ [2] జోరు,
భూరి [3]విద్వన్మౌళి - హీరు [4]శ్రీ హీరుని, । సత్కవీశ్వర కృత - శ్లాఘు మాఘు,
తే. నర[5]నుతాంధ్రవచో ధుర్యు - [6]నన్నపార్యు, । సూక్తి మణిరాజిఁ దిక్కన - సోమయాజి,
మతి సురాచార్యు నెఱ్ఱనా - మాత్యవర్యుఁ । బ్రౌఢిఁ దలఁచెద సాహిత్య - రూఢి మెఱయ. 6

### కుకవి తిరస్కృతి

మ. కవి[1]రాజార్జిత [2]కావ్య కోశ గృహ రం - గద్వాక్య మాణిక్యముల్
సవడిన్ బ్రుచ్చిలి పోఁకవక్కకయినం - జట్టీయఁగా, [3]హీన మా
నవ గేహంబుల [4]సందిక్రంతలనె [5]మం - దవ్యాప్తి వర్తించు దు
ష్కవిచోరావళి నిల్వనేర్చునె సుధీ - చంద్రాతప స్ఫూర్తికిన్? 7

వ. అని యివ్విధంబున నిష్టదేవతా స్మరణంబును, బురాతన కవీశ్వరానుసరణంబును, గుకవి నిరాకరణంబునుం జేసి, శబ్దార్థ భావ [1]రసాలంకార బంధంబుగా నొక్క ప్రబంధం బంధ్రభాషా భవ్యంబగు [2]వచనకావ్యంబుగా రచియింపం బూనిన సమయంబున, 8

### కంబముమెట్టు నగరీ ప్రశంస

సీ. వరుణదిగ్వీథి నే - పురమునఁ బ్రవహించెఁ । [1]బావన సలిల సం - పన్న[2]మున్న,
దీపించె నే పురి - గోపికా మానసా । స్పదవర్తి చెన్నగో - పాలమూర్తి,
భాసిల్లె నే వీటఁ - బ్రహ్లాద భక్తి వి । శ్రాణి కొండ నృసింహ - శార్ఙ్గపాణి,
యే పట్టణంబునఁ - జూపట్టె హిత పద్మ । హేళి [3]వీరేశ బా - లేందు మౌళి,
తే. చతుర చతురంగబల రత్న - సౌధ యూథ । సాల గోపుర తోరణ - సకల వర్ణ
పౌర వారాంగనా జన - ప్రముఖ [4]వస్తు । మేదురం, బట్టి కంబము-మెట్టు పురము, 9

---

(6) 1 భారతీ - మ, మా, త, తి, హ, ర 2 శూరు - మా 3 విద్వన్మణి - తీ; విద్వన్మనోహర - క; విద్వన్మనోంబుజరవి భారవి - తా 4 శ్రీహరు - మ, తి, తీ, హ, ర, క 5 మతాంధ్ర - మ 6 నన్నయార్యు - క (7) 1 రాజార్చిత - మ, మా, త, తా, ర 2 వాక్య - క 3 జూచు హీనమానవ గేహంబుల - మ; హీనమానవ గేహంబుల - మా, త; జూచు మావన గేహంబుల - తా; జూచు హీనవదేహంబుల - తి, హ, క; జూచి హీన వధేహంబుల - తీ 4 సందికంతల - త; సందిగంతుల - తా; సందు గొందులనె - తీ 5 మంది (యతి?) - తి, ర, క (8) 1 రసాలంకారాను బంధంబుగా - త తీ, ర, క 2 వచనరచనా - తా; పద్యకావ్యంబుగా - తీ; భవ్యంబుగా రచియింపంబూనిన సమయంబున - క. వ. 9-49 వఱకు క ప్ర. లో లుప్తము (9) 1 భావన స్మృతుల - తీ 2 పెన్న- మ, తా 3 బిలేశ - తీ; విలేశ - మ, తి; వివేశ - హ, ర 4 వసతి - తీ

తే. ఆంధ్రమండల గిరి దుర్గ - హారలతకు। విమల నాయకరత్నభా - వము భజించి,
యున్నతోన్నత శైల సం - పన్న మగుచు। సకల పుటభేదనముల నె - న్నికకు[1] నెక్కె. 10

**కొలిపాక యెఱ్ఱయ ప్రాభవము**

వ. ఇవ్విధంబునం జూపట్టుచు, విద్వేషిహృదయ ఘట్టనంబగు నమ్మహా పట్టనంబున స్థల కరణికాగ్రగణ్యుండనై, 11

సీ. హరినీల నిభ దేహ - నిరుపమచ్ఛాయల। యమునా సహస్రంబు - లవతరింప,
వివిధ రాగాస్పద - [1]వేణు నాదంబున। ఘన సుధాజలధి ల - క్షలు జనింప,
లావణ్య పూర్ణ లీ - లా కటాక్షంబుల। నంగసంభవ కోటు - లంకురింప,
మోహన కల్యాణ - ముఖ విలాసంబునఁ। జంద్రార్బుదంబులు - సంభవింపఁ,
తే. గల్పతరు మూలమున గోపి - కా యుతముగ। మించి క్రీడించు కంబను - మెట్టువిభుఁడు
మదనగోపాలుఁ డిలువేల్పు - మహిమఁ బ్రోవ। నెలమి విలసిల్లెఁ గొలిపాక-యెఱ్ఱశౌరి. 12

క. సుత నిధి పరిణయ దేవా। యతన తటా కోపవనము - లనఁదగు షట్సం
తతులు సమకూరె, [1]నా కొక। కృతి యందుట యొప్పు ననుచుఁ - గృతనిశ్చయుఁడై, 13

చ. సుతులు హితుల్ పురోహితులు - శూరులు ధీరు లుదారులుం గళా
చతురులు మంత్రిశేఖరులు - జాణలు గాణలు వారభామినీ
[1]వ్రతతులు చేరి కొల్వఁగ, స - భా భవనాంతర రత్నపీఠికా
స్థితుఁడయి, విష్ణుకీర్తన వి - శిష్ట పురాణము లాలకింపుచున్, 14

క. శ్రేష్ఠ శ్రీవిష్ణు కథా। [1] గోష్ఠిన్ మధురామృతంబు - గ్రోలుచుఁ, గవితా
నిష్ఠా ద్వితీయ దివిజ। [2]జ్యేష్ఠుఁడనగు నన్నుఁ బిలిచి - యిట్లని పలికెన్. 15

**ఎఱ్ఱయ, హరిభట్టు శేముషీ వైభవము నభినందించుట**

మ. అమృతప్రాయ [1]వచో విశేష రచనా - హంభావ పుంభావ వా
గ్రమణీ మూర్తివి, వేద శాస్త్ర, వివిధ - గ్రంథార్థ నిర్ణీతి, వే
కముఖ బ్రహ్మవు, యాజుష ప్రకట శా - ఖా ధర్మ ధుర్యుండ, వ
ర్యమ తేజుండవు, [2]రాఘవార్యహరిభ - ట్టా! సత్కవిగ్రామణీ! 16

(10) 1 నెక్కె - తి (12) 1 వేణునినాదంబుఘన - తి (13) 1 నాకిఁక-తా (14) 1 వ్రతతుల-తా (15) 1 గోష్ఠిమధురా - త, హ 2 జ్యేష్ఠుడగు - మా (16) 1 విశేష కావ్యరచనాహంభావవాగ్రామణీ మూర్తివి - మ; యశోవిశేష రచనాహంభావసంభావవాగ్రమణీ - తా; విశేష కావ్యరచనాహంభావవాగ్రామణీ రమణీ - తి; విశేష కావ్యరచనాహం భావపుంభావవా రమణీ - తీ; విశేష కావ్యరచనాహం భావవాగ్రామణీదమ సమ్మూర్తివి - హ; విశేష కార్యరచనాహంభావవాగ్రామమూర్తివి - ర 2. రాఘవార్య - తి, హ, ర

తే. అష్టఘంటావధాన వి - శిష్ట బిరుద! । నీవు రచియింపఁ దలఁచిన - నిరుపమార్థ
రమ్యమగు నీ వరాహ పు-రాణ కావ్య । మంకితము సేయు నా పేర - [1]నభిమతముగ. 17

వ. అని సవినయంబుగాఁ గర్పూర తాంబూల [1]లాలితాంబరాభరణాదు లొసంగిన నంగీకరించి, యేతత్కావ్య కామినీ కర్ణపూరం బగు నయ్యమాత్య శిరోమణి వంశావతారం బభివర్ణించెద. అది యెట్టిదనిన, 18

## కృతిపతి యెఱ్ఱామాత్యుని వంశప్రశస్తి

శా. వేధః పుత్ర మరీచిసంయమికి నా - విర్భూతుఁడై, దైత్యభి
ద్బోధానంద సమేతుఁడై, సకల జం - తు వ్రాత కూటస్థుఁడై,
మేధా నిశ్చలుఁడై, జగత్త్రయమునన్ - మించెం, దపో యజ్ఞ దీ
క్షా ధన్యుండగు కశ్యపాఖ్యముని, సా - క్షాత్పద్మజుండో! యనన్. 19

ఉ. ఆమునినాథు గోత్ర కల - శాంబుధిలోపల నెఱ్ఱమంత్రి పూ
ర్ణామృతధాముఁ డుద్భవము - [1]నందె; [2]వినిర్మల కీర్తి చంద్రికా
స్తోమము ధాత్రిఁ బర్వఁగ, బు - ధుల్ గొనియాడఁగ, శత్రు పద్మముల్
మోములు వంప, బాంధవ స - ముద్రము నిచ్చలు నుబ్బుచుండఁగన్. 20

క. ఆ సచివశేఖరుఁడు గుణ । భాసురయగు మల్లమాంబఁ - బరిణయమై, యు
ల్లాసమునఁ గాంచె బుద్ధి । న్వాసవగురుఁ బోల్పఁదగిన - నల్వురు సుతులన్. 21

వ. వారెవ్వరనిన, 22

సీ. పన్నగేంద్రశయాన - [1]పన్నీరజ ధ్యాన । సన్నద్ధ నిజబుద్ధి - చెన్నవిభుఁడు,
కాంతాజన స్వాంత - సంతత విశ్రాంత । కంతు సౌందర్యుఁ డ - నంత మంత్రి,
పార్వతీశాఖర్వ - సర్వజ్ఞతా గర్వ । సర్వస్వ నిర్వాహి - సర్వ ఘనుఁడు,
హేమాచలోత్సంగ - ధామావళీ రంగ । సీమా [2]నటత్కీర్తి - రామశౌరి

తే. యనఁగ, విఖ్యాతులై మించి - రవధికుధర । చరమ పరమాంధకార సం - హరణకరణ
తరణి బింబాయమాన ప్ర - తాపయుతులు, । [3]మఘవపుర కామినీ గీయ - మానయశులు.

క. వారల లోపల నగ్రజుఁ । డై రాజిలు చెన్న సైని - కాగ్రణి, యక్కాం
బా రమణియందుఁ గనియె మ । హా రసికుల, బసవవిభు న - నంతామాత్యున్. 24

(17) 1 నభినుతముగ - మా, హ (18) 1 పీతాంబరా - హ (20) 1 నంద - మా; డిందె - త
2 వినిర్మిత - తా (23) 1 పదనీరజ - త 2 నఖత్కీర్తి - మా 3 మధుర - మా, తి, తీ, షా, ర

చ. సురుచిరలీలఁ జెన్నవిభు - సోదరుఁడైన యనంతమంత్రి శే
ఖరుఁడు, దిశాంగనా కబరి - కా తతులన్ నిజ కీర్తిమంజరీ
పరిమళ భాసురంబులుగ - భక్తి నొనర్చుచు, [1]గంగమాంబికం
బరిణయమయ్యె, శంకరుఁడు - పార్వతిఁ బోలెఁ బ్రమోదమానుఁడై. 25

వ. త దనుసంభవుండు, 26

శా. నించెం గీర్తులు పద్మజాండమున, మ - న్నించెం గవిశ్రేణి, నా
లించెన్ విష్ణుపురాణ సంహితలఁ, బా - లించెం ధరాకాంత, నీ
క్షించెన్ లోపల నంబుజోదరుని, ర - క్షించెన్ సుధీ బంధులన్,
మించెన్ మంత్రుల సర్వయప్రభుఁడు, ని - ర్మించెం బ్రతాపార్జునిన్. 27

శా. రంగ చ్చక్రపయోధరన్, గమల వ - క్త్రాన్, బంధుజీవాధరన్,
శృంగారోరు రసాన్వితన్, గువలయా - క్షిన్, జంచరీకాలకన్,
గంగాంబన్ వరియించె నా సచివ లో - కస్వామి, వారాశి తే
వం, గల్యాణ గుణావళీ మణిగణ - వ్యాసంగ గంభీరుఁడై. 28

క. ఆ రమణీ రమణులకుఁ గు। మారులు జనియించి రనుప - మానులు [1]ఘనులై
ధారుణిఁ బొడమిన సాక్షా। [2]త్స్మరసభవ శివ ఫణీంద్ర - శయను లనంగన్. 29

సీ. విదిత ప్రసన్నతా - సదనంబు వదనంబు, । కమల బుద్ధి విధాయి - కన్నుదోయి,
విమల సూనృత భూష-ణములు భాష ణములు, । రామచంద్ర పదాను - [1]రక్తి భక్తి,
[2]సంతత దాన ప్ర - శస్తముల్ హస్తముల్, । [3]చింతిత సకలార్థ - సిద్ధి బుద్ధి,
యమిత వేదార్థ పూ - ర్ణములు కర్ణమ్ములు, । హరికథా [4]వర్ణనా - భ్యసన రసన
తే గాఁగ, విలసిల్లె బలి శిబి - కర్ణ ఖచర । [5]కామధుగ్ధేను సురరత్న - కల్పభూజ
దాన విఖ్యాతి విజయా[6]ప - దాన జనిత । చిర యశో[7]హారి, సర్వయ -చెన్నశౌరి. 30

---

(25) 1 నంగ - తి, హ (29) 1 సచివాకారముల ధాత్రిఁబొడమినసారస - మ, మా, త, తి, తీ, హ, ర 2 సారస సంభవ ఫణీంద్ర - తి (30) 1 రక్త శక్తి - తా 2 సతత దానప్రశస్తములు హస్తమ్ములు - మ, మా, తా, తి, హ, ర; సతతదాన ప్రశస్తములు హస్తములు వాంఛితసజ స లార్థ - తీ 3 శ్రీల సత్సకలార్థ - తా 4 కర్ణనా - త 5 కామధేను ర్జరరత్న - తీ 6 వధానివనిత - మ; వధాన జనిత - మా; వధాన వినుత - తా; వధాన నతతి - తీ; వధానవనిత - హ; విధానివనిత - ర 7 ధారి - మ, మా, త, తి, హ, ర

సీ. చుట్టంబు పూర్ణిమా - శోభిత యామినీ, [1]ధవ చంద్రికా ధాళ - ధళ్యమునకుఁ,
జెలికత్తె శీతాంశు - శేఖర ప్రథమాంగ, జాహ్నవీ జల చాక - చక్యమునకు,
సైదోడు నీహార - శైల గండోపలా, నీక నిర్మల నైగ - నిగ్యమునకు,
జనని దుగ్ధాంబోధి - ఘన వీచికా ఫేన, తరళతా[2]భర ధాగ - ధగ్యమునకు,
తే. హార హీర పటీర నీ - హార తార, తార కాకాశవాహినీ - పూర రుచిర
రుచి రమాకర్షణ[3]క్రియా-ప్రచుర మగుచు, [4]వెలయుఁ గొలిపాక చెన్నని-విమలకీర్తి. 31

శా. శ్రీనిత్యుండగు చెన్నమంత్రి సరిగాఁ - జింతింతుఁ, దేజో నయ
జ్ఞా నైశ్వర్య రుచి స్వరూప జన ర - క్షా పాత్రదానంబులన్;
భానున్, భార్గవు, భారతీరమణునిన్, - భర్మాద్రిబాణాసనున్,
భానీకప్రభు, భావజున్, భరతునిన్, - భాస్వత్తనూజాతునిన్. 32

ఉ. చిత్ర చరిత్రుఁ డాసచివ - శేఖరుసోదరుఁ డెల్లమంత్రి సౌ
భ్రాత్ర ధురంధరుండు, హరి - భక్తి సమేతుఁడు, మాదమాంబ, లో
కత్రయ వర్ణనీయ గుణ - కాంతఁ, బతివ్రత, నన్నమంత్రిరా
ట్పుత్రికఁ, బెండ్లియాడె, సిరిఁ - బోల్పగఁ గైకొను శౌరికైవడిన్. 33

శా. ఆ సాధ్వీమణియందు నెల్లవిభుఁ డా - ర్యానంద సంధాయక
శ్రీ సంపన్నుల, భూసురోత్తమ కృతా - శీర్వాద సంవర్ధితో
ల్లాసోత్సాహ చిరాయురున్నతులఁ, గ, - ల్యాణాత్ములం గాంచె, వి
ద్యా సంపూర్ణుల, వేదమంత్రిపు ననం - తామాత్యకందర్పునిన్. 34

వ. తదనుజుండు, 35

ఉ. ఒప్పులకుప్ప, దాన ఖచ - రోత్తముఁ, డాహవ సవ్యసాచి, దు
గ్ధాప్పతికన్యకా ధవ ప - దాంబురుహ భ్రమరుండు, బుద్ధిచే
న ప్పరమేష్ఠిఁ బోలిన మ - హాత్ముఁడు, సర్వయమంత్రి పుత్రుఁడా
తిప్పన, ధీరతం బసిడి - [1]తిప్పన మించె ధరాతలంబునన్. 36

ఉ. వీరలపిన్నతండ్రి ధర - విశ్రుతిఁ గాంచిన రామమంత్రి మం
దారుఁడు, చంద్ర చందన సు - ధాకర కుంద మరాళ మల్లికా
హార పటీర హీర సము - దంచిత కీర్తియుతుండు, వీరమాం
బా రమణీమణిం బరమ - భాగ్యవతిన్ వరియించెఁ గూరిమిన్. 37

(31) 1 ధవళ చంద్రిక - హ 2 భవ - మ, త, తా, తి, తీ, హ, ర 3 ప్రియా - మ, త, తా, తి, తీ, హ, ర 4 వెలయ - మ, మా, త, తీ, హ (36) 1 తిప్పను - తి, హ, ర

అ. ఆ వధూటియందు - నా మంత్రి వరునకు। నుదయమంది రర్థి - సదయమతులు
హేమశైలధీరుఁ - డెల్ల మంత్రీంద్రుఁడు। పంచబాణ నిభుఁడు - పంచ విభుఁడు. 38

వ. ఇవ్విధంబున లోకోత్తర గుణ రత్నోదారంబగు కాశ్యపగోత్ర పారావారంబునం గొలిపాక సర్వయప్రభు గంగాంబికా గర్భశుక్తి మౌక్తికంబు లగు తనూభవులు మువ్వుర లోనం, గృతినాయకుండును [1]రేఖా విజిత పంచసాయకుండును నగు నెఱ్ఱయ మంత్రి సార్వభౌముని త్రిభువన పవిత్రంబగు చరిత్రం బెట్టిదనిన, 39

సీ. తన కీర్తి కామినిం - గని మునుల్ వాగ్భవ। మంత్రంబు చెప్పి న - మస్కరింపఁ,
దన మనోహర రూప - దర్పక [1]కళఁ జూచి, యువతులు మోహాబ్ధి - నోలలాడఁ,
దన నీతి సౌష్ఠవం - బునకు శాత్రవ లక్ష్మి। యభిసారికా లీల - నభిగమింపఁ,
దన యీగి కులికి యా - చనక దారిద్ర్యంబు। లరి రాజ మంత్రుల - నాశ్రయింప
తే. వెలసె, హరిదంత వేదండ - వితత గండ। మండల స్రావి మదపాన - మత్త మధుప
మధుర సంగీత జేగీయ-మాన యశుఁడుఁ, । హేమగిరి ధీరుఁ, డెఱ్ఱ మం-త్రీశ్వరుండు. 40

మ. నవతెంతుం గొలిపాకయెఱ్ఱనికిఁ దే - జశ్శౌర్య గాంభీర్య స
త్త్వ విభుత్వోక్తి ధనుర్జయోన్నతి [1] శమ - త్యాగక్రియా కాంతులన్;
సవితన్, సాత్యకి, సింధు, సీరి, సురశా - స్తన్, [2]సూతు, సేనాని, సైం
ధవనిర్భేదను, సోము, సౌమ్యఘను, సం - తానంబు, సస్యాధిపున్. * 41

సీ. * భుజశౌర్య వైభవ - సుజనరక్షణముల। నరహరి విఖ్యాతిఁ - బరిణమించి,
చతురభాషా స్వామి - హిత [1] భూతి గరిమల। ఫణినాయకాంగద - ప్రౌఢిఁ దాల్చి,
సమధికసత్త్వ తే - జశ్శుద్ధి మహిమలఁ। బవనమిత్ర స్ఫూర్తిఁ - బరిఢవించి,
హరికీర్తన జ్ఞాన - వర [2] కాంతి గుణముల। సురముని జనక వి - శ్రుతి వహించి
తే. వర్ణనకునెక్కె, భారతీ - కర్ణపూర। సార కహ్లార కర్ణికా - స్రావి మధుర
మధు రసామృత మాధురీ-మందిరాయ। మాణ వాగ్జృంభణుం డెఱ్ఱ-మంత్రి[3]వరుఁడు.

(39) లేఖా - మ, త, తి, తీ, హ, ర (40) 1 కథ - త, తి, తీ, హ, ర, మ, మా (41) 1 యశః - తీ 2 సౌరి - తీ * ఇది అక్షరగుణిత వృత్తము. (42) * గూఢ తృతీయము 1 భూతి - త, తా 2 కాంత - హ 3 విభుఁడు - తి, తీ, హ

మ. దరహాసంబులు దిగ్వధూతతికి, ము - క్తాహారముల్ వాణికిన్,
శరదంభోధరముల్ నభంబునకు, రా - జత్కౌముదీజాలముల్
పరిపూర్ణేందున, కూర్మిపంక్తులు పయః - పాథోధికిన్ వైభవా
మరనాథుండగు నెల్లమంత్రి[1] వర శుం - భత్కీర్తి ధావళ్యముల్. 43

షష్ఠ్యంతములు

క. ఈదృశ సుగుణాకల్పున, । కాది [1] మ భాగవత హిత స - మంచిత [2] చర్యా
హ్లాదిత ఫణితల్పునకును, । సాదరజల్పునకు, సత్య - సంకల్పునకున్, 44

క. తిరుమల నారాయణ గురు । చరణాబ్జ ధ్యాన మధు ర [1] స స్థిర మతి ప
ట్చరణునకు, ఫలిత కృష్ణ । స్మరణునకు, నరాతిమంత్రి - మద హరణునకున్, 45

క. శ్రీ [1] మహిత స్తంభాచల । నామ సముద్ధామ పట్ట - ణ స్థల గణక
గ్రామణికి, బంధు హిత ర । క్షామణికిఁ, గవీంద్ర పంక - జ నభోమణికిన్, 46

క. రాధాధవ మురళీ రవ । వేధస్తరుణీ కరాబ్జ - వీణా విలస
[1] ద్గాథామృత సదృశ వచో । మాధుర్యున, [2] కమిత జయ ర - మాధుర్యునకున్, 47

క. కుటిల రిపు సచివ [1] కోటీ । నిటలస్థల ఘుసృణతిలక - నిరుపమ రేఖా
పటలయుత చరణ [2] నఖునకుఁ, । జటుల వచోరచన సుకవి - జన సుముఖునకున్, 48

క. [1] ఉద్యత్ప్రతాప నిర్జిత । మధ్యందిన చండభాను - మండల శిఖికిన్,
సాధ్యేతర భయదాహవ । మధ్య భుజాశౌర్య శాత - మఖికిన్, సుఖికిన్, 49

క. తరుణీజన హృదయాంబుజ । పరిచిత [1] శైత్యునకు, దాన - పాండిత్యునకున్,
బరమోత్సవ సంపాదిత । హరి హితకృత్యునకు, నెల్ల - నామాత్యునకున్, 50

తే. అచలితాభ్యుదయ పరంప - రాభివృద్ధి, । గా సుధారస మధురోక్తి - గౌరవమునఁ
గణఁగి, యేఁజేయు నిమ్మహా - గ్రంథమునకు. । [1] నేధమాన కథాసూత్ర-మెట్టిదనిన: 51

---

(43) 1 వగు - తి (44) 1 మహాభాగవత సమంచిత - త 2 వర్యా - (45) 1 సుస్థిర (యతి?) - మ, త, తా, ర; సంస్థిర - మా (46) 1 మహిత దుఃఖచలనా సముద్ధామ - మ; మహితా దంభాచల నామసము - త; మహిదుగ్ధంబా చలనాము - తి, హ (47) 1 ద్గానామృత (ప్రాస?) - మ, మా 2 కెల్లనాఖ్య మంత్రీంద్రునకున్ - తీ; కెల్లనామ మంత్రీంద్రునకున్ - తి, హ, ర; కును రోష మదహరణునకున్ - మ (48) 1 కోటి - ర 2 సఖునకు - మా (4 ) 1 ఈ పద్యము తీ - ప్ర. లో, లుప్తము (50) 1 చైత్యునకు - మ, తా, తి, హ, ర; చైత్రునకు(?) (51) 1 నేధమాన - మ, మా తా, తి, తీ, హ, ర, క

# ప్రథమాశ్వాసము

## కథాప్రారంభము:

### రోమశమున్యాశ్రమమునకు మార్కండేయముని సమాగమము

సీ. [1]హరిపదాంబుజ భక్తి-పరుఁడు మార్కండేయ। ముని నాయకుం డొక్క-దినమునందు,
శాండిల్య పులహ వి - శ్వామిత్ర గౌతమ। దేవల కౌండిన్య - దేవరాత
కశ్యపాత్రి వశిష్ఠ - కణ్వాది మునులతో। గౌరీశ్వరుని పదాం - భోరుహములు
సేవింపఁదలఁచి, ని - జావాస నిర్గతుం। డై, పుణ్యదేశంబు - లాశ్రమములు

తే. నదులుఁ గాసారములుఁ గాన-నములు గిరులుఁ। గడచి, యెడనెడ సన్ముని-గణ మొనర్చు
నాతిథేయాది విహిత కృ - త్యములచేత। హర్షమందుచు నల్లన - యరిగి యరిగి, 1

సు: విలసత్పంకజ కైరవోత్పల వనీ - విశ్రాంత భృంగాంగనా
కల సంగీత విలాస మోహినిఁ, దరం - గ వ్యూహినిన్, హంస మం
డల కారండవ చక్ర ముఖ్య ఖగ [1]రా - ణ్ణాదామృతోత్సాహినిన్,
జలరాశి ప్రియగేహినిన్, గనుఁగొనెన్ - జర్మణ్వతీ వాహినిన్. 2

వ. ఇట్లు గనుంగొని, తత్తీరంబున నవపల్లవ కోరక పుష్ప ఫల సంపత్సమేత చూతపోత నారికేళ పనస వకుళ చంపక బిల్వ ఖర్జూర వటాశోక పున్నాగ కురవక తాల హింతాల సంతాన కర్పూర భూరుహ కుంద మల్లికాది నానావిధ తరు లతా వితాన శోభమానంబును, విమల కమల కుముద సముదయ పుల్ల హల్లక బృంద నిష్యందమాన మకరంద[1]ధారాసార మిళిత కలిత జలపూర పూరిత కాసార మాలికా సారమ్మృణాలజాల [2]చర్వణ గర్వ హంస కలహంస కారండవ సారస చక్రవాక బక క్రౌంచ ముఖ కోలాహల ముఖరిత మధ్యస్థానంబును, మలయానిల విహార కమనీయంబును, [3]వకుళ మధు రసాస్వాద ప్రాదుర్భూత మద ముదిత పుష్పంధయ బంధుర ఝుంకార రమణీయంబును, జాతివైర దూర జంతుసంతాన సమాకీర్ణంబును బర్ణశాలాంగణ విహరమాణ మునికుమార క్రీడాకలాప ఘోష పరిపూర్ణంబును, విశాల తరుమూల పవిత్రాసన సమాసీన [4]పరమయోగీశ్వర తత్త్వ వివేచన పరస్పరాలాప సమయ సముదిత వివాద సందిగ్ధార్థ విశదీకరణ పరిణత రాజకీర శారికా కోకిల కాకలీ రవాకలితంబును, తరుమూల సేచన లీలా లాలస మునిబాలికా [5]లలితంబు నగుచుఁ, బుణ్యవనితా వదనంబు చందంబునం దిలకోజ్జ్వలంబును, పాండవసైన్యంబు తెఱంగున శ్రీ కృష్ణార్జున సమేతంబును,

---

(1) 1 హర - త (2) 1 రాడ్వాహామృతో - తి; రాడ్దాహామృతో - హ, ర (3) 1 ధారాగమ శిత చలితజలపూరిత - తా 2 రక్షణ - ము, తా, హ, ర 3 మధుర మను-మూ, త, తా, తి, తీ, హ, ర 4 పరమేశ్వర తత్వ - తీ 5 లాలితంబు - తీ

నయోధ్యానగరంబు మాడ్కి రామ [6]లక్ష్మణాధిష్ఠితంబును, సురలోకంబు కరణి సుమన స్సంవృతంబును, వారాంగనా సదనంబు క్రియఁబల్లవాస్పదంబునునై, సజ్జన సమాకీర్ణంబయ్యుఁ బుణ్యజన దూరంబును, వివిధ శాలాన్వితంబయ్యు విశాలంబునగు రోమశాశ్రమంబుఁ గనుంగొని [7]ప్రవేశించి యందు, 3

మ. కనియె౯ సంయమిసార్వభౌముఁడు త్రిలో - కఖ్యాత భాస్వద్యశున్,
దిననాథ ప్రతిమాన మూర్తి సుషమా - [1]దీప్తాఖిల క్ష్మాదిశున్,
ఘన పంచేంద్రియ మత్త వారణఘటా - గర్వాపహారాంకుశున్,
వినుతామ్నాయ పురాణ తత్త్వకలనా - విద్యావశున్, రోమశున్. 4

మ. కని చేర న్మునియుక్తుఁడై యరిగి మా - ర్కండేయమౌనీంద్రుఁ డా
[1]ఘను, నిందూపలవేదికాస్థితు, నమ - స్కారప్రియాలాప సం
జనితానందునిఁజేసి, [2]సత్కృత సమ - ర్చాపూర్వకాతిథ్యముల్
గొని, తత్ప్రాంత సమర్పితాసనమునన్ - [3]గూర్చుండె మోదంబునన్. 5

వ. ఇట్లు భాగవతకులాగ్రగణ్యుండును, బరమపుణ్యుండును, మహానుభావుండును నగు మార్కండేయ మహామునిదేవుం డుపవిష్టుండగుటయుఁ దత్ప్రభావంబున, 6

ప్రశాంత పావన వన శోభ

సీ. ఋతుధర్మములు మాని - లతలు భూజంబులు । పూచి కాచి ఫలించి - పొలుపుమిగిలె,
నంబుధరాలోక - నంబు లేక మయూర । విహగసంఘము పురి - విచ్చి యాడెఁ,
బుంస్కోకిలంబు ల - పూర్వ కుహూకార । పంచమ[1]స్వరముల - పసలు చూపె,
శ్రుతి సుఖ స్వరముల - శుక శారికా తతి । హరికథామృతముల - నానుచుండెఁ,
తే. దేనియలు గ్రోలి[2]మదమునఁ - దేఁటిగములు । సార ఝుంకార రవముల - సంభ్రమించె,
మఱియుఁ దక్కిన జంతుస - మాజమెల్ల । నురుతరానంద జలరాశి - నోలలాడె. 7

మ. వనలక్ష్మి ధవళాతపత్రముల తే - వం బుండరీకావళుల్
గనుపట్టెన్ వికసించి కాంతిగరిమం - గాసార మధ్యంబునన్,
ఘన పుష్పోత్థిత రేణు పింజరిత రం - గత్తారకా [1]వీథి త
ద్వనజాతాక్షికి మేలుకట్టు గతి హృ - ద్యంబయ్యె నీక్షింపఁగన్. 8

---

6 లక్ష్మణాధి దైవతంబును - తా 7 ప్రశంసించి - తీ (4) 1 ధిక్షాఖిలక్ష్మాధిశుం - మ; దీప్తాఖిలక్ష్మాదిశుం - మా; దీప్తాఖిలక్ష్మాధిపున్ - త; ధిశ్యాఖిలక్షాధిశున్ - తీ; దిక్ష్మాఖిలక్షాధిశున్ - ర; దిక్షాఖిలాధిశున్-క (5) 1 ఘన సింధూఫల - మ, తా, హ, ర, క 2 తత్కృత- మా 3 గూర్చుండి-త, తి (7) 1 స్వనముల - త, తా, హ, ర, క 2 మదముని - తి, తీ (8) 1 రీతి-మ

సీ. కలువలు నిడు వాలుఁ - గన్నులుగా, [1]సరో । జంబు భాసుర వద-నంబుగాఁగ,
నెఱి మించు తేఁటులు - నీలాలకములుగా, । బింబికాఫల [2]మధ - రంబుగాఁగ,
మాలూరఫలములు - పాలిండ్ల తెఱఁగుగా, । సంపెంగవిరి నాస - సొంపుగాఁగ,
హరిమధ్యమ స్ఫూర్తి - నిఱుపేద నడుముగాఁ, । దామరతూఁడ్లు హ - స్తములుగాఁగఁ,
తే. గనకరంభలు తొడల పొం - కంబుగాఁగఁ, । జిగురు లడుగులుగా, ఘన - శ్రీసమేత
యగుచు, వనలక్ష్మి రోమశు - నాశ్రమమున । నుచితవైఖరిఁ గనుపట్టు-చుండు నంత, 9

సీ. గంధసార మహీజ - బంధురోరగరాజ । భుక్త ముక్తంబులై - పొదలి పొదలి,
భూసార జలపూర - కాసార కుముదార । వింద బృందంబుపై - విడిసి విడిసి,
కోమల మాకంద - కుసుమగుచ్ఛ మరంద । కణ గణంబుల సొంపు - గమిచి గమిచి,
భామినీ సురతాంత - భవ ఘర్మజల [1]తాంత । గండమండలములఁ - గదిసి కదిసి,
తే. చిన్నివెన్నెల లేఁగొనల్ - చిదిమి చిదిమి, । పరువుమరువంపుఁదావుల - బలసి బలసి,
మునులతనువుల కింపుగా-మొనసి మొనసి, । మంద మందానిలము వీచె-మలసి మలసి.
తే. మలయగిరి వాతపోత స - మాగమమున । మౌనివరుఁ డిట్లు మార్గశ్ర - మంబు వాసి
సంతసింపుచు రోమశ - సంయమీంద్రుఁ । బ్రేమ నీక్షించి పలికె గం - భీరఫణితి. 11

## మునీంద్రద్వయ కృత పరస్పర సంభావనము

సీ. సంకర్ష[1]ణాస్య సం - జాతానలంబులు । భుగభుగ ధ్వనులతో - నెగయునాఁడు,
శైలంబులల్లాడ - సప్త మారుతములు । బెట్టుగా [2]బిస్సట్లు - వెట్టునాఁడు,
తొమ్మిదివిధముల - తోయదంబులు రేఁగి । ఘోషించి పెనువాన - గురియునాఁడు,
రెండారు తెఱఁగులై - చండాంశు బింబముల్ । వేఁడియెండలు చల్లి - వేఁచునాఁడు,
తే. దీర్ఘతరముగ నజుఁడు ని-ద్రించునాఁడు, । వనధి బ్రహ్మాండభాండంబు-మునుఁగునాఁడు
నే భయంబును లేక య-థేచ్ఛనుండు । నెలమి నీయాశ్రమమ్ము, ము-నీంద్రతిలక! 12

క. బూరి వటపత్ర తలమున । నీరజనాభుండు యోగ - నిద్రాపరుఁడై
[1] కూరికినప్పు డుపద్రవ । దూరంబని మునులు చేరు - దురు నీ నెలవున్. 13

చ. ఫణికులసార్వభౌముఁడును - బ్రస్తుతిసేయఁగలేఁడు నీ తపో
గుణగరిమంబు, మాదృశుల - కున్ వశమే? యన; రోమశుండు త
త్ప్రణుతికి లేఁతనవ్వు ముఖ - పద్మము [1]న న్నునలొత్త, మౌనిరా
డ్గణ పరివారితుండగు మృ - కండుతనూజునితోడ నిట్లనున్. 14

---

(9) 1 సరోజంబు భాసుర వనజంబు-తీ 2 మధురంబు-మ, మా, త, హ, ర (10) 1 కాంత - మా, త (12) 1 ణాఖ్య - తీ, హ, ర 2 విస్సట్లు - మ, తీ, హ, ర, క (13) 1 కోరియటఁబవ్వళించఁగ - మ; కూరిమియప్పుడుపద్రవ - హ, క (14) 1 లోఁజిగురొత్త - తా

చ. పరమపవిత్రము న్వినుతి - పాత్రమునైన భవత్పదాంబుజ
స్ఫురిత పరాగమాత్ర మిటు - సోఁకుటఁజేసి మదీయదేహమున్,
బరిచిత గేహమున్, [1]సుకృత - పావనతా పరిణాహమంది సు
స్థిరత వహించె, నిష్ట ఫలసిద్ధిఁ దనర్చెఁ దపోవిశేషమున్. 15

క. భవదంఘ్రికమల దర్శన। భవ [1] సుకృతమహత్త్వ మెన్నఁ - బంకేరుహసం
భవునకుఁ, గమలోదరునకు, । భవునకు శక్యంబుగాదు - పరమమునీంద్రా! 16

వ. అని పలికి వెండియు నిట్లనియె. 17

చ. సతతము నగ్నిహోత్రములు-సాఁగునె? భూరుహముల్ ఫలించునే?
సితుకునె ధేనువుల్? జలగ - భీరములై చెలువొందునే [1]సర
స్వతులు? సమృద్ధమే విపిన - ధాన్యము? పోషిత జంతుజాల మ
ప్రతిహతమే? మృగాద్యసుర-బాధలు లేవుగదా వనంబునన్? 18

వ. అని కుశలంబడిగి మఱియు నిట్లనియె. 19

సీ. శతకోటి శతకోటి - సమ సమారవములు । దళముగాఁ బర్విన - నులికిపడక,
లోకభీకర సము - ల్లోల కల్లోల సం। ఘము లొత్తి వచ్చిన - [1]గండ్లుపడక,
తిమిర [2]సమాభీల - తిమి తిమింగిల [3]వక్త్ర। కుహరమార్గంబులఁ-[4] గుంటుపడక,
భంజనాటోప ప్ర - భంజనాక్షేపంబు। మెండు గాఁదొణఁగిన - బెండుపడక,

తే. యబ్ధు లేకార్ణవత్వంబు - నంది [5]యుండ। భయ మెఱుంగక వటపత్ర-శయనుఁడైన
విష్ణుఁ బ్రభవిష్ణుఁ జేరి సే - వింపుచుందు। వలఘుతరశక్తిఁ బద్మజ-ప్రళయవేళ. 20

క. [1] బాలకుఁడై మఱ్ఱాకునఁ। దేలెడు హరి నిట్లు గొలువ - దివిజావళి ని
న్నాలోకించి నుతింతును, । శ్రీలలనా రమణ[2]భక్తి - శీలుఁడవనుచున్. 21

క. కావున, నధ్యాత్మకళా। కోవిదుఁడవు, సకల మౌని - కులపతి వరయన్
నీ [1] వచ్చినకతమున, నా। భావము సంతోష వికచ - భావమునొందెన్. 22

క. అనవుడు, రోమశమునిపతి। కిని మార్కండేయ మౌని - [1]కేవల వినయా
వనతుఁడగు దంతకాంతులు। కనుపట్టుచు మెఱయఁ బలికె - గంభీరోక్తిన్. 23

(15) 1 బరమ - తీ (16) 1 సద్గుణ సుకృతమెన్న - తా (18) 1 నవ స్తుతులు - తి, తీ
(20) 1 గళ్ళు - తీ భిన్నప్రతులు 2 నామాభీ - తీ 3 వక్ర - మ, హ, త, తా, తి; నక్ర - తీ
4 గుండు - తీ 5 యుండు - అన్ని ప్ర. (21) 1 బా ౘపై - తా; జాలకుఁడై - మ, మా, తి, హ, ర
2 భక్త - త, తా, తి, తీ, హ, ర (22) 1 విచ్చేసిన - హ (23) 1 కినతి వినయా - మా; కేసర - త;
వినయాన్వితుఁడై తనివొంది దంత - తా

తే. పూని [1]మా కుశలప్రశ్న - పూర్వకముగ, ననఘమానస ! యేమేమి - యడిగితీవు
తలఁప నవియెల్ల కుశలాన్వి-తములు నూవె । భవదనుగ్రహవశమునఁ-బరమపురుష! 24

క. [1]హర చరణకమల యుగళీ । పరి [2]చరణార్థంబు రజత - పర్వతమున కే
నరుగుచు భాగ్యవశంబున । నిరుపమ హరిమూర్తివైన-నినుఁ గనుఁగొంటిన్. 25

క. ఫలితములయ్యెఁ దపంబులు, । గళితములయ్యె న్మదీయ-[1]కల్మషములు, ని
ర్మలితములయ్యె యశంబులు, । కలితములయ్యెం బ్రబోధ - కల్యాణంబుల్. 26

క. మనమునఁ గల యనుమానము । తన కన్నను ఘనుని నడిగి - తద్విమలోక్తుల్
వినినపుడుగాని పాయదు, । మునివర! యొకటడుగ వలయు-[1]మును ముఖ్యముగాన్. 27

## మార్కండేయమౌని తాత్త్విక సంప్రశ్నము

సీ. వివిధంబులై మించు - వేదార్థములు చూచి । భ్రాంతులై, సహజ సి - ద్ధాంత మార్గ
మిది యని పలుకలే, - రదియును బౌద్ధాది । ఘనవాద[1]పిహితమై - కానఁబడదు,
విద్యామదాంధులై - వేదాంత విహితార్థ । మిదమిత్థమని నిర్ణ - యింపలేక,
యర్థాంతరముఁ జెప్పి - యజ్ఞాన పథవర్తు । లై విద్వదభిమాన-మతిశయింపఁ,

తే. దనర బుధులయ్యు నిత్యత-త్త్వంబు మఱచి । యాతనా దేహములఁ బొంది-యమ కఠోర
దండతాడితులై శోక - దగ్ధులగుచు । నుగ్ర నర[2]కాలయంబుల - నుందు రనఘ! 28

తే. అట్లుగావున, నిగమంబు - లరసి చూచి । యర్థవాదంబు మాని సా-రాంశమేర్చి
[1]హృద్వికార హరంబగు - హితపథంబు । నాకుఁ దెలుపుము సంయమి-లోక వంద్య!

సీ. వేదాంత సిద్ధాంత - [1]విమల మార్గంబున । నేకమై విహరించు - నెద్దియేని?
స్థావర జంగమా-త్మక జగ ద్వితయంబు । నెందేని [2]వర్తించు - నిరవుగాఁగ?
దేని తనుచ్ఛాయ - భాను మండల శత । కోటి ప్రభాతతిఁ - గుందు వఱచు?
సత్త్వ రజ స్తమ - స్సంజాత వికృతులఁ । గడచి వెలుంగు నొ-క్కటియు నెద్ది?

తే. తరువులందునుసురలందు-నరులయందుఁ । గీటములయందు [3]మునులందు-గిరులయందు
సాక్షియై నిల్చునెయ్యది-సంక్రమించి? । యట్టి తత్త్వంబుఁ దెలుపుము - యతివరేణ్య!

---

(24) 1 కుశల ప్రశ్న పూర్వకముగ-మ,మా,హ; పూనిననుఁగుశల-త; పూని కుశలములను-తా (25) 1 హరి-హ 2 చర్యార్థంబు-త (26) 1 కలుషములు-మ (27) 1 ముదమున మాకున్-త; మును కొని నాకున్ - తా; మునివరమాకున్ - హ, ర, క, తి (28) 1 విహిత - మ, ర 2 కార్తి నొందుచు-క (29) 1 దుర్వికారహరంబులఁ దొడరు పదము-క;దు ర్వికారహరంబగు హితపథంబు(యతి?)-మ, మా; దుర్వికారంబునందు హితపదంబు-తా; దుర్వికారహరంబగు సద్యోఫలంబు - తీ (30) 1 విదుల - త 2 విహరించు,- తీ 3 గిరులందుమునులయందు (యతి?) - మ, త, తి, హ, ర, క

క. [1] ఏ కథ విని మర్త్యుఁడు పు। ణ్యాకరుఁడై పంకజాస - నాధిక దివిష 31
ల్లోకముల మెలఁగు నభయత। నా కథ వినిపింపు నాకు - హర్షం బొదవన్.

మత్త. ఆ మహామహుఁ డివ్విధంబున - [1]నంబుజోదర తత్త్వలీ
లా మహత్త్వము నాలకింపఁ ద - లంచి పల్కినయంత, నా
రోమశుండు ప్రమోద హర్షిత - రోమ కంచుకితాంగుఁడై 32
శ్రీ మనోహరు సద్గుణ [2] స్తుతి - [3]సేయు [4]పూనిక నిట్లనెన్.

## రోమశముని విష్ణుమహిమ నభివర్ణించుట

ఉ. శ్రీరమణీ మనోహరుఁడు, - శేషఫణీశ్వర భోగతల్పుఁ, డం
భోరుహమిత్ర కోటి రుచి - పూరితమూర్తి, కృపాకరుండు, దు
ర్వార సురారి ఖండనుఁడు, - వర్ణిత నిర్మలకీర్తి, నేఁడు సం 33
స్మారితుఁడయ్యెఁ, గాన దివ - సంబు కృతార్థతఁబొందె నెంతయున్.

క. నారాయణ నామము జి। హ్వా రుచిరము, విష్ణురూప - మక్షి సఫలతా 34
కారణము, శౌరిచరిత సు। ధారస మది కర్ణసౌఖ్య - దంబు ధరిత్రిన్

క. అక్షయుఁ డచలుఁడు పూర్ణుఁడు। సాక్షియు వేదాంత వేద్య - చరితుఁడు నగు ప
ద్మాక్షుం [1] డె పరమతత్త్వము,। వీక్షింపఁ దదన్య[2] మొకటి - వినఁబడదెందున్. 35

క. దశశత వదనునకైనను। దశశత కిరణాది దేవ - తా [1]తతికైనం
దశశత నయనునకైనను। వశమే! హరిగుణము లెఱిఁగి - వర్ణనసేయన్. 36

తే. ఎంత మాత్రంబు మద్వచో-హృదయములకు। గోచరించును గోవింద-గుణ మహత్త్వ
మంత మాత్రంబు వినిపింతు - నవధరింపు। వినుతపుణ్య! మృకండుజ-మునివరేణ్య.

క. శ్రోతకు వక్తకు భువన। ఖ్యాత సరోజాక్ష సత్క - థామృతవృష్టిన్
జేతస్తాపము లణఁగును। భూత భవ ద్భావి దురిత - పుంజము [1]దొలఁగున్. 38

చ. హరిచరితంబులేని యుతి - హీనము చంద్రుఁడులేని రాత్రి, యం
బురుహములేని దీర్ఘిక, ప్ర - భుత్వములేని సురూపమున్, రస

(31) 1 ఈ ప. తీ ప్ర. లో లుప్తము (32) 1 నంబుజోదరు దివ్య - తీ 2 స్థితి- తా 3 సేయఁ బూనె నదెట్లనన్-తీ 4 పూనికె-మ, తా, క; పూనిక-మా (35) 1 డే పరతత్త్వము-తా 2 మొండు - తీ (36) 1 పతి-హ (38) 1 లణఁగున్ - క

స్ఫురణములేని కావ్యమును, - బూర్ణతలేని తపోనిరూఢి, దు
ష్పురుషుని [1]తోడి బాంధవము - పోలిక [2]నిష్ఫలముల్ దలంపఁగన్. 39

క. హరినామ కీర్తనామృత । హరిపద తీర్థంబులాని - యతివిమలుండై
హరిభక్తి పరవశుండగు । పురుషుఁడు కైవల్యపదముఁ - బొందుట యరుదే? 40

సీ. తోయజాక్షునిఁ బూజ - సేయని కరములు । భీకరాఖిల పాత - కాకరములు,
హరిమందిరముఁ [1]జేర- నరుగని పదములు । యమలోకదుఃఖ యా - త్రాస్పదములు,
విష్ణురూపంబు భా - వింపని మనములు । తామస విక్రియా-[2]వామనములు,
దైత్యారిహితముగా - దానం బొనర్పని । బహు [3]ధనంబులు దేహ - బంధనములు,
తే. అంబుజోదరు సంకీర్త - నంబులేని । ముఖములత్యుగ్రనరకాభి - ముఖము లింది
రా మనోహర చరిత దూ - రంబులైన । దినము[4]లిల దుర్దినంబులు - మునివరేణ్య! 41

చ. నరసుర సిద్ధ సాధ్య దితి - నందన ముఖ్యులయందు, భారతీ
శ్వర ముని భక్త చిత్త జల - జంబులయందును, భూత వాహినీ
తరు లతికాదు[1]లం దచలి - తస్థితి నిల్చి, జగంబుఁ బ్రోచు నా
పురుషుఁ, డతండు లేక తృణ - ముం జరియింపదు, వేయు నేటికిన్! 42

వ. అట్టి పురాణపురుషుండైన విష్ణుండు ముఖంబువలన బ్రాహ్మణులను, బాహువుల వలన రాజన్యులను, నూరువులవలన వైశ్యులను, బాదంబులవలన శూద్రులను, జిత్తంబు వలన శశాంకమండలంబును, నయనంబులవలన భానుమండలంబును, ముఖంబువలన నింద్రాగ్నులను, బ్రాణంబువలన వాయువులను, నాభివలన నంతరిక్షంబును, శిరంబువలన నాకాశంబును, బాదంబులవలన భూలోకంబును, శ్రోత్రయుగళంబువలన దిశామండలంబును, [1]మేహనంబువలన సముద్రంబులను, గేశచయంబువలనఁ బుణ్య నదీవిశేషంబులను, నాభికమలంబువలనఁ బితామహుని, ముఖానిలంబువలన దర్వీకర పతంగ [2]సంఘంబులను, హర్షంబువలన గంధర్వ కింపురుష మన్మథామరకామినీ జనంబులను బుట్టించి, రజస్సత్త్వ తమోగుణ సహితుండై, బ్రహ్మ విష్ణు శంకర నామంబులం గలిగి, జగదుత్పత్తి స్థితి లయ కారణంబై, యపరిభేద్య స్వరూపంబునఁ ద్రిజగద్వ్యాపకుండై వర్తించు. మఱియును, 43

క. మోహితులై, యజ్ఞాన తి । రోహితులై, కమలజాత - రుద్రాదులు ల
క్ష్మీహితునిమాయ నత్యుప । గూహితులైనారు, సర్వ - గోచర చరితా! 44

---

(39) 1 తోటి-అన్నితాళ. ప్ర 2 నిష్ఫలమౌ-తి (41) 1 జొఱ-హ, ర 2 దామనములు-మా, త 3 దేహ సంబంధ బంధనములు-క 4 లిటు-మ,తా,తి,హ,ర; లవి-క (42) 1 లంమ నుచితస్థితి-తి, హ, ర, క (43) 1 మోహంబు - మ, తా, తి, తీ, హ, ర 2 శంఖంబులను - తీ

క. పురుహూతాది దిగీశులు, । నర కిన్నర యక్ష దనుజ - నాగాదులు, నం
బురుహాసన రుద్రాదులు । హరిరూపముఁ దెలియఁ జాల - రమలచరిత్రా! 45

మ. గిరులన్ వృక్షములన్ సరీసృపములన్ - గీర్వాణులన్ వహ్నులన్
ధరణీదేవతలన్ సముద్రముల మా - ర్తాండావలిన్ యక్షులన్
[1]వరలోకంబుల నాశ్రమంబుల నదీ - [2]వ్రాతంబులన్ గోవులన్
హరిరూపంబులుగా నెఱుంగు, [3]మమరా - హారోల్లసద్భూషణా! 46

ఉ. భూరి తపోమహత్త్వమునఁ - బుణ్యమతుల్ సనకాదు లుగ్ర సం
సారమునన్ దగుల్వడక, - సంతతమున్ హృదయాబ్జ కర్ణికా
[1]ధారమునన్ సమీరము ను - [2]దాత్తత నిల్పి, సనాతనుం జగ
త్కారణు విష్ణు, నాత్మఁ బొడఁ - గాంతురు నిశ్చల భక్తియుక్తులై. 47

సీ. ధర్మంబు గళితమై - ధరణి నధర్మంబు । పూర్ణమై యభివృద్ధిఁ - బొందినపుడు,
గీర్వాణపక్షంబు - గీటణంచుటకునై । [1]మించి రాక్షసులు జ-న్మించినపుడు,
వేద శాస్త్ర పురాణ - విద్యలు [2]పాషండ । కుల [3]దూషితంబులై-పొలియునపుడు,
[4] సభ్యు లెంతయు నొచ్చి - సంచరించిన నాఁడు, । పుడమిపై బాధలు-పొడమినపుడు,

తే. మహిమ చూపట్టు దుష్ట ని-గ్రహము చేసి । జగము రక్షించు తలఁపునఁ-జక్రపాణి
మత్స్యకూర్మాదిబహుమూర్తి-మంతుఁడగుచుఁ । బ్రతియుగంబున [5]జనియించు-భవ్యచరిత!

సీ. భువనపావన నదీ - నివహ నాయకుఁడగు । నమృత పయోరాశి-యాఁడుబిడ్డ,
శృంగారరస [1]సార - జీవకళాలీల । మోహనాంగము గల-[2]ముద్దరాలు,
తెలిదమ్మిరేకుల - కిలకిలనగు కన్నుఁ । [3]గోనలఁ గలుముల - నీను మగువ,
పద్మసంభవ భావ - భవ ముఖ్య దివిజ సం । ఘాతంబుఁ గడుపారఁ - గన్నతల్లి,

(46) 1 పర - తా 2 ప్రాంతంబులన్ - హ 3 మధురా - త (47) 1 ధారమునం దగుల్పడు విధంబు సమీరము - మా 2 దదజ్ఞత - మ, తి, తీ (48) 1 మేటి - తా; మేధ - త; మేద - మ, మా, ర, హ 2 ధీషండ - మా 3 భూషితం - అన్ని ప్ర. 4 ఇది మ. ప్ర. పాఠము; నిజమైనహరిభక్తి త్యజియించి జనులెల్ల నేషధారణులయి వెలయు నపుడు- తి, తీ; దుష్ట సంకీర్ణమై శిష్టజ నోపద్రవము సేయు నిమ్మహి వనరునపుడు - హ; మా, త, తా, ర, క ప్ర. లో పాదము లుప్తము 5 జన్మించు-తా (49) 1 పూర-మా 2 ముద్దురాలు - మా 3 గొనలచేఁ గలుముల నొనయుచు సతి - తీ

తే. లక్ష్మియై మించి, వైష్ణవో - ల్లసిత శక్తి । [4]నంది, చిదచిత్స్వరూపుని - యనుపమాన
బాహు మధ్యస్థలంబునఁ - బాయకుండు । సంతతంబును వంయమి - సార్వభౌమ! 49

తే. తిలలఁ దైలంబు పూర్ణమై - నిలిచినట్లు, । నిఖిలవిశ్వంబులోపల - నిండియుండి,
సర్వమయుఁడైన హరి, దేవ-చక్రవర్తి । జగముఁ బుట్టించు రక్షించు-సంహరించు. 50

క. [1]ఏ నెలవున నే రూపము । లో నే నామమునఁ దలఁచు - లోలతను జనుం,
డా నెలవున నా రూపము । లో నా నామమునఁ దోఁచు - లోలత హరియున్. 51

క. అణువులలోపల మిక్కిలి । యణువై యాద్యంత రహితుఁ - డనఁదగు నారా
యణుని మహత్త్వము, దివిష । ద్గణవల్లభ ముఖులకైనఁ - దరమే తెలియన్? 52

క. జల [1]పరిపూరిత బహువిధ । కలశంబుల నేక శీత - కరుఁడే బహుభం
గులఁ గానవచ్చు కైవడిఁ । బలుతెఱఁగులఁ దోఁచు నాత్మ - భావనతుండై. 53

వ. [1]ఇట్టి పురాణపురుషుండు సర్వపరిపూర్ణుండై జగద్రక్షణంబుకొఱకు మత్స్య కూర్మ వరాహ నృసింహ వామన రూపంబుల నవతరించి భూభారంబు మాంచె. ఇంక రామత్రయ బుద్ధ కల్కి [2]వేషంబుల నుదయించి, పాషండ రాక్షసాది దుష్టనిగ్రహం బొనరింపంగలండని చెప్పిన విని, మార్కండేయుం డిట్లనియె. 54

### వరాహావతార కథా శ్రవణ కౌతూహలము

క. ఏదినిమిత్తము విష్ణుం । డాదివరాహస్వరూప-మగుటకు? హృదయా
హ్లాదిని [1]యగు నా కథ నా । కాదరమునఁ దెలియ నొడువు-[2]మమల చరిత్రా! 55

చ. అనవుడు రోమశుండు [1]హృద - యంబున నుత్సుకుఁడై, మృకండునం
దనునకు నిట్లనున్, మును వి-నంబడు [2]నట్టిదయైన పద్మలో
చన చరితాంకితంబులగు - సత్కథ, లంచితభక్తి నిత్యమున్
వినఁగఁదలంచువారికి న - వీనములై యొనరించు సౌఖ్యముల్. 56

క. కావున, విష్ణుకథా రస । కోవిద! [1]సద్వచన హృదయ - గోచర హరి లీ
లావిర్భావ చరిత్రము । వేవిధముల విస్తరింతు - విను మెట్లన్నన్ 57

---

4 యట్టి-మ,మా,త, తా; యద్ది - హ,ర,క (51) 1 ఏ నెలవున నేరూపున నేనామమున దలంచి తేనియును జనుం డానెలవున నా రూపున నా నామమునఁదోఁచు లోలత హరియున్-మ (53) 1 పూ త బహుతరమగు - తా (54) 1 ఇట్లు - తా 2 దేహంబుల-తి,తీ,హ,ర (55) 1 యమ్యెుం గథ - మ,తి, తీ,హ, క, ర; యైతగు కథ-తా, 2 విమల (యతి?)-మ,హ,క (56) 1 మది నుత్సుకుఁడైన (యతి )-తి 2 నట్టిది-త; నట్టియదైన-మ,తా, తి, తీ, హ, ర, క (57) 1 మద్వచన-మా

### రాక్షస జనన ప్రకారము

క. పదునాల్గు దివ్యయుగములు । మొదలం జనఁ, బద్మకల్ప - మున దితిసతికిన్
మదయుతులు సుతులు రాక్షసు । లుదయించిరి, సత్త్వ సాహ -[1]సోద్ధతులగుచున్ 58

వ. అంత, 59

సీ. ధర్మంబు వదలిరి - ధారుణీనాథులు, । సత్యంబు ధాత్రి ను - త్సన్నమయ్యె,
బహువిఘ్నములఁ గుంటు-వడియె యాగంబులు, । నిగమముల్ [1]పాషండ-నిహతి నొందె,
ప్రజ లనాచార త - త్పరత [2]వర్తించిరి, । మాసెఁ బాతివ్రత్య - మహిమలెల్ల,
సంతత దాన ప్ర - చారంబు లుడివోయెఁ, । గడు మించె వర్ణసాం-కర్యగరిమ,

తే. మొదవులేమియుఁ బిదుకక-ముఖుఁగఁదొడఁగెఁ, । [3]గోరినప్పుడు వానలు-గురియటుడిగె,
భూతదయ లేశమాత్రంబు - పొడమదయ్యె, । సమదరాక్షస జన్మదో - షంబు కతన. 60

### దైత్యుల స్వైర విహారము

ఉ. ఉగ్రమదాంధ బుద్ధులు బ - లోద్ధతు లిట్టి నిశాచరుల్ విశ్వ
ద్ధ్రాగ్రహులై మహీపతుల - నందఱ [1]నోర్చి, సురేంద్రు వీటికిన్
నిగ్రహమాచరించి, వెస - నిర్జర పుణ్యసతీజనంబు బం
దీ గ్రహణం బొనర్చి, మహ - నీయ ధృతిన్ భువనంబు లేలుచున్. 61

ఉ. నాయ మొకింతలేక యొక - నాఁడు సురాద్రికి డాయఁబోయి, య
త్యాయత బాహుదర్పమునఁ - దద్గిరిమధ్య నివాసులైన వి
శ్వాయువు [1]పుణ్యకేతనుఁడు - వజ్రుఁడు సాల్వుఁడు నాదిగాఁ జమూ
నాయకులం గుఱించి కద - నం బొనరింపుచునున్న యత్తఱిన్. 62

### హరుఁడు దైత్యులను భస్మము చేయుట

ఉ. విస్మయ మేమి చెప్ప! గణ - వీరచమూ సహితంబుగాఁగ ద
గ్గస్మరుఁ డీశ్వరుం డపుడు - తద్గిరికిం జని, రాక్షసేంద్రులన్
భస్మముసేయఁ, దద్భసిత - పంక్తిని [1]షష్టిసహస్ర దైత్యు లు
గ్రస్మయు లుద్భవించి రవి - ఖండిత మండిత శస్త్రపాణులై. 63

---

(58) 1 సోదరు-హ (60) 1 పాదంట-తీ 2 వహించిరి-తీ 3 ర. ప్ర. లో పాదము లుప్తము.
(61) 1 నొంచి-మా; మించి-త (62) 1 పుష్ప-మా,త (63) 1 షష్ఠ-మ,మా,హ,ర

### భసిత సంజాత దనుజుల తపము - శివ సాక్షాత్కారము

చ. అఱువదివేలు నిట్లుదయ - మంది గదా శర భిండివాల తో
మర ముఖరాయుధాగ్రముల - మస్తకముల్ గదియించి, మీఁదికిం
జరణములూఁతగాఁ దపము - సల్పిరి శంభునిఁగూర్చి, రౌప్య భా
స్వరగిరి వాయుకోణగతి - చంద్రమతీ తటినీ తటంబునన్. 64

సీ. సతత మార్దవ ధర్మ - శార్దూల మృగచర్మ । శాటితో, ఫణి [1]తులా - కోటితోడ,
ఘనసార నక్షత్ర - కాంతి భాసురగాత్ర । పుష్టితో, నిటలాగ్ర - దృష్టితోడ,
గంగా పయఃపూర - కలిత జటాభార । సీమతో, వామాంగ - భామతోడ,
సేవార్థ నిస్తంద్ర - దేవపారిషదేంద్ర । చయముతో, గోరాజ - హయముతోడ,
తే. జింకతో, మౌళిఁ గ్రొన్నెల - వంకతోడ, । నొప్పు[2]తో, గళమూలంపుఁ - గప్పుతోడ,
హరుఁడు ప్రత్యక్షమయ్యె భ-క్తార్తిహరుఁడు । దైత్యులకు, నుగ్రతర తపో-నిత్యులకును. 65

క. అప్పుడు దానవవీరులు । ముప్పిరిగొను భయముఁ బ్రణయ - మును విస్మయముం
జిప్పిల, నతులై యిట్లని । యప్పరమేశ్వరునిఁ బొగడి - రతులితభక్తిన్. 66

### పరమశివ స్తుతి

సీ. పురహర! శశిజూట! - భూతేశ! శాశ్వత! । నిర్మల! నిరవద్య! - నిర్వికల్ప!
ఈశాన! శంకర! - హిమశైలజానాథ! । హర! మహేశ్వర! శూల - ధర! గిరీశ!
నిత్య! మృత్యుంజయ! - నిర్వాణ [1]నాయక! । వేదాంతవేద్య! బ్ర - హ్మాదివంద్య!
అంధకాసుర దర్ప - హరణ! చర్మాంబర! । వృషభేంద్రవాహన! - విషమనేత్ర!
తే. ఫాలలోచనకోణాగ్ర - భాగ నిర్య । దనలకణమాత్ర నిష్ప్లుత-మనసిజాంగ!
భసిత చందన చర్చా వి - భాసమాన! । పన్నగాధీశభూషణ! - భక్తవరద! 67

చ. అమల యతీంద్ర[1]చిత్త మణి - హర్మ్యములం దొకవేళ సూక్ష్మరూ
పమున వసింతు, వొక్కపరి - పద్మభవాండము పాదుకాతప
త్రముల విధంబుగా గరిమఁ - దాల్తువు, పర్వతకన్యకా సమా
గమ సుఖ[2]సక్తి నొక్కపుడు - గాంతువు యోగ్య గృహస్థధర్మమున్. 68

క. ఒకమఱి సర్వము నీవై । యకలంకత నిల్తు వణు మ - హద్భావమునన్
సకలేశ్వర! నీ తత్త్వము । ప్రకటంబుగఁ దెలియవశమె - బ్రహ్మాదులకున్? 69

---

(65) 1 కులకోటి-తా,తి,తీ,హ,ర,క 2 తోడుత గళమున-తి,తీ,హ; తోగర-త,మా: గరమూల కప్పు-మా (67) 1 దాయక-తీ (68) 1 చిత్ర-మ,త,తీ,హ,ర,క 2 పంక్తి-తి,తీ

క. చిరకాల మత్పురాకృత । పరమ తపోమహిమ నేఁడు - ఫలితం బయ్యెన్,
దొరకె మనోవాంఛితములు । [1]గరళాశన! నిన్నుఁ జూడఁ - గలిగిన కతనన్. 70

మ. పరభామా రతుఁడైన, నిత్య మదిరా - పానోన్నతుండైన, భూ
సురహత్యాకరుఁడైన, హేమ ముఖ వ - స్తువ్రాత చౌర్యక్రియా
పరుఁడైనన్, "శివ! చంద్రజూట! గిరిజా - ప్రాణేశ!" యంచున్ నినుం
బురదైత్యాంతక! పేరుకొన్న, నఘ ని - ర్ముక్తుండగున్ గొబ్బునన్. 71

మ. నినుఁ బూజించి, నినుం దలంచి, రసన - న్నీనామముల్ గూర్చి, నీ
కని దానంబొనరించినట్టి నరుఁ డా-హా! వామభాగంబునన్
వనజాక్షిన్, గళమందుఁ[1] గందుఁ, దలపై - వాఃపూరముం, బాదమం
దనిలాహారవిభూషణంబు గలవాఁ - డై యుండు నీసన్నిధిన్. 72

ఆ. భూ పరాగముల శ - మీ పలాశములఁ దా । రల నుదగ్రవృష్టి-జల కణముల
నెన్నవచ్చుఁ గాని-యీశ! మీ గుణములు । నలువకైన నెన్న-నలవిగాదు. 73

మ. హర! మృత్యుంజయ! పంచబాణ హర! జం-భారాతిముఖ్యాఖిలా
మర కోటీర మణిప్రభా [1]స్ఫురణ శుం - భత్పాద! సర్వేశ! యం
బరకేశా! కమలాసనాదుల్ భవ - త్పంచాక్షరీమంత్ర త
త్పరులై కాదె! సృజింపఁ బెంప నణఁగిం - పన్ శక్తులౌ టారయన్. 74

క. రవి శశి [1]ధరణి జలానల । పవన నభో యజ్వ లనఁగఁ - బరగిన యుష్మ
త్ప్రవిమల మూర్త్యష్టకమును । భువనంబులఁ బ్రోచుఁ బరమ - పురుషవరేణ్యా! 75

ఉ. నీ కలితోత్తమాంగమున - నీళ్లను దోసెఁడు చల్లువాఁడు మం
దాకిని[1]మోచుఁ, బువ్వొకటిఁ - దా నిడువాఁడు ప్రసన్న చంద్రరే
ఖా[2]కుసుమంబుఁ దాల్చు,[3] సిరి - గంద మలందినవాఁడు మన్మథ
ప్రాకటభూతిఁ గైకొనుఁ, బు-రాకృత పుణ్యఫలంబు [4]తప్పునే? 76

వ. అని యివ్విధంబున భసితసంభవులైన కపిలోచన ధూమ్రలోచన వక్త్రదంత సూచీముఖ సునాసీర కంకాస్య గృధ్రరోమ చంచరీక సుశేష జ్వాలాకేశ ఖడ్గపాదాది నిశాచర చమూనాయకులు పార్వతీరమణునిం బ్రస్తుతింపుచు, నల్లనల్లన నికటతటంబునకుం జేరంజని, కరపుటంబులు నిటలాగ్రభాగంబులం గదియించి, దేవా! మదీయ తపంబులు ఫలితంబులయ్యె.

(70) 1 గరళగళా-తి,తీ (72) 1 గండములపై - తీ (74) 1 సరణ - మ,మా,తి,తీ,హా,ర,క (75) 1 ధర సలిలానల-మా 2 సలిలశిఖి-తా (76) 1 మౌళి-తీ 2 కుముదంబు - మా 3 తల - తీ 4 తప్పునే-క

మాకు నకుంఠిత పరాక్రమంబు ననివారితశౌర్యంబు నచలితజయంబును త్రైలోక్యాధిపత్యంబును స్థావర జంగమాదులవలన భయంబు లేకుండుటయునుం గృపసేయవలె నని విన్నవించి, సాష్టాంగ దండ ప్రణామం బాచరించిన, వారలకుఁ గరుణా వశంకరుండగు శంకరుం డిట్లనియె.

### అసురులయెడ నంబికాధవుని యనుగ్రహము

ఉ. రాక్షసపుంగవుల్! వినుఁడు! - రాఁగలకార్యముఁ [1]దెల్పెదన్, హిర
ణ్యాక్షుఁడు [2]నాఁగ నొక్కఁ డను - రాన్వయమందు దితిప్రియాత్మజుం
డై క్షితి నుద్భవించు, ఘనుఁ - డాతఁడు దోడుగ, నాజి దేవతా
పక్షము గీఁటణంచి, [3]నిరు - పద్రవులై జగ మేలుఁ డింతయున్. 78

చ, అని వివరించి [1]చెప్పి, దితి - జాన్వయవర్యుల నాదరించివీ
డ్కొని శివుఁ డాత్మలోకమున - కుం బ్రమదంబున నేఁగె, నంత నా
దనుజులు నుత్సహించి బల - దర్పితులై బహుసైన్యయుక్తులై
వనధిపరీత ధాత్రి నని - వారణ నేలిరి నిర్భయాత్ములై. 79

వ. తత్కాలంబున, 80

ఉ. [1]ధారుణి [2]యుక్కణంగె, కుల-ధర్మము సత్యము దూరమయ్యె, నా
చారము [3]చెంగె, దానములు-సాగకపోయెఁ, బరోపకారముల్
జాఱె, దయావిశేష మతి-చంచలమయ్యెఁ, బతివ్రతాగుణం
బారయ గొడ్డువోయెఁ, [4]బర-మార్థము [5]గెంటె విచిత్రవైఖరిన్. 81

సీ. అనిమిషేంద్రున [1]కార్తిఁ - గనుమూఁతలేదయ్యెఁ । ననలునితేజంబు - పొనుఁగువడియె
దండహస్తుని హస్త - దండంబు బెండయ్యెఁ । యాతుధానుఁడు మూల-నణఁగియుండెఁ
బాథోధిరాజు ప్రాఁ-భవమెల్ల నీరయ్యెఁ । గాలి[2]జవప్రౌఢి-తూలిపోయె
ధనదుని విక్రమో - త్సవము వెచ్చంబయ్యెఁ । శూలిదేహంబు సాఁ-బాలుచిక్కె

తే. గ్రహగణంబులు దినములు -గడువఁజొచ్చె । నురగలోకంబు [3]నిశ్వాస-భరితమయ్యె
నమరులకు యజ్ఞభాగంబు-లమరవయ్యెఁ । గ్రూరదైత్యులు ధరణి చే-కొనినకతన 82.

---

(78) 1 దెల్పుదున్-మ,మా,త,తి,తీ,హ,ర,క 2 డనంగ-మ,మా, 3 నిరుపద్రవమై-మ,హ,ర,క
(79) 1 శూలి-మ,తి,తీ,హ,ర,క (81) 1 ఈ ప. తీ. ప్ర. లోలుప్తము 2 స్రుక్క - మ, తా, హ, ర, క
3 చింగె - మ,హ,ర,క 4 వరధర్మము (యతి?) - తా 5 గిట్టె-త,తా (82) 1 కాంతి -తా;కార్తిఁగను
మూయ - అన్ని ప్ర. 2 చిత్ర - తా,తి,తీ; జిత - మ,హ,ర 3 విశ్వాస-తీ

### సురపతి సురగురువుతో మంత్రాలోచనము

చ. గరిమదలిర్ప నిట్లు బహు - కాలము దైత్యులు ధాత్రి యేలఁగా
సురపతి యొక్కనాఁడు మణి - శోభిత సౌధమునందు, దేవ కి
న్నర ముని యక్ష కింపురుష-నాగ నవగ్రహ సిద్ధ తారకా
పరివృతుఁడై వసించి, నయ - భాషల గీష్పతితోడ నిట్లనున్. 83

మ. హరదత్తోగ్ర వరప్రభావమున గ - ర్వాక్రాంతులై రాక్షసుల్
ధరణీనాథుల నొంచి దేవతల ను - ద్ఘాటించి యాశాధిరా
ట్పురముల్ చేకొనఁజొచ్చి; రా దనుజులం - బోనీక దండింపఁగా
[1]గురువైనట్టి యుపాయముం దలఁచి నా - కుం దెల్పు మార్యోత్తమా! 84

ఆ. త్రిదశకార్యనాశ - మొదవిన నన్యులు । నిర్వహింపఁగలరె - నీవు దక్క?
క్రూరదితికుమార - కుల మంతకంతకుఁ । బ్రబలదొణఁగె దివిజ - భయద మగుచు. 85

చ, గురువవు, మంత్రి, వాప్తుఁడ, వ - కుంఠితబుద్ధివి గాన, నిన్ను నా
దరమున వేఁడఁగావలసె, - దైత్యుల గెల్చుట యెట్లు? దేవతల్
నిరుపమసాధ్వసంబునఁ జ - లింపఁ దొణంగిరి, సర్వమంగళా
కరమగు మత్పురంబు గత - కౌతుకమై కడుఁ [1]బాడువారెడున్. 86

క. ఏ కార్యంబున దైత్యులు । శోకంబునఁ బుత్ర మిత్ర - శూన్యాలయులై
యాకలములు దిని కుందుదు, । రా కార్యముఁ దెలిసి నాకు-నానతి యీవే! 87

క. అని యిట్లు దైత్యనాయక । [1]హననోపాయంబు నింద్రుఁ - డడిగినఁ, బ్రజ్ఞా
వనరాశియైన సురగురుఁ । డనుకంపా పూరితాత్ముఁ-డై యిట్లనియెన్. 88

### బృహస్పతి దానవ వినాశమునకుఁ దెలిపిన యుపాయము

క. కరుణించి యొసఁగె శంభుఁడు । వర [1]మసురల కది మరల్ప-వశమే వాణీ
వరునకునైనను? గార్యము । వెరవిది యని పలుకరాదు-విబుధవరేణ్యా! 89

వ. మఱియు నీతిమార్గంబు నిజమంత్రులతో మంత్రాలోచనంబు చేసి, కార్యాకార్య మెఱుంగఁజేసి, స్వామ్యమాత్య సుహృత్కోశ రాష్ట్ర దుర్గ బలంబు లను సప్తాంగంబులం గలిగి, సామ దాన భేద దండంబు లనం గల[1]చతురుపాయంబులచేత శాత్రవనాశం బొనర్పవలయు. అందుఁ గర్తృ కారయితృత్వ సామర్థ్య సమేతుండై బలవంతునియందు సామ దానంబులును, సమబలుని

---

(84) 1 గుఱుతై-మ,తి,తీ,హ,క,ర; గురుఁడై-మా (86) 1 బాటునాటిలెన్-క (88) 1 హరణో (ప్రాప?)-మ (89) 1 మసురుల-తి, తీ, హ (90) 1 చతురోపాయ-అన్ని తాళ. ప్ర

యందు భేదంబును, హీనబలునియందు దండోపాయంబును బ్రయోగింపవలయు. దండోపాయంబునకు రథ గజ తురగ పదాతి నివహంబును, దనుస్త్రాణ దివ్యాయుధముఖ పరికరంబులును సంపాదించి, గూఢచార ముఖంబునఁ బరనృప బలసంపత్తియును, దత్ప్రభుమంత్రోత్సాహశక్తి ప్రకారంబులును, దద్విచారంబు నెఱింగి, గుప్త మంత్రంబునఁ బ్రవర్తింపవలయు. వెండియు, 90

సీ. తన మూలబలము నెం-తయుఁ బెంచి, యటమీఁద । [1]వలసిన మూఁకల-వారిఁగూర్చి,
గుప్తమంత్ర విచార - కుశలతఁ గార్యంబు । ప్రాప్తులతో విచా - రం బొనర్చి,
తద్విచారంబు న - త్యంత గూఢముచేసి, । ప్రకటించి బయట వే - ఱొకటి చెప్పి,
పరశక్తియును నాత్మ - బలశక్తియును గాంచి, । కలఁగక తదుపాయ-గతులెఱింగి,
తే. మించివచ్చిన పనులెల్ల -[2]మేలుగిళ్లు । దెలిసి, కోపంబువర్జించి, - [3]తీవ్రకార్య
సరణి నడువక, పరబుద్ధిఁ-గుఱుచపడక । సేయవలయును గురుబుద్ధి-నాయకులకు. 91

మ. గగనం[1]బంటగఁ గోట దీర్చి, పరిఖల్-గంభీరముల్ చేసి, పొం
దుగ నట్టళ్ళును[2]దంచనంబులును దో - డ్తో నిల్పి, ధాన్యాది వ
స్తుగణంబుల్ సవరించి, యాప్త - సుభట - స్తోమంబుఁ గావన్ దృఢం
బగు దుర్గంబుననుండి, భూవిభుఁడు రా - జ్యంబేలు టొప్పుం భువిన్. 92

ఉ. మిక్కిలి శీతలాంబువులు - మేనికిఁ గీడు, మహోష్ణవారిచేఁ
బొక్కు శరీర, మీ యుభయ-ముం దొరలించిన నింపొనర్చు న
ట్లొక్కనయంబు నొండె, భయ-మొండె నొనర్పక, తద్ద్వయంబుఁ దా
నిక్కువెఱింగి చూపు మను - జేంద్రునకు న్వశులౌదు రందఱున్. 93

క. బలవంతుఁడైన విమతుఁడు । కలయక విరసించెనేని - ఘనుఁడగు పృథివీ
వలయేశుఁ గూడి తన పగఁ । జలమున సాధింపవలయుఁ జతురుండగుచున్. 94

క. ఆదిగాన ఘోరదైత్యులు । మదవద్రిపుభయద శౌర్య -[1]మత్తులు వారిం
గదనమున నోర్వ సురలకు । నిది సమయము గాదు నిర్జ - రేశ్వర![2]తలఁపన్. 95

ఉ. శంభువర [1]ప్రవృద్ధ భుజ - శౌర్యుల [2]వార్యులు సంగరక్రియా
రంభ విజృంభమాణు లప-రాజిత కార్ముకబాణు లుగ్ర వా
గ్దంభులు దైత్యడింభు లిఁకఁ-గాలవశంబునఁగాని నేఁడు వి
శ్వంభరమూర్తిచేనయిన - సాధ్యులుగారు నిలింపనాయకా! 96

(91) 1 వలనొప్ప వలసిన-త 2 మేలుగీడు-తీ 3 విప్రకార్య (యతి?) - మా (92) 1 బంఁదఁగ-తి,తీ 2 దెంచనం - తి, తీ, హ; డించనము - త,తా (95) 1 మంతులు - తా 2 వినవే - తి (96) 1 ప్రసాద - తి, తీ 2 దైత్యుల-తా; వారిత-క

చ. ఇటవిను మింకనొక్కటి సు - రేశ్వర! నిక్క ముపన్యసింతు, ధూ
ర్జటివరమత్తులైన దితి - సంభవు లేమియుఁ గన్నుగాన, రీ
[1]కుటిలుల సంహరింప మన - కుం గల దిక్కు సరోజనాభుఁ, డా
పటుమతి నాశ్రయించు, మన - పాయ శుభోన్నతులబ్బు గొబ్బునన్. 97

క. పూజింపుము హరిచరణాం । భోజంబుల, నతని [1]రూప-మును జిత్తములో
యోజింపుము, తద్గుణ గణ । తేజో గరిమములు సన్ను - తింపుము భక్తిన్. 98

క. ఆపన్నరక్షకుండగు । నా పన్నగశాయి దుష్ట - హరణోచిత కా
ర్యోపాయకుశలుఁ డవ్యయుఁ । డాపదలన్నియును మాన్చు - నాత్మఁ దలంపన్ 99

ఉ. కీర్తనమాత్ర సాధుజన - ఖేదముమాన్పు ఝషాది విస్ఫుర
న్మూర్తులు దాల్చి, దైత్యకుల - ము న్నిజహస్త నిశాత చక్ర వి
స్ఫూర్తికి విందుచేసి, పరి - పూర్ణయశోనిధియైన భక్తలో
కార్తివిదారి, శౌరి, దిగ - నాడునె దేవ మునీంద్ర సంఘమున్? 100

క. వనితారూపముఁ గైకొని । దనుజుల నణఁగించి, యమృత-దానంబున నీ
యనిమిషులనెల్లఁ బ్రోచిన । యనుపమ చారిత్రుఁ [1]డాప్తుఁ-డతఁడే కాఁడే? 101

వ. అని యివ్విధంబునం బరమార్థంబు తేటపడంబలికిన వాచస్పతికి వాస్తోష్పతి యిట్లనియె.

మ. అమృతాంభోనిధిలోన శేషఫణి శ - య్యామధ్యమం దిందిరా
రమణీ రత్నముతోడఁగూడి సుఖని - ద్రం బొందియున్నట్టి శౌ
రి మురారి న్నిగమాంతవర్తి నురుకీ - ర్తిం గొల్చుటెట్లా ప్రదే
శము చేరంజనలేరు బ్రహ్మ[1]ముఖులున్, - శక్తాత్ములే మాదృశుల్? 103

క. అని హరిపూజా లాభ । మ్మునకు నుపాయంబు వేఁడు - పురుహూతుని వా
గ్వినయముల కలరి సురగురుఁ । డనుకంపిత హృదయుఁడగుచు-నపుడిట్లనియెన్ 104

### పుండరీకాక్షుని పూజా విధానము

క. నీ నొడివినట్లు యమృతాం । భోనిధిమధ్యమున శేష - భోగీంద్రునిపై
శ్రీ [1]నారీయుతుఁడై హరి । తా నెంతయుఁ గూర్మినుండుఁ - దథ్యంబరయన్. 105

---

(97) 1 కుటిలుర-మ;మా;తి,తీ,హ,ర (98) 1 రూపు మొగి-మ,మా,హ,క,ర; రూపమొగి - తి,తీ (101) డాత్ముఁడాతఁడె-మ,తా;డా మహాత్ముఁడు-త,మా (103) 1 ముఖరుల్-తా (105) 1 నాయకుఁడై శ్రీ-తి,తీ,హ;ర,క

మ. హరి యచ్చోటన కాదు, సర్వమునఁ దా - నై, వాయు వార్యద్రి భూ
[1]తరు తేజో వియ దంబురాశి విపిన - స్థానాపగా లోహ స
త్పురు షాంతః పరమాణు ముఖ్యములయం - దుం బూర్ణుఁడై, వీనికిం
బరమాధారమునై వెలుంగుఁ ద్రిజగ - ద్బాహ్యాంతరాళంబులన్. 106

క. నీయందును నాయందును । బాయక వర్తించునట్టి - పరమాత్ముని నీ
వాయత[1]భక్తి భజింపు మ । పాయంబులు గలుగవెచట - బలదనుజారీ! 107

వ. మఱియు, నా పుండరీకాక్షుని పూజాప్రకారం బాకర్ణింపుము. శిలామయంబును, దారుమయంబును, లోహమయంబును, [1]లేఖ్యయు, నాలేఖ్యయు, మనోమయంబును, మణిమయంబును, సికతామయంబు ననం నెనిమిది తెఱంగుల ప్రతిమారూపంబులు గలవు. అందులో నిష్టంబైన విగ్రహంబునందు నా వారిజాక్షు[2]నం దావాహించి, యాసనార్ఘ్యపాద్యాచమనీయ మధుపర్క స్నాన వస్త్ర యజ్ఞోపవీత దివ్యాభరణ గంధ పుష్ప ధూప దీప నైవేద్య తాంబూల వ్యజనాద్యుపచారంబులు మంత్రయుక్తంబుగాఁ జేసి, ప్రదక్షిణనమస్కారంబు లాచరింపవలయు. అట్టి ప్రతిమావిశేషంబులును గ్రామార్చన గృహార్చన భేదంబుల ద్వివిధంబులగు. అందు గ్రామార్చన రూపంబు చలంబు నచలంబు నన రెండు తెఱంగులు మహోత్సవ కాలంబునఁ బుష్ప[3]కారోపణ యోగ్యంబు చలంబు, స్థావరరూపంబు బచలంబు ననం బరగు అట్టి చలప్రతిమా విగ్రహంబులయందును గృహార్చనారూపంబులయందును దారుమయ సికతామయ లేప్యామయ లేఖ్యాలేఖ్యాది రూపంబులయందును బ్రత్యహంబు నావాహనోద్వాసనంబులు సేయవలయు. అచలప్రతిమలయందును, ధ్యాన ప్రత్యక్ష విగ్రహంబులయందును, సాలగ్రామశిలా స్వరూపంబులయందును, మణిమయంబులయందును బరమ పురుషుండు నిత్య సన్నిహితుండు, గావున నావాహనోద్వాసనంబులు సేయంజనదు. ఇట్టి ప్రతిమా భేదంబులలోన సాలగ్రామ శిలామహత్త్వంబు చెప్పెద నాకర్ణింపుము. 108

## సాలగ్రామ మాహాత్మ్యము

క. శ్రీమత్సాలగ్రామ । శ్రీమూర్తిని వేదశాస్త్ర - శిష్ట ద్విజ చూ
డామణికి దానమిచ్చిన । యా మనుజుని సొమ్ము లైహి - కాముష్మికముల్. 109

క. సాలగ్రామశిలా ప్ర । క్షాళిత తీర్థంబుఁ గ్రోలి - కమలోదరు ది
వ్యాలయముఁ జేరి యెన్నఁడుఁ । గ్రోలఁడువో! నరుఁడు మాతృ-కుచ దుగ్ధములన్. 110

సీ. బ్రహ్మహత్యా సురా - పాన గుర్వంగనా । గమన కాంచనచౌర్య - కల్మషముల,
సోదరీసంభోగ - సూనృతరాహిత్య । పరకామినీసంగ - పాతకముల,

(106) [1] ధరతా- (107) 1 మతిభజియింపుము - మ, తి, తీ, హ, ర,క (108) సేవ్యయు - హ,క,ర; నవ్యయు - మా 2 నందావహించి - అన్ని ప్ర. 3 కారోహణ - తా,క

మాతాపితృ త్యాగ - మాతంగభామినీ । ఖేలన కాపట్య - కిల్బిషముల,
భూతహింసా పుణ్య - పురుష పుణ్యాంగనా । [1]దూషణాత్మస్తుతి - దుష్కృతములఁ
తే. బాసి, సురవంద్యుఁడై విష్ణు-పదమునందు । మానినులుగొల్వఁ గ్రీడించు-మానవుండు,
హరిదినంబున శ్రీమూర్తి - నచలభక్తి । యొసఁగ సద్విప్రునకు దాన-మొసఁగెనేని. 111

క. విలసితసాలగ్రామో । పలమూర్తి విశిష్టుఁడైన - పద్మారమణున్
[1]దులసీ దళములఁ బూన్చిన । ఫలకాముఁడు వాంఛితార్థ-పటలముఁ జెందున్. 112

### ఏకాదశీ మాహాత్మ్యము

క ఏకాదశి నుపవాసము । గైకొని తులసీదళమునఁ - గమలోదరు పూ
జాకృత్యము దీర్చిన నరుఁ । డాకల్పము విష్ణులోక - మందు వసించున్ 113

క. హరిపుణ్య వాసరంబున । నరుఁ డన్నముఁగుడిచెనేని - నలినాప్తసుధా
కరులు గలయంత కాలము । నరకంబులఁ గూలు హిత జ - నంబులతోడన్. 114

చ నిరుపమతీర్థసేవయు వి - నిర్మలధర్మసమార్జనంబు న
ధ్వరకరణంబు నన్నజల - దానములుం జరమాశ్రమక్రియా
స్ఫురణము నర్థికామపరి - పూర్తియు నాదిగఁగల్గు పుణ్యముల్
హరిదివసోపవాసఫల - మందుల వేయవపాలుఁ బోలునే? 115

వ. అని యివ్విధంబున సురగురుం డుపన్యసించిన సమయంబున, 116

### వసుంధర సురేంద్రుని సభకరుదెంచుట

సీ. కబరికా భారంబు - గమన వేగంబునఁ । గుప్పించి మూఁపునఁ - గునిసియాడఁ
బవన నర్తన శిక్ష - ఫాల రంగంబునఁ । గుటిలాలకంబులు - [1]గొండ్లిసలుప,
గండ స్థలంబున - ఘర్మాంబు శీకర । జాలంబు మెల్లన - జాలుకొనఁగ
సతత నిఃశ్వాస మా - రుతమున నాసికా । పుటములు పలుమారు - పుటములెగయఁ,
తే. గుచము లల్లాడఁ, బయ్యెద-కొంగు జాఱఁ, । గౌను జవ్వాడ, మోవిపైఁ-గాంతి వాడ,
లోని తహతహ చేష్టలు - కానఁబడఁగ । నరుగుదెంచెను భూదేవి-యమరసభకు. 117

వ. ఇట్లరుదెంచిన భూకాంత నాలోకించి, దేవతాసమేతుండగు పురుహూతుం డవ్విష్ణు భామిని నెదుర్కొని ప్రణతుండై, యర్ఘ్య పాద్యాది విధులం బూజించి, యొక్క హిరణ్మయ సింహాసనంబు సమర్పించిన, నద్దేవియు నందు నాసీనయై యా సునాసీరున కిట్లనియె.

---

(111) 1 దూషణోన్నతఘోర - తా; దూషణస్తుతి మహా - మ, మా, తి, తి, హ, ర, క
(112) 1 దులసిం బూజించినఁ దగ - మ; దుళసీరమణు బూన్చిన - త, మా (117) 1 గోష్ఠి - తా

శా. కంఠేకాల వరప్రభావ విలస - ద్గర్వాంధులై, సంగరో
త్కంఠా పూరితులై, సమస్త దివిష - త్పృక్షావనీనాథులం
గుంఠీభావము నొందఁజేసి, యసురల్ - గోర్కెన్ సురప్రేయసీ
కంఠాలింగన కాంక్షులైరి, దితి దు - ర్గర్భంబునం బుట్టుటన్. 119

క. బలవంతు లా సురాహితు । లిలఁ బాలింపంగఁ గచ్ఛ - పేశ్వర ఫణిరా
ట్కులనగ వరాహ దిగ్గజ । ములకన్ మద్భార మతి స - మున్నత మయ్యెన్. 120

క. కావున మనము ప్రియమ్మునఁ । బోవలయును సకలలోక - పూజ్యుండగు శ్రీ
దేవుని సన్నిధి కతఁ డసు । రావలిఁ బరిమార్చి భాగ - మంతయుఁ దీర్చున్. 121

క. పూర్వమున దుష్టదైత్యుల । గర్వాంధులఁ జక్రధార - ఖండించి జగ
[1]న్నిర్వాహపరుఁడు గాఁడె? సు । పర్వులు కొనియాడఁ జనఁడె-బహువారంబుల్? 122

చ. అమరులు నొచ్చినం, దితి సు - రావలి హెచ్చిన, నగ్నిహోత్రముల్
సమసిన ధర్మముల్ చెడిన, - సత్యము[1] గ్రుంగిన, నీతి మార్గముల్
శమితములైన, వేదవిధి - జాఱిన, దుర్జను లెచ్చరించినన్
గమలదళాక్షుఁ డీ జగముఁ - గాచును దా నుచితావతారుఁడై. 123

వ. అని పలికిన ధరణీ తరుణీమణి ఫణితిసరణికి నానందించి, పురందరుండు బృందారక సందోహంబును, సనక సనందన సనత్కుమార పరమయోగి వ్యూహంబును, నారదాది దివ్య మునులును, రంభాది సురకామినులును, గంధర్వ కిన్నర కింపురుష గరుడోరగ నికాయంబును, సూర్యాదిగ్రహ తారకా సముదయంబును గొలిచి చనుదేర, నా [1]భూమిభామినీ లలామం బురస్కరించుకొని, స్వర్గంబు నిర్గమించి చనిచని ముందఱ, 124

### దేవబృందముతో నింద్రుని హరిపుర ప్రయాణము

సీ. సిరిఁగన్నతండ్రి, రా - జీవనాభుని మామ, । తామరచూలి మా-తామహుండు,
శూలిబోనముకుండ, - సురల యాఁకటి పంట, । వాహినీ తరుణుల - మోహభర్త
యమరధాత్రీజంబు - లంకురించిన పాదు, । చలివెలుంగుల వేల్పు - జన్మభూమి,
జలధరంబుల పాన - శాల, రత్నంబుల । గని, శైలముల డాఁగు - మనికి పట్టు,
తే. చేరవచ్చిన తఱి నెంత - వారినైనఁ । బూని లోఁగొననేర్చిన - భువనగురుఁడు
ననఁగఁ, జూపట్టుచున్న దు-గ్ధాంబురాశిఁ । గాంచి, దేవేంద్రుఁ డిట్లనుఁ-గౌతుకమున. 125

(122) 1 న్నిర్వహణ పరుఁడు - మా, త, తి, తీ, ర (123) 1 కుందిన-త (124) 1 భూమిబా లలామం - మ, తి, తీ, హ, ర, క

చ. ఎడమ కుడింత లేక తను - నింపునఁ జేరినవారి భంగముల్
కడలకు [1]నొత్తి, జీవన ని - కాయము [2]పొత్తొనరించి, పొటులం
బడి, యనుకూలుఁడై సరస - భావమునన్విహరింప నేర్చు నీ
కడలివిభుండు, సర్వబుధ - కాంక్షిత దానకళా [3]ప్రగల్భుఁడై. 126

వ. అని పయోనిధానంబుఁ గొనియాడి, తత్సమీపంబునం గనుపట్టు వైకుంఠ పట్టణంబు
గనుంగొని దివిజులతో నిట్లనియె. 127

సీ. గగన మండల నవ-గ్రహము లీ పురికోట । నవరత్న బీజ [1]సం-భవములొక్కొ?
గంభీర సప్త సా-గరము లీ పురి దీర్ఘ । పరిఖల ప్రతిబింబ - సరణులొక్కొ?
మేరు రోహణ ముఖ్య - భూరి శైలంబు లీ । పురి గోపురముల సో - దరములొక్కొ?
రంభాది సురలోక - రాజాస్య లీ పురి । భద్రేభయానల - ప్రతిమలొక్కొ?

తే. దివిజ భూజంబు లీ పురిఁ - దేజరిల్లు । నిరుపమోద్యాన తరువుల - నీడలొక్కొ?
యనఁగఁ గన్నుల కానంద-జనక మగుచు । సిరులఁ జెన్నొందుఁ గంటిరే-హరిపురంబు?

చ. ఉరమునఁ గౌస్తుభంబు సిరి - యుం, గటి మండలమందుఁ గాంచనాం
బరమును, వామ భాగమున-మచ్చయు, నాలుగు చేతులం గదా
సరసిజ శంఖ చక్రములు - సమ్మతిఁ దాల్పని వానిఁ గాన మీ
పురవరమందుఁ జిన్ని మొల - పూసల[1]పాపనిఁ బట్టిచూచినన్. 129

మ. దివిజుల్! పంజర రాజకీరముల న - ర్థిం జూడుఁ, డిచ్చోట బా
గవత స్కంధ కథా సుధా మధుర వా - క్యంబుల్ ప్రసంగింపుచు
న్నవి కర్ణంబుల కింపుగాఁగ, నిచట - న్రామాయణ గ్రంథమున్
సవిశేషోక్తుల విస్తరించు వినుఁడా - శ్చర్యంబుగా శారికల్. 130

సీ. జాళువా బంగారు - జలపోసనము మంచి । వలువలు గట్టనే - వన్నెకాఁడు,
మిసిమి గాలికి నుబ్బు - మెత్తని [1]పరుపుపైఁ । బొసఁగ నిద్రింపని - పుట్టుభోగి,
ప్రొద్దుపోకలకైనఁ - [2]బులుఁగు తేజీనెక్కి । వీథులఁ బఱవని - వేడ్కకాఁడు,
పొక్కిలి వెలిదమ్మి - పువ్వునఁ బుట్టిన । తనయుని నెత్తి పెం - చని గృహస్థు,

తే. యువతి చెక్కులఁ జన్నుల-నొక్క మరియు । మకరికలు వ్రాయ హస్త ప-ద్మములు నాల్గు
గరిమఁ దాల్పక యుండని-కాముకుండు । లేఁడు హరిపురిలోనఁ బో-లించిచూడ. 131

(126) 1 నెత్తి-తి,తీ 2 లో సవరించి-మా 3 ప్రగల్భ్యుఁడై -మ, మా,త,తా,క (128) 1 సంగమము (యతి?) - ర (129) 1 పట్టిని వేడ్కఁ జూచినన్ - హ (131) 1 కడుపుపై - మ, మా, త, తా, హా, ర, క 2 బులుగుల జీనెక్కి - మ

వ. ఇట్లనన్య సామాన్య సంపద్విశేష విరచిత సురచయోత్కంఠంబగు వైకుంఠంబుఁ గనుంగొని, పురందదాది బృందారక బృందంబు వందనంబొనర్చె. భూదేవియుం బ్రాగ్ద్వారము ఖంబున [1]నన్నగరు ప్రవేశించి, హరిమందిరంబు చేరంజని, 132

ధరాదేవీ కృత విష్ణుస్తుతి

సీ. బహుమణి స్థాపిత - పాదాంగదమువాని, । జాళువాపసిఁడి ప - చ్చడమువాని,
[1]నబ్ధిజా కుచ చంద-నాంక వక్షమువాని, । శ్రీవత్స సౌభాగ్య - చిహ్నవాని,
హారలతా వేల్లి - తోరు కంఠమువాని, । నవరత్నమయ భూష - ణములవాని,
గండస్థలీ చల త్కుండలంబులవాని, । నవ్వులు దొలఁకు నా - ననమువాని,

తే. నంబురుహబంధు నిభ కిరీ - టంబువాని, । జలధర శ్యామ విగ్రహ - చ్ఛాయవానిఁ,
బాంచజన్య సుదర్శన - ప్రముఖ దివ్య । సాధనోజ్జ్వల కరచతు - ష్టయము వాని, 133

ఉ. వారిజ పత్ర నేత్రముల - వాని, నుదంచిత నాభి పంకజో
ద్గారిత శారదాధవ శ - తంబులవాని, రమా మనోహరా
కారమువాని, సంయమి ని - కాయ వశంవద చర్యవాని, ల
క్ష్మీ రమణున్, హరిన్, భువన - సేవ్యుని, దైవత సార్వభౌమునిన్, 134

క. వాసవ రత్నోత్పన్న వి । భా సముదయ భాసమాను, - భద్రాసన మ
ధ్యాసీనుఁ జక్రిఁ గాంచె మ । హీసతి యానంద భరిత - హృదయము తోడన్. 135

క. ధరణీపతి యివ్విధమునఁ । [1]దరణి శత ప్రతిము శౌరిఁ - దాఁ గని యంతః
కరణమున నలరి యవ్విభు । చరణములకు[2]నెఱఁగి లేచి - సంభ్రమ మొదవన్, 136

క. కరకమలంబులు నిటలాం । తరమునఁ గదియించి, దేవ - తా గురు లక్ష్మీ
శ్వరు నిఖిలలోక కుక్షిం । భరు హరి, నిట్లనుచుఁ జేరి-ప్రస్తుతి చేసెన్. 137

సీ. దేవ! దేవేశ్వర! - దేవారి ఖండన! । నిత్య! నిత్యోదయ! - నిత్య చరిత!
పద్మజ పద్మారి - పద్మాప్తసేవిత! । భవహర! భవమిత్ర! - భవ్యభవన!
శతపత్రహిత శత - శతకోటి సంకాశ! । సర్వజ్ఞ! సర్వేశ! - సర్వవినుత!
నాగేంద్ర నాగారి - నాగేశ వందిత! । కమలాక్ష! కమలేశ! - కమలనిలయ!

తే. చక్ర ఖండిత[1] సకలారి-చక్ర! చక్రి! - పరమపద ధామ! పరమేశ! - పరమపురుష!
నిన్ను సేవింతు సతతంబు - నిగమజనక! । [2]* * * * * * 138

(132) 1 నగరంబు - అన్ని ప్ర. (133) 1. ఈ పా.ర. ప్ర. లో లుప్తము (136) 1 ధరణీశ ప్రతిము - హ,ర,క; 2 నొరగి-అన్ని ప్ర. (138) 1 కమలారి-త ? అన్ని ప్ర.లో పా. లుప్తము

ఉ. ధీరత నెవ్వఁడేని భవ - దీయ లసద్గుణ వర్ణనా సుధా
పూరము జిహ్వికాంజలులఁ - బూని, భవాతప జాత దాహమున్
దీరఁగఁ గ్రోలు, నట్టి మహ - నీయుఁడు దుర్గతి [1]మార్గ మారుఁడై
చేరును ముక్తిధామ మతి - శీఘ్రమున న్విగత ప్రయాసుఁడై. 139

సీ. అమరేంద్రశరణంబు - లగు నీదుచరణంబు । లంచిత భక్తిఁ బూ - జించువారు,
నిగమ సంస్తుతి పాత్ర - మగు నీ చరిత్రంబు । వీనులఁ దనియంగ - వినెడువారు,
నఖిల లోకాధార - మగు నీ శరీరంబుఁ । దలఁ పున నేప్రొద్దు - నిలుపువారు,
నమృతపూర్ణద్రోణి - యగు నీగుణ శ్రేణి । [1]నిరుపమ మతిని వ - ర్ణించువారు,

తే. దండధర ఘోర దండ ప్ర - చండ పాత । నిర్యదుజ్జ్వల హుతభు గు - న్నిద్ర వివిధ
లోల కీలాపహతులకు - లోను గాక । ఘనత నందురు నీపురిఁ - గమలనాభ! 140

ఉ. దారుణ పూర్వకర్మ పటు - తస్కర వర్గము లీడ్వ గర్భకాం
తారముఁ దూఱి, సంసరణ - తాప భయంకర బాధ నొందు సం
సారికి, నీ గుణప్రకర - సంస్తుతి తద్భయమోచన క్రియా
కారణ మంబు జేక్షణ! జ - గత్పరి రక్షణ! [1]చక్రలక్షణా! 141

చ. అలయక సంతతంబు రస - నాగ్రమునం భవదీయ సద్గుణం
బులు గొనియాడియు న్వినియు - మోదమునొందు నరుండు, కర్మ శృం
ఖలికలు గోసివైచి యవి - కారత నీ తనువందు డిందుఁ బో!
జలము జలంబులం గదియు - చందమునన్ సురబృంద వందితా! 142

ఆ. ఘట పటాదులందుఁ - గలుగు జాతి వ్యక్తు । లేర్పరింప వశమె - యేరికైన?
నట్ల విశ్వమునకు - నఖిలాత్మ [1]యగు నీకు । భేదశంక లేదు - వేద వినుత! 143

క. శంకరుఁడని, త్రైలోక్య వ । శంకరుఁడని, దుష్టరాక్ష - స ప్రవర వినా
శంకరుఁడని, కొల్తురు ని । శ్శంక రహస్యాగమార్థ - చతురులు నిన్నున్ 144

క. అంబుజ భవుఁడాదిగఁ గీ । టంబంతముగాఁగఁ బ్రాక - టంబైన ప్రపం
[1]చంబునఁ బరిపూర్ణుఁడవగు । చుం బొల్తువు, నీవు లేని - చోటును గలదే? 145

క. ఈ యఖిల చరాచరమున । నీ యెఱుఁగనియట్టి కార్య - నికరంబేదీ?
తోయరుహపత్రలోచన! । యే యెడలం గలవె దైవ-మెఱుఁగని పొందుల్? 146

---

(139) 1 దూర మార్గుఁడై - తి, తీ, ర (140) 1 నిరూపుమదిని - మ, తా, తి, తీ, హ, ర, క; నిరుపమ మదిని - త 2 తనుం డగు - తి (141) 1 దుష్ట శిక్షణా - త; చక్ర రక్షణా - మ (143) 1 వగునీకు - తా (145) 1 చంబంతన - త

శా. స్పర్ధాకాముకుఁడైన సోమకుఁడు శ-బ్దబ్రహ్మముం జోరతా
వర్ధిష్ణుండగుచున్ [1]హరించి యరుగన్ - వాచాల వీచీ లస
ద్వార్ధిన్ దుర్ధర మీనవేషమున నా - వైరిన్విదారించి, యం
తర్ధైర్యచ్యుతుఁడైన వాక్పతికి నా - మ్నాయంబు లీవే దయన్? 147

ఉ. దానవవీరులున్ సురలు - దర్పితులై యమృతోదయార్థ మం
భోనిధిఁ దర్చునప్పుడు స - ముద్రజలాంతర మగ్నమైన మం
థాన ధరాధరంబుఁ బ్రమ - దంబునఁ దాల్పవె కూర్మమూర్తివై?
భూనుత భక్తరంజన! ప్ర - భూతకృపాంజన! దైత్యభంజనా! 148

వ. అని యివ్విధంబున వసుధావనిత వినుతించిన, [1]నకించి త్పులక కంచుకిత గాత్రుం డగుచుఁ, బుండరీకనేత్రుం డా ధరణీ తరుణీమణి దిట్టతనంబునం దేనియలుట్టిపడ నొడివిన సుధా కల్పంబులగు మధుర జల్పంబులు చెవులకుం జవులొనర్ప దర్పక లీలాసదనుండును దరహసిత వదనుండునగుచు నమ్మగువం జేరందివిచి, జగదీశ్వరుండు సంభ్రమంబున, 149

### శ్రీహరి వసుంధరను సాంత్వనపఱచుట

మ. కరమూలంబుల బాహువుల్ చొనిపి, శృం - గారంబు సంపూర్ణ కుం
భ రుచిం బోల్చు పయోధరద్వయ మురో - భాగంబునం దార్కొనం
బరిరంభించి, యుదంచితాధరసుధా - పానంబునం దేలి, రా
గ రసోద్రేకమునం దదీయ సకలాం - గ స్పర్శనోత్సాహియై, 150

తే. అంకపీఠస్థలంబున - నా లతాంగిఁ । జేర్చి, చిబుకంబు పుణుకుచు - సేదదీర్చి,
తత్సమాగమసుఖ పర-తంత్రుఁడగుచు । నంబుజాక్షుండు వసుధ కి-ట్లనుచుఁ బలికె. 151

సీ. సుదతులు విరులకై - చోఁపిన గమి విచ్చి । పఱచు తేఁటులరీతిఁ - గుడులు చెదరి,
యస్తమింపగ నేఁగు - నమృతాంశు బింబంబు । కైవడి నెమ్మోము - కాంతి వెడలి,
రసమింకి కడు [1]వాడి-పసచెడు బింబికా । ఫలముచొప్పున మోవి - చెలువ ముడిగి,
మొదలి [2]వేరుకుఁ ద్రెవ్వి - మురువు దప్పిన పువ్వు । లత లీల మేని వి-లాస మెడలి,

తే. చిన్నఁబాటేర్పడంగ, నా - యున్నకడకు । నీవు వచ్చిన భావంబు - నిర్ణయింపఁ
గార్యమొక్కటి యేదేని-కలుగఁబోలుఁ, । దడవుసేయక వినిపింపు-తరళనయన! 152

మ. పరిణామంబె ధరిత్రి నీకు? మఖముల్-పాటింతురే భూసురుల్?
ధరణీనాథులు పాడిమై నడతురే? - ధర్మంబు[1]సామాజికుల్

(147) 1 విరించి-తి,తీ,హ,ర,క (149) 1 నగ్గించిత - క (152) 1 వాడువారిన (యతి?) - మ,మా,త,తి,తీ,హ,ర,క 2 వేరునుద్రెవ్వ-త (153) 1 సామాధికుల్-అన్ని ప్ర

పొరపొచ్చెంబొనరింప కేర్పఱతురే? - భూరి ప్రతాపోగ్రులై
సురవిద్వేషులు సంభవించరు గదా? - సూచింపు మజ్ఞాననా! 153

వ. అని సాంత్వనపూర్వకంబుగా నిర్వాణపాలన లీలాప్రవర్తిష్ణుండగు విష్ణుం డానతిచ్చిన దేవకార్యధురంధరయగు వసుంధర యా సింధుర[1]పదున కిట్లనియె. 154

క. ఆర్య[1]నుత చరిత! సర్వాం । తర్యామికి [2]నీకు నవిది - తము లేదైనన్,
ధైర్యం బారయ నచ్చిన । కార్యము వినిపింతు వినుము - కరుణాపరతన్. 155

ఉ. దారుణ దైత్య దానవులు - దగ్రబలాఢ్యులు పుట్టి, యిందు కో
టీర వరప్రభావమున - డెందమున న్మదియించి, లోక సం
హార మొనర్ప, నిగ్గనుట - కై సురలందఱు నేఁగుదెంచి, దౌ
వారికులడ్డపెట్ట నిలు - వంబడినారు గృహాంగణంబునన్. 156

### వాసవాదుల హరినగర ప్రవేశము

క. అని విన్నవించునాలో । సనకాదులు [1]వాసవాది - సకలామరులున్
ముని కిన్నర యక్షావళులుఁ । గనుకని హరినగరు చొచ్చె - ఘంటావీథిన్. 157

చ. మణిమయ దివ్యగోపుర స - మాజములున్ భువనేశ్వరంబులున్
బణములుఁ జప్పరంబులు స - భా భవనంబులు దివ్యరత్న తో
రణములుఁ బువ్వుఁదోఁటలును - రాజముఖుల్ మొదలైన తత్పుర
ప్రణుత విశేషముల్ నయన - పర్వముగాఁ గనుగొంచు నందఱున్. 158

### ఇంద్రాదులను జయ విజయులు నిరోధించి బాధించుట

ఉ. వారిజనాభు శ్రీ[1]నగరు - వాసవముఖ్యులు గాంచి, హస్త పం
కేరుహముల్ లలాటమునఁ - గీల్కొనఁజేసి, నిజప్రయోజన
ప్రేరణ నొండొరుం గడచి - భీతి విచారము లేక పూర్వది
గ్ద్వారము చొచ్చిపోవుటయు, - వారల కడ్డము[2]నిల్చి గొబ్బునన్, 159

చ. జయవిజయాహ్వయుల్, కనక - శైల నిభాంగులు, వేత్రహస్తు, ల
క్షయ శుభ శంఖ చక్ర ముఖ - సాధనవంతులు, పుణ్య లక్షణో
దయులు, నిలింపకోటికి ము - దంబున నిట్లనిపల్కి రెంతయున్
ప్రియము నయంబుఁ బొంకమును - బింకము నేర్పడ నుక్తిచాతురిన్. 160

---

(154) 1 వరదున - తా,ర (155) 1 సుర - మ, త 2 నీకభావిత నాకేదైనన్ - తా; నీకు నేదితముకే - తి, తీ, హ, ర (157) 1 నారదాది - తా (159) 1 నగరి-త 2 వచ్చి-క

శా. శ్రీకాంతా ధరణీసతీ యుతముగా - శృంగార సౌధాంతర
వ్యాకోచ ప్రసవావళీ రచిత శ - య్యా మధ్య నాసీనుఁడై
యేకాంతంబున నున్నవాఁడు హరి, మీ - కీ వేళఁ దద్దర్శనం
బాకాంక్షించిన నేల కల్గు? సురలా - రా! తత్తరం బేటికిన్? 161

క. ఎఱుఁగరు మీరలు కార్య । త్వరితంబున నేఁగుదెంచి-తలక్రిందైనన్,
హరియాజ్ఞ లేక యూరక । చొరవచ్చునె మీకు నతని - శుద్ధాంతంబున్? 162

క. ఉండుఁడు మీరిచ్చోట వి । తండావాదములు మాని - తాలిమితో, ని
ట్లుం [1]దంగ నోపరేనియుఁ । బొండిప్పుడు [2]మీ నివాస - భువనంబులకున్. 163

వ. అని పలికిన జయవిజయుల నయ భయ గర్భంబులగు వాక్య సందర్భంబులు లెక్కగొనక, నిర్భర కార్యాపన్నతాకృత [1]వివేకచ్ఛేదులగు వానవాదులు నీరజోదరు[2]భవనద్వారంబుఁ దూఱి చనునంత, 164

క జయవిజయులు రోషారుణ । నయనంబుల నిప్పులొలుక - నాళీకవన
ప్రియ [1]తనయ చండ దండ । ద్వయ సమముల హస్త వేత్ర - దండముల వడిన్, 165

సీ. మోదిరి జంభారి - [1]ముకుటాగ్ర మాణిక్య । పటలంబు నలుగడఁ - జిటిలిపడఁగఁ,
జదిపిరి దక్షిణా - శా వల్లభుని సము । ద్దండ దండము సూక్ష్మ - ఖండములుగఁ,
బ్రహరించి రంబుధి - ప్రభుని పాణి గృహీత । దృఢ పాశలతికలు - [2]ద్రెవ్వి తొరుగ,
నదిచిరి యక్షనా - యకుని కేయూర కం । కణ ముఖ్య రత్నభూ - షణము లురుల,
తే. ననిలుకరములు విఱిచిరి-మునులఁ బఱచి । రచలతం దిట్టి రఖిలసం-యములఁగొట్టి
రాగ్రహంబెల్లఁ దమమూర్తు లయ్యెననఁగ । హరి గృహద్వార రక్షణా-యత్తులగుచు. 166

క. ఈ విధమున మురభంజన । దౌవారిక చండ వేత్ర - దండాహతులై
దేవతలు మునులు గంధ । ర్వావలియును యక్ష కిన్న - రాదులు యతులున్, 167

### జయ విజయులకు ఘోర శాపము

చ. హరిహయుఁ డాదిగాఁగల మ - హామహు లందఱు దండఘాత జ
ర్జరిత శరీర వేదనల - రాఁజిన రోషము మిన్నుముట్ట, నా
హరిపద సేవకోత్తముల - నల్కఁ గనుంగొని, 'మీరు రాక్షస
స్ఫురిత కులంబునన్ ధరణిఁ - బుట్టుఁడు శ్రీహరికి న్విరోధులై. 168

(163) 1 డఁదగ - తి,తీ,తీ 2 నిజ-క (164) 1 వివేకభేదు - మా,త,తి; వివేకవేదు - తా 2 భువన-మ,తి,తీ,హ,ర,క (165) 1 తాయతచండ - మ,త; తయను వందా-తి,తీ,క; తయ చండా - హ,ర (166) 1 మకుటా (యతి?) - త 2 ద్రెళ్ళి - మ,తా

క. జననములు మూఁడు మనుజా । శనులై వర్తింపుఁ' డనుచు - శాపము దివిష
న్మునిముఖ్యు లొసఁగి, రత్తఱి । మొనసిన కలకలము వినియె-మురభంజనుఁడున్ 169

శౌరి సాక్షాత్కారము

చ విని దనుజోగ్ర [1]ఘోషమని - వేగమె చక్రము పూని, దైత్య భం
జన మొనరింపఁగా నుదిత - సంభ్రముఁడై చనుదెంచి, సజ్జనా
వన [2]ధనుఁడైన శౌరి తల - వాకిట నిల్చిన, నా [3]గమావిభుం
గనుగొని రింద్ర ముఖ్యులు, వి - కాస సమంచిత నేత్రపద్ములై. 170

చ. వికసిత నేత్ర బృంద మర - వింద వనంబుగ, హర్ష బాష్ప [1]నీ
ర కణము లుప్పతిల్లు మక - రందముగాఁ, [2]దమ మీఁద సారె సా
రెకు హరిమేని చాయ ప్రస - రించుట తేఁటుల రాకగా, సుర
ప్రకరము లత్తఱిం గొలని - భావము దాల్చె [3]ను ఘర్మ తోయతన్. 171

చ. పరమ యతీంద్ర హృద్గుహలఁ - బాయక క్రీడ యొనర్చుచుండు నీ
హరి చనుదెంచె, నిప్పుడ ర - యంబున వీక్షణ నీల రశ్మి వా
గురికలచేఁ దగుల్పఱచు - కొంద మటంచుఁ దలంచియో సుమీ!
సురపతిముఖ్యు లొక్కమొగిఁ - జూచిరి తత్సకలాంగకంబులన్. 172

క. దివిజేశ్వరాదు లీక్రియ । భువనేశ్వరుఁ గాంచి, హర్ష - పూరితులై యు
త్సవలీల మ్రొక్కి, వేద । స్తవములఁ గొనియాడి రుదిత - తాత్పర్యమునన్. 173

తే. అపుడు జయ విజయు [1]లిరువు-రంబుజాక్షు । పదములకు వ్రాలి శాపసం-ప్రాప్తి శోక
బాష్పధారా సమర్పిత పాద్యులగుచు । హస్తయుగములు మోడ్చి యి-ట్లనిరి హరికి. 174

ఉ. సారసనాభ! మీపనుపు - సంతతముం దలమోచి మందిర
ద్వారముఁ గాచియున్న మము - వాసవముఖ్యులు ద్రోచి చొచ్చినన్
వారల నడ్డగించితిమి - వాక్పరుషత్వముఁ జూపి, మాకు దౌ
వారికధర్మముల్ విడువ - వచ్చునె స్వామిహితంబు వీడ్వడన్? 175

క. ఇది తప్పుచేసి త్రిదశులు । సదయత్వము వదలి మూఁడు - జన్మంబులు మీ
పదములకుఁ బాసి దైత్యత । నుదయించఁగ శాపమిచ్చి - రూరక మాకున్. 176

---

(170) 1 ఘోషము న-హ,ర,క 2 తను - తి,తీ 3 తన - మ,తి,హ.,ర (171) 1 ముల్ నికరణ ముప్ప - మ; నేత్రకణములుప్ప - క; నీరకణములుప్ప - మా, త; తోయకణములుప్ప - తి,తీ,హ,ర 2 రమ - తీ 3 నఘర్మ - అన్ని ప్ర; సమర్మ - మా (174) 1 లిద్దరునంబు (గణము?) - అన్ని ప్ర.

క. మురహర! యీ[1]శాపానల । పరితాపము మాన్ప నొండు - పాయము మాకున్
దొరకునె? నిర్వైతు భవ । త్కరుణామృత సేచనంబు - గలుగకయున్నన్. 177

వ. అని శాపాగమన వృత్తాంతం బెఱింగించి, కించి దాకుంచితముఖులై పదనఖ ముఖంబుల నేల వ్రాయుచుఁ, గన్నీరు మున్నీరుగా జాఱ నూరకున్న, దౌవారికులకు దానవారి కరుణా తరంగితంబులగు నపాంగంబుల నవలోకించి యిట్లనియె. 178

జయ విజయులకు నభయ ప్రదానము

సీ. ఏమి సేయఁగ వచ్చు, - నింద్రాది దివ్యులు । కోపించి మీ కిట్లు - శాపమిచ్చి,
రది బ్రహ్మ రుద్రాదు - లైన మాన్పఁగ లేరు, । దైవిక దుఃఖంబు - దగులకున్నె?
కార్యంబు లుదయించుఁ - గర్మాను గుణములై, । [1]కాఁగల పను లేల - కాక మాను?
జన్మాంతరంబుల - సంచితంబగు కర్మ । మనుభవించినఁగాని - యణఁగిపోదు,
తే. దీనికై యుమ్మలింపక, - దితికి మీరు । తనయులై పుట్టి, రాక్షస - త్వము భజించి
యవని యేలుఁడు, తోడన - యవతరించి । మిమ్ము వధియింతు [2]నేనిదె-నమ్మిచనుఁడు.

క. నను నిందించిన దోషం । బును జెందదు మిమ్ము, జన్మ - ములు మూఁడును గై
కొని మత్సాయక హతులై, । కనియెద రటమీఁదఁ బూర్వ-గతి [1]మత్పదమున్. 180

క. గర్వితత దితిసుత భావ మ । నర్వంబని యంటిరేని, - యమలిన ధరణీ
బర్హిర్ముఖ వంశజులై, । గార్హస్థ్యముఁ దాల్చి యజ్ఞ-కర్మ[1]స్థిరులై, 181

క. వేదాంత శాస్త్రపారగు । లై, దాన తపో నిరూఢు - లై, రక్షిత మ
ర్యాదులయి, యేడు [1]జన్మము । లాదరమునఁ గడపి కాంచుఁ - డస్మత్పదమున్. 182

వ. అనిన, జయ విజయులు, లోక విష్ణుండును బరమయోగి[1]మనః కమల [2]వర్తిష్ణుండును గరుణామృత వర్ధిష్ణుండు నగు విష్ణునకుం బునః ప్రణతులై, యిట్లనిరి 183

క. ఫణి శయన! మిమ్ముఁ బాసిన । క్షణ మొక్కటి మాకు బ్రహ్మ - కల్పంబగు, బ్రా
హ్మణుల మయి సప్త భవములు । గణ నాతీతాబ్ద తతులు - గడవఁగఁ గలమే? 184

క. [1]జననత్రయమున రాక్షస । తనువులు గైకొని జనించి, - తావక వైరం
బను నావచేత, నాప । ద్వననిధి వేగంబ దాఁటు - పారము కఱకన్. 185

(177) 1 శాపోక్తుల - మా (179) 1 రాఁగల పనులేలరాకమాను - త 2 నేనిది - మ, త, తి, తీ, హ, ర, క (180) 1 మత్పురమున్ - మ, మా, త (181) 1 స్థితులై - త (182) 1 భవముల నాదర - త (183) 1 మర్మ - తి, తీ 2 వర్ధిష్ణు - అన్ని ప్ర. (184) 1 అనుభవమునని - ము, తి, తీ, హ, ర, క; మనశత్రులమై - మా; ఘనవైరంబున - త

ఉ. తామసజన్మభూమి యగు - దానవవంశమునం జనించి యే
మేమియు బుద్ధిలేక, జగ - దీశ్వర ! నీకొనరించునట్టి నిం
దాముఖ దుష్కృతంబులు మ - నంబునఁ బెట్టక కావుమీ సుర
గ్రామణి ! యంచుఁ బల్కి, దితి - గర్భముఁ దూఱఁగ నేఁగి రిద్దఱున్. 186

187
వ. అని పలికి,

అశ్వాసాంత పద్య గద్యములు

చ. * పరమ కృపావతార ! కుల-[1]పాలన! సద్ద్విజలోక మానితా!
శరధి గభీర! [2]సాతబల-జాల! గుణ[3]ధ్రువ భోగ వాసవా!
సరస కళా విచార! వర-సారసమిత్ర రమా కృపాణ! ని
ర్భర నగరాజ ధీర! నవ-భావజ! నిత్య విరాగ కామితా ! 188

క. దిఙ్మానినీ కచాగ్ర । స్రఙ్మంజుల కీర్తిధన్య! - సకలక్షోణీ
భుఙ్మాన్య! సుజన సమ్మత । వాఙ్మాధుర్యాభిరామ! - వైభవ రామా ! 189

మాలిని. విమలగుణ విశాలా ! - విస్ఫుర త్కీర్తిలోలా !
సమయ విహితదానా ! - సర్వ విద్యానిధానా !
కమల రుచిర నేత్రా ! - గంగమాంబా సుపుత్రా ! 190
హిమగిరి సమధైర్యా ! - యెఱ్ఱనామాత్యవర్యా !

గద్యము

ఇది శ్రీ హనుమత్కరుణా వరప్రసాదాసాదిత సారస్వత నిరాతంక, చంద్ర నామాంక రామ విద్వన్మణి తనూజాత, అష్ట ఘంటావధాన పరమేశ్వర బిరుద విఖ్యాత, హరిభట్ట ప్రణీతంబైన వరాహపురాణంబునఁ, గైవల్యఖండంబను పూర్వ భాగంబునందుఁ బ్రథమాశ్వాసము.

---

(188) * నాగబంధము. 1 పావన - అన్ని ప్ర. 2 సార - త, తా 3 ధ్రువ - మా, త; వ్రత - తా

# ద్వితీయాశ్వాసము

క. శ్రీ రమణీ నిశ్చలతా । కారణ! సుగుణాభిరామ! - కల్పమహీజో
దార! హరి నిహిత మానస । సారస! కొలిపాక యెఱ్ఱ - సచివవరేణ్యా! 1

వ. అవధరింపుము. రోమశ మహాముని మార్కండేయున కిట్లనియె. అట్లు జయ విజయులు భూలోకంబున సంభవింప నరుగుటయు, ననంతరంబ యంబుజాక్షుండు దేవ ముని గంధర్వాదుల నవలోకించి, 2

### మురారి ముని బృందారక బృందము నూరడించుట

తే. ఏమి కార్యంబు మీర లూ - హించి కలఁగి । యిటకు వచ్చితి, రక్కార్య - మెల్ల ఫలిత
మయ్యె, నిర్భీతులై నిజా-[1]యతనములకు । నుత్సుకత నేఁగి వసియింపుఁ-డొకటివినుఁడు!

ఉ. కోపము పాప కారణము - గూడిన తద్దురితంబు దుర్గతి
ప్రాపక, మట్లుగావునను - బద్మజు నంతటి వానికైన రో
షాపనయం బొనర్పక ర - యంబునఁ గార్యము దీరునే? మన
స్తాపము నొందనేల? భవి - తవ్యము లయ్యెడు దైవికంబునన్. 4

క. రాక్షసకుల మణఁచి, భవ । ద్రక్షణ మొనరింతు నని, సు - ర ప్రవరులఁ బ
ద్మాక్షుం[1]డూరార్చి, తగన్ । వీక్షా గోచరుఁడుగాక - వేగం బరిగెన్. 5

వ. అంత, 6

### హిరణ్యాక్ష జననము

క. జయ విజయులు దితి గర్భా । శ్రయముఁ బ్రవేశించి, రందు - జయుఁ డరిభయదు
ర్జయుఁడు, హిరణ్యాక్ష సమా । హ్వయుఁడై యుదయించెఁ ద్రిభువ-[1]నార్పిత[2]భయుఁడై. 7

శా. ఈరీతిం బ్రభవించి రాక్షసకులా - ధీశుండు బాలత్వ కౌ
మారంబుల్ [1]తరియించి, యౌవన మదో - న్మాదంబునన్ శత్రు సం
హారోదార విభూతి నొంది, సురక - న్యాశ్రేణి సేవింప, జం
భారాతి ప్రతిమానుఁడై వసుమతీ-[2] భాగంబుఁ బాలింపుచున్, 8

---

(3) 1 లయములకును (యతి?) - తి, తీ, హ, ర, క (5) 1 డూరార్చియుదగు - తి, తీ, ర
(7) 1 నార్తిత - ర 2 భరుఁడై - క (8) 1 ధరియించి - అన్ని ప్ర. 2 చక్రంబు (యతి?) - తీ

### పంచజనావత పట్టణ వర్ణనము

క. పంచజనావత నామో। దంచిత మగు పట్టణంబు, - దైత్యుఁడు సంప
ద్వంచిత సురపురముఁగ ని। ర్మించెం, దద్వైభవం బ - మేయము పొగడన్. 9

సీ. పరిఖా సమాకీర్ణ - బంధుర మణిమయ। ప్రాకార వలయ వి - భాసితంబు,
విమల కాంచనకుంభ - రమణీయ గోపుర। ద్వార తోరణజాల - వర్ణితంబు,
నసమయ ప్రసవ నే - త్రానంద శృంగార। వనజాత మారుత - వాసితంబు,
రాజమార్గాబద్ధ - రమణీయ కుట్టిమ। పద్మరాగ ప్రభా - భాసితంబు,

తే. భద్రగజ వాజి రథ భట - భామినీ స। [1]మాజ దనుజకుమార వి - భ్రాజితంబు,
సురగణాపేక్షణీయ వ - స్తు ప్రమోద। కరము, పంచ జనావతా - ఖ్యాన పురము. 10

చ. నిరుపమ పద్మరాగమణి - నిర్మిత తత్పుర హర్మ్యకోటి సు
స్థిర వరహేమ కుంభములు - తీవ్రతఁదాఁకి పరిభ్రమించి తే
రురవడి [1]దోరగల్పడిన - నొప్పదటంచునొ ? దక్షిణోత్తర
స్ఫుర దయనాపదేశమునఁ - బోవు దివాకరుఁ డబ్ధిఁ గ్రుంకఁగన్. 11

చ. అతులిత తత్పురీ విమల - హాటకవప్ర బహిస్తటాంతిక
స్థిత బహు తారకంబులు, త - దీయ మహా పరిఖా జలంబులన్
బ్రతిఫలితంబులై, యురగ - పాలక మౌళిసహస్ర భాగ కీ
లిత మహనీయ రత్నపట - లిం దలపించుఁ బ్రతిత్రియామమున్. 12

చ. విలసిత చంద్రకాంతమణి - [1]విశ్రుత తత్పుర గోపురంబులం
బొలసిన పూర్ణిమేందు కర - పుంజమునన్ జనియించినట్టి ని
ర్మల జలపూరముల్, కడఁగి - మంజుల హేమమయ ప్రణాళికా
గళితములై, ప్రపూరములు - గా నొనరించు సరోవరంబులన్. 13

ఉ. రాజిత రత్న సౌధగత - రాజముఖీ ముఖ లోచనాబ్జ వ
క్షోజ [1]కచాదులందుఁ గల - సొంపుఁ గనుంగొను వేడ్క మానసాం
భోజమునన్ జనింప, సుర - ముఖ్యులు హేమ విచిత్ర పుత్రికా
వ్యాజమున న్వసింతు రని - వారణఁ, దత్పుటభేదనంబునన్. 14

---

(10) 1 మాజరాజ - త; మాదనుజరాజ - మ, తి, తీ, హ, ర, క (11) వారగల్పడిన - మా; దారకల్ - మ, హ, ర, క; తాదగుల్పడిన - తా (13) 1 విస్తృత-మా, త, తా (14) 1 కచాది కొను-మ, తా, తి, హ, ర; కచాదికాంతి - త; కరాబ్జకొను - క; కచావికాసము ల - తీ

శా. భావ జ్ఞాన వచో విశేష విజిత - బ్రహ్మల్, ప్రతాపావలే
పావిర్భావ నిరస్త భాస్కరులు, వి - త్తాదాన దానక్రియా
ప్రావీణ్యాపర కిన్నరేశ్వరులు, శౌ - ర్యశ్రీ కిరీటుల్, మహీ
దేవ క్షత్రియ వైశ్య శూద్రులు పుర - స్థేము ల్విచారింపఁగన్. 15

చ తరణిశీత ప్రతాపుఁడగు - దానవభర్తకు రాజధాని, యిం
దిరకు విహారమందిరము, - నిర్జరకోటికి సంతత స్పృహా
కర విభవాకరంబు నన - గాఁ, బురి బల్మియుఁ గల్మియు న్మనో
హరతయు వేఱువేఱ కొని - యాడఁగనేటికి మాటిమాటికిన్? 16

సీ. తరుణీ రతిశ్రమా - హరణ మాత్రమె కాని । [1]విచ్చలవిడి గాడ్పు - విసరవెఱచుఁ,
[2]గమల వికాసమా - త్రమె కాని భానుండు । దీపించి వేఁడిమిఁ - జూప వెఱచుఁ,
దరు సస్య పోష్యమా-త్రమె కాని జలదంబు । ఘోషించి యతివృష్టి-గురియ వెఱచుఁ,
[3]బచనాది సత్క్రియా - రచన మాత్రమె కాని । శిఖి తీక్ష్ణకీలలఁ-జెలఁగ వెఱచుఁ,
తే. జండ భుజదండ మండిత - మండలాగ్ర । ఖండి తాఖండలీయకా[4]- ఖండ సైన్య
మండలుండగు దనుజేంద్రు - మహిత శౌర్య । బుద్ధి పాలితమైన త-త్పురవరమున. 17

## హిరణ్యాక్షుని భీకర తపశ్చర్య

వ. ఇవ్విధంబున సకల లోక నయనానంద కరంబైన పంచజనావత నగరంబున కధీశ్వరుండగు హిరణ్యాక్షుం డొక్కనాఁడు, జగంబు నేకచ్ఛత్రంబుగాఁ బాలింపందలంచి, నిజ రాజ్య భారం బమాత్యాధీనంబు చేసి, జటా వల్కలంబులు ధరియించి, మునివేషంబునం జనిచని ముందట, 18

ఉ స్వర్వనితా విహార విల - స ద్వనఝూటము, శేముషీ [1]తపః
కుర్వదనేక మౌనియుత - కూటము, శాఖి శిఖా నిరుద్ధ స
ప్తార్వ రథోరు ఘోటము, స - నంత వనాటము, శోభమాన సౌ
పర్వణ పర్వత [2]ప్రవర - [2]భర్మ కిరీటము, హేమకూటమున్, 19

క. కనఁగొని, తచ్ఛిఖరంబునఁ । గనకాక్ష నిశాటకుల శిఖామణి, యేకాం
త నిశాంత మధ్యమంబున । ననుమోద విరాజి తాన - నాంభోరుహుఁడై, 20

(17) 1 విచ్చనవిడి - హ,ర,క 2 హ,ర. - ప్ర.లో 2, 4 పాదములు లుప్తము; అనుకూలుఁడై కాని యాదిత్యుఁడు రుదీప్తి కిరణముల్ పలుమారు నెఱపవెఱచు - మ, తి, తీ; జనశీత భయనివారణము మాత్రమె గాని మిహిరారి స్వేచ్ఛ చేమించవెఱచు - క 3 మందమైని యనలుండు మహానణం గుటె కాని దంట మోములరణ్య మంట వెఱచు - మ, తా, తి, తీ 4 నాఖండ - మ (19) 1 తమః - తి, తీ, ర 2 ప్రకర - తా; ధర్మ (యతి?) - మ, తా

సీ. జ్వాలా కరాళ పా - వక చతుష్టయ మధ్య । ధరణిపై[1]నేక పా - దమున నిలిచి,
నతతోర్ధ్వభాగ ప్ర - సారిత బాహుఁడై । సూర్యబింబము మీఁదఁ - జూడ్కిఁ జేర్చి,
యాత్మ సంయోజిత - ప్రాణుఁడై పవమాన । భోజియై శాంతి ప్ర-పూర్ణుఁ డగుచుఁ,
బార్వతీయుత వామ - భాగు సర్వేశ్వరుఁ । గరుణామృతాంశు శే - ఖరుగుణించి,

తే. వర్ష శీతాతపాది తీ - వ్రతకు నోర్చి, । నిర్జితేంద్రియుఁడై, [2]మౌన - నియతిఁ దాల్చి,
త్రిజగ దాశ్చర్య భయద చ-రిత్ర మొదవ, । [3]నుద్ధణాకృతి నొనరించె-నుగ్రతపము. 21

వ. తత్సమయంబున, 22

### ఫాలాక్షుని సాక్షాత్కారము

సీ. ఘన జటాజూట శే - ఖరిత చంద్రద్యుతి । సీమంత మౌక్తిక - శ్రీల [1]బెరయ,
గ్రైవేయ ఫణి ఫణా - రత్న నూత్న ప్రభ । తారహార జ్యోత్స్నఁ - [2]ద్రస్తరింపఁ,
గటిమండ లాబద్ధ - కరటిచర్మ చ్ఛాయ । చీనాంశుకచ్ఛవిఁ - జిక్కుపఱప,
రమణీయ భసితాంగ - రాగ నైర్మల్యంబు । కుచ చందనస్ఫూర్తిఁ - గూడి నిగుడ,

తే. వనిత సామేనఁ గలిగిన - వన్నెకాఁడు, । భావసంభవు గెల్చిన - పరమయోగి,
పూని యొరులకుఁ బొడగాన-రాని వేల్పు, । దానవాధీశ్వరునకుఁ బ్ర-త్యక్షమయ్యె 23

### హిరణ్యాక్ష వరప్రదానము

వ. ఇట్లు సాక్షాత్కరించిన ఫాలాక్షునకు హిరణ్యాక్షుం డక్షయ ప్రణామంబు లాచరించి, నిటలతట ఘటిత కరకమల పుటుండై, యుదంచిత వాక్ప్రపంచంబున వినుతించి, యప్పరమేశ్వరునివలన దేవ మానవ భోగి మనోనిక్షిప్త భయంబగు త్రైలోక్య జయంబును, బరిపంథిజాల హృదయాభీలంబగు శూలంబును, [1]దళితాఖిల దివ్యశస్త్రంబగు పాశుపతాస్త్రంబును, దిరస్కృత మేరుమహత్త్వంబగు బాహుసత్త్వంబును వరంబులుగాఁ గొని, పునఃపునః ప్రణామము లాచరించి, సకల సంపన్మందిరంబగు నిజపురంబున కరిగి, భృత్యామాత్య సాంగత్య నిత్యానంద కందళిత మానసారవిందుండై, ప్రాజ్య సామ్రాజ్య విభవంబు లనుభవించుచు, నొక్కనాఁ డాత్మభవన దక్షిణద్వార ప్రాంగణ సభా మధ్యమంబున, 24

మ. ధరణీశుల్ సచివుల్ పురోహితులు గం - ధర్వుల్ దిగీశాది ని
ర్జరులుం గిన్నరు లప్సరో నికరముౖన్, - జ్వాలాముఖాది క్షపా
చర సైన్యంబును గొల్వ, దివ్యమణి భా - స్వ ద్భర్మసింహాసన
స్థిరుఁడై, భూషణదీప్తి భానురుచి నా - క్షేపింపఁ గొల్వుండఁగన్, 25

(21) 1 యందేక-మ,తి,తీ,హ,ర,క; 2 మౌని-త,తి,తీ 3 నుద్ధురాకృతి-తీ (23) 1 (బెనయ-హ 2 బ్రస్తరింప (యతి?) - మా (24) 1 ధవళితాఖిల - తా, మ, మా, తి, తీ, హ, ర, క

ఉ. విక్రమశాలి, నయ్యసుర - వీరుఁ గనుంగొనువేడ్క, నీతి ని
ర్వక్రుఁడు, బుద్ధివైభవ ని - రాకృత శక్రుఁడు, తత్త్వబోధ తీ
క్ష్ణ క్రకచాగ్ర నిర్దళిత - సంసృతిచక్రుఁడు, కాంతి ధౌత ది
క్చక్రుఁడు, రక్షిత స్వజన - చక్రుఁడు, శుక్రుఁడు వచ్చె నత్తఱిన్. 26

ఉ. అమ్మునిరాకఁ గాంచి దను - జాగ్రణి, చయ్యన లేచి, యర్ఘ్య పా
ద్యమ్ములు వందనాది విహి - తాచరణంబులు చేసి, రత్న పీ
ఠమ్మున నుంచి, యంజలి పు - టంబు లలాటమునన్ ఘటించి, వా
క్యమ్ముల పద్ధతి న్వినయ - గౌరవముల్ [1]గొనసాగ నిట్లనున్. 27

క. గంగా స్రోతస్విని వికళాంగునిపై నరుగుదెంచి - నట్లు, దయా సం
సంగమతి నీవు వచ్చుట। నంగికృత పుణ్యమూర్తి - నైతి మహాత్మా! 28

శా. నీ సామర్థ్యముచేతఁ గాదె రిపుల - న్నిర్జించి తత్కాంతలన్
దాసీవర్గముగాఁగ నేలుట, భుజా - [1]దండోద్ధతిన్ దిగ్వరా
వానశ్రేణులు కొల్లలాడుట, జగ - [2]ద్వర్ణ్యంబుగా రాజ్యల
క్ష్మీ సంపన్నుఁడనై చెలంగుటయుఁ జ - ర్చింపన్ మునీంద్రోత్తమా! 29

ఆ. నీవు [1]గలుగ మాకు - నిఖిల దానవరాజ్య। వైభవంబు చెడక - వన్నెమిగిలి
శత్రురహిత మగుచు - శాశ్వతంబై యున్న। ది జగంబులోనఁ - దేజరిలుచు. 30

వ. అనవుడు భార్గవుం డిట్లనియె. 31

ఉ తొల్లి నిశాచరేశ్వరులు - ధూర్జటితుల్య పరాక్రమోన్నతుల్,
బల్లిదులైన దేవతలఁ - బాఱ నదల్చి, సమస్త మేదినీ
వల్లభులైరి, కాని, [1]జన -వర్ణిత చారు భవత్సమాన సం
పల్లలిత ప్రభావ గుణ - పారగులేరీ పరికించి చూడఁగన్. 32

సీ శోధించితివి శాస్త్ర - సూక్ష్మంబులైనట్టి। నీతిమార్గంబులు - నేర్పుతోడ,
సాధించితివి [1]జగ - త్సన్నుతం బగు చండ। భుజదండ బలమున - భువనతతుల,
బాధించితివి ప్రతా - పంబున సురకోటిఁ। గారాగృహంబునఁ - గడిమి నునిచి,
రోధించితివి యప్స - రో నికాయము నెల్ల। భవదీయ శుద్ధాంత - భవనభూమి,
తే. సంహరించితి వనుపమ - చక్రవాళ। శైల పర్యంత మేదినీ - శ్వర కఠోర
బాహువిక్రమ గర్వ వి-స్ఫార మహిమఁ, । గలరె నినుఁబోల నౌరులు న-క్తంచరేంద్ర! 33

(27) 1 గొనియాడ-మ,తి,తీ (29) 1 దండాహతిన్ - మ,తా,తి, తీ, హ, ర, క 2 ద్గణ్యంబు (యతి?) - మ,తి,తీ,హ,ర,క;ద్వంద్వంబు-తా (30) 1 నేఁడు - తి,తీ,హ;గాక - తా;మాకునెల్ల - క (32) 1 వర-త;చిర-తా (33) 1 వీరసమ్మతం-త,మా;సురసన్నుతం-తా

శా. సర్వైశ్వర్యకళా నిధాన నిజ రా - జ్యస్థుండవై, యస్మదా
శీర్వాదంబునఁ బుత్ర [1]మిత్ర వనితా - శ్రీశాలివై, దేవ గం
ధర్వాజేయ పరాక్రమస్థిరుఁడవై, - ధారాళ దానక్రియా
[2]వార్వాహ ప్రతిమాన మూర్తి వగుచు - న్వర్ధిల్లు దైత్యోత్తమా! 34

వ. అని భార్గవుం డనర్గ ళాశీర్వచనపూర్వకంబుగాఁ బలికినఁ, గలికినవ్వు లేమొలకలు కపోల[1]పాలికల నందంద కందలింప, నానంద చంద్రికా సందీప్త వదనేందు మండలుం డగుచు, నాఖండలవిరోధిమండలేశ్వరుం డమ్మునీశ్వరున కిట్లనియె. 35

జగదుత్పత్తి ప్రకార నిరూపణము

క. లోక త్రయంబులోన సు । ఖాకరమగు భువన మెద్ది? - యచ్చట దనుజా
నీకముతో విహరించెద, । నా కెఱుఁగఁగ నానతిమ్ము - నయగుణనిలయా! 36

సీ. ఆధార మెయ్యది - యఖిల లోకములకు? । వారిధి ద్వీప వి - స్తార మెంత?
తద్ద్వీపములకు నెం-దఱు రాజ ముఖ్యులు? । [1]మనకసాధ్య ప్రయో-జనము లెవ్వి?
కనకాచలాదులఁ - గల వస్తుతతి యెద్ది? । వనజాప్తుఁ డేమార్గ-మునఁ జరించు?
జంభారి నగరంబు - సాధించు వెరవేది? । యే వేల్పు నాథుండు - దేవతలకు?

తే. రాజితంబుగ నెవ్వని - చే జగంబు । విరచితంబయ్యె? నన్నియు - విస్తరించి
తేటపఱపుము నావుడు, - దితిజగురుఁడు । హర్షమందుచు నిట్లను-నసురపతికి. 37

క. భువిఁ బూర్వ దైత్యు లడుగని । వివిధ రహస్యములు దెలియ - వేఁడితివి ననున్
భవ [1]దుదిత ప్రశ్నములకు । వివరింతు నదుత్తరముల - విను మసురేంద్రా! 38

చ. పులహుఁడనంగ నొక్క ముని - పుంగవుఁ డాప్యుఁడు, వాలఖిల్యులం
దలఘుఁడతండు, మున్ను జల - జాప్తుని యొద్ద నధీత వేద మం
డలుఁడయి, యమ్మహాత్మువల - నన్ ద్రుహిణాండ జనిప్రకారముం
దెలియ నెఱింగి, యా ఘనుఁడు - దేవపురంబున కేఁగి నేర్పునన్, 39

క. ఆమూలచూడముగ సు । త్రామున [1]కు నుపన్యసించెఁ - దత్కథ మౌని
గ్రామణి, గీర్వాణ సభా । సామాజిక కర్ణపుట ర - సాయన ఫణితిన్. 40

(34) 1 పౌత్ర - మ, మా, త, తా, తి, తీ, ర, క 2 దుర్వార (యతి?)-మ,మా,తి,తీ,హా,ర,క
(35) 1 పులక తిలకితంబులై-తీ,ర,మ,మా,సుఖస్మితమగు నవకపోల-త (37) 1 మనుజసాధ్య-త
(38) 1 దీంత-హా (40) 1 కెఱిఁగించెనంత - తీ

చ. కరుణదలిర్ప నా దివిజ - కాంతుఁడు సర్వముఁ జెప్పె నాకు వి
స్ఫురిత వచోగతిన్, వరుణ - పుష్కర తీర మనోజ్ఞ కుట్టిమ
స్థిర మణిసౌధ మధ్యమ వి - చిత్ర హిరణ్మయ భద్ర పీఠికాం
తరమునఁ జిత్రకేతు ముఖ - ధన్యులు గొల్వ సుఖోపవిష్టుఁడై. 41

మ. అగభి జ్జల్పిత వాక్యపద్ధతి, జ్జగ - ద్వ్యాపారమున్, స్వర్గ ప
న్నగలోకాచల ముఖ్య విస్తరణముం, - దత్తత్ప్రదేశోదితం
బగు సత్పుణ్య కథా విశేష సముదా-యంబున్, వచో మాధురిన్
దగ నీకు న్వివరించెద న్వినుము, దై - త్య స్తోమ చూడామణీ! 42

క. శిఖి వాయు జల వియ ద్భూ। ముఖ భూత సమావృతంబు - ముని మర్త్య [1]మరు
త్సుఖ సంచరణార్హమునై। నిఖిల బ్రహ్మాండ ఘటము - నెఱి నుదయించెన్. 43

ఉ. అరయ నయ్యజాండమును, - హాటకశైలము దేవతాగిరిన్,
మారుతభుగ్విభుండు ఫణి - మండల నాథుఁడు, దిక్కరుల్ హరి
ద్వారణ సంఘముం, గమఠ - వర్యుఁడుఁ గచ్ఛప సార్వభౌముఁ, డా
ధార విశిష్ట శక్తియును - దాల్చుచునుండుఁ గ్రమ క్రమంబునన్. 44

### పాతాళలోక సౌభాగ్యము

వ. అయ్యాధారశక్తియు విలయ సమయంబుల బ్రహ్మాండ మధ్యగతంబులగు స్వర్గమర్త్య
పాతాళంబుల హరించు. [1]అ లోకంబులలోనం బాతాళ సౌభాగ్యం బెట్టిదనిన, 45

సీ. సార్వకాలిక శుద్ధ - జల పూరితములైన। హేలాది పుణ్య వా - హినులు గలిగి,
కిసలయ కోరక - ప్రసవ ఫలోద్దామ। తరు శోభితోద్యాన - తతులు గలిగి,
ప్రకట సంజీవనా - ద్యకలంక దివ్యౌష। ధములఁ జూపట్టు శై - లములు గలిగి,
ప్రాకార గోపుర - ప్రాసాద మణి దీప్తి। విమల శాఖాపట్ట - ణములు గలిగి,
తే. రూప లావణ్య గుణముల-రూఢికెక్కు। నవ వయఃపూర్ణ నాగక-న్యకలు గలిగి,
కల్పభూరుహ [1]నవరత్న-కామధేను। పుంజములు గల్గి పాతాళ-భువన మమరు. 46

చ. ఎఱుఁగరు కామినీ పురుషు-లెందు వియోగము, దుఃఖలేశముం
బొరయరు, ప్రాణికోటి సుఖ-పూర్ణత నొంది, భయంబు లేక య
ధ్వరము లొనర్తు రార్యు, లహి-వర్య విషాగ్నికి నోడి శాత్రవుల్
చొరరు, హిమోష్ణ బాధలును-సోఁకవు తద్భువనాధివాసులన్. 47

(43) 1 సముత్సుక (ప్రాస?)-తి,తీ (45) 1 నాగలోక-తి,తీ,ర;నాక-హ (46) 1 సురరత్న-త,క

క. శక్రారివర్య! విను, కా। మ క్రోధ విమోహ లోభ-మద మాత్సర్యా
ఖ్యాక్రూరాంతర రిపు ష। ట్చక్రము నచ్చోట గగన-[1]జలజము దలఁపన్. 48

చ. కల కలకంఠ నాదముల-గర్వము సర్వము [1]జట్టిగొన్న [2]మం
గళ గళ సుస్వరంబు గల-కాంతలు చెంతలఁ జేరి కొల్వఁగాఁ
గొలకొలమంచు దేవతలు-కోరిక లీరికలొత్త [3]నా గమిం
గిలకిల నవ్వి కేళిఁ [4]దుల-కింతురు కాంతురు సౌఖ్య [5]మచ్చటన్. 49

వ. ఇట్లనన్య సామాన్యరామణీయక ధురంధరంబై పుర సరి ద్గిరి వన రాజి విరాజితంబైన ఫణి భువనంబు, ద్వాదశకోటి యోజనాయతంబును, త్రయోదశ శతాధిక పంచాశత్కోటి యోజన విస్తృతంబునునై యొప్పుచుండు. మఱియు జగత్త్రయంబునకు మధ్యమలోకంబైన మహీ మండలం బెట్టిదనిన, 50

చ. పుర శరధి ప్రసిద్ధ వన - పుణ్య సరి ద్గిరి యుక్తయై, మనో
హరతరయై, సమస్త విభ - వాకరయై చెలువొందు నివ్వసుం
ధర, నురగాధినాయకుఁడు - దాల్చు వినిర్మల రత్నమండలాం
తర తరళ ప్రభా వలన - ధన్య సహస్ర ఫణాగ్ర సీమలన్. 51

కాంచనాద్రి కమనీయత

క. రాత్రించరేంద్ర! యిట్టి ధ। రిత్రీ మధ్యమునఁ గిన్న - రీ గాన కళా
పాత్రమన నొప్పుఁ గాంచన। గోత్రము, మణి సానుకాంతి - గుణ చిత్రంబై. 52

ఆ. అ సువర్ణశైల - మాధారముగ దివ్య। రత్న శోభమాన - రథము నెక్కి
దివిజవరులు పొగడఁ - దేజ స్సమగ్రుఁడై। సంచరింపుచుండు - జలజహితుఁడు. 53

సీ. రాజహంసావళీ - రమణీయ మానసా। ద్యమిత పుణ్య సరోవ - రములు గలిగి,
సంతత ఫల పుష్ప - సంప త్సమాకీర్ణ। చైత్రాది వన సమా - జములు గలిగి,
యమృతాశనాంగనా - సముదయ క్రీడా మ। నోహర రత్న సా - నువులు గలిగి,
యభ్రంకష ప్రభా - విభ్రమోదంచిత - కాంచన శృంగ సం - ఘములు గలిగి,
తే. పూర్వ పశ్చిమ సాగరం - బులు గమించి। జంభశాసనముఖ దేవ - సదన మగుచు
*సోమసూర్యులు [1]చనుపందఁ - జోద్యమంది। రాజితంబయ్యె మేరు ధ-రాధరంబు. 54

(48) 1 జలదము-త (49) 1 జట్టు-త,తి,క 2 మంగళతర-మ,తా,తి,తీ,హ,ర 3 నాగముం-త,మా; నాగమం - తి,తీ,హ,ర;గానమం - మ 4 మళికింతురు - మ,తి,తీ,హ,ర 5 మంతటన్ - తి,తీ (54) * ఈ పాదము-మా,త,తా,హ,ర,క ప్ర.లో లుప్తము 1 పెనుపంద-తి,తీ.

క. సంచిత తపఃప్రభావో । దంచితులై దనుజవరులు - ధరణీస్థలి జ
న్మించిన వేళ, భయంబునఁ । గాంచనశైలంబు బలసి - కదలరు దివిజుల్. 55

జంబూద్వీప వైభవము

శా. ఆ ధర్మాద్రికి దక్షిణంబున, సహ - స్రాఖండ శాఖావళీ
సౌభాగ్యంబును, యోజన ద్విశతకో - చ్ఛ్రాయంబునుం గల్గి, [1]యా
శా భద్రేభ [2]తను ప్రమాణ ఫలపుం - జ వ్యాప్తమై యొప్పు జం
బూ భూజాతము, తన్మహాఫల రసో - ద్భూత ప్రభావం బిలన్, 56

క. జంబూనది యన వరుణ ది । గంబుధికిం బర్వెఁ, దన్మహా వాహినిలో
నం బరఁగు [1]నినుము పసిఁడై । జాంబూనద నామమునఁ బ్ర - శస్తి వహించెన్. 57

క. తద్విటపి యోగమున జం । బూద్వీపం బనఁగ భువన - పూజ్యంబై యే
తద్ద్వీప మమరె, భూధర । విద్వేషిప్రార్థనీయ - విభవం బగుచున్. 58

వ. అట్టి జంబూద్వీపంబునఁ గనకశైలంబును, మాల్యవత్క్ష్మాధరంబును, నిషధ భూధరంబును, వింధ్య వసుంధరాధరంబును, హిమవత్పర్వతంబును, పారియాత్రాచలంబును, గంధమాదన నగంబు ననం బరఁగు సప్తకులపర్వతంబులును, చిత్రశైల కేతుమాల సంవర్తకాది కేసర నగంబులును, మలయ దర్దుర శ్వేతశైల త్రికూటాది ప్రత్యంతభూధరంబులును దేవతాధిష్ఠితావకాశంబులై, యతిశీతలద్రోణి ప్రదేశంబులై, సకల పుష్ప ఫల సమంచితంబులై, కిన్నర కింపురుష గంధర్వాది దివ్యగణ నివాసయోగ్య వనవ్రాతంబులై విలసిల్లు. మఱియును బవిత్రోదక తరంగ పటలీ నటీ నటన రంగాయమాన గంగా యమునా నర్మదా చర్మణ్వతీ సరస్వతీ శోణా చంద్రభాగా సరయూ ప్రముఖ నిఖిల పుణ్యనదీ కదంబంబును, మగధ మత్స్య కళింగ శూరసేన కేరళ చోళ పాండ్య క్రథకైశికాది సకల దేశ నికురుంబంబును, నారాయణ బదరీ శంఖ కదళీ నిషధాది విశిష్టాశ్రమ సముదాయంబునుం గలిగియుండు. వెండియు, శ్వేతద్వీపంబు లవణేక్షు మధు క్షీర దధి ఘృత సలిల పూరిత సప్తసాగర పరీతంబును, కుశ క్రౌంచ శాక శాల్మలీ ప్లక్ష పుష్కర ద్వీప సమేతంబులును, చతుర్వర్గ మూల కందంబును, సకల జగదానందంబునునై యొప్పు. అందు, 59

ఉ. ఏలిరి మున్ను దేశము ల - నేకవిధార్జిత పుణ్యులై, మహీ
పాలవరేణ్యు లత్యధిక - బాహుపరాక్రమ నిర్జితారులై,
ఫాల మృణాళ హార హిమ - పారద నారద హీర శారదా
వ్యాళవ రాలఘుద్యుతి స - మంచిత కీర్తివధూ విహారులై. 60

(56) 1 యున్నాభద్రేభ-త 2 తమఃప్రమాణ-మ, మా, తి, తి, ర, క (57) 1 నినుము-మా, ర

క. ఆ నరనాయకు లెల్లను । దానవ కర తీవ్రఖడ్గ - దళితాంగకులై
ప్రాణములు విడిచి యమర । స్థానమునకు సంతసమునఁ-జనిరి మహాత్మా! 61

క. నీ నామము విని [1]యచ్చటి । భూనాయకు లెల్ల వణఁకి - భూధర విపిన
స్థానంబులఁ జరియింతురు । దానోజ్జ్వలగుణసనాథ! - దానవనాథా! 62

శా. శాకద్వీప ముఖాంతరీపములు, రా - జద్వైభవశ్రీల న
స్తోకఖ్యాతి వహించి దేవ సుజన - స్తోమాభిరామంబులై,
యేకాలంబును జూడనొప్పు బుపబా - ధీశాత్మజవ్రాత [1]బా
హా కౌక్షేయకశక్తి లాలితములై, - యక్షీణభావంబులన్. 63

తే. అట్టి దీవులకడ నుండు - నయుత యోజ । [1]నాయతంబగు బంగారు - చాయ భూమి
యా ధరిత్రికిఁ దుదవంక-నమరుఁ జక్ర । వాళ శైలంబు సకలది-గ్వ్యాప్త మగుచు. 64

క. అని భార్గవుండు పలికిన । యనుపమ వాక్యముల కలరి, - యమ్మునితోడన్
దనుజేంద్రుఁ డనియె వెండియు, । ఘనసమయ పయోద నినద - గంభీరోక్తిన్. 65

## మహాప్రళయ వివరణము

ఉ. ఏ గతి నాశమొందు జగ - [1]మింతయుఁ? గ్రమ్మఱ సంభవించు నే
లాగునఁ? దద్విధుండును ద - లంపఁగ నెవ్వఁడు? సర్వమున్ దయా
సాగర! యానతిమ్మనిన, - సంయమివర్యుఁడు, దానవాన్వయ
శ్రీ గురుమూర్తి, యా దనుజ - సింహున కిట్లను నాదరంబునన్. 66

క. సురరిపువర! విను, షష్ట్యు । త్తర శతసాధన సమంచి - తాఖిల సృష్ట్యా
వరణముల నెద్ది దృగ్గో । చరమగు నది నశ్వరంబు - చర్చింపంగన్. 67

క. కాలము సర్వ చరాచర । జాలమునకు నాశకమును - జనకంబును, ద
త్కాలంబును వంచింపఁగఁ । జాలఁడు కాలాత్ముఁడైన - జలజోదరుఁడున్. 68

తే. అపరపక్షము వచ్చిన - నమృతకరుఁడు । కాలపర్యయమునఁ గళా - క్షయము నందు
నట్లు, సమయంబు డగ్గఱ-నఖిల జగము । నణఁగు, నది మాన్ప నేరికి-నలవి గాదు. 69

వ. అట్టి జగన్నాశ ప్రకారం బెట్టిదనిన, 70

(62) 1 యిప్పుడు-క (63) 1 బాహాక్షాయక (ప్రాస?)-మ,త,తా; బాహాక్షాసాయక-తి,హ,ర,క; బాహాకృత్యాయక-తీ (64) 1 నాయుత-మా,హ,ర;నాయిత-మ (66) 1 మెల్లను-త

సీ. శత వత్సరములు వ - ర్షము లేక ధరమీఁది । సస్య భూరుహ లతా - జాల మెల్ల
ఫలశూన్యమై పోవఁ - బ్రజలు దుర్భిక్షంబు - చేత బెగ్గిలి యతి - క్షీణు లగుచు
నిజ కులోచిత ధర్మ - భజనంబు వర్జించి । చౌర్య సాహస ముఖా - కార్య నిరతు
లగుచు జీవితముల - కై పుత్ర భార్యాల । లను విక్రయింపుచు - వనములందు
తే. గిరులయందును దృష్టి గో - చరములైన । శాక [1] మూలాది భక్ష్యముల్ - చవులుచూచి
క్షుత్పిపాసాతిశయ జాత - శోకవహ్ని - చె నశింతురు కాలాన - నానమునను. 71

క. పక్షి పశు కీటతతి యధి । క క్షుత్తృష్ణానలమునఁ - గడతేరఁ [1]చనన్
బ్రక్షీణమగుచు విశ్వము । వీక్షింపఁగ సర్వ శూన్య - వృత్తి వహించున్. 72

ఉ. అంతటఁ జండభానుఁడు స - హస్రకరంబులు సాచి, భూతలా
భ్యంతర వారిపూరముల - నన్నిటిఁ గ్రోలి, యశేష వల్లికా
క్రాంత మహీజ గుల్మ తృణ - [1]రాజి రసంబుల నెల్లఁ బీల్చి, దు
ర్దాంత నిజ ప్రతాపమున - రాయిడిపెట్టు నజాండ భాండమున్. 73

మ. ఘనశౌర్యోన్నత! యంతలో నురగలో - కంబందు సంకర్షణా
నన జాతంబగు పావకం బనిలబృం - ద ప్రేరితంబై ఘన
స్వన సంపన్నతఁ బ్రజ్వలింపుచును బం - చాశ చ్ఛతాబ్దంబు లు
గ్ర నిరూఢిం గబళించి యాహుతిగొనున్ - బ్రహ్మాండ నారాంశమున్. 74

క. నీరేరుహ గర్భాండం । బారయ దందహ్యమాన - మై యప్పగిదిన్
సారముచెడి దగ్ధ పటా । కారంబునఁ గానఁబడు జ - గన్నుతచరితా! 75

మ. శతపంచాబ్దము లయ్యెడ న్విసరు ఝం - ఝా మారుతం బుగ్ర గ
ర్జితము ల్మీఱఁగ మేఘబృందమును వ - ర్షించున్ దిశాసామజా
యత శుండా సమ వారిధారల [1]జగం - బావారిలోఁ గజ్జల
ప్రతిమంబై యణఁగు [2]న్విధేందు రవి తా - రా ముఖ్య పూర్వంబుగన్. 76

వ. ఇట్లు జగం బేకార్ణవంబైన, వసుంధర గంధ రహితయై జలంబునం గలయు. తత్సలిలంబును గత రసంబై తేజో లీనంబగు. తత్తేజంబును రూప శూన్యంబై వాయుగతంబగు. తద్వాతూలంబును స్పర్శవర్జితంబై యాకాశంబున నణంగు. తద్గగనంబును విగళిత శబ్దంబై భూతాదిం బ్రవేశించు. తద్భూతాది మహద్రూప స్థగితంబగు. తన్మహద్రూపం బహంకార గ్రస్తంబగు. తదహంకారంబు సత్త్వాదిగుణ మిళితంబై కాల గళితంబగు. ఆ కాలం బపరి

(71) 1 భక్ష్యాదిమోహముల్-ర (72) 1 శుభ-మూ,త (73) 1 కాది-మూ,త (76) 1 జంబ్వాంభోధి-తీ;జంబూవారి-తి,హ,ర 2 న్విధుండు-మ,తా,తి,తీ,హ,ర,క

మేయంబును, నిరవయవంబు నగుటంజేసి యాద్యంత రహితంబును నిత్యంబునై ప్రవర్తించు. కావునఁ గాలంబుచేతనే చరాచరంబునకు లయంబును బునరుద్భవంబునుం గలుగు. జగత్కర్త కాలంబ యని చెప్పిన విని, రక్షోవర్యుండు నిజాచార్యున కిట్లనియె. 77

క. దుర్గమమై [1]యమృతాంధో । వర్గమునకు సతత[2]మును ని - వాసంబగు నా
స్వర్గమునఁ గల మహత్త్వము । భార్గవ! నా కానతిమ్ము - పరమప్రీతిన్. 78

వ. అనిన శుక్రుం డిట్లనియె. 79

సురలోక భోగ భాగ్యములు

క. శ్రీకర రాజ ద్విజ పట । లీకృత వివిధాధ్వరావ - లీ పుణ్య ఫలం
బై కామ్యమాన[1] మగుటయు । [2]నాకముఁ గొనియాడ వశమె - నా కమరారీ? 80

ఉ. భర్గ జటాటవీ గళిత - భవ్య నదీ తటమందు, శత్రు ష
డ్వర్గము నొంచి, భూమి సుఖ - వర్జితులై తపమాచరించి, స
న్మార్గవిహారులై సుజన - మానితులై విలసిల్లువారికిన్
స్వర్గమె కాదె కామ్యఫల - సారము, దానవవంశశేఖరా? 81

సీ. అష్టాంగయోగ వి - ద్యాభ్యాస దక్షులు, । బ్రహ్మచర్య వ్రత - ఫలిత గతులు,
నగ్నిహోత్రాది క్రి - యా మార్గ నిరతులు, । సాంగ వేదత్రయా - ధ్యయన పరులు,
నన్నదానోపార్జి - తాఖండ కీర్తులు, । నిజ కులోచిత ధర్మ - భజన రతులు,
సముచితౌదార్య ని - స్తంద్రు, లత్యంత ప్ర । [1]శాంతులు, [2]సంతత - సాధు[3]మతులు,
తే. కదనమున వైరిసేనకు-నెదురు నడచి । శస్త్రహతిఁ బ్రాణములఁ బాసి-చనిన ఘనులు,
దివ్య కాంతాసహస్ర సం-సేవ్యులగుచు । నమరపురమున వసియింతు-రసురవర్య! 82

మ. శ్రుతిపారంగతుఁడై, సదక్షిణ మఖ - స్తోమంబు వాటించి, [1]సం
గత పుణ్యుండగు భూసురోత్తముఁడు, నా-కంబందుఁ బ్రాపించు. నూ
ర్జిత కల్పద్రుమ మంజరీ మధు[2]ర మై - రేయామృతాస్వాద [3]గ
ర్వితగీర్వాణవధూ సితంబభర నీ - వీ మోక్ష సత్సౌఖ్యముల్. 83

(78) 1 యమృతాంధస - తి,తీ;యమృతాగస - మ;యమృతాగమ-మా,తా; యమృతాశన - హ 2 నిజ-మ,మా,తి,తీ,హ,ర (80) 1 మగుటన్-త,తా 2 నాకమునం గల మహత్వమానతి యీవే - క (82) 1 శాంత ప్రసన్నాస్య - తా,మా 2 విన్యాస - త 3 జనులు - తి,తీ,ర (83) 1 సన్నుత (యతి?)!- మ,మా,త,తి,తీ,హ,ర,క 2 రసాక్షిణరసా - తా 3 కల్పిత-మా

వ. మఱియుం దత్పుర సౌభాగ్యం బెట్టిదనిన, 84

సీ. కాంచన [1]గోపుర - కాంతాన్యదుర్గమ । ప్రాకార పరిఖా [2]వి - భాసితంబు,
దీపితానేక ర - థ్యాపార్శ్వ [3]సౌధాగ్ర । కలశ నూతన రత్న - కాంతి యుతము,
దివిజతరంగిణీ - తీర కల్పకభూజ । భూరి పుష్పామోద - పూరితంబు,
సర్వలోకాంగనా - సౌందర్య గర్వ ని । ర్వాపణ పటు వధూ - రంజితంబు,
తే. సతత రాజాధ్వ [4]పుంజ పుం - జాయమాన । సంచర ద్దేవతా వ్రజ - సంకులంబు,
సకల కల్యాణ సౌభాగ్య - జననభూమి, । లోక విశ్రుత చరితంబు - నాకపురము. 85

ఉ. తామరసాప్త కాంతి సము - దాయముతోడుత నంధకారముల్
ప్రేమదలిర్పఁ జెల్మి యొన - రించునొకో! యనఁ బొల్చుఁ, దన్మరు
ద్ధామమునందు వప్ర సము - దంచిత నిర్మల పద్మరాగ సు
త్రామమణి ప్రభల్ నభముఁ - దార్కొని యొక్కటఁగూడి పర్విసన్. 86

ఉ. ఆ నగరంబులోన దివి - జాధిప మండిత హేమసౌధ సం
తాన విరాజి తాగ్రభవ - నంబులఁ గ్రీడలుసల్పు దేవతా
మానిను లంబుజానన వి - మాన తురంగమ హంసపంక్తికి
న్మానుగ మందమంద గమ - నంబులు నేర్పుచు నుందు రెప్పుడున్. 87

ఉ. కారుమెఱుంగు రాపొడియుఁ - గమ్మ పసిండిరజంబుఁ గూర్చి, నీ
హార [1]కరామృతంబుఁ బద - నంటఁగఁ జల్లుచుఁ, గాయజుండు శృం
గారరసంబు దీపకళ - గా నిడి చేసిన బొమ్మలో యనన్,
వారనితంబినీమణు ల - వారణఁ బొల్తురు తత్పురంబునన్. 88

శా. ప్రోఢ ల్నాథులఁగూడి యా నగరి నా - రోహావరోహాంగజ
క్రీడా బంధములం బెనంగి[1]నఁ, దదం - గస్వేదముల్ వాయ నీ
రాడం, దత్కుచ కుంకుమారుణములై - యభ్రాపగా తోయముల్
చూడం బొల్చుఁ, బ్రవాళకాంతి [2]పిహితా - స్తోకాబ్ధి [3]రామాకృతిన్. 89

క. నాకమునఁ గల వదాన్యా । నీకముఁ గొనియాడ నేల? - నీరస శిలలున్,
[1]మ్రాఁకులుఁ, బశువులు దివిజుల । యాకాంక్షలు దీర్చుచుండు - ననిశము ననిరన్. 90

---

(85) 1 గోపురాక్రాంతాస్య - మ,మా,త,ర,క; గోపురకాంతాస్య - తి,తీ 2 విరాజితంబు - క 3 సౌభాగ్య-మ,త,తి,తీ,హ,ర,క 4 రాంశుభుం - తా (88) 1 కళామృతంబు-తా (89) 1 ననుసంగ (యతి?)-మ,మా,త,తి,హ,ర,క;తదంగ (యతి)-తా 2 పిహితస్తోమాబ్ధి-తా 3 పూర్వాకృతిన్-మ,త,తి, తీ,హ,ర,క;పూరాకృతిన్-మా (90) 1 మ్రాఁకులు-హ

క. అందంబై, భోగలతా । కందంబై, దివిజ నయన - కంజాత కృతా
నందంబై, శోభిల్లును । నందనవన మా పురంబు - నకు నికటమునన్. 91

ఆ. *అఖిల విబుధ లోచ - నాహ్లాదకారియై । నవ్యమైన తద్వ - నంబునందు
ననిచి చిగురుచూపి-నవ పుష్ప ఫలములఁ । బొలుచు నెపుడు సకల-భూజములును. 92

సీ. నీరజాప్తాలోక - నిరవకాశానేక । సంతాన భూరుహ - చ్ఛాయలందు,
మకరంద రస పాన - మత్త భృంగీ గాన । మహిత కేళీ లతా - గృహములందుఁ,
గుముదారవింద సం - కుల వాసనా బృంద । వాసిత నవ సరో - వరములందుఁ,
గర్పూర మృగనాభి - కలిత సౌరభ శోభి । పల్లవ రచిత త - ల్పమ్ములందుఁ,
తే. జతుర రంభాది కామినీ - సహితులగుచు, । వాసవానల యమ దైత్య - వరుణ పవన
యక్షవర శంకరాది [1]స-మస్తసురులు । వరుసఁ గ్రీడింతు రమ్మహా-వనములోన. 93

వ. ఇట్టి నందనారామంబుచేత నభిరామంబగు దివిజ ధామంబు రామణీయకంబు మఱియు నెట్టిదనిన, 94

చ. మరునకు బొమ్మవెట్టి, యభి - మానమునం దుదిముట్టి, తాపస
స్ఫురణ వహించినట్టి యతి - పుంగవు బుద్ధిసరోరుహంబు, త
త్పుర హరిణేక్షణాజన క - పోల మిళ ద్దరహాస చంద్రిక
ల్బొరసిన యాక్షణంబ, ముకు - ళించును దానవలోకనాయకా! 95

శా. ఆ లోకంబున నుండు సజ్జనులు [1]దే - హాశా విపచ్ఛోక తృ
ష్ణా లోభాది విదూరులై, యమృత మా - స్వాదింపుచున్, యౌవన
శ్రీ లావణ్యసమేతులై, [2]యమరులై, - శృంగార సంపన్నులై,
కేళీతత్పరులై, సుఖింతురు మృగా - క్షీయుక్తులై నిచ్చలున్. 96

క. *అరివీరులఁ దూలింపను, । బరువడిఁ ద్రిదశాలయంబుఁ - బరిపాలింపన్
హరి గలఁడు గాన, దివిజులు । వెఱవక వర్తింతు రధిక - విభవోన్నతులై. 97

మ. లలనా[1]రూపము దాల్చి, దైత్యవరులన్ - లావణ్య వారాశిలోఁ
గలయన్ముంచి, విలాస హాస విలస - ద్గంభీర వాక్పాశ బ
ద్ధులఁ గావించి, పురందరాదులకు సం - తోషంబుగాఁ దొల్లి యా
జలజాక్షుండు సుధారసం బొసఁగడే - చౌర్య క్రియాశాలియై? 98

(92) * ఈ ప.తి.ప్ర.లో లుప్తము (93) 1 సమస్తసురలు-అన్ని ప. (96) 1 దెహాశాదివాశోక-ము,తా; దేహాశాదిపచ్ఛాశోక-మా; దాశీశాధిపశోక-త; దేహాశాగిపశ్చోక - తి; దేవశాధిపశ్శోక - ర; దేహాశాధిపశ్శోక-హ,క 2 యమృతులై-ము,తా,తి,తీ,హ,ర,క (97) * ఈ ప.తా ప్ర.లో లుప్తము (98) 1 భావము-మా,తి,తా,తి,తీ,హ,ర,క

క. అమృత రసాస్వాదనమున । నమరత్వము నొంది సౌఖ్య - మందిన దివిజుల్,
క్రమమునఁ [1]దావక సాయక । సముదయమునఁ గూలఁగలరు - సమరక్షోణిన్. 99

వ. అది గావున, భవన్నిశిత నారాచ ధారా సంపాతంబున సుర శిరస్సరసిజ వ్రాతంబుల విడళించి, త్రిదశేంద్ర సింహాసనారూఢుండవై, నాకలోక సుఖంబు లనుభవించి, నక్తంచరాన్వయ సముద్ధరణం బొనర్పవలయు. ఇది నీకు విజయ కాలంబును, సురలకుఁ బరాజయ కాలంబునుంగా నెఱుంగుము. అది యెట్లనిన, 100

విశ్రవుని వృత్తాంతము

సీ. పుండరీకం బనాఁ - బురరాజ మొక్కటి । పారియాత్రాచల - పశ్చిమమునఁ
ప్రాకార గోపుర - ప్రాసాద కలితమై । విలసిల్లు, నందొక - విప్రవరుఁడు
విశ్రవుం డనువాఁడు - విత్తాభిలాషియై । వెస నగ్రనందను - విక్రయించి,
ధన సంగ్రహము చేసి, - తద్విత్త మంతయుఁ । గ్రమమున వృద్ధిమూ-లమునఁ బెనిచి,

తే. యనుభవింపను, సముచిత - వ్యయ మొనర్పఁ । జాల కత్యంత లోభియై-సంతతంబు
తద్గతస్వాంతుఁడై యుండి, - [1]తౌల్యుఁ డనెడి । వైశ్యునకు నాదరంబున-వడ్డికిచ్చె. 101

తే. అంతఁ దద్వైశ్య మందిరా - భ్యంతరమునఁ । గల ధనంబెల్లఁ దస్కరా - క్రాంతమైన,
విప్రవర్యుండు తద్విత్త-విలయ శోక । తాప దందహ్యమానుఁడై-తన మనమున, 102

చ అనుచిత వర్తనంబనక - యాత్మజునిం దెగనమ్మికొన్న యా
ధన మది, భోగ దాన విహి - తవ్యయ ధర్మ పరోపకార సా
ధనముగఁ జేయనేరక, వృ - థామతినై బహువృద్ధి లాభ వ
ర్ధన మద పారవశ్యమునఁ - దౌల్యున కిచ్చితి నేఁటి కీ గతిన్. 103

చ. విడిముడి గల్గి యోగ్యమగు - వెచ్చము సేయని కష్టలోభి చే
పడిన ధనంబు, చోర నృప - బాధలఁ బొందక నిల్వనేర్చునే?
జడమతినైతి, భూమిసుర - జాతి విశిష్టపథ ప్రచారమున్
గెడసితి, బేలనైతి, విధి - గెల్వఁగవచ్చునె యెంతవారికిన్? 104

క. చోరుల [1]చేపడినర్థము । చేరునె పలుమారు చింత - చేసిన? నిఁక నే
దార సుత విత్త మోహ వి । కారము వర్జించి, యూర్ధ్వ - గతిఁ బొందుటకున్, 105

(99) 1 దానవ - త (101) 1 తంత్య - మ,త,తా,తి,తీ,హ,ర,క (105) 1 చేపడియర్థము - తీ

ఉ. యోగ్య తపం బొనర్తు, నని - యుత్తమవర్ణుఁడు నిర్ణయించి, వై
రాగ్యమునొంది, [1]చందన ధ - రాధర బిందుసరోవరంబునన్
వాగ్యతుఁడై, సువర్ణమయ - వారిజకర్ణిక నుండి, నిత్య సౌ
భాగ్యుని, వేద[2]వేద్యునిఁ, గృ - పానిధి, నంచిత భక్త సేవధిన్, 106

తే. విష్ణుఁ, బ్రభవిష్ణు నిజ మనో-వీథి నిల్పి, చండ మార్తాండ మండల - స్థాపితాగ్ర
దృష్టియై చేసెఁ దపమును-స్థిరత మెఱయ, । భూరి మారుత పూరక-పూర్వకముగ. 107

వ. ఇట్లు భూసురశ్రేష్ఠుండు తపోనిష్ఠుండై యుండునంత నొక్కనాఁడు, 108

ఉ. నీరజమిత్ర దత్తమగు - నిర్మల హారముఁ బ్రేమఁ దాల్చి, యం
భోరుహతుల్య నేత్ర రుచి - పుంజము దిక్కులఁ బర్వఁ, గిన్నరీ
స్మేరనుతుల్ చెలంగ, యమ - [1]సింధువరాదులు గొల్వఁగా, సునా
సీరుఁడు వచ్చె నచ్చటికి - శ్రీకర శుభ్ర గజాధిరూఢుఁడై. 109

చ. దివిజవరేణ్యుఁ డిట్లు చను - దెంచి, సరోవరలక్ష్మి లోచనో
త్సవ మొనరింపఁ గన్గొని, ని - జ ద్విపరాజముచేఁ దదంతర
ప్రవిమల హేమపద్మ నిక - రంబు వెసం [1]దివియింప, నల్గి వి
శ్రవుఁడను విప్రపుంగవుఁడు, - జంభనిషూదనుతోడ నిట్లనున్. 110

వ. సురేంద్రా! నీవు రాజ్య మదాతిరేకంబునఁ గన్నుగానక తపో నిష్ఠా గరిష్ఠుండనగు నాచే నధిష్ఠితంబగు నేతత్కమలషండంబు భవద్వేదండంబుచేతం ద్రెంచివైపించితివి. కావున, నీ [1]మహైశ్వర్యంబు రాక్షసాక్రాంతం బగుఁగాక! యని శపియించె. అదికారణంబునఁ ద్రిదశ రాజ్యంబు సాధ్యంబగు. నీవు చతురంగ బలయుతుండవై దండయాత్రకుం బ్రయత్నంబు సేయుమనిన తాపసాధ్యక్షునకు, హిరణ్యాక్షుం డిట్లనియె. 111

ఆ. అమృత మెట్లు పుట్టె? - నది రాక్షసుల వల । పించి, చక్రి దేవ - బృందమునకు
నెట్లు పంచిపెట్టె? - నిక్కథ వినుపింపు । మనుడు, మునివరేణ్యుఁ-డతని కనియె. 112

## క్షీరసాగర మథనము

క. దనుజేంద్ర! వినుము, దైత్యులు । ననిమిషపుంగవులుఁ గూడి - యమృత రసోత్పా
దనమునకుఁ దగిన యత్నము । మనమున నూహించి, విగత-మత్సరు లగుచున్, 113

(106) 1 చెందెను-మ,ర,క;చేరెను-హ. 2 మృగ్యుని - త;వంద్యుని - తా (109) 1 సింధు ధరా-మా;సిద్ధవరా-ర (110) 1 దవిలించ-ను,క (111) 1 మహాదైశ్వర్య-మ,మా,తా,తి,తీ,ర,క

క. పొందుగఁ గర్వము చేసి ర । మంద భుజాబలము మెఱయ - మణి శిఖరాళీ
సుందరము, విభవ విజిత పు । రందరము, మనోజ్ఞ కంద - రము, మందరమున్ 114

క. తరిత్రాడు చేసి [1]రమరా । సురు లురగిజానిఁ జంద్ర - [2]చూడ పదాబ్జా
[3]భరణ పరికీర్తిగామిని, । నర[4]నుత సుగుణైకభూమి, - నాగస్వామిన్. 115

వ. ఇవ్విధంబున సకల సాధన సంపన్నులై, మున్నీరుఁ దరువ సమకట్టిన సమయంబునం,
బట్టు బిగితప్పి, యప్పర్వతంబు ఘుమఘుమ ధ్వానంబుతో మునింగిన, 116

క. దేవాసురు లపుడు క్రియా । కోవిదభావమును, మథన - కుధరోద్ధరణ
ప్రావీణ్యముఁ జాలక, ల । జ్జావనత ముఖాబ్జులైన - యవసరమందున్, 117

## కూర్మావతారము

మ. చతురామ్నాయములుం బదాంబురుహముల్, - చండాంశు శీతాంశు ల
ప్రతిమా నాక్షియుగంబు, పావకుఁడు శుం - భ ద్వక్త్రముంగా రమా
పతి కూర్మాకృతి దాల్చి, యెత్తె వెరవొ - ప్పన్ వార్ధినిర్మగ్న ప
ర్వతరాజంబు, సమస్త రాత్రిచర గీ - ర్వాణుల్ ప్రశంసింపఁగన్. 118

తే. చరమ భాగంబునందు వై - శాఖ నగముఁ । బూని, మీఁదికి నెత్తి, యం - భో నిధాన
మధ్యమున నున్న కమఠేంద్రు - మహిమ గాంచి, । యద్భుతంబంది సురలుఁ గ్ర - వ్యాద
వరులు, 119

క. నిజ దివ్య జ్ఞానంబున । భుజగేశ్వరతల్పుఁ డగుటఁ - బోలించి, కరాం
బుజములు మొగిచి; రమాపతి, । నజు నిట్లని వినుతిచేసి - రందఱు వరుసన్. 120

## సురాసుర కృత విష్ణుస్తుతి

లయగ్రాహి

సాధుజన రక్షణ! ధ[illegible] -రోద్ధృతి విచక్షణ! వి । రోధిమద శిక్షణ! ర-మాధర! పయఃపా
థోధి కృతవాస! నిరు-పాధిక విలాస! మిహి । కా ధవళ కీర్తి! దివి-జాధిపతి ముఖ్యా
రాధిత శరీర! పరి - శోధిత విచార! ముని । బోధ ఫలసార! విన - *తాసుతవిహా రా
యోధన జితాసుర! ప-యోధర సుభాసుర! కృ । పైధిత మహీసుర! య-శోధనవరేణ్యా!

(115) 1 రమరాసురలు - అన్నిప్ర. 2 జూట - త 3 భరణత్వకీర్తి-మ,మా,తా,తి,తీ,హా,ర,క
4 సుర - తి,తీ (121) * యతి?

సీ. సర్వలోకాధీశ! - సనకాది సేవిత! । పరమ యోగారూఢ! - దురిత హరణ!
కౌస్తుభ శ్రీవత్స - కలిత వక్షస్స్థల! । రమణీయ హార వి - రాజమాన!
రత్నకుండల దీప్తి - రంజిత వదనాబ్జ! । మణికంకణ ప్రభా - మహిత హస్త!
లలిత పీతాంబరా - లంకృత కటిసీమ! । కరుణా కటాక్ష వీ - క్షణ విలాస!

తే. బాలభాస్కర కోటి వి - భా సమేత! । భాగవతలోక మందార! - పరమపురుష!
పుండరీకాక్ష! గోవింద! పుణ్యనిలయ! । నిన్ను నెప్పుడుఁ దలఁతు మా-పన్నవరద! 122

ఉ. [1]ఆపదమాన వహ్ని హతు - లయ్యు, ముకుంద! గుణాభిరామ! నీ
రూపము సంస్మరించిన న - రుల్ ధర దైవిక భౌతికాది సం
తాపములం ద్యజించి, విత - తంబగు పుత్త్ర ధనాది లాభ ము
ద్దీపితలీలఁ గాంచి, ప్రము - దింతురు శ్రీవనితామనోహరా! 123

ఆ. అనుచు సురలు వొగడ, - ననుపమ దరహాస । భాసమాన వదన - పంకజుండు,
హరి విరించిసహితుఁ - డై పుండరీకాక్షుఁ । డసురవరుల కడకు - నరుగుదెంచె. 124

మ. హరి యేఁతెంచిన, దేవదానవులు ని - త్యానంద సంపన్నులై
ధరణిం జాఁగిలి మ్రొక్కి పల్కిరి, జగ - త్కల్యాణ! దుగ్ధాంబుధిం
దరువంగా వెర వానతిమ్మనుటయున్, - దాక్షిణ్య వీక్షా కృతా
దరుఁడై దైత్యులఁ గొందఱం బిలిచి, ప - ద్మావల్లభుం డిట్లనున్. 125

క. ప్రారంభించిన కార్యం । బూరక దిగనాడ, సాహ - సోదారులకున్
దూరమగుఁ గీర్తి, మానం । బాఱడి చను, మేలు [1]చేర-దపనడి వచ్చున్. 126

ఉ కావున మీరు దేవతల - కన్న బలాఢ్యులు దైత్యులార! మీ
భావుక బాహుసత్త్వ పరి - పాకము లోకము మెచ్చ, భోగిరా
జావృత మందరాద్రిఁ గల - శాబ్ధి మథింపుఁడు గ్రమ్మఱ న్నిలిం
పావళితోడఁ గూడి, హృద - యాంబురుహంబుల నుత్సహింపుచున్. 127

ఆ మథ్యమాన జలధి - మధ్యమంబున సుధా । రసము పొడము, నాద - రమున మీకు,
నమరసంఘము నకు - నది పంచి పెట్టెద । ననుడు, సమ్మతించి - యసురవరులు. 128

(123) 1 ఆపదమాని - అన్నిప్ర. (126) 1 చారదనపడివచ్చున్ - పు,త,తా; చారదనపడి మా,తి,తీ; చారధనపడి - హ; చారధనపడి - ర; చేతదనపడి - క

మ. హరివాక్యానుగుణంబుగా, సకల దే - వానీక సంయుక్తులై,
పరిపూర్ణోత్సవ[1]జాత హుంకృతులచే - బ్రహ్మాండ మల్లాడఁగాఁ,
దరువం జొచ్చిరి దానవుల్ నిజ భుజా - దర్పంబు రెట్టింప, సు
స్థిర ధాత్రీవలయావధిన్, బహు మణి - శ్రేణీ నిధిన్ వారిధిన్, 129

### శంకరుఁడు గరళక్షోభము మాన్పి లోకము నుద్ధరించుట

క. పురికొని తరువఁగ, నాలోఁ । బరమాద్భుత లీల భువన - భయద జ్వాలా
తరళము, సర్వ దిగంతా । విరళము, గరళంబు సంభ - వించెన్ మొదలన్. 130

వ. * ఇట్లు ప్రళయానలాభీలంబును, జ్వాలా జాల కరాళంబును, జగన్నాశ మూలంబును నగు కాకోలంబు వొడమి, సకల బ్రహ్మాండ మండలోన్మూలం [1]బొనరింపం దలంప, నిలింప దానవ సముదయంబు భయంబు నొంది, రయంబునం గడలి వెడలి, యిక్కార్యంబు చక్కం బెట్టి దిక్కు ముక్కంటివేల్పు దక్కం దక్కొరుండు లేఁడని మృత్యుంజయుపాలికిం జని, 131

మ. "పరమేశాయ, పరాత్పరాయ, గిరిజా-[1]భాగ్యాయ, తుభ్యం నమః
కరుణాపూరిత మానసాయ, విభవే, - కల్యాణరూపాయ, శం
కర! మాం[2]పాహి" యటంచు మౌళి ఘటితా - ఖండాంజలీ ద్వంద్వులై
సురదైత్యుల్ శరణంబు చొచ్చి, గరళ - క్షోభం బెఱింగించినన్, 132

ఉ. పాటవమొప్పఁ జేరి, కర - పద్మమునం గబళించి, శీతరు
గ్జూటుఁడు నవ్వుచు న్మెసఁగెఁ - జూర్ణిత పద్మభవాండ మండలీ
[1]పేటము, నుద్ధతారవ వి-భీషిత దేవ నిశాటమున్, నిరా
ఘాటముఁ, గాలకూటము, న - కాండ లయంకర[2]రూప కీటమున్. 133

క. హాలాహల కీలా భవ । నీలిమ గళ మూలమంద - నిలిచిన కతనన్
బాలేందుధరుఁడు, శంభుఁడు, । కాలహరుం డొప్పె నీల - [1]కంధరుఁ డనఁగన్. 134

వ. ఇట్లు కాలకూటంబు శూలిచేత నిష్పీతంబైన, దేవాసురవరులు [1]నిర్వృతులై, జలధి గిలుకొట్టం దొణంగి రంత, 135

(129) 1 జాల - మ,తా,తి,తి,హ,ర,క (131) 1 బుదహింపం - మ,మా,తి,తి,హ,క; * వ; 131 - ప 13, ర, ప్ర. లుప్తము (132) 1 భార్యాయ-మ,మా,తా,తి,తి,హ,క 2 త్రాహి - మ,తి,హ,క (133) 1 ఘేటము నంచతా-ము,మా,త,తి,తి,హ,క 2 కిబరూపమున్-మ,తి,తి;కిబహపమున్ - మా,త, తా,హ,క (134) 1 కంధరుండనఁగన్-త,తా (135) 1 నిర్భయులై-మ,మా,తా,తి,తి,హ,ర,క

శ్రీదేవి ప్రాదుర్భావము

సీ. శృంగార రసమునఁ - జిలుముపోఁ గడిగిన । లలిత సువర్ణ శ - లాక యనఁగ,
నమృతాంశు మండ[1]లం - బున సానపట్టిన । కమనీయ నవరత్న - కళిక యనఁగ,
ఘనసార మృగనాభి - కర్దమంబున దోహ । లం బొనర్చిన తటి - ల్లతిక యనఁగఁ,
బటు సుధాజలమునఁ - బదనిచ్చి చికిలి సే । యించిన వలరాజు - హేతి యనఁగ,

తే. మథ్యమాన పయోరాశి - మధ్యమమున । నిందిరాదేవి పొడమి, యా - నంద మొదవ
విశ్వనిర్మాణపరు, నర-విందనాభుఁ । దనర వరియించి, లోకైక-జనని యయ్యె. 136

అమృతాపహరణము

చ. మఱియును దన్మహాజలధి - మధ్యమమున్ మథియింపఁగా నిశా
కరుఁడును, గామధేనువును, - గల్పమహీ[ు]చయంబు, దేవతా
కరి తురగంబులున్ మొదలు - గాఁ గల భవ్య పదార్థజాలముల్
వరుస జనించి మించె నని - వారణ లీల, ననంతరంబునన్, 137

క. కరముల నమృత సమన్విత । వర కాంచన కలశ మొకటి - వైభవ మెనఁగన్
ధరియించి వెడలె ధన్వం । తరి, తత్సాగరములోన - దనుజాధీశా! 138

క. అంతట సంభ్రమమున ధ । న్వంతరిచేనున్న యమృత - వరకలశము వి
క్రాంతమతిఁ గొని [1]దనుజే । ంద్రాంతరమున కేఁగి రసుర - లతిరభసమునన్. 139

తే. జలజలోచనుఁ డపుడు సా - క్షాత్కరించి, । నమిత కంధరులైన య - య్యమరవరులఁ
జూచి, మాధుర్య ధుర్య వ-చో నిరూఢి । నతిదయామృత మొలుక ని-ట్లనుచుఁ బలికె. 140

సీ. ఇంద్రాది సురులార! - యింతమాత్రమునకై । చింతింపవలవదు - చిన్నవోయి,
[1]యొక్కకమంబునఁ గొని - యురవడి దైత్యుల । నాహవక్రీడల - నణఁపరాదు,
అయ్యెడునట్టి కా - ర్యము గాక మానదు । ప్రాప్తవ్య కర్మంబు - ప్రాప్త మగును,
దత్కర్మము సత్కృ - త ప్రయత్నంబున । ఫలియించుఁ గాల వి - పాక సరణిఁ

తే. గాన, మీరు మనంబునఁ - గలఁక యుడిగి । దైత్యు లున్నెడ కరుగుఁ డు - త్కంఠతోడ
నంతలోఁ గామినీమూర్తి - నవతరించి, । మోహపుట్టించి, వారి నే - మోసపుత్తు. 141

---

(136) 1 లంబను - త,తా,హ,ర,క (139) 1 దనుజ (?) - మా,హ,క (141) 1 యేక క్ర మంబునఁగాని యురవడి - తి; యేకథంబుగఁగాని యిరవుగ - తీ; యేక్రమంబునఁగాని యురువడి (యతి?) - మ,హ,ర,క

చ. అని హరి యానతిచ్చిన, సు - ధార్ణవ తీరము వాసి దేవతల్
మనమున సంతసం బొదవ, - మారుతవేగముతోడఁ దన్మహా
దనుజసమాజ వాక్కలహ - తార నినాద సమేతమైన, యా
దను వను భూమికిం జని ము - దంబున నిల్చి, రనంతరంబునన్, 142

## కమలాక్షుని కామినీ రూపము

సీ. చిగురుటాకుల నవ్వు-చిన్నారి యడుగులు, । కరితుండముల మించు-మెఱుఁగుఁదొడలు,
సికతామయంబు నా - క్షేపించు జఘనంబు, । గగనంబునకు బొమ్మ - గట్టు నడుము,
కనకకుంభముల బిం-కముదీర్చు చనుదోయి, । యరవిందముల [1]నేలు-హస్తయుగము,
కంబు సౌందర్యంబు-కబళించు కంఠంబు, । ముదురుచందురుఁ బోలు-ముద్దు[2]మొగము,
తే. నలినదళములఁ దలఁపించు-నయనయుగళి, । తేఁటిఱెక్కల చెలువంబుఁ-దెగడు కురులు
గలిగి, శృంగార [3]రస జీవ-కళయుఁ బోలెఁ । గాంతయై శౌరి, దైత్యుల-కడకు వచ్చి, 143

సీ. మఱపించుఁ గొందఱ - మంజుల వాక్సుధా । మాధుర్య [1]మను చొక్కు - మందు చల్లి,
తగిలించుఁ గొందఱఁ - దళుకు [2]వాలిక చూపు । [3]గము లను వలలకుఁ - గదియ నొత్తి,
తిగుచుఁ గొందఱ గండ - యుగ కందళిత నూత్న । మందహాసం బను - మచ్చు వైచి,
వలపించుఁ గొందఱ - వలి గుబ్బపాలిండ్ల । నవరని మెఱుఁ గను - జలధి ముంచి,
తే. మోవిపస చూపి కొందఱ - మోసపఱచు, । హస్తసంజ్ఞలఁ గొందఱ - నాదరించు,
నంచనడపులఁ గొందఱ-[4]నపలపించు, । గానరసమునఁ గొందఱఁ - గరఁగఁజేయు. 144

క. ఈ కరణి సకల దనుజా । నీకము వంచించి, మాని - నీ [1]రూప ధర
శ్రీకాంతుఁడు దయతోడ సు । ధా కలశము దెచ్చి దేవ - తల కర్పించెన్. 145

చ. త్రిదశులు తత్సుధారస మ - తిప్రమదంబునఁ గ్రోలి, యెన్నఁడున్
ముదిమియుఁ జావు లేని దృఢ - మూర్తులు దాల్చి, యసాధ్వసంబునం
ద్రిదివపురంబునందు [1]నమ - రీ నికురుంబ విరాజమాన సౌ
ఖ్యద మణిసౌధ వీథుల న - ఖండితులై విహరింతు రెప్పుడున్. 146

వ. అని యిట్లు దానవాచార్యుండు హిరణ్యాక్షునకు సముద్రమథన వృత్తాంతంబు, నమృతోద్భవంబు తెఱంగు లెఱింగించె. ఆ సమయంబున, 147

---

(143) 1 ఁబోలు-క 2 మోము-త,తి,క 3 ంసములోఁగళయ-తి,తీ,హ,ర (144) 1 మనుసొక్కు-త;మునఁజొక్కు-మ,మా,తి,తీ,హ,క 2 వాలికె - అన్ని ప్ర. 3 గతులను - ర 4 నలవంచు - త (145) 1 రూపపు - తి,తీ,ర;రూపదలి (?) - హ (146) 1 నమణీ - త

సూర్యాస్తమయ వర్ణనము

చ. కరములు సాఁచి, [1]రాజనిజ - కాంతఁ, గుముద్వతి నంటెఁ బద్మినీ
వరుఁ, డని లోకులాడు నప - వాదము మాన్చుకొనం, బ్రమాణ సు
స్థిరమతియై గమించి, [2]జల - దివ్య మొనర్చెడువాఁడె పోలెఁ, దా
మరస హితుండు గ్రుంకెఁ జర - మ స్ఫురితార్ణవ మధ్యమంబునన్. 148

ఆ. చక్రవాక మిథున - జాత వియోగాగ్ని । [1]విపుల రుచులు వెల్గి - విరిసె ననఁగ,
సాంధ్యరాగ మొదవెఁ,-జనుఁగ్రొత్త లేఁత చీఁ । కటి తదీయ ధూమ-పటల మనఁగ. 149

చ. జలరుహబాంధవుం డపర - సాగర నీరము సొచ్చె, నింక రాఁ
గలఁడు సుధాంశుఁ, డీ నడిమి - కందువఁ గాని మదీయ జృంభణం
బలవఁడ దంచు, భూధర గు - హాంతర మార్గ వినిర్గతంబులై
*కలయఁగఁ బర్వె రోదసి, న - ఖండగతిం జరతాంధకారముల్. 150

చ. సరసుఁడు, తారకాయుతుఁడు, - శాంతుఁడు, రాజకళా కలాప వి
స్ఫురితుఁడు వచ్చుఁ గూర్మిఁ దనుఁ - బొందుట కంచుఁ దలంచు యామినీ
తరుణి, రతిక్రియా సముచి - తంబగు నంబర నూత్న శయ్యపై
నెఱపిన [1]మల్లెమొగ్గ లన - నిర్మలతం గనుపట్టెఁ దారకల్. 151

చంద్రోదయ సుషమ

సీ. మోరచిక్కము పద్మ - ములకు, నాఁకటిపంట । రంగ చ్చకోర [1]ప-తంగములకు,
మొగసిరి కైరవం - బులకు, నుచ్చాటన । కలిత యంత్రం బంధ - కారమునకు,
పీడాకు నవ చక్ర - విహగ దంపతులకుఁ, । బాయసాన్నము దేవ - పటలమునకు,
*డాకన్ను పద్మాల - యా కళత్రున, కభి ! చారకృత్యము జార - చోర తతికిఁ,
తే. గూర్మి సైదోడు లచ్చికిఁ, - గొడుకుఁగుఱ్ఱ । యంబుధికి, మేనమామ వు - ష్పాయుధునకు
ననుచుఁ గొనియాడఁ, బూర్వ శై - లాగ్ర[2]వీథి । సోముఁ డుదయించెఁ జంద్రికో-ద్దాముఁ
డగుచు. 152

(148) 1 రాజు - తా,తీ 2 జలధివ్య - తా;జలధిక్వ - తీ (149) 1 పిప్ర - మ,త,తా, తి,తీ,హా,ర,క (150) * త.ప్రలో 4 వ పా. 151 ప. లో 1, 2, 3 పా. లుప్తము (151) 1 మొల్ల- హా,ర (152) 1 తరంగములకు - తి,తీ, * తీ ప్ర. లో పా. లుప్తము 2 వనధి - తా

వ. తత్సమయంబున, శౌర్య హర్యక్షుండగు హిరణ్యాక్షుండు, పురందర రమా హరణ చాతుర్యధుర్యుండగు దనుజాచార్యు వీడ్కొని, యభ్యంతరమందిరంబునకుం జని, మజ్జన భోజనాది కృత్యంబులు నిర్వర్తించి, దివ్య గంధ మాల్యాంబరాభరణంబుల నలంకృతుండై, *సంపాదిత [1]ప్రమోదంబగు ప్రాసాదంబునందును, సంతతోత్సాహ [2]నిదానమ్ములగు నుద్యానమ్ములందును, వికసిత కమల [3]కహ్లారంబులగు కాసారంబులందును, రూప విభ్రమ విలాస శృంగారరస భాజనంబులగు కామినీజనంబులం గూడి, యామ్రేడిత రతిక్రీడా పరతంత్రుండై యుండె. అంత, 153

ప్రభాత వర్ణనము

మ. జలజాతంబులు నిద్ర మేలుకొన, న - క్షత్రంబు లెందేనియుం
దొలఁగంబాఱ, విహంగ సంఘములు అం - తుల్ సేయఁ, గహ్లారమం
డలి లావణ్యము జాఱ, జక్కవలు వే - డ్కన్ నిక్క, మందానిలం
బెలమిన్వీవఁ, బ్రభాత మయ్యె జగతిన్ - హృద్య ప్రభాన్వీతమై. 154

సీ. తిమిర [1]కుంభి విదార - ణమునకు నుదయాద్రి । [2]దరి నిర్గమించు కే - సరి యనంగ,
శీతాంశుకిరణ మూ - ర్చిత పద్మలక్ష్మికి । సముచిత [3]జీవనౌ - షధ మనంగ,
యామినీ విరహి వి-హంగ దంపతులకు । సాంగత్య [4]మొనరించు - సఖుఁ డనంగ,
భువనాంతర క్షేత్ర - మున నంటు బీజముల్ । వెదపెట్టు కర్షక - విభుఁ డనంగఁ,
తే. బరమ ముని పుణ్య పరిపాక-ఫల మనంగఁ, । [5]ప్రాక్సతీ పద్మరాగ ద - ర్పణ మనంగ,
జంభరిపు సౌధ కాంచన - [6]కుంభ మనఁగ । సూర్యుఁ డుదయించె [7]నభినంది - తార్యుఁ
డగుచు. 155

అమరారి యమరావతి యాత్రకమణము

చ. అటమును మేలుకాంచి, యను - రాన్వయనాయకుఁ డాహ్నికక్రియా
పటలముఁ దీర్చి, మంత్రి హిత - బంధు పురోహిత వారణాశ్వ స
ద్భట రథ సంఘము ల్గొలువ, - బంధుర దుందుభినాద సైనికా
ర్భటులు చెలంగ, మత్తగజ - రాజము నెక్కి, మహోగ్రమూర్తియై, 156

(153) 1 ప్రమోదితం - త 2 నిధానము - మా 3 కలహార - తి,హ;కల్హార - మ, మా, త, తా,ర,క * సంపాదిత - పరతంత్రుండై - వఱకు తి.ప్ర.లో లుప్తము (155) 1 కుంభ - త 2 వెలి- మా 3 జితజీవసౌధమనఁగ - త 4 మొదవించు - త 5 మూఁడు మూర్తుల తేజంపు ముద్దయనఁగ - తి 6 మణియనంగ - ర 7. నందితాచార్యుఁడగుచు - తా

మ. ధూమ్రాక్షాది మదాంధ దైత్య దనుజ - స్తోమంబుతో, వారుణీ
తామ్రాక్షి ప్రభ బాలభానురుచి ను - ద్ఘాటింపఁ, జింతామణీ
కమ్రశ్రీ యుత సౌధ కల్పతరు రం - గ జ్జంభవిద్వి ట్పురీ
సామ్రాజ్యంబు హరింపఁ గోరి, కదలెం - జండ ప్రభా[1]వోద్ధతిన్. 157

వ. ఇట్లు కదలి, హిరణ్యాక్షుం డదభ్ర శుభ్రతా విజిత సుధాకర మరీచికలగు వీచికల చేతను, [1]బరిహసిత శరన్మల్లికా గుచ్ఛ వితానంబులగు ఫేనంబులచేతను, సమభ్యస్త శారదా నాభి విక్రమంబులగు సలిల భ్రమంబులచేతను, సఫలీకృత సుజనాభిలాషంబు లగు ఘోషంబులచేతను, జలక్రీడారంభ విజృంభమాణ రంభా ముఖ్యాంభోరుహనయనా శ్రుతిపుట ఘటిత ప్రమోదంబులగు హంస కారండవ క్రౌంచాది జలవిహంగమ నాదంబుల చేతను, దివిజగణ మనోహర వాసనా కరండంబులగు కమల కహ్లార షండంబులచేతను, సమాక్రాంత నభోభాగంబగు ప్రవాహవేగంబుచేతను, ముక్తి[2]ప్రాసాద సమారోహణ [3]సోపానకారంబులగు తీరంబులచేతను, గామిత ఫలప్రదాన [4]మణి రత్నపేటికలగు నంతికోద్యానవాటికలచేతను విలోకనీయమై, త్రిభువన జేగీయమాన కీర్తిపతాకిని యగు మందాకినిం జేరంబోయి, తత్పరి సరంబున విడిసె. అంత, 158

క. రక్షోవిభుఁడైన హిర । ణ్యాక్షుఁడు యుద్ధాభికాంక్ష - నమరనదీ తీ
రక్షోణి విడియుట సహ । స్రాక్షుఁడు విని, దివిజ[1]బల స - మావృతుఁ డగుచున్, 159

## సురాసుర భీకర సమరము

శా. భేరీ భాంకృతి ఘోర ఘోషముల ది - గ్భిత్తుల్ ప్రకంపింప, సే
నా రావంబున నంబుధు ల్గలఁగ, ర - త్నస్యందనం బెక్కి, వి
స్తారోదార జయాంకమాలికల గం - ధర్వుల్ ప్రశంసింప, దు
ర్వారుండై నగరంబు వెల్వడి, రిపు - వ్రాతంబు భీతిల్లఁగన్, 160

చ. రణ మొనరింప, దైత్యశిబి - రంబునకై చను జంభభేది జృం
భణమున కుత్సహింపుచును, - బట్టిన ముద్గర భిండివాల భీ
షణ కరవాల ముఖ్య బహు - శస్త్ర సమన్వితహస్తులై, యవా
రణ మునుమున్న దేవతలు - రాక్షసవీరులఁ దాఁకి రుగ్రతన్. 161

(157) 1 వోన్నతిన్ - క (158) 1 నుపహసిత - ర 2 ప్రసాద - మ,మా,త,తా,తి,తీ,ర,క 3 సోపాన - మ,మా,తా,క 4 గుణరత్న - మా,త,హ,ర,క (159) 1 గణ - ర

క. దానవు లప్పుడు నిర్జర । సేనా సంరంభమునకుఁ - జిత్తంబునఁ గ్రో
ధానలము ప్రజ్వలించిన । నా నిర్జరబలముఁ దాఁకి - రతిరభసమునన్. 162

క. ఉభయ బలంబుల శూరులు । నభిముఖులై యిట్లు పోరి - రన్యోన్య జయా
[1]రభటి మనంబులఁ గోరుచు । నభినవ దోర్దండ శౌర్య - మతిశయ మందన్. 163

వ. తత్సమయంబున నిరువాఁగునుం గలయం బెరసి, గజారోహకులు గజారోహకులును, దురగారూఢులు తురగారూఢులును, రథికులు రథికులును, బదాతులు పదాతులును దలపడి, తుండంబులు ఖండించియు, రదనంబులు విదళించియు, శిరంబులు నురుమాడియుఁ, బాదంబులు ఛేదించియు, *మావతుల నిర్జీవితులం జేసియుఁ, గందరంబులు చిందరలాడియు, నడుములు కడికండ లొనర్చియు, వాలంబులు గూలనేసియు, పల్లంబులు డుల్లించియు, *రాహుత్తులఁ దుత్తుమురు గావించియు, యుగ్యంబుల వహన యోగ్యత్వంబులు మాన్పియు, సూతుల నేపణంచియు, రథాంగంబుల భంగించియు, [1]నక్షంబుల శిక్షించియు, రథుల విరథులం జేసియు, ఖేటంబుల విటతాటనం బొనర్చియుఁ, [2]గైదువ లైదుపది గావించియుఁ, గుత్తుకలు కత్తరించియు, భుజదండంబులు చెండాడియు, ఫాలంబులు [3]లీలం బొడిచియు విజృంభించిన, గజకళేబర గిరినికరంబును, దురంగమ తరంగంబును, శతాంగ తిమింగిలంబును, బదాతి కమఠవ్రాతంబును, ధవళచ్ఛత్ర చామరఖండ డిండీరంబును, బలలాంశ ప్రవాళజాలంబును, [4]నాంత్ర ఘోరాహి సమూహంబును, రక్తప్రవాహ వ్యూహ పూరంబును నగు సమరసముద్రంబు రౌద్రంబై కనుపట్టె. అందు, 164

సీ. పోటున కాశించి, - పోక ముందఱ నిల్చి । కుంత ఘాతంబులఁ - గూలువారుఁ,
బఱతెంచి చలమునఁ - బరబలంబులు చొచ్చి । యుడు ఖడ్గధారల - నొరగువారు,
బిరుదులు పచరించి - కరకరి నెదిరించి । [1]చక్రపాతంబుల - సమయువారుఁ,
దమవారి కడ్డమై - తరిమి భీకరవృత్తిఁ । దోమర హతులచేఁ - దూలువారు

తే. నై, రణంబున నుభయ సే - నాగ్రచరులు । నవ్యవస్థిత విజయ భం - గాత్ము లగుచు,
దొమ్మికయ్యం బొనర్చిరి - దురవలోక । బాహువిక్రమ సంపత్ప్ర - భావ మమర. 165

ఆ. *తిరిగి పిఱికిఁ బోక, - ధృతి తప్పి చెదరక, । నిలిచి యుగ్రశౌర్య - కలితు లగుచు,
దేవ దైత్యవరులు - చేవతోఁ గదనంబు । సలుపుచున్నయట్టి - సమయమునను, 166

---

(163) 1 రభట - హ (164) * మావతుల - చెండాడియు తా. ప్ర.లో లుప్తము * రాహుత్తుల - భంగించియు ర. ప్ర. లో లుప్తము 1 నక్షంబుల - ర, క 2 గైదువు - ర 3 ప్రీలం - క 4 నన్త్ర - మ,తా,తి,తీ,హ,ర,క (165) 1 చక్రాహతం - తా (166) * ఈ ప. తా.ప్ర.లో లుప్తము

మ. అనలుం డేసె నిశాటవల్లభునిపై - నభ్రంలిహ ప్రజ్వల
ద్ఘన కీలా సముదాయమున్, జన దృగ - గ్రాహ్య స్ఫులింగావళీ
జనిత ధ్వాన విశేష వజ్ర¹భవ గ - ర్జా భిన్న దైతేయమున్,
దినరాణ్మండలకోటి తుల్య సుషమా - స్థేయంబు, నాగ్నేయమున్. 167

క. ఏసినఁ గలంగి నిజ సే । నా సముదాయంబు చెదరి - నం గని, భువన
త్రాసకుఁడగు దనుజేశ్వరుఁ । డా సమయమునందు దివిజు - లద్భుతమందన్, 168

ఆ. ¹బెదరి పఱచువారిఁ - బేర్వేఱఁ జీరుచు । నెదురునడుచువారిఁ - గదియఁ ²జనుచు
గురు పరాక్రమమునఁ-గోదండ మెక్కించి । చతురుఁ డగుచు ³రాత్రి-చరవరుండు, 169

క. వారుణ బాణంబున దు । ర్వారానల బాణ జనిత - వహ్ని ప్రభలన్
వారించి, దివిజకుల సం । హారుఁడు రోషారుణీకృ - తాక్షుం డగుచున్, 170

చ. అనలుని నాఱుబాణముల - నంటఁగ నేసి, పదేను తూఁపులన్
వననిధినాథు నొంచి, యని - వార్య సహస్రముల న్నిలింపనా
థుని తనువందుఁ గీల్కొలిపి, - దుర్గమ మార్గణ పంచకంబునన్
ఘనుఁడగు దండహస్తుని ప్ర - కంపితగాత్రుని జేసె నత్తఱిన్. 171

చ. అపుడు పురందరుం డలిగి, - యగ్నికణంబులు వేయుకన్నులన్
విపులత నిర్గమింపఁగ, ర - విప్రభ మించిన వజ్ర మంది, యా
చపలుని గూలవ్రేయుటయుఁ, - జయ్యన మూర్ఛిలి దానవేశ్వరుం
డపగతఖేదుఁడై తెలిసి, - యద్భుత రోష కషాయితాస్యుఁడై, 172

క. ఈశ వర లబ్ధమగు భయ । దాశుగమున దేవవిభుని - యంగము నొంపన్,
ధీశాలి యతఁడు మూర్ఛిలె, । నాశాపతులెల్ల ¹వణఁక, - నమరులు ²బెగడన్. 173

ఆ. అంతలోనఁ దెలిసి - యమరేంద్రుఁ డత్యుగ్ర । రోషవహ్ని భయద - వేషుఁడగుచు,
నెలమి దైత్యవరుల - నెదిరించి కదనంబు । సలిపె బాహుశౌర్య - సంభ్రమమున. 174

క. హరి హేషితములఁ గరి ఘీం । కరణముల ¹రథాంగ నేమి - ఘన నినదములన్,
వర భట కోలాహలముల । ధరణీతల ముద్రువఁ దొణఁగెఁ - దత్సమయమునన్. 175

---

(167) 1 ధవ - క (169) 1 చెద (యతి?) - తి,హా 2 నడుచు - మ,తా,తి,తీ,హా,ర,క
3 రాక్షసేశ్వరుండు (యతి?) - మ, తి, హా, ర, క; రాక్షసప్రభుండు - తీ (173) 1 బెగడ - క
2 బెదరన్ - మ,తా,తి,హా,ర;వణఁకన్ - క (175) 1 రథనేమి - మా;రథములనేమి - త

### అమరుల పలాయనము

ఉ. భీకర దైత్యరాజ శర - బృందముచేఁ గడు నొచ్చి, నిల్వఁగా
లేక, సురేశ్వరుండు నని - లింపముగా భయ విహ్వలాత్ముఁడై
నాకము నిర్గమించి, శర - ణంబుగఁ జేరె, నఖండిత ప్రభా
ప్రాకట చండ భానువుఁ, [1]ప్ర - భానుకృశానువు, రత్నసానువున్. 176

### అసురపతి యమరలోకాధిపత్యము

వ. ఇట్లు, వారలు సమరవిముఖులై పఱచిన, నసురచక్రవర్తి నిరమిత్ర లోకంబగు నాకంబు [1]విచ్చలవిడి చొచ్చి, సంతత [2]చింతామణీ రామణీయక [3]పరివృ తేందిరంబగు సభామందిరంబున, మహేంద్రసింహాసనంబున సమాసీనుండై, యనర్గళ స్వర్గభోగంబుల ననురాగం బొందుచున్నయెడ, నొక్కనాఁడు [4]భసితసంభవుం డగు సునాసీరుం డను నిశాచరవీరుండు తత్సమ్ముఖమ్మున నిలిచి యిట్లనియె. 177

### సునాసీరదానవుని రాజనీతి ప్రబోధము

ఉ. నీవు భుజా విజృంభణ వి - నిర్జిత నిర్జరవల్లభుండవై
దేవ! మహానుభావమున - దివ్యపురీ మణిసౌధ కామినీ
భావజకేళిఁ దేలుచు, న - భంగ పరాక్రమ శక్రరాజ్య ల
క్ష్మీ విభవాది కృత్యమున - మించితి వెంతయు దైత్యనాయకా! 178

క. దైతేయసార్వభౌమ! మ । హీతలమున నిన్నుఁ బోలు - నీదృగ్భల వి
ఖ్యాతుల నెవ్వరిఁ గానము । [1]భూత భవ ద్భావి కాల - ముల నెయ్యెడలన్. 179

తే. ఏకతంబైన దిచ్చట - హేమనయన! । విన్నవింపంగఁ గల దొక్క - విన్నమాట,
సావధానుండవై విను - [1]మస్మదీరి । తంబు, నీకు హితంబు త - థ్యంబు నగుట. 180

ఉ. కొందఱు దానవేశ్వరులు - కుంభినిలో మును శూరతా లతా
కందము లయ్యు, నీతి[1]గతిఁ - గానమి, [2]భోగవశాంతరంగులై
ముందఱికార్యముల్ [3]విఱిగి - మోచినదాఁక నెఱుంగలేక, తా
మెందుకుఁగాక రాజ్య ధన - హీనతఁ బొందిరి [4]రాక్షసాగ్రణీ! 181

---

(176) 1 ప్రభావ - మూ,త (177) 1 విచ్చనవిడి - మ,మూ,త,తా,తి,తీ,ర,క 2 చింతామణ్యాది ప[రి]వృతేందిందిరం - తీ 3 పరికృతే[ం]దిరం - మూ,త 4 భసిత త్రిపుండ్ర సంభవుం - క (179) 1 భూతలమున భావికాల - క (180) 1 మీకు నా మతంబు - హ; సత[ం]బునీకు - [..]మస్మదీయ హితము - క (181) 1 రతి - త 2 క్రూరదశా[..]త-తి 3 పెరిగి-త 4 రాక్ష సాధమా-తి

మ. సమ రాజేంద్రుని గూర్చి సామము, భుజా - శౌర్యాధికున్ గూర్చి దా
నము. [1]హీనం గలయంగనేరని మహీ - నాథాగ్రణిం గూర్చి భే
దము, శక్తిత్రయ హీనుఁగూర్చి కడిమిం - దండంబు గావింప యు
క్తము భూపాలున, కాత్మరాజ్య పరిర - క్షా కార్య నిస్తంద్రతన్. 182

తే. * నీతిమార్గంబు వదలక - నృపతి భావి । కార్య మాప్త బుధామాత్య - గణముతోడ
నూహ యొనరించి, కుశలుఁడై-యుండవలయు । మంత్ర రక్షణవిధి నప్రమత్తుఁ-డగుచు.

క. బలిమి గలనాఁడె విమతులఁ । బొలియింపఁగ నేర్పులేని - భూవరులకుఁ, ద
[1]త్కాలశేషముచేతనె చెడుఁ । గలిమియు రాజ్యంబు బంధుగరిమయు ననఘా! 184

క. కావున, శాత్రవశేషము । భూవరుఁ డుచ్ఛిన్నమూల - ముగ నణఁగింపం
గావలయు, నహిత రహిత మ । హీ వలయం బేలుకన్న - హితముం గలదే? 185

చ. అనిమిషకోటి దక్క మన - కన్యులు లేరు విరోధు, లమ్మహా
ఘనులు సురాచలంబున సు - ఖస్థితి నిల్చినవారు, వారికిం
దనుజవిదారి రక్షకుఁ, డ - తండు నిశాటులఁ జక్రధారలం
దునిమి, యొసంగు నింద్రున క - నూనమతిం ద్రిదివాధిపత్యమున్. 186

క. *నిశ్శేషంబుగ దనుజ మ । న శ్శల్యములైన సుర గ - ణంబుల నెల్లన్
దోశ్శక్తిఁ దునుముటకు ర । క్షశ్శేఖర! తగు నుపాయ - గతి నూహింపన్. 187

వ. అని పలికి, వెండియు నిట్లనియె. 188

సీ. ఒక్క కార్యము దోఁచి - యున్నది నామది । నది విను మెఱిఁగింతు - [1]నసురనాథ!
త్రిదశాలయంబు రా - త్రించరేశ్వరులకు । భోగ [2]భాగ్య నివాస - [3]భూమి యయ్యె,
దివిజలోకమున వ - ర్తించినవారల । కిష్టంబు గాదు మ - హీ సుఖంబు,
కావున, నీవు బా - హా విజృంభణమునఁ । బృథివితోఁ గనకాద్రిఁ - బెనఁచిపట్టి

తే. వార్ధిలోపల మునుఁగంగ - వైచితేని, । యమర ముని సిద్ధ కిన్నర - యక్షవరులు
నమసిపోవుదు, రంత ని - శ్శంకలీల । నేలుదువు నీవు సురలోక - మెల్ల గరిమ. 189

తే. అని సునాసీరుఁ డెఱిఁగింప - ననుమతించి, । కనకనేత్రుండు తత్కార్య - కరణమునకు
సముచితోపాయ వరులైన-సచివవరుల । తోడ నూహించి, పిదప ను-ద్యుక్తుఁడయ్యె 190

(182) 1 దీనం-అన్నిప్ర. (183) * ఈ ప. తీ.ప్ర. లో లుప్తము (184) 1 త్కాల విశేషముచేతనే (ప్రాస?) - మ;త్కాలశేషము - తా,హ; త్కాలముశేషము - ర (187) * ఈ ప.తీ,ప్ర,లో లుప్తము (189) 1 నవనినాథ - 2 యోగ్య - మ,మా,త,తి,తీ,హ,ర,క 3 యోగభూమి - క

## దేవదానవ ద్వితీయ మహా సంగ్రామము

వ. ఆ సమయంబున మహేంద్రాది బృందారక బృందంబు నాకలోక విహారులగు దైత్య వీరులతోడి యుద్ధంబునకు సన్నద్ధంబై వచ్చినం, బెచ్చుపెరిగి, హిరణ్యాక్ష ప్రేరితులై జ్వాలాముఖ కేతుముఖ రుచిక చిత్రకేతు ధూమ్రాక్ష కరాళాక్ష వజ్రదంత సూచీదంత వికట తామ్రకేశ దక్షిణావర్త శంఖ గవయాది రాత్రించర వరులు హస్త్యశ్వ రథ పదాతి సమేతులై, శాత బాణ సంపాతంబున నొప్పించె. అంత, గీర్వాణబలంబు చలంబునం [1]బోక పెనంగినం, బతిత కరి వ్యూహంబును, భగ్నాశ్వ సందోహంబును, గళిత శతాంగంబును, ఖండిత వీర భటోత్తమాంగంబును, నృత్యత్కబంధ శత సంకీర్ణంబును, రక్తప్రవాహ పూర్ణంబును, మేదోమాంస పంకిలంబును, శోణిత పాన మత్త భూత బేతాళ సంకులంబును, గాహళ మృదంగ భేరీ భయద ఘోషణంబును, సర్వలోకైక భీషణంబునై యాయోధనం బద్భుతంబయ్యె. అందు, 191

ఆ. దివిజవరులతోడి - తీవ్ర యుద్ధంబున । విఱిగి దైత్యవరులు - విహ్వలించి,
యమరపురికి నరిగి-యత్తఱిఁ గెఱిఁగింప, । నసురవరుఁడు శక్తి - హస్తుఁ డగుచు, 192

సీ. [1]చిట చిటాయిత కోప - శిఖి శిఖా ఘటనల । దంష్ట్రాయుగము ఘోర - తరముగాఁగ,
నాసా[2]పుటోగ్ర ని - శ్శ్వాస మారుతమునఁ । గోరమీసమ్ములు - [3]గొకురుపొడువ,
భ్రుకుటీ వినిర్మాణ - వికృత పక్ష్మంబులఁ । దీక్ష్ణ నేత్రంబులు - దిరుగుపడఁగ,
నఖిలలోక భయంక - రాట్టహాసంబున । బ్రహ్మాండభాండ క - ర్పరము వగులఁ,
తే. బాదఘట్టన నద్రులు - భగ్నములుగఁ, । గాయదీప్తుల దిశలు చీఁ - కట్లుగొనఁగ,
యుద్ధమున కేఁగె [4]సర్వస-న్నద్ధుఁడగుచుఁ । జటుల విస్ఫూర్తి దానవ-చక్రవర్తి. 193

**చ. మృగపతి సింధురంబుల న - మేయ నఖాహతి సంహరించిన**
**ట్లగణిత బాహుదర్ప సము - దంచితుఁడై, సురరాజు గుండియల్**
**వగులఁగఁ, జక్ర కుంత శర - పట్టిస శూల ముఖాయుధంబులం**
**దెగి వధియించె, దైత్యులు ను - తింప నకంపితలీల నత్తఱిన్.** 194

చ. అమరులు తన్మహారణము - నందు, సువర్ణవిలోచన ప్రతా
పమునకు నోర్వలేక, మదిఁ - బాయనిభీతిఁ గలంగి, యాత్మ వి
క్రమములు వీటిఁబోఁబఱచి, - కాంచన భూధరరాజ[1] తుంగ శృం
గము తుదఁ జేరి నిల్చిరి, య - ఖండ తదీయ వనాంతరంబునన్. 195

(191) 1 బోర-త (193) 1 చిటపటాయిత - తి; చిటగిటాయిత - హా, ర 2 పుటాగ్ర - మా, త 3 గొగురు - తీ; గొరుకు - తా, హా; కుకురు - త 4 గర్వ - మ, త, తి, తీ, ర, క (195) 1 భవ్యశృంగ - తీ; శృంగముల్లుమురుగఁజేరి (యతి?) - హ

హిరణ్యాక్షుఁడు వసుంధర నుత్పాటించి సముద్రమున వైచుట

క. సురగిరిఁ జేరిన దివిజుల । హరియింపఁ దలంచి, దాన - వాధీశ్వరుఁ [1]డు
ద్ధురలీల నార్చె, నాశా । కరి కర్ణపుటీ కుడుంగ - కంబులు వగులన్. 196

వ. ఇట్లట్టహాసంబు చేసి, హిరణ్యాక్షుండు సకల దేవతా నాశ[1]కరణాపేక్షుండై యాక్షణంబ, 197

చ. నిరుపమ [1]హుంకృతి ధ్వనులు - [2]నింగికిఁ బర్వ, నఖర్వ కోప వి
స్ఫురణ కరాళనేత్రుఁ డగు - చున్, భయ మింతయు లేక, మేరుభూ
ధర సహితంబుగాఁగ వసు - ధాతల ముద్ధతిఁ బెల్లగించి, సా
గరమున వైచె బాహు బల - గర్వ మెలర్పఁగ, నిట్లు వైచినన్, 198

క. సాధ్వసమున దివిజులు హా । హా! ధ్వని యొనరించి, రమ్మ - హాబ్ధియుఁ దత్పా
త ధ్వస్త జలచరంబై । సధ్వానం బగుచుఁ గలఁగి - చలితం బయ్యెన్. 199

క. వడి చెడక తద్వసుంధర । బుడబుడమని కడలి నడుమ - [1]బుగ్గలు [2]వొడమన్
బడి, మునుఁగునపుడు జగములు । వడవడ వడఁకంగఁ దొడఁగె-[3]వసుధామర్త్యా! 200

ఆ. అంత, నాక్షణం[1]బ - యఖిల జగత్పాల । న క్రియాపరుండు - చక్రధరుఁడు,
జలధిమగ్న సర్వ - సర్వంసహాతలో । ద్ధరణమునకు నాత్మ - దయ దలిర్ప, 201

యజ్ఞవరాహావిర్భావము

సీ. ఆమ్నాయములు చర - ణారవిందములుగా, । రవి సుధాకరులు నే - త్రములుగాఁగ,
గంధవాహ స్ఫూర్తి - కర్ణ యుగ్మంబుగా, । శివ పద్మభవులు దం - ష్ట్రికలుగాఁగ,
నుగ్రానలంబు ఘో - ణాగ్ర భాగంబుగా, । జలధరంబులు సటా - చ్ఛటలుగాఁగఁ,
గాకోదరేంద్రుండు - కఠిన వాలంబుగాఁ, । గాలంబు గమనవే - గంబుగాఁగ,

తే. యజ్ఞరూపంబుతోడ బ్ర - హ్మాండమెల్లఁ । దానయై నిండి, సుర లద్భు - తంబు నొంద,
డిందిరా-ప్రాణవిభుఁడు, । రాక్షసధ్వంసి, యాదివ-రాహ మయ్యె. 202

డేయునకు రోమశుం డెఱింగించినయత్తెఱంగు. 203

---

[1] (ప్రాస?) - మా (197) 1 కరుణాపేతుండై - క (198) 1 హింకృతి - మ,మా,త,తా (200) 1 బుడగలు - అని యుండిన నను ప్రాసశోభ యతిశ
న్ - క 3 వసుధామాత్యా - మ,మా (201) 1 బునందు-మ,తా,తి,తీ,ర,హా,క

(182) తో
(ప్రాస?) -
(189) 1 నవసి,

## ఆశ్వాసాంత పద్య గద్యములు

శా. *చర్యావార్య మహత్ప్రియవ్రత పరా! - శౌరిక్రియా [1]చక్రగా!
వర్యారాధ్య హరి[2]స్ఫురన్మత! భుజ - వ్యాకృష్ట వైరిప్రభా!
ధుర్యాహంకృతి [3]సూక్తి మన్నుత జయ - ద్భ్యాతిక్రమా[5]తంద్రకా!
కార్యాలోచన భావ బుద్ధి[6]ధుతరా - గా! కీర్తి[7]భామోత్సుకా! 204

క. *రాకా శశాంక హరి తా । రాకాశతరంగిణీ పు - రారాతి హిమా
నీ కాశ కుంద చందన । నీకాశ యశోఽభిరామ! - నృప[1]నయధామా! 205

మాలిని. సతత విహిత దానా! - సత్యభాషా నిదానా!
[1]పతిహిత గుణ ధుర్యా! - పండితాశ్చర్య [2]చర్యా!
గత దురిత సమాజా! - గంగమాంబా తనూజా!
మతి విభవ కలాపా! - మంత్రి పుంద్రేక్షుచాపా! 206

## గద్యము

ఇది శ్రీహనుమత్కరుణా వర ప్రసాదాసాదిత సారస్వతనిరాతంక, చంద్రనామాంక రామవిద్వన్మణి తనూజాత, అష్టఘంటావధానపరమేశ్వర బిరుద విఖ్యాత, హరిభట్ట ప్రణీతంబైన వరాహపురాణంబునం గైవల్యఖండంబను పూర్వభాగంబునందు ద్వితీయాశ్వాసము.

---

(204) * చక్రబంధము. 1 చక్రిగా - మ 2 స్మరన్మత - క 3 శుక్తి - మ,తా 4 మన్నదయి తద్భూతి - హ,ర,క;మన్మచయిత - తి 5 రప్రకా - తి,హ,ర 6 ద్రుత - త;మతి - హ;మత - మ, మా,తా,తి,తీ,ర,క 7 భావోత్సుకా - తా;కావోత్సుకా-తీ;ధామో-క;భౌమో-ర (205) * ఈ ప.తీ.ప్ర.లో లుప్తము. 1 దయ - మ,తా,హ,ర,క (206) 1 ప్రతి - మా 2 ధుర్యా - మ,హ,ర,క;ధైర్యా - తా; భర్యా - త

# తృతీయాశ్వాసము

క. శ్రీకర కీర్తివరారో । * హా కేళీ మందిరాయి - తాజాండ వధూ
లోక విలోక చకోర ని । శాకర! కొలిపాక యెఱ్ఱ - సచివ[1]వరేణ్యా! 1

వ. అకర్ణింపుము. రోమశుండు మార్కండేయున కిట్లనియె. 2

**ఆదివరాహమూర్తి భీషణ విహారము**

ఆ. అమహా వరాహ - మత్యంత భీషణ । దేహ మమర, దళిత - దిక్క మగుచు,
జానుదఘ్న సప్త - [1]సాగర జలములఁ । గలఁచి, పంకిలములు - గా నొనర్చె. 3

సీ. ఘనతర ఘోణాగ్ర - మున నొక్కచో ధాత్రి । ఘుర్ఘుర ధ్వనులతోఁ - [1]గుద్దలించుఁ,
బాదుగా నిల్చి సం - భ్రమమున నొకచోటఁ । గొనవెంట్రుకలు నిక్కఁ - గొప్పరించుఁ,
గఠిన వాలము బెట్టు - గాఁ[2]దీసి యొకచోటఁ । గడిమిమై రొప్పుచు - గద్దరించు,
భూరి [3]దంష్ట్రా టంక-ముల గ్రుచ్చి యొకచోట । నగముల నడువీథి-కెగురఁజిమ్ముఁ,
తే. చరణఖుర ఘట్టనంబుల - జలధిమధ్య । జంతుజాలంబు నొకచోట - సంహరించు,
దుష్టశిక్షణ [4]భక్తివి - శిష్ట రక్ష । ణాకులంబైన యమ్మేటి - యేకలంబు. 4

వ. ఇట్లు బహుప్రకారంబుల విహారంబు సల్పి, జగదాభీలం బగుచున్న యయ్యాది [1]కోలంబుఁ గనుంగొని, హిరణ్యాక్షుండు రోష కషాయితాక్షుండగుచు, సింహనాదంబుల దిగ్వేదండంబుల బెండుపడం జేయుచు డగ్గఱి, 5

**హిరణ్యాక్షుఁడు వరాహమూర్తిని దాఁకుట**

శా. కోపోద్రేక కరాళభావమున ర - క్షోవల్లభుం డార్చి, లీ
లాపోత్రిం గర శాతఖడ్గహతి ను - ల్కంజేసి, తద్ఘోర దం
ష్ట్రా పాతంబున కోహటించి, నిశితా - స్త్రంబుల్ ప్రయోగించి, మా
యా పాండిత్యము చూపినం, గనలి బ్ర - హ్మాండంబు ఘూర్ణిల్లఁగన్, 6

---

(1) * ఈ పా. తి,ర.ప్ర. లో లుప్తము; హాకృత నిరత పరిరంభ యాశ్రితకవిరాళ్ళోకవిలోక-తీ
1 కుమారా - క (3) 1 సాగరీ - మ, మా (4) 1 గుండలించు - మా,త 2 వీచి - ఘా, పూ, ర
3 దంష్ట్రోదగ్ర - తి 4 శిష్ట - తీ (5) 1 క్రోడంబు - క

చ. ఘన[1]తర ఘోషవేగమగు - గర్జిత మూర్జితభంగి నింగి దా
ర్కొనఁగొనగొల్పి, తాపమును - గోపము నొక్కట ముంపుచుండ మీఁ
దను దనుజేంద్రుపైఁ జనిన - తత్క్షణ మా క్షణదాచరుండు నిం
పునఁ బునరస్త్రవర్షమున - ముంచె నుదంచితలీలఁ [2]గోలమున్. 7

క. వాలమ్మున నా దైత్యుని । వా లమ్ములు దాఁకకుండ - వడిఁ జదియుచు నా
కోలమ్ము [1]గవిసె జిత కా । కోలమ్మగు రోషవహ్ని - గొబ్బున నిగుడన్. 8

చ. కవిసినఁ, [1]గ్రేళ్ళుదాఁటి మదిఁ - గంపము లే కసురేంద్రుఁ డంబికా
ధవ వర లబ్ధమైన నిశి - తంబగు శూలము వైవఁ, దత్కిటి
ప్రవరుని చెక్కు నాటి, కను - పట్టె నిశాచరరాడ్వ్యధార్థమై
చెవికడఁ [2]జేరి, మంతనము - చెప్పఁగ నిల్చిన భాతి నందమై. 9

వ. ఇట్లు నక్తంచరప్రయుక్తంబై, నిజ కపోల పాలికా సక్తంబైన యాభీలంబగు శూలంబు నేలంబడ విదిర్చి, కోపాటోపంబున, 10

### హిరణ్యాక్ష సంహారము

ఉ. ఆదివరాహ మప్పు డమ - రాహితుఁ గూలఁగఁ దూఁటి, తీక్ష్ణ దం
ష్ట్రా దళితాంగుఁజేసి, నవ - రక్త కదుష్ణ తదాంత్ర మాలికా
చ్ఛేదము లంబరమ్మునకుఁ - జిమ్ముచుఁ గ్రీడయొనర్చె, రాక్షసుల్
మోదవిహీన భావమున - ముందఱగానక తల్లడిల్లఁగన్. 11

### వరాహమూర్తి వసుంధరను దంష్ట్రాగ్రమున నుద్ధరించుట

చ. దురమున లోకకంటకుని - దుర్మదు నిట్లు వధించి, యామినీ
చర నివహంబునెల్ల యమ - సద్మముఁ జేరఁగఁ[1]బంచి, మేరుభూ
ధర పుర దేశ కానన వి - తాన ధురంధరయైన యా వసుం
ధర నురు దంష్ట్రికాగ్రమునఁ - దాల్చి, పయోనిధిమీఁది కెత్తినన్, 12

క. విమలంబై తద్దంష్ట్రా । గ్రమునన్, భూదేవి మృత్తి - కా తను ఖండ
క్రమమునఁ జాలఁగ నొప్పెను । సుమనస్సంఘంబు లెల్లఁ - జోద్యంబందన్. 13

---

(7) 1 ఘనరోషవేష - మ,మా 2 గ్రోడ - క (8) 1 గదిసె - మ,త,తా, తి, తీ, హ, ర, క
(9) 1 గెల్లుదాటి - అన్ని ప్ర. 2 నిల్చి - ర (12) 1 బుచ్చి - ర

క. కిరివర దంష్ట్రా దండో । పరిభాగము [1]నందు నాత-పత్రము కరణిన్
ధరణీచక్రము తనరెను, । సురశైలము పసిఁడిగుబ్బ - చొప్పున నొప్పెన్. 14

వ. ఇవ్విధంబున లీలాకోల దంష్ట్రాగ్రస్థాన సమాసీనయగు భూదేవి యా దేవదేవుని
నిట్లని స్తుతియించె. 15

భూదేవి కృత వరాహ స్తుతి

శా. శ్రీరాజన్ముఖపద్మ! దేవపటలి - సేవ్యాంఘ్రి విభ్రాజితా!
దూరాపాస్త సమస్తదైత్య! సుమనో - దుఃఖార్తి విచ్ఛేదనో
దారస్వాంత! జగత్త్రయైక నిలయా! - దాక్షిణ్యపాథోనిధీ!
ఘోరాకారహిరణ్యలోచనహర! - క్రోడావతారోజ్వలా! 16

క. హర భాస్కర శేషఫణీ । శ్వర వాణీవరుల కైన - వశమే పొగడన్?
నిరుపమ నిర్మల నిశ్చల । నిరవధికము లైనయట్టి - నీ [1]సుగుణములన్. 17

క. సనకాదియోగి మానస । వనజంబులయందు, భాగ - వతులందు, సుధా
శనకోటియందు నుందువు, । నిను వినుతింపంగఁ దరమె - నీరజనాభా! 18

క. కొందఱు శూన్యం బనియును, । గొందఱు తేజస్స్వరూప - గుణనిధి యనియున్,
గొందఱు కాలంబనియును । సందెఱుఁగక తలఁతు రుదిత - సందేహమునన్. 19

క. అణువులలోఁ బరమాణువు, । ప్రణుతింప మహత్తులందుఁ - బరమమహత్తై,
గణనకునెక్కు జగత్కా । రణ[1]మగు నీ [2]పెంపు యింది - రాహృదయేశా! 20

చ. నతమతి నీ గుణస్తుతి యొ - నర్చిన యా శ్వపచుండు సర్వపూ
జితుఁడగుఁ, దావకాంఘ్రి సర - సీరుహభక్తి విహీనుఁడై చతుః
శ్రుతి పఠనంబుచేసిన [1]వి - శుద్ధకులోద్భవుఁడైన నంత్యజ
ప్రతిముఁడగున్, జగత్త్రితయ - పావనకీర్తన! పుణ్య[2]వర్తనా! 21

క. అకృతప్రయత్నుఁడై తను । వికృతిం బ్రాపించునపుడు - 'విష్ణో'! యనుచున్
నక్క[1]దుచ్చరణము చేసినఁ । బ్రకృతిగుణ విరహితుఁడగును - బతితుండైనన్. 22

---

(14) 1 నంటి - తి,తీ,హ,ర,క (17) 1 నామములన్ - త (20) మునుదీపింపదిందిరా-తీ
2 పెంపుయిందిరా - తీ.కంటెభిన్న ప్ర. (21) 1 విశిష్ట (యతి?) - తీ 2 కీర్తనా - మ,మా,త,తా,తి,తీ,
హ,ర (22) 1 దుత్స్మరణ - తి,తీ,హ,ర

శా. వేదార్థంబులు వేఱుగాఁ [1]దెలిసి, దు - ర్విజ్ఞాను లాత్మేశ్వరా
భేద ధ్యాన సమేతులై, తుది భవ - త్ప్రీత్యర్థమై కర్మముల్
మోదంబొప్పఁగఁ జేయనేరక, మహా - మోహాంధులై యుందు రం
తాది వ్యాప్తి విహీన సంసృతి సము - ద్రాంత ర్నిమగ్నాత్ములై. 23

సీ. మాధవ! నీనామ - మంత్రామృతము జిహ్వ । కుత్తుకబంటిగాఁ - గ్రోలువారుఁ,
గమలాక్ష! నీకథా - గంగాంబువులఁ దోఁగి । కలుషపంకము వాయఁ - గడుగువారుఁ,
బరమేశ! నీ[1]భక్తి - భజన నిక్షేపంబు । దొరకిన నుబ్బి మై - మఱచువారు,
బలిభేది! [2]నీకుఁగా - నిలఁ గర్మ పృథురత్న । వితతి సంప్రీతి న - ర్పించువారుఁ,

తే. త్రిదశవందిత! భవదీయ - పదసరోజ । సీమ నిజ చిత్తభృంగంబుఁ - జేర్చువారు
వరుసఁ గ్రీడింతు రానంద-భరితులగుచుఁ । బుష్పసాయకజనక! నీ-పురవరమున. 24

సీ. శ్రీబీజ భువనేశ్వ - రీబీజములు రెండు । బిందు యుక్తములుగాఁ - బ్రేమ నిలిపి,
నెఱి, మహా[1]దేవాయ - పరమాత్మనే వరా । [2]హాయని వేదరూ - పాయ యనిన,
నేకవింశాక్షరం - బై కోలదేవతా । కంబగు మంత్రరా - జంబు వొడము,
నిట్టి నీమంత్రంబు - నింపుతోఁ బ్రణవాది । కమును, [3]స్వాహాంతంబు - గా జపించి,

తే. భక్తి నశ్వత్థ సమిదా జ్య - పాయసములఁ । బావకుని దన్పి మంత్ర[5]త-ర్పణ మొనర్చి,
భూమిసురభోజనము పెట్టి-పొలుచునట్టి । మానవుం డేలు, నీ మహీ-మండలంబు. 25

క. వినుమీ మంత్రంబునఁ జం । దన [1]మభిమంత్రించి ఫాల - తలమునఁ దాల్పన్,
జన వనితా శతయుత భూ । ధన లాభము గలుగు, విమత - దర్పము[2]నణఁగున్. 26

క. ఏతన్మంత్ర పరాయణ । తాతిశయంబున మనుష్యుఁ - డైహిక భోగో
పేతుఁడయి కాంచుఁ బిదప స । నాతన భవదీయ పట్ట - ణస్థితి సుఖమున్. 27

క. అగణిత బాహు పరాక్రముఁ । డగు కనకాక్షుని వధించి - యఖిల జగంబుల్
మగుడంగ నుద్ధరించితి । [1]వగజానుతపుణ్యనామ! - యహితవిరామా! 28

---

(23) 1 దలఁచి - తి,తీ (24) 1 భక్త - మా,త 2 నీకుఁగప్పంబుగా నిజకర్మ పృథు రత్నవితతి నర్పించువారు - మా,త,తా (25) 1 దేహాయ - మ మా,త,హ,ర,క 2 హాయయని(?)-క 3 స్వాహాస్వధాంతమునుగాఁగభక్తి - తా 4 ద్యుపాయసముల - తి,తీ,హ,ర,క 5 రక్షణ (యతి?)-మ,మా,తి,తీ (26) 1 మునుమంత్రించి-త 2 మహేశా - తీ; నాగున్ - తి,హ (28) 1 నగ జాసుత (యతి?) - మా

మ. అని విశ్వక్షితికామినీమణి వరా - హాకారుఁడై యున్న శ్రీ
వనితానాథుని, వేదవేద్యునిఁ గృపా - వార్ధిం బ్రశంసించి, త
ద్ఘనదంష్ట్రామయ[1] దివ్యపీఠమున ను - త్సాహంబుతో నిల్చెఁ, బు
ణ్యనదీ సాగర తీర్థ పర్వత వనీ - నానార్థ సంయుక్తయై. 29

ఉ. అంబుజనాభుఁడిట్లు కిటి - యై ధరణీతల ముద్ధరించి, యిం
ద్రుం బరమానురాగమునఁ - దొంటి[1]గతిన్ సురలోక రాజ్యపీ
ఠంబున నిల్పెనంచుఁ బ్రక - టంబుగఁ జెప్పిన రోమశున్, సమ
గ్రంబగు భక్తిఁ గన్గొని, మృ - కండుతనూజుఁడు పల్కె వెండియున్. 30

క. ఏకర్మము శ్రుతి [1]సమ్మత? । మేకర్మము మోక్ష[2]లబ్ధి - హేతువు? దురితం
బేకర్మమువలనం దెగు । నాకర్మము నాకుఁ దెల్పు - మార్యలలామా! 31

వ. *అని పల్కిన మార్కండేయమునీశ్వరునకు రోమశుం డిట్లనియె. 32

క. నీయడిగిన యీ యర్థమె । తోయజభవు నడుగ నార - దునకును వాణీ
నాయకుఁడు మున్ను కర్ణర । సాయనముగ నొకటి చెప్పె - నది విను మనఘా! 33

## నలినాసన నారద సంవాదము

సీ. నారదుం డొకనాఁడు - నలినాసనుని పొలి । కరిగి, తద్దివ్య స - భాంతరమున
నుచితాసనంబున - నుండి, కేలుమొగిడ్చి, । మహనీయ మోక్షధ - ర్మంబు లెవ్వి?
యని ప్రశ్నచేసిన, - నఖిలార్థ తత్త్వజ్ఞుఁ । డైన వాణీశుఁ డి - ట్లనుచుఁ బలికె,
నాదివరాహ దం - [1]ష్ట్రాగ్ర సంస్థాయిని । యైన భూదేవి తో - [2]యరుహనాభుఁ

తే. బ్రస్తుతింపుచు మోక్షధ - ర్మముల నడుగ । నా మహాపోత్రి ధాత్రికి - నాదరమునఁ
దెలిపినట్టి తెఱంగు నేఁ - దేటపఱతు । నిరవుమీఱంగ విను మది - యెట్టిదనిన. 34

మ. అసురాగ్రేసరుఁడై తనర్చిన హిర - ణ్యాక్షుండు హేమాద్రితో
వసుధాచక్రము నబ్ధిలో మునుఁగవై - వం, జక్కి వారాహగా
త్ర సమేతుండయి యుద్ధరించె మును, త - ద్దంష్ట్రా నమాసీనయై
పొసఁగన్ భూసతి యిట్లనుం బ్రణుతి వా - క్పూరంబుగా శౌరికిన్. 35

---

(29) 1 రత్న - మ,త,తీ,హ,ర,క (30) 1 మతిన్ - మా (31) 1 సమ్మతియే - మ,మా,త 2 లబ్ధి - అన్ని ప్ర. (32) * ఈ వ. తీ. ప్ర. లో లుప్తము. (34) 1 ష్ట్రాసనస్థాయినియైన భూదేవి యంబురుహనాభు (యతి?) - మ, త, క, తీ 2 వనజనాభు (యతి?) - తా

## మోక్షప్రదమగు భాగవతధర్మ నిరూపణము

ఆ. వనజనాభ! భాగ - వత ధర్మ మెయ్యది? । [1]వలయు చిహ్న [2]మెద్ది - వైష్ణవులకు?
మనుజుఁ డేమిమూల-మున ముక్తిఁ బ్రాపించు? । నానతిమ్ము వీని-నాదరమున. 36

వ. అని పలికిన భూదేవికి భూదారవల్లభుం డిట్లనియె - నని రోమశుండు మార్కండేయుం గనుంగొని, 37

తే. [1]కర్మభూమి సమస్తలో - కములయందు । వసుధ, యాధాత్రిపై భాగ - వత విశిష్ట
ధర్మ మబ్జాక్షు చరణ ప-ద్మ[2]స్తవంబ, । యది యొనర్చిన నరుఁడు త-త్పదము గాంచు. 38

క. [1]నిర్మలబుద్ధులు, సుజనులు, । ధర్మజ్ఞులు, [2]సత్యరతులు - దానాఢ్యులు, స
త్కర్ములు, నరయఁగ వైష్ణవు । లర్మిలిఁ బొందుదురు వీరు - హరిమందిరమున్. 39

క. హరికి సమర్పితములుగాఁ । బురుషుఁడు కర్మము లొనర్చి - పునరావృత్తిం
బొరయక, వైకుంఠ మహా । పురమున సుఖముండు దివిజ - పూజ్యుం డగుచున్. 40

## కాల స్వరూపము

ఉ. అక్షయపుణ్యమూర్తి, విభుఁ, - [1]డాఢ్యుఁడు, సర్వవి[2]ముండు, పుండరీ
కాక్షుఁడు విశ్వమింతయుఁ ద్రి - యంబున మున్ను సృజించి, మీఁదటం
గుక్షిగతంబుగా మెసఁగు - గొబ్బున స్వీకృత కాల[3]రూపుఁడై
దక్షతఁ దూర్ణనాభము వి - ధంబునఁ దద్భవన ప్రపంచమున్. 41

వ. కావున, సమస్తంబును గాలవశంబుగా నెఱుంగునది - యని యాదివరాహంబు భూదేవికిఁ జెప్పెనని, చతుర్ముఖుండు నారదున కిట్లనియె. 42

ఉ. వాల[1]వృష ప్రకేతు శుక - వజ్ర[2]గురుండు మహాశ్వకేతు శై
వాల కుశ త్రిలోచన సు - పర్ణ రథాఖ్య నృగాది పూర్వ భూ
పాలవరేణ్యు లత్యధిక - బాహుపరాక్రము, లట్టివారుఁ ద
త్కాలముచేతనే తెగిరి - గాదె, తలంప మహీసురోత్తమా! 43

ఆ. వాఁడి సూదిచేత - వనజ దళంబులు । నూఱు కూడఁబట్టి - తూఱఁ బొడుచు
కాల మది క్షణంబు, - క్షణములు పది గూడఁ । గాష్ఠ, కాష్ఠ లేడు - కళ దలంప. 44

---

(36) 1 పరమ - తీ; వెలయు (యతి?) - మ,తా,తి,హ,ర,క 2 తెవ్వి - మా (38) 1 ధర్మ (యతి?) - మ,మా,త,తి,హ,ర,క 2 స్తవంబుయది - అప్ర ప్ర. (39) 1 నిర్మల బుధులున్-తి,తీ 2 సుజనరతులు - తి,తీ (41) 1 డాఢ్యుఁడు త; డార్యుఁడు - తా 2 విభుండు - తా, తి, తీ, ర 3 కూటుఁడై - త (43) 1 వృషాఖ్య - మ; వృషాభి - తా; వృషావ - తి,తీ,హ,ర 2 సురుండు-త

క. ఆ కళ లిరువది గూడ శు । భాకర! యరగడియ యయ్యె. - నవి రెండు మహీ
లోకమున ఘటిక యనుచు వి । వేకించిరి గణితశాస్త్ర - విద్యా[1]చరితుల్. 45

సీ. అవి రెండు గూడిన-నగు ముహూర్తము, ముహూ । ర్తములు ముప్పది దివా-రాత్రమయ్యెఁ,
బదియేను దినములు - పక్షంబు, పక్ష ద్వ । యంబు మాసం, బది - యాఱుఁ గూడ
నయనమై పరఁగు, నా - యయనయుగ్మముఁ గూర్ప । వత్సరంబగు, నట్టి - వర్షశతము
లురవడిఁ బది గూడ - నొక సహస్రంబగుఁ, । జర్చింప శతసహ - స్రములు లక్ష,

తే. యరయ లక్షలు పదిపదు - లైనఁ గోటి, । యట్టి కోటులు ధర నేఁబ - దైన నాకు
నర్ధయామము, విను [1]మంత-నంత నృపతు । లస్తమింతురు[2]కాలసం-గ్రస్తు లగుచు. 46

క. రవి గమనాగమనంబులఁ । బ్రవిమల మానసులు కాల - పరిణామంబున్
వివరింతురు, తద్విరహిత । మవునేనియుఁ దెలియ దస్మ - దాదులకైనన్. 47

క. నాళీకానన దివిష । త్పాలక నృపముఖులు కాల - పరిభూతులు, త
త్కాలమును గెలువ నోపఁడు । కాలాత్మకుఁడైనయట్టి - కమలాధవుఁడున్. 48

వ. ఇట్టి కాలంబు కృత త్రేతా ద్వాపర కలియుగాది భేదంబులం బ్రవర్తించు. ఆ యుగంబులయందు జనులు స్వకులాచార సంయుక్తులై బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్ర రూపంబులఁ జతుర్విధంబులై యుండురు. అందు నగ్రగణ్యులైన భూసురులు [1]బ్రహ్మచారి గృహస్థ వానప్రస్థ యతి భేదంబుల నాలుగు తెఱంగులైరి. ఇంక బ్రాహ్మణజాతీయ ధర్మంబు లెట్టివనిన, 49

**చాతుర్వర్ణ్య ధర్మములు**

సీ. స్నానంబు వేద మా - ర్జవ [1]మమాత్సర్యంబు । దానం బహింస ని - స్తంద్రభావ
మతిథిసత్కారంబు - లగ్నిహోత్రంబులు । సంధ్యాది కృత్యముల్-[2]సర్వసమత
హరిచింతనము సంత - తాచార మక్రోధ । మాస్తిక్య మమృతవా - క్యప్రచార
మాదిత్య[3]సేవ యో - గారూఢభావంబు । పైతృకాచరణంబు - భావశుద్ధి

తే. భాగవతభక్తి కామాది - భంజనంబు । దయయు దాక్షిణ్య మఖిలశా - స్త్రార్థదృష్టి
ప్రాజ్ఞసంగతి సాధువ-ర్తన ముముక్ష । యనఁగ, నివి విప్రధర్మంబు-లనఘచరిత! 50

చ. హరిపదభక్తియున్, దయయు, - నాహవమున్, రిపుభేదనంబు, సు
స్థిరహృదయత్వమున్, [1]విబుధ - సేవయు, దానము, రాజ్యపాలనా
భిరతియు, సింధురాశ్వ రథ - భృత్య సముద్ధరణంబు, నీతిసం
చరణము, మంత్రగోపన వి - చారము నా, నివి రాజధర్మముల్. 51

---

(45) 1 చతురుల్ (?) (46) 1 మందనంత - మ,మా,తా,తి,ర,క; ముప్పైనంత - తీ; మరిదనంత - హ 2 రోగ-తీ(49) 1 బ్రహ్మచర్య - త (50) 1 మహత్సత్యంబు - తీ 2 సరవి - తా 3 శివయోగ మారూఢ - త (51) 1 విబుధ - తీ

ఆ. క్రయము, విక్రయంబు, - ద్రవ్యార్జనము, విప్ర । భక్తి, కరుణ, లాభ - పాటవంబు,
స్నాన దాన నియమ - భూనుతాచారంబు । లరయ వైశ్య¹జాతి - కర్మవిధులు. 52

క. నలినోదర భూసుర ని । శ్చలభక్తియు, స్వామిహితము - శౌర్యము, రిపురా
డ్బలభేదన చాతుర్యము, । దలపోయఁగ శూద్ర ¹విహిత - ధర్మము లనఘా! 53

### విప్రుల విశిష్ట ధర్మములు

తే. ఇట్టివర్ణంబులందు మ - హీసురుండు । సర్వకర్మ సమాచార - చతురుఁ డగుచుఁ
బావనము సేయు నిజ పాద-పద్మరేణు । ఖండ సంయోగమున ధరా-¹మండలంబు. 54

క. పదపంకజ స్థలంబున । నదులును, గరములను వహ్ని, - నగవుల సిరియున్,
హృదయంబునఁ బరమాత్మయు । విదితంబుగఁ బాయకుండు - విప్రులకెల్లన్. 55

క. జననంబున శూద్రునిక్రియ । జనియించి, విశిష్ట కర్మ - సంస్కారవశం
బున గళిత కల్మషుండై । మనుజుఁడు విప్రత్వ మొందు - మౌనివరేణ్యా! 56

సీ. పూర్వజన్మార్జిత - పుణ్యాతిశయమున । విప్రవంశమున నా - విర్భవించి,
జాతకర్మాది సం - స్కార సంయుక్తుఁడై । యనుపమ యోగవి - ఖ్యాతుఁ డగుచు,
దేశికోత్తమ సమా - దిష్ట మార్గమున భి । క్షాభోజియై జటా - చ్ఛటలు దాల్చి,
దండాజినంబులు - ధరియించి మేఖలా । కౌపీన సహితుఁడై -¹కోపముడిగి,

తే. విమలచేతస్కుఁడై వేద - వేది యగుచు, । బ్రహ్మచర్యంబు²చరియించి - పరమనియతి
నావ్రతాంతంబునను గృహ-స్థాశ్రమంబు । స్వీకరింపంగవలయు, ను-ర్వీసురేంద్ర! 57

క. సమ వంశజాత కన్యక । నమిత గుణోదారఁ బెండ్లి - యై, గేహస్థా
శ్రమమున నుండిన విప్రుఁడు । సముచిత కృత్యముల నిత్య - సంతుష్టుండై, 58

మ. కమలాక్షార్చనశాలియై, యతిథిస - త్కారంబు గావించి, యు
త్తమసాధ్వీమణియందు ¹నందనుల ను - త్పాదించి, వర్గత్రయ
క్రమ సౌఖ్యంబులు చెంది, యావెనుక మో - క్షప్రాప్తికి న్మూలకం
ద మనన్మించిన యోగముం దెలిసి, వా - నప్రస్థ సన్మార్గమున్, 59

క. కూరిమిఁగైకొని, ధన సుత । దారాదులయందు నిర్గ - తస్పృహుఁడై, కాం
తార¹మునఁ గందమూలా । హారంబులచేతఁ దృప్తుఁ - డై యటమీఁదన్, 60

---

(52) 1 వరుల - తీ (53) 1 జాతి - క (54) 1 మండలమున - మ, మా, త, తా, తి, క
(57) 1 కోపముడిగి విమలచేతస్కుఁడై - ఈ భాగము మ,త,తి,హ,ర ప్ర. లో లుప్తము; ఘనత
మెఱయ నాదరం బొప్పఁగా - మా 2 భజియించి - తీ; నియమించి - ర; ధరియించి - తి
(59) 1 నుత్తముల - మా (60) 1 భవకంద - మా,త; ఫలకంద - తీ

తే. సర్వ సంగపరిత్యాగ - చతురుఁడగుచు । భిక్షువేషముదాల్చి, ప - ద్మాక్షు చరణ
వనజ నిర్మల భక్తిసా - ధనముగాఁగఁ । జెందునది సజ్జనుఁడు హరి - మందిరంబు. 61

### కర్మయోగ రహస్యము

ఉ. జ్ఞానము కర్మమార్గమున - సంజనితంబగుచుండుఁ, దన్మహా
జ్ఞానవిశేష పూర్వముగ - సజ్జనవర్యులు కర్మలాభమున్
మానకచేసి, తత్ఫలము - మాధవమూర్తికి నర్పితంబుగాఁ
బూనియొనర్చి, విష్ణుపద - భోగము గాంతురు - భక్తియుక్తులై. 62

వ. అట్టి కర్మంబులు నిత్య నైమిత్తిక కామ్య నిషిద్ధంబు లన నాల్గు తెఱంగులయ్యె. అందు సంధ్యా కృత్యంబులు నిత్యకర్మంబులు. సోమసూర్యగ్రహణాది కాలకర్తవ్యంబులు నైమిత్తికంబులు. ఫలవాంఛా సమేతంబులు కామ్యకర్మంబులు. రజస్వలా సంభాషణంబులు నిషిద్ధంబులు. వీనిలోనం గామ్య నిషిద్ధ కర్మంబులు పరిత్యజించి, నిత్య నైమిత్తికంబులు భగవత్ప్రీతిగా నాచరింపవలయు. 63

క. ఫలవాంఛ చేసి నిత్యా । దులు భూసురుఁ డాచరించి, - దుఃఖాకరుఁడై
యిలఁ బలుమరు జనియింపుచు, । బలవత్సంసారవార్ధిఁ - బడును మునీంద్రా! 64

క. హరినామ కీర్తినంబును । హరిపూజా కరణ[1]రతియు - హరిభక్త జనా
దరణంబును గావించిన । నరుఁ [2]డేఁగును విష్ణుపదము - నకు మునినాథా! 65

### విష్ణుపూజా క్రమము

క. ఆలేఖ్య లోహ లేపిత । శైల మనో రత్న [1]దారు - సైకత కృత ల
క్ష్మీలలనేశ ప్రతిమా । జాలములో నొకటిఁ బూన్పఁ - జను మనుజునకున్. 66

వ. తత్పూజాప్రకారం బెట్టిదనిన, 67

సీ. స్నానపూర్వకముగా - సంధ్యాదు లొనరించి, । గోమయ పరిలిప్త - భూమియందు
రంగవల్లీ క్రియా - రమ్య మండపమున । భాసురపీఠంబుఁ - బాదుకొల్పి.
పద్మాలయాధవ - ప్రతిమ నచ్చట నిల్పి, । తన్ముఖాసీనుఁడై - తలఁపు గిలిగి.
యందు లక్ష్మీనాథు - నావాహనముచేసి, । క్రమమున నర్ఘ్యపా - ద్యము లొసంగి,
తే. సరస చందన మలఁది పు-ష్పముల నించి । భక్తి మెఱయంగ ధూపదీ-పము లొసంగి,
బహువిధాన్నంబు లర్పించి-ప్రస్తుతించి, । తగు నొనర్పఁ బ్రణామ ప్ర-దక్షిణములు 68

(65) 1 గతియు - మ 2 ధరుగను - తీ (66) 1 ధాతు - తా, తీ

క. పావన సాలగ్రామ శి । లావిధిఁ దాఁ బాయకుండు - లక్ష్మీరమణుం
డా విమలోపలమున హరి । కావాహనవిధి యొనర్చు -[1]టనుచిత మనఘా! 69

వ. అనిన యా శారదాభర్తకు నారదుం డిట్లనియె. 70

క. సాలగ్రామ విశిష్ట శి । లా లక్షణ మెద్ది? యందు - లక్ష్మీరమణుం
డేలీలఁ బాయకుండును? । బోలఁగ నా కానతిమ్ము - భువనస్తుత్యా! 71

ఉ. నావుడు పద్మసంభవుఁడు - నారదసంయమి కిట్లనున్, మహీ
దేవికిఁ [1]గోలమూర్తి యగు - దేవుఁడు మున్నెఱిఁగించెఁ, [2]దచ్ఛిలా
పావన లక్షణక్రమము - భక్తిదలిర్పఁగ నీకు నా తెఱం
గే వివ[3]రింతు, విన్ము భవ - దీరిత పృచ్ఛకు నుత్తరంబగున్. 72

## పావన సాలగ్రామ మాహాత్మ్యము

క. హిమశైల గండకీ మ । ధ్యమ భాగము[1]నందు యోజ - నాయత విస్తా
ర మనోజ్ఞంబై కలదొక । యమల క్షేత్రంబు హరికి - [2]నాశ్రయ మగుచున్. 73

క. అన్నెలవునఁ బొడమిన శిల । లన్నియుఁ జక్రాంకితంబు - లై శుభదములై
సన్నుతికెక్కుచునుండుఁ బ్ర । సన్న రుచి స్ఫురణ గలిగి - సంయమివర్యా! 74

చ. అనుపమపుణ్య[1]శిల! విను - మద్భుత మచ్చటఁ బెద్దనిద్రకున్
గనుగవమూసెనేని కృత - కల్మషుఁడైనను, శంఖ చక్ర సా
ధనములు బాహుదండములఁ - దాల్చి. జగజ్జన వందనీయుఁడై
తనరుచు, శ్రీహరిం గలయుఁ - దక్షణమంద, యమంద వైఖరిన్. 75

క. శ్రీమత్పుణ్యాకర నిజ । నామంబై, ముక్తికార - ణంబై, తద్ధా
త్రీమండలంబు సాల । గ్రామక్షేత్రం బనాఁగ - గణనకు నెక్కున్. 76

క. అచ్చో నుదయించిన శిల । నచ్చుగఁ బూజించునట్టి - యనఘాత్ముఁడు పా
పోచ్చయ [1]విరహితుఁడై తుద । [2]విచ్చలవిడి విష్ణులోక - విభవముఁ జెందున్. 77

---

(69) 1 ఒర్తంబనఘా - తీ (72) 1 గ్రోడ - క 2 దాశిలా - తి,తీ 3 రించెదన్వినుత్వదీయపుఁ బ్రశ్నకు - తీ (73) 1 నంటి - త 2 నాశ్రమ - తి,తీ (75) 1 కర్మ - మ, తా, తి, తీ, హ,ర,క (77) 1 భయవిరహితుఁడయి - త,మ,హ; మున విరహి - తీ; విరహితుఁ డగుచును - తా 2 విచ్చనవిడి - అన్ని ప్ర.

శా. సాలగ్రామశిలార్పిత ప్రసవమున్ - సద్భక్తి సంపన్నుఁడై
మౌళిం దాలుచు నెవ్వఁడేని యతఁడ - స్మల్లోకముం [1]దాఁటి, జం
ఘాలుండై చని, విష్ణు[2]లోకమున సౌ - ఖ్యంబందుఁ, బద్మాలయా
కేళీసౌధ సమీప కాంచనమయ - క్రీడా నివాసంబునన్. 78

క. ప్రేమదలిర్పఁగ సాల । గ్రామశిలా మధ్యమమునఁ - [1]గదలక యుండుం
దామరసాక్షుఁడు, గావున । నామణి పూజార్హమయ్యె - నమరమునీంద్రా! 79

మ. లలితజ్ఞానధురీణ! యెచ్చటను సా - లగ్రామరత్నంబు శో
భిలు, నచ్చో దివిజాపగా ముఖ నదీ - బృందంబు వర్తించు, ను
జ్జ్వలతం దచ్చిల [1]యున్నసగ్గడఁ జతు - శ్చాపప్రమాణావనీ
తల మత్యంత పవిత్రమై, సకలతీ - ర్థశ్రేష్ఠమై పొల్పగున్. 80

క. *విలసిత సాలగ్రామో । పల నికటమునందుఁ జక్ర - పాణిని భక్తిన్
నెలకొలిపి, [1]కుముద కమలం । బులఁ బూజయొనర్చునతఁడు - ముక్తిం జెందున్. 81

సీ. విప్రహంతయు, దేవ - విత్తాపహరణుండు, । సతతపరాంగనా - సంగరతుఁడు,
ద్యూత పానక్రియా - దురితానురక్తుండు, । పతితుండు, స్వసృ మాతృ - పాతకుండు,
గురునిందయొనరించు-కుజనుండు, మూర్ఖుండు, । చండాల భామాను-షంగ[1]పరుఁడు,
గో పశు స్త్రీ కుల - ఘ్నుండు, పితృద్రోహి, । నాస్తికుం, డాచార - నయ విదూరుఁ

తే. డైన, నుపవాస నియతుఁడై - హరిదినమునఁ । బొనఁగ శ్రీమూర్తి విప్రున-కొసఁగెనేని
పుష్కరారూఢుఁడై సర్వ-పూజ్యుఁ డగుచు । విష్ణుసాయుజ్య[2]మును బొందు-విమలచరిత!

శా. సాలగ్రామము దానమిచ్చి నరుఁ డీ - సంసారదావానల
జ్వాలాంతఃపతితుండు గాక, వసుధా - సౌఖ్యంబులం బొంది, ది
వ్యాలంకారసమేతుఁడై, నిజ శరీ - రాంతంబున న్విష్ణుతే
జోలీనత్వము నొందుఁ, దూఱఁ డతఁ డి - చ్చో మాతృగర్భాటవిన్. 83

చ. హరికి సమర్పితంబగు వ - రాన్నమ యొండె, ఫలంబ యొండె, భా
సుర [1]సలిలంబ యొండె, చవి - చూచిన, నెట్టిదురాత్ముఁడైనఁ ద
త్పరముపదంబు నొందు; విను - పంకజనాభున కర్పితంబులై
పరఁగని వస్తువుల్, శునక - [2]పాచక మాంస సమంబు లారయన్. 84

(78) 1 జెంది - మూ 2 గేహమున - మ, మూ, త, తా, హ, ర (79) 1 గడయక - మా (80) 1 యందు - తీ (81) * ఈ ప. తీ. ప్ర. లో లుప్తము 1 నీలకమలం - మా, త (82) 1 రతుఁడు - తి,తీ; చరుఁడు - హ,ర 2 మందును - తీ (84) 1 పరవస్తువొండె - తీ 2 పాదజ - మ, మా,త,తా;పాచిక - తి,తీ,హ,ర,క

క. కావున భక్తిసమేతుం । డై, విప్రుఁడు నిజ కులోచి - తాచారపరుం
డై, వర సాలగ్రామ । శ్రీవల్లభమూర్తిఁ బూజ - సేయఁగవలయున్. 85

క. ప్రతిదినమును శ్రీమూర్తి । స్థిత తీర్థము గ్రోలునట్టి - ధీరుఁడు, పితృసం
యుతుఁడై హరిభవనంబున । వితతానందంబు ననుభ - వింపుచు నుండున్. 86

వ. అట్టి సాలగ్రామంబులయందు గుణసమేతంబులగు కొన్ని మూర్తిభేదంబుల నాది వరాహంబు భూదేవి కెఱింగించె. తత్క్రమంబు వినుము. వాసుదేవానిరుద్ధ నారాయణ పరమేష్ఠి కపిల నారసింహ వరాహ కూర్మానంత హయగ్రీవ వైకుంఠ శ్రీధర వామన ప్రద్యుమ్న సంకర్షణ చక్రనాభి మత్స్యో గ్రనారసింహ పరశురామ శ్రీరామ శ్రీకృష్ణ జనార్దన లక్ష్మీనారాయణ దధివామనంబులు పూజాయోగ్యంబులు. వీనియందు సంకర్షణమూర్తి క్షత్రియులకుఁ, బ్రద్యుమ్నమూర్తి వైశ్యులకు, ననిరుద్ధమూర్తి శూద్రులకును గరస్పర్శన పూర్వకంబుగాఁ బూజనీయంబులు. మఱియుం బూర్వోక్త మూర్తిభేదంబులయం[1]దతిశ్యామలంబు రోగకరంబును, కృష్ణవర్ణంబు కీర్తికరంబును, పీతవర్ణంబు ధనకరంబును, నీలవర్ణంబు లక్ష్మీప్రాప్తికరంబును, పాండువర్ణంబు సంపన్నాశకరంబును, రక్తవర్ణంబు రాజ్యకరంబును, గపిలవర్ణంబు పత్నీహానికరంబును నగు. వీని లక్షణంబులు వివరించెద. ఆకర్ణింపుము. 87

క. ద్వారంబున సమచక్రము । లారయఁ గనుపట్టి ధవళ - మై [1]శుభదంబై
మీఱునది వాసుదేవ మ । నో[2]రమమూర్తి యన వెలయు - నుతగుణనిలయా! 88

ఆ. వెనుకవంకఁ బద్మ - మును, వక్త్రసీమ రే । ఖాత్రయంబు పీత - కాంతి[1]భరము
గలిగి, వృత్తమగుచుఁ - గనుపట్టునది యని । రుద్ధమూర్తిగా నె - ఱుంగవలయు. 89

ఉ. ఆయత [1]కాంతిపుంజ సము - దంచితమై, ఘన నీలనీరద
చ్ఛాయఁ దనర్చి, వామగత - చక్రయుగంబును, దక్షిణాంగ రే
ఖాయుతమున్ శుభప్రద ము - ఖంబునునై చెలువొందెనేని, నా
రాయణమూర్తిగా నెఱుఁగు, - రాజిత భక్తిపురస్సరంబుగన్. 90

క. అతిశోభనమై, రేఖా । యతనంబై, పద్మచిహ్న - మై, వృత్త నిజా
కృతియై చూపట్టిన, నా । యతమతి! పరమేష్ఠిమూర్తి - యని తెలియఁదగున్. 91

క. * స్థూలతర చక్రయుగళము । నీల ఘనద్యుతియుఁ గలిగి -[1]నిరత గదారే
ఖాలంకృత మధ్యమ [2]మనఁ । జాలినయది కపిలమూర్తి - సన్మునివర్యా! 92

(87) 1 శ్యామంబు - మా,త,క (88) 1 సుభగంబై - త 2 హర (ప్రాస?) - మా (89) 1 రసము - మ,మా; తరము - తా (90) 1 నీలకాంతిసము - తి (92) 1 నిరతముగదరే-త 2 మున - మ,మా,తా,తి,తీ,హ,ర,క; * తి,తీ ప్ర. లో ఈ ప. తరువాతి (93) ప. అపముగ్రము.

క. పృథు[1]వక్త్రమై, సుచక్ర । ప్రథితంబగు నృహరిమూర్తి, - పరులకుఁ బూజా
గ్రథన మొనరింపరా, ద । శ్లథమానసుఁడైన బ్రహ్మ - చారికిఁ [2]దక్కన్. 93

తే. పంచబిందుక కపిలంబు, - భాసుర త్రి । బిందుయుత నారసింహంబు - పృథుతర ప్ర
యత్నమునఁ బూజ యొనరించు-నర్చకులకు । నపునరావృత్తి ముక్తిదా-యకము లనఘ! 94

తే. శక్తిలింగక మనఁగ దం-ష్ట్రా ఖురాది । కములు గైకొని, విషమ చ - క్రములు దాల్చి
సేవకాభీష్ట దాన ప్ర - సిద్ధమగుచుఁ ; దనరునది [1]కోలమూర్తి స - జ్జనవరేణ్య! 95

క. స్థూలంబై, [1]హాసవమణి । నీలంబై, విబుధవర్ణ - నీయంబై, రే
ఖా లాంఛన త్రయంబై । క్రాలెడునది కూర్మమూర్తి - గౌరవనిలయా! 96

తే. హరిత వర్ణాంకితము కౌస్తు - భాభిశోభి । తంబునై మించి, [1]చరమభా - గంబునందు
వర్తులంబైనయట్టి యా-వర్త మొకటి । యమరఁ గైకొన్నయదియ య-నంతమూర్తి. 97

క. ఎంచఁగ నంకుశ రేఖా । పంచకమునఁ గలితమగుచు - బహు బిందుకమై
మించి, నలుపైనయది విప । రించ హయగ్రీవమూర్తి - ఋషికులతిలకా! 98

క. ఏక సు[1]చక్రము మణి[2]రే । ఖాకము, నంబుజయుతంబు - ఘంటా రేఖా
శ్రీకలిత ద్వారమునై, [1]ప్రాకట వైకుంఠమూర్తి-భాసిలు ననఘా! 99

చ. లలిత కదంబపుష్ప రుచి - లక్షితమై, వనమాలికా సము
జ్జ్వలమయి, రేఖ లైదు చెలు - వంబుగఁ గైకొని, రాజ్యసంపదం
జెలఁగి యొసంగఁజాలునది - శ్రీధరమూర్తి యనంగ నొప్పు; వ
ర్తులతయు, హ్రస్వభావమును - రూఢిగ వామనమూర్తి చిహ్నముల్. 100

క. అతసీ నూతన కుసుమ । ద్యుతియును, విస్పష్ట బిందు - యోగము, రమ్యా
కృతియుఁ, ద్రివిక్రమమూర్తికి । శ్రుతిభాషిత చిహ్నములు య - శోధనవర్యా! 101

తే. చక్రములు రెండు వామపా-ర్శ్వమునఁ గలిగి, । దక్షిణంబున నొకరేఖ-తనరఁ బూని,
వర్ణములు రేఖలును బెక్కు-వరుస మేన । నమరఁ గైకొన్నయదియు న-నంతమూర్తి. 102

క. నీరదవర్ణము, దీర్ఘా । కారంబును, సూక్ష్మచక్ర - కము, బహురంధ్రా
ధారమునై చూపట్టిన । నారయఁ బ్రద్యుమ్నమూర్తి - యన విలసిల్లున్. 103

తే. తాళ లాంగూల చిహ్నముల్-దాల్చినట్టి । యదియుఁ బ్రద్యుమ్నమూర్తియ-యనఁగఁబరఁగు
రక్తవర్ణము దీర్ఘచ-క్రములు నంక । ములుగ సంకర్ష[1]ణాఖ్యాన - మూర్తి తనరు. 104

(93) 1 చక్రమై - మా 2 గణకన్ - క (95) 1 క్రోడ - క (96) 1 వామన - మ,మా,త,
తి,తీ,హ,ర,క (97) 1 చతుర - మ,తి,హ,ర,క (99) 1 రేఖము - క 2 రేఖాంకమో (ప్రాస?)-
అన్ని ప్ర. (104) 1 ణ ధ్యాన - మ,తా,తి,తీ,హ,ర,క

సీ. చక్ర మొక్కటి శిర - స్థ్సలమున ధరియించి । శోభిల్లునది చక్ర - నాభిమూర్తి,
యుభయ పార్శ్వములందు - నొగి మత్స్యరేఖలు । మహిమఁ దాల్చిన యది - మత్స్యమూర్తి,
భూరి వక్త్రమును దం - ష్ట్రారేఖయును గలిగి । [1]నికర పూజ్యము నుగ్ర - [2]నృహరిమూర్తి,
[3]డాపల గంభ్రడగో - ద్దరి దక్షిణమునఁ జె । క్రము[4]గల్గ భార్గవ - రామమూర్తి,

తే. చాప సాయక రేఖలు - సవ్యసీమ । రమణఁ గైకొన్నయది రఘు - రామమూర్తి,
పీతమును గూర్చసన్నిభ - పృథుల చక్ర । కీర్తనీయంబు నగునది - కృష్ణమూర్తి. 105

క. విను, నాలుగు చక్రంబులఁ । గనుపట్టుచు, [1]సేవ్యమాన - కామ్యార్థదమై
వినుతికినెక్కు జనార్దన । మను మూర్తి, సమస్త పూజ్య - [2]మనఘచరిత్రా! 106

క. చారు సమచక్ర యుతము నై । రో రూఢ సువర్ణబిందు - రుచిరము, వనమా
లా రమ్యమునై లక్ష్మీ । నారాయణమూర్తి తనరు - నతసౌఖ్యదమై. 107

తే. * వామ చక్రసమేతంబు - వర్తులంబుఁ । జక్రరేఖాయుతంబును, - జారు ధవళ
వర్ణకలితంబునై, దధి - వామనాఖ్య । మూర్తి శోభిల్లుఁ బహులాభ - మోదకరము. 108

వ. అట్టి మూర్తిభేదంబులయందుఁ గపిలంబును, [1]దర్దురంబును, భగ్నంబు, నతిరూక్షం బును, బహుచ్ఛిద్రంబును, బహురేఖాంకంబును, నిస్తలంబును, స్థూలంబును, నూర్ధ్వ వక్త్రంబును, నధోవక్త్రంబును, బహువక్త్రంబు, నేకవక్త్రంబును, విశాలవక్త్రంబును, బార్శ్వ వక్త్రంబును; వృత్త మాత్రాష్టమ భాగాదిక వక్త్రంబును, భగ్నచక్రంబును, దగ్ధంబును, నతి రక్తంబును, భీషణంబు నగు సాలగ్రామంబు సత్పుత్రాది నాశకరంబు గావునఁ బరిత్యజించి, దోషరహితంబులును, లక్షణసహితంబులు నగు సాలగ్రామంబులు పూజా దాన యోగ్యంబు లుగా నెఱింగి, యంగీకరింపవలయు. 109

తే. ద్వారకాపురి, గండకీ - తటిని, చక్ర । తీర్థ నారాయణక్షేత్ర - దేశ మగము
సంభవస్థానములు మని - సార్వభౌమ! । జగతి హరిమూర్తి వరశిలా - సంఘమునకు. 110

తే. ద్వారకాసంభవం బాయ - తంబు, వర్తు । లంబు గండకీశిల, యున్న - తంబు చూడ
భవ్య నారాయణక్షేత్ర - భవము, చక్ర । తీర్థజాతంబు చక్ర వి - స్తృతియుతంబు. 111

---

(105) 1 గణపూజ గండియుగ్రహరిమూర్తి - తి 2 హరిమూర్తి (యతి?) - మ,తా,తి,హ,ర,క 3 దాపల (ద - డ యతి) - అన్ని ప్ర. ర.పు.; సో దాపల - రఘురామమూర్తి, లుప్తము. 4 గల్గి నది భృగురామమూర్తి - తి (106) 1 సేవ్యమాన - అన్ని ప్ర. 2 మఖిల - తీ (108) * ఈ ప. మ,తి,తీ,హ,ర,క,ప్ర. లో లుప్తము (109) 1 దుర్దరంబు - మ,మా,త,తా

క. ఈ లక్షణములు గలిగిన । సాలగ్రామోత్తమములు - సంసారులకున్
మేలొసఁగుఁ బూజితములై । భూలోకమునందు, విష్ణు-[1]భువనమునందున్. 112

క. వేమఱు సాలగ్రామ శి । లామాత్రము బ్రహ్మచర్య - లక్షణయుక్తుం
డై, ముక్తి గోరు [1]యతికిని । సామర్థ్యము[2]నం భజింపఁ - జను ననఘాత్మా! 113

ఉ. కావున విష్ణుభక్తి మదిఁ - గల్గి, నరోత్తముఁ డంబుసంభవం
బై విలసిల్లు పద్మదళ - మంబువిలిప్తము గానిరీతి, దో
[1]షావిల ఘోర సంసరణ - సంగతుఁడయ్యు, సుతాది మోహ వ
ల్లీ వితతిం దగుల్వడి చ - లింపక, సజ్జన సన్నుతాత్ముఁడై, 114

ఉ. ఉత్తమ మధ్యమాధమ కు - లోద్భవుఁ డయ్యును, సత్యవాక్య[1]సం
గత్తరుఁడై, నిషిద్ధములు - కామ్యములు న్విడనాడి, నిత్య నై
మిత్తిక కర్మముల్ హరికి - మెచ్చుగఁజేయుచు, నన్వయోచితో
దాత్తచరిత్రుఁడై, పరమ - ధార్మికుఁడై, భగవత్ప్ర[2]పన్నుఁడై, 115

శా. సాలగ్రామశిలా స్వరూప హరిఁ బూ - జం దన్పి, తత్పాద తీ
ర్థాళిం గ్రోలి, తదర్పితాన్నముల నా - హారించి, తద్భక్త ర
క్షాలోలుండగుచు న్మెలంగి, జగదా - శ్చర్యంబుగాఁ జెందుఁ, ద
న్నాళీకాక్ష విహార హార జనితా - నందైక భోగంబులన్. 116

వ. ఇంక నొక్క యితిహాసంబుఁ జెప్పెద నాకర్ణింపుము. 117

## చోరోపాఖ్యానము

సీ. పాటలీ పురవర - ప్రాంత దక్షిణసీమ । శేఖరాహ్వయ మగు - శిఖరి గలదు,
తద్గిరీంద్రమునఁ బు - త్ర స్త్రీ సమేతుఁడై । శూరాస్యుఁ డను నొక్క - చోరకుండు
నిలయంబు కల్పించి, - నిల్చి త్రోవలుగట్టి, । నరులఁ జంపుచుఁ దద్ధ - నంబులెల్ల
సంగ్రహింపుచుఁ బాప-సంయుక్తుఁడై, ధేను । మాంసముల్ భుజియించి-మత్తుఁడగుచుఁ,

తే. ప్రతిదినంబును సుత దార-బంధు వితతి । నరసి పోషింపుచును[1]శస్త్ర-హస్తుఁ డగుచుఁ
జౌర్యవిద్యా ప్రవీణుఁడై,-సాహసమున । నుక్కుమిగిలి విజృంభించి-యొక్కనాఁడు, 118

(112) 1 లోకమునందున్ (యతి?)-మా (113) 1 నతనికి-ర 2 సంభవింప-మ,మా,తా,తి,తీ, హా,ర,క (114) 1 షావలి - తీ;షానల (ప్రాస?) - తి;షాఖిల (ప్రాస?) - మా (115) 1 రంగత్తరుఁడై - తి,తీ;తంగత్తరుఁడై - మ,మా,త,తా,హా,క 2 సన్నుఁడై - మ,తా (118) 1 చక్ర - మ, తి, తీ, హా, ర, క

ఉ. కాలము చేరువయ్యె నని - కానక, యాతఁడు తత్పురంబులో
వేలకుఁగల్గి, మీటుగల - విప్రునిగేహముఁ గన్నపెట్టి, తృ
ష్ణా లులితాత్ముఁడై, బలము - చాయ యెఱుంగక సంచరించి, యు
న్మీలితచేష్టితుం డగుచు - మూర్ఛిలి, తోడనె లబ్ధసంజ్ఞుఁడై, 119

క. ఆలో ధనసంగ్రహమున । కై లేచి భయంబు లేక - యా ద్విజుగృహముం
[1]గేల వెరంజుచుఁ జోరుఁడు । సాలగ్రామాభిషిక్త - జలములు గనియెన్. 120

వ. ఇట్లు గనుంగొని, యమందానందంబు నొంది, 121

క. అవి దప్పిదీరఁ గ్రోలిన । యవసరమున, యమునిదూత - లా ఘోరాస్యున్
జవమున డగ్గఱి, [1]పాశ । ప్రవిబద్ధునిజేసి, యాత్మ - పట్టణమునకున్, 122

చ. కొని చనునంతలోనన, ము - కుందునికింకరు లడ్డగించి, త
ర్జన నినదోగ్రలీల సమ - రం బొనరించి, కృతాంతదూతలం
[1]గనుకనిఁ బాఱఁద్రోలి, భుజ - గర్వము దివ్యులు గాంచి మేలుమే
లని కొనియాడఁ, జోరుఁ గొని - యప్పుడ యేఁగిరి చక్రిపాలికిన్. 123

వ. ఇవ్విధంబున సాలగ్రామతీర్థపాన విలీన కల్మష భాసురుండగు చోరుని విడిపించుకొని, వైకుంఠ నగరంబునకుం బంకజోదరుకింకరు లరిగినఁ, గాలదూతలు పరాజయ ఖేద సమేతులై, సమవర్తికడకుం జని యిట్లనిరి. 124

ఉ. దేవరయాజ్ఞ మోచి, జగ - తీస్థలికేఁగి, సమస్త దోషపుం
జావిల మానసుండగు దు - రాత్ముని, జోరుని బట్టితేరఁగాఁ
జేవిడిపించి, యాఖలుని - జేకొని రంబురుహాక్షదాసు లి
చ్ఛావిధి, [1]మున్నువోలె నిఁకఁ - జాగవు తావక భృత్యకృత్యముల్. 125

సీ. అని యిట్లు విన్నవిం-చినఁ, గృతాంతుఁడు రోష । కలితుఁడై త్యక్తాధి-కారుఁ డగుచుఁ,
ద్రిదివంబునకు నేఁగి - దేవతాభర్తకు । నీ కథావృత్తాంత - మెఱుఁగఁజెప్పి,
యతనితోఁ గూడి దు-గ్ధాబ్ధిమధ్యమునకుఁ । జని, శేషశయుని-జలజనయను
దర్శించి, బహువిధ - స్తవములఁ గొనియాడి, । కరములు నిటలభా - గమునఁ జేర్చి,

---

(120) 1 బోలగ వెదకుచు - తీ (122) 1 బహుపాశవిబద్ధునిజేసి యాత్మ సదనంబునకున్- తి,తీ,హా,ర (123) 1 గనుగొని - మా,తీ,హ (125) 1 మున్నవోలె - తీ

తే. తస్కరుని చొప్పు, విష్ణుదూ - తల విధంబు, । నాత్మభృత్యుల కుంతిగా-లైన తెఱఁగు
విన్నవించిన, నిందిరా-విభుఁడు నవ్వి, । యాదరంబున యముని కి-ట్లనుచుఁ బలికె. 126

శా. సాలగ్రామ శిలాభిషిక్త సలిలా - స్వాదక్రియాభీల దం
భోళి ధ్వస్త సమస్త దోషగిరులై, - పుణ్యాగ్రగణ్యాత్ములై
కేళి న్మత్పురి కేఁగుదెంచె దివిజుల్ - కీర్తింపఁ జోడుంచు, ని
వేలా దీనికి నుమ్మలించెద[1]వు నేఁ - డీరీతి వైవస్వతా! 127

వ. ఇంక నొక్క రహస్యంబు చెప్పెద నాకర్ణింపుము. 128

సీ. మత్పాదపూజా స - మాహితులగువారి, । మత్తీర్థములు గోరి - మసలువారి,
మదభీష్ట కైంకర్య - ముదితాత్ములగువారి, । మద్ధ్యానమున మేను - మఱచువారి,
మద్భక్తజన దత్త - నమస్కారులగువారి, । మత్కథ నిరతులై - మనెడువారి,
మన్మార్గ సౌఖ్యంబు - మరగి పొందినవారి, । మత్క్రతుక్రియల నే - మఱనివారి,

తే. శౌర్యమునకైనఁ, గృతవిశే-షమునకైనఁ, । దవిలి మచ్చిహ్నములు మేనఁ-దాల్చువారిఁ
గరుణఁ జేపట్టి వైకుంఠ-పురికిఁ జేర్చి, । ప్రాణతుల్యులుగాఁ జూతు-భానుతనయ! 129

ఉ. కావున నీకు నొక్క హిత - కార్యముఁ జెప్పెద, యింతనుండి మ
త్సేవకమందిరంబులకుఁ - జేరితివేనియుఁ గాఁక వచ్చుఁ జు
మ్మీ! వలదంచు [1]సౌరి నియ - మించి శిరోహితమూర్తియయ్యె ల
క్ష్మీవరుఁ, డంతకుండు నరి - గెన్ బలభేదియుఁ దానుఁ గ్రమ్మఱన్. 130

వ. అదికావున, బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రాది వర్ణజాతులును, [1]బ్రహ్మచర్య గృహస్థ వానప్రస్థ యత్యాశ్రమ సమేతులును, నిజ పూజా యోగ్యస్ఫూర్తులగు సాలగ్రామ శ్రీమూర్తుల నిత్యసన్నిహితుండగు రమాసహితుని నారాధింపవలయును 131

## హరినామ సంకీర్తన ప్రాశస్త్యము

క. యుగములు నాల్గిటిలోఁ గలి । యుగమునఁ గల దొక్క సుగుణ-[1]మోహో! మనుజుం
డగణిత పాతకుఁడయ్యును । సుగతికిఁ జను విష్ణుకథలు - [2]సొంపుగ వినినన్. 132

---

(127) 1 విటెంతేభీతి - తీ (130) 1 శౌరి - అ.ప్ర.ప. (131) 1 బ్రహ్మచర్యాద్యాశ్రమ-తా
(132) 1 మొప్పగమనుజుం - త;యుత్తమమనుజుంసగణిత - హ;మూహింపనటం - క 2 నొప్పగ (యతి?) - మ,ర

సీ. కృతయుగంబున భాగ - వతులకు మారుత । పూరణక్రియల నే - పుణ్య మబ్బుఁ,
త్రేతాయుగంబున - శ్రీవధూవిభుఁ గూర్చి । తప మాచరింప నే - ధర్మ మొదవు,
ద్వాపరంబున యాగ - తంత్రాది కర్మముల్ । జరుప నే సుకృతంబు - సంభవించు,
*[1]మహితమౌ చతురాశ్ర-మ స్వక్రియావశ । మ్మున నే ఫలంబు వి-స్ఫూర్తి నొందు

తే. నట్టి పుణ్యాదికము, పంక-జాక్షు మధుర । నామ కీర్తనమాత్రంబు - నం జనించుఁ
గాన, యుగములయందెల్లఁ-గలియుగంబు । భక్తకోటి కనాయాస-ముక్తిదం[2]బు. 133

వ. మఱియుఁ గర్మయోగంబును, ధ్యానయోగంబును, భక్తియోగంబు నన, ముక్తిప్రాప్తి కారణంబులు మూఁడు గలవు. అందుఁ గామ్య నిషిద్ధంబులు వర్జించి, నిత్య నైమిత్తిక కర్మంబులు భగవత్ప్రీతిగా నాచరించుట కర్మయోగంబు. యమ నియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యాన ధారణ సమా ధ్యష్టాంగమ్ములచేత హృదయాంభోరుహ కర్ణికా మధ్యమంబునం బరమాత్ము దర్శనంబొనర్చుట ధ్యానయోగంబు. హరిస్థిరబుద్ధి భక్తియోగంబు. ఈ త్రివిధంబునందు, ధ్యానయోగంబు విస్తరించెద నాకర్ణింపుము. 134

### ధ్యానయోగ ప్రకారము

సీ. విజన స్థలంబున - విమల పద్మాసనా । సీనుఁడై యుండి [1]ని - శ్చింతుఁ డగుచు,
వాయువువశముగా - ద్వారముల్ బంధించి । సమ[2]కాయుఁడై మనో - జలరుహంబు
ప్రణవంబు [3]చెవిని సొం - ద్రంబుగా బోధించి, । తద్భవ్య కర్ణికాం - తరమునందు
సోమ సూర్యాగ్నుల - సొరది దొంతరగాఁగ । నిలిపి, యా వహ్నిమం - డలములోన

తే. భావనాకల్పిత [4]స్వర్ణ - భద్రపీఠి । కాంతరాళంబునం దీప్త - మైన విష్ణు
మూర్తి [5]నిలుపుచుఁ బుత్రాది-మోహముడిగి,।సంతత ధ్యాన మీరీతిఁ-జలుపవలయు. 135

క. ఏ రూపముఁ దన చిత్తాం । భోరుహమునఁ దలఁచు నరుఁడు - పుణ్యాకరుఁడై,
యా రూపముఁ బొంది యతం । డారూఢుండగును వైష్ణ - వాంచిత [1]పదవిన్. 136

---

(133) * మహిత - జరించు తి.ప్ర. లో లుప్తము 1 కలియుగంబున భక్తి కలితులై కీర్తన లొనరించి నంతనే యొదవుముక్తిగాన యుగముల - తీ 2 బు జపతపాధ్యాయ సత్క్రియా చరణ నిపుణ సన్మునివరేణ్యులకుఁ బాలజాతకంబు-తీ (135) 1 నిశ్చిత్తు-మ,మా,హ,ర,క 2 వాయు-మ; వాయు - తీ;వాయు - క 3 చేవినిద్రంబుగా - త,తి 4 స్వర్గ - తి,తీ 5 దలఁపుచు-మా, త, తా, తి, తీ,క (136) 1 పదమున్ - అన్ని ప్ర.

క. హరిమూర్తులలో నెయ్యది । పరిచితమగు, నట్టిమూర్తి - భావింపఁ దగున్,
బరమూర్తిఁ దలఁచెనేనియుఁ । బురుషుఁడు విఘ్నములఁ బొందు,-బుద్ధి చలింపన్. 137

క. హరి[1]కీర్తన మాత్రమునం । బరమపదం [2]బొదవు ననుచు - బలభిన్ముఖ్యా
మరులు మదిఁ గోరుచుందురు । ధరపైఁ గలియుగమునందుఁ - దారు జనింపన్. 138

ఉ. దార కుమార మిత్ర జన - తా ఫణిసంకుల, మవ్యయ స్పృహా
భూరితరాంధకార మధు - పుంజ తృణావరణంబునైన సం
సార పురాణకూపమున - జాఱినమర్త్యుఁడు, విష్ణుకీర్తనో
దార మరజ్జుమార్గమునఁ - దా వెడలం దగు బుద్ధిమంతుఁడై. 139

సీ. నిజ [1]పూర్వభవ కర్మ - నియత [2]యోనిసహస్ర । జాతుఁడై జీవుండు - భూతధాత్రిఁ
గ్రమమున మానవా - కారుఁడై యుదయించి, । పరమ వైష్ణవమార్గ - మెఱుఁగలేక,
పరసతీ వ్యసనుఁడై - పరవిత్త హరణంబు । సేయుచు, విద్యావి - శిష్టులైన
బుధుల నిందింపుచుఁ - బుణ్యంబు దిగనాడి, । దానం బొనర్పక - ధర్మ ముడిగి,

తే. గురు కృపాదృష్టి దూరుఁడై-కుమతి యగుచు । నర్థ కాంతా సుతాది మో-హంబుకతనఁ
జాల గర్వించి యవసాన-కాలముననుI యాతనాదేహియై పోయి-యమపురమున, 140

సీ. తప్యమానానల - తప్తుఁడై, యసిపత్ర । వన ఖండితాంగుఁడై - శునకవక్త్ర
కబళితుండై, గృధ్ర - కాక సందష్టుఁడై, । లోహానంబుల - లోనఁ గూలి,
యతితప్త తైలమ - ధ్యమునఁ ద్రోవఁగఁబడి । బహుకాల పాశని - బద్ధుఁ డగుచు
*నధిక దుఃఖకరంబు - లైన నారకములఁ । దద్గత జంతు బృం - దములచేతఁ

తే. బీడితుండయి, యత్యంత - భీతిఁ బొంది, । దండధర భట గద శత - ధా విభిన్న
[1]మూర్ధుఁడై శోకజలధిలో-మునిఁగి మునిఁగి, । [2]యనదయై దిక్కుగానక-పనవి పనవి,

క. ఈరీతి సకల భయద మ । హా రౌరవ రౌరవాది - కానేకోద్య
న్నారక కూపాంతరముల । దారుణ బాధా[1]విశీర్ణ - తర విగ్రహుఁడై, 142

క. *అంతట నిజ కర్మానుభ । వాంతంబునఁ దత్ప్రతిష్ఠ - మగు గర్భగుహా
భ్యంతరముఁ జొచ్చి జననీ । సంతత విణ్మూత్ర విహిత - [1]సర్వాంగుండై, 143

---

(138) 1 చింతన - తీ 2 బబ్బు - మా,త (140) 1 యోగ - తీ 2 యోగ - మ,తి,తీ,హ, ర,క (141) * నధిక - నారకముల తి,హ,ర,ప్ర. లో లుప్తము; రక్తమేదోమాంససిక్త కూపంబున దుర్గంధ మగ్నుఁడై దొర్లి దొర్లి తద్గతంబగుజంతు-తీ 1 మూర్ధ్నుడై-అన్ని ప్ర. 2 ఈపాదము తా.ప్ర.లో మాత్రమున్నది. (142) 1 వికీర్ణ-త;వితీర్ణ-క (143) * ఈ ప. త.ప్ర.లో లుప్తము 1 సర్వాంగకుఁడై-మా

శా. *యాదృగ్జంతువు గర్భకోటరము ము - న్నర్థిం బ్రవేశించి, తాఁ
దాదృగ్గాత్రభరంబు దాల్చి వెడలుం - దద్యోనిమార్గంబునన్,
బ్రాదుర్భావ నిదాన భూరి జవ శుం - భత్ సూతి వాతచ్ఛటా
భేదోత్పాదిత వేదనాభర మహా - భీతిం బ్రకంపించుచున్. 144

ఉ. ఈగతి జీవుఁ డెంతయును - హేయతరంబగు మాతృగర్భ కా
రాగృహవీథి వెల్వడి, ని - రంతర బాహ్య సమీరణాహతిం
బ్రాగవబోధము న్మఱచి, - బాలకుఁడై చరియించి, యౌవనా
భోగముఁ జెంది, రూప బల - భోగ ధనాదులచేత మత్తుఁడై, 145

క. గురు దేవ ద్విజ నిందా । పరుఁడై, నిమిషమును విష్ణు - పాదాంభోజ
స్మరణ మొనర్పఁగనేరక । తిరుగం జనుచుండు దుర్గ - తికి జడమతియై. 146

సీ. ఈరీతి నరులు దే - హేంద్రియ సంజాత । కామాది గుణములఁ - గట్టువడుచు,
బహువిధ జన్మ సం - భావిత కర్మాను । రూప సంపన్నదా - రూఢు లగుచు,
నర్థ దారాది మో - హవ్యాప్తి నస్థిరం । బగు జీవనంబు ని - త్యమని నమ్మి,
విపుల లోభమ్మున - విత్త ముపార్జించి । సత్పాత్రదానంబు - జరుపలేక,

తే. ముక్తి సంప్రాప్తికర ధర్మ-మోద శూన్యు । లగుచు, నటమీఁద బహు వేద-నాతినిబిడ
యాతనా దేహములు దాల్చి,-యమిత దుఃఖ । మనుభవింతురు నరక కూ - పాంతరముల.

వ. అదిగావున, 148

సీ. త్వఙ్మాంస సంధిబం - ధముల పట్టువదల్చి, । దంతకోరకముల - ధరణిఁ గూల్చి,
నేత్ర వీక్షణశక్తి - నిశ్శేషముగఁ ద్రెంచి, । శ్రవణప్రభావంబు - సంహరించి,
జిహ్వా వచోవృత్తి - శిథిలత నొందించి, । ఘ్రాణ గంధజ్ఞాన - గరి[1]మ డించి,
హృదయ సామర్థ్యంబు - మొదలికిఁ బోకార్చి, । తనువుఁ గంపమునకు - దాపొనర్చి,

తే. పలిత రోగాది వికృతి సం-వలితుఁ జేసి । ఘన జరా కాళరాత్రి గ్రమిం-గకయ మున్న,
నరుఁడు హరి[2]నామ జప కళా - నిరతుఁ డగుచుఁ । బరమపదసౌఖ్య మనుభవిం - పంగ
వలయు. 149

వ. అని చెప్పి, వెండియుం బుండరీకభవుండు నారదున కిట్లనియె. 150

(144) * ఈ ప. మ,తి,తీ,హ,ర,క ప్ర.లో లుప్తము (149) 1 మడంచి - తి,హ,ర 2 జప సత్కళా - మ,తా,హ,ర,క;జపసత్కథా - తి

తే. వినుము [1]మోక్షార్థియైనట్టి - విమలమతికి । భాగవతభక్తి మదిఁ బోనఁ - బాదుకొల్పి,
కమలనాభార్పితాఖిల-కర్ముఁ డగుచు। నుంట యుచితంబు, వెండియు-నొకటివినుము. 151

క. నర[1]కాంత వర్తులకు, భా । సురలోక విహార లబ్ధ - [2]శుభకీర్తులకుం
[3]బరిణామంబునఁ గాలము । సరిగా వర్తించుచుండు - సన్మునివర్యా! 152

క. ఆ కాలమె ఘన దుఃఖ [1]సు । ఖాకరమై నిడుపు గుఱుచ - లై తోఁచును, దే
హాకీర్ణభావ గుణమది । ప్రాకట్య[2]మ మెఱయఁ దెలియఁ - బడ దెవ్వరికిన్. 153

క. సముదిత దుఃఖాన్వితులకు, । సముదంచిత భోగ సౌఖ్య - [1]సంపన్నులకున్
గ్రమమునఁ [2]దోఁచుచు నుండును । నిముసం బేఁడగుచు, నేఁడు-నిముసం బగుచున్. 154

తే. పక్ష మాసర్తు వర్షాను - భవ [1]వినాశ్య । పాప పుణ్య ఫలంబు సం - ప్రాప్తమగుచు
ననుభవింపంగఁబడుచుండు,-నధిక సూక్ష్మ । కాలమునఁజేసి జీవసం-ఘంబుచేత. 155

ఆ. పాప పుణ్య కర్మ - ఫలము జీవుఁ డనుభ । వించి పిదప సంభ - వించు, విశ్వ
ధరణిమండలమునఁ-దనకుఁ బ్రాప్తవ్యమై । నట్టి యుచిత విగ్ర-హమును దాల్చి. 156

వ. ఇట్లనుభూయమానంబులగు *కర్మంబులు సంచితంబులు, ప్రారబ్ధంబులు నన రెండు తెఱంగులు. అందుఁ బూర్వజన్మార్జితంబులై రాశిభూతంబులగు కర్మంబులు సంచితంబులు. భవిష్యజ్జన్మంబులక్రమంబున ఫలోన్ముఖంబులైన కర్మంబులు ప్రారబ్ధంబులు. అట్టి కర్మంబులు పుణ్య పాప భేదంబున ద్వివిధంబులై యుండు. అందు స్వర్గభోగ్యంబులు పుణ్యకర్మంబులును, నిరయభోగ్యంబులు పాప కర్మంబులునై సుఖ దుఃఖ జనకంబులగుచుఁ బ్రవర్తిల్లుచుండు. కావున, 157

చ. పురుషుఁడు దేహియై ధరణిఁ - బుట్టి, ప్రబోధము గల్గి, తత్త్వముం
గురు[1]వదనంబున న్విని, ము - కుందుఁడ కర్మ[2]వినాశకుండుగా
నెఱిఁగి, యధర్మమార్గమున - నేఁగక, వైష్ణవభక్తుఁడై, మనో
హర సుచరిత్రుఁడై, భగవ - దర్పిత నిర్మల కర్మజాలుఁడై, 158

---

(151) 1 వరభూషణార్థియై-క; భూషణార్థియై-మా (152) 1 కాంతావర్తులకునుసుర-మ,మా, త,తి,హ,ర,క 2 సుర-మ,మా,తి,హ,ర,క 3 బరమాణం-మ,మా,త,తా (153) 1 శుభాకర-తి,హ 2 మమేర - మా (154) 1 సన్మానులకున్ - మా 2 వర్తిలు - క (155) 1 వినాశ - మ,తి,హ,ర,క (157) * కర్మంబు-జనకంబు మా.ప్ర.లో లుప్తము (158) 1 వచనం-మ,త,తా,తి,హ,ర 2 సునాశకుం - మ,మా

తే. కర్మ బహువల్లికా సమా - క్రాంతుఁ డగుచు । దారుణంబైన సంసార - భూరుహంబు
భూరి సుజ్ఞాన నిశిత కు-ఠార ధార । నెలమి ఖండించి, హరిపురి - కేఁగవలయు. 159

ఉ. అచ్చెరువంద నేల? విను, - మద్భుతకర్ముఁడు చక్రి, యాత్మ నా
మోచ్చరణైకమాత్రము స - ముత్సుకుఁడై యొనరించువానికి
న్మెచ్చి యొసంగు ముక్తి, నిది - నిక్క, మెఱుంగియు దేహధారియై
చచ్చుచుఁ బుట్టుచుం దిరుగు - జంతువుఁ గన్గొని నవ్వవచ్చెడిన్. 160

చ. తనువు ధరించి జీవుఁడు సు - త ప్రమదాముఖ వస్తు మోహ వ
ర్ధనమునఁ గన్నుగానక, వి - రాజిత సాత్త్వికదాన దూరుఁడై,
యనుపమ వేదమార్గ జడుఁ - డై, భవనాశన మోక్షలాభ సా
ధన హరిధర్మము న్విడిచి, - తత్త్వ మెఱుంగకయుండు మూఢుఁడై. 161

వ. ఇంక నొక్క యితిహాసంబు చెప్పెద నాకర్ణింపుము. 162

## విష్ణువర్ధనోపాఖ్యానము

సీ. బలభేదనం బను - పట్టణంబునఁ దొల్లి । విష్ణువర్ధనుఁ డను - విప్రవరుఁడు
ధర్మ సత్య జ్ఞాన - దాక్షిణ్య [1]యుక్తుఁడై । యఖిల శాస్త్రంబుల - నభ్యసించి,
సంతతానుష్ఠాన - సంపన్నుఁడై, శత్రు । షడ్వర్గ జయమునఁ - జాల వెలసి,
యనుకూల భార్యా స - హాయుఁడై, సాత్త్విక । దానంబు సేయుచుఁ - దత్ఫలంబు

తే. హరికి నర్పించి, వైష్ణవ - ధ్యాన యోగ । చతురుఁడై, యన్నదానంబు - జరుపుచుండి,
యచలితశ్రీ సమేత గృ-హంబునందు । మండలాధీశ మాన్యుఁడై-యుండి యతఁడు, 163

మ. సురకల్లోలినిఁ దీర్థమాడఁ [1]గ మన - స్తోషంబుతో నొక్కనాఁ
డరుగన్, భూసురముఖ్యుఁ డొక్కరుఁడు తృ - ష్ణానల్ప దాహ క్షుధా
తురుఁడై, యింటికి వచ్చి యన్న మడుగన్, - దుర్వార సంపన్మదా
కరతన్, [2]బెట్టడ విష్ణువర్ధన[3]సుధీ - కంజాక్షి దుష్టాకృతిన్. 164

ఆ. అంతఁ, గొంతకాల - మరిగినతుద విష్ణు । వర్ధనుండు కాల - వశగుఁ డగుచు
దేహయష్టి వదలి, - దేవేంద్రపురమున । కరిగె నమరసంఘ - మభినుతింప. 165

---

(163) 1 వంతుఁడై - త (164) 1 గడుసంతోషంబు - తా 2 బెట్టక - మ,మా,తి,తీ,హా,
ర,క 3 పతీ - త

## పుణ్యపాపానుభవ ప్రకారవైచిత్రి

వ. ఇట్లు పాంచభౌతిక దేహంబు విసర్జించి, దివ్యశరీరంబు పరిగ్రహించి, రత్న విమానారూఢుండై, యప్సరోగణ పరివృతుండగుచుఁ ద్రిదివంబున కరుగుటయుఁ, బురందరుండు రంభాది సురకామినీ సహస్రంబులతో నమ్మహాత్ముని నెదుర్కొని, నిజ సింహాసనార్ధంబున నుపవిష్టుంజేసి, యర్ఘ్య పాద్యాది కృత్యంబుల నుపచరించి యిట్లనియె. 166

ఉ. కాలవశుండవై చనక, - కర్మమయాఖిల పాశ బంధముల్
శ్రీలలనావర స్తుతి వి - శేష మహా నిశితాసిధారచేఁ
[1]గిలుకు[2]ద్రెంచి, యత్యధిక - కీర్తి వహించి, వసుంధరాస్థలిన్
గాలము మోసపుచ్చితివి - కారణజన్ముఁడవై మహీసురా! 167

ఉ. తొంటిదినమ్ముల న్మహిమ - తో హరిభక్తులు వేనవేలు మా
యింటికి వచ్చి, విష్ణుపురి - కేఁగుచు నుందురు, వారియందు నీ
వంటి మహానుభావుఁ, గుల - వర్ధను, నేకవధూ వ్రతాన్వితున్,
గంటక శత్రుషట్కహరుఁ - గానము వైష్ణవధర్మభూషణా! 168

శా. రంభాది ప్రమదా విహార కలిత - ప్రాసాద మధ్యంబులన్
శుంభద్భోగసుఖంబులం గొనుచు, ని - చ్చోఁ బెద్దకాలంబు సం
రంభంబేర్పడ నుండి, పూజ్య గరిమం - బ్రాపించు యోగీంద్రసే
వ్యాంభోజాసన లోకమందు దశకో - ట్యబ్దంబు లుర్వీశ్వరా! 169

తే. మఱియు నటమీఁద వైకుంఠ - పురికి నరిగి । శంఖ చక్రాబ్జ నందక - శార్ఙ్గ సహిత
కరచతుష్టయ కలిత వి- గ్రహుఁడవగుచు । విష్ణుకైంకర్య పరుఁడవై - వెలయఁగలవు. 170

వ. అని యిట్లు పురందరుండు విష్ణువర్ధను నభినందించి, వైవస్వతుని వదనం బవలోకించిన, నతండు తద్విప్రోత్తమున కిట్లనియె. 171

సీ. భూసురోత్తమ! నీవు - భూమండలంబందు । నార్జించితివి పుణ్య - మభినుతముగఁ,
బరమ పాతివ్రత్య - నిరతయై భాసిల్లు । భవదీయకాంత, సం - పన్మదమున
నొకనాఁడు విప్రము - ఖ్యుఁడొకఁడు తృష్ణాక్షు । ధాతుఁడై వచ్చి - యన్న మడుగ,
బహు భక్ష్య భోజ్య సం - భారంబు లింటిలోఁ । గలిగియుఁ బెట్టక - కడపినట్టి

(167) 1 గెలు - తా 2 దేల్చి - మా; దెంచి - ఇతర ప్ర.

తే. పాప మున్నది, యందు సొం-బాలు నిన్నుఁ । దగులుఁ, గావున నిరయ స-ద్మంబులోన
యాతనాదేహ గతుఁడవై-యబ్దమాత్ర । మనుభవింపంగఁ నగు నీకు-నా ఫలంబు. 172

ఉ. రౌరవముఖ్య నారక ప - రంపరలం దనుభూత పాప సం
భారుఁడవై, సురేంద్రపురిఁ - బ్రాక్తన పుణ్యఫలంబు గాంచి, యా
ధారుణిఁ గొన్ని యబ్దములు - దర్పిత జంబుకమూర్తివై, తదా
కారము నుజ్జగించి, మరి - కాంతువు విష్ణుపురీ విహారమున్. 173

చ. తరుణి యొనర్చునట్టి దురి - తంబుల నర్ధము భర్తఁజేరుఁ ద
త్పురుషుఁడు సేయునట్టి ఘన - పుణ్యములోన సగంబు భామినిం
బొరయుచునుండు, నీ ద్వివిధ - మున్ శ్రుతిమూలముగా నెఱుంగు భూ
సురవర! యంచుఁ బల్కె రవి - సూనున కిట్లనుఁ గంపితాత్ముఁడై. 174

ఆ. ప్రాప్త యాతనుండ - నై యేను దుఃఖాను । భవముచేతఁ గుంది - భానుతనయ!
[1]మీఁద నెట్లు నిర్గ - మింతు భయంకరా । కార నిరయ శోక - కాననంబు? 175

వ. అని పలికిన విప్రవరునకు దండధరుం డిట్లనియె. 176

ఉ. భూసురుఁ డొక్కరుండు, కృత - పుణ్యుఁడు, తొల్లి మహేంద్రకీల శై
లాసమ సానుదేశమున - నంబుజనాభునిగూర్చి మారుతా
భ్యాసపురస్సరంబుగ భ - యంకర తీవ్రతపం బొనర్చెఁ, బ
ద్మాసనముఖ్య దేవతలు - నద్భుత మందుచునుండ నత్తఱిన్. 177

సీ. జనని యెవ్వని నాభి - వనజాత కర్ణిక । భూత భవద్భావి - ధాతృతతికి?
సూచకం బెవ్వని - లోచనద్వయ మహో । రాత్రాది కాలసం - రంభమునకు?
మామ యెవ్వని పాద - తామరసాగ్రంబు । [1]వర రత్న సంపన్న - వార్ధిపతికి?
నాధార మెవ్వని - యసమాన తల్పంబు । చక్రవాళాంత భూ - చక్రమునకు?

తే. నుద్భవస్థాన మెవ్వని - యుదర శుక్తి । పద్మగర్భాంత మౌక్తిక - పటలమునకు?
నమ్మహాత్ముఁడు లక్ష్మీస-హాయుఁడగుచు । ధరణిసుర శేఖరునకుఁ బ్ర-త్యక్షమయ్యె. 178

వ. ఇవ్విధంబున సాక్షాత్కరించిన లక్ష్మీకాంతుం డతనికిట్లనియె 179

(175) 1 యెట్లుమీఁద నిర్గమింతు - త (178) 1 నగరత్న (యతి?) - మా

క. మెచ్చితిఁ దావక తపమున । కిచ్చెద ధరణీసురేంద్ర! - యిష్టార్థములన్
విచ్చలవిడి నడుగుము యు । ష్మ చ్చతురవచో [1]విశేష - సంపద మెఱయన్. 180

చ. అని హరి యానతిచ్చిన, ధ - రామరముఖ్యుఁడు [2]సంతసించి, వం
దన మొనరించి, హస్తనళి - నంబులు మౌళి నమర్చి యిట్లనున్;
వనరుహనేత్ర! సర్వజన - వర్ణిత! మాధవ! చక్రి! నాకు నీ
యనుపమలోక మిమ్ము కరు - ణాన్వితవీక్షణ! భక్తరక్షణా! 181

సీ. నావుడు, మేదినీ - దేవపుంగవునకు । నిందిరాధవుఁ డర - విందనాభుఁ
డతిభక్తితోడ ని - ట్లనియె, విప్రోత్తమ! । నీకు నేనూఱేండ్లు - నిరయమందు
బహుదుఃఖములు పొందఁ - బ్రాప్తంబు గల, దవా । ర్యంబులు కర్మఫ - లంబు లరయ,
మద్భక్తుఁడవు గాన, - మాసమాత్రము రౌర । వాది మహా దుఃఖ - మనుభవించి,
తే. భోగ నాశ్యంబులైనట్టి - [1]పూర్వ[2]కర్మ । జాలములఁ [3]ద్రెంప వైష్ణవ - జన్మమంది,
ధరణి సంసారభయ దూర - తరుఁడ వగుచుః । దత్పరతఁ[4]జేరెదవు మీఁద-మత్పురంబు.

వ. అని దేవదేవుం డానతిచ్చిన, భూదేవవరుండు తదాజ్ఞా నియుక్తుండై, యొక్క మాసంబు మదీయలోకంబున ననూన శోకం బనుభవించి, భూతలంబున వైష్ణవజాతుండై, యనంతరంబున వైకుంఠనగర ప్రాప్తుండయ్యె. కావున, నీవును యాతనాతను సమేతుండవై, యొక్క వత్సరంబు కుత్సిత నిరయంబుల దురితఫలం బనుభవించి, యటమీఁద సుకృత పరిపాకాతిరేకంబున నాకలోకంబున సహస్రవర్షంబులు హర్షోత్కర్షంబు నొంది, క్రమ్మఱం బుడమిం బొడమి, యల్పకాలంబునన శేషతల్పు పదంబున ముదంబు నొందెదవని పల్కిన యుష్ణాంశు నందనునకు విష్ణువర్ధనుం డిట్లనియె. 183

సీ. సమవర్తివై మున్ను - సకల జీవులకును । గర్మమూలమున సం - క్రాంతమైన
పాప పుణ్య చయంబు - భాగించి యధికాల్ప । రూప తత్త్వమ్ములఁ - జూపి వరుస
ననుభవింపఁగ బంచి, - యంత భూతలమున । నెట్టి [1]కర్మంబుల - కెద్ది జన్మ
మది నిర్ణయించి, మ - ర్యాదతో జీవన । కర్మ మోహాదులఁ - గలుగఁజేసి,
తే. నీవు నియమింపఁ, బ్రాణు లా-త్రోవ నడచి । జన్మ మరణాంధకార సం-ఛన్నులగుచుఁ
దలఁప నెఱుఁగరు హరి నాత్మ-దండధారి! । *కలుష నిచయ నిరస్త! లో-కప్రశస్త! 184

(180) 1 విలాస-తా (181) 1 ధరావర-మ,త,తా,తి,తీ,హ,ర,క 2 వేడ్కనంత-మ,తి,తీ,హ, ర,క; సమ్మతించి-మా (182) 1 పుణ్య-త 2 జన్మకర్మములుద్రెవ్వ (యతి?)-మా 3 ద్రిప్ప-మ,హ, ర,క 4 జెందెదవు - క (184) 1 జన్మంబుననెట్టికర్మ - తీ * ఇది తీ.ప్ర. పాఠము; ఇతర ప్ర. లో లుప్తము.

వ. అనిన విష్ణువర్ధనునకుఁ గృతాంతుం డిట్లనియె. 185

సీ. వసుధామరేంద్ర! నీ - వలనఁ బాపంబులు । లేవు, నీ వాజన్మ - పావనుఁడవు,
హరిపద ధ్యాన త - త్పరుఁడవు, దేవతా । పూజితుండవు, నిత్య - పుణ్యమతివి,
వనితమూలమ్మున - వచ్చిన పాతకం । బనుభావ్యమగుఁ బతి - కర్ధభాగ,
మట్లుగావున నేరి - కైన దుష్కర్మంబు । లనుభవంబునఁ గాని - యణఁగిపోవు,

తే. హరికి సత్కర్మ మర్పితం-[1]బయ్యుఁగాని, । కలుషసంఘంబు చెడిపోక-నిలిచియుండు,
*నందు సత్పాత్రదానాదు-లైన సుకృత । కర్మములు సేయ నణఁగు భా-గత్రయంబు. 186

ఆ. అనుభవైక నాశ్య - మా చతుర్థాంశంబు । పద్మజాది దివిజ - పటలికైనఁ,
గాన ననుభవింపు - కాంతా కృతాఘంబు । నందుఁ బాదభాగ-మనఘ! యనుచు, 187

క. అంతకుఁ డిట్లమరసభా । భ్యంతరమునఁ బలికె, నంత - నా విప్రుఁడు దు
ర్దాంత ఘన శోక సంభవ । చింతా భారమున[1]నుబ్బ - సిల్లుచుఁ బలికెన్. 188

ఆ. పుణ్య మనుభవించి, - భూలోకమునఁ బుట్టఁ । జనెదునపుడు పాప - చరమభాగ
మనుభవింతుఁ గాని, - యాదిన నరకాను । భవ మొనర్పఁజాల - దివిజముఖ్య! 189

సురలోక సుఖానుభూతి

వ. అనిన విని యనిమిషాధ్యక్షుం డనుకంపా సంపన్నాక్షుండగుచు, రంభాముఖ బర్హిర్ముఖ చంద్రముఖులం గనుంగొని యిట్లనియె.

చ. ఇతఁడు మహానుభావుఁడు, మ - హీసుర[1]వర్యుఁడు, విష్ణుభక్తి సం
యుతుఁ, డదిగావున న్మరక - తోపల నిర్మిత భర్మహర్మ్య శో
భిత మృదుశయ్యలందు, రతి - భేదములం గరఁగించి, [2]తావకా
ద్భుతచరితంబుచే నుబుసు - పుచ్చుఁడు మీరు సహస్రవర్షముల్. 190

క. అని పలికిన దేవేంద్రుని । పనుపు శిరోవీథి మాల్య - భావంబునఁ గై
కొని, యాయమరాంగనలా । ఘనుఁ దోడ్కొని యరిగి రాత్మఁ-గౌతుక మొదవన్. 191

వ. ఇట్లరిగి, 192

(186) 1 బయ్యెఁగాని-మ,త,తా,తి,తీ,హ,ర,క *నందుసత్పాత్ర-పటలికైన తి. ప.లో లుప్తము.
(188) 1 నుల్లసిల్లుచు - క (190) 1 ముఖ్యుఁడు - క 2 వినికద్భుత - మ,మా,త,తీ,హ,ర,క

సీ. నవరత్న కాంచనో - న్నత సౌధవీథులఁ, । గృతక చింతామణి - గిరితటములఁ,
గలిత మందాకినీ - పులినభాగంబుల, । నతుల ధారా గృహా - భ్యంతరముల,
నందనారామ మం - దారక చ్ఛాయల, । నంచిత కుసుమ శ - య్యా తలముల,
వారిజోత్పల సము - జ్జ్వల సరోవరముల, । ననుపమ స్వర్ణ డో - లాంతరముల

తే. వరుసఁ గ్రీడింపుచుండె భూ - సురవరుండు । దివిజకాంతలు చతు[1]రశీ - తి ప్రభేద
సురత బంధవిశేష వి-స్ఫురణఁ దనుప । నిరుపమానందభరితుఁడై,-మఱియు నతఁడు, 193

మ. ప్రమదంబందుచుఁ జూచు నొక్కపుడు రం - భా నర్తకీ రూపిత
భ్రమరీనృత్య విసార్యమాణ విలస - ద్బాహాద్వయీ మూలభా
గ మనోహారి సువర్ణ రేణునిభ రం - గత్కాంతి సందోహ వి
భ్రమణోత్పన్న తటిల్లతా వలయసౌ - భాగ్యంబుల న్నిచ్చలున్. 194

సీ. అంగనాధర సుధా - హార సంతృప్తుఁడై । యమృతాంధసుం దొట - నభి[1]నయించు,
రామావిలోకన - ప్రస్త నిమేష వి । తానుఁడై యనిమిష - త్వము భజించు,
వ్రీడావతీ రతి - క్రీడా[2]వినిద్రుఁడై । యస్వప్నభావంబు - నర్థిఁ దాల్చుఁ,
దరుణీ పయోధరో - త్సంగ [3]విహారియై । ఖేచరత్వంబు నం - గీకరించు,

తే. దివ్య భోగానుభవములఁ - దేజరిలుచు । నతులితానందముల నుప - ర్యత వహించు,
మదనభూతంబు సోఁకిన-మత్తుఁడగుచుఁ, । బరిహృతాన్యవిచారుఁడై-బ్రాహ్మణుండు. 195

ఉ. భూవిబుధోత్తముం డిటు ల - పూర్వ మనోభవకేళి తత్పరుం
డై విహరింప, నేకదివ - సాకృతి దివ్య సహస్ర వర్షముల్
పోవుటయున్, బరేతపతి - బుద్ధి నెఱింగి, భయంక రాత్మభృ
త్యావళిఁ బంచె, బ్రాహ్మణ కు - లాగ్రణిపాలికి నాక్షణంబునన్. 196

## దుష్టర నరక యాతనానుభవము

వ. ఇట్లు పనిచినఁ గాలకింకరులు భయంకరులై సురపురికి నరిగి, త్రిదశసుదతీ మధ్యమంబున మదన కదన[1]క్రియా పరవశుఁడై కాలంబుపోక కడగానకయున్న విష్ణువర్ధనుని బలాత్కారంబునం బట్టుకొనివచ్చి, సమవర్తికట్టెదురం బెట్టిన, నావిప్రవరు నాలోకించి దండధరుం డిట్లనియె. 197

(193) 1 ర చౌసీతి (యతి?) -మ,మా (195) 1 నుతించు-మా 2 వినీంద్రుఁడై-మ,మా,తా, తి,తీ,హా,ర,క 3 విహారుఁడై - తా,క (197) 1 క్రీడా - క

మ. సురలోకంబున భూసురోత్తమ! బుధ - స్తుత్యుండవై, నిర్జరీ
సురత క్రీడలఁ గాలముం జరుపఁగాఁ - జోద్యంబు నీ కొక్క వా
సరమై తోఁచి, సహస్రవర్షము లవి - జ్ఞాతంబులై పోయె, దు
స్తర శోకంబునఁ బొందు మింకొక ఋతు - ద్వంద్వంబు దీనాకృతిన్. 198

చ. అని సమవర్తి పల్కిన, మ - హాద్భుతమంది సబాష్పనేత్రుఁడై
తనమదిఁ [1]దాప ముప్పతిల, - దైవము దూఱుచు, ఘోర కింకరా
ననములు గాంచి బెగ్గిలుచు, - నాకనివాసులు చూచుచుండఁగాఁ
జనియె నతండు రౌరవ ని - శాంతముఁ జేరఁగ నెట్టకేలకున్. 199

వ. ఇట్లు కాలకింకరానీతుండై, యమలోకంబున కరిగిన విష్ణువర్ధనుం గదిసి, తత్కింకరులు కాలసూత్రంబున ముంచియుఁ, గాలానల జ్వాలా జాల[1]నఖంబులును, లోహముఖంబులునగు ఖగంబులచేతఁ గఱపించియు, నిర్వాత జ్వలన కీలా[2]సంరంభంబులగు సంతప్తాయసస్తంభంబుల నంటఁగట్టియు భంగద లగు గదలం గొట్టియు, నిశితాసిపత్రవన మధ్యంబులం ద్రోసియు, శూలంబుల ద్రవేసియుఁ, దప్తతైలంబులం ద్రోచియు, సంఘాతాది నారకంబుల[3]ద్రేఁచియు నొప్పించిన, యాతనాదేహ సంశ్రితుండై[4]నిమేష పరిమితంబగు కాలంబు వత్సరశతంబుగాఁ దలంచి, పాపపరిపాకంబగు శోకం బనుభవింపుచు, నొక్కనాఁడు భయంకరులగు కింకరుల నాక్షేపించి, నిరయక్షేత్రంబు బలాత్కారంబున నిర్గమించి, దండధరుపాలి కుద్దండతం జని యిట్లనియె. 200

ఆ. సర్వసమతఁ బొంది - సమవర్తివై నీవు । జీవకోట్లకెల్లఁ - జేసినట్టి
పాప[1]ఫలముఁ గుడుపఁ - బాల్పడి, నాయెడ । నసమవర్తివైతి - వనఘచరిత! 201

క. ఋతు యుగళ భోగ్య [1]దురితా । న్వితు నన్ను, సహస్రవర్ష - నిష్ఠుర దుఃఖ
ప్రతిహతుని జేయఁదగునే? । ప్రతిపక్షుఁడ వగుచు నిట్లు-పద్మాప్తసుతా! 202

క. కరుణించి నన్నకారణ । విరసత్వము మాని కావ - వే! యని పలుకన్,
దరహాస వికచ వదనాం । బురుహుండై, యముఁడు విప్ర - ముఖ్యున కనియెన్. 203

---

(199) 1 బాపము-మా (200) 1 సంఘంబు-మ,మా,తి,హ,ర,క 2 సంభవంబులను - మా 3 ముంచియు - త 4 నిమిషపరీతం-తా (201) 1 శమనుచు-మా (202) 1 వనితా-మ,తి,హ,ర,క

సీ. సర్వజంతు[1]వులందు - సముఁడనై వర్తింతు, । వైరంబుఁ దాల్ప నె - వ్వారియెడల,
హెచ్చుగుందులు సేయ - కిత్తుఁ [2]గర్మమునకుఁ । దుల్యంబుగా సుఖ - దుఃఖఫలము,
నల్పకాలంబైన - నతి[3]దీర్ఘమై తోఁచు । దారుణ శోక సం - తప్తమతుల
కట్లుగావున, భూసు - రాన్వయవర! నీవు । నిరయంబునకు నేఁగి, - నేఁటి కేడు

తే. దినము లయ్యెను, గర్మంబు - తీవ్రపడిన । ననుభవింపక పోవునే? - యరుగు మింక,
మూఁడునెలలును నిరువది-మూఁడు దినము । లుగ్ర నరకాంతరంబుల-నుండవలయు.

ఆ. అనిన దండధరుని - యాజ్ఞా క్రమంబున । నిరయ మనుభవించి, ధరణియందు
జంబుకత్వ మంది, - సంత్యక్త గాత్రుఁడై, । హరిపురమున కేఁగి - హర్ష మొందె. 205

వ. అదిగావున, జీవుండు బహు [1]జన్మవాసనంబునఁ బూర్వపుణ్య పరిపాక సారంబగు మానవాకారంబు ధరియించి, జ్ఞానసమ్యగ్జ్ఞానసమేతుండై, స్వప్నజాగ్రదవస్థలయందు హరినామ స్మరణంబు వదలక, పుత్ర[2]దార విత్తాది సంగ ప్రచారంబు దూరంబు గావించి, యోగ మార్గంబున నపవర్గంబుఁ జెందవలయు నని, నారదునకు శారదారమణుండు మోక్షధర్మోపదేశంబు చేసిన క్రమంబు రోమశుండు చెప్పిన, విని సంతసించి, మార్కండేయుం డిట్లనియె. 206

క. జయ విజయు లిరువురందును । జయుఁడు హిరణ్యాక్షుఁ డగుచు-సమసెను; విజయుం
[1]డయమహీత! యెచటి కరిగెను? । ప్రియమగు తత్క్రమము విస్త-రింపుము తెలియన్.

వ. అనిన మార్కండేయునకు రోమశుం డిట్లనియె. 208

## హిరణ్యకశిపుని వృత్తాంతము

క. విజయాహ్వయుండు దితిగ । ర్భజుఁడై, ఘన బాహు దర్ప - భాసురుఁ డగుచున్
ద్రిజగ ద్భయంకరాకృతి । నజితుండై, కనకకశిపుఁ - డనఁగా వెలసెన్. 209

శా. ఆ రక్షోరమణుండు లోకభయద - వ్యాపారుఁడై, బాల్య కౌ
మారంబుల్ గడచన్న యౌవన వయో - మత్తాత్ముఁడై, రాజ్య మిం
పారం జేయుచు, నొక్కనాఁడు సచివ - న్యస్తాత్మసామ్రాజ్య సం
భారుండై, జగదాధిపత్య మహిమం - బ్రాపించు చిత్తంబునన్, 210

---

(204) 1 వులకు - తా 2 గర్మలకును - తా 3 దుఃఖమై - మా,క (206) 1 జన్మావసానంబున - మా,త 2 దారా - మ,హ,ర (207) 1 డైయమ - మ,త,క

### నీలగళునిగూర్చి నిశాచరేంద్రుని నిర్నిరోధ తపము

ఆ. వీరసేననగరి - వెడలి మాల్యవదద్రి । కందరమున నీల - గళునిగూర్చి
నిరుపమాన ధైర్య-నిస్తంద్రుఁడై, విని । శ్చలత మెఱయఁ దపము-సలుపునంత, 211

సీ. రవి వేయుఁగరముల - నవనీరసముఁ గ్రోలెఁ, । దీవ్రాతపంబున - దిశలు[1]వ్రేలె,
నతిదీర్ఘతరములై - యహములు ప్రసరించెఁ, । గమలినీలతలు పొం - కము ధరించెఁ,
జాతకంబులకుఁ దృ - ష్ణాతురత్వము మించెఁ, । జక్రవాయువు లుర్వి - నాక్రమించెఁ,
గల్లోలినీ దీర్ఘి - కాశ్రేణి నెఱి దప్పె, । ఘన ధూళిపటల మా - కసము గప్పెఁ,
తే. గాననంబుల [2]దవపావ - కంబు లెదిగె, । నధ్వగావళి ధారాగృ - హముల నొదిగె,
భానుకాంతోపలంబులు - ప్రజ్వరిల్లెఁ । జండ ఘర్మాగమం బిట్లు - సంఘటిల్లె. 212

చ. హరికి సుధాంబురాశి, నిట - లాక్షునకుం దుహినాద్రి, భారతీ
శ్వరునకు నాభి[1]పద్మమును - సద్మములై విహరింపఁగల్గెఁగా,
కరయ తదుష్ణకాల నిబి - డాతప[2]తాపము నిస్తరింపఁగాఁ
దరమగునే త్రిమూర్తులకుఁ? - దక్కినవారల నెన్ననేటికిన్. 213

శా. రక్షోనాయకుఁ డిట్టివేసవిని సం - రంభంబు రెట్టింపఁగాఁ
జక్షుర్వీక్షణ జాలము[1]ం దపనుపై - సంధించి, ఘోరాగ్ని మ
ధ్యక్షేత్రంబునఁ బాదపల్లవ నఖాం - తం బూఁతగా నిల్పి, ఫా
లాక్షున్గూర్చి తపంబు [2]సల్పె భయద - వ్యాపార మేపారఁగన్. 214

వ. అంత, 215

సీ. జలధరంబులు [1]కులా - చలము నారోహించె, । నలర విద్యుల్లత - లంకురించెఁ,
బురుహూతుచాపంబు - వరుణదిక్కునఁ దోఁచెఁ, । బ్రథమదిశా సమీ - రములు వీచెఁ,
జాతకంబుల[2]తప - శ్చర్యలు ఫలియించె, । జాతీలతలు పుష్ప - సమితి నించె,
నీలకంఠంబులు - నృత్యంబు ప్రకటించెఁ, । దాళంబు లన గర్జి - తములు మించె,
తే. నీపములు పూచెఁ, దటినీక-లాప మేచె, । సస్యములు హెచ్చె, రాజహం-సములు నొచ్చెఁ,
*గమలములు వనరె, నింద్రగో-పములు దనరె । లతలు చెలువారె, వానకా-లంబు మీఱె.

---

(212) 1 వీగె-క;వీచె-తా;మించె-త 2 వనపావకంబుదిరిగె-మ,తి,తీ,హా,ర,క (213) 1 పంకజముస్థానము - మ,తా,తి,తీ,హా,ర,క 2 ముగ్రత-మా (214) 1 మున్నిమునిపై-క,మా 2 చేసె - మా (216) 1 శైలచయము-మా;మహాబిలము-త;నభమందు (యతి?) -తా; 2 తపశ్చరియలు-మ,త,తి, హా,ర,క * కమలములు-అన్ని ప్ర. వర్ణాధిక్యముచే గణభంగము.

మ. దనుజాధీశ్వరుఁ డిట్టి వర్షదినముల్ - ధారాధరశ్రేణి [1]జో
రని వర్షింపుచునుండ నూర్ధ్వవదనుం - డై, నిర్నిమేషావలో
కనుఁడై, యున్నత గండశైల శిఖరా - గ్రంబందుఁ గౌపీనమా
త్ర నిరూఢాంబరుఁడై, యొనర్చెఁ దపమున్ - ధారాళ యత్నంబునన్. 217

వ. * తదనంతరంబ, 218

సీ. అహముల దీర్ఘత్వ - మంతయు నుడివోయె, । నమృతాంశు రుచిజాల - మవచమాయె,
నీహారములు లోక - నికర మాచ్ఛాదించెఁ, । జలి పేదజనముల - సంహరించె,
ధనదదిశా మారు - తంబులు చెలరేఁగె, । * దక్షిణాయనమునఁ - దపనుఁ డేఁగె,
నుష్ణంబు భామాప - యోధరంబులఁ జేరె, । నెండపై జనులకు - నింపుమీఱె,
తే. గర్భగృహవాసముల భోగి-గణము లణఁగెఁ, । గణఁకఁ దాంబూలములు చవి - గాఁగఁ దొణఁగెఁ,
బట్టుచేలంబు లోకకొంత-భయముఁ బాపె, । శీతకాలంబు నిజ గుణ-ఖ్యాతిఁ జూపె. 219

క. తరుణీ*జన [1]వక్షోజ । స్థిర గిరిదుర్గముల దండఁ - జేరక యున్నన్
దరమె చలిచేత బ్రదుకఁగ । హరి హర పంకేరుహాస - నాదుల కైనన్, 220

చ. అనఁగ భయంకరంబగు హి - మాగమకాలమునందు, ఫాలలో
చనుఁ దనబుద్ధిఁ గీల్కొలిపి, - చల్లని కుత్తుకబంటి నీటిలో
[1]న నశనుఁడై, నిమేష రహి - తాక్షి సమీక్షిత నాసికాగ్రుఁడై
దనుజుఁడు బాహ్యము న్మఱచి, - తన్మయుఁడై తప మాచరింపఁగన్. 221

క. వత్సర సహస్ర మరిగినఁ । దత్సమయమునందు నతని - తపమున నుత్స
న్నోత్సాహుఁ డగుచు గిరిజా । వత్సలుఁ డేతెంచి, దనుజ - వర్యుని మ్రోలన్, 222

### పరమశివానుగ్రహము - వరప్రదానము

వ. లోచనగోచరుండై, 'నిశాచరవల్లభ! భవదాచరిత తపశ్చర్యా పరితుష్టుండనైతి. తావకాభీష్టంబు లొసంగెదవేఁడు' మనిన యష్టమూర్తికిం బ్రణుతి విశేషంబుల సంతోషం బొనర్చి, శేషభూషణువలన సమేళిత వివిధ భోగ కృత్యంబగు త్రైలోక్యాధిపత్యంబును, దేవ గంధర్వ

(217) 1 భోరున (యతి?) - త,తా,క; బోరన - మా (218) * ఈ వ.తి,ర,ప్ర.లో లుప్తము
(219) * దక్షిణా - చవిగాఁగఁదొణఁగె హ.ప్ర.లో లుప్తము (220) 1 వక్షోజద్వయ (ప్రాస?) - త
(221) 1 న,నచలుఁడై(యతి?) - మ,తి,తీ,హ,ర,క

ప్రముఖాసహ్యా చర్యంబగు శౌర్యంబును, స్థావర జంగమ జనిత భయ నివారణ ధురీణంబగు తను త్రాణంబును, గరాళంబగు శూలంబును, జండంబులగు బాణ కోదండంబులును వరంబులుగాఁగొని, తత్కరుణా సుధా స్నపిత సర్వాంగుం డగుచు, నిజపురంబున కరిగి, బలీముఖ సుషేణ సూచీముఖ జ్వాలాముఖ[1]కంక నిషధ కుశ వజ్ర దందశూక క్రూరాక్ష కీట చిత్ర దమఘోషాది ఘోర రాక్షసవీరులం గూడుకొని, చతురంగబల సమేతుండై, పరాక్రమ స్ఫీతుండగుచు, సకల దేశాధిపతులం బరాజితులను జేసి, దిగీశులం గళిత ప్రకాశులం గావించి, గీర్వాణుల నిస్త్రాణుల నొనర్చి, రాజ్యసంప దవలేపంబును భుజప్రతాపంబును జూపట్టఁ ద్రిభువన పట్టాభిషిక్తుండై, రాజ్యంబు సేయుచుండఁ దదనంతరంబున, 223

## ప్రహ్లాద చరిత్ర

క. నారాయణభక్తి [1]కళా । పారాయణుఁ డగుచుఁ [2]బుట్టెఁ - బ్రహ్లాదుం డా
వీరాగ్రగణ్యునకు నం । గారకపాలంబులోనఁ - గమలము వోలెన్. 224

తే. సకల కల్యాణ లక్షణ-సంయుతుండు । సుతుఁడు జనియింపఁ[1]బుత్రవ-త్సుఖము గాంచె,
దర్శనాలింగనాలాప - తతులవలనఁ । జారుతరమూర్తి, దానవ - చక్రవర్తి. 225

ఉ. అద్దనుజేంద్రుఁ డిట్లు ప్రమ - దాతిశయంబును బొంది, జాతక
ర్మాదు లొనర్చి, నందనుఁ బ్ర - యత్నమునం బెనుపంగ, వాఁడు ని
త్యోదయ వర్ధితుండగుచు - నుండె, సురారియు నొక్కనాఁడు శు
క్రోదితకార్యుఁడై, నిజ పు - రోహితులం బిలిపించి [1]యిట్లనున్. 226

## ప్రహ్లాదుని విద్యాభ్యాసము

ఉ. భూదివిజేంద్రులార! కుల - భూషణుఁడైన మదీయపుత్రుఁ, బ్ర
హ్లాదుని వీనిఁ బట్టి, యుప - లాలనపూర్వముగాఁగ నీతిశా
స్త్రాది రహస్యముల్ దెలియ, - యత్నమునం జదివించి, దైత్యమ
ర్యాద లుపన్యసించి, చరి - తార్థునిజేయుఁడు సత్వరంబునన్. 227

ఆ. అని, హిరణ్యకశిపుఁ - డాత్మకుమారుని । నా పురోహితులకు - నప్పగించి
యనుప, విప్రవరులు-నసురేంద్రనందనుఁ । గొనుచు నిజ నివాస-మునకు నరిగి, 228

(223) 1 శంఖ - మ,తా,తి,హా,ర,క (224) 1 సదా-మా,త 2 నుండె - మ,మా,తి,హా,ర,క
(225) 1 బుత్రకోత్సవము (యతి?)-మ,తా;బుత్ర ఉత్సవము-తి,హా,ర (226) 1 యిట్లనెన్-మా,త

ఉ. వేదకళా రసజ్ఞుని వి - వేకనిధుల్ చదివించి, రాప్త ల
క్ష్మీదయిత ప్రసాదు, మతి - కీలిత భాగవత ప్రశస్త మ
ర్యాదు, నఖండబోధ సలి - లాపహృతాఖిల పాపశాదు, ప్ర
హ్లాదు, గతప్రమాదు, దను - జాంతకభక్తి కృతప్రమోదునిన్. 229

ఉ. అత్తఱి నొక్కనాఁడు దను - జాన్వయవర్యుఁడు, మంత్రి బంధు మి
త్రోత్తమ సేవకుల్ గొలువ - నోలగముండి, కుమారు శాస్త్రనం
పత్తి పరీక్షణార్థము కృ - పాయుతుఁడై పిలువంగఁ బంచినం,
దత్తనుజాతుఁ దోడ్కొని ము - దంబున వచ్చిరి విప్రపుంగవుల్. 230

వ. ఇట్లు చనుదెంచి, మహీసురులు దనుజాగ్రేసరు నాశీర్వదించి, జితమనోభవుండగు తనూభవునిం బురోభాగంబున నిలిపిన, 231

ఉ. దానవచక్రవర్తి సుతు - దగ్గఱఁదీసి, నిజాంకపీఠికా
సీనునిజేసి, మైనిమిరి, - చెక్కిలి నొక్కి, యురంబు మేనితో
నాని, శిరంబు మూర్కొని, ప్రి - యంబున నిట్లనుఁ, బుత్ర! నీవు వి
ద్యానిధివైతి వంచుఁ గొని - యాడుదు రార్యులు ప్రస్తవంబునన్. 232

క. నీనేర్చినట్టి నీతి వి । తానములో నొక సుభాషి - తము చదువుము, నా
కానందంబుగ, మధుర వ । చో నిపుణత కెల్లవారు - చోద్యంబందన్. 233

వ, అనిన దనుజనునాసీరునకుఁ బ్రహ్లాదుం డిట్లనియె. 234

ప్రహ్లాదుని హరిభక్తి

చ. పురుషవరేణ్య! నిత్య పరి - పూర్ణముదంబున నిర్మలుండనై
గురు చరణారవిందముల - కుం బరిచర్య యొనర్చి, శాస్త్ర వి
స్తరముఁ బఠించి, యందు సద - సత్త్వ వివేకము నిర్ణయించి, యే
నెఱిఁగినవాఁడఁ, దత్త్వ మది - యెట్టిదనా, విను మేర్పరించెదన్. 235

లయగ్రాహి

నీరజభవాది నుతు, - ఘోర రిపుసంహరుఁ, బ
    - యోరుహ విలోచను, న - పార గుణరాశిన్,
హారచయ భూషితుఁ, గృ - పారస సమన్వితు, ను
    - రారి[1]వనపావకుని, - భూరమణి నాథున్,
దారుణ సుదర్శన వి - భా రుచిర హస్తు, నవ
    - నీరద సమాన రుచి - పూరిత నిజాంగున్,
మేరునగ ధీరుని, ర - మారమణు, భక్త సుర
    - భూరుహముఁ గొల్చెద న - నారతము భక్తిన్. 236

చ. అనవుడుఁ, గర్ణరంధ్రముల - నగ్నిశిఖా పరితప్త శూలముల్
చొనిపినయట్లు మిట్టిపడి, - చూపుల నిప్పులు రాల, హుంకృతి
ధ్వనుల నభంబు వ్రీల, భయ - దంబగు రౌద్రము మూర్తిదాల్చెనో
యనఁ, గడు నుగ్రుఁడై, దితిసు - తాగ్రణి విప్రులఁ గాంచి యిట్లనెన్. 237

హిరణ్యకశిపుని యాగ్రహోదగ్రత

ఉ. బాలుఁడు వీఁడు, బుద్ధిపరి - పాక విదూరుఁడు, విష్ణువర్ణనా
మూలములైన పద్యములు - మూర్ఖత మీరెటిఁగింపకున్న, నే
పోలిక నేర్చు? నాపగతుఁ - బూని నుతించునె మత్సుతుండు? శా
ర్దూల కిశోరకంబు మృగ - ధూర్త పరాక్రమమున్ గణించునే? 238

క. పౌరోహిత్య మిషంబున । నారాయణు పనుపుఁ బూని, - నను వంచింపన్
గోరి, యిట కరుగుదెంచిన । వైరులు గా కిట్టి విప్ర - వరులుం గలరే? 239

ఉ. నావుడు, దైత్యనాథు వచ - నంబుల వేఁడిమి కోర్వలేక, భూ
దేవ[1]కులాఢ్యు లిట్లనిరి, - దేవ! భవత్సుతుఁ డేదనేర్చెనో
శ్రీవిభువర్ణనం, బిది వి - చిత్రము, మానసములోన నీతి వి
ద్యా[2]విదుఁ జేసి, నీమదికి - హర్షమొనర్చెద, మంపు క్రమ్మఱన్. 240

ఆ అని ప్రతిజ్ఞ పలికి, - [1]దనుజేంద్రనందను । వెంటఁ దోడుకొనుచు - విప్రు లరిగి,
సంతతంబు నీతి - శాస్త్రంబుఁ జదివింపు । చుండి, రంతలోన - నొక్కనాఁడు, 241

(236) 1 దవపావకుని - మ,మూ,శ,తి,తీ,హ,ర,క (240) 1 కుమారు-తీ 2 నిధి (ప్రాస?)- తా
(241) 1 యసురేంద్ర - క

## రాక్షస కుమారులకుఁ బ్రహ్లాదుని విష్ణుభక్తి ప్రబోధము

క. శ్రీరమణీవల్లభు పద । సారస సుజ్ఞాన మధు ర - [1]స స్థిర భృంగా
కారుండగు ప్రహ్లాదకు । మారుఁడు, వైష్ణవ రహస్య - మతములు[2]దెలుపన్, 242

చ. మదిఁ దలపోసి, కొందఱు స - మానవయస్కుల దైత్యబాలురం
గదియఁగఁ బిల్చి, మీకు హిత - కార్యము చెప్పెద, రండు, దుర్జనుల్
మెదలని[1]చోటి కంచు, నొక - మేరకుఁ దోకొనిపోయి, వారితో
సదయ వచోవిశేషములు, - సాత్త్వికభావము మీఱ నిట్లనున్. 243

ఉ. దానవపుత్రులార! సుఖ - దంబగు నెయ్యది మీకు, నేమిటం
గాని శరీర మోహమయ - గాఢతమంబు నణంపఁజాలు సు
జ్ఞాన మహాప్రదీపము ప్ర - సన్నత[1]గైకొన, దట్టి తత్త్వము
న్మానుతలీలఁ దెల్పెద, వి - నుండు[2]మనంబున సావధానులై. 244

సీ. క్షీర వారాశిలో-శేష తల్పంబునఁ । బద్మాలయాభర్త - పవ్వళించు,
నా సర్వమయు[1]ని నా - భీ సరోవరమునఁ । జతురాస్యుఁడై ధాత - సంభవించె,
నతనిచే నిర్మితం - బయ్యె బ్రహ్మాండంబు । పాతాళ భూ స్వర్గ - భరిత మగుచుఁ,
దత్త్రిలోకముల మ - ధ్యమ లోకమైనట్టి । భూమి, సప్తద్వీప - ములఁ దనర్చె,
తే. నట్టి దీవులలోన వి-ఖ్యాతి గాంచె । జాంబవద్ద్వీప, మంబుధి - శైల గహన
మనుజ గో విప్ర ముఖ వర్ణ - మానవేంద్ర । పుర[2]వన గ్రామ వాహినీ - పూర్వమగుచు.

మ. భువన[1]స్తుత్య గుణానురూపమగు జం-బూద్వీపమం దాత్మక
ర్మ వితానానుగుణంబుగా వివిధ గ - ర్భప్రాప్తుఁడై, జీవుఁ డు
ద్భవకాలంబున సూతిమారుతము నొం - పన్, యోనిమార్గంబునన్
భువికి న్వెల్వడి, మోహపాశ నికరం - బుల్ దన్ను బంధించినన్, 246

క. ఎఱుకచెడి, సతత తృష్ణా । పరవశుఁడై పెరిగి, పుత్ర - [1]భార్యాదులపై
మరులుగొని, విత్త కాంక్షా । [2]పరిపీడితుఁ డగుచు, [3]దీన - భావాన్వితుఁడై, 247

(242) 1 సంస్థిర-క;సుస్థిర (యతి?)-మ,మా,త,తా,హ,ర 2 పెలుచన్-తీ (243) 1 యిక్క-తీ (244) 1 గైకొనుఁడట్టి-తీ 2 మదంబున-క (245) 1 నిజనాభిసరోరుహమునఁ జతుర్ముఖుఁడు దామును జనించె - తి; స్వీయమగు నాభిపంకేజమునఁ జతుర్ముఖుఁడు దామునుజనించె - తీ 2 వర - తా (246) 1 వ్యక్త - తీ (247) 1 దారాదులకై (యతి?)-మా 2 పర - మ,మా,తి,తీ,హ,ర,క 3 విత్త - తి,తీ,హ,ర

చ. చలదళ పల్ల[1]వాంచల ని - షక్త పయఃకణ భాతిఁ, జాలఁ జం
చలమగు మేను నమ్మి, కలు - షంబు లనేకము లాచరించి, [2]లో
తలఁపు విహీనుఁడై, పిదపఁ - దత్తనువున్ బెడఁబాసి, యాతనా
కలిత శరీరుఁడై, నిరయ - కల్పిత బాధల దుఃఖ మందుచున్, 248

క. అనుభూత పాపఫలుఁడై । పునరుద్భవ మంది, విష్ణుఁ - బూజింప, మనం
బున భక్తి నిలుప నేరక । ధన దార సుతేషణములఁ - దగిలి నశించున్. 249

ఉ. ఇట్టు, సరోజనాభు భజి - [1]యింప నెఱుంగక, తామసాత్ముఁడై
పుట్టుచు గిట్టుచున్, జముని - పోకలఁ గీడ్పడుఁ, గాన భవ్యమై
నట్టి మనుష్యగాత్రముఁ బ్రి - యంబునఁ[2]గైకొని, బోధయుక్తుఁడై,
చుట్టిన ఘోర మోహ దృఢ - సూత్రములం దెగఁగోసి, ధీరుఁడై, 250

ఉ. చిత్తము శౌరిపాదములఁ - జేర్చి, తదర్పణబుద్ధి నిత్య నై
మిత్తిక కర్మముల్ నడపి, - మిన్నక కామ్య నిషిద్ధ దుష్క్రియా
వృత్తికిఁ బోక, సంతతము - విష్ణుపరాయణుఁ డైనయట్టి వి
ద్వత్తిలకుండు, గాంచు నప - వర్గము నిర్గళితాంతరాయుఁడై. 151

ఆ. ఇది మహా రహస్య, - మీ చందమున మీరు । బాహ్య వస్తు వాంఛఁ - బరిభవించి,
విశ్వమయుని, శాశ్వ - తైశ్వర్యుఁ గొలువుఁడీ! । దనుజతనయులార! - దినదినంబు. 252

క. అని, యిబ్విధమున దానవ । తనయులకును [1]భుక్తి ముక్తి - దాయకమగు పా
వన విష్ణుభక్తి యోగము । నొనరఁగఁ బ్రహ్లాదవర్యుఁ - డుపదేశించెన్. 253

## కుమార విద్యావైదుష్య పరీక్ష

వ. అంత, నొక్కనాఁడు హిరణ్యకశిపుదానవేంద్రుండు మణి భూషణాంబర గంధ మాల్యాలంకృతుండై, శూలహస్తుండగుచు, సభాభవనంబున కేతెంచి, సింహాసన సమాసీనుండై, రంభాద్యప్సరో నృత్యం బవలోకింపుచు, వంది మాగధ సంస్తూయమాన నిజ బిరుద గద్యపద్య శ్రవణ జాత కౌతూహలుండగుచు, సభాభవనంబునఁ బేరోలగంబుండి, గురుగృహంబున నున్న ప్రహ్లాదకుమారు రావించి, నిజ వామాంకపీఠంబున నునిచి, సాంత్వనపూర్వకంబుగా నిట్లనియె. 254

(248) 1 వాంచిత-తి 2 బోదలప-అన్ని ప్ర. (250) 1 యించుమెఱుంగక-తి 2 గన్గొని-మ,మూ,శ (253) 1 భక్తి-తి,తి

చ. గురువులు సంతసింప, నను - కూలుఁడవై, పఠియించితే మనో
[1]హరముగ నీతిశాస్త్రము స-మస్తము నన్న! కుమార! నిన్నుఁ బా
మరులగు దైత్య[2]నందనులు - మందుఁ డటందురు, వారిమాట బో
ల్పఱచుటకై పఠింపు మొక - పద్యము, నర్థవిశేష హృద్యమున్. 255

వ. అనినఁ బ్రహ్లాదుఁ డిట్లనియె. 256

## ప్రహ్లాదుని విష్ణుతత్త్వ వినిర్ణయము

క. చదివితి [1]హరి గుణ గణములు, । చదివితిఁ దత్పాదభక్తి - సాధనములు, నేఁ
జదివితి [2]నతని మహత్త్వముఁ । జదువులలో నింతకంటెఁ - జదువులు గలవే? 257

క. జనన స్థితి విలయములకు । వనజోదరుఁ డతఁడు కర్త - వర్ణింపఁగ నీ
కనుభవకారణ మగు నీ । ఘన రాజ్యప్రాప్తి యతని - కరుణన కాదే? 258

సీ. ఆద్యంతశూన్యుఁ, డ - వ్యయుఁ, డజేయుఁడు, లోక । నాథుండు దుర్జన - నాశకరుఁడు,
బహుకోటి భాస్కర - ప్రతిమాన తేజుండు । సజ్జన హృత్పద్మ - సదనవర్తి,
యాశ్రిత సురభూజ, - మఖిల భూతాంతర । స్థైర్య క్రియావేది, - సర్వసముఁడు,
సనకాది యోగీంద్ర - సంతత ధ్యేయుండు, । త్రిగుణ వ్యతీతుండు, - దివిజవంద్యుఁ

తే. డమల[1]చరితుఁడు, భాగవ - తానురాగి, । [2]పశ్వమయమూర్తి, వేదాంత - వేద్యకీర్తి,
శేషపర్యంక శయనుండు,-శ్రీయుతుండు,। పొలుచు నన్నింటిలోఁ బరి-పూర్ణుఁడగుచు. 259

క. హరముఖ్యులే మహాత్ముని । చరితము సర్వంబుఁ దెలియఁ - జాలరు, నే నా
[1]పురుషోత్తముని మహత్త్వము । నెఱయఁగ వర్ణింపనేర్తు - నే? దనుజేంద్రా! 260

ఆ. నా మనోవిహారి, - నాపాలి దైవంబు, । శ్రీ మహీ ధవుండు, - శేషశాయి,
యతని నెఱుకపఱచు - నవి గాక చదువులు, । చక్రిఁ దెలుపలేని - చదువు చదువె? 261

క. అని పలికిన ప్రహ్లాదుని । సునిశిత వాక్యాళి కర్ణ - శూలములైనం
[1]గనలిపడి, యంక గతుఁడగు । తనయుని బడఁద్రోచి, భృత్య - తతి కిట్లనియెన్. 262

(255) 1 హరమగు-త 2 బాలకులు-తీ (257) 1 నేహరిగుణములు - మ,తా,తి,తీ,హా,ర,క 2 (దన్మాహాత్మ్యము-మా,త; నిదన్మహత్త్వము-తా (259) 1 భాగవతానుగ్రహానురాగి-తా; భాగవతా జనతానురాగి-మా 2 విబుధగణనీయవేదాంత వేద్యమూర్తి-తీ (260) 1 పురుషోత్తమునిమాహాత్మ్యము-త (262) 1 గనిపర్యంకగతుండగు-తా;ఘనపర్యంకగతుండగు-మ; తనపర్యంకగతుండగు-తి,హా,ర;దను జేంద్రుఁడంకగతుఁడగు-తీ

సుకుమార కుమారుని రూపుమాపఁ గుపితపిత యానతి

శా. లోకానీకము సంచలింప, దనుజు ల్భూషింప శూరుండనై
నాకౌకఃపతిముఖ్య దిక్పతుల స - న్నాహంబుతో గెల్చి, యి
ట్లేకచ్ఛత్రముగా, నజాండభవనం బే - నేలఁగా, వీఁడు ల
క్ష్మీకాంతుండు జగద్విభుం డనుచు నా - క్షేపోక్తులం బల్కెడిన్. 263

ఉ. న్యాయ[1]పథంబు దప్పి, కుల - నాశకుఁడై జనియించె వీఁడు, దే
వాయతనంబుఁ గూల్చుటకు - నై యుదయించిన రావి వోలె, నా
రాయణుఁ డెన్న మద్విమతుఁ, - డా కుటిలాత్ముని [2]గొండచేసి, మే
ధాయుతుఁడై నుతించె వస - ద్రావిన[3]యట్లు నిరర్థకోక్తులన్. 264

ఆ. ప్రకృతి[1]బంధుఁ డయ్యుఁ - బగవానిఁ గూడిన । వాఁడు పగతునట్లు - వధ్యుఁ డండ్రు
కాన, వీనిఁ బట్టి - మీ నేర్చుతెఱఁగులఁ । దునుముఁ [2]డిపుడు రాజ - తనయుఁ డనక. 265

వ. అని యానతిచ్చిన దానవరాజునాజ్ఞం దలమోచి, తత్కింకరులు రోష భయంకరు లగుచుఁ బ్రహ్లాదుని బుర బహిరంగణమునకుం దిగుచుకొని, వధ్యశిలా మధ్యంబున నుపవిష్టుం జేసి, 266

క. కలుషించి దైత్యనాథుఁడు । నిలుపోపక మమ్ముఁ బిలిచి - నినుఁ దునుముటకై
సెలవులు మూఁడు నొసంగెను । దలఁపుము నీ యిష్టదైవ - తంబుఁ గుమారా! 267

వ. అనినఁ, బ్రహ్లాదుండు దైత్యుల కిట్లనియె. 268

విష్ణుభక్తి మహిమ

శా. గోవిందుండన నొప్పు నెవ్వఁడు, జగ - త్కూటస్థుఁ డెవ్వాఁడు, వి
శ్వావిర్భావ వివర్ధన క్షయకర - వ్యాపారుఁ డెవ్వాడు, నా
నా వేద స్తవనీయుఁ డెవ్వఁడు, చిదా - నందాత్ముఁ డెవ్వాఁడు, నా
దైవం బా జలజోదరుం, డతనిఁ జి - త్తంబందు భావించెదన్. 269

---

(264) 1 పదంబు - త,తా 2 గొప్ప - త 3 చిల్క - క (265) 1 బంధుఁడైన - మం,మా,తా,హా,ర; బద్ధుఁడైన-క 2 డితఁడు - ర

మ. అని, ప్రహ్లాద[1]కుమారుఁ డట్టు లభయుం - డై, వార్ధికన్యాధవున్,
వనజాక్షున్, దనుజాంతకున్, మురహరు - న్వర్ణింప, నా కింకరుల్
ఘన రోషానల [2]దీపితాస్యు లగుచున్-గర్జించి, యా పుణ్యవ
ర్తనుపై ప్రేసిరి, ఖడ్గ శూల శిత కుం - త క్రూర బాణాదులన్. 270

చ. అసురభట ప్రయుక్తమగు - నా శిత శస్త్రచయంబు దైత్యరా
జ సుతుని వజ్రసారమగు - చారు శరీరము దాఁకి, చూర్ణమై
వసుమతి రాలెఁ గాని, యొక - వంకయు[1]నొంపఁగలేకపోయె, నా
బిసరుహబాంధవుం దిమిరబృందము - లోపునె యాక్రమింపఁగన్? 271

ఉ. ఆయుధ సంప్రయోగము ని - రర్థకమౌట [1]నెఱింగి, క్రవ్యభు
గ్నాయక కింకరుల్ సమద - నాగ నికాయము లా కుమారుపై
నాయతశక్తి దీకొలుప, - నా ద్విరదంబులు నొక్కపెట్టఁ [2]ద
త్కాయము దూఁటి, యాక్షణమ - ఖండిత దంతము లయ్యె నన్నియున్. 272

తే. దంతములు విర్గి యపుడ దం - తావళంబు । లాఁడుపోఁడిమిఁ గైకొని-చూడ నొప్పెఁ,
బురుషకుంజరుఁ డనుచు నా - పరమపుణ్యు । డాయ వచ్చిన కరిణీ ని - కాయ మనఁగ.

చ. క్రమమున నంతఁ బోక యసుర - ప్రభుకింకరు లుగ్ర కృష్ణ స
ర్పములఁ బ్రచండతం గఱవఁ - బంచిన, దానవరాట్కుమారు గా
త్రముఁ గబళించి, తత్ఫణులు - రక్తము గ్రక్కుచుఁ బాఱె, నట్ల, సం
భ్రమమునఁ దార్క్ష్యవాహనుని - భక్తులఁ బాములు[1]నొంపఁజాలునే? 274

ఉ. పోయక దైత్యు లిట్లు బహు - భంగుల బాధలొనర్ప "విష్ణుదే
వాయ నమో, [1]నిరంత విభ - వాయ నమో, జలజాలయా కళ
త్రాయ నమో, నిశాచర హ - రాయ నమో" యనుఁ గాని, క్రవ్యభు
గ్నాయకనందనుండు చల - నంబునఁ బొందఁ డొకించుకేనియున్. 275

క. స్మరణ మొనర్చిన నంతః । కరణములో నెగులు దీర్చు - కమలాక్ష శ్రీ
చరణము; తన్నామ స్తుతి । కరణము వెలివంత మాన్పఁ - గలుగుట యరుదే? 276

(270) 1 కుమారధీరుఁడ-మ; కుమారకుండభయుఁడై యా-తి,తీ,హ,ర,క; డప్పుడభయుండై-మా 2 పీడితాస్యు-క (271) 1 నొవ్వఁగ-మ,హ,ర,క; నోర్వఁగ-త; నెవ్వగ-తి,తీ (272) 1 యునర్గి - మా,త 2 నాకాయము-మ,తా,తి,తీ,హ,ర,క (274) 1 నొవ్వ-తీ (275) 1 యనంత-తీ

### పుండరీకాక్షుఁడు ప్రహ్లాదుని బరీక్షించుట

ఉ. వెండియు, దైత్యు లగ్ని విష - వేదన కృత్యము లాచరించియున్
జండతఁ జూపియుం దునుమఁ - జాలక, బాలకు నుగ్రపాశ బం
ధుండుగఁ జేసి, యంబునిధిఁ - ద్రోచినఁ, దత్సలిలంబులోపలన్
గొండొక మగ్నుఁడై, మది ము - కుందుని బేర్కొనుచుండు నత్తఱిన్, 277

ఉ. పంకరుహాక్షుఁ, డార్తజన - పాలన దక్షుఁడు, శేషభోగి ప
ర్యంకుఁడు, శంఖ చక్ర కలి - తాంకుఁడు డగ్గఱ వచ్చి, యాత్మ వా
మాంకమునందు దైత్యతన - యాగ్రణి నుంచి, శిరంబు దువ్వి, క్షే
మంకర వాగ్విశేషమున - మచ్చిగఁ దేల్చుచుఁ గూర్మి నిట్లనున్. 278

చ. జనకునియాజ్ఞ నిల్పక, ని - శాచరకోటి కసమ్మతుండవై,
ఘనతర చక్ర కుంత శర - ఖడ్గ గజోరగ వహ్నిముఖ్య వే
దనముల నొంది, యిట్లు సత - తంబు కృశింపుచు, బాల్యచాపలం
బున మృతిపొందెదేమిటికి - బుద్ధివిహీనుఁడవై కుమారకా? 279

సీ. అఖిల లోక స్వామి - యైన నీ జనకుఁ డే । కాతపత్రంబుగా - నసురరాజ్య
మంతయుఁ బాలింప, - నతని యాజ్ఞాస్థితిఁ । ద్రోయక బుద్ధిమం - తుండ వగుచు
నీతిశాస్త్రాభ్యాస - నిపుణ మానసుఁడవై । యువ[1]రాజపట్టమై, - భవము దాల్చి,
యంబరాభరణ మా - ల్యా లేపనాదుల । నర్థిఁ గైకొని రత్న - హర్మ్యములను,

తే. మృదుల శయ్యాతలంబున - మదన పరవ । శాంగనా జన [2]ప్రియ సమా - లింగనాది
సురత సౌఖ్యంబు లనుభవిం - చుటకుఁ బాసి, యాపదలఁ బొందఁ దగునె ప్రహ్లాద! నీకు?

క. నావుడుఁ, దత్తను సంగో । ద్భావిత సుజ్ఞాన మహిమఁ - బరమేశునిగా
భావించి, దనుజపతిసుతుఁ । డా వనజాక్షునకు వినతుఁ - డై యిట్లనియెన్. 281

### ప్రహ్లాదుని ప్రార్థనము

క. తల్లివి తండ్రివి జీవిత । వల్లభుఁడవు నీవ కాక - వసుమతి [1]నాకుం
దల్లి యనఁ దండ్రి యనగా । వల్లభుఁ డన నొరులు గలరె - వనజదళాక్షా? 282

(280) 1 రాజ్య - అన్ని ప్ర. 2 కుచ - మూ, త (282) 1 లోనం - మ, క

తే. నలిననిలయావరేణ్య ! నీ - నామ పఠన । వజ్రపంజర మధ్యమ - వర్తియైన
నా శరీరంబునకు నేల - నాశ మొదవు ? । దానవాధము ఘోర కృ - త్యములవలన.

చ. కమలభవాది దైవతని - కాయములున్, సనకాది యోగిబృం
దములును, నారదాది ముని - నాయక వర్గములున్, విశిష్ట క
ర్మము లొనరించియైన, సుక - రంబుగఁ గానఁగలేని, నీ స్వరూ
పముగనుఁగొంటిఁ, దొల్లిటి త - పంబులు నాకు ఫలించె నన్నియున్. 284

తే. జన్మసాఫల్య మయ్యె నీ - చరణకమల । దర్శనంబునఁ - బ్రాగ్దురి - తంబు లణఁగెఁ,
గనకకశిపుని దండించి-కమలనాభ ! । ధర్మసంస్థాపనము సేయు -[1]దయ దలిర్ప. 285

మ. అని ప్రహ్లాదుఁడు విన్నవించిన, సరో - జాక్షుండు మందస్మితా
ననుఁడై, యిట్లను, విన్మ దైత్యసుత ! నిం - దానై పుణిన్ [1]మించు నీ
జనకుం దున్మెదు, ధర్మ మేర్పఱతు, దు - ష్ట శ్రేణి ఖండింతు, వ
ర్ధన మొందం బ్రకటింతు వేదతతులన్, - దండింతుఁ బాషండులన్. 286

మ. అభిషేకింతుఁ బురందరుం ద్రిదశరాజ్యంబందుఁ బూర్వాకృతిన్,
విభవోపేతులఁజేసి సాత్త్వికులఁ గా - వింతు న్మహీమర్త్యులన్,
శుభసంపన్నుఁడవై సహస్ర భువన - స్తుత్యుండవై యుండు, నీ
కభయంబిచ్చితి, నేఁగు నీపురికిఁ బు - త్రా ! వైష్ణవాగ్రేసరా ! 287

క. అని పలికినఁ, బ్రహ్లాదుం । [1]డనుముదిత స్వాంతుఁ డగుచు - నబ్జాక్షునకున్
వినతు లొనరించి, సంశయ । మను [2]లత ఖండించి, [3]మగుడి - యరిగెం బురికిన్. 288

## దనుజకింకరులు దానవపతికిఁ జోద్యమును విన్నవించుట

వ. ఇట్లు ప్రహ్లాదుండు పురంబున కరుగునంతమున్న, యతని వనధిం ద్రోచి చనిన కింకరులు హిరణ్యకశిపు సమ్ముఖంబునం గరకమలంబులు [1]మొగిచి నిలిచి, వధ్య శిలారోపణంబు మొదలను సముద్ర [2]నిపాతనంబు తుదయు నగు కుమారుని వృత్తాంతంబు సర్వంబును విన్నవించి, వెండియు నిట్లనిరి. 289

(285) 1 నిర్మలాత్మ - క (286) 1 మించెనీ జనకుండున్నద పర్పమేర్పరతు-అన్ని ప్ర. (288) 1 డునుముదిత స్వాంతుఁడగుచునుతులను బంకే । జనయను కడ సంశయ-తీ 2 తల-మ,తి, హ్మ,ర,క 3 మగుడనరిగెం-మ,తా,తి,తీ,హ,ర,క (289) 1 ముకుళించి-తీ 2 నిర్ఘాతనము-మ,తి,హ,ర

ఉ. [1]చూచితి యొక్క చోద్యము య - శోధన! నీసుతు నంబురాశిలో
వైచినవేళ నొక్క ఫణి - వర్యుఁడు వచ్చి, తదీయ బంధ ని
ర్మోచన మాచరించి, [2]యను - మోదమునం గొనిపోయి, వార్ధిరా
డ్వీచి పరంపరా విమల - వేశ్మము సొచ్చెఁ బ్రసన్నమూర్తియై. 290

క. ఊహింపఁగఁ బ్రహ్లాదుని । మాహాత్మ్యము ఘనము, నీ కు - మారుఁడె? దైత్య
శ్రీ హరియింపఁగ వచ్చిన । శ్రీహరి గాకెందు నిట్టి - చిత్రము గలదే? 291

క. *అని విన్నవింపుచుండం । దనుజేంద్రుఁడు చారముఖము -[1]నం దా బ్రహ్లా
దుని రాక విని సముద్య । ద్ఘన రోష దవాగ్ని శిఖలు - గగనము ముట్టన్, 292

## హిరణ్యకశిపుఁడు పుత్రవధార్థము ససైన్యము వెడలుట

క. *[1]కులముచెడఁ గుట్టుసుతునిం । బొలియించెద నేనె యనుచు, - భూరి కృపాణో
జ్జ్వల హస్తుఁడై చతుర్విధ । బలములతోఁ బురము వెడలె - భయరహితుండై. 293

చ. అమరవిరోధిసైన్య చర - ణాహతి జాతములై ధరా పరా
గములు దిశావకాశములు - గప్పి, కసుంగొన[1]నొప్పె, నిందిరా
రమణుఁడు చంపునంతకును - రాక్షసుఁ డొండెడకేఁగె నేనిఁ గా
ర్యము చెడునంచు నప్పుడ ర - యంబునఁ గండ్లరికట్టెనో యనన్. 294

క. కడు వడి దానవసేనలు । నడచునెడం దద్భరంబు - న ధరణి వణఁకెన్,
బొడిమన్ను రాలె శేషుని । పడగలు వెయ్యింటిమీఁదఁ - బాతాళమునన్. 295

ఉ. వాసవుఁ డాత్మపక్షములు - వజ్రహతిం దునుమాడఁ గొండ లా
యీసునఁ దద్విరోధి దను - జేంద్రుని జేరెననంగ, దాన [1]ధా
రా సముదగ్ర నిర్ఝర ప-రంపరతోఁ గనుపట్టె దైత్య సే
నా సమదద్విపంబు[2]లవి - నమ్ర రిపువ్రజ నిష్కృపంబులై. 296

చ. జలరుహబాంధవుం డమర - శైలము చుట్టును నెక్కియాడుచో
వలపలివాగె కాని గరు - వంబున దాపలివాగె ద్రిప్పనన్
మలఁగవు, నీరథాశ్వములు - మా కెనగావని, హేషితారవ
చ్ఛలమున నార్చె నవ్వు, సుర - శాత్రవ సైన్య తురంగమావళుల్. 297

---

(290) 1 చూచితి మొక్క - మ,మా,తా,హ,ర,క 2 యును - తీ (292) * ఈ ప.తీ.ప్ర.లో లుప్తము. 1 నందుం బ్రహ్లా - తా; * ప. 293, 294 మా.ప్ర.లో లుప్తము. (293) 1 కులము పొడగుట - తీ;కులము చెడగుట - తి,ర (294) 1 నొచ్చి-అన్ని ప్ర. (296) 1 వారాసముదగ్ర - అన్ని ప్ర. 2 లువినమ్ర-తీ

తే. కండ్లపస చూపి కామినీ - గణము వోలెఁ । బరుష విషమాస్త్ర వేదన - బొలుపఱుపఁ
గల మనోగతి బెడిదంబు -గా[1]వెలుంగు । దైత్యనాయకు సేనా ర - థ వ్రజంబు. 298

తే. నీలలోహిత మూర్తులు, - శూలధరులు । నుగ్రవేషులు నగుచు దై, - త్యాగ్రగణ్య
వీరయోధులు మూర్తీ భ-వించినట్టి । రౌద్ర [1]రసమునఁ బొల్తు రు-న్నిద్రమహిమ. 299

వ. ఇట్లనన్య సామాన్యంబగు సైన్యంబుతో హిరణ్యకశిపు యాతుధానప్రముఖుండు [1]కుమా
రాభిముఖుండయి చనునెడ ముందట, 300

### నరసింహావిర్భావము

క. [1]ప్రళయానల [2]సన్నిభమై । [3]జలజాధిప కోటి కోటి - సంకాశంబై
యిల నొక తేజఃపుంజము । కలయఁగ దిశలెల్లఁ గప్పి - కనుఁగొనఁబడియెన్. 301

మ. మెఱుఁగుంగోఱల నిప్పుకల్ దొరుఁగ, నా - మ్రేడీకృతారావ [1]ని
ష్ఠురయై జిహ్వ నటింప, నూర్పుల గిరి - స్తోమంబు లూఁటాడఁ, గ్రో
ధ రసావేశము నేత్రము ల్దెలుప, నా - దైత్యేంద్రు ఖండింపఁగా
నరసింహాకృతి దాల్చి, యందు వెడలె - న్నారాయణుం [2]డుగ్రుఁడై. 302

ఉ. ఇట్టితి ఘోరమూర్తి నుద - యించి, సురాసుర దుర్నిరీక్షుఁడై
నట్టి నృసింహదేవుని భ - యంకర లోచన నిర్య దగ్ని సం
ఘట్టనమాత్ర [1]నద్భుతము - గాఁ బరిదగ్ధములయ్యె దైత్య రా
ట్పట్టణ హర్మ్య గోపుర స - భాగృహ కోశ[2]గృహాదు లన్నియున్. 303

ఉ. ఆ తెఱఁగెల్లఁ గాంచి, దను - జాగ్రణి [1]కోప కషాయి[2]తాస్యుఁడై
యీతఁడువో! మదీయ రిపుఁ, - డీతఁడువో! జలజాలయా మనో
నేత, నృసింహుఁడైన యిత - నిన్ బలిచేసెదఁ జుట్టుముట్టి, నా
హేతి [3]కరాళ కాళికకు - నిప్పుడ నందనువెట్టి మానఁగన్. 304

---

(298) 1 మెలంగు-త (299) 1 రసమున-అన్ని ప్ర. (300) 1 విహారాభి-మా;పరాభి - మ; వారాభి-తి,ర (301) 1 ప్రళయానిల-అన్ని ప్ర. 2 సంభవమై-మ,మా,త,తి,తీ,హ,ర; సంభ్రమమై-క 3 జలజాహిత-అన్ని ప్ర. (302) 1 నిష్ఠురమై-తీ 2 డుద్ధతిన్ - తీ (303) 1 నుద్ధతము - తా;దుత్తు ఋము-మ,తి,తీ,హ,ర,క 2 భువనాదు-క (304) 1 రోష-తీ 2 తామ్రుడై-తీ;తామ్రుఁడై-హ 3 కరాళ కాళిక-తి,తీ

కనకకశిపు విదళనము

చ. ఎదురెదురేఁగి దైత్యవరుఁ - డేచినకోపముతోడ మిక్కిలిం
గదిసి, భయంబు లేక, నిజ - ఖడ్గముపూని, నృసింహమూర్తిపై
నదటున వ్రేయఁ జూచుటయు, - నంతకుమున్న రమావిభుండు త
త్పదములుఁ జేతులుం బెనఁచి - పట్టి, చలింపఁగనీక యుగ్రతన్, 305

క. [1]తొడ లను వధ్యశిలాస్థలిఁ । బడవైచి, నఖఁబు లను కృ - పాణంబులచే
వడివడిని [2]వ్రచ్చి ప్రేవులు । తొడిమలుకూడంగఁ ద్రెంచి - దుర్వారుండై, 306

మ. కర పాద ప్రముఖాఖిలాంగకములన్ - ఖండించి, దైత్యేశ్వరుం
బరలోకంబున కన్పి, తద్రుధిర కుంభత్సేచనప్రాప్తి బం
ధుర కోపాగ్ని శమించినం, ద్రిదశ[1]నాథుం గాంచి, కారుణ్య ని
ర్భర వీక్షా నికరంబునం దనుపుచుం, - బ్రహ్లాదు నగ్గింపుచున్, 307

ప్రహ్లాదరాజ్య పట్టాభిషేకము

క. * రారమ్మని, నిజ చరణాం । భోరుహ భక్తాగ్రగణ్యుఁ - బుణ్యు నతని ర
క్షోరాజ్య భద్రపీఠ న । మారూఢుని జేసె దివిజు - లానందింపన్. 308

క. కావున సంఖ్యాతీతము । లై వెలసిన హరిగుణముల - నభినుతి సేయం
గా, వాణీవల్లభ ముఖ । దేవావళికైన నరిది - ధీమద్వినుతా! 309

రామ కృష్ణావతార కథ

సీ. అంత, రెండవజన్మ - మందు రావణ కుంభ । కర్ణులై భుజపరా - క్రమము మెఱసి,
లంకాపురంబు ని - శ్శంకఁ బాలింపుచు, । బలవ న్నిలింపుల - భంగపఱచి,
తుద రఘురామచం-ద్రుని చాపభవ సాయ । కాగ్నికి శలభంబు - లైరి, మఱియు,
మూఁడవ సంభవం - బున శిశుపాలుండు । దంతవక్త్రుం [1]డనఁ - దనరి, వాసు

తే. దేవ శిత చక్రధారలఁ - ద్రెంపఁబడిరి, । పిదప నిజ[2]శాప ముక్తులై - విదితమహిమ
జయుఁడు విజయుండు వైకుంఠ-సదనమునకుఁ । బూర్వమూర్తులు గైకొని-పోయి రనఘ!

వ. *అని పలికి, 311

(306) 1 ఒడలను - మ,మా,తి,హ,ర,క 2 గ్రుచ్చి - తా (307) 1 సుస్తోమంబు - మా (308) * ఈ ప. మా.ప్ర లో లుప్తము (310) 1 దనౌ-తీ 2 చాప-తి (311) * ఈ వ. తి,తీ,ప్ర.లో లుప్తము

## ఆశ్వాసాంత పద్య గద్యములు

చ. *నర[1]నుత శౌరిపాద[2]రత! - నవ్య[3]సు ధోత్తమసత్యభాషణా!
పరహిత భూరిమోద[4]యుత! - భవ్య [5]బుధోత్తమ నిత్యపోషణా!
స్మరనిభదేహ! పుణ్యగణ - మాన్య [6]నృపాలయశోభివర్తనా!
[7]వరశుభగేహ! గణ్యగుణ - [8]వైన్యనృపాలయశోభి[9]కీర్తనా! 312

క. వాణీ మరాళ గంగా। వేణీ నీహార [1]హీర - విధుమణి ముక్తా
శ్రేణీ నిర్మల దీధితి। పాణింధమ కీర్తిధామ - భాగ్యోద్దామా! 313

మాలిని. సువిభవ పురుహూతా! - శుద్ధ వంశాభిజాతా!
నవ రసికవరేణ్యా! - నమ్ర విద్వచ్ఛరణ్యా!
భువన హిత చరిత్రా! - భూసుర స్తోత్రపాత్రా!
సవితృ సదృశ తేజా! - సర్వ ధీమత్తనుజా! 314

### గద్యము

ఇది శ్రీ హనుమత్కరుణా వరప్రసాదాసాదిత సారస్వత నిరాతంక, చంద్ర నామాంక రామవిద్వన్మణి తనూజాత, అష్టఘంటావధాన పరమేశ్వర బిరుద విఖ్యాత, హరిభట్టప్రణీతం బైన వరాహపురాణంబునఁ గైవల్యఖండంబను పూర్వభాగంబునందుఁ దృతీయాశ్వాసము.

---

(312) * ఇది గోమూత్రికాబంధము. 1 నత - తీ;సుత - తి,ర; నుతి - త 2 నత-ర; రస-క 3 సురద్రుమ - తా; సుధారమ - మా; సురాసుర-ము 4 హిత-తి,తీ 5 వరాదర - తీ 6 కృపాల-మా 7 పర - మ,మా,హ,క 8 దైన్య (యతి?) - మ,క 9 కీర్తితా - త (313) 1 హార - తీ

# చతుర్థాశ్వాసము

క. శ్రీ కీర్తి దివ్యతటినీ। ప్రాకట జల ధౌత విష్ణు - పదతల! పుణ్య
శ్లోకకుల! సుకవి కోకిల। మా కందారామ! యెఱ్ఱ - మంత్రిలలామా! 1

వ. ఆకర్ణింపుము. ప్రహ్లాదచరిత్రానంతరంబున మార్కండేయుండు రోమశున కిట్లనియె. 2

**హరికథామృత పానాభిరతి**

క. మునివల్లభ! భవదానన। మను జలనిధివలన హరి క - థామృత పానం
బొనరించి, తృప్తి [1]నొందదు। పునరాకర్ణన పరత్వ - మునఁ గర్ణంబుల్. 3

ఉ. కావున, నీశ్వరుండును జ - గంబును భిన్నములంచుఁ దోఁచు దు
ర్భావన మానునట్లుగఁ, గృ - పామతి సర్వమయాత్ముఁడైన ల
క్ష్మీవనితా మనోహరు వి - చిత్ర చరిత్ర ముపన్యసింపవే!
పావన వాగ్విశేషముల - పాటవ మేర్పడఁ బండితాగ్రణీ! 4

మ. గరిమన్ లోకములన్ సృజింపఁ, బెనుపన్, - ఖండింపఁగాఁజాలు నీ
శ్వరుఁడయ్యున్ హరి, దైత్యకీట [1]హృతికై - జన్మించెఁ బల్మారు ను
ర్వరపైఁ దా నదియేల? సర్వసమతన్ - వర్తించు [2]నేర్పయ్యు, నే
కరణి న్వైరముపూనె రాక్షసులపైఁ - గారుణ్య శూన్యాకృతిన్. 5

క. అనఘ! వసిష్ఠుఁడు, నారదుఁ। డును, సనకాదులుఁ దపః ప - టుత్వము, బోధం
బును గల్గి, శక్తు లయ్యును। మును ముక్తులు గామి కేమి - [1]మూలము చెపుమా! 6

క. శ్రీరమణుఁడు మీనా ద్యవ। తారము లంగీకరించి - దానవకుల సం
హార మొనర్చుట మొదలగు। [1]మీఱిన చరితములు దెలుపు - మృదు వాక్యములన్. 7

వ. అని మార్కండేయుం డడిగిన, నుచిత వాక్ప్రపంచంబున రోమాంచ సమంచితాంగుం
డగుచు రోమశుం డమ్మహాత్మున కిట్లనియె. 8

---

(3) 1 బొందవు - త,తా; బొందదు - మ; నొందవు - మా,తీ (5) 1 హతి - త,క;హరి - మా,తా,తి,తీ,హ,ర 2 వాఁడయ్యు - తీ (6) 1 మూలమ్మనఘా - తీ (7) 1 మీఱిన కథలానతిమ్ము - క; మీఱిశరీరములు - మ,మా,త,తి,తీ,హ,ర

చ. వినుము మునీంద్ర! పూర్వమున - [1]విష్ణుమయుండగు నాదిమూర్తిచే
వనజ[2]భవాండమందు, భవ - వారిజమిత్ర మృగాంక యక్ష స
న్మని మను [3]మానవామర మ - నోభవ కిన్నర రాజమానమై
జననము నొందె విశ్వమును - సాగర శైల వనాంతరీపమై. 9

సీ. నారాయణుం డాత్మ - నాభీసరోజ మ ! ధ్యమమున బ్రహ్మయై - యవతరించి,
మహ దహంకారాది - మహనీయ సాధన ! సంపత్సమేతుఁడై - చతురుఁ డగుచు,
నంబర సర్వంస-హా నల జల మారు ! తము లను పంచభూ - తములతోడ
నిర్మించె, నవియును - నిర్మింపఁ[1]గలవియు ! ననఁ బెక్కు గలవు బ్ర - హ్మాండకోట్లు,

తే. నందు నెచ్చట [2]నేకార్య - మావహిలునొ ! పుండరీకాక్షుఁడైన దే - వుండు దక్క
నరసి[3]యిదమిత్థమని పల్క-నజుఁడు నోపఁ, ! డెట్లు మముబోఁటి కీటాత్ము-లెఱుఁగఁగలరు.

మ. హరిమాయా [1]పిహితంబులై పొడము [2]బ్ర - హ్మాండావళుల్ తద్రమా
వరు సామర్థ్యము, మూర్తివైభవ గుణ - వ్యాపార కృత్యంబులున్
బరిపాటిం గొనియాడ వేదములు న - ప్రాజ్ఞంబులై యుండు, వి
స్తరభంగిం బ్రకటింప మాదృశులకున్ - శక్యంబె? విద్వన్నుతా! 11

## శ్రీహరి మాహాత్మ్యము

వ. మునీంద్రా! వినుము. ఆ యాదిపురుషుం గొందఱు కాలరూపి యనియును, గొందఱు విజ్ఞానరూపి యనియును, గొందఱు తేజోరూపి యనియును, గొందఱు భాస్కరరూపి యనియును, గొందఱు బ్రహ్మరూపి యనియును, గొందఱు శంఖ చక్ర గదా శార్ఙ్గ చిహ్నితుండనియును, గొందఱు మృత్యుంజయుం డనియును, [1]గొందఱు పరబ్రహ్మం బనియును బ్రతిపాదింతురు; కాని, తదీయ [2]తాత్త్వికరూపంబు నిర్ణయింపనేరరు. ఆ వైకుంఠ నాయకుండును, బహు రూపావృతాత్మకుండునునై [3]జ్ఞానయోగ భక్తియోగ కర్మయోగంబుల నుపాసింపంబడి, తత్కర్మఫలంబుల నొసంగుచు సర్వభూతాంత[4]ర్యామియై యుండు. వెండియు, 12

(9) 1 విశ్వ - మా 2 భవాంత - తీ; భవామరేంద్రభవ - మా,త 3 మానవాదిగ - మా,త (10) 1 గాఁగలయవిపెక్కు-తీ 2 తానయైయతిశయిలుచు-మ,తా,క 3 యరవింద-త (11) 1 విహితంబు-మ,మా,తా,తి,తీ,హ,ర,క 2 బ్రహ్మాండంబులాశ్రీరమా-తీ (12) 1 గొంఱదఱు పరబ్రహ్మం బనియును-తీ.ప్ర. లోని పాఠము 2 సాత్త్వికా-మ,మా,త,తి,తీ,హ,ర.క 3 ధ్యాన అన్ని ప్ర. 4 ర్యామియైన వాసుదేవుండుండు - త

క. గురువుల నమరుల ధాత్రీ । సురులను ధేనువుల నదుల - సుస్థిరభక్తిన్
హరిరూపములుగఁ దలఁచిన । నరుఁ డేఁగుం బరమపదము - నకు మునివర్యా! 13

సీ. ఎన్ని బ్రహ్మాండంబు - లన్నింటి కందఱు । బ్రహ్మలై హరి సృష్టి - భరము పూను,
నెన్ని పాతాళంబు - లన్నింటి కందఱు । [1]భోగీంద్రులై శౌరి - భూమిఁ దాల్చు,
నెన్ని స్వర్లోకంబు - లన్నింటి కందఱు । జంభారులై చక్రి - జగము లేలు,
నెన్ని కైలాసంబు - లన్నింటి కందఱు । భర్గులై శార్ఙ్గి ప్ర - పంచ మణఁచు,

తే. నెవ్వఁ డేరూపమునఁ దన్ను - నెఱుఁగఁ గోరు । వాని కారూపమునఁ గాన-వచ్చుచుండు,
భక్తజన వత్సలత్వ త - త్పరుఁడు గాన । భక్తిమంతుల కతఁ డిచ్చుఁ - బరమపదము. 14

మ. అవతారంబు లనేకకోట్లు గల, వా - యా బ్రహ్మకల్పంబునన్
భవ శక్రాది నుత ప్రచారుఁ డగుచున్ - బ్రహ్మాండమధ్యంబునన్
వివిధాకారముల న్వహించి, త్రిజగ - ద్విఘ్నంబుల న్మాన్ప సం
భవముం బొంది, మురారి క్రీడనలుపు - న్మత్స్యాది రూపంబులన్. 15

ఆ. సర్వ [1]వేదమయుఁడు,-సర్వాంతర స్థాయి, । సర్వ భూతమయుఁడు,-[2]సర్వ సముఁడు,
సర్వ వైరిహరుఁడు - శాశ్వతుం, డవ్యయుఁ, । డచ్యుతుండు ప్రోచు - నఖిలజగము. 16

మ. ఘన విద్యా కుల రూపసంపదలచే - గర్వించి [1]మోహాంధతం
దనుఁ జింతించు వివేక మేమఱిన భ - క్తశ్రేణి బోధించి, యా
త్మ నివాసస్థితి సౌఖ్యమిచ్చుటకునై, - ధాత్రీస్థలిం బుట్టి యా
వనజాక్షుండు జగంబుఁ బ్రోచు వివిధ - వ్యాపార [2]పారీణుఁడై. 17

క. భువనేశుఁడు శాసింపఁగ । నవివేకము దొఱఁగి,[1]దుర్మ - దాంధత్వముఁ బా
సి, వనట నొందక [2]మనుజుల్ । [3]ధ్రువమగు హరిపదముఁ జెందు-దురు మునితిలకా! 18

---

(14) 1 భోగేంద్రులై - మ,త,తా,తి,తీ,హ,ర,క (16) 1 దేవ-మా;భూత - ర 2 శాశ్వతుండు, మునుల సుకలనరుల ముదముతో గోవుల, నవ్యయుండుబ్రోచు - క (17) 1 మోహాంధకుల్ - తి,తీ,క; మోహోద్ధతుల్ - త 2 మేపారగన్ - తీ (18) 1 దుర్మదాంధతలేకన్, భువివనటబాసి మనుజులు - మ,తి,హ,ర,క; దుర్మదాంధతవిడియాభువి - తీ 2 యమరుల్ - మా 3 ధ్రువముగ - మ,హ,ర,క

చ. హరి, నిజ జన్మ [1]కర్మ చరి - తామృతపాన మొనర్చు దాసులన్
బరమపదంబుఁ జేర్చుటకుఁ - బల్మఱు ధాత్రి జనించుఁగాక, దు
స్తర బలగర్వ కంటక నిశా - చర కాననముల్ హరింపఁ, ద
త్కరక[2]మలాంత రోజ్జ్వల సు - దర్శన వహ్నికణంబు చాలదే? 19

మ. ధర నిక్షేపము, పాల వెన్న, తిలలం - దైలంబు, ధారాధరో
దరసీమ న్సలిలంబు, పుష్పముల గం - ధవ్యాప్తి, బీజాళి నం
కురముల్, దారువులం గృశానుఁ, డిభరా - ట్కుంభంబుల న్మౌక్తికో
త్కరముం బోలె, నజాండకోటి హరియుం - [1]దానుండు సంక్రాంతుఁడై. 20

తే. ఇందిరాభర్త మాహాత్మ్య - మిట్టి దట్టి । దని యెఱుంగఁగనేరక - యఖిల వేద
[1]వాగురులఁ జిక్కువడి బహు-భాగవతుల । తవిలి వర్ణింప, [2]నితరుల-తరమె తెలియ? 21

సీ. మానవుండని భక్తిఁ - బూని భావించిన । వారి కారూపమై - వరము లొసఁగుఁ,
దేజోమయుండని - తెలిసినవారికిఁ । దన్మూర్తియై కాంక్షి - తంబు లిచ్చు,
నమృతాంశుకోటీరుఁ - డని కొల్చువారికి । నట్లయై యిష్టకృ - త్యము లొనర్చు,
నలినాసనుండని - తలఁచినవారికిఁ । దాదృశుఁడై [1]సమ్మ - దంబు సేయు,

తే. నిన్నియును నేల యెవ్వరి - కెట్లు తోఁచు । నట్టితెఱఁగున గోచరుం - డై తదీయ
కర్మకాంతారముల నీఱు-[2]గా హరించి । నిముసమున నిల్పు వారల-నిజ పదమున. 22

క. అనుమానింప కజాండము । లను బూర్ణుఁడు చక్రి, తత్క - ళారహితంబై
న నెలవు లేదని తెలిసిన । ఘనపుణ్యుఁడు, పరమపద సు - ఖస్థితిఁ జెందున్. 23

వ. అదికావునఁ, బరమపురుష దృక్కోణ దర్శనమాత్ర [1]నిర్మితంబులై చతుర్ముఖ పంచముఖ షణ్ముఖ సప్తముఖ [2]దశముఖ శతముఖ సహస్రముఖ విరించిపాలితంబులగు బ్రహ్మాండంబు లనంతంబులు గలవు. అందుఁ జతుర్ముఖాధీనంబగు నీ బ్రహ్మాండంబున, నే నెఱింగిన వైష్ణవ కథామృత విశేషంబులు గొన్ని వివరించెద నాకర్ణింపుము. 24

---

(19) 1 పుణ్య - త 2 కమలాంతరజ్వల - మ,మూ,హ,ర,క (20) 1 దాగుండు - మ,మా, త,తి,హ,ర (21) 1 పటలముల - త,తా; వలయమున - మా; పృథుల జంకెడివారలీయుర్వి మీద దవిలి (యతి?) - క 2 లేరింకఁ దరమెతెలియ - తీ (22) 1 సమ్మతంబు - త 2 నాహరించి (యతి?) - తీ (24) 1 నిర్జితంబు - తా 2 దశముఖ - మా,త.ప్ర.పాఠము

సీ. మూలముల్ [1]మీఁదు కొ-మ్మలు క్రిందునై చాల । నున్నతంబై మించు-నొక్క తరువు
వేద పర్ణంబుల - విలసిల్లుఁ, [2]దత్పక్వ । ఫలము లెవ్వారికిఁ - దెలియఁబడవు,
అహారియును నిరా - హారియునై రెండు । పక్షు[3]లు తరువునఁ - బాయకుండు,
నతినిశ్చలంబైన - యా ఖగద్వితయంబు । నురుశక్తి నైక్యంబు - నొందఁజేసి

తే. యమ్మహీజమ్ముఁ బాలింప - నణఁపఁ జాలి । తత్ఫలశ్రేణి [4]నిజ భక్త - తతికి నొసఁగు
నీ మహత్త్వంబు, వర్ణింప - నేర్తు నెట్లు? । శరధికన్యాకళత్ర! తా - మరసనేత్ర! 38

క. బాలుఁడను బుద్ధిహీనుఁడ । నాలోకింపుము కృపా క - టాక్షముల ననున్;
మేలుకొన సమయ మయ్యెను । [1]చాలింపుము యోగనిద్ర - సకలశరణ్యా! 39

వ. అని యిట్లు హిరణ్యగర్భుం డుచిత వాక్య సందర్భంబున నుతించి, ప్రార్థించిన, నా జగద్గర్భుండు మెల్కొనకున్న, నది యోగమాయాశక్తి[1]కృత్యంబని నిర్ణయించి, నిద్రారూపంబున సంక్రమించిన జగన్మోహనకారిణియగు నా యోగమాయ నిట్లని స్తుతించె. 40

### విష్ణుదుర్గాస్తవము

శ్లో. వందే[2]హం [1]దేవి! పాదారవిందే! మందేతరార్చితే!
[2]తావకే సేవకేష్టాపవర్గే! దుర్గే! మదంబికే! 41

వ. అని నమస్కరించి, వెండియు నిట్లనియె. 42

క. శ్రీపతిని యోగనిద్రా । రూపంబున నలము కాల - రూపిణివగు నీ
శ్రీపదములు సేవించెదఁ । దాపత్రయ దుఃఖజలధి - తారణమునకున్. 43

ఉ. కంబుసమానకంఠికి, జ - గత్త్రయదేవ కిరీటరత్న భా
చుంబిత పాదపీఠి, కతి - శోభనమూర్తికిఁ, బల్లవావళీ
బింబసమాధరోష్ఠి, కరి - భీకర శూలసమేతయైన దు
ర్గాంబకు, విష్ణుశక్తికి న - నంత నమస్కృతు లాచరించెదన్. 44

---

(38) 1 మెండుకొమ్మలు (యతి?) - మ,మా,తి,హ,ర,క; మెండల్పముగ శాఖములుగల్గి-తీ 2 దత్వము - త 3 లా తరువును - తీ 4 నీభక్త - మ,తా;తద్భక్త - క (39) 1 పాలింపుము - తీ 2 వదలి - తీ (40) 1 కృతంబని - త,హ,ర (41) 1 దేహి-త 2 తావకసేవకేష్టా - మ;తావకే సేవకేష్టా-మా,త; తావకస్సేవకేష్టా - తి,తీ,ర; తావకీసేవకేష్టా - తా

క. ఘన రాజసమున బ్రాహ్మీ । వనజాక్షియు, సాత్త్వికమున - వైష్ణవియుఁ [1]దన
ర్చిన తామసమున రౌద్రియు । ననఁ బరగుదు వొక్క నీవ - [2]యంబుజవదనా! 45

తే. శక్తులందెల్ల నాదిమ - శక్తి వీవ, । మూర్తులందెల్ల నాదిమ - మూర్తి వీవ,
హర[1]విరించాది వందిత - చరణ వగుచుఁ । ద్రిభువనంబును రక్షించు - దేవి వీవ. 46

క. నిఱుపేదలైన, నీ పద । సరసిజములు గొలిచిరేని - సాగర [1]వేలా
పరివృత [2]విశ్వక్షోణీ । [3]పరివృఢు లగుదురు త్రిలోక - పావనచరితా! 47

చ. ప్రణవము కామరాజము, ప్ర - భంజనబీజము, [1]నిందిరావధూ
మణి నిజ బీజయుగ్మము క్ర - మంబున బిందుసమన్వితంబులై
ప్రణుతికినెక్కఁ, గూర్పనగు - భాసుర తావక మంత్రము న్మనో
గణితముచేసి శాశ్వతసు - ఖంబులు గాంతురు సజ్జనోత్తముల్. 48

ఉ. నీ నిజరూపముం దెలియ - నేరని దుర్మతు లన్యదేవతా
ధీన మనస్కులై తిరిగి, - దీపిత వైదిక కర్మ[1]మార్గమున్
గానఁగలేక, యైహిక సు - ఖంబులకుం బెడఁబాసి, నారక
స్థాన నివాస దుఃఖముల - దైన్యమునొందుదు రెల్లకాలమున్. 49

సీ. నిద్రయై యే దేవి - నిఖిల భూతంబుల । చేష్టలు [1]మఱపించి - చిక్కువఱచుఁ,
దృష్ణయై యే దేవి - ధీరతాలతఁ ద్రెంచి । ధర మానవుల దీన - దశకుఁ దెచ్చు,
[2]మాయేంద్రజాలమై - పాయక యే దేవి । *విశ్వంబునకు భ్రాంతి - విస్తరించు,
నాశా స్వరూపిణి - యై నిల్చి యే దేవి । నరు నీషణత్రయ - పరుని జేయుఁ,

తే. ద్రిభువనేశ్వరి యగుచు నే-దేవి తనరుఁ, । బరఁగ బ్రహ్మాది సకలరూ-పములు దాల్చి
యభినుతికి నెక్కు నే దేవి,-యట్టి నిన్ను । భక్తి సేవింతు, భావింతుఁ,-బ్రస్తుతింతు. 50

(45) 1 ననన్ఘనతామస - మ,మా,తి,తీ,హ,ర,క 2 యంబుజనేత్రీ-మ,మా,త,తి,తీ,హ,ర,క
(46) 1 విరించ్యాది - త,తా,తీ (47) 1 చేలా - తీ 2 వృక్ష - ర 3 పరివృతు - త,తా; పరిపృథు-
మ,మా,తి,హ,ర,క (48) 1 దేహకాంతియున్, రణవిజయంబు దుర్దశ శరణ్య హుతాశన లక్ష్మియుక్త
మున్, బ్రణుకితి-మ,తా,క (49) 1 మాత్రమున్-మ,తా,తి,హ,ర,క; సూత్రమున్-తీ (50) 1 వర్జించి-త
2 మాహేంద్రజాల - త,తా, * విశ్వంబు - యట్టినిన్ను,తి,తీ,ర,ప్ర. లో లుప్తము

సీ. నినుఁ గాళ[1]రాత్రి [2]యం-చు నుతింతు భువనేశ్వ । రీ శక్తి యనుచు వ-ర్ణింతు నిన్నుఁ,
*గౌమారి యని నిన్ను-గణుతింతు, వైష్ణవి । యని నిన్ను [3]నెపుడుఁ గీ-ర్తనమొనర్తు,
వారాహి యని నిన్ను-వాక్రుత్తు, సర్వమం । గళ యని నిను వచో-గరిమ [4]నుడుదు,
[5]బ్రహ్మాణి యని నిన్నుఁ - బ్రస్తుతి గావింతు, । సావిత్రి యని నిన్ను - [6]నన్నుతింతు,

తే. జనని! నిను దుర్గ యనుచుఁ బే-ర్కొని భజింతు, । సర్వలోక నమస్కృత-చరణపీఠ
యనియు,నఖిలార్థదాయిని-యనియునిన్ను । సంతతముఁగొల్తుఁగల్యాణి!-చంద్రవదన!51

క. ఈ దుర్గాస్తవ మెప్పుడు । సాదరబుద్ధిం బఠించు - సరసులు, సుత పౌ
త్రాదులతోడ సుఖస్థితి । మేదిని యేలుదురు బంధు - మిత్ర ప్రియులై. 52

## వైష్ణవీమాయ సాక్షాత్కారము

వ. అని యిట్లు కొనియాడిన వనజాసనుని వినుతుల కనుమతించి, [1]జగన్మోహ విధాయినియు నిత్యానపాయినియు నగు వైష్ణవమాయాదేవి కాకోదరరాజశయను నయన [2]జలజంబులవలన వెలువడి చెలువంబగు లలనా రూపంబు గైకొని, కలంకు లేని కొలంకున నందంబులగు కెందమ్మివిరుల సిరులకుం దల్లి బందువులగు చరణతలంబుల దలంబగు కెంజాయ చేత రంజితంబులై, పదనఖంబు లవంధ్య సంధ్యారాగ సాగర మౌక్తికాయమాన తారకా సఖంబులై చెలువొందఁ, గల[3]హంస క్రేంకార మంత్రరాజంబులకు నోంకార బీజంబుల చొప్పున నొప్పు మంజీర తార నినదంబులు వేదంబుల నుత్పాదింపఁ, గటితట ఘటిత కాంచన కాంచీ కలాప కలకలంబు మధ్యమ స్థలంబునకై యస్తి నాస్తి వివాదం బొనరింపఁ బుట్టిన తద్ఘంటికా పరస్పర కోలాహలంబు సొంపున నింపు సంపాదింపఁ, దోరంబగు నీహారంబుచేతఁ [4]బొదుగుడుపడిన జక్కవకవ చెలువంబునఁ [5]జిలువ వలిపెంపుఁ [6]గంచెల మెఱుంగున, మెఱుంగులు తుఱంగలించు వలుదచన్నుల కెలంకులం దొలంకు ప్రభాంకురంబులు బాహు శాఖల నలమికొనుచుండఁ, [7]దత్కుచపర్వత భరం బోర్వక యడంగిన నడిమిం బొడగానక వెదుకులాడునవియుం బోలె రత్నహారంబు లుభయపార్శ్వంబులకుం దూఁగియాడ, స్తన గోవర్ధనగిరి ద్వయంబు లెత్తిపట్టిన మధ్యమా హరి కరదండంబుల నోజ రోమరాజి విరాజిల్ల,

---

(51) 1 గాళరాత్రీ - తి,తీ.క 2 యందు - తీ ప్ర; 3 వర్ణనయేనొనర్తు (యతి?) - మ 4 నందు - తీ; నుడుతు-మ,మూ,తా,ర,క 5 బ్రాహ్మియటంచునిన్-తీ 6 సంస్మరింతు-మ,మూ,తా,తి, హ,ర,క * గౌమా - బ్రహ్మాణియ హ. ప్ర.లో లుప్తము. (53) 1 జగన్మోహన-మూ,త,తా,క 2 జలజంబుల-మ,త,క 3 హంసక్రౌంచ-కలాప మ,మూ,తి,తీ,హ,ర,క,ప్ర.లో లుప్తము 4 బొనుగుపడిన - తీ 5 జిలుగు-తీ 6 గంచెలియ-అన్ని ప్ర. 7 దత్కుచభరం- త 8 మధ్యమహారికదండ - త,తా; మధ్యమహారికరదండ-మ,మూ,హ;మధ్యమాహరి కరదండ-తి,తీ,ర

నిద్దంబులగు చెక్కుటద్దంబుల మకరిపత్రంబులై పొంకంబులగు రత్నతాటంకంబుల కాంతి పటలంబు [9]తటంబులం బుటంబులుగొనుచుండఁ, జరమ సంధ్యారుణ జలధర రేఖాగ్రంబున వీక్షణీయంబగు నక్షత్రంబు తెఱంగున నధరపల్లవోపరిభాగంబున [10]నాసాభరణ మౌక్తికంబు చూపట్ట, ఫాలభాగంబున మృగనాభితిలకం బరచందురు నడిమి కందు చందంబున నయనానందం బొనర్ప, నాసిక యను తెర యిరుగడలం బరిణయంబునకు నాసన్నులైన చకోర వధూవరుల సిరు [11]లంగీకరించిన దీర్ఘనేత్రంబులు శతపత్ర మిత్రంబులు లావణ్యపత్రంబులునై చెలంగ, నంధకారంబునందుఁ గానంబడు తారకాజాలంబు లీలం గబరికాభారంబునందు మల్లికా కుసుమంబులు విలసిల్లఁ, గంకణ కేయూర ముద్రికాది దివ్య భూషణ కరంబులగు కరంబులు[12] భక్తాభయంకరంబులయి శోభిల్ల, దివ్యాంబరాలంకృతయై, సహస్రసూర్య సంకాశ ప్రభా [13]భారంబగు నాకారంబుతో సాక్షాత్కరించి, విష్ణుమాయాదేవి మందగమనంబున నేతెంచి, యరవిందభవుని ముందఱ నిల్చినంతఁ, బుండరీకాక్షుండును యోగనిద్ర చాలించి, నిజ నాభిసరోజ కర్ణికాసమాసీనుండగు హిరణ్యగర్భుని గృపాగర్భితంబులగు చూపుల నవలోకించిన, నతండు నిటలతట ఘటితాంజలియై యిట్లని విన్నవించె. 53

మ. అరిషడ్వర్గము నిగ్రహించి, మమతా - హంకారముల్ ద్రెంచి, బం
ధుర భక్తిం దప మాచరించిన మహా - త్ముల్ బోధవిద్యా ధురం
ధరులుం గానని నీ స్వరూపమును నే - త్రప్రీతిగాఁ జూడఁ గం
టి రమావల్లభ! వేయునేల? తుదము - ట్టెన్ జన్మ మబ్జేక్షణా! 54

క. హరి విష్ణుండు రమాపతి । యరవిందాక్షుండు చక్రి - యహిశాయి యతీ
శ్వరహృదయ నిలయుఁడని నిను । మఱవక కీర్తింతుఁ గృత న - మస్కారుఁడనై. 55

తే. బాలుఁడను బుద్ధిహీనుఁడ-భ్రాంతియుతుఁడఁ । గార్య కారణ మూఢుఁడఁ,-గాన నన్నుఁ
గరుణ రక్షింపు రక్షింపు - కమలనాభ! - జనకకృత్యంబు పుత్రర-క్షణమె కాదె? 56

సీ. అవధరింపుము, దేవ! - భువనత్రయము మున్ను । సృజియించి మానస - సృష్టి చేసి,
యా లోకములయందు - [1]నద్రి కానన వార్ధి । దేశ నదీ లోక - దివిజ మనుజ
తారకా గ్రహ చంద్ర - తపన మునీశ్వర । కిన్నర [2]గారుడ - పన్నగేంద్ర
గంధర్వ యక్ష రా - క్షస కామినీజన । పశు తురంగమ కీట - పక్షితతుల

తే. ధృతి వినిర్మింపఁ, గాలచో - దితము లగుచు । నవియు నన్యోన్య వైర మ - హత్త్వమునను
సమసె, నటమీఁది కృత్యంపుఁ-జంద మెఱుఁగ । నేరకున్నాఁడఁ గరుణింపు-నీరజాక్ష! 57

(53) 9 నిటలంబుల - తీ 10 నాసామౌక్తికాభరణంబు-తీ 11 లలంకరించిన-త 12 భక్తాభయ శోభనంబులై - క 13 ధారంబగు - మ,మా,త,తి,హ,ర (57) 1 నద్రి - తి; సద్రి - తీ 2 కింపురుష- మ,మా,త,తా,తి,హ,ర,క

క. అని [1]విన్నవింపఁ ద్రిజగ । జ్జనకుఁడు లక్ష్మీవిభుండు - సర్వముఁ జిత్తం
బున నూహసేసి, విశ్వము । నొనరఁగ నిర్మింప నపుడ - యుద్యుక్తుండై. 58

విశ్వసృష్టి వికాసము

చ. తనరఁగ నాత్మ నాకసముఁ, - దద్గగనంబున మారుతంబు, నా
యనిలమునన్ హుతాశనము, - నా యనలంబున వారి, యా జలం
బునను ధరిత్రి, నా ధరణిఁ - బొందుగ నోషధు, లా మహౌషధీ
వనమున నన్నమున్ భువన - వత్సలుఁడై సృజియించె నేర్పునన్. 59

క. అది [1]సకల జంతుకోటికి । నుదరానల శాంతికరము - హుతవహ కీలా
వదనమున వేల్వఁగాఁబడి । త్రిదశ ప్రీతిదముగాఁగ - ధృతి నొనరించెన్. 60

తే. శౌరి మఱి[1]యు విరాడ్రూప - ధారి యగుచు । సర్వగతుఁడై యనంతర - సర్గమునకుఁ
గారణంబగు ధాతృవ-ర్గము సృజించి । కరుణ తళుకొత్త వారలఁ-గలయఁ జూచి, 61

వ. అందు, శిల్పవిద్యా కుశలుండగు విశ్వకర్మం బిలిచి, నీవు లోకత్రయంబునందు సౌధ
కేళీ వన పుర గ్రామాది విశేషంబులతోడం గూడ దేశంబులు నిర్మింపుమని నియమించి
యనంతరంబ, 62

ఉ. అంబుజనాభుఁ డాత్మ వద - నాంబురుహంబున భూమిదేవ వం
శంబును, బాహుదండముల - సంగతి రాజకులంబు, నూరుకాం
డంబుల వైశ్యజాతిఁ, జర - ణంబుల శూద్రగణంబు, నక్షియు
గ్మంబునఁ జంద్రసూర్యుల న - ఖండగతిన్ సృ[1]జియించి, వెండియున్, 63

క. నాసాముఖ మధ్యమమున । వాసవముఖ హరిదధీశ - వర్గముఁ, బ్రాణో
ల్లాసమున గాడ్పు, ముఖ ని । శ్వాస [1]సమీరమునఁ - బక్షి సర్పాదికమున్, 64

సీ. వరుసఁ గేశంబుల - వాహినీ స్తోమంబు, । రోమకూపముల [2]నం - భోముచములుఁ,
గరరుహంబులఁ దార - కా గ్రహ నక్షత్ర । తిర్యగాదులు మఱి - ధేనుకులము,
సితహాసమునఁ గామ - యుత సప్తవింశతి । భేదాంక దేవతా - బృందములును,
నాసికఁ బితృదేవ - తా సమూహంబును, । రోషాతిశయమున - రుద్రసమితిఁ

తే. గూర్మి నిర్మించి, నిర్మాణ-కర్మ పాట । వంబుఁ దనుఁ దాన మెచ్చి, స-ర్వంబుఁ జూచి,
యాత్మమూర్తి సముద్భూత-యైన మాయఁ । బిలిచి యిట్లని పలికె గం-భీరఫణితి. 65

(58) 1 వినుతింపఁగ-క (60) 1 జంతుకోటి కెల్లనుదరా - తీ (61) 1 యునుజిద్రూప - తి,తి,ర (63) 1 సృజియించె నత్తఱిన్-తీ (64) 1 మున సమీరపక్షి-తీ (65) 1 దేశంబుల-త 2 నంబోధిచయము (యతి?)-౯;నంభోధరములు (యతి?)-మ, మా, హ, క

మ. విను, మాయాసతి! సర్వజంతువులకుం - [1]వేర్వేఱఁ దుల్యాంగనా
జనముం గొబ్బున యుష్మదంశమున సం - జాతంబుగాఁ జేయు, చే
సినఁ, [2]గాంతా పురుషవ్రజంబు మిథున - శ్రీఁ బొంది, యన్యోన్య మో
హ [3]నిబద్ధంబునఁ బాయలేక సురత - వ్యాసక్తిఁ గ్రీడింపఁగన్, 66

క. వారలవలనఁ గుమార కు । మారీ వ్రాతంబు వొడము, - మఱియును దత్త
త్పారంపర్య వశంబునఁ । దోరముళై నిగుడు సంత - తులు లోకమునన్. 67

క. *రేతోమయ సృష్టిక్రమ । మీ తెఱఁగున వృద్ధిఁబొందు - నింతి! భవన్మా
యాతిశయంబునఁ [1]జేతన । జాతంబు పరిభ్రమించు - సంసారమునన్. 68

### అవతార ప్రసక్తి

సీ. ఈ జగత్త్రయమున - నెచ్చోటనైనను । మించి దుర్జనులు జ - న్మించిరేని,
వేదోక్తమార్గంబు - విపరీతమగునేని, । మునుల యాగంబులు - మునిఁగెనేని,
భూనాయకులు ధర్మ - హీనులైరేని, స । ద్ద్విజులు విద్యలను గ - ర్వించిరేని,
ధరణిఁ బాతివ్రత్య - ధర్మంబు చెడెనేని, విషమదైత్యులు సంభ - వించిరేని,

తే. కఠిన పాషండజనములు - గలిగిరేని, । దురితబలమున సత్యంబు - విరిసెనేని,
యప్పు డచ్చోటఁ దగురీతి - నవతరించి । దుష్టనిగ్రహ మొనరింతుఁ - దోయజాక్షి! 69

వ. అని యానతిచ్చినఁ బుండరీకాక్షు నాజ్ఞాను సారంబున, నమ్మాయాదేవి స్త్రీ[1]వ్యక్తి నిర్మాణం బొనరించి, విశ్వ సృష్టిచక్రంబు నాక్రమించి ప్రవర్తించె నని రోమశుండు మార్కండేయునకుం జెప్పి, వెండియు నిట్లనియె. 70

### అమరుల ప్రాదుర్భావము

ఆ. కలిత కీర్తిశాలి - కశ్యపుఁ డొకనాఁడు, । మానవతిని జెఱఁగు - మాసి యనల
నామ తీర్థవారి - [1]నాల్నాళ్ళుచేసిన । [2]యదితిఁ గాంచి, ప్రముది-తాత్ముఁడగుచు. 71

(66) 1 వేర్వేఱ-త,తా,క 2 దత్కాపురుష-తి,హ,ర 3 నిబంధంబున-త,తీ,ర 4 సురస - హ,ర
(68) * ఈ పక ప్ర.లో లుప్తము 1 యాతను-తా (70) 1 వేష-క (71) నాల్నాడ్లు-మ;నానాడ్లు-మా;
నానాళ్లు-త,తా,ర;నాల్నాడు-క 2 యతివ-మ,తి,తీ,హ,ర,క

ఉ. ప్రేయసిఁ జేరఁదీసి, రతి - భేదములం గరఁగింప, నా సరో
జాయత[1]నేత్ర గర్భపుట - మం దుదయించిరి విష్ణుభక్తి పా
రాయణులుం, బ్రశాంతులు, ని - రంతర ధర్మ విశుద్ధ [2]బుద్ధు, లా
మ్నాయ పదానువర్తులు న - నం దగు దేవవరుల్ క్రమంబునన్. 72

క. వారలఁ ద్రిజగద్విభుఁ డం । భోరుహలోచనుఁడు నాక - భువనమునం దిం
పారఁ బ్రతిష్ఠించె, దయా । పూరిత హృదయారవింద - భూషితుఁ డగుచున్. 73

## దైత్యుల జన్మక్రమము

చ పదపడి కశ్యపాహ్వయుఁడు - బంధుర మోహభరాంధచిత్తుఁడై
మదనరసాతిరేకమున - మానవతిన్, దితిఁ బుష్పిణిన్, సుఖ
ప్రద రతిఁ గూడ, దానియుద - రంబునఁ బుట్టిరి యాతతాయు, లు
న్మదులు, హరిద్విషుల్, నిగమ - [1]నాశక కృత్యులు, దేవశాత్రవుల్. 74

క. హరి, నిజసేవాపరులగు । సురలకు విద్వేషు లగుచుఁ - జూపోపని యా
దురితాత్ముల, దితిపుత్రులఁ, । బరిమార్చుచునుండుఁ ద్రిదశ - పాలనమునకై. 75

క. [1]హరికిన్ దేహము సుర, లా । సురలకు నెగ్గాచరింపఁ - జూచినయేనిన్,
హరుఁడైనను విమతుం డా । హరికిం, దత్త్వార్థ మిది మ - హామునితిలకా! 76

ఉ. పంకజనాభుఁ డాత్మపద - భక్తుల కాపదవచ్చెనేని యా
యంకిలిదీర్చి కాచు, సక - లార్థములన్ ఫలియింపఁజేయు, నే
వంక జయంబ యిచ్చు, ముని - వల్లభ! సజ్జనరక్షకై నిరా
తంకమతి న్వహింపఁడె య - తండు ఝష ప్రముఖావతారముల్? 77

---

(72) 1 నేత్రి - అన్ని తాళపత్ర ప్ర. 2 బంధు - మ,తి,తీ,హ,ర,క (74) 1 నాశరతుల్ పరతుల్ సురాహితుల్ - తా; సాదరకృత్యులు దేవశాత్రవుల్ (యతి?) - మ; మానులు పాపరతుల్ సురాహితుల్ - మా,త:మానులువారపతుల్ సురాహితుల్ - తి,తీ,హ,ర;దూరులు దారపతుల్ సురాహితుల్ - క. (76) 1 హరిదేహంబులు సురలా - మ,మా,త,తా,తి,హ,ర,క

భూసురప్రతతి కృతాపరాధము

సీ. తొల్లి భూమీసురుల్ - తోయజాసను మీఱ । వేదాది [1]విద్యాప్ర - వీణు లగుచు
జగతిపై వర్తించు - [2]నిగమ తత్త్వార్థమ్ము । విడిచి యపార్థముల్ - నొడివికొనుచు
గర్వాంధులైనఁ, ద - ద్గర్వంబు వారింప । హరి, సోమకుండను - నసుర నొకని
నిర్మించుటయు, వాఁడు - నిగమంబు లను విప్ర । మూలధనం బెల్ల - ముచ్చిలించి

తే. యంబునిధిలోన దాఁగిన, - [3]నవనిసురులు । వేదనిర్ధనులై, గర్వ - వాద ముడిగి
సంధ్య లుడివోయి, బ్రహ్మవ - ర్చసము దొలఁగి । విహిత యాగాది సత్క్రియా -
రహితు లగుచు, 78

క. అపద్భవమగు పశ్చా । [1]త్తాపంబునఁ బొంది, పూర్వ - ధర్మ విశేషో
ద్దీపిత సుజ్ఞానంబున । శ్రీపతి మది నిల్పి తపము - చేసిరి విప్రుల్. 79

ఉ. నిర్గతగమ్యులైన యవ - నీసురు లుగ్రతపంబు సేయ, నం
తర్గతరోషుఁడై జలజ - నాభుఁడు దా శరణాగ[1]తావనా
నర్గళ సత్కృపాపరత - నత్తఱి ముందఱ నిల్చి, భూమరు
ద్వర్గముతోడ నిట్లను, ను - దార గభీర వచో విచర్చికన్. 80

చ. వినుఁడు! మదీయరూపమగు - వేదము నిందయొనర్చు మత్తులం
దునుముదు, విప్రులౌట మిముఁ - దున్మగరాక, శ్రుతిప్రపంచముం
బనుపడ దాఁచినాఁడ, నిగ - మంబులఁ జేయుట విప్రకోటికిం
గనుఁగొన జీవుకన్న నధి - కంబుగదా! వివరింపనేర్చినన్. 81

క. పశ్చాత్తాపంబునఁ గృత । నిశ్చయులై తపముసేఁత - నిందా [1]సత్ప్రా
యశ్చిత్తమయ్యె, మీరిఁక । నిశ్చింతులు గండు, మగుడ - నిగమము లిత్తున్. 82

వ. అని యుపలాలించి, యమ్మహీసురుల వీడ్కొని వారిజోదరుండు పారావారంబు
నకుం జని, 83

---

(78) 1 దివ్య - మా,త 2 సర్వతత్త్వార్థమ్ము-మా,త, 3 నవనిసురలు-అన్ని ప్ర. (79) 1 త్తాప
మునంబొంది - త;తాపంబునుబొంది - తీ (80) 1 తార్చనా - మ, మా, తా, తి, తీ, హ, ర, క
(82) 1 భిప్రాయ - మ,మా,తి,ర,క; దిప్రాయ - త; సప్రాయ - తా; భిప్రాయశ్చిత్తులయ్యె - తీ,హ

### మత్స్యావతార వర్ణనము

సీ. మధ్యాహ్న మార్తాండ - మండల ప్రతిమాన । దారుణ దీర్ఘనే - త్రములతోడ
[1]నంత్యకాలోద్దండ - యమదండ చండతా । లంఘన చతుర వా - లంబుతోడ
తిమి తిమింగిల ముఖ్య - సమధికాంభశ్చర । గ్రాసార్థ వివృత వ - క్త్రమ్ముతోడ
మైనాకముఖ శైల - [2]రీణతా యోగ్యాంగ । [3]సంధి గృహప్రపం - చంబుతోడ

తే. నొక మహామీనమై శౌరి - యుదధిలోన । దురము గావించి [4]సోమకా - సురుని దునిమి
శ్రుతులఁ గొనివచ్చి మేదినీ-సురుల కిచ్చె । నన, మృకండుతనూజుఁ డి-ట్లనియె మునికి. 84

చ. అకట! నిజప్రయోజన స - హాయతకై హరి తానె మున్ను [1]సో
ముకుని సృజించి, క్రమ్మర స - ముద్రములోన వధించెనన్న, నే
రికి విన నింపుగాదు; విష - వృక్షమునైనను బెట్టి పెంచి, తాఁ
బెకలిచివైచునే కరుణ - పేరు నెఱుంగని ఘాతుకాత్ముఁడున్? 85

వ. అనిన మార్కండేయునకు రోమశుం డిట్లనియె. 86

సీ. వినుము, కార్యార్థమై - వనజాక్షుఁ డొకవేళ । తనదాసులం దొక - తప్పు వెట్టి,
యవనిపై రాక్షసు - లై సంభవము నొంది । గర్వితులగువారి - గర్వ మడఁపుఁ
డని యానతిచ్చిన, - నా విష్ణుభక్తులు । దారుణ బాహాప్ర - తాప మమరఁ
గ్రవ్యాదులై పుట్టి - గర్వితారాతుల । నణఁగించి కృతకార్యు - లైన పిదప,

తే. వీరు నాచేతఁ దెగ కన్య - వీరవరుల । చేత హతులైన ముక్తికిఁ - జేర రనుచు
నాత్మఁ దలపోసి, సమరంబు - లందుఁ దఱిమి । తా[1]వధియించు హరి యాతు -
ధానవరుల. 87

క. హరి యెవ్వనిఁ దాఁ జంపక । పరుచేఁ జంపించు, వాఁడు - భవ[1]బంధుండై
ధరణీతలమున నక్తం । చరవంశమునందుఁ దిరుగ - జననము నొందున్. 88

తే. సురలు గర్వింప, యామినీ - చరులచేత । మానభంగంబు నొందించు; - దానవేంద్రు
లాత్మదర్పింప, నప్పు డా-యమరవరుల । చేతఁ దగు శిక్ష చేయించు - శ్రీవిభుండు. 89

(84) 1 యవధికాలో - మా,త 2 రీనతా - మ,తీ,క;లీనతా - మా,త;దీనతో - తా; నతా - తి,హ,ర 3 సంధిగృహా - మా,తః సంధిగుహ - తాః నందీగృహ - తి,హ; బందీగ్రహ - తీః సంద గృహ - రః సందీహ - మ 4 సోముకా-మ,మా (85) 1 సోమకుని (యతి?)-త,హ,ర (87) 1 హరి యించు - తీ (88) 1 బద్ధుండై - తా

వ. అని మత్స్యావతారవృత్తాంతంబు చెప్పి, సంతతానందుండును, రోమహర్షుండు నగు రోమశుండు వెండియు నిట్లనియె, 90

## కూర్మావతార వర్ణనము

మ. హరిఁ బూజింపక దేవదైత్యులు మహా - హంకార సంపన్నతా
గరిమన్ సాహసవంతులై, నిజ భుజా - గర్వంబు ప్రేరేప, మం
దరశైలంబున సాగరంబుఁ దరువన్, - దద్వార్ధిమధ్యంబునన్
గిరిరాజంబు మునింగె, దానవవరుల్ గీర్వాణులుం జూడఁగన్. 91

మ. సమదామర్త్య నిశాచరేశ్వర భుజా - సత్త్వోద్భవంబైన గ
ర్వము సర్వంబును వీటిఁబుచ్చి, కరుణా - వ్యాసంగుఁడై, కూర్మ రూ
పమునం దోఁచి మురారి యెత్తె భువన - ప్రఖ్యాతిగా [1]బాధనం
భ్రమ [2]నశ్య జ్జలజంతుజాల మగు నా - మంథాన కుత్కీలమున్. 92

క. వ్రత దాన తీర్థ సేవా । క్రతుముఖ్యములైన విహిత - కర్మంబులు శ్రీ
పతి వర్జితంబులైనను । బ్రతిహతములు గాకయున్నె - బహువిఘ్నములన్. 93

ఉ. వెండియు దేవదానవులు - విష్ణుపదాంబుజభక్తి లేక యు
ద్దండ మదంబునం దిరుగఁ, - దద్బల[1]గర్వము మాన్పఁ బంకజా
క్షుం డొక శాపకైతవము - చూపి, జయాదుల దైత్యయోనిఁ బు
ట్టుండని [2]పంప, నందొక భ - టుండు హిరణ్యవిలోచనాఖ్యుఁడై, 94

ఉ. ధారుణిఁ బుట్టి, బాహుబల - దర్పితుఁడై, కనకాచలంబు బృం
దారకమందిరం బనుచుఁ - దద్గిరితో ధరఁ బెల్లగించి, గం
భీర పయోనిధానమునఁ - బేర్చి [1]గుభిల్లన [2]వైచె, వైచినన్
భూరి భయంబునం దివిజ - పుంగవముఖ్యులు కంపితాత్ములై, 95

శా. బాహాగర్వము లుజ్జగించి, కరుణా - పాథోనిధిం, బక్షిరా
డ్వాహుం [1]బ్రస్తుతిసేయ, విష్ణుఁడు దయా - వర్ధిష్ణుఁడై వచ్చి వా
రాహాకారము దాల్చి యెత్తె, నిజ దం - ష్ట్రాదండకోటీ ఘనో
త్సాహుండై సచరా[2]చరంబగు ధరా - [3]చక్రం బవక్రాకృతిన్ 96

(92) 1 బాడ-తః బాధ-తి; బాద-మూ,తా,తీ; బాఠ-మ,హ,ర,క 2 నశ్యం-అన్ని ప్ర 3 నమత్తీ ల మున్-వ; సముచ్చైచ్ఛలమున్-మూ; నముంగిటమున్-క (94) 1 వర్గము-తా 2 పంపె-తీ (95) 1 గుభేలున-మ,మూ,తా,హ 2 వైవఁజూచినన్-తా (96) 1 సంస్తుతి-మూ,త 2 చరస్థపృథివీసర్వంబవ -తా - క 3 చక్రంబు చక్రాకృతిన్ - మ,తా

క. దళిత హిరణ్యాక్ష తనూ । గళితాసృఙ్మాంస శోణ - ఘన ఘోణాగ్రో
జ్జ్వలుఁడై ధర యెత్తిన హరిఁ । బలుమఱు వినుతించి రమర-పతి మునిముఖ్యుల్. 97

క. వినుము, క్రమంబున విజయుం । డనునతఁడు హిరణ్యకశిపుఁ - డను దానవుఁడై
జనియించిన, నరకేసరి । తనువున హరి వాని నఖ వి - దారితుఁ జేసెన్. 98

వ. అని చెప్పిన, మార్కండేయుండు విస్మితుండై, యంభోధర గంభీర స్వరంబున రోమశున కిట్లనియె. 99

## వరాహావతార వర్ణనము

సీ. అనఘ! విశ్వేశ్వరుం - డగు శంకరునకు నా । వాసమై యుండుఁ గై - లాసశిఖరి,
యా రాజతాచలం - బసమాన శృంగంబు । గాఁ బ్రసిద్ధికినెక్కెఁ - గాంచనాద్రి,
సకలాశ్రయము రత్న - సాను శోభితమునై । యా మేరుగిరి యుండు - భూమినడుమ,
నది నవఖండమై - పదికోట్ల యోజనం । బుల వెడల్పున నొప్పు - భూరిమహిమ,

తే. నట్టి భూమండలమునెల్లఁ - జుట్టి పట్టి । దనుజుఁ డేరీతి [1]జలధిలో - మునుఁగవైచె?
నింత బాహాబలము వాని - కెట్లు గలిగె? । నీ రహస్యార్థ మెఱిఁగింపు - మిద్ధచరిత! 100

వ. అనిన, రోమశుం డిట్లనియె. 101

చ. వినుము మునీంద్ర! యా దనుజ - వీరుని దీర్ఘ భుజాయుగంబు కాం
చనగిరి సార, మాతఁడు ని - జంబగు నల్క సురాద్రి వార్ధిలో
మునుఁగఁగవైచి, దేవతల - మూల మడంచెద నంచు, నాత్మ నా
శన సమయంబు గానక, స - సంభ్రముఁడై కనకాచలేంద్రమున్, 102

ఆ. పెనఁచి పట్టి, యూఁచి, - పెకలింప [1]నుంకించు । నంత, రజతశైల - మందు నున్న
భూతనాథుఁ [2]డలిగి-బొటమనవ్రేల నా । త్రిదశశిఖరిఁ [3]గ్రుంగ-నదుముటయును. 103

క. హర చరణాంగుష్ఠంబునఁ । బరిపీడితమగుచు, దివిజ - పర్వత మేనూ
ఱిరువది యోజనములు స । త్వరమున దిగఁబడియె ధరణి - వలయముతోడన్. 104

వ. ఇట్లు ధరావలయంబుతో సురనిలయంబగు సువర్ణభూధరంబు రసాతలంబునఁ గ్రుంగిన, 105

(100) 1 (వ?) నధి-మా,తి,హ, గంగలో-తీ (102) 1 మణంచెద-త (103) 1 నూకించు-హా
2 డొరగి - మ,తి,తీ,హా,ర,క 3 శృంగమడుకు - మ,తా,తి

మ. తలవంపయ్యె భుజంగరాజునకుఁ, ద - ద్ధాత్రీభరం బానఁగా
నలవింతైనను [1]లేమిఁ గూర్మపతి స - ర్వాంగంబులుం గుంచి య
వ్వలపాలై తిరిగెన్, దిశాకరి చయం - బుం బెక్కు గండంబులం
జలనం బుప్పతిలంగ ౖమొగ్గెఁ గడు నా - శ్చర్యంబుగా నత్తఱిన్. 106

ఉ. భేదము మాని వార్ధు లోక - [1]పెట్టున నాల్గును మేరదప్పి, యే
కోదకమైనఁ గాంచి, సుర - యూథపులెల్ల భయాకులాత్ములై
యీదెస మాన్ప దిక్కుగల - దే హరిదక్కఁ [2]గ నంచు, నాపదం
బోధ సమీరు, నా పరమ - [3]పూరుషు నిట్లు నుతించి రందఱున్. 107

సీ. *''సకలజగన్నాథ! - శంఖచక్రాంకిత! । జలజాలయాధీశ! - జలజనయన!
దళి[1]తరాక్షస! జగ - త్కల్యాణ! సజ్జన । నిలయ! నీరదనీల! - నీలదేహ!
గ్రహ[2]నాథ తారకా - రాజ రాజిత[3]నేత్ర! । ఘనతర హార కం - కణ కిరీట!
సచ్చిదానంద! ని - శ్చల! దయాసాగర! । సత్య! సత్యజ్ఞాన! - [4]సత్యసహిత!

తే. జలజజాతాది నత నిజ - చరణనలిన! । అండజాధీశకేతన! - యజ్ఞ[5]దాత!
సతత నారద సంగీత - సక్తచిత్త! । శ్రితజనానీకరక్షణ! - శేషశయన! 108

క. జయ సర్వమంగళాలయ! । జయ జయ యోగీంద్రహృదయ - జలరుహ వసతే!
జయ గోవింద! మురారే! । జయ జయ నః పాహి'' యనిరి - సకలామరులున్. 109

చ. ఉరవడి వార్ధిలో మునుఁగు - చున్నది మేరువు ధాత్రితోడ, నె
వ్వరు నిది మాన్పనోపరు, జ - వంబున నేక్రియనైన రాక్షసుం
బొరిగొని, నీటిలోఁ గలసి - పోయెడి ధారుణి నుద్ధరింపవే!
హరి! జగదీశ! మాధవ! జ - నార్దన! దానవలోకమర్దనా! 110

వ. అని యివ్విధంబున, 111

క. హరిమాయా మోహితులై । సుర లది శీతాంశుఖండ - జూట కృతముగా
నెఱుఁగక, రాక్షసకృత మని । మొఱలిడుటయు, నాలకించి - మురభంజనుఁడున్, 112

---

(106) 1 లేకకూర్మ - తీ (107) 1 బెట్టుగ - మా,త 2 నటంచు - తీ 3 పుణ్యుని - మ,మా,త,తా,తి,హ,ర,క (108) * ఇది నిరోష్ఠ్య సీసపద్యము. 1 తాఘతత - తీ; తదుర్జన - త 2 రాజ - తీ 3 నయన - మ,మా,తి,తీ,హ,ర,క 4 సహితరూప - మ,మా,తి; సహితహృదయ - తీ,ర; సహితరూఢ-క 5 ధాత - తీ; సాధ - త; వాత - హ

ఉ. వారిభయంబు మాన్ప, సుర - వత్సలుఁ డాదివరాహమూర్తియై
ఘోరనిశాచరుం దునిమి, - కుంభిని మేరువుతోడ నెంతయున్
బీరమెలర్పఁ, గొమ్ముతుద - వేయవపాలున నుద్ధరించి, బృం
దారకకోటిఁ గాచె, [1]నది - నాకు హరుం డెఱిఁగించె సర్వమున్. 113

చ. అనుడు, మృకండునందన మ - హాముని రోమశుఁ బల్కె, నో కథా
వననిధి! యిందిరావిభుఁడు - వామనమూర్తి ధరించి, యాచరిం
చిన చరితంబు కర్ణపుట - చిత్త రసాయన మంద్రు కోవిదుల్,
వినియెదఁ దచ్చరిత్రము ప్ర - వీణత[1] మీఱ నుపన్యసింపవే! 114

వ అనిన రోమశుం డమ్మహాత్మున కిట్లనియె. 115

## వామనావతార వర్ణనము

మ. హరి, రక్షోహరణంబు సేయుటకు మా - యా వామనాకారుఁడై
గరిమన్ ఛత్రము, యజ్ఞసూత్రమును, స - త్కౌపీనమున్, మౌంజియున్
సరవిం దాల్చి, బలీంద్రుఁ గన్గొని, ''విభో! - స్వస్త్యస్తు తే'' యంచు, వి
స్ఫురితాశీర్వచనంబు లిచ్చి, కుహనా - పూర్వంబుగా నిట్లనున్. 116

చ. అరయఁగ[1] మేరువైనఁ బర - మాణు నిభంబగు నన్య[2]యాచ్ఞకుం
దొరఁ[3]కొనెనేని, నీగతి ఘ - నుండగు నుత్తమదాత కల్గినం
దిరముగ నర్థివిద్య సుర - ధేనువుపోల్కి ఫలించు, సిగ్గునం
[4]దఱుఁగని యర్థి మేరుగిరిఁ - దక్కువగాఁ దలపోయు నుబ్బునన్. 117

క. అడుగుట హీనము, వేఁడిన । నిడకుండుట యంతకన్న - హీనము, విభు నె
క్కుడు వేఁడఁగఁ దగ దర్థికి, । నొడఁబడఁగా వేఁడ నిచ్చు - టొప్పం బతికిన్. 118

ఉ. కుందక యిత్తు వర్థులకుఁ - గోరినయర్థము లంచు, గోఁచి ము
ప్పందుము గట్టఁగాఁ దలఁచు - పామరవిప్రుఁడఁ గాను, నాకు నా
నందముతోడ నిమ్ము చర - ణ త్రయమాత్ర ధరిత్రి, దాన మి
న్నందెద, నల్పదానమున - నైన సుఖింపనివాఁడు నార్యుఁడే? 119

---

(113) 1 నది - త.హ (114) 1 మీఱు - తా (117) 1 జిత్రమైన - మా 2 యాచ్ఞ - అన్ని ప్ర. 3 కొననీను - త 4 దఱిఁగిన - తీ.భిన్నప్ర.

క. [1]అనవుడు, బలి యొడఁబడుటయు । దనుజాంతకుఁ డప్పు డొక ప-దంబున ధరణిన్,
ఘనమార్గము నొక [2]చరణం । బునఁ గలయఁగ నాక్రమించె-భువనోన్నతుఁడై. 120

క. దానవవర్యుని నురగ । స్థానంబున నిల్పి, యభయ - దానంబున ని
త్యానందపూర పూరిత । మానసులంజేసె హరి, య - మర్త్యుల నెల్లన్. 121

క. ఆవేళ మీఁదఁజూచిన । శ్రీవరు చరణంబు జలము - చే నింపుగ వా
ణీవిభుఁడు గడుగ, నది దు । గ్ధావల్లభమౌళి నిల్చె - గంగానదియై. 122

ఉ. మానితలీలఁ బద్మజ క - మండలు పూరితవారి, యిందిరా
జానిపదంబు సోఁకి, దివి - పన్నదియై ప్రవహించి, స్వర్గ సో
పానమనంగఁ బొల్చె, విను, - పాతకియైనను ముక్తి[1]గామియౌ
మానవుఁ డానదిన్ మకర - [2]మాఘదినంబులఁ దానమాడినన్. 123

వ. అని చెప్పి, వెండియు నిట్లనియె. 124

## పరశురామావతార వర్ణనము

ఉ. తామరసేక్షణుండు జమ - దగ్నికి రాముఁడనం జనించి, యు
ద్దామమదంబునం బితృ వ - ధం బొనరించిన క్షత్రియాన్వయ
స్తోమముఁ జుట్టుముట్టి, నిజ - దోర్బలశౌర్య మహత్త్వమేర్పడన్
భీమకుఠారపాతములఁ - బేర్చి హరించెఁ ద్రిసప్తవారముల్. 125

## శ్రీరామావతార వర్ణనము

చ. జయ విజయాహ్వయుల్ మును ని - శాచరులై [1]జలజాయతాక్షుచే
క్షయమును బొంది, రెండవ యు - గంబున రావణ కుంభకర్ణులై
రయమున లోకముల్ చెఱుప, - రాముఁడనా నుదయించి, వారి ని
ర్దయత వధించెఁ జక్రి, విను, - తచ్చరితక్రమంబు సవిస్తరంబుగన్. 126

(120) 1 అనుటయు - హ 2 పాదం - తీ (123) 1 గాం॰చు,నే - క 2 మాస - తీ
(126) 1 జలజాక్షుచేతసం॰ - మ,మా,తా,తి,తీ,ఘా,ర,క

ఉ. ఓమునిసార్వభౌమ! సుగు-ణోజ్జ్వల! నిప్పుల నిర్మితంబు లీ
తామరచూలిచే విరచి - తంబగు విశ్వమునందు, మేషికా
స్తోమ గళస్తనంబులును, - శోభిత దాన విహీన హస్తముల్,
రామకథా సుధారస త - రంగిణిఁ దేలని కర్ణ జిహ్వలున్. 127

వ. కావున, రామాయణ కథాక్రమంబు వినిపించెద. ఆకర్ణింపుము. తొల్లి రావణ కుంభకర్ణాది దానవబాధా పరిపీడితులై దేవతలు ప్రార్థించిన, నారాయణుఁడు భానువంశోద్భవుండగు దశరథ నరేంద్రునకుం దన యంశంబున రాముండును, శేషుని యంశంబున లక్ష్మణుండును, శంఖ చక్రాంశంబుల భరత శత్రుఘ్ను లన, నలువురు తనూభవులం బుట్టించిన, వారు [1]క్రమక్రమ ప్రవర్ధమానులగుచుండ, నొక్కనాఁడు, 128

క. గాధితనూజుఁడు దశరథ । భూధవుకడ కేఁగుదెంచి, - పూజితుఁడై శా
ర్యాధికుల రామలక్ష్మణ । యోధుల నిజ యజ్ఞరక్ష - యొనరించుటకున్, 129

ఉ. పాటవమొప్ప వేఁడి, జన - పాలకుఁ డంపిన, వారితోఁ దపో
[1]వాటిక కేఁగుచో, నెదురు - వచ్చిన రాక్షసిఁ, గామరూపిణిన్,
దాటకఁ జూప, నా దశర - థక్షితిపాగ్రసుతుండు దాని లా
లాటము గాఁడనేసిన, ని - లాన్థలిఁ గూలె నిశాటి చయ్యనన్. 130

క. దాశరథి మఱియు యజ్ఞ వి । నాశకులగు నుగ్ర దైత్య - నాథుల నుద్దం
డాశుగ శతములఁ బొరిగొని । కౌశికుయాగంబు పూర్ణ - గతి నొందించెన్. 131

చ. ప్రథనము లిట్లు గెల్చి, ముని - రత్నముతోడ స[1]లక్ష్మణంబుగా
మిథిలకు నేఁగి, శంకరుని - [2]మెచ్చుల చాపము రెండుగాఁ బరి
శ్లథ మొనరించి, సీత, శుభ - లక్షణఁ గైకొని, భార్గవుం బర
శ్వథధరు నోర్చి, మోదమునఁ - జాఁగి యయోధ్యకు [3]వచ్చి, వెండియున్, 132

క. కేకయతనయా వశుఁడై । భూకాంతుం డనుప, జనక - పుత్రికతో ను
శ్లోకుండగు లక్ష్మణుతో । సాకేతపురంబు వెడలి - సరభసగతులన్, 133

---

(128) 1 క్రమంబుగవర్ధ - తా,తి,తీ (130) 1 వాటికినేఁగు - త (132) 1 లక్ష్మణుండు - హ
2 మెచ్చగు - తి,తీ 3 నేఁగి - తీ

సీ. దండకారణ్యంబు - దరిసి, యచ్చటు వాసి । చని, కుంభజాశ్రమ - మున వసించి,
తదనంతరము భర - ద్వాజాశ్రమమున శూ । ర్పణఖ నాసికఁ దున్మి - పాఱవైచి,
ఖరదూషణాది రా - క్షసుల ఖండించినఁ । దద్వార్త విని యల్గి, - దశముఖుండు
మారీచు ననిపిన, నా-నా రాక్షసుఁడు చిత్ర । మృగమూర్తి దాల్చి న - మీపసీమ

తే. జనకజా దృష్టిపథమున - సంచరించి, । తన్నుఁ బట్టంగ వచ్చిన - దశరథేంద్ర
తనయు నెలయించుకొని, కొంత-దవ్వు చనిన। రావణాసురుఁ డంత సం-భ్రమముతోడ, 134

తే. పర్ణశాలా నివాసినిఁ, - బరమ సాధ్వి, । జనకసుతఁ దేరిపైఁ బెట్టు-కొని రయమున
నాత్మపురి కేఁగె, నంత మా-యామృగంబుఁ । జంపి రాముఁడు మగుడి యా-శ్రమము చేరి,

క. ధరణీతనూభవఁ గానక । పరితాపము నొంది, [1]శోక - పరవశుఁడై సో
దర సహితంబుగఁ బంపా । సరసీతీరమున కరిగి, - జనపతి యచటన్, 136

ఉ. పావనిఁ గాంచి, తన్మధుర - భాషల కుత్సవమంది, చేరి, సు
గ్రీవునితోడ సఖ్య మొన - రించి, [1]నిజస్థితి భానుసూను చే
తో[2]విహితంబు సేయుటకు - దుందుభికాయముఁ బాఱమీటి యు
ద్ధావనిఁ గూల్చె వాలి నొక - యమ్మున ఖేచరులెల్ల మెచ్చఁగన్. 137

ఉ. వానరరాజ్య పీఠమున - వారిజమిత్రకుమారు నిల్పి, సీ
తా నలినాక్షి పోయిన [1]ప - థం బరయన్ హనుమంతు నంప, నా
ధీనిధి గోష్పదంబు పగి-దిం జలరాశి నతిక్రమించి, లం
కా నగరంబు [2]సొచ్చి, జన - క ప్రియనందనఁ గాంచి నమ్రుఁడై, 138

క. విభుఁ డిచ్చిన మణిముద్రిక । నిభగామిని కీయ, నమ్మ - హీసుత రామ
ప్రభుని గనుఁగొనిన కైవడి । శుభహర్షము నొందెఁ, బవన-సూనుఁడు మఱియున్, 139

ఉ. రాముని సేమముం దెలిపి, - రమ్య మృదూక్తుల నూఱడించి, యా
రామ యొసంగినట్టి ఘన - రత్నముఁ గైకొని, యుత్సహించి, లం
కా మణి[1]సౌధ జాలములు - కాలిచి, యక్షకుమారుతోడ ను
ద్దామ బలాఢ్యులైన బహు - దానవులం బరిమార్చి ధీరతన్, 140

---

(136) 1 యడవిఁబరికింపుచు - త (137) 1 జలస్థితి - మా,త 2 విమఁలంబు - తీ; విమ
రంబు - తా; విముదంబు-మ,మా,తి,హ,ర,క (138) 1 విధం-క 2 లోన - తి,తీ (140) 1 హర్మ్య శ్రీ
సౌధములు - ర

మ. తిరుగ న్వారిధి దాఁటి, రాఘవధరి - త్రీనాథచూడామణిం
గరమర్థిం గని, 'కంటి సీత' ననుచుం - గల్యాణవార్తా పుర
స్సరభావంబున, నింతిచేఁ గొనిన భా - స్వద్రత్న [1]మర్పించి, తా
ధరణిం జాఁగిలిమ్రొక్కి నిల్చిన, మహో - త్సాహంబుతో రాముఁడున్, 141

ఉ. ప్రాణముప్రాణమైన ప్రియ - భామిని మంగళవార్త దెచ్చి, నా
ప్రాణము నిల్పి, లోకమున - భానుకులోద్ధరణ ప్రసిద్ధ పా
రీణుఁడవైతి, తావక చ - రిత్ర [1]విచిత్రమటంచు నా జగ
త్ప్రాణకుమారునిం బొగడి, - పల్మఱుఁ గౌఁగిటఁజేర్చి, యత్తఱిన్, 142

క. భానుసుతానీతములగు । వానరసైన్యములతోడ - వసుధ చలింపం
గా [1]నరిగి, వార్ధిఁ గట్టి, చ । మూ నివహము సేతుమార్గ - మున దాఁటుటయున్, 143

సీ. శరణాగతత్రాణ - బిరుద విఖ్యాతుఁ డా । జానకీపతి, విభీ - షణుఁడు వచ్చి
మఱువుచొచ్చినఁ గాఁచి, - మహిమ లంకాపుర । ప్రాకారముల చుట్టు - వార [1]విడిసి,
కుంభకర్ణుని శౌర్య - జృంభణంబు హరించి, । నారాచముల మేఘ - నాదుఁ గూల్చి,
దశకంఠ కంఠ కాం - తారంబు నిజ బాణ । [2]వితతి దావాగ్ని కా - హుతి యొనర్చి,
తే. జయము గొని, సీతతోడ ల - క్ష్మణునితోడఁ । బుష్పకారూఢుఁడై సైన్య - ములు భజింప
సురలు జయపెట్ట, నలరుల-సోన గురియఁ । దిరిగి రాముఁడు సాకేత-పురికి నరిగె. 144

వ. ఇవ్విధంబున జయవిజయులు రెండవ జన్మంబున రావణకుంభకర్ణులై, రాఘవేశ్వరు బాణంబులచేత ప్రాణంబులం బాసి, మూఁడవ జన్మంబున ద్వాపరయుగంబునందు దౌవారికులు శిశుపాల దంతవక్త్రులై జనియించి, లోకకంటకులై వర్తించుచున్న సమయంబున, 145

## కృష్ణ బుద్ధ కల్క్యవతార కార్యములు

చ. జలరుహలోచనుండు, హరి, - సాధు జనావనశాలి, దేవతా
తిలకము, కృష్ణనామమున - దేవకిగర్భమునం జనించి, య
చ్చలమునఁ గంస కేశి ముర - సాల్వులతో శిశుపాల దంతవ
క్త్రులఁ దెగటార్చి, గోపికల - కుం బ్రియుఁడై విహరించె వేడుకన్. 146

తే. బుద్ధరూపంబు దాల్చి యం - భోజనాభుఁ । డసురవీరుల మోహాబ్ధి - యందు ముంచె;
భావికాలంబునకుఁ గల్కి - భావ మంది । ఖలజనంబుల మర్దింపఁగలఁడు శౌరి. 147

---

(141) 1 మున్నిచ్చి - త (142) 1 మచిత్ర - త; పవిత్ర - క (143) 1 నేఁగి - మా,తి,ర
(144) 1 విడిచి - అన్ని ప్ర. 2 వితత - మ,మా,త

క. అదిగావున, హరిచరితము । తుద మొద లిది యనుచుఁ దెలియఁ, - దోయజభవుఁడున్,
బదినూఱుతలలు దాల్చిన । సదయుండును నోపఁ, డితర - జనముల తరమే? 148

వ. అని పలికిన రోమశునకు మార్కండేయుం డిట్లనియె, 149

మార్మిక ప్రశ్నము - ధార్మిక సమాధానము

ఉ. రోమశ! నీదుపల్కుల వి - రోధము గానఁగవచ్చె, నిందిరా
స్వామికరంబులం దెగిన - వారలు ముక్తి భజింతురంటి ము
న్నీమహి నా జయాదు లుద - యించిరి ముమ్మరు ధాత్రి విష్ణుతే
జో మృతులయ్యు, [1]నట్టి దిది - సూక్ష్మము, నాకెఱిఁగింపు మేర్పడన్. 150

వ. అనిన రోమశుం డిట్లనియె. 151

సీ. జయ విజయు లమర - శాపంబు దగిలినఁ । బన్నగశాయికి - విన్నవింప,
''నేడుజన్మంబు ల - హీన వైష్ణవభక్తి । సహితులై విప్రవం - శమునఁ బుట్టుఁ
డటమీఁద మీకు శా - పావసానం బగు'' । నని పుండరీకాక్షుఁ - డానతీయ,
''నన్ని జన్మములు నీ - సన్నిధానము లేక । కాలంబు గడపుట - గలదె మాకు?

తే. అరులమై మూఁడు జన్మము - లంది, పిదప । మిమ్ముఁ జేరెద'' మని తారె-సమ్మతించి
నలిననాభునితోఁ బల్కి - నారు గాన । ననఘ! జన్మత్రయము వారి - కందవలసె. 152

వ. అని యిట్లు దశావతారవృత్తాంతం బెఱింగించిన రోమశునకు మార్కండేయుం డిట్లనియె. 153

క. దేవకివరగర్భంబున । శ్రీవల్లభుఁ డుదయమంది, - శ్రీకృష్ణుండై
యేవిధమున శిశుపాల మ । హీవరు [1]తల దునిమె నాన - తిమ్ము మునీంద్రా! 154

కృష్ణావతార వర్ణనము

ఉ. నావుడు, రోమశుండు ముని - నాథున కిట్లను, బ్రహ్మచేఁ బ్రియం
భావుకలీల, మున్ను శిశు - పాలముఖు ల్వరమంది, మత్తులై
దేవతలన్ హరించి, దశ - దిక్కుల నొక్కట నాక్రమించి, బా
హా విపుల ప్రతాపమున - నడ్డములేక చరింప నయ్యెడన్, 155

(150) 1 నంటిపిది - తా,హ; బుట్టినది - తీ (154) 1 లను - మ,తి,తీ,హ,ర,క

మ. [1]అమరాధీశ సహాయులై సురలు, దు - గ్ధాంభోధిలో శేషభో
గ మహా తల్పమునన్ శయించిన రమా - [2]కాంతున్, జగద్గర్భునిం
గమలాక్షుం గని, చాఁగిమ్రొక్కి, కర యు - గ్మంబుల్ శిరోవీథులం
బ్రమదంబొప్ప [3]ఘటించి, యిట్లని వి-నుతింపంజొచ్చి రా దేవునిన్. 156

చ. నియత [1]గుణచ్ఛటా రహిత! - నిర్జర[2]వంద్య! విరోధిదైత్య దు
ర్జయ! కరుణా సుధారస వి - రాజిత నేత్రసరోజ! సంశ్రిత
ప్రియ! కమలాముఖాంబురుహ - భృంగకులోత్తమ! నిత్య! నిర్మలా
శ్రయ! శశి భాస్కరాక్షియుగ! - శంఖ సుదర్శన శార్ఙ్గ లాంఛనా! 157

సీ. మాధవ! నరసింహ! - మధుకైటభాంతక! । దేవ! జగన్నాథ! - [1]దివిజవంద్య!
ధారాధరప్రభా - పూర నిర్మలదేహ! । దారుణ దైత్యేంద్ర - దర్ప హరణ!
శతకోటి మన్మథ - సౌందర్యసంపన్న! । సాంద్రవైభవ! పత - గేంద్రగమన!
కుండలద్యుతి గమ్య - గండమండలభాగ! । దర్వీకరేశ్వర - తల్పశయన!

తే. సతత నారద సంగీత - [2]సక్తహృదయ! । సచ్చిదానంద! నిర్గుణ! - సర్వపూర్ణ!
భక్తజన లోక రక్షణ!-పరమపురుష! । యాపదలఁ బాపి[3]మముఁ బ్రోవు-మంబుజాక్ష! 158

ఉ. భౌతికదేహధారులగు - ప్రాణులు తావక నామమంత్రముం
బ్రీతి జపించి, ప్రాగ్దురిత - బృందము వాసి, పునర్భవాటవీ
వ్రాతము సొచ్చి పోక, యప - వర్గముఁ గాంచి సుఖింతు, రర్క జై
వాతృక నేత్ర! భక్తజన - వత్సల! మాధవ! మేదినీధవా! 159

శా. ఆశాపాశ విముక్తులయ్యును వశి - ష్ఠాదుల్ మహాత్ముల్, పురో
డాశం బెవ్వరిఁగూర్చి వేల్చినను వే - డ్కం [1]దత్తదాకారివై
ప్రాశస్త్యంబుగఁ బావకార్పిత హవి - ర్భాగంబులన్ సమ్మదా
వేశం బొప్ప భుజించి, యాగఫల మీ - వే యిత్తు తత్కర్తకున్. 160

---

(156) 1 అమరాంభోధి - తీ 2 నాథున్ (యతి?) - తీ 3 గ సంఘటించి వినుతిం - త
(157) 1 గుణోజ్జ్వలామహిత - తీ 2 నంద్య - తీ (158) 1 దివ్య - త 2 సరస - క 3 నన(గృపఁ
బ్రోవవయ్య (యతి?) - క (159) 1 దత్పలాకారివై - హ

చ. సరసిజనాభ! నీ చరణ - సారసభక్తి విహీనులైన [1]దు
ష్పురుషులు వేదమార్గములఁ - బోవక, దార సుతాది సక్తులై
దురితము లాచరించి, తుద - దుర్గతిఁ బొందుదు, రెంతవారలుం
బరమవివేక! నీ మహిమ - పారముముట్ట నెఱుంగనేర్తురే? 161

తే. అఖిలలోకేశ! పార ప - ర్యంతరూప । పారపారగ! వారిజ - పత్రనేత్ర!
విశ్వ[1]రూప! నమోఽస్తు తే-వేదవినుత! । పాహి [2]నస్త్రాహి దేవ! శే-షాహిశయన! 162

చ. అని వినుతింపుచుం బ్రణతు - లై హరికిన్, శిశుపాలముఖ్య దు
ర్జను లుదయించి, పద్మజవ - రంబున నున్మదులై, జగత్త్రయం
బునకు నొనర్చు బాధవిధ - మున్ వినిపించినఁ జూచి, యా సనా
తనుఁడగు వేల్పుఱేఁడు ప్రమ - దంబున వారలతోడ నిట్లనున్, 163

సీ. అంబుజాసనదత్త - మగు వరంబున మదో । [1]న్మాదులౌ శిశుపాల - కాది దనుజ
వీరుల బాధించు - విధ మెఱుంగుదు, వారు । సమకాలమునఁ గాని - సమసిపోరు,
పదఁడు, నిర్జరులు గో - పాలకులయ్యును, । సురకామినులు గోప - తరుణులయ్యు,
నామ్నాయములు గో స - హస్రంబులయ్యును । మేదినిమీఁద జ - న్మింపుఁ డిపుడ,

తే. యంత, యదువంశమందుఁ గృ-ష్ణాహ్వయమున । భువన రక్షాపరుండనై-యవతరించి,
దనుజవంశంబు [2]నున్మూలి-తంబుచేసి, । యెల్లి నేఁటనె భూభార-మెల్ల డింతు. 164

వ. అని, దనుజాంతకుం డంతర్ధానంబు నొందె. వాసవాదులు నిజ నివాసంబున కరిగి, నారాయణోపదిష్ట ప్రకారంబున, నిజాంశంబుల గోపాలకులయ్యు, నమరకామినులు గోపిక లయ్యును, నిగమంబులు గో గణంబులయ్యును సంభవించిరి. తత్సమయంబున, 165

సీ. విను ముగ్రసేన నం - దనుఁడు కంసుం డను । వాఁడు, సోదరియైన-వనజ[1]ముఖిని,
దేవకి యను నామ - ధేయంబు గలదాని, । వసుదేవుఁ డను యదు - వంశజునకుఁ
బరిణయం బొనరించి, - బహు పదార్థము లిచ్చి, యత్తవారింటికి - [2]ననుపఁ దలఁచి,
యరదంబుపై వధూ - వరుల నెక్కించి, తా । సారథియై నిల్చి, - తేరు గడపి,

తే. నిరుపమోత్సాహభరితుఁడై - యరుగుచున్న । యవసరంబున వినువారి-కద్భుతముగఁ,
గంసునకుఁ గర్ణశూలంబు-గాఁగ, నభ్ర । వాణి యిట్లని పల్కె దు-ర్వార ఫణితి. 166

(161) 1 తత్పురుషులు - తా (162) 1 నాథ - మ,మా,తి,తీ,హ,ర,క; నేత - త 2 మాం పాహిదేవేశ పాహిశయన - తా (164) 1 ద్ధారులై - మ,తా,తి,ర; ద్గారులై - హ 2 నిర్మూలితంబు- తా,తీ (166) 1 నేత్ర - తీ 2 నంప - తి

మ. క్రమమొప్ప న్వసుదేవుగేహమున కి - కాంతామణిన్, దేవకిం
బ్రమదం బొందుచు నంపెదీ వకట! నీ - పాలింటికిన్ మృత్యువై
[1]కమలానాథుఁడు నివ్వధింపఁగలఁ, డీ - కంజాతపత్త్రాక్షి య
ష్టమ గర్భంబున సంభవించి తుదఁ, గం - సా! సంశయం బేటికిన్? 167

క. అని యశరీరియుఁ బలికిన । సునిశిత వాక్యంబు, తప్త - శూలము మాడ్కిన్
దన చెవులు గాఁడిపాఱిన, । ఘన భయమున సంచలించెఁ - గంసుం [1]డంతన్. 168

ఉ. దేహవినాశ మూలమగు - తీవ్ర విషావృతమైనయట్టి యా
బాహువుఁ ద్రెంచి, మేను నిలు - పందగు నందురు, కాన, సోదరీ
స్నేహము సేయుటొప్ప దని, - చెల్లెలి ముందలపట్టి, యా జగ
ద్ద్రోహి గళంబుఁద్రెంచుటకు - దోరసి యెత్తినఁ, జూచి యత్తఱిన్, 169

క. వసుదేవుఁడు ప్రాణేశ్వరి । యసువుల [1]పోకడకు నులికి, - యా కంసుని సా
హసకృత్యము మాన్పుటకై, । యెనఁగఁగ మృదు వాక్యగతుల - నిట్లని పలికెన్. 170

మ. విను, కంసక్షితినాథ! కీర్తిసుగుణా - న్వి[1]తుండ, వీ సోదరీ
హననం బిట్లొనరింప నీ కగునె? వి - ప్రానీకముం, గామినీ
జనులున్ [2]రాజు కవధ్యు, లీ గగన భా - ష ల్నమ్మఁగావచ్చునే?
మనుజుం డాడిన నమ్మరాదఁట! సుధీ - మార్గంబుఁ బాటింపవే! 171

చ. చలమున వేఁగురించి సతిఁ - జంపినఁ, బాపము దక్కఁగాని, కాఁ
గలపని కాకమానదు, జ - గన్నుత! కోపము మాను, ధర్మముం
దలఁపు, దయావిశేషము మ - నంబున నిల్పుము, భామఁ [1]దున్మఁగా
వల, దటుగాకయున్న జన - వల్లభ! వి న్నొకమాట చెప్పెదన్. 172

క. సుదతీమణి గర్భంబున । నుదయించిన సుతులఁ జంప - నొసఁగెద, నీ బె
ట్టిద ముడుగు మనినఁ, గంసుఁడు । మదిఁ గోపము[1]మట్టుపఱచి - మహితప్రౌఢిన్, 173

(167) 1 కమలాధీశుఁడు - క; కమలానాథుఁడు - మ (168) 1 డలుకన్ - మ, హూ, త, తా, తి, హ, ర, క (170) 1 పోకపడు-మ, శ, తా, తి, హ, ర, క (171) 1 తుండవై, సోదరిన్ - త 2 రేని-తి (172) 1 ద్రుంచఁగా - తీ (173) 1 ముట్టమరచి - తా

తే. దేవకీ వసుదేవులఁ - దిరుగఁ దెచ్చి । యాత్మపురమునఁ గారాగృ - హంబునందు
నునిచెఁ, గొన్నాళ్ల కొక పుత్రుఁ-[1]డుదితుఁడైన । దేవకీభర్త కంస క్ష-మావిభునకు, 174

క. ఆ నిసుఁగు నొసఁగుటయుఁ, ద । త్సూనృతమున కాత్మ మెచ్చి, - తోడనె మగుడం
గా నిచ్చెను వసుదేవున । కా నందనుఁ గంసనృపతి - యానందమునన్. 175

ఉ. అంతట నొక్కనాఁడు కల - హాశనమౌనివరుండు కంస భూ
కాంతుని గానవచ్చి, నృప - కల్పితపూజలఁ బ్రీతిఁ బొంది, శ్రీ
కాంతుఁడు దేవకీతరుణి - గర్భమునం దుదయించు గోప్య వృ
త్తాంతము చెప్పిపోవుటయు, - నా చపలాత్ముఁడు భీతచిత్తుఁడై, 176

క. * తొలుచూలువాఁడు మొదలుగఁ । జెలియలికిం బుట్టినట్టి - శిశువులఁ, గోపా
కులచిత్తుఁడగుచు నార్వురఁ । బొలి[1]యించి, దురాత్ముఁ డుచిత - బుద్ధిచ్యుతుఁడై, 177

తే. జనకుఁడగు నుగ్రసేనుని, - ననపరాధు । శృంఖలాబద్ధ చరణుని - జేసి యునిచి,
జగతి [1]వాలించె నా జరా - సంధముఖ్య । దానవశ్రేణి తనమాట - లోన నడవ. 178

## శ్రీకృష్ణ జననము

ఉ. వారిజనాభుఁ డంత యదు - వంశమునం దుదయించి, 'మేదినీ
భారము [1]మానుఁగా!' కనుచు - భావమునం దలపోసి, యోగ మా
యా రమణిం గనుంగొని, ప్రి - యంబున నిట్లను "దేవి! దేవకీ
నీరజగంధి గర్భమున - నిల్చినవాఁ డురగేంద్రుఁ, డాతనిన్, 179

తే. వెలఁది! నీమాయ నచ్చోటు-వెడలఁ దిగిచి । రోహిణీగర్భ[1]మందు నే-రుపున నిడుము;
అల యశోదకు నందన-వగుము నీవు; । ఏను దేవకియం దుద - యించువాఁడ". 180

క. అని నియమించిన, మాయా । వనితామణి యట్ల చేసె, - వారిజనాభుం
డును దేవకి గర్భంబున । నొనరఁ బ్రవేశింప, నా ప - యోరుహముఖికిన్, 181

ఆ. [1]తవనతప్పి యుములు-తఱుచయ్యె, మోమునఁ । [2]బలుకఁబాటు గొంత-తొలఁకరించె,
నలసభావ మొదవె,-నఖిలార్థములమీఁద । నరుచి పుట్టెఁ, దొడలు-మెఱుఁగులెక్కె. 182

(174) 1 డుదితమైన - తా,హ; డుదయమైన - త (177) * ఈ ప. మా,ర,ప్ర లో లుప్తము. 1 యించెంగంసుఁడుచిత - త (178) 1 ఖాలించె - ర; పాలించె - తీ (17?) 1 మాన్తుఁగాక - త,ర (180) 1 మునను - తి,తీ,హ,ర (182) 1 తపదప్పి - మా,త; తనువుదప్పి - తా,క; తమముదప్పి - తి,తీ, 2 బలకబారె - మ,మా,తా,తి,తీ,హ,ర,క

క. పురుషోత్తముఁ డుదరంబునఁ । బెరుగన్, సతిబడుగునడుము - [1]పెంపు వహించెన్,
సిరిగల దొర లోఁబడినను । నిఱుపేదలకైనఁ గలిమి - [2]నెలకొనకున్నే? 183

వ. హరి యుదయించి క్రోలఁగలఁ - డంచుఁ దలంచి, సుధారసంబు వి
స్ఫురిత సువర్ణకుంభములఁ - బూర్ణముచేసి, వినీలపాత్రముల్
మఱువుగ మీఁద మూసిన క్ర - మంబునఁ, జూడఁగ నొప్పె దేవకీ
తరుణికుచంబు, లగ్రములఁ - దార్కొనియుండిన [1]నీలిమంబునన్. 184

తే. అతివ భక్షింప లోనికి-నరుగు మంటి । పెల్ల గమి యొప్పెఁ, 'దన భార-మెల్ల మాన్పు'
మనుచు గర్భస్థుఁడైన ప-ద్మాక్షుఁ జేర । సూక్ష్మగతి నేఁగు మేదినీ-సుదతి యనఁగ. 185

తే. దేవకీదేవి గర్భ మం - దిరములోని । విష్ణుదీపంబు కొడి నాభి - వెడలి పాఱ,
దాని యంజనరేఖ చం - దమునఁ బొలిచె । మిగుల నఱుపెక్కి నూఁగారు -
పొగడఁ [1]దగుచు. 186

చ. క్రమమున నిట్టి చిహ్నములు - గల్గిన గర్భము, [1]నాఁడునాట సం
భ్రమమున వృద్ధిపొంద, దశ - మంబగు మాసమునందు, సన్మహా
ర్తమునను, శంఖ చక్ర కలి - తంబగు వేషమువాని, దేవకీ
రమణి, కుమారునిం గనియె, - రత్నవిభూషణ భూషితాంగునిన్. 187

క. [1]సుత[2]భూమికా ధరుండై । యతివకు నిట్లుదితుఁడైన - యబ్జాక్షు, జగ
న్నుతుఁ గనుఁగొని వసుదేవుఁడు । హిత వాచాకౌశలమున - నిట్లని పొగడెన్. 188

సీ. జయ సర్వమంగళా - స్పద! నిత్య! నిరవద్య! । జయ దయారసపూర్ణ-చారునయన!
జయ నిత్యకల్యాణ! - సనకాది సంసేవ్య । జయ లోకనాయక! - [1]నియతపుణ్య!
జయ శంఖ చక్ర లాం - ఛన! కౌస్తుభాంకిత! । జయ కోటికందర్ప - సదృశరూప!
జయ భాగవత మనో - జలజ మధ్యనివాస । జయ సర్వ![2]భోగి ప్ర - శస్త[3]తల్ప!

తే జయ రమాకామినీ నాథ! - సకలపూర్ణ! । జయ మహేంద్రాదివందిత - చరణకమల!
జయ సదానందమయ! జగ -జ్జాలరూప! । జయ ఝషాద్యవతార వి-స్పష్ట చరిత! 189

---

(183) 1 పెంపొదవించెన్ - తా 2 లోఁగొన (యతి?) - మ,తా,హ,ర (184) 1 నీలిమంబ నన్ - మ,మా,త,తా,తీ,హ,ర,క (186) 1 దగఁగ క; దగను - ఇతర ప్ర. (187) 1 నాఁడునాటి- అన్ని ప్ర (188) 1 సుత - త,తా,హ 2 కామికా - తా (189) 1 నిర్మిత-మా 2 లోక - తీ; భోగ - తీ,తా 3 తత్త్వ - క

క. సనకాది యోగిపుంగవు । లును గానఁగలేని - నిన్ను, లోకేశ్వరు, నేఁ
గనుఁగొంటి మత్పురాతన । జననార్జిత పుణ్యచయము - సఫలం బయ్యెన్. 190

క. కోపించి చంపెఁ గంసుఁడు । చాపలమున మత్కుమార - షట్కము, నిఁక నీ
రూప ముపసంహరింపుము । తాపత్రయహరణ! దేవ - తా [1]నుత చరణా! 191

వ. అని వినుతించి, సాంత్వనాలాపంబుల విన్నవించిన వసుదేవునకు, నా దేవదేవుం
డిట్లనియె. 192

చ. భయ మిఁక నేల? కంసముఖ - పార్థివభంజన మాచరింప నే
నయగతి మీకు నందనుఁడ - నైతి, వ్రజంబున నందభామినీ
శయనమునందు నన్నునిచి, - చయ్యనఁ దత్సుతఁ దెచ్చి, దేవకీ
శయనము నందుఁ బెట్టుము స - సంభ్రమతం జను మీక్షణంబునన్. * 193

ఉ. అని హితకార్యముం దెలిపి, - యాశ్రితలోలుఁడు బాలుఁడైనఁ, గ
న్గొని, వసుదేవుఁ డెత్తుకొని, - గొంకక రాత్రిఁ గళిందజానదిం
దనరఁగ దాఁటి, [1]నందవని - తా శయనంబునఁ బుత్త్రుఁ డించి, త
త్తనుభవఁ దెచ్చి, యాత్మసతి - తల్పముఁ జేర్చిన తత్క్షణంబునన్, * 194

క. ఆ పిన్నది [1]నినదంబుగ । వాపోయిన, నిద్రదేఱి - వాకిటికాడన్
గాపున్నవాఁడు చెప్పినఁ, । గాపురుషాగ్రేసరుండు - [2]కంసుం డలుకన్. 195

చ. పవనజవంబునం బఱచి, - [1]పాణిఁ గృపాణముతోడ సోదరీ
భవనము చొచ్చి, [2]కోలుపులి - బాలమృగిం గబళించునట్లు, పా
టవమున మేనకోడలి దృ - ఢంబుగఁ బట్టి, శిలాతలంబుపై
[3]స్రవమున నెత్తివైచుటయు, - [4]నా శిశు వప్పుడు శక్తిమూర్తియై, 196

తే. గగనవీథికి లంఘించి, - కంసుఁ జూచి, । 'యోరి పాపాత్మ! నీపాలి - వైరి వాఁడె
బాలుఁడై యున్నవాఁడు [1]వ్రే-పల్లెలోన।నిక్క' మని చెప్పి, తాఁ బోయె-నిలువ కచట. 197

---

(191) 1 నత - త,తా,తి,ర (194) 1 నందువనితా - మ,మా,త; *ఈ ప.త.ప్ర. లో లుప్తము (195) 1 నినదంబున - తా 2 కడు క్రోధమునన్-క (196) 1 బాణకృపాణ - మ,మా,త,తా,తి,హ,ర,క 2 కోలు - తీ;కోర - త; కోరు-మ,మా,హ,ర,క 3 రవమున (యతి?) - మ,త,తా,తి,తీ,హ,ర,క; స్రవ మున (యతి?) - మా 4 జయ్యన బాలయు (యతి?) - తీ (197) 1 రేపల్లె - అన్ని ప్ర

వ. అని చెప్పిన విని కంసుండు నిర్విణ్ణమానసుండై పశ్చాత్తాపంబు నొంది, వీరల [1]నడ్డ పెట్టనేల? యని దేవకీవసుదేవుల శృంఖలాబంధ విముక్తులం జేసి, నిజ నివాసంబున కనిపి, తాను నాత్మమందిరమున కరిగె. అంత, నట [2]వ్రేపల్లెలోన నందుండు రోహిణీగర్భజాతుం డగు రామునకును, గృష్ణునకును స్వపురోహితుండగు గర్గుచేత జాతకర్మాది సంస్కారంబులు చేయించి, విప్రులకు గోసహస్రంబుల నొసంగి, పరమోత్సాహంబున నున్న సమయంబున, 198

చ. మదమునఁ గంసభూవిభుఁ డ - మాత్యులతోఁ గొలువుండి, కృష్ణుఁ డా
యదుకులమందుఁ బుట్టిన ర - హస్యము సర్వము నొక్కనాఁడు నా
రదమునిచే నెఱింగి, మును - రౌద్రముగా దివినుండి యోగినీ
సుదతి యుపన్యసించిన వ - చో విధముం దలపోసి, భీతుఁడై, 199

చ. వ్రజమునఁ బుట్టినట్టి శిశు - వర్గమునెల్ల వధింపుమంచు నా
కుజనుఁడు పూతనం బనుప, - ఘోరనిశాచరి మర్త్యకాంతయై
నిజ కుచమండలి న్విషము - నించి, చలింపక నందగేహ మ
క్కజముగఁ జొచ్చి, కృష్ణుఁ బొడ - గాంచి, తగన్ గిలిగింతవుచ్చుచున్, 200

## కృష్ణుని బాలక్రీడలు

ఆ. [1]చేఁపి పాలు గారెఁ - జిన్నారి[2]యన్న! నా । చన్నుగుడువు మనుచు - సంభ్రమమునఁ
జూచుకంబు నోరఁ - జొనిపినఁ, గైతవ । బాలుఁ డపుడు తమక - పాటుతోడ, 201

క. కరములఁ దత్కుచకుంభము । దొరకంగాఁ దొడఁగి పట్టి, - దుర్వార బల
స్ఫురణమునఁ గుడువఁ, దన చ । న్నెరియుటయును దైత్యభామ - యేచిన నొప్పిన్, 202

క. విడు [1]విడు మనుచును, బెదవులు । తడుపుచు, నోర్మొత్తుకొనుచుఁ,-దనుఁ బడఁద్రోవన్
విడువక, తత్ప్రాణంబులు । వెడలఁగఁ గుచవిషము శిశువు - వెసఁ బీల్చుటయున్, 203

వ. బాలఘాతిని యగు నా పూతన విగతప్రాణయై, శైలంబు కరణిం గనుపించె. సురలు హర్షోత్కర్షంబునం గుసుమవర్షంబులు గురిసిరి. వెండియు, నృశంసుండగు కంసుండు తమ్ము హింసించుటకు ఘోరాకారులగు దానవవీరులం బనిచిన, బాలక్రీడా చరిష్ణుండగు విష్ణుండు సంభ్రమంబున, 204

---

(198) 1 నడ్డు - తీ 2 రేపల్లె-అన్ని ప్ర. (201) 1 చేఁపె-ర 2 నాయన్న - క (203) 1 విడు ష మనుచుఁ - మ,మా,తా,తి,తీ,హ,ర,క

సీ. శకటాది ఘోర రా - క్షసుల నిర్మూలించి, । వృషభుని సమవర్తి - వీటి కనిపి,
[1]బక తృణావర్తుల - వికలత నొందించి, । యఘదైత్యు విగళిత - ప్రాణుఁ జేసి,
యమునాతరంగిణి - యందుఁ గాళియు నొంచి, । వల్లవతతి నగ్ని - వలనఁ గాచి,
ఘనుఁ బ్రలంబుని జంపి, - మునిసతుల్ దెచ్చిన । [2]దివ్యాశనంబులఁ - దృప్తినొంది,

తే. యశ్రమంబున గోవర్ధ - నాద్రి యెత్తి, । బహువిధంబుల బలరామ - సహితుఁ డగుచుఁ
గృష్ణబాలుండు తనయిచ్ఛ-గ్రీడ సలిపె । శౌర్య ముప్పొంగ నందవ్ర-జంబునందు. 205

వ. అంత, 206

చ. కలుషగుణావతంసుఁ డగు - కంసుఁడు చారులచేత రామకృ
ష్ణుల భుజసత్త్వ విక్రమ య - శో గుణ వర్తనముల్ క్రమంబునన్
దెలిసి, తలంకి, వారల వ - ధింప నుపాయము లూహసేసి, యా
బలయుతమూర్తులం బిలువఁ - [1]బంపెదఁగాకని నిశ్చితాత్ముఁడై, 207

తే. ధీరు నక్రూరుఁ బిలిచి, యో-భూరిపుణ్య! । చనుము తేరెక్కి నందగో-ష్ఠమున [1]కిపుడ,
రామకృష్ణుల నిటకు శీ-ఘ్రమునఁ దెమ్ము । నావు, డక్రూరుఁడును దక్ష-ిణంబ కదలి, 208

ఉ. మందకు నేఁగి, బాలుఁడగు - మాధవుఁ గన్గొని, [1]సంస్తుతింపుచున్
వందన మాచరించి, యదు - వల్లభ! తా మధురాపురంబులో
నం దగు కార్ముకోత్సవ మొ - నర్పుచు, మిమ్మటఁ బిల్వఁబంచె, సం
క్రందనభోగ[2]శాలియగు - కంసుఁ, డనన్విని శౌరి నవ్వుచున్, 209

శా. ఆ యక్రూరునితో హితాన్నముల నా - హారించి, కృష్ణుండు కొం
తేయ [1]క్షేమ మతండు చెప్పినను బ్రీ - తిం బొంది, యా మంద నా
రే యెల్లం జనినం, బ్రభాత విధు ల - ర్థిం దీర్చి, తేరెక్కి, తే
జో యుక్తుల్ బలకృష్ణు లేఁగి, రల కం - సుం జూడ సాక్రూరులై, 210

క. అరుగునెడ, గోపికలు త । ద్విరహమ్మున కోర్వలేక - వెనుదగిలిన, నా
హరి వారల నుచితోక్తుల । మరలంగా ననిపి, చనియె - మధురాపురికిన్. 211

---

(205) 1 వెస - తీః బల - తి 2 దివ్యోదనం - తా (207) 1 బంచెద - తా (208) 1 కివు తీ
(209) 1 సంతసింపుచున్ - తా 2 రాశి - మ (210) 1 క్షేత - మ, హ, ర.

## కంస సంహారము

వ. అంతఁ గంసుండు రామకృష్ణాగమనంబు చారులవలన నెఱింగి, నిజ మందిరద్వారంబున మదధారా నిస్తంద్రంబగు కువలయాపీడ కరీంద్రంబును నిలిపి, ముష్టిక చాణూరాది మల్లులు గొలువ, నిజ సభా భవనంబున రత్నసింహాసనాసీనుండై యుండె. అప్పుడు రామకృష్ణులు రథావతరణంబు చేసి, యక్రూరు ననిపి, పాదచారులై, మధురాపురంబు ప్రవేశించి, రాజ మార్గంబునఁ బౌరజనంబులకు లోచనోత్సవం బొనరింపుచు, నృపభవనంబు చేరంజని, తద్ద్వారంబున నున్న మద దంతావళంబు నుత్పాటించి కుంభంబులు వ్రయ్య నడిచి, నేలం గూల్చి, భీకరాకారులై కంసు సమీపంబునకుం జని, 212

మ. కకుబంత ద్విప తుల్య రూపముల, రం - గ క్షోణిఁ జాణూర ము
ష్టిక మల్లేంద్రు లెదిర్చినన్, యదుకుల - శ్రేష్ఠుల్ నిరాఘాట స
త్త్వకళా జృంభిత ముష్టిఘాతముల వి - ధ్వస్తాంగులం జేసి, నే
లకు వ్రాల న్సమయించి, మల్ల విజయా - లంకారులై వెండియున్, 213

చ. కినుక మనంబునం [1]బొదలఁ - గృష్ణుఁడు కంసునిమీఁది కొక్క చం
గన వడి దాఁటి, తచ్ఛిరము - గాత్రముతోఁ బెడఁబాపి, కాలునిం
గనుఁగొన నంపి, తజ్జనకుఁ - గ్రమ్మఱ రాజ్యమునందు నిల్పి, భూ
వినుతముగాఁగ ధర్మ మభి - వృద్ధి వహింపఁగఁజేసి వెండియున్, 214

ఉ. * దేవకిఁ గాంచి మ్రొక్కి, వసు - దేవునికిం బ్రణమిల్లి, వారిచే
దీవనలంది శౌరి, బల - దేవుఁడుఁ దానును నిర్గమించి, బృం
దావనవాటికిం జని, ము - దంబున గోపనితంబినీ రతి
శ్రీ వశుఁడై, మురారి విహ - రింపుచునుండెఁ గ్రమక్రమంబునన్. 215

ఉ. కౌరవ పాండవ ప్రధన - కాలమునం జని, సవ్యసాచికిన్
సారథియై, సుయోధనుని - శౌర్యము మాపి, యుధిష్ఠిరు న్మహీ
భార ధురీణతా స్థితికిఁ - బట్టముకట్టి, మురారి దైత్య సం
హార మొనర్చి, సర్వవిజ - య ప్రమదంబున విఱ్ఱవీఁగుచున్, 216

---

(214) 1 దొడర - త (215) * ఈ ప.తా.ప్ర. లో లుప్తము

ఉ. ధీరత రుక్మిణీముఖ స - తీ వితతిం గ్రమయుక్తిఁ బెండ్లియై
ద్వారక నేలుచుండునెడ, - ధర్మతనూజుఁడు దిగ్జయార్జితో
దార పదార్థజాతములు - తమ్ములు దెచ్చిన, రాజసూయ మిం
పార నొనర్పఁగాఁ దలఁచి, - [1]యాప్తజనుం దనపాలి కంపినన్, 217

క. ఇంద్రాది దివిజ [1]వందితుఁ । డింద్రోపల నిభుఁడు, కృష్ణుఁ - డిచ్ఛా పురుషుం
డింద్రజ సాంద్ర స్నేహుం । డింద్రప్రస్థమున కరిగె - హిత పరివృతుఁడై. 218

## శిశుపాల వధ

సీ. అత్తఱి, శ్రీకృష్ణుఁ-డరుగుదెంచిన వార్త । విని, పాండుతనయు లా-విష్ణుమూర్తి
కెదురేఁగి, యర్ఘ్యాది - విదితార్చనంబుల । [1]వందనాదుల నుత్స-వం బొనర్చి,
యతని సమ్మతమున -నా ధర్మసూనుండు । రాజసూయ మహాధ్వ-ర మ్మొనర్చి,
ధరణీసురుల నిష్ట - దక్షిణాదులఁ దన్పి । యవభృథస్నానంబు - లర్థిఁ జేసి,

తే. యార్యభూసుర ముని సమూ - [2]హములలోన । హరికి నర్పించె జనపాలుఁ డగ్రపూజ
యది విలోకించి, శిశుపాలుఁ-డాగ్రహించి, సమదుఁడై పల్కెఁ దత్సభా-సదులువినఁగ.

ఉ. ఈ సభయం దకృత్య [1]మిది - యిట్లొనరించి నరేంద్రుబుద్ధి పూ
ర్ణ్మసెనొ? కాక, జ్ఞానమున - మించిన సంయమివర్యు లుండఁగా,
భూసురు లుండఁగా, నృపతి - పుంగవు లుండఁగ, నగ్రపూజకుం
గానుకుఁబోని యీ పసుల - కాపరి, [2]పేదరి గొల్లఁ డర్హుఁడే? 220

చ. అని, తన కంత్యకాలము స - మాగతమౌట యెఱుంగలేక, నిం
దన మొనరించు చైద్యుని, మ - దస్ఫురితానుచిత ప్రలాపునిం
గనుఁగొని, కృష్ణుఁ డా [1]ఖలుని - కంఠమృణాళముఁ [2]ద్రెంచె, హేమ భా
జన మను సాధనంబున ని - శాచర భీకర రోష దీప్తుఁడై. 221

---

(217) 1 యాప్తజునిం - తీ (218) 1 వంద్యుం-మ,తా,తి,హ,క (219) 1 వందనాదుల - స్నానంబులర్థిఁజేసి - ర.ప్ర. లో లుప్తము 2 హములతోన - మ,మా,త,తీ,హ,ర,క (220) 1 విధి-తా కంటె భిన్న ప్ర. 2 పాడరి - త; పాదరి (పాదలి?) - తా; పాపము - మా (221) 1 బలుని-తా 2 ద్రుంచె - హ

తే. దేవకీదేవి కిట్లింది - రా విభుండు । కృష్ణుఁడై పుట్టి, దైత్యుల - గీటణంచి,
దేవ సన్నుత చరితుఁ డా-దేహ ముడిగి, । కమలనాభుండు నిజనివా-సమున కరిగె. 222

తే. ఎపుడు దానవు లుదయించి, - రపుడు చక్రి । తద్వినాశంబు [1]గావింపఁ - దగినయట్టి
వేష మంగీకరించి, యా - విర్భవించుఁ । గాన, హరి[2]చర్య మంగళ - కారణంబు. 223

## జీవుని జన్మకర్మ బంధనము

సీ. విను, పాంచభౌతిక - విగ్రహంబులు దాల్చి, । భూవలయంబున - జీవరాశి
మానసప్రేరిత - మది, సంతతంబును । బహువిధ ఘోర పా - పము లొనర్చి,
రౌరవ ప్రముఖ నా - రక కూపములఁ గూలి, । యందుఁ బాతకఫల - మనుభవించి,
[1]పాపానురూప రూ - పములఁ గ్రమ్మఱఁ బుట్టి, । యజ్ఞానభవ మోహ-మాక్రమింపఁ,

తే. బుత్త్రదారాది సంగతిఁ - బొదలుచుండుఁ । బాము మూర్కొన్నవానికి - వేము తీయ
నైన కైవడిఁ, బుత్త్రమి-త్రాది [2]రతుల । కథమసంసార [3]సుఖమును-మధుర [4]మగును.

వ. అట్టి సంసారంబునం దగులువడి, [1]విశిష్టాదు లాదానాది క్రియా సంయుక్తులై, యధికారి విశేషంబున జ్ఞానోదయపర్యంతంబు కర్మప్రకాశంబగు నిగమమార్గంబు విమర్శించి, కర్మంబు లాచరింపుచుఁ, దత్కర్మనాశంబై, బాహ్యగత మనో మాయా రహితంబగు సమ్యగ్జ్ఞానంబు దొరకక మోహితులై వర్తింతు రని చెప్పి, 225

## ఆశ్వాసాంత పద్య గద్యములు

స్వాగతము. [1]రోష దూర [2]శమ - రూపిత వేషా! । వేష యోగ్య గుణ - [3]విస్ఫుట భూషా!
భూషణాకృత వి - భుత్వ విశేషా! । శేషభోగి సమ - చిత్ర మనీషా! 226

క. ఫణిశయన చరణకమల । ప్రణమిత నిజ[1]మూర్ధభాగ! - భాగవతాళీ
గణనీయ మహిమా! హిమకర । మణి నిర్మల కీర్తిధామ - మంత్రిలలామా! * 227

---

(223) 1 వారింప - తా 2 సర్వ - తీ (224) 1 పాపానుకూల - తి,తీ,హ,ర 2 గతుల-మా 3 సుఖమతి - తీ; ముఖముఖ - తి 4 మగుచు - మ,మా,హ,క (225) 1 విశిష్టులు సదాసావి క్రియా - మ; విశిష్టులాదానవిక్రియా - తా; విశిష్టులు దాసాక్రియా - తి; విశిష్టులు సదానక్రియా - తీ; విశిష్టజనులు దాసాదిక్రియా - హ; విశిష్టులు దాసావిక్రియా - ర; విశిష్టులు దాసాదిక్రియా - క (226) 1 దోష (యతి?) - మ,మా 2 షద-తా 3 నిస్ఫుట (యతి?) - మ (227) 1 మూర్ధ్న - అన్ని ప్ర. * ఈ ప. ముక్తపదగ్రస్తము.

మాలిని. హరి పదయుగ పూజా - యత్త చేతఃపయోజా!
నర వినుత వివేకా! - నందిత ప్రాజ్ఞ లోకా!
భరిత సుగుణరత్నా! - భాగ్య యోగ్య ప్రయత్నా!
సరస సుజన మిత్రా! - సర్వయామాత్యపుత్రా! 228

### గద్యము

ఇది శ్రీహనుమత్కరుణా వర ప్రసాదాసాదిత సారస్వతనిరాతంక, చంద్రనామాంక రామవిద్వన్మణి తనూజాత, అష్టఘంటావధానపరమేశ్వర బిరుద విఖ్యాత, హరిభట్టప్రణీతంబైన వరాహపురాణంబునఁ గైవల్యఖండంబను పూర్వభాగంబునందుఁ జతుర్థాశ్వాసము.

# పంచమాశ్వాసము

క. శ్రీరమణ ప్రతిపాదక । వారాహపురాణ తత్త్వ - వార్తా శ్రవణో
దార పరితోష చిత్త స । మారోపితపులక! యెఱ్ఱ - య ప్రభుతిలకా! 1

వ. అకర్ణింపుము. ఇట్లు రోమశుండు మార్కండేయునకుఁ బరమ పవిత్రంబగు శ్రీకృష్ణ
చరిత్రంబు వినిపించి, పరమానంద [1]వికసిత ముఖారవిందుం డగుచు మఱియు నిట్లనియె. 2

## కర్మయోగ క్రమము

తే. కారణంబగు పుష్పంబు,-కార్యమైన । ఫలము పెనుపొందఁ, దాఁ జెడు-పగిది [1]నొందుఁ;
గారణంబగు కర్మంబు, కార్యమైన । బోధ మొదవినఁ, దాఁ దెగి - పోవు ననఘ! 3

సీ. అనుపనీతునకుఁ జె - ప్పినయట్టి ధర్మంబు । బ్రహ్మచారికి నది - పనికిరాదు,
బ్రహ్మచారికి నొన - ర్చఁగ నొప్పు ధర్మంబు । గృహమేధులకు నాచ - రింపరాదు,
గృహమేధియోగ్యమై - [1]మహి మించు ధర్మంబు । వనవాసి చేయుట - యనుచితంబు,
వనవాసివిహితమై - తనరిన ధర్మంబు । సన్యాసులకుఁ బూని - జరుపఁ [2]జనదు,

తే. అట్టి [3]సన్యాసయోగంబు - లాత్మలోనఁ । బాదుకొనుదాఁక, [4]నధికారి - భేదమునను
వేదములు కర్మయోగంబు - విస్తరించు, । [5]నమల సుజ్ఞాన ఫల సమ - వాప్తికొఱకు. 4

క. వేదోక్త కర్మయోగ స । మాదరణాభ్యాస జనిత - హరితత్త్వ జ్ఞా
నోదధి యగు యోగీంద్రుఁడు, । మోదంబున నంతరంగ - ముఖమగు నాత్మన్, 5

## జ్ఞానయోగ విధానము

సీ. చూచునట్లన చూచు - సొరిది బాహ్యార్థముల్, । [1]దర్శన స్మృతి నాత్మఁ - దగులనీఁడు;
వినినయట్లన విను - వేదాది రవముల, । నాకర్ణనస్మృతి - నాత్మ నిడఁడు;
పలికినట్లన పల్కుఁ - బరులతో నేర్పున, । భాషణ [2]స్మృతి నాత్మఁ - బఱపికొనఁడు;
అంటినట్లన యంటు - [3]నఖిలవస్తువు, లెల్ల । స్పర్శనస్మృతి నాత్మఁ - బట్టుపఱుపఁ;

తే. ఈ విధంబునఁ గర్మంబు - లెల్ల వదలి । నిరుపమ జ్ఞాన భరితుఁడై - పరమయోగి,
భక్తిఁ బరమాత్మఁ దనమదిఁ-బాదుకొలిపి, । మఱచు బాహ్యప్రపంచంబు-మౌనితిలక! 6

---

(2) 1 కందళిత-క (3) 1 నొంద-మ,త,తా (4) 1 యొనరించు (యతి?)-మ,తి,క 2 దగదు-త
3 సన్యాసి యోగ్యంబు-తి,తీ 4 నధికార-త,తా 5 నసమ-క (6) 1 గలదర్శనంబులఁ గలసియుండు -
తి,తీ;దర్శనత్వము నాత్మఁదగులనీఁడు-మా;దర్శనం బందునఁ గానసి యుంకు (యతి?)-మ,తా,హ,ర క
2 స్తుతి-మా కంటె భిన్నప్ర. 3 నంటినవరలెను స్పర్శంబు మతి-తి,తీ;నన్యవస్తువులేమి ముట్టినఁ-త;
నంటకవరలినను మతి-మ,తా,హ,ర,క

సీ. చాంద్రమానమున మా-సము నిండ, నది యొక్క । దివసమై చనుఁ బితృ-దేవతలకు,
దినములు పితృమాస-మున నెన్న మున్నూట । యఱువది యొక యబ్ద-మమర[1]తతికి,
దేవ మానంబున-దివ్య వర్షంబులు । పండ్రెండువేలైనఁ - బరగ యుగము,
పరువడి [2]నేకస - ప్తతి మహా యుగములు । చింతింప నొక్క మ - న్వంతరంబు,

తే. రమణఁ బదునాల్గు మన్వంత-రములు చనిన । నబ్జభవునకు నొకదిన, - మందులోన
నవతరించును భూభార - మణఁప శౌరి । మీన కూర్మాది రూప స - మేతుఁడగుచు. 7

## హరినామ మహత్త్వము

ఉ. జిహ్వగసార్వభౌముఁడు, శ - చీరమణుండును, బంకజాసన
బ్రహ్మతనూజులుం, గమల - బాంధవులున్, హరి నాద్యు నీశ్వరున్
బ్రహ్మకు జన్మహేతువుగఁ - బ్రస్తుతిసేతురు గాని, కేవల
బ్రహ్మము విశ్వకర్త యని - భావమునం దలపోయ రజ్ఞతన్. 8

క. హరి నామ స్మరణంబునఁ । బరిహృతమౌ వాని దురిత - భారంబుఁ, బ్రభా
కరతేజస్స్ఫురణంబునఁ । గర మరుదుగఁ జెడని యంధ - కారముఁ గలదే? 9

క. సురలోక సతత సన్నుత । [1]చరితుండును, దైత్య తిమిర - [2]చండాంశుఁడు స
త్పురుష హృదయాలయుఁడు నగు । హరికన్నఁ దదీయ నామ - మధికం బనఘా! 10

మ. ఉపవాసంబులఁ, దీర్ఘసేవనములన్, - యోగావధానంబులన్,
జప హోమ వ్రతచర్యలం, దపములన్, - సన్యాసకృత్యంబులన్,
విపులక్లేశము నొందు సజ్జనులకున్, - విష్ణుండు [1]నీలేని మో
క్ష పదం బిచ్చుఁ దదీయనామము, సకృ - త్సంకీర్తి మాత్రంబునన్. 11

క. శ్రీహరి నామోచ్చారణ । మాహాత్మ్యముఁ గలుగఁబట్టి, - మానవు లఘ సం
దోహములఁ బాసి పొందుదు । రైహికసుఖ పారలౌకి - కానందములన్. 12

---

(7) 1 పతికి-మ,తి,తీ,హ,ర,క 2 నొక్క-తా (10) 1 చరణుండును - తి,తీ 2 చండాంశుం
డున్ బురుష - తీ: చండాంశుఁడు తత్పురుష - మ,మా,త,తా,తి,హ,ర (11) నున్లేని - అన్ని ప్ర.

చ. విను, మునినాథ! పూర్వమున - విప్రుఁ డొకండు కృతాంతుపీటికిం
జని, హరినామ మొక్కపరి - సంస్తుతిచేసిన, నాలకించి, త
ద్ధున [1]సుకృతంబుఁజేసి, నర - కస్థితు లాక్షణ[2]మందు ముక్తులై
రనుడు, మృకండునందన మ - హాముని రోమశుతోడ నిట్లనున్. 13

క. ధరణీసురుఁ డెట్లరిగెను । నరకస్థలి? కతఁడు విష్ణు - నామము నుడువన్,
నరకస్థితు లది విని, హరి । పురమున కేరీతిఁ జనిరి? - భూసురతిలకా! 14

వ. అనిన మార్కండేయునకు రోమశుం డిట్లనియె. 15

## శివశర్మోపాఖ్యానము

క. మునివల్లభ! పుష్పావతి । యన నొక్క పురంబు ధాత్రి - కవతంసంబై
తనరారుచుండుఁ, దత్పురి । యనుపమ విభవంబు పొగడ - నజునకు వశమే? 16

సీ. పార్వతీశ్వరు భాతి - భాసిల్లు నప్పురి । హేమ [1]వప్రములు - మిన్నేఱు మోచి,
హరి రీతిఁ బొల్చు న - ప్పురి [2]పరిఖాశ్రేణి । తనలోన భువన సం - తతులఁ బూని,
యంబుజాసను మాడ్కి - నలరు నప్పురి గోపు । రములు హిరణ్య గ - ర్భత వహించి,
యబ్ధి కైవడి నొప్పు - నప్పురి రాజమా । ర్గము వాహినీ సహ - స్రముల [3]బెరసి,

తే. సిరుల [4]పుట్టిల్లు, సౌభాగ్య-గరిమ [5]వెంట, । మంగళంబుల టెంకి, ధ-ర్మముల నెలవు,
వినుత సర్వార్థ నిలయంబు - ననఁ,ద్రిలోక । భాసురంబగు నమ్మహా-పట్టణమున, 17

మ. చతురామ్నాయ విశారదుం, డఖిల శా - స్త్రగ్రంథ నిర్ణేత, [1]స
త్క్రతు నిర్ధూత సమస్త కల్మషుఁడు, రా - గ ద్వేష దూరుండు, సు
వ్రతుఁ డొప్పున్, శివశర్మనా, ధరణిదే - వశ్రేష్ఠుఁ, డా సద్గుణో
న్నతచర్యుం డొకనాఁడు ప్రొద్దున నుష - స్స్నా[2]నార్థియై యేటికిన్, 18

తే. చని, కృతస్నానుఁడై కాల్య-సమయ కర్మ । పటల మొనరించి, భాస్కరో-పాస్తి [1]చేసి,
కుశ సమిత్పల మూలముల్-గొనుచు మగిడి। పురికిఁ జొత్తెంచు నప్పుడా-తెరువుపొంత, 19

(13) 1 సుకృతంబుచేత - మా,త 2 మాత్ర - త (17) 1 వత్రములు - మ,త,తా,తి,తీ,ర,క 2 పరిఘ - తీ కంటె భిన్న ప్ర. 3 మెఱసి - తి,తీ 4 పుట్టిల్లు - మ,తి,తీ 5 పింట - ర; పెంపు-తి,తీ (18) 1 సంగత - త కంటె భిన్న ప్ర. 2 నార్థమై - మ,మా,తి,తీ; నార్థుఁడై - హ (19) 1 తీర్చి - మ,మా,త,తా,హ,ర,క

చ. ప్రియ నవపత్ర సాంద్రమగు - పిప్పలభూజముక్రింద, వాలుకా
శయనమునందు, నప్పు డటు - సంభవమొందిన పిన్నపాపనిన్
[1]బయలునఁ గాంచి, యాతఁ డన - పత్యుఁడు గావున, భక్తితోఁ గర
ద్వయమున నెత్తి తెచ్చి, నిజ - ధామముఁ జేర్చి, దయార్ద్రచిత్తుఁడై, 20

క. శీలుండని పేరిడి, యా । బాలకునిం దాది పెట్టి - పరిపోషింపం,
గాలక్రమమున నతనికి । నాలో యౌవనము వొడమ, - నట విప్రుండున్, 21

వ. అక్కుమారుని జాతి నిర్ణయింప లేమింజేసి, కృషి [1]పాశుపాల్యంబులయందు నియుక్తునిం జేసిన, నతండును దత్కర్మంబుల నప్రమత్తుండై వర్తింపుచుఁ, దన్మందిరంబులు ధన ధాన్య [2]పూరితములుగా నొనరింపుచు, నా విప్రదంపతులయెడఁ బితృబుద్ధి గావింపుచుఁ, జౌర్య మాయాది రహితుండై, నిర్మల భక్తియుతుండై, పనులయందు సావధానుండై, తద్గృహంబునఁ బ్రవర్ధమానుండయ్యె. తద్భూసురాంగనయు నతనియందుఁ బుత్రస్నేహం బంగీకరించి, మృష్టాన్నంబులం బరితృప్తి యొనర్చుచునుండె. ఇట్లు కొన్ని సంవత్సరంబు లరుగునంత, 22

చ. సతతము నా మహీవిబుధ - సాధ్వి, కుమారులు లేక, దారుణ
వ్రతములు, దేవపూజ లుప - వాసములున్, బహు దానధర్మముల్
హితమతిఁజేసి, ప్రాయ మొక - యించుక జాఱఁగ, గొడ్డు[1]వీఁగి, య
ద్భుతముగఁ గాంచెఁ బూర్వ కృత - పుణ్యఫలంబున నొక్క కన్యకన్. 23

తే. పద్మదళనేత్రి, సౌందర్య-భరితగాత్రి, । బాల తనభార్య కిట్లు సం - భవమునొందఁ
గాంచి, శివశర్మ దానికి గ్రహము లైదు । నిధనమున నున్న, నేష్యంబు-నిర్ణయించి, 24

చ. మనమున ఖేదమంది నిజ - మానిని కిట్లను, నో లతాంగి! యీ
తనయకు వల్లభుం డగు న - తండు మహామహుఁడయ్యు, నేడు నా
ళ్లన జమువీటికిం జనఁగ - లం డిది తప్పదు, పూర్వజన్మమం
దొనరిచినట్టి కర్మఫల - మూరకపోవునె యెంతవారికిన్? 25

---

(20) 1 బ్రియతనమొప్ప - మా,త,తా (22) 1 పశుబంధనంబు - మ 2 సమృద్ధ - తి,తీ
(23) 1 వీడి - ర

ఉ. నావుడు, భూసురాంగన మ - నంబున శోకము నొంది 'యక్కటా!
దైవ మనేకకాలముగ్ర - తంబులు [1]బానగ నీయఁబోయి, నా
కీ వర మెట్లొసంగెఁ? బతి - హీనత నొందిన బిడ్డఁ జూచి, నా
జీవము నిల్చునే?' యనుచుఁ - జింతిలి, పొక్కుచు నుండు నంతటన్, 26

క. భూసురవరుఁ డా కన్యకు । వాసవి యని పేరుపెట్టి - వావిరి పెనుపం
గా, సప్త వత్సరంబులు । భాసురగతి నరుగఁ, బెండ్లి - ప్రాయం బైనన్, 27

చ. [1]వరుఁ గొనివచ్చి, పుత్రిని వి - వాహముచేసెద నంచు భూసురుం
డరయుచు బ్రహ్మతీర్థ తట - మందు విహారపురంబు చేరి, కే
సరుఁ డను విప్రనందను, ర - సజ్ఞు, నధీత సమస్తవేదు, న
ప్పురమునఁ గాంచి, [2]పిల్చుకొని - పోయి, నిజాత్మజఁ బెండ్లి చేసినన్, 28

తే. కనినవారెట్లు బ్రదికిరో - మునివరేణ్య! । విన్నవింపంగ నోరాడ-కున్న దిపుడు;
వాసవీభర్త దారుణ - జ్వరము దాఁకి । తనువుతోఁబాసె నేడవ - దినమునందు. 29

క. అతఁ డిట్లు శమన మందిర । గతుఁడగుటయుఁ, బాకలౌకి - కంబులు శాస్త్రో
[1]చిత సరణిఁ దీర్చి, భూసుర । పతిసతియును [2]దాను వగల - పాలై రనఘా! 30

ఉ. భవ్య [1]నివాసహేతువగు - ప్రాయ మొకించుక యంకురింప, భో
గ వ్యవహార యోగ్యమగు - [2]కాలమునంద యనుంగుబిడ్డ వై
ధవ్యము నొందెనేనిఁ దలి - దండ్రులయేటికి, దానిఁ గన్నచో
నవ్యయ దుఃఖసాగరము - నందు మునుంగరె వీత[3]రాగులున్? 31

తే. ఇట్లు పతిహీనయైన యా-యిగురుఁ[1]బోణి । కష్టములుకొన్ని చన్నఁ, బ్రా-యంబు వొడమె;
రసము చవిగొను భాజకీ - రంబు లేని । చూతలతికకు సఫలతా - ఖ్యాతి వోలె. 32

## శీలుని యుత్తమ శీలము

ఉ. వాసవి యట్లు యౌవన భ - వంబగు దర్పముఁ జెంది యిక్షుబా
ణాసన బాణ భిన్న హృద యాంబుజయై, ధృతి నిల్పలేక, కే
ళీ సుఖకాంక్షఁ దన్నుఁ గద - లింపఁగ, శీలునియింటికిం దమి
స్రా సమయంబునందు నభి - సారికయై రయమార నేఁగినన్, 33

(26) 1 సేయఁగ - తి (28) 1 వరునకొసంగి - తి, తీ 2 తోడుకొని - తి, తీ (30) 1 దిత-తా 2 దారు - హ (31) 1 వివాక - తా 2 నాలము (యతి?)-మ,త,ర 3 రాగతన్-హ (32) 1 బోఁడిం త,హ,ర; బోడి - తా

ఉ. శీలుఁడు దానిరాకఁ గని, - చిత్తమునం బరితాపమొంది, యా
బాలిక మన్మథార్త యగు - భావముఁ గన్గొని, పల్కెఁ 'దల్లి! నీ
వేలరుదెంచితిట్లు? మన - [1]యిద్దఱికిన్ శివశర్మ తండ్రి, దు
శ్శీలము మాను, నా యనుఁగుఁ - [2]జెల్లెల, వీ విధి నీకు ధర్మమే? 34

చ. ఉడుగుము పాపబుద్ధి, యిది - యెప్పుదు, మానఁగఁజాలవేని యి
ప్పుడె చని, యన్యపూరుషుని - బొంది భయంకర రౌరవాగ్నిలోఁ
దొడిఁబడఁ గూలి, నీ దురిత - [1]దుష్ట ఫలంబు [2]భుజింతు గాని, యిం
పెడలఁగ నన్నునుం జెఱుప - నేటికిఁ జూచెదు విప్రకన్యకా! 35

చ. నిమిషసుఖార్థమై కులము - నీఱుగఁ [1]జేసి, దురాత్మ లబ్బినం
దమకముతో రమించి, నిజ - నాథుని రౌరవమందుఁ ద్రోచి, [2]యు
త్తములగు నత్తమామ [3]దలి - దండ్రులకుం దలవంపు చేసి, మా
న మెడలి, మన్మథజ్వరము - నం జెడిపోదురు దుష్టకామినుల్. 36

చ. సుజనునకైన, దుర్గ్రహము - చూచిన దారుణ లగ్నమందు, నా
త్మజు లుదయించిరేనిఁ బితృ - ధర్మము వారికిఁ గల్గదన్న స
ద్ద్విజవచనంబు తప్ప' దని - వేమఱు కర్ణయుగంబు పాణి పం
కజముల మూసికొంచు, నెస - కంబున వెండియు దాని కిట్లనున్. 37

తే. 'తల్లి! నీ వింక నిచ్చటఁ - దడవు నిల్వఁ । జనదు పోపొమ్మ' నావుడు, - మనసులోన
నతివ లజ్జించి, [1]కోపాకు-లాత్మ యగుచు । మొక్కలంబునఁ బితృగేహ-మునకు నరిగి,

చ. కనుగవ కింపొనర్చు నుప - కాంతుని, దుష్కులజాతునైనఁ బై
కొని, రతిబంధ భేదములఁ - [1]గూడి రమింపుచునుండి, బంధకీ
జనమణి యొక్కనాఁడు విష - సమ్మిళితాన్నము పెట్టి చంపె స
జ్జన నుతశీలునిన్, గుణవి - శాలుని, శీలుని, బుణ్యలోలునిన్. 39

---

(34) 1 యిర్వురకున్ - తి,తీ 2 జెల్లలయీ - తి,తీ (35) 1 దుఃఖ - మా 2 భజింతుగాక-మా,తా,హ (36) 1 నెట్టి - మా,ర; నిట్టు - త,క; బెట్టె - తా; జేయు-తి,తీ 2 సత్తము - తి,తీ 3 తలి-అన్ని ప్ర. (38) 1 రోషాకులాత్మ - తి,తీ , క (39) గోరి - తా

మ. అకలంకుం డతఁ డిట్లు చన్న, శివశ - ర్మాఖ్యద్విజుం డౌర్ధ్వదై
హికముల్ వానికిఁ దీర్చి, యాత్మసతితో - నింతింత[1]నారాని మ
చ్చిక దుఃఖింపుచునుండె, నంతటను నా - శీలుండు భూదేవ గే
హ కృతాహార పవిత్ర భోజన భవం - బైనట్టి పుణ్యంబునన్, 40

చ. అనుపమ దివ్య దేహధరుఁ - డై వర పుష్పక మెక్కి, నిర్జరీ
జనములు గొల్వఁగా, నమర - సద్మము చొచ్చిన, వాని భానుమ
త్తనయుఁడు గాంచి, తత్ప్రతి హి - తత్వ గుణంబున కుత్సహించి, యా
యనఘుని, నాత్మకింకర ని- యామకుఁగా నధికారిఁ జేసినన్, 41

క. అతఁడును దాని కొడంబడి । ప్రతిదినమును శమన కింక - ర వ్రాతముతో
క్షితికిం జని భౌతిక తను । గతులగు ప్రాణులను విలయ - కాలజ్ఞుండై, 42

చ. కొని చనుచుండి యుండి, యొక - కొన్ని[1]దినంబులు చన్నమీఁద, నా
జనను తుఁ డొక్కనాఁడు శివ - శర్మఁ గనుంగొని, [2]చేరఁబోయి వం
దన మొనరించి, శీలుఁడను - నామము చెప్పిన, వానిఁ జూచి యా
ఘనుఁడు ప్రమోదమొంది, నునుఁ - గౌఁగిటఁజేర్చి, మృదూక్తి నిట్లనున్. 43

ఉ. [1]'ఎచ్చటనున్నవాఁడ విటు - లిన్ని దినంబులు? నిన్నుఁగూడి యా
వచ్చినవార లెవ్వ? రని - వారిత దివ్యశరీర మే ఘనుం
డిచ్చెను? నిన్ను భృత్యునిగ - నేలిన దేవవరేణ్యుఁ డెవ్వఁ? డీ
యచ్చెరు వంతయుం దెలుపు - మాత్మజ! నాయెడ భక్తి గల్గినన్'. 44

వ. అని పలికిన శివశర్మకు శీలుం డిట్లనియె. 45

సీ. భూసురోత్తమ! నీవు - పుణ్యాధికుండవు । సత్యసంధుండవు - సర్వసముఁడ
వగుట, నీ గేహంబు - నందుఁ బతివ్రతా । రత్నంబు భవదీయ - రాజవదన,
ననుఁ బుత్రవాత్సల్య - మున నియోగింపుచు । [1]నను వాసరంబు ని - ష్టాన్న మొసఁగ
భుజియించుకతన నేఁ - బుణ్యుండనైయుండ, । నంత, నీపుత్రిక - యధిక రోష

---

(40) 1 నాఁగాని - తా (43) 1 సమంబులు - త 2 భక్తితోడనా। తనికి నమస్కరించి వసుధాదివిజోత్తముయేను నీదునం। దనుఁడను శీలనాముఁడ మనంబున నన్ను నెఱింగితే యనన్ - తా (44) 1 అచ్చెరువంది విప్రవరుఁడాతనిఁ గన్గొని నిన్నుఁగూడి యా। వచ్చిన - తా (46) 1 ననుఁదాస్తతంబు - మాౕత

తే. కలితమానస యగుచు న - కారణంబ । విషముపెట్టిన, దేహంబు - విడిచి పోవ,
శమనుఁ డాత్మీయ కింకర-స్వామిఁ జేసి । భక్తిఁ బనిగొంచు, నను నేఁడు-పనిచె నిటకు.

క. ఇచ్చటి ధరణీపాలుం । [1]డచ్చలమున వేఁటవెడలి - [2]యధిక పిపాసం
బచ్చు నిఁక, నతనిఁ గొనిపో । వచ్చి, నినుం జూడఁ గంటి - వర్ణితపుణ్యా! 47

వ. అని చెప్పి, భూసురాన్న భోజన పుణ్యాతిరేకంబున దివ్యదేహంబు గలుగుటయుఁ, దనుఁ గూడవచ్చినవారలు యమకింకరు లనియు నెఱింగించిన, శివశర్మ ప్రముదితుండగుచు, శీలుని కర్ణంబు డాసి, మంతనంబున నిట్లనియె. 48

క. ఈ కాయముతోడనె సుర । లోకంబును, బ్రేతరాజ - లోకముఁ జూడన్
[1]నాకుం గాంక్షయుఁ బొడమె, న । శోకగతి న్వాని రెంటిఁ - జూపుము [2]పుత్రా! 49

చ. అనవుడు, 'భూసురేంద్ర! నిను - నంగముతోఁ గొనిపోవరాదు, నీ
తను వొకచోట దాఁప నుచి - తంబగు యత్నము సేయు, మంత నా
జనపతిఁ గాలకింకర వ - శంబున మీఁదికి నంపి వత్తు నే'
నని యెఱిఁగించి, శీలుఁడు ర - యంబునఁ బోయెఁ దిరోహి[1]తాత్ముడై. 50

శా. ఆలోఁ దత్పురనాయకుండు మృగయా - వ్యాసక్తి నానాచమూ
జాలంబు ల్గొలువంగఁ గానలకు ని - చ్ఛావృత్తిమై నేఁగి, శా
ర్దూలేభాది మృగంబులన్ శితశర - స్తోమంబునం దున్మి, యు
ద్వేల గ్రీష్మము దాఁకి సొచ్చి, మృతిఁ బొం - దెన్ దైవయోగంబునన్. 51

ఉ. భూపతి యిట్లు కాలగతిఁ - బొందిన, శీలుఁడు దివ్య యాన సం
స్థాపితుఁ జేసి, కింకర వ - శంబున మీఁదికి నంపి, సత్య వా
చాపరతంత్రబుద్ధి శివ-శర్మ గృహంబున కేఁగుదెంచి, త
ద్దీపితగాత్ర మొక్క బిల-దేశమునందు సురక్షితంబుగన్, 52

క. పదిలంబు చేసి, యా భూ । త్రిదశేంద్రుని నొక్క దివ్య - దేహములోనన్
ముదమున నిడుకొని చని యం । బుద మార్గము గడచి, వినయ-మున నిట్లనియెన్. 53

(47) 1 డిచ్ఛకమున - తి, తీ 2 ఎసఁగ - తి, తీ (49) 1 నాకున్నాకాంక్షవొడమెశోక ... ము, మూ, త; నాకుంగాంక్ష జనించె నశోక - తి, తీ, క 2 నింద్రా - తా (50) 1 తాస్యుడై - క

## శివశర్మ నరకలోక సందర్శనము

క. [1]ఈ తెరువు శమనపురికిని । నీ తెరువు సురేంద్రపురికి - నేఁగును భువన
ఖ్యాత గతి నిందులో నీ । కే తెరువు రుచించు నంద - యేఁగుద మనఘా! 54

క. అని శీలుఁ డిట్లు పల్కిన । విని విప్రుఁడు నరకలోక - వీక్షా[1]పేక్షన్
మును శమనపురికి నరుగుద । మని, శీలుఁడుఁ దానుఁ జనుచు - నటఁ గట్టెదురన్, 55

సీ. దావాగ్ని బహు శిఖా - తప్తులై వాతెరల్ । దడుపుచు నోళ్లెండి - పడినవారు,
దారుణ కింకరో - త్కర తాడితాంగులై । మొఱలువెట్టుచు నేలఁ - బొరలువారు,
నిటువంటి పాపంబు - లేల చేసితి మని । కుందుచుఁ దముఁ దిట్టు - కొనెడువారు,
మృదుపాదములు గాఁడి-మీఁగాళ్ళ వెడలిన । వాఁడిముండ్లను [1]నొచ్చి-వణఁకువారు

తే. నగుచుఁ, దెరువున యాతనా - ప్రాప్తులైన । విప్రహంతల, దేవతా - విత్తహరులఁ,
బరవధూ సంగ సహితులఁ,-బాప[2]రతుల । నద్భుతంబునఁ గనుఁగొంచు-నరిగి యరిగి,

వ. అట ముందట, శస్త్రధారా విదారితంబులగు దుర్జన జిహ్వా ఖండంబులవలనను, నిస్త్రింశ దళితంబులగు వేదబాహ్య జన గళంబులవలనను, శూలప్రోతంబు లగు గురునిందక వక్షస్థలంబులవలనను, గదా ఘాత శకలితంబులగు విప్రదూషక మస్తకంబుల వలనను, నిర్గళితంబులగు రక్త మాంస మేదో మజ్జాదులచేతం బంకిలంబై, తత్పూతి గంధంబునకు ననుబంధంబులతో గములుగట్టి, [1]ఝుంఝుమ్మన మూఁగి పరిభ్రమించు మక్షికాకులంబుచేత సంకులంబై, తదుద్భూతంబులగు క్రిమిసంఘాతంబులు తొలఁగం జెదరిపడిన కండల నండ గొనిన కాకంబులఁ దిననీక తఱుము లోహచంచు ఖగంబులచేత భీకరంబై, సింహకిశోరంబుల లీలం బొలుచు శునకసహస్రంబులు గఱచిన విడిపించుకొననేరక మొఱలువెట్టువారును, శూల నిక్షిప్తాంగులై దురంత వేదనాభరంబున నొఱలువారును, దప్త తైలమధ్యంబునం దేలియాడుచుఁ బొదపొదం బొక్కువారును, నసిపత్ర వనంబులం గూలంద్రోచిన శకలిత శరీరులై పరివేదనం

(54) 1 ఈ తెరవు సురేంద్రపురి। ప్రీతి జనున్నది చూడఁగఁ ప్రేతవీటికిం - మ; ఈ తెరువు శమను వీటికి। నీ తెరువు సురేంద్రపురికి నేఁగును భువన - మా; ఈ తెరువుసురేంద్రపురికి। నీ తెరువు కృతాంత నగరి కేఁగును భువన - త; ఈ తెరువు ప్రేతపతిపురి। కీ తెరువు సురేంద్రపురికి నేఁగను భువన-తా; ఈ తెరువు శమన పురమున। కి తెరువు తిలోకపాలుఁ డింద్రునివురికొ-తి,తీ; హ,ర ప్ర.లో ఈ భాగము లుప్తము. (55) 1 పరుడై - తా (56) 1 నెంచి - మ,క 2 రతులునైనవారిని,గను - తి,తీ (57) 1 జోమన - అన్ని ప్ర.

బొనర్చువారును, ప్రతప్త లోహస్తంభంబులం గట్టఁబడి కమలిన దేహంబులం బొడమిన దాహంబులం బరవశులై వగచువారును, మెడల నుపులు దవిలించి వ్రేలం దివిచిన వాయు నిరోధంబున నయనంబులు వెలికి నుఱికి తూఁగియాడెడువారును, గ్రాఁగిన లోహద్రవంబులు వాతెఱలం బూరించిన నంతర్దాహంబున హాహాకారంబు లొనర్చువారును, గళ లగ్నంబులైన గాలంబులతోడం ద్రిప్పినఁ దద్భ్రమణ వేగంబునం దెగి కూలువారును, లోహముఖంబులు గల పులుఁగులు కన్నులవియం బొడిచిన నంధులై కూపంబులం బడువారును, సంఘాత కాల సూత్రాది నరకంబులందు బాధితు లగువారునునై యాతనాదేహం బవలంబించి, పాపఫలం బనుభవించి, కుందు ప్రాణులచేత బీభత్సాకరంబైన యమమందిరంబుఁ గనుంగొని, శివశర్మ పార్శ్వస్థితుండగు యమదూత కిట్లనియె. 57

క. ఇది యే లోకం? బెవ్వని । సదనం? బీ ప్రాణు లిట్లు - సంతత దుఃఖా
స్పదు లగుటకుఁ గత మెయ్యది? । సదయత నీ మాయ దెలుపు - సర్వము పుత్రా! 58

వ. అనిన భూసురోత్తమునకు శీలుం డిట్లనియె. 59

సీ. మున్నూఱు యోజనం - బులు లోని విస్తృతం । బార్నూఱు క్రోశంబు - లాయతంబు
నై మించు నిచ్చోటు - యమలోక, మిందును । జీవులు మును ధాత్రిఁ - జేసినట్టి
పాతకరాసుల - ఫలముల నీరీతి । యాతనా సహితులై - యనుభవించి,
పాపానురూప రూ - పములతో మేదినీ । స్థలమున వెండియు - సంభవించి,

తే. పుత్ర మిత్ర కళత్రాది - భూరి మోహ । సహితులగుచు ననేక దో - షము లొనర్చి,
కాలవశమున గాత్ర[1]సం-గములు విడిచి, । తిరుగ నీలోకమున కేఁగు-దెంతు రనఘ! 60

తే. పుణ్య పాప ఫలంబు లీ - పురవరమున । ననుభవింపంగఁ గూడిన - యపుడు, విప్ర!
ధారుణీనాయకుండు సం-త్యజుఁడు నొక్క । సమము, యధికాల్ప భావ లే-శమును లేదు.

సీ. కాఁగిన యినుము వ-క్త్రమునఁ బోసినఁ దిను । వారలు వాగ్వ్యభి-చారపరులు,
మండెడు నుక్కుకం - బములఁ బీడించిన । వారు సంతత పర - దారరతులు,
తప్త తైల ప్రవాం - తరముల వర్తించు । వా రన్య సంతాప - వత్సలాత్మ,
లురులు వెట్టిన మెడ - లూఁచిపోవఁగ వ్రేలు । వారు [1]జారాంగనా - వ్యసనమతులు

తే. భీకరానల శిఖలలో - వ్రేలువారు । శిష్టజన తాపకరులగు - దుష్ట[2]జనులు,
తనువు లవియంగ నసిపత్ర-వనములందుఁ । బొక్కిపడువారు బొంకుల-పుట్ట లనఘ! 62

(60) 1 సంఘములు - మ,తా,హ,రక (62) 1 రాజాంగనా - మా,తః పరాంగనా - తి,తీ
2 మత్తులు - మ,హ,క

సీ. బ్రహ్మకల్పముదాఁక - బ్రహ్మఘ్ను లుందురు । తిరముగా సంఘాత-[1]నిరయమందు,
మధుపానరతి [2]క్రియా - మత్తు లుందురు కాల । సూత్ర నారకమందు - శోకమునను,
స్వర్ణ చోరకులగు - సాహసు లుందురు । తప్తాఖ్య నరక మ - ధ్యమమునందు,
గురు విప్ర దూషణ - పరతంత్రు లుందురు । క్రిమిభోజనమునందు - ఖేదమునను,

తే. నిందకులు నాస్తికులు నతి - నీచమతులు । భ్రూణహంతలు కన్యలఁ - బొందువారు
బలిమిఁ బరభామినులఁ [3]జెఱ-పట్టువారు । ఘోరగతిఁ బొందుదురు వజ్ర-నారకముల. 63

క. ఋతుకాలంబున లజ్జా । వతియగు సతిఁ బాసి చనిన - వల్లభుఁ డతి దుః
ఖితుఁడగుచును వర్తించును । సతతంబును గాలపాశ - సంఘాతములన్ 64

క. నిరయమున నున్నవారును, । నిరయోన్ముఖులైనవారు, - నిరయ శ్రేణిం
దరియించినవారలునై । యురుతర దుఃఖముల నెరియు - చుందురు ప్రాణుల్. 65

తే. నరక దుఃఖానుభవము నెం - దఱు భజింతు । రందఱు ప గామమోహితు-లై జనింతు,
రుర్వీసుర! ధాత్రిలో నెంద-ఱుదితులైరి । యందఱును వచ్చుచుందు రీ-యమునిపురికి.

సీ. చూడుము! మేదినీ - సురవర్య! రోషాగ్ని । సందీప్త లోచనో - జ్జ్వలితుఁ డగుచు,
దక్షిణకరమున - దండంబు చూపట్టు । నట్టహాస భయంక - రాస్యుఁ డగుచు
యాతనాసంగతు - లగు జీవులకు నెల్ల । నతి భీమదర్శనుం - డగుచు మెఱసి,
చండశూలాయుధో - ద్దండ బాహోగ్రుఁడై । వరుస నల్గడలఁ గిం - కరులు గొలువఁ,

తే. చిత్రగుప్తుండుఁ జిత్రుండుఁ - జిత్రముఖుఁడుఁ । జిత్రకేతుండు సమముగా - జీవకోట్ల
కెల్లఁ బాపంబు పుణ్యంబు-నేరుపఱుప, । నిండుకొలువున్నవాఁ డంత-కుండు వాఁడె. 67

వ. ఇట్టి యమలోకంబునకు నాగ్నేయభాగంబున నన్న పర్వతంబులును, నాజ్య ప్రవాహంబులును, బాయస కూపంబులును, శర్కరా సరోవరంబులును, మాక్షిక తటాకంబులును మొదలుగాఁ గలుగు పదార్థంబులకు నిలయంబై, చతుర్ద్వార సమేతంబై పితృలోకంబు వర్తించు. అందుఁ బితృదేవతలు వివాహాది కర్మకాలంబుల సమాహూతులై, ప్రాగ్ద్వార స్థిత సత్య వసు సంజ్ఞిక విశ్వేదేవతా సమేతులును, దీర్ఘశ్రాద్ధాదులయందు సమాహూతులై యుదగ్ద్వార స్థిత ధూర్లోచన సంజ్ఞిక విశ్వేదేవతా సమేతులును, మాస సాంవత్సరికాది పైతృకంబులం బశ్చిమ ద్వార స్థిత పురూరవాద్రవ సంజ్ఞిక విశ్వేదేవతా సమేతులును, సపిండీకరణాదులయందు దక్షిణద్వార స్థిత కామల కామ సంజ్ఞిక విశ్వేదేవతా సమేతులునై, తద్విశ్వేదేవ పూర్వకంబుగ

(63) 1 నరక - త 2 గల - తీ 3 జెరఁబట్టు - తీ

హుతంబులును, దత్తంబులును నగు భోజ్యంబులును, గొలపక్వంబులు, నగ్నిపక్వంబులు, రసపక్వంబులు నైన యన్నంబులం దృప్తిం బొందుదురు. ఇట్టి పితృలోకంబునకు నుదగ్భాగంబున, 68

మ. ప్రతత స్వర్ణ మణిప్రభా ధగధగ - త్ప్రాసాదవర్గంబు, నూ
ర్జిత [1]రంభాముఖ నిర్జరీ బహువిధ - క్రీడా నిసర్గంబు, శో
భిత చింతామణి కల్పకామరగవీ - బృంద ప్రసూతార్థ మం
డిత మార్గంబునునైన స్వర్గ మది కం - టే? భూసురాగ్రేసరా! 69

చ. అని వినిపింపఁగా, యమభ - టాగ్రణివాక్యము లాలకింపుచుం
జని, నికటంబున న్నరక - సద్మమునం దనురూప యాతనా
తనువులు దాల్చి, శోక పరి - తాపమునం బలవించు జీవులం
గని, కరుణాతిరేకమునఁ - గర్ణపుటంబులు కేల మూయుచున్, 70

## నరకవాసులకుఁ బరమపదప్రాప్తి

క. నారాయణ నారాయణ। నారాయణ యనుచుఁ బలుక - నరకస్థితు లా
నారాయణ నామ శ్రుతి। కారణమున విష్ణుపదము - గనిరి మునీంద్రా! 71

చ. హరిపురి కీప్రకారమున - నందఱుఁ బోయినఁ, బ్రేతనాథుఁ డా
ర్త రవము లెప్పటట్లు విన - రాక, నిజాలయమెల్ల శూన్యతా
గరిమ వహించియుండుటకుఁ - గారణముం దెలియంగలేక, య
చ్చెరుపడి యాత్మకింకరులఁ - జీరి భయంకరరీతి నిట్లనున్. 72

సీ. భూరి లోహస్తంభ - ములయందు నేలొకో। కలయంగ ననలంబు - లలమికొనవు?
తప్యమానము లగు - తైలంబు లేలొకో। భుగభుగ ధ్వనులతో - నెగసిపడవు?
బంధుర నరక కూ-ప శతంబు లేలొకో। ప్రకట బీభత్సపూ-ర్ణములు గావు?
[1]శ్వాపదాది క్రూర - జంతువు లేలొకో। పసిగొని నలువంకఁ - బరువులిడవు?

తే. వాఁడిదప్పిన వసిపత్ర - వనము లేల?। శూలములు మొక్కపోయిన - వేల నేఁడు?
వివిధ కుజనార్తరవ మేల-చెవులఁ బడదు?। పాడువాఱె నిదేల మ-త్పట్టణంబు? 73

(69) 1 రంగన్ముఖ - తా (73) 1 జనపదాది - తః ద్వాపదాది (యతి?) - మ,మా,క; శ్వాపదాది - తి,తీ,హ,ర

మ. హరిదాసుల్ పనిపూని యిచ్చటికి ది - వ్యాకారులై వచ్చిరో?
వర యోగీంద్రులు దివ్యనామము లిట - న్వర్ణించిరో? కాక, శ్రీ
వరుఁ డత్యంత దయాభిరాముఁ డగుచున్ - వైకుంఠముం జేర్చెనో?
[1]తఱుచై ప్రాణులు లేరు చూడ నరక - స్థానంబునం దెయ్యెడన్. 74

వ. అని పలికిన పితృపతికిఁ గింకరులు కరంబులు మొగిచి యిట్లనిరి. 75

ఉ. స్వామి! కృతాంత! దండధర! - సజ్జనబంధు[1]శరణ్యుఁ, డిందుగా
భూమిసురాగ్రగణ్యుఁ డొక - పుణ్యుఁడు వచ్చి, విపన్న మానవ
స్తోమము గాంచి, జాతకృప - తో హరిఁ బేర్కొనఁ, దన్ముఖంబునం
దామరసాక్షు నామము ము-దంబున వీనుల నాలకించుటన్, 76

క. *పాపములఁ బాసి, నరక । స్థాపితులగు జీవులెల్లఁ - దత్క్షణ మాత్రన్
శ్రీపతిభవనము చేరిన । నీపురి శూన్యత్వగతి వ - హించె మహాత్మా! 77

వ. అనిన, కింకరులకు నంతకుం డిట్లనియె. 78

ఉ. కింకరులార! మీరు పరి - కింపక శ్రీహరిభక్తుల న్నిరా
తంకత నిట్లుఁ దేఁదగునె? - దానన మత్పుర మిట్టిదయ్యె, మీ
కింకొక బుద్ధి చెప్పెద, మ - హీస్థలి కెన్నఁడుచన్న, వైనతే
యాంక పదారవింద [1]యుగ - ళాత్ముల, భాగవతాగ్రగణ్యులన్, 79

క. హరిభక్తిపరుల, లక్ష్మీ । శ్వరు సేవాపరుల, విష్ణు - చరణార్చన త
త్పరుల, ముకుంద గుణస్తుతి । పరులం గని, తొలఁగిపొండు-భయ రయ యుతులై 80

వ. అని, వైవస్వతుండు నిజకింకరుల నాజ్ఞాపించి, యంతఃపురంబునకుం జనియెఁ
శివశర్మయు విష్ణునామ ప్రభావం బెఱింగి, భూలోకంబునకు వచ్చి, యాత్మశరీర గతుండై,
చతుర్థాశ్రమంబు గైకొని, నారాయణ ధ్యాన పరాయణుండై హరిపుర ప్రాప్తుండయ్యె నని
చెప్పిన విని, మార్కండేయుండు రోమశున కిట్లనియె. 81

---

(74) 1 తఱచై - మా (76) 1 శరణ్యా! ముందుగా - తి,తీ; శరణ్యుఁడెత్తుగా - త; శరణ్యుఁ డింతలో - తా; శరణ్యుఁ డింపుగా - క (77) * ఈ పద్యమును, దరువాతి వచనమును ర. ప్ర.లో లుప్తము (79) 1 నికరాత్ముల - త. కంటె భిన్న ప్ర.

యాతనాశరీర ధారణము

క. నానావిధ దేహంబులఁ । బూనిన యా జీవులెల్లఁ - బుడమిని మృతులై
యా నరకంబుల కేవిధ । మైన శరీరములు దాల్చి, - యరుగుదు రనఘా? 82

క. అనవుడు, విజ్ఞాన కళా । వననిధి, రోమశుఁడు, వైష్ణ - వగ్రామణి, యా
మునిశేఖరునకు నిట్లను । ననుపమ వాక్పాటవమున - కార్యులు మెచ్చన్. 83

సీ. జీవుఁ డవధ్యుఁ డ - [1]చ్ఛేద్యుఁ డక్లేద్యుండు । జన్మ జరా మృత్యు - జాతి రహితుఁ
డంగనా పురుష వే-షాది శూన్యుఁడు నిత్యుఁ । డచలుండు సర్వగుం-డగుచు నుండు,
నతఁ డాత్మకర్మమూ-లాగత మృగ పక్షి । మనుజ కీటాది జ - న్మములఁ బొంది,
త దనురూపములైన - తనువుల ఫల మాయు । రవసాన పర్యంత - మనుభవించి,

తే. పుత్ర [2]దారాది మోహాంధ - బుద్ధి యగుచు, । భుక్తి నిధువన నిద్రాది - సక్తుఁ డగుచు
నస్వసుఖముల బద్ధుఁడై,-యంతమీఁదఁ । గాలవశమున మృతిఁబొంది-గాత్ర మెడలి, 84

మ. యమదూతల్ గొనిపోవఁ, గర్మ లయ ప - ర్యంతంబు శస్త్రాగ్ని ము
ఖ్యములన్ ద్రీలని యాతనా తనువునం - దావిష్టుఁడై, భోగ[1]నా
శ్యములం గర్మఫలంబులం గుడిచి, త - త్సందర్శితానేక గ
ర్భములం గ్రమ్మఱఁ బుట్టు జీవుఁ డుచిత - ప్రజ్ఞా విహీనాత్ముఁడై. 85

చంద్రసూర్యవంశ రాజన్యుల జనన ప్రకారము

చ అనిన, మృకండుసూనుఁడు ప్రి - యంబున రోమశుతోడ నిట్లనున్,
'మునివర! సూర్య సోమకుల - ముఖ్య నరేంద్రుల జన్మ కర్మ వ
ర్తనములు సర్వముం దెలియఁ - దత్త్వమతి న్వినిపింపు' మన్న, నా
ఘనఘవరేణ్యుఁ డిట్లనియె - నమ్మహనీయున కాదరంబునన్. 86

మ. హరి బాహాయుగళంబు[1]నం దుదితులై, - యత్యంత [2]బాహాఢ్యులై,
ధరణీ దుర్భర భార సంభరణ వి - ద్యా దక్షులై సంతత
స్థిర ధైర్యోన్నతులై, సమస్త విభవ - శ్రీ కామినీ పూర్ణ మం
దిరులై, రాజులు పుట్టి రంబుజసుహృ - త్తేజోఽభిరామాంగులై. 87

---

(84) 1 భేద్యు (యతి?) - అన్ని ప్ర. 2 మోహాది - మ,తా,తి,తీ,హ,ర,క (85) 1 వాచ్యములం - తా (87) 1 నన్విదితులై - అన్ని ప్ర. 2 దానాఢ్యులై - తీ కంటె భిన్న ప్ర.

క. నారాయణ బాహు సుధా । పారావారమున నిట్లు - ప్రభవించిన యా
ధీరాత్ములు నృపచంద్రులు । ధారుణి కేతెంచి నీతి - తత్పరమతులై, 88

ఉ. కోపము చిన్నమంత, తల - కొన్న ప్రసాదము మేరువంతగాఁ
జూపి, ప్రజానుపాలనము - సూనృతవృత్తి నొనర్చుచున్, రిపు
క్ష్మాపతులన్ హరించి, గరి - మంబున రాజ్యముచేసి చేసి, యు
ద్దీపితదర్పులై , తపన - తేజముఁ జూచి సహింప కుద్ధతిన్, 89

మ. ఘన బాహాబల దుర్మదాంధు లగుచున్, - గంజాప్తుతో దివ్య సా
ధనముల్ పూని రణం బొనర్చినను, మా - ర్తాండుండు కోపించి, యా
జననాథావళిఁ బట్టి మ్రింగుటయు, వి - శ్వక్షోణికిన్ రాజు లే
క, నరుల్ తస్కరబాధల న్నిబిడ దుః - ఖవ్యాప్తులై యున్నెడన్. 90

ఆ. కువలయ ప్రమోద - కుండగు రాజు లే । కున్న [1]సత్పథంబు - వన్నె దిగదె?
కువలయ ప్రమోద - కుండగు రాజు లే । కున్న సత్పథంబు - వన్నె దిగదె? 91

చ. అని తలపోసి, భూమివల - యంబునకుం దగు రాజవర్యు నొ
క్కనిఁ గొనితేరఁగా నుచిత - కార్యవిశేషము నిర్ణయించి, స
న్మునులు [1]దివాకరుం గదిసి - మూర్ధసమర్పిత [2]పాణిపద్ములై
వినుతి యొనర్పఁజొచ్చిరి, ప - విత్ర వచోగతి నమ్మహాత్మునిన్. 92

సీ. సప్తాశ్వ! మార్తాండ! - జలజవనీమిత్ర! । [1]సర్వలోచన! దేవ! - సర్వవంద్య!
సర్వగ్రహాధిప! - సర్వరోగాపహ! । సకలజగద్దీప! - సామరూప!
భాస్కర! దినకర! - బ్రహ్మాండభూషణ! । దశశతకిరణార్క! - తపన! సూర్య!
ద్వాదశాత్మక! వికర్తన! దివాకర! బోధ । మయ! జగన్మయ! సదా-ధ్యయన నిరత!

తే. యరుణ! కాశ్యప! తిమిర సం-హరణచతుర! । యర్యమాదిత్య! దివిజేశ్వ-రాదిసేవ్య!
సత్యసంకల్ప! [2]మందేహ-దైత్యమథన! । స్వీకరింపుము మన్నమ-స్కృతి శతములు. 93

ఆ. చండతిమిర పీత - సకల చరాచరో । ద్ధరణ కరణ రూప - ధారి వగుచుఁ
బ్రతిదినంబు [1]నొందఁ - బరమ జగత్సాక్షి । వరయ నీవ కావె? - యబ్జమిత్ర! 94

---

(91) 1 తత్పదంబు - తా (92) 1 దివౌకసుల్ - తీ 2 పాద - తీ (93) 1 సర్వావలోకన - తీ 2 మండిత - మ,మూ,తా,తీ,హ,ర,క (94) 1 పొడమ - మూ

తే. మూఁడునాభుల నైదుక-మ్ములఁ దనర్చు । చక్రమును, సప్తనామకా-శ్వమును, గుంటి
సారథియుఁ గల్గు తే-రెక్కి, సత్వరమున । నప్సరో నాగ యక్ష స-మన్వితముగ, 95

ఆ. వాలఖిల్య మునులు - వర్ణింపఁగా, నిరా । లంబమైనయట్టి - యంబరమునఁ
బ్రతిదినంబుఁ దిరుగు-భవదీయ మహిమంబుఁ । దెలియ నరిది మాకు-ననఘచరిత! 96

క. దినమును బక్షము మాసం । బును ఋతు వయనకును వర్ష - ములునై కాలం
బనుమింపం బడుచుండుట । యనఘా! నీ యుదయ మహిమ - నౌనో కాదో? 97

క. నరు లెవ్వరైనఁ దావక । చరణంబులు గొలిచిరేనిఁ - జండాపత్సా
గరము గడచి, యారోగ్య । స్థిరు లగుదురు సకల దివిజ - సేవ్యచరిత్రా! 98

శా. ఆకర్ణింపుము విన్నపంబు త్రిజగ - ద్వ్యాపారపారీణ! భూ
లోకంబెల్ల నరాజకంబగుట యా - లోకించి, చోరోద్ధతా
నీకంబుల్ గడు బాధపెట్టఁగ, భయో - న్నిద్రాత్ములై [1]భూప్రజల్
శోకంబందుచు నున్నవారు దివిజ - స్తుత్యా! ప్రతాపోజ్జ్వలా! 99

క. మఖములు సాగక యుండెను, । మఖభోజన వర్ధమాన - మహులగు బర్హి
ర్ముఖులు, మఖభాగ చర్వణ । సుఖవాంఛా రహితులైరి - సురమునివినుతా! 100

చ. అతులిత [1]వర్గధర్మ నియ - మాబ్ధికిఁ జెల్లెలికట్ట, సజ్జనా
తత విపదద్రికిం గులిశ - ధార, చతుఃపురుషార్థ శేముషీ
లతికకు నాలవాలము, కు - లద్వ్వరదంబున కంకుశంబు భూ
పతి, యతఁ డబ్బకుండిన వి - పర్యయమందు సమస్త కార్యముల్. 101

ఉ. కావున, రాజసత్తములు - గల్గకయుండిన ధాత్రి సుస్థిరీ
భావము నొంద, దాత్మపతిఁ - బాసిన భామినియట్లు, దేవతా
సేవితరూప! మా మనవి - చేకొని తావక గర్భ వేశత
క్ష్మావరకోటిఁ గ్రమ్మఱ నొ - సంగు మనన్, రవి వారి కిట్లనున్. 102

చ. మునివరులార! యా నృపతి - ముఖ్యులు మత్కిరణప్రసార సం
జనిత మహోష్ణపీడితులు, - సారవిహీనులు నౌటఁజేసి, దు
ర్జన రిపు [1]గర్వభంజనము, - సర్వమహీ పరిపాలనంబు స
జ్జన భజనంబుఁ జేయఁగ న - శక్తులు, వీరల వేఁడనేటికిన్? 103

(99) 1 భూసురుల్ - తీ (101) 1 వర్ణ - మూ, తా (103) 1 పర - తా,తి,తీ

సీ. వినుఁడు, పూర్వమున నీ-మనుజాధిపతులు మ । త్కోపాగ్నిముఖమునఁ-గూలునపుడు
హిమకరబింబ మ - ధ్యమమునఁ గొందఱు, । కొందఱు వరుణది - వ్యమందిరమున,
దారుణ [1]కాననాం - తరమునఁ గొందఱు । కొందఱు [2]గిరి గుహా - కుహరములను,
యోగీంద్ర [3]వేష సం - యుక్తులై కొందఱు । చని యణంగినవారు - సాధ్వసమున,

తే. నిట్టి రాజన్యవరులలో - నెవ్వరేని । యఖిలభూ పాలనమునకు - నర్హులగుదు
రట్టి రాజుల మీరు చే-పట్టి మంత్ర । శక్తిఁ, బట్టంబు గట్టుఁ [4]డీ - స్థైర్యమునకు. 104

చ. అన విని, యమ్మునిప్రవరు - లర్కుని వీడ్కొని యింద్రయుక్తులై
చని, వనవాస దీనులగు - క్షత్రియులం గొనివచ్చి, రాజ్య పా
లన మొనరింప నిల్పినఁ జ - లంబున వారలు ధర్మబాహ్యులై
మనుజుల [1]శౌర్య దండవిధి - మాటికి [2]నొంపుచు గర్వితాత్ములై, 105

ఆ. [1]తగఁ గిరాతవేష - ధారులై వనముల । కరిగి రంత, మునులు - వరుణలోక
వాసులైన రాజ - వర్యులఁ దెచ్చి రా । జ్యమున నిలుప, వారు - ననుదినంబు, 106

క. మదిరాపాన విహారము । వదలక యన్యోన్య కలహ - వశమునఁ బ్రజలన్
విదళింపుచు వర్తింపఁగఁ । బదపడి భూతలము శూన్య - [1]భావము నొందెన్. 107

సీ. అది గాంచి, పద్మజుం - డర్క శీతాంశుల । వలన రాజకులంబు - గలుగఁజేసి,
తద్వంశజాత భూ - ధవులకు నింద్రుని । వలన మనోహరై - శ్వర్య మహిమ,
ధననాథువలన వి - త్తము, చండభానుని । వలనఁ బ్రతాపంబు, - వనరుహారి
వలనఁ గాంతియు యశో - వైభవంబును, సురా । చార్యునివలన రా - జన్యనీతి

తే. బలము, నంభోధివర్యుని - వలన[1]జయము । జేర్చి, రాజ్యాభిషిక్తులఁ - జేసి నిలుప,
నన్నరేంద్రులు ధర్మస-హాయు లగుచుఁ । బాడి తప్పక బుద్ధి సం-పదలఁ బొదలి, 108

ఆ. సుజన రక్షణంబు - కుజన శిక్షణమును । సూనృతోక్తి రతియు - సుభగ మతియుఁ
గలిగి, ధాత్రి యేలి - రలఘు తేజంబున । విప్ర పూజనాభి - వృద్ధు లగుచు. 109

---

(104) 1 మా, రణాంతరమున-త్రి,తీ 2 మహి-త,తా 3 శేష-తా,తి,తీ,ర 4 డైశ్వర్యమునకు - తా,కఁటె భిన్న ప్ర. (105) 1 జౌర్య - మ,మా,క 2 నొప్పుచు - అన్ని ప్ర. (106) 1 తగిలి గీత వేష - మా,త,కంటె భిన్న ప్ర. (107) 1 భాగము - మ,హ,ర,క (108) 1 గలుగఁజేసి - తా

వ. ఇట్లు సోమ సూర్యవంశోత్పన్నులగు రాజన్యులు కుంచకులు, రాజకులు, గర్తకులు, సమానకులు నన నాలుగు తెఱంగులవారు గలరు. అందు క్షత్రకన్యకలవలన విప్రుల కుదయించినవారు కుంచకులును, క్షత్రియకాంతలయందు రాజన్యులకు సంభవించినవారు రాజకులును, వైశ్యభామలయందు రాజుల కుద్భవించినవారు గర్తకులును, శూద్రాంగనల యందు క్షత్రియులకుం బుట్టినవారు సమానకులు నన౦ బరగి, ప్రజాపాలనం బొనర్తురు. అట్టి భూవరోత్తముల జన్మ కర్మ ప్రకారంబులు గొన్ని చెప్పెద నాకర్ణింపుము. 110

## ఇనకులేశుల దివ్యచరితము

సీ. శ్రీభర్త యాత్మీయ - నాభిపద్మంబునఁ । [1]జతురాననుండు తా - సంభవించె,
నా చతుర్ముఖుని చి - త్తాంభోజమునఁ బుట్టి । నధిక తేజోనిధి - యగు మరీచి,
యా మహామహునకు - నౌరసపుత్రుఁడై । జననంబునొందె క - శ్యపవిరించి,
యతనికి దక్షక - న్యకయైన యదితికిఁ । బ్రభవించెఁ దనయుఁడై - భాస్కరుండు,

తే. సకల సురసేవ్యుఁడై జగ - చ్చక్షు వగుచు । విమల మూర్తిత్రయాత్ముఁడై - వెలయునట్టి
చండకరునకు వైవస్వ-తుం డనంగ । మనుకులాఢ్యుండు హరిభక్తి-ధనుఁడు వొడమె. 111

క. వారిజహిత సుతుఁడగు నా । ధీరుఁడు నిర్మించెఁ గర్మ - దృఢముగ సరయూ
తీరమున సుజన బోధ్యను, । సార సురాసుర [1]బలాద్య - సాధ్య నయోధ్యన్. 112

క. సిరుల, విశాల వధూటీ । స్ఫురణంబున, మధుర సరస - భోగ్య పదార్థా
కర మహిమ, భోగవతి యనఁ । బొరసెం దత్పురి యనేక - పుర నామములన్. 113

మ. హరితేజో నవ బీజకంబు, మనువ - ర్యాంకూర, మిక్ష్వాకు బం
ధురకాండంబు, దిలీప ముఖ్య నృపతి - స్తోమోరు శాఖంబు, దా
శరథి స్వచ్ఛ ఫలంబునైన రవివం - శస్వర్గభూజంబు, త
త్పురరాజంబను నాలవాలమున నొ - ప్పున్ సద్ద్విజావాసమై. 114

సీ. తగ మేను దాల్చిన - నిగమశాస్త్రంబులు, । మూర్తి పూనిన శౌర్య - కీర్తివితతు,
లాకారవంతంబు - లైన విత్తములు, రూ । పము వహించినయట్టి - పతిహితంబు,
లంగంబులందిన - శృంగారభావంబు । లాకృతి [1]గలుగుకా - మాగమములు,
తనువుచేపట్టిన - దాన పాండిత్యంబు, । లసమగాత్రము గల - యఖిలవిద్య

---

(111) 1 జతురాననుండన - తీ కంటె భిన్న. (112) 1 బలాఢ్యసాధ్య - అన్ని ప్ర.

తే. లనఁగ, విఖ్యాతులై మింతు - రధికమహిమ । వర మహీసుర రాజన్య - వైశ్య శూద్ర
కామినీజన కాముక - గణ వదాన్య । నరసపుంగవు లమ్మహా - పురవరమున. 115

మ. తరులెల్లన్ సురభూజముల్, శిలల మొ - త్తంబెల్లఁ జింతామణుల్,
వర గోబృందములెల్లఁ గామదుఘముల్, - [1]భామాజనంబెల్ల [2]న
చ్చరతండంబు, హయంబులెల్ల దివిజా - శ్వంబుల్, మదానేకపో
త్కరమెల్లన్ దివిషద్గజంబు లనఁగాఁ - గన్పట్టు నవ్వీటిలోన్. 116

వ. ఇట్లు వైవస్వతమనువు సకల పదార్థ పరిపూర్ణంబును, సకల వైభవాకీర్ణంబును, సకల సౌభాగ్య సముదీర్ణంబునుంగా, నయోధ్యా నగరంబు నిర్మించి, యందుఁ గృతాభిషేకుండై, న్యాయమార్గంబున రాజ్యంబు సేయుచుండె. అంతఁ, దద్వంశంబునకు నవతంసంబై యిక్ష్వాకుం డుదయించె. తదన్వయంబున, 117

చ. అగణిత బాహు[1]శక్తి సము - దంచితుఁడై, తన [2]పెంపు దేవతల్
పొగడఁగ, శత్రుభూపతుల - సొంక మణంచి, శతాశ్వమేధముల్
తగ నొనరించి, భూసురులఁ - దన్పె ధనంబుల, నమ్మహాత్ముఁ డా
సగరుఁడు సంభవించె గుణ - సాగరుఁడై, మనువంశ రత్నమై. 118

క. ఘనపుణ్యుం డా సగరుఁడు । తన భామినులందు సత్త్వ - [1]ధర్మాన్వితులన్
దనయుల నఱువదివేవురఁ । గనియె నఖండ ప్రతాప - గర్వోన్నతులన్. 119

ఉ. వారలు నూఁగుమీసములు - వచ్చుతఱిన్, తమ తండ్రి[1]పంపుగా
దారుణ శక్తిజాలములు - దాల్చి, మఖాశ్వముఁ గావఁబోవ, జం
భారి తదీయ ఘోటకము - నర్థి హరించి, భుజంగలోకముం
జేరి, నిమీలితాక్షు, ముని - శేఖరు, భాగవతాగ్రగణ్యునిన్, 120

చ. కపిలుని గాంచి, యా మునిశి - ఖామణిచెంగట నశ్వరత్నమున్
నిపుణతఁ గట్టిపోయె; నిట - నిష్ఠురు లా సగరాధిపాత్మజుల్
కుపితమనస్కులై, సవన - ఘోటముఁ గానక కంపితాత్ములై
విపులధరిత్రియున్, గగన - వీథియు నారసి చూచి వెండియున్, 121

---

(115) 1 గలిగిన యాగమములు-త (116) 1 వామా-మా 2 నప్సరతండంబు-తా (118) 1 సత్త్వ-మా,త 2 పంపు - త కంటె భిన్న ప్ర (119) 1 ధామా - మా (120) 1 పంపఁగా - మ,మా,త,తీ

తే. ఉరగలోకంబు వెదకుట - కుద్యమించి, । పటు ఖనిత్రాగ్రముల ధాత్రిఁ - బాయఁ ద్రవ్వి,
జలధిమార్గంబునను రసా - తలము సొచ్చి, । కపిలమునిపొంత మఖఘోట - కంబుఁ గాంచి,

చ. వెనుక హయంబుఁ గట్టుకొని, - [1]వీఁడె [2]యథార్థ తపస్వి కైవడిన్
గనుగవ మూసినాఁడు, పొడ - గంటిమి గుఱ్ఱపుదొంగ నంచు, నా
మునివరు ముష్టిఘాతముల - మోదిన, నా ఘను రోషవహ్ని లో
చనముల [3]వెళ్ళి, యా సగర - జాతుల భస్మముచేసె నందఱన్. 123

ఉ. అంత, భగీరథుండను మ - హాత్ముఁడు తత్కులమందుఁ బుట్టి, య
త్యంత తపోగతిన్, శివుఁ బు - రాంతకుఁ బ్రీతునిఁజేసి, యా యుమా
కాంతు జటానుషంగ యగు - గంగ, నభంగురభంగఁ, [1]బాప జా
లాంతకర ప్రసంగఁ బ్రియ, - మారఁగఁ దెచ్చిన, నా స్రవంతియున్, 124

తే. తరుణ [1]శశిశేఖరుని జటా - భరము [2]డిగ్గి, । యభ్రపథమున ధాత్రికి - నవతరించి,
నాగలోకంబు దరిసి, పు - ణ్యతఁ దనర్చి । సగరతనయుల ముక్తిపా - రగులఁ జేసె. 125

క. ఆ రాజసుతుఁడు దెచ్చిన । కారణమున, సకలలోక - కల్మషపటలీ
హారిణి యగు సురనది, భా । గీరథి యను పేర విదిత - కీర్తి వహించెన్. 126

క. *తదనంతరమున సుగుణా । స్పదుఁడగు యువనాశ్వ నృపతి - ప్రభవము నొందెన్
ముదమున నతనికిఁ ద్రిజగ । ద్విదితుఁడు, మాంధాతృ నామ - ధేయుఁడు వొడమెన్. 127

క. విశద యశః[1]పట గర్భిత । దశదిగ్వలయుం డతండు - దారుణ బాహా
నిశితాసి పాటవంబున । దశకంఠుని గెలిచె సమద - దర్ప మెలర్పన్. 128

శా. సాధు త్రాణ కళా వితంద్రుఁడు, హరి - శ్చంద్రుండు జన్మించి, తే
జోధుర్యుండు వశిష్ఠు[1]పూన్కి నిలుపన్ - శుద్ధాంతరంగంబునన్
గాధేయుం డొనరించు దుష్క్రియల, శో - కంబందియున్, సత్యభా
షా ధీరుండగుచున్, ద్విసప్త యుగముల్ - శాసించె భూచక్రమున్. 129

---

(123) 1 వెండి - మ,తా,హ,ర 2 హయార్థ - మా 3 వెల్లి - మ, ర, క (124) 1 దాప బాలాంత - త (125) 1 శశిధరునిజటా - త 2 గాంచి - మ,తి.తీ,హ,ర,క (127) * ఈ,ప.ర ప్ర. లో లుప్తము (128) 1 పటు - మ,తా,హ,ర,క (129) 1 పూన్కె - మ,తా,హ

మ. ప్రభవంబందె ననంతరంబున దిలీ - ప క్ష్మాధవుం, డమ్మహీ
విభురత్నంబునకున్ సుదక్షిణకు నా - విర్భూతుఁ డయ్యెన్ రఘు
ప్రభుఁ, డాతండు మఖాశ్వరక్షణ మొన - ర్పం బిత్రనుజ్ఞాతుఁడై
రభసం బొప్పఁగ సంచరించునెడ, సు - త్రాముండు తద్వాహమున్, 130

ఆ. అపహరించి చనిన - నమరేంద్రు వెన్నంటి । యంపవెల్లి నతని - యదటణంచి,
గెలిచినట్టి రఘువు-గలుగుట, రఘువంశ । మనఁగఁ బరగెఁ దన్నృ-పాన్వయంబు 131

ఉ. అట్టి రఘుక్షమాపతికి - నాత్మజుఁడై యజుఁ డుద్భవించి, యి
ట్టట్టనరాని [1]విక్రమత - నా ధర యేలుచునుండె, నా జగ
త్పట్టణభర్తకున్, దశర - థ క్షితిపాలుఁడు పుత్రరత్నమై
పుట్టి తనర్చె, సర్వనృప - పుంగవ మౌళి కిరీట సేవ్యతన్ 132

చ. హరిమదహర్త కా దశర - థావనిభర్తకుఁ బుత్రులై జనిం
చిరి మఖశక్తిఁజేసి, హరి - శేష సుదర్శన పాంచజన్య బా
సురతర తైజసాంశముల - శూరులు రాముఁడు, లక్ష్మణాఖ్యుడున్,
భరతుఁడు, శత్రుహంతయు నే-తనంగ మహాత్ములు నల్వు రెన్నఁగన్. 133

ఉ. ఆ మహనీయవిక్రముల - యందును, బూర్వజుఁడైన సద్గుణా
రాముఁడు, వైరివైభవ వి - రాముఁడు, రాముఁడు గాధినందనో
ద్దామ మఖంబు గాచి, హిమ - ధామకిరీటునివిల్లు ద్రుంచి, సీ
తామహిళా వివాహ సము - దంచితుఁడై, తదనంతరంబునన్, 134

ఉ. రావణ ముఖ్యరాక్షస ప - రంపరలం దునుమాడి, జానకీ
దేవియుఁ దా నయోధ్య కరు - దెంచి, సుఖస్థితిఁ గ్రీడసల్పుచున్
భూవలయాధిపత్యమునఁ - బొంగుచునుండి, [1]మహీజనాపవా
దా[2]విల వాక్యముల్విని, ప్రి - యాంగన నంపె నరణ్యభూమికిన్. 135

మ లలనారత్నము సీత, దుష్ట మృగజా - లవ్యాప్త ఘోరాటవిన్
బలవద్గర్భభరాలసాంగి యగుచుం - బ్రాణేశ్వరుం [1]జీరుచుం
గలకంఠీ కలకంఠ పంచమ కుహూ - కారానుకార ధ్వనిం
బలవింప న్విని, చేరవచ్చెఁ గరుణం - బ్రాచేతసుం డుల్కుచున్. 136

(132) 1 విక్రమమునంధర (యతి?) - అన్ని ప్ర (135) 1 మహీ(ధవుంకు మిథ్యావృత
నింద)ల న్విని - తీ 2 వళిగాంచి భూమిజను దప్పకనంపె - మ (136) 1 దూఱుచుం - మా,త,తా

క. చనుదెంచి, యాశ్రమాంతిక । మున వల్మీకజుఁడు గాంచె, - మోహన కంఠ
స్వన జిత పిక సంఘాతను, । జనలోక ఖ్యాత, నవని - జాతన్, సీతన్, 137

తే. *ధరణిపతితను, ధూళి దూ - సరితగాత్రిఁ । బూర్ణ గర్భసమన్వితఁ - బొఱఁతి నిట్లు
గాంచి,కరుణారసం బాత్మఁ-గడలుకొనఁగ, । మునిశిఖామణి యాయిందు-ముఖికి ననియె.

క. వనితా! యెవ్వని భార్యవు? । వనమున నిను డించి చనిన - వాఁడెవ్వఁడు? నీ
వొనరించిన తప్పెయ్యది? । వినిపింపుము వికసితార - విందనిభాస్యా! 139

వ. అని పలికిన మునికులోత్తంసునకు నా హంసగమన యిట్లనియె. 140

ఉ. భూజనయిత్రికన్, జనక - పుత్రిక నే, నతిలోక[1]పుణ్యుఁ డా
రాజకులాగ్రగణ్యుఁ డగు - రాముని భార్య, నతండు విశ్వధా
త్రీజన దుష్ప్రవాదము భ - రింపక, లక్ష్మణు నంప, నమ్మహా
తేజుఁడు నన్నుఁ దెచ్చి, వన - దేశమునన్ దిగనాడిపోయినన్, 141

మ. వగలం గుందుచునున్నదాన ననినన్ - వాల్మీకి యుద్యత్కృపా
స్థగితుండై, తన యాశ్రమంబునకు నా - సాధ్వీమణిం దెచ్చి, పొం
దుగఁ బోషింపఁగ, [1]నంతలో యమళ పు - త్రుల్ సన్మహార్తంబునం
దొగి జన్మించిరి సీతకుం గుశలవా - ఖ్యల్ భూరి తేజస్కులై. 142

చ. సుతయుగళంబులోఁ బ్రథమ - జుండగునట్టి కుశుండు తాఁ గుశా
వతి యను వీడొనర్చి గరు - వంబున [1]రాజ్యముసేయుచుం, గుము
ద్వతి యను భామఁ బెండ్లియయి, - తత్సతితోడ నయోధ్యకేఁగి, యం
దతిథిసమాహ్వయుం డగు వ - రాత్మజుఁ గాంచె గుణాభిరామునిన్. 143

---

(138) *ధరణిపతి తన్ వృథా వనస్థలివసింపఁ । బంప, శోకాకులత గళద్బాష్పయౌచు, - డిల్లపడి రక్షణాశఁ దన్నల్లఁజూడ - తీ; ధరణిపతియగు రాముని విరహతాప । మునను సోలుచు నెవ్వగ మునిఁగి యున్న । ధరణి సంజాతఁ గనుఁగొని తలఁకునొంది - హ; ధరణిసుతఁ దనుధూళి - క; ర. ప్ర. లోఁ దుది పా. మాత్రము కలదు (141) 1 పుణ్యుఁడౌ - మా,త,తా,హ,ర (142) 1 నంతలోనఘన - మ; నంతలోనయమ - తా (143) 1 సద్వతిఁ బెండ్లియై మహా । రతిశత భోగముల్దనిపి రమ్య పురాకృత పుణ్యరాశియం। దతిథి - మ; రాజ్యము దాలిచెం గుముద్వతి - తీ

వ. అట్టి యతిథికి బుషభానతియందు [1]నిషధుండగు కుశేశయుం డుదయించె. అతనికి [2]వాసవియతి యను భామయందు నలుండు సంభవించె నన్నరేంద్రునకు నభుండు, నమ్మహీపతికిఁ బుండరీకుండు, నా నృపాలునకు క్షేమధనుండు, నా భూభర్తకు వశంవదుండు, నా ధరణీధవునకు నహీనజుండు, నా రాజచంద్రునకుఁ బారియాత్రుండు, నా జనపాలునకుఁ బద్మకాంతయందు శిలుండు, నా నృపోత్తమునకు సునాభుండు, నా క్షోణీవిభునకు వజ్రుండు. నా రాజన్యునకు శంఖుండు, నా పార్థివునకు హరిదశ్వుండును గ్రమంబున జనియించిరి, ఆ హరిదశ్వుండు భుజాబలంబున సమరతలంబుల ననేక రిపుకులంబులం బొలియించి, హయమేధాది వివిధాధ్వరంబు లొనర్చి, దీప్త యను భార్యయందు విశ్వసహుండను తనూభవుని గనియె. అతనికి హిరణ్యనాభుండు వొడమె. ఆ మండలేశ్వరునకుఁ గౌసల్యుం డవతరించె. ఆ మహాత్మునకు సోమనృపాలుం డుద్భవించె. ఆ క్షత్రియోత్తమునకు బ్రహ్మిష్ఠుం డుత్పన్నంబయ్యె. ఇట్లు మహావీరులగు సూర్యవంశ సంభవు లనేకులు గలరు. అట్టి సూర్య వంశంబు చతుర్వింశతి భేదంబులం బ్రవర్తించె. ఇంక, సోమవంశ ప్రకారంబు వివరించెద నాకర్ణింపు మని రోమశుం డిట్లనియె. 144

### చంద్రవంశ ప్రశస్తి

సీ. శిరసుపువ్వంబికా - జీవితేశ్వరునకు, । నిందిరాధవునకు - నెడమకన్ను,
వాకట్టు [1]బదనిక - వనరుహశ్రేణికి, । [2]నమృతాశనులకు నా - హారఘటము,
గారాపుఁగొమరుండు - కలశవారాశికిఁ, । గలిమిచేడియకు డ - గ్గఱినతోడు,
మొగసిరిమందు చెం - దొగ [3]మొత్తమునకును, । జారచోరులకు నం-గారవృష్టి,

తే. విరహులకుఁ[4]బెట్టు, చలువకు-[5]విడిదిమట్టు । తిమిరములనెవ్వ, [6]శిశుచకో-రముల బువ్వ,
మన్మథుని మామ, కాంతిసం - పదల సీమ, । చంద్రుఁ డొప్పారుఁ గౌముదీ - సాంద్రుఁ
డగుచు. 145

ఆ. అతనివలనఁ బుట్టి - రనురూపతేజులు । పుష్యరథుఁడు దముఁడు - పూరువుండు
దర్శనుండు వజ్ర - దంత సహాఖ్యులు । జిత్రుఁ డార్యకుండు - జిత్రకుండు. 146

వ అందు, 147

---

(144) 1 నిషండు - మా,తీ,ర 2 వాసవ - తీ,హ (145) 1 నదెనిదె - మ,హ; వదినికె - మా,త; నదెవిదె - తా; వికసిత - తి,తీ; మరియును - క 2 నమృతాంధసులకు - మా 3 రత్నము - తి,తీ 4 బెట్ట - తా 5 విట్టిమట్టు - మ; వీటిమట్టు - తా; బిట్టుమట్టు - తి,తీ; విఠ్ఠిమట్టి - హ; వింటిమట్టు - క 6 నాచకోర - తా

క. పుష్యద్గుణునకు, బుధ సం । భాష్యునకు, నరేంద్రనీతి - పారంగత వై
దుష్యమణి భూషణునకును, । బుష్యరథాఖ్యునకు విదుఁడు - పుట్టెమునీంద్రా! 148

సీ. విదమహీపతి కుద్భ - వించె సుద్యుమ్నుఁ డా । ధరణీశునకు క్షేమ-ధన్వుఁ డొదవె,
శతబలి వానికి - జన్మించె, నన్నరే । శ్వరునకు దమనుండు - సంభవించెఁ,
బొడమె శంతనుఁడు త - ద్భూపాలకునకు, నా । మండలేశునకు భో - జుండు పుట్టె,
నవతరించెఁ గుశధ్వ - జాఖ్యుఁడా నృపతి, కా । స్వామికిఁ గలిగెఁ గ్రౌం-చ ధ్వజుండు,

తే. కనియె నా క్షోణిపతి వికర్తనుని, నతని । కాత్మజుండయ్యె సోమద-త్తాహ్వయుండు,
తద్ధరావల్లభుఁడు యజ్ఞ-దత్తుఁ గాంచె, । నుదితుఁడయ్యె మహేంద్రుఁ డా-యుత్తమునకు.

వ. అమ్మహేంద్రునకు శరద్వతుండు పుట్టె. అ రాజచూడామణికి మయూరధ్వజుండు జనియించె. ఆ మయూరధ్వజునకుఁ గుముద్వతియుఁ, బుంజిలయు, నిషధయుఁ, జంద్రరేఖయు నన నలుగురు భార్యలు గలరు. అందుఁ గుముద్వతికి శృంగవీర్యుండును, బుంజిలకుఁ గృష్ణుండును, నిషధకు దాల్భ్యుండును, జంద్రరేఖకు రామసేనుండును నుదయించిరి. అందు, శృంగవీర్యుండు బ్రహ్మచర్యంబున విప్రత్వం బంగీకరించి, బ్రహ్మలోకంబున కరిగె. తదనుమతంబునఁ గృష్ణుండు సహస్ర కాంతాసమేతుఁడై చతురంగబలంబులు గొలువ, భూదేవేంద్రుండన రాజ్యంబు నిష్కంటకంబుగా నేలుచుఁ, గుమారసహస్రంబుఁ గాంచె. అందు, వజ్రుండు కోసలాధిపతి యయ్యె; నూర్వురు కుమారులు [1]యోగాభ్యాసపరులై [2]యుత్తమమార్గంబునకుం జనిరి; మఱియు, నార్నూట [3]పదునొకండుగురు కిరాతులై యరణ్యప్రదేశంబు చేరిరి; వెండియు నిన్నూట యెనుబది యెనమండ్రుగురు కుమారులు సమబలులై యన్యోన్య కలహంబునఁ బ్రజాపీడకులైరి. అంతఁ గలియుగం బాసన్నంబైన, 150

మ. ధరణీనాథులు [1]సత్యహీను లగుచున్, - దర్పించి దుర్మార్గులై
నిరతంబున్ ధనధాన్యమత్తులగుచు - న్నిర్లజ్జులై, మేదినీ
సురవిత్తంబు లపహ్నవింపుచును దే - జోహీనులై యున్నచో
హరి కల్క్యాకృతి దాల్చి, తున్మ [2]దురమం - దశ్వోత్తమారూఢుఁడై. 151

---

(150) 1 యోగధ్యాన - మా,తి,తీ 2 యుక్త ధర్మ మార్గ - తా 3 పద నలుగురు - తా కంటె భిన్న ప్ర. (151) 1 సత్త్వ - తీ 2 ధరయం - తా

శా. ఆదిత్యామృతధామ వంశభవులై - యజ్ఞానులై, పుత్ర కాం
తా దుర్మోహ నిబద్ధబుద్ధులగుచున్, - దర్పాంధులై రాజ్యముల్
మోదంబొప్పఁగ నేలు దుష్టనృపు, లం - భోజాక్ష సద్భక్తి పూ
జా దూరస్థితులై నశించిరి, వృథా - సంగ్రామరంగంబులన్. 152

తే. ఉభయ వంశంబులందు ని-ట్లుద్భవించి, । చనిన మనుజేశ్వరుల వస్తు-జాల మెల్ల
విలయమును బొందెఁ గాని, త-ద్విభులవెంట । నరుగ దొకటైన నందు స-త్పురుషవర్య!

సంసారాసార పరిజ్ఞానము.

సీ. కావున, మనుజత్వ - కలితుఁడై యైశ్వర్య । దారాది మోహ బం - ధములఁ బడక,
పాంచభౌతిక దేహ - భావ సౌఖ్యంబులు । [1]క్షణభంగురము లను - సరణిఁ దెలిసి,
సంగ్రహించిన వస్తు - సమితిలో [2]నొకటైనఁ । దనవెంటఁ గూడి రాదనుచుఁ దలఁచి,
సద్గురు కరుణచే - సర్వాంతరస్థాయి । హరి జగన్మయుఁడని - యాత్మ నెఱిఁగి,

తే. చక్రిరూపంబు నేత్రల-క్ష్యంబు చేసి, । తత్కథా[3]కర్ణనమున శ్రో-త్రములఁ దనిపి,
సతత సంకీర్తనక్రియా-చతురుఁ డగుచు । నుండు నెవ్వఁడు, మోక్షంబు-నొందు నతఁడు.

శా. హింసా [1]దంభ [2]మదాభిమాన రతులై-యే కాలము న్మానవుల్
సంసా[3]రోదిత పుత్ర దారధనవాం-ఛాసక్తులై, యాత్మలోఁ
గంసారిం దలపోయఁ గాన, కతిదుః-ఖప్రాప్తులై, కర్మ వి
ధ్వంసోపాయము లేక, యోనిగతులై - వర్తింపుచు న్వెళ్లుచున్, 155

క. దురితానురూప దారుణ । నరకంబుల ననుభవించి, - నలఁగి ధరిత్రిన్
దిరుగ జననముల నొందియు । నెఱుఁగరు [1]సదసద్వివేక - మించుకయైనన్. 156

సీ. జనన స్థలంబులు - చర్చింప దుర్గంధ । చటుల మూత్ర పురీష - సంకులములు,
గాత్రముల్ పరికింప - ఘన రక్త మాంసాస్థి । చర్మ మేదో రోమ - నిర్మితములు,
సంచారములుచూడఁ - జంచలాత్మ కుటుంబ । రక్షణ దైన్య దు - ర్లక్షణములు,
సంసార నిస్సార - సౌఖ్యముల్ వివరింప । స్వప్న మిథ్యా భోగ - సన్నిభములు,

తే. పట్టఁ బసచాలదిది మేడి-పంటి చంద । మని యెఱింగియు, దేహి య-త్యంత మోహ
సహితుఁడగుఁ గాని, వైకుంఠ-సదనమునకుఁ । జెరువు సుజ్ఞాన మను బుద్ధిఁ-దెలియఁ
[1]డనఘ! 157

---

(154) 1 క్షర - మ,మూ,తా,హ,క 2 నొకటేని - తీ ౩ వర్ణన - తా (155) 1 రంభ - త
2 మహా - తి,తీ,ర 3 రోపిత - త (156) 1 సువివేకభావ - తీ (157) 1 డకట - తీ

మ. గురువే దైవముగాఁ దలంచి, మదిలోఁ - గోర్కెల్ విసర్జించి, త
ద్గురువాక్య ప్రతిభా విశేషమునఁ జే - తోజాత సందేహ దు
స్తర దుర్వార తమిస్రముం జెఱిచి, ని - స్తంద్రాత్ముఁడై, యిందిరా
వరునిం గొల్చినవానికిం గలుగు ని - ర్వాణంబు మౌనీశ్వరా ! 158

వ. వినుము. జీవుండు పాంచభౌతిక దేహ సహితుండై యనేక జన్మావసానంబున మనుష్యత్వంబు నొంది, త్వక్చక్షుః శ్రోత్ర జిహ్వా ఘ్రాణ వాక్పాణి పాద పాయూపస్థాహ్వాయ దశేంద్రియ సహిత మనో [1]వ్యవహార వికారంబుల నణంచి, క్షణభంగురంబగు పుత్ర దార ధనాది సంగం బంగీకరించియుఁ, దజ్జనిత సుఖ దుఃఖంబులయెడ సమత్వం బవలంబించి, యాధ్యాత్మికాధిదైవి కాధిభౌతికంబు లనం బరఁగు తాపత్రయంబువలనం బొడము వగలం దగులువడక, కులమద విత్తమద విద్యామద రూపమద భోగమద శౌర్యమద పుత్రమదంబులం బరగు సప్తమదంబులం [2]బొదలక, పరవిత్త కాంతాదులయం దాసక్తి యొనర్పక, గురుముఖంబున లక్ష్మీవరునిఁ బరతత్త్వంబుగా నెఱింగి, తద్భక్తజన స్నేహంబును, తద్గుణాకర్ణనంబును, తత్ప్రతిమావిలోకనంబును, తత్పాదతీర్థ సేవనంబును, తత్పూజా పారతంత్ర్యంబును, తత్సమర్పితాన్న భోజనంబును వదలక, భక్తియోగ కర్మయోగంబులం బరమాత్మ భావనాపరుండై, బాహ్యజ్ఞానంబు మఱచి, సర్వసముండై, వర్తించునతండు విష్ణుసాయుజ్యంబు నొందు.

## మయూరధ్వజోపాఖ్యానము

తొల్లి మయూరధ్వజుం డన నొక్క భూభుజుండు మునివచన ప్రభావంబున నైదు దినంబులన మోక్షంబు గాంచె. తత్కథావిశేషంబు చెప్పెద నాకర్ణింపుము. 159

చ. కరి రథ [1]వాహ వీరభట - గర్భిత సర్వపదంబు, రత్న గో
పుర వరసౌధ వప్రరుచి - పుంజ విచిత్రిత సర్వదిక్కమున్,
సరసపదార్థ పూరితము, - సంతత వైభవ సంయుతంబునై
యిరవగుఁ బట్టణం బొకటి - హేమపురం బన, దివ్యసేవ్యమై. 160

క. భుజ నిశితాసి భుజంగీ । [1]భుజికర్మీకృత విరోధి - భూభుజుఁడు, కుశ
ధ్వజ తనుజుండు, మయూర । ధ్వజుఁ డను రాజేలుచుండు - దత్పురవరమున్. 161

---

(159) 1 వ్యాపార - త 2 బొరలక - తీ (160) 1 వాజి - తీ (161) 1 భుజవల్మీ - హ; భుజకర్మీకృత - ఇతర ప్ర.

మ. మదము న్మత్సరముం బ్రమోదమును గా - మ క్రోధ లోభంబులున్
మది నుప్పొంగ నతండు దానమును ధ - ర్మంబుల్ విసర్జించి, దు
ష్టదశా [1]సంయుతుఁడై, యనిత్యమగు సం - సారంబు నిత్యంబుగా
హృదయంబందుఁ దలంచి, యర్థము లుపా - ర్జించెన్ దయాశూన్యుఁడై. 162

ఉ. పాడిదొఱంగి, యా ధరణి - పాలకుఁ డిట్లు ధరిత్రి యేలఁగా
[1]గోడని భూప్రజల్ వగలఁ - గుందిరి, వానలు వోయె, సస్యముల్
వాడె, ఫలద్రుమంబులును - వంధ్యము లయ్యెను, గోగణంబు పా
లీడినఁ దన్నుకోఁదొఱఁగె, - నేమనిచెప్పుదు మౌనిశేఖరా! 163

తే. రాజ దోషాతిశయము కా - రణముగాఁగ । సత్య ధర్మ దయాదులు - సమసిపోవ,
ద్వాదశాబ్దంబు లుర్విపై - వాన లేక । భూప్రజావళి దుర్భిక్ష - మున నశించె. 164

క. యాగ హవిర్భాగ పరి । త్యాగం బొనరించి, రథిక - యత్నంబునఁ దే
జో గుణయుతులగు నింద్ర పు । రోగము లిటు [1]కఱవు సంప్ర - రూఢం బైనన్. 165

## వసిష్ఠాది మునీంద్రుల యాగమనము

క. అయెడఁ గౌశిక శాలం । కాయన జాబాలి హరిత - కాత్యాయన వా
త్స్యాయన వల్మీకభవా । త్రేయ వశిష్ఠాది సకల - దివ్యమునీంద్రుల్, 166

సీ. రయమున బదరికా - శ్రమభూమి కందఱుఁ । జేరి, యనావృష్టి - కారణంబు
నృపతిదోషంబుగా - నిపుణత నూహించి, । తద్దోషశాంతి కు - ద్యమ మొనర్చి,
[1]హేమపురప్రాంత - సీమకు నరిగి, బ్రం । దావనదీర్థికఁ - దానమాడి,
సంధ్యాదు లొనరించి, - సపవిత్రపాణులై । పురి చొచ్చి, రాజమం - దిరము చేరి,

తే. ద్వారమున నిల్చి, రప్పుడు - వారి రాక । విభుఁడు దౌవారికుఁడు విన్న-వింపఁ దెలిసి
నెదురు చని, యామహాత్ముల, - నిద్ధయశుల, । మునుల నభ్యంతరాలయం-బునకుదెచ్చి,

క. పరమార్ఘ్య పాద్య ముఖ్యా । చరణంబుల నతిథి విహిత - సత్కారములం
బరితృప్తులఁ జేసి, మనో । హరపీఠములందు [1]నునిచి - యాదర మెసఁగన్. 168

---

(162) 1 సంయుతమై యనీమమగు - మ,మూ,తి,తీ,హ,ర,క (163) 1 గూడిన - తా
(165) 1 కరము - తీ (167) 1 సోమపుర - అన్ని ప్ర. (168) 1 నిలిపి - తీ

తే. వందనము చేసి కరపల్లవములు రెండు । ఫాలమునఁ గూర్చి వినయ సంపన్నుఁడగుచు
నా మయూరధ్వజాహ్వయ - భూమిభర్త । మధురభాషల నిట్లను - మౌని తతికి 169

క. అప్రాజ్ఞుల మాదృశులను । క్షిప్రంబునఁ గుశలమతులఁ - జేయుటకై, తా
[1]రప్రార్థనీయులయ్యును । విప్రులు చనుదెంతు రుదిత - విహరణ వాంఛన్. 170

క. మీ పాదరజము సోఁకినఁ । బాపంబు దొలంగుఁ, బుణ్య - ఫల మబ్బు, మన
స్తాపములు వాయు, శుభములు । చేపడు, నెటువంటి దుష్ట - చిత్తున కైనన్. 171

చ. ధన మణి భూషణాంబర వి - తానము లొల్లక, నిస్పృహాత్ములై
వనముల నుండు మీ రిటకు - వచ్చుటఁజేసి, ఫలించె మత్పురా
తన సుకృతంబు, మీకు నుచి - తంబుగ నే నొనరించునట్టి యా
పని వినిపింపుఁ డెద్ది? దృఢ - భావమునన్ సమకూర్తు నిష్టమున్. 172

వ. అనిన మయూరధ్వజునకు వశిష్ఠాది మును లిట్లనిరి. 173

క. విజయోఽస్తు తే, మయూర । ధ్వజ ధాత్రీనాథ! ఖండి - త ద్వేషినృప
వ్రజ! రాజలక్షణోజ్జ్వల! । భుజవిక్రమ శోభమాన! - భోగసురేంద్రా! 174

ఉ. అసలు గోసి, యింద్రియ [1]హ - యంబుల వాగెఁ గుదించి, కాననా
వాసులమైన మాకు నొక - వస్తువుపై నభిలాష పుట్టినన్,
వాసవభోగ! చేతి కది - వచ్చినదాఁకఁ, దదీయవాంఛ దా
నోసరిలంగఁదేర, దను - వొందునె వాంఛ జయింప నేరికిన్? 175

క. ఆశా వాంఛలు సరియగు । నా శతధృతికైన, నస్మ - దాదులకైనన్,
ధీశక్తిని నా రెంటిని । నాశము నొందించు టరిది - నరనాథమణీ! 176

క. ఏ యర్థము దన కీప్సిత । మా యర్థము హస్తగామి - యగునట్లు బహూ
పాయముల మెలఁగఁ డెవ్వఁడు, । వాయుప్రేరిత శవంబు - వాఁడు నరేంద్రా! 177

క. *విడిముడి గలిగియు నొరులకు । నిడనేరక, యనుభవింప - నేరక మదిలో
నుడుగని లోభము దాఁచిన । గడుసరి, జీవన్మృతుండు - గాఁడె తలంపన్? 178

---

(170) 1 రప్రార్థితులయ్యు మహా - త. కంటె భిన్న ప్ర. (175) 1 చయంబుల - మ,తి,తీ, హా,ర,క (178) * 1 ఈ ప. తా ప్ర. లో లుప్తము

తే. అర్థి చే సాఁచి వేఁడిన - యాక్షణంబ । వాంఛితార్థంబు లీనేర్చు - వాఁడె దాత,
పార్థివోత్తమ! యొక విన్న-పంబు గలిగి, । వచ్చినారము యాచక-త్వము భజించి. 179

చ విసుము నరేంద్ర! లోకమున - వృష్టి యొకింతయు లేమిఁజేసి, భూ
జనులు నశింపఁ దత్కలుష - శాంతికి నూహయొనర్చి, వర్ష సా
ధనమగు యాగ మొక్కటి ము - దంబున నింద్రునిగూర్చి చేయఁగాఁ
జనునని నిశ్చయించి, ధన - సంచయనార్థము నిన్ను వేఁడఁగన్, 180

క. హృదయమునఁ దలఁచి వచ్చితి । మిది మా యభిలషితకార్య, - మిట నిష్కములం
బదివేలకోట్లొసంగక । తుదిముట్టదు మఖము, విఘ్న - [1]దూష్యంబగుచున్. 181

వ. కావునఁ, దత్పరిమిత విత్తం బొసంగిన సంప్రాప్తకాములమై నిజాశ్రమంబుల కరిగెద మని పలికిన వశిష్ఠాది మునీంద్రుల భాషణంబు లాకర్ణించిన యాక్షణంబ, 182

క. ఆ రాజవరుని ప్రాణ స । మీరము వెడలంగ నుద్య - మించెను, లోభా
ధారులకు నర్థివాక్యము । మారణ మంత్రంబు గాదె - మహి నూహింపన్? 183

చ. ఘనతర కష్టలోభిఁ, దమ - కంబునఁ జంపెడునంత యల్కనె
మ్మనమునఁ బుట్టెనేని, విష - మారణకర్మ కృపాణముఖ్య సా
ధనములు గూర్పనేల? శ్రమ - దంబున డగ్గఱి, కాసు వీస మి
మ్మనుటయె చాలు వాని నిమి - షార్థమునన్ మృతిఁబొందఁజేయఁగన్. 184

చ విసుము మునీంద్ర! యిట్లు పృథి - వీవరుప్రాణము నిర్గమింపఁజూ
చిన కథ లాత్మలం దెఱిఁగి, - శీఘ్రము మంత్రిత వారిపూర మా
జనపతిమీఁద నమ్మునులు - చల్లిన, నాతఁడు నిద్రితాత్ముఁడై,
కనుగవ మూసి, యొక్క కల - గాంచె మహాద్భుతదర్శనంబునన్. 185

వ. [1]తదీయ స్వప్న కథాక్రమం బెఱింగించెద నాకర్ణింపుము. 186

## విచిత్ర స్వప్నకథ

చ. అరిజయశాలి యా నరవ - రాగ్రణి, కొల్వున నున్నయత్తఱిన్
గరువలిమేను దాల్చి, [1]తగ - గర్వము చూపఁగ నేఁగుదెంచిన
ట్లరుదుగ నుత్తమాశ్వ మొక - టానభకుం జనుదేర, విక్రమా
భరణుఁడు గాంచెఁ[2]బో పసిఁడి - పల్లముతోడి తురంగరత్నమున్. 187

---

(181) 1 దూరం - మా,త,తా (186) 1 తత్కలక్రమం - తా (187) 1 తన - మా
2 బొంబసిఁడి పగ్గము - త; గ్రొంబసిఁడి - మా,తా

తే. కాంచి, సంతోష పులకిత-గాత్రుఁ డగుచు । ధరణినాయకుఁ డా హయో-త్తమము నెక్క,
సరస నదియు మనోవేగ-భరిత మగుచుఁ । జాఁగి, యెనుబదివేల యో-జనము లరిగె. 188

చ. జలధులు దాఁటి యిట్లు రభ - సంబున నేఁగుచునుండ, భూవరుం
డలయిక దోఁచిన న్వికలుఁ - డై, మధుసాగర తీరమందు, నూ
డలు గనుపట్టు నున్నత వ - టద్రుమ మొక్కటి చేరువైనఁ, ద
ద్విలసిత శాఖ పట్టుకొని - వ్రేలుచు, వాగెలపట్టు వీడినన్, 189

క. తురగోత్తమ మెందేనియు । నరిగె, మహీవిభుఁడు కంపి - తాత్ముండై త
త్తరువు దిగివచ్చి, మూల । స్థిరవేదిక విశ్రమించి, - చింతాపరుఁడై, 190

వ. తన మనంబున, 191

చ. కదిసిన [1]లోభశక్తిఁ, జిర - కాల ముపార్జితమైన రాజ్యమున్,
సుదతులఁ, బుత్రులన్, హితుల, - శూరుల, దంతి రథాశ్వ భృత్య సం
పదలను బాపి [2]తెచ్చె విధి - బాపురె! కుమ్మరి కొక్క యేఁడునున్
[3]గుదియకు నొక్క పెట్టు, నని - కూర్చిన యా నుడి నిక్కువంబుగన్. 192

సీ. అని తలపోయుచు, - నన్నరేంద్రుఁడు ఘన । క్షుత్పిపాసాకృత - క్షోభుఁ డగుచు,
నుదకంబు నచ్చోట - వెదకుచు, మణిసౌధ । దీపితంబైన మా - యా పురంబు
నుపకంఠమునఁ గాంచి, - నృపతి యా పురి చొచ్చి । యే యే గృహంబున - కేఁగి చూచె
నాయాయి గృహమున - [1]నలఁగక గోహత్య । లొనరింపుచున్న దు-ర్జనుల కర్మ

తే. * మక్షిగోచర మగుటయు - నాత్మ రోసి, । తెలియఁ జండాలపుర మిది, - దీన నున్న
వారు సంభాషణీయులు - గారు నాకు, । జలము గ్రోలక ప్రాణంబు - నిలువ, దింక
నెట్టు భుజియింప మది కింపు - పుట్టు నిచట? 193

క. విధివశమున నా కిచ్చట । నధమగతిం జెందవలసె, - నని శోక రసాం
బుధిఁ దేలి తేలి, క్రమ్మఱ । నధిపతి వటతరువుకడకు - నరిగినయంతన్, 194

---

(192) 1 మోహ - తి,తీ 2 తెచ్చితివి - తి,తీ 3 గుదెకొక పెట్టునాఁగ - తి,తీ (193) 1 నల యిక - తీ; * ఇందలి యెత్తుగీతి పంచపాది

### సాయంసమయ వర్ణనము

చ. కమలినిఁ, బుష్పిణి, న్మధువి - కారవతిన్, ద్విజరాజదూషితం
బ్రమదముతోడఁ గూడి, [1]యను-రాగవశంబునఁ గ్రీడసల్పఁగా,
నమరఁగ రక్తమయ్యె నని, - యంబరము న్విడనాడి, వార్ధిలో
దుమికె శరీరశుద్ధి కనఁ, - దోయరుహాప్తుఁడు గ్రుంకె [2]నత్తఱిన్. 195

చ. గిరిగుహలందుఁ, [1]గంజముఖి - కిన్ గచభారములందు, మత్తష
ట్చరణములందు, నీలమణి - జాలమునందుఁ, గురంగనాభియం
దిరువుగ దాఁగి, చండకరుఁ - డేఁగిన, నొక్కటఁ గూడి, మొత్తమై
దిరదిర నేఁగుదెంచె నన, - దిక్కులఁ బర్వె ఘనాంధకారముల్. 196

తే. సరస రాత్రివధూమణి - చంద్ర గళిత । చంద్రికానవ గండూష - సంగమమున
నిగిడి పూచిన మి న్నను-పొగడచెట్టు । పుష్పముల భాతిఁ, దారలు-పొడిచి యొప్పె. 197

చ. సలలిత తారకా కుసుమ - జాలము దట్టముగాఁగ, నంబర
స్థల మను పాన్పుపై నెఱపి, - [1]చల్లని వెన్నెలజాలు తుంపురు
ల్చిలికి, మనోభవుండు పవ - ళించుటకై, యిడినట్టి శుభ్రపుం
దలగడబిళ్ల వోలె, హిమ - ధాముఁడు పొల్చె సురేంద్రదిక్తటిన్. 198

వ. ఇట్లు ప్రభా సాంద్రుండగు చంద్రుం, డుదయాచల తుంగ [1]శృంగంబు నలంకరింపం గనుంగొని, మయూరధ్వజుండు తృష్ణానల తప్తుండగుచు, నిజ రాజ్య ధన వనితా [2]తనయాదులం దలంచి, తన మనంబున, 199

సీ. ఔషధం బెద్ది ప- ద్మాననాలోక వి । యోగ తాపజ్వర - రోగమునకుఁ,
[1]దేప మెయ్యది పుత్ర - రూప నిరీక్షణా । హర్ష రాహిత్య దుః - ఖాంబునిధికిఁ,
బ్రబల వర్షంబెద్ది - బంధు సంభాషణో । త్సాహ [2]దూరీభావ - దావశిఖికిఁ,
గుద్దాల మెయ్యది - కోవిద హిత మిత్ర । విరహ సంభవ ఖేద - విషమలతకు,
తే. నకట! దైవంబు ప్రతికూల - మగుచు నిటకుఁ । దెచ్చె, నీ శోక మెవ్వరు - దీర్ప నేర్తు
రనుచుఁ, గనుమూయ మేల్కాన-నలవి గాక । కళవళింపుచు నారాత్రి-గడపె విభుఁడు.

---

(195) 1 యనురాగరసంబున - తి 2 నంతటన్ - తీ (196) 1 వారిజదళాక్షుల కేశము లందు (యతి?) - తా (198) 1 చల్లన - తా,తి,తీ (199) 1 శిఖరంబు - తీ 2 సుతాదులం - తీ (200) 1 దీప - తీ; దెప్ప (యతి?) - తి. భిన్న ప్ర. 2 భూరిదాహ - మ,ర,క; భూరిధావ - మా; భూరిదాహ - త; దూరదుర్ధావ (హ?) - తి,తీ; దూరీదావ - హ

చ. జలజ[1]లతాంతము ల్విరిసెఁ, - జల్లనివాయువు వీచెఁ, బుల్గుమూఁ
కల కలనాదముల్ చెలఁగెఁ, - గైరవముల్ ముకుళించె, వెన్నెలల్
పలపలనయ్యెఁ, దారల నె - పం బణఁగెన్, శశి గ్రుంకె నేర్పడం,
బలబల తెల్లవాఱె, రతి - బంధమునం జెలరేఁగె [2]జక్కవల్. 201

ఉ. దారుణ సాంధ్యరాగ శిఖిఁ - దప్తముచేసి, ప్రభాతకారకుం
డారసి, పూర్వశైల శిఖ - రాగ్రపు [1]దాగటిమీఁదఁ దేజపుం
గాఱున నిడ్డ నొప్పెసఁగు - గ్రాఁగిన లోహపుముద్ద నాఁగ, జం
భారిదిగంతసీమ జల - జాప్తుఁడు మించె ను[2]దీయమానుఁడై. 202

వ. ఇట్లు సూర్యోదయం బగుటయుఁ దత్ప్రాంతంబున, 203

క. మధుసమయ కుసుమ సముదయ । మధురస నిష్యంద పాన - మదకల గుంజ
న్మధుకర మిథున మృదు స్వన । మధురిమ గల కొలను గనియె-మహిపతి యెదురన్.

వ. కాంచి, యా కాసారంబునం గాలోచిత కృత్యంబులు దీర్చి, జలంబులు గ్రోలి, వటమూలంబునకు వచ్చి, యెప్పటియట్ల యుండునంత, 205

### సిద్ధపురుషుని తామస విక్రియ

సీ. భైరవార్పిత దివ్య - వారుణ పూరంబు । నుత్సాహగరిమ [1]గ్రు - క్కుఱకఁద్రావి,
చాల మత్తతగొని - నాలుక తిరుగక । తడఁబడ నేమేని - నొడువుకొనుచు,
నడుగులు తొట్రిల్లఁ - బడఁబారి గొబ్బున । బయలూరఁగొనఁ జూచి - బార లిడుచు,
మద్యదుర్గంధ సం - పద చోడుముట్టంగ । హాస్యకారంబు పె - క్కైన నగుచు,

తే. నిక్కి వెస నావులింపుచు - నీలుగిలుచు, । [2]బందులాడుచుఁ, [3]వార శ-బ్దములు బెళుక
నుగ్గళింపుచు, లజ్జా వి - యోగియైన । సిద్ధవరుఁ డొక్కఁ డారాజుఁ - జేరవచ్చె. 206

తే. వచ్చి,యా సిద్ధవరుఁడు భూ-వరుని [1]గాంచి, । యతని కుల గోత్ర నామంబు-లడిగి,ధాత్రిఁ
జాఁగఁబడి మ్రొక్కి, పలుమఱు-సన్నుతించి, । పలికె నొకమాట సంతోష-భరితుఁ డగుచు.

---

(201) 1 నితాంతము - మా 2 జక్కువల్ - మ,మా,తా,హ,ర,క (202) 1 దాగడి - తీ 2 దీప్యమానుఁడై - తా,తి,తీ (206) 1 గుంకురుక - మ,త,తా,క; గుద్దురక - మా,ర 2 బంతు - మ,మా,హ,క; బూతు (యతి?) - తా; బాతు - త,తి,తీ,ర 3 తాన - త; దాళ - త. కంటె భిన్న ప్ర. (207) 1 డాసి - మా

తే. వినుము భూపాల! మత్పుత్రి-వనజగంధి । కమలహూతి [1]యనా నొక్క - కన్య గలదు,
రూప లావణ్య మధురాను-లాప సుగుణ । రత్నమంజూష, దానికి-రమణి లీడె? 208

సీ. తలిరుజొంపముల మా-ర్దవము, కాంచన కాహ । ళముల పొంకము, కర-భముల తీరు,
ఘన సైకతము పెంపు - గగనంబు సొబగును, । సుడిపొల్పు, తరఁగల - సోయగంబు,
కాలోరగము చాయ, - కరికుంభముల మేలు, । లతల చెల్వము, శంఖ - [1]లక్షణంబు,
పవడంపుఁగెంపు, చం - పకము లావణ్యంబు, । తొలకరి మెఱుఁగుల - వలనితళుకు,

తే. [2]ముకురముల సొంపు, శ్రీకార-ముల తెఱంగు। విదియచందురు బాగు, తు-మ్మెదల [3]కప్పు
గూర్చి, శృంగారరసముఁ బైఁ - గ్రుమ్మరించి, । రమణిఁ గావించెఁ గాఁబోలుఁ - గమల
భవుఁడు. 209

క. వేయును నేటికి? ధరణీ । నాయక! సౌందర్యముఖ గు - ణంబుల నీ కా
తోయజవదనామణి తగు, । నా [1]యతివకు నీవ తగుదు - వారసి చూడన్. 210

తే. 'రత్నములలోనఁ గామినీ-రత్న మధిక' । మనుచు వర్ణించు శాస్త్రంబు-మనుజనాథ!
సౌఖ్యములలోన [1]నంగనా-సౌఖ్య సుఖము । ధన్య, మిది సర్వజంతు సా-ధారణంబు.

ఉ. హీనకులంబుమానవుని - యింట మనోహర రత్నమున్న, నే
[1]హూనికనైనఁ గైకొనుట - భూవరధర్మము, విన్మ, కాముకుం
డైనఁ గొఱంత యేమి? 'కమ - లానన శంకర మాధవుల్ సదా
మానవతీ సమేతు' లను - మాట యెఱుంగవె రాజపుంగవా! 212

క. వేదాధ్యయన పరుండగు । భూదేవున, కంత్యజునకుఁ - బోలింపఁగ ను
త్పాదనగేహం బొకటియ । భేదము లే, దిందుఁ బెద్ద - పిన్ననఁ గలదే? 213

వ. అని పలికి, యా సిద్ధపురుషుండు తన తనూభవ రావించి, యమ్మహీపతి సమ్ముఖంబున నిలిపిన, నా మయూరధ్వజుండు నయనానందకందంబగు నా యిందుముఖి సౌందర్యం బవలోకించి, యంతర్గతంబున, 214

## చండాలప్రమదా సమాగమము

శా. లావణ్యామృతవృష్టి, మోహనకళా - లక్ష్యంబు, శృంగార పా
రావారంబు, మనోజరాజ్యఫల స - ర్వస్వంబు, సౌందర్య వ
ల్లీ విభ్రాజిత మూలకంద, మిది పో - లింపంగ నింద్రాన్యయే?
యీ వామాక్షి [1]భజించువాఁడు [2]నృపదే - వేంద్రుండు గాకుండునే? 215

(208) 1 యనఁగ - తీ (209) 1 తతిగరిమము - తీ 2 ముకుళముల - తా భిన్నప్ర. కుముదముల (యతి?) - త 3 పెంపు - మా. భిన్న ప్ర. (210) 1 యింతికి-తీ (211) 1 కామినీ-తా (212) 1 హూనికె - మ,త,తా (215) 1 భుజించు - తా 2 మహి-తి,తీ

సీ. తలఁకక చేరలం-తలు నేత్రములు దాల్చె । కొణిదెఁడు మొగ మెట్లు-కుదురుపడియె ?
నీ [1]యెత్తుఁబోలు పా-లిండ్ల భారము పూని । చీమంత నడు మెట్లు-[2]శేఖరించె ?
గురుతరంబైన యీ-క్రొమ్ముడి పెనుమోపు । నన్నువగళ మెట్టు-లానుకొనియె ?
[3]గుఱివెట్టరాని యీ-పిఱుఁదుప్రేఁగునఁ జిన్ని । పదము లెట్టులు తొట్రు-పడక నిలిచెఁ?

తే. ప్రకట లావణ్యరస సము-ద్రంబు నెట్లు । రమణిఁ దనువల్లి తనయందు-నిముడ[4]నేర్చె ?
భూరి శృంగారరసము న-ద్భుతరసంబుఁ । గలిపి, యీ తన్విఁజేసెనో-కమలభవుఁడు ?

ఉ. తీపులవింటివాఁడు భువిఁ - ద్రిమ్మర నంపినయట్టి మాయ యీ
రూపము దాల్చెఁగాక, యిది - రూపవతీమణి యయ్యెనేని, నా
చూపులవెంటనే మనసు - చొచ్చుట యెట్లు ? మనంబు సొచ్చెఁబో,
లోపల [1]నుండుఁగాక, వెలి - లోచనమార్గముఁ [2]బాయ దెట్టొకో ? 217

తే. అకట ! మాతంగకన్యక-యగుట, దీని । నంటరాదని శంకించు - టనుచితంబు,
బాహ్యమున నంటకయ యున్న-భావవీథిఁ । గాంతతోఁ గూడి క్రీడింపఁ-గనినపిదప.

చ. అని తలపోసి పోసి మద - నానలవేదనఁ గ్రాఁగుచున్న యా
జనపతిఁ జేరి, యా యధమ - జాతివధూమణి, తద్గళంబున
న్వినుత మధూకమాలికఁ ద - విల్చె, నతండును బెండ్లియాడె, నే
మనఁగల దింకఁ, బాపభయ - మాత్మఁ దలంతురె కాముకాధముల్ ? 219

శా. చండాలప్రమదా వివాహకలనా - సంతుష్టుఁడై, యన్నరేం
ద్రుండత్రాంతము మద్యపానరతుఁడై, - దుర్బుద్ధి, గోమాంస స
త్ఖండంబుల్ భుజియింపుచు న్వరుస నా - కంజాక్షితో నిక్షు కో
దండ క్రీడలఁ దేలుచుండె మణిసౌ - ధంబందుఁ [1]జేరిచ్చలన్. 220

ఉ. ప్రేమదలిర్ప నిట్లు విహ - రింపుచుఁ బుత్రశతంబుఁ గాంచి, యు
ద్దామవిభూతిఁ దత్తదుచి - తంబుగఁ బూని, వివాహకృత్యముల్
భూమివిభుం డొనర్చి, నిజ - పుత్రులుఁ బౌత్రులుఁ దాను భార్యయున్
దామరతంపరై కడు ము - దంబునఁ దేలుచునుండు నత్తఱిన్, 221

---

(216) 1 యెత్తుకోలు - మా,త 2 శేకరించె - మా; శీకరించె - త; స్వీకరించె - తా,కః సేక రించె - తి,తీ,హ 3 గురువైనయట్టియీ - తీ 4 ఁజేసె - తీ; ఁగొనియె - త (217) 1 నుండెఁగాక - అన్ని తాళ. ప్రః నుండుటెట్లు-తీ 2 బాయుటెట్లొకో-తీ (220) 1 బేరిచ్చలన్-మా; వర్తింపుచున్ - తీ

సీ. పరిపాకగతి [1]మీఱఁ - [2]జఱచెనో యన, దేహ । మెల్లను నరలచేఁ - దెల్లఁ బాఱ,
[3]ద్విజములై, కానివి - దినిన కీడును బోలె, । దంతంబు లిలఁ బతి - తములుగాఁగ,
ముదిమితొయ్యలి తన్నుఁ-గదిసిన సాత్త్వికో । ద్గమ మయ్యెనో, యనఁ-గంప మొదవఁ,
బ్రాయంబు గోల్పడఁ - బటు శోకమునఁ బోలె । నేత్ర [4]గోళంబుల - నీరు గ్రమ్మ,

తే. వార్ధకం బను భూతంబు - వచ్చి తన్ను । నలమినప్పుడు పుత్రకాం - తాది మోహ
పారవశ్యంబు వదలక-పార్థివేంద్రుఁ । డుత్సుకత నుండె, నంతలో-నొక్కనాఁడు. 222

చ. కొడుకులు నాఁడుబిడ్డలును - గోడలు కొమ్మలు పౌత్రవర్గమున్
దడయక చుట్టును న్మెలఁగఁ, - దానును భార్యయు సమ్మదాశ్రులన్
జడిగొనఁ జూచుచున్నపుడు, - సౌధతలంబునఁ గాలుజాఱి, యా
పడఁతుక గూలి యాక్షణమ - ప్రాణవియోగము నందె, నందినన్, 223

తే. భూవరేణ్యుండు సతిఁ జూచి,-పొక్కిపడుచు । హా! పతివ్రత! హా! మనో-హర శుభాంగి!
హా! [1]ప్రియాంగన! ననుఁ బాయ-[2]నగునెనీకు? । ననుచుఁ బలుమారు శోకించు
-నవసరమున. 224

క. వెడ మాయఁ గనిన కలకై । యడలెడు భూపాలు చంద - మారసి, నగుచుం -
దొడ చఱచి, మేలుకొలిపిరి । తడయక యవ్విభుని మునులు - దయ యిగురొత్తన్. 225

వ. ఇట్లు మునివర ప్రబోధితుండై, మయూరధ్వజుం డదరిపడి లేచి, ముహూర్తమాత్ర స్వప్నంబునఁ జిరకాలానుభూతంబులగు సుఖదుఃఖంబుల కచ్చెరుపడి, యాస్థానంబుఁ గలయం గనుంగొని, పశ్చాత్తాపంబున లజ్జా [1]నమితకంధరుండై, చిన్నవోయి యుండె. ఆ సమయంబునఁ గులగురుండగు వశిష్ఠమునీశ్వరుం డతని నాలోకించి, నగుమొగంబుతో నిట్లనియె. 226

**జీవితములు స్వప్నానుభూతులు**

తే. తగునె నీ కిట్లు భూవరో - త్తంస! మద్య । పాన గోష్ఠియు, గోమాంస - భక్షణంబు,
నధమ మాతంగభామా స-మాగమంబుఁ । బతితగృహ భోజనముఁ జేయఁ-బాపమనక?

---

(222) 1 జాఱ - ర,క; జూడ - మా,త 2 జెఱచెనో - త,తా,తీ 3 ద్విజనులై - తీ 4 గోళంబు కన్నీరు - తి,తీ,హ,ర,క (224) 1 ప్రియా ననుఁ బాయఁగ - తీ 2 దగునె (యతి?) - తి.భిన్న ప్ర. (226) 1 సహిత మానసుండై - క

క. ఆ సంపద, లా మానిని, । యా సుతు, లా బంధువర్గ - మా వైభవమున్
గాసిం బొందక నిలిచెనె? । [1]యీ సందెఱుఁగంగవలదె - యిలఁ బ్రాజ్ఞునకున్? 228

క. క్షణిక స్వప్నం బగునిది, । గణుతింపఁగ దీర్ఘకాలి - క స్వప్నం బ
ప్రణుతంబగు సంసారము, । గుణ మందును నిందు లేదు - [1]కువలయనాథా! 229

తే. పూర్వ నిమిషంబులోఁ గన్న - భోగ సుఖము । వర్తమాన క్షణంబున - వసుమతీశ!
స్వప్నమై తోఁచు, స్వప్న సం-జాత సౌఖ్య । మస్థిరము గాక నిత్యమే-యరసి చూడ? 230

ఆ. ఇదియె కాదు, తరువు - లెల్లను వంధ్యంబు । లయ్యె, నధ్వరంబు - లణఁగిపోయె,
శుభవిహీన మగుచు - శూన్యభావంబునఁ । గానుపించె నీ జ - గత్త్రయంబు. 231

ఉ. కావునఁ, బుత్ర మిత్ర ధన - కంజముఖీ ముఖ వస్తుజాలమున్
భావములోన స్వప్నసుఖ - [1]భాతి ననిత్యముగాఁ దలంపుచున్,
భూవరచంద్ర! దానమున - భూసుర బంధు హితార్థకోటి ని
చ్ఛావిధిఁ దన్పి, గైకొనుము - శత్రుజయంబును నీతిశాలివై. 232

ఉ. భవ్య దయా సుధాజలధి, - భక్తశరణ్యుఁడు, శ్రీవిభుండు, మం
తవ్యుఁడుగా నెఱింగి, ప్రమ - దంబున నా జగదీశు దేవతా
సేవ్యుఁ దలంచి, పేర్కొని భ - జించి, నుతించి, నమస్కరించి, నీ
వవ్యయ సౌఖ్యసిద్ధి గను - మన్న దుదీరిత వాక్యపద్ధతిన్. 233

ఉ. నావుడుఁ, దద్వశిష్ఠ వచ - నంబున నిర్గత సంశయాత్ముఁడై,
భావమునన్ సతీ తనయ - బంధుజనాశ్రిత విత్త మోహముం
బోవఁగఁబెట్టి, యా పరమ - పుణ్యులకుం బ్రణమిల్లి, హస్తముల్
దా విలసిల్ల మోడ్చి, యను - తాపము దోఁపఁగ వారి కిట్లనున్. 234

మ. అరిషడ్వర్గ వశంవదుండనయి, రా - జ్యశ్రీ తనూజాంగనా
తురగానేకప ముఖ్య వస్తుపటలీ - దుర్మోహ బంధుండనై,
సిరి నిత్యంబని విశ్వసించి, మది ల - క్ష్మీనాథ పూజా నమ
స్కరణ స్తోత్రము లాచరింపక వృథా - సంసార సంగంబునన్, 235

క. భోగములఁ దవిలి, పాత్ర । [1]త్యాగ మొనర్పంగలేక - హతమతి నగు నా
కే గతి పొందఁగవలయుఁ? ద । మోగుణ రహితాత్ములార! - మునివరులారా! 236

---

(228) 1 యాసందెఱుఁగంగవలదె ప్రాజ్ఞున కెవుడున్ (యతి?)-మ,తి,తీ,హ,ర,క (229) 1 వసుధాధీశా (యతి?) - మా,తా: యవనీనాథా (యతి?) - త (232) 1 ఫక్కులు నిత్య - తీ; బారిన నిత్య-మ,తా,హ,ర,క (236) 1 త్యాగంబొనరింపలేక - తీ

ఉ. ఏనదిఁ దీర్థమాడి నరుఁ - డేచిన కర్మ[1]చయంబుఁ ద్రుంచు? నే
దానమున న్నశించు దురి - తంబులు? తెన్స యొనర్ప నే యను
ష్ఠానము ముక్తి నిచ్చుఁ? బ్రక - టంబుగ నెవ్వని సేవ స్వర్గ సో
పానము? దేనఁ బొందుపడు - భావము? పుణ్యము నెట్టిదింపగున్? 237

వ. ఈ సూక్ష్మార్థంబులు నిర్ణయించి, యిందఱు [1]నేకవాక్యంబుగా నానతిండనిన, నఖిల ముని సమ్మతంబున వశిష్ఠుం డిట్లనియె. 238

### పరమధర్మ ప్రబోధము

క. అన్నోదక దానంబులు । సన్నుతములు సకల దాన - సారము, [1]లవి యా
పన్నులకు నిచ్చిరేని స । మున్నతగతి నిహ పరంబు । లొనఁగం జాలున్. 239

ఆ అగ్నిహోత్రకాల - మప్పుడు, భుజియింపఁ । బోవునపుడు, దేవ - పూజయపుడు,
నన్నకాంక్షి యగుచు - నతిథి యేతెంచిన । నతని కిడనివాఁడె - యంత్యజుండు 240

తే. అలసి,మధ్యాహ్న సమయంబు-నందు నింటి । కతిథి యేతెంచి,విఫల ప్ర-యత్నుఁ డగుచు
[1]మరలిపోయినఁ,దద్గృహే-శ్వరుఁడు మునుఁగు । నిరయ దారుణ దుఃఖసా-గరమునందు.

క. ఓదన మొసంగియైన, స । మాదరమున జలము పోసి - యైనను హృదయా
హ్లాదముగ నతిథిఁ బ్రోచిన । యా దొరకున్ దొరకుఁ బుణ్య - మతిసులభమునన్. 242

ఆ తెరువు [1]నడిచి యలసి-ధృతిదప్పి మధ్యాహ్న । కాలమందు నన్న - కాంక్షి యగుచు
నరుగుదెంచినట్టి - యభ్యాగతుండె నా । రాయణుండు, శుభ ప - రాయణుండు. 243

ఆ. పరమపుణ్యుఁడైనఁ, - బాపాన్వితుండైనఁ, । గులజుఁడైన, నీచ - కులజుఁడైన,
బ్రహ్మవేదియైన, - [1]పతితాత్ముఁడైన నాఁ । కొన్నవాఁడె పాత్రుఁ - డన్నమునకు. 244

సీ. ఏకపత్నీవ్రత - వ్యాకోచ చిత్తుండు, । [1]దాంతుండు, విమల సం - తానయుతుఁడు,
[2]విశద కర్మాచార - [3]విధిమూర్తి, శుద్ధాత్ముఁ, । డన్యకాంతా ధనా - ద్యస్పృహుండు,
వైష్ణవమార్గ వి - శ్వాస సంపన్నుండు, । హరిమంత్ర భజన ప - రాయణుండు,
[4]నగ్నిహోత్రాది క్రి - యా సమర్థుఁడు, శాంతి । పూర్ణుఁ, డుత్తమ విప్ర - పుంగవుండు

తే. నఖిలదానంబులకుఁ బాత్రు - లనఘచరిత! । విష్ణుసంప్రీతిగాఁ బూని, - వీరి కిచ్చు
దాన మత్యంత శుభఫల-దాయకంబు । గానఁ, బ్రత్యహ దానసం-గతుఁడ వగుము. 245

(237) 1 జయంబుదించు - మ, మా, త, తి, తీ, హ, ర, క (238) 1 నైకకంఠ్యంబుగా-తీ (239) 1 లది-తా,భిన్న ప్ర. (241) 1 తరలి - తీ (243) 1 దప్పి-తి,తీ (244) 1 బ్రహ్మఘ్నుఁడైన-త (245) 1 దాత్తుండు - మ, మా, తి, తీ, హ, ర, క 2 విశ్వ - త 3 కృతమూర్తి-త. భిన్న ప్ర. 4 నగ్నిహోత్రప్రక్రియా - తా.

క. మానస వాక్కాయేంద్రియ । మానోత్పాదితములైన - మహితాఘతతుల్
మానవులకుఁ బుణ్యనదీ । స్నానంబున నణఁగు నఖిల-సన్నుతచరితా! 246

తే. మాఘమాసమునందుఁ దా-మరసహితుఁడు । గొంతయుదయించునప్పుడు-కువలయమునఁ
గల జలంబెల్లఁ బావనం-బలఘుచరిత! । [1]స్నానమాడిన జనుల పా-తకము లణఁచు. 247

ఆ. మకర మాఘమందు - సకల తీర్థంబులు । నమరనదికి సమము - లంద్రు బుధులు,
గాన, సలిల మెచటఁ - గలిగె నచ్చోఁ గృత । స్నానులగుట మేలు - సజ్జనులకు 248

క. దీనులకు నన్న మిడుటయు, । దానము సత్పాత్రమందుఁ-[1]దగఁ జేయుటయున్
మానవులకు నిత్యాను । ష్ఠానము, లివి రెండు సుగతి - సాధక[2]తమముల్. 249

### విష్ణుపూజా విశిష్టత

చ. సకలమునందు నుండు హరి, - సర్వమయుండు, సమస్తజీవులం
దొకరుఁడ సాక్షియై తిరుగు - చుండుఁ బ్రబోధత నొంది, ముక్తి దా
యకుఁడగు నవ్విభుం గడవ - నన్యుఁడు లేఁ, డదిగావునన్, శిలా
దికముల [1]శ్రీపతిన్ బుధులు - ధీరతఁ బూజ యొనర్పఁగాఁదగున్. 250

క. సిరియును నాయువుఁ దేజముఁ । బరమనివాసంబు [1]నొసఁగఁ - బాల్పడి, లక్ష్మీ
శ్వరుఁడు నిజదాసు లున్నెడ । [2]నిరవుగ వర్తించుఁ బాయఁ - డెచ్చటనైనన్. 251

క. అతుల శిలా లోహాది । ప్రతిమల హరి నావహించి, - భక్తి దలిర్పం
బ్రతిదినమును బూజించిన । యతఁ డేఁగు న్విష్ణుపురికి - నధికవిభూతిన్. 252

క. [1]ప్రణవాది నమోంతములగు । ఫణివల్లభ తల్పశయను - బహు [2]నామములన్
బ్రణుతించి, కృష్ణతులసీ । [3]మణిదళములఁ బూన్చునతఁడు - మాధవుఁ జేరున్. 253

సీ. శ్రీభర్త నొక తుల - సీ దళంబునఁ బూజ । గావింప [1]నుపపాత - కంబు లణఁగు,
వారిజాక్షుని దళ - ద్వయమునఁ బూజింప । స్వర్ణచౌర్యాది దో - షములు దొలఁగు,
దనుజాంతకుని దళ - త్రయమునఁ బూజింప । బ్రహ్మహత్యాది పా - పంబు లడఁగు,
జలజనాభుని జతు - ర్దళములఁ బూజింప । నింద్రుఁడై సురలోక - మేలుచుండుఁ,
తే. బంచదళముల భక్తిసం - పన్నుఁ డగుచుఁ । బంచసాయకగురుని బూ - జించునట్టి
పరమపుణ్యుఁడు వైకుంఠ-పురి వసించు, । నంతమీఁదటిఫలము శ్రీ-హరి యెఱుంగు. 254

(247) 1 తానమాడిన - మా, త, తా, తీ. (249) 1 దగుఁ-మ, మా, హ, ర 2 తరముల్-మ,త (250) 1 శ్రీరమాపతిని ధీరత-త; శ్రీపతిందలఁచి - మా. (251) 1 నొసఁగు - మ, తి, తీ, హ, ర, క. 2 నిరువు-తా (253) 1 ప్రణవాదిని మొత్తములగు - తీ 2 మానములన్ - తీ 3 మణులం బూజించు నతఁడు - తా (254) 1 నృప - తీ, హ, ర

క. హరిచరణకమల సేవా । కరణ దృఢోత్సాహుఁడైన - ఘనునకు వర్యా
చరణీయము, తులసీతరు । పరిణత దళ పూజనంబు - పార్థివతిలకా! 255

ఉ. భూరి గురు[1]ప్రసాదమున - బోధవివేకముఁ గొంత గాంచి, త
త్కారణ పుణ్యకర్మములఁ - దా నొనరింపుచు, శాంతి రత్నభూ
షా రమణీయ గాత్రుఁడయి, - [2]సత్యమునందు నిజాంతరంగముం
గూరిమిఁ బాయనీక పని - గొంట యవశ్యము బుద్ధిశాలికిన్. 256

క. దానంబును, బుణ్యనదీ । స్నానంబును, దేవపూజ, - సత్యము, సదను
ష్ఠానము ననియెడునవి సు । జ్ఞానమునకు సాధనములు - జగతీనాథా! 257

క. భక్తి జ్ఞాన గుణద్వయ । యుక్తుండై తనరు సజ్జ - నోత్తమునకు, నా
సక్తమతి నొసఁగు శ్రీహరి । [1]ముక్తివధూ యోగసౌఖ్య - మును జననాథా! 258

క. హరి దైవము, హరి దైవము, । హరి దైవము సుమ్ము! నమ్ము, - మవనీశ్వర! యా
హరిఁ గొలువు, మమ్మహాత్ముఁడు । కరుణానిధి [1]నీకు నొసఁగుఁ - గైవల్యంబున్. 259

మ. అని బోధింప, వశిష్ఠమౌనివచన - వ్యాప్తిన్ మయూరధ్వజుం
డును చిత్తంబు కలంకదేరిన, గరి - ష్ఠుండై వశిష్ఠాది స
న్మునుల న్వీడ్కొని, దుష్ట మోహలత ను - న్మూలించి, లక్ష్మీశ్వరున్
వనజాక్షు న్మదిఁ బాదుకొల్పి, యితర - వ్యాపార నిర్ముక్తుఁడై, 260

క. పంచజనోద్భవధరు నా । పంచాస్త్రగురున్ భజించి, - భావించి, తగన్
బంచమదినమున నాతఁడు । పంచత్వము నొంది పరమ - పదముం గనియెన్. 261

వ. ఇవ్విధంబున మయూరధ్వజుండు హరిపుర ప్రాప్తుం డగుటయుఁ, దత్కుమారుం డభిషిక్తుండై, రాజ్యంబు సేయుచుండె నని, కైవల్యఖండ [1]మాహాత్మ్యంబు వివరించిన, మార్కండేయాది మునీంద్రులు రోమశు నభినందించి, యనంతరంబ, విజ్ఞానఖండ శ్రవణ కుతూహలులై యుండి రవధరింపుము. 262

---

(256) 1 ప్రదానమున - మ,తా,తి,తీ,హ,ర,క 2 సత్త్వము - తా,తి,తీ (258) 1 ముక్తిదమా యోగ - త (259) 1 నీకొసంగు - తీ (262) 1 మహత్త్వంబు - మ,మా,హ,ర

ఫలశ్రుతి

మ. కపటస్వాంతులు గాక, యెవ్వ రిల నా - కాంక్షించి, యేత ద్వరా
హ పురాణంబున నాదిఖండచరితం - బాద్యంతము న్వింధు, రా
నిపుణు ల్గాంతురు పుత్ర పౌత్ర ధన వా - ణీ సంప దాయుష్య ము
ఖ్య పదార్థోదిత సౌఖ్యతృప్తియుఁ, దుదిం - గై వల్య సంప్రాప్తియున్. 263

అశ్వాసాంత పద్య గద్యములు

లయవిభాతి. విమలగుణభూష! బుధ - కమలవనపూష! నిజ
* సుజనపరితోష జిత - హిమకరవిశేషా!
సమదరిపుజైత్ర! నవ - కుముదనిభనేత్ర! కుల
సముచితవిచిత్ర! పరి - ణమితనిజమిత్రా!
ప్రమదరసలోల! హత - సమదహితజాల! ముర
విమతనతశీల! మతి - శమితమదలీలా!
యమరపతికల్ప! రతి - సమరబహుశిల్ప! బలి
దమనపరితల్ప ఫణి - రమణసమజల్పా! 264

క. రూపాపహసిత సుమన । శ్చాప! కలాలాప! దాన - సౌమనసమణీ!
దీపిత హృత్పుట పేటీ । గోపిత రుచిపూర్ణ మదన - గోపాలమణీ! 265

మాలిని॥ శతమఖసమ భోగా! - సాధు రక్షానురాగా!
సతత హరిసపర్యా! - సప్తసంతాన ధుర్యా!
వితరణగుణ ధామా! - విస్ఫురత్కీర్తి సీమా!
హితజన సురభూజా! - యెఱ్ఱయామాత్యరాజా! 266

గద్యము

ఇది శ్రీ హనుమత్కరుణా వర ప్రసాదాసాదిత సారస్వతనిరాతంక, చంద్రనామాంక రామ విద్వన్మణి తనూజాత, అష్టఘంటావధానపరమేశ్వర బిరుద విఖ్యాత, హరిభట్ట ప్రణీతం బైన వరాహపురాణంబునఁ గైవల్యఖండంబను పూర్వభాగంబునందుఁ బంచమాశ్వాసము.

---

(264) * సుజన (ప్రాస యతి?) - అన్ని ప్ర. (సుముఖ?)

—: సంపూర్ణము :—